శ్రీ సాయినిలయ ప్రచురణ-12

శ్రీ సాయినాథ బోధామృతము

(శ్రీ సాయిబాబా అభయ ప్రదానములు - సూక్తులు)

రచయిత :

కీ. శే. శ్రీ బాపట్ల హనుమంతరావుగారు

1627/IIDL
ROP

కం. సాయియె సద్గురు దైవము
సాయిసూక్తు లెఱిఁగి, యనుసరణము సలుపన్,
సాయికి శరణము పలికిన,
శ్రేయము - భక్తుల కభీష్ట సిద్ధియు కలుగున్!

(ప్రచురణకర్త)

ప్రచురణకర్త :

బాపట్ల వేంకట పార్థసారధి

శ్రీ సాయినిలయమ్, చెరువు (పోస్టు) - 522 113

సర్వహక్కులు
ప్రచురణకర్తవి.

మూల్యము రూ. 53/-

మొదటి కూర్పు : 1968
రెండవ కూర్పు ; 1981
మూడవ కూర్పు : 1988
నాల్గవ కూర్పు : 1995
ఐదవ కూర్పు : 1999

సిద్ధాంతము :

శాస్త్ర గురుబోధలను మఱి స్వానుభవము
కలిమి నెద్దాని నరుఁడేడుగడగ నమ్మ
నదియె శ్రేష్ఠంబు - బరమమౌ నదియ, యది జ
గంబునన్ వాని కవలంబనంబు, సాయి!

....

అఖిల భారత సాయి సంఘాధినేత
బీ. వి. నరసింహు నానతిఁ బ్రీతిఁ బలికె
సులభతరముగ తండ్రి, భక్తులు పఠింప
సాయినాథుని బోధల సారమిదియ!
అభ్యసించిన నభిరుచి లభ్యమగును!

(ప్రచురణకర్త)

ముద్రణ :

శ్రీ రాధాకృష్ణ ప్రింటింగ్ ప్రెస్,
బాపట్ల - 522 101
గుంటూరుజిల్లా

తొలిపలుకు (మొదటికూర్పు)

[గౌ. జస్టిస్ యం. బి. రేగే. బి.ఏ., యల్. యల్. బి.
హైకోర్టు జడ్జి, ఇండూరు. (రిటైర్డు)]

శ్రీ సాయినాథ బోధామృతము (శ్రీ సాయీబాబా అభయప్రదానములు-సూక్తులు)నకు తొలిపలుకుఁబలుకు ప్రయత్నము సూర్యుని నొక చిన్న మైనపు వత్తి దీపముతోఁజూప నుద్యమించుటే యగును. ఈ విషయము నా కంటె నితరు లెఱుగజాలరు. కాని శ్రీ సాయిబాబా అభయ ప్రదానములను, సూక్తుల నేర్చికూర్చు భాగ్యము గడించిన నా ప్రియసోదరుడు పూజ్యశ్రీ బి. వి. నరసింహస్వామి యీ కృతికి దొలిపలుకు రచించు గౌరవమునకు నేను తగనని తెలిపిన సహింపడు. బాబా దివ్యానుగ్రహమున ఈ చిన్న మైనపువత్తి దీపము సంసార కుహరమునుండి జీవిని వెలుపల దివ్యజ్యోతి స్వరూపుడైన సూర్యుని దగ్గఱకు గొనిపోవ మసక మసక వెలుగు ప్రసరించిన వచ్చునేమో! అటుల ప్రసరింపజాలిన 'అభయ ప్రదానముల' కింకొక దానిని జేర్చుటయగును.

మతముయొక్క నిగూఢ లక్ష్యము ఆత్మజ్ఞానము. గమ్యమునకు జేర్చు మార్గ మాయా వ్యక్తికి దగినదిగ నుండవలయును. భౌతిక దేహమునందున్న బాబా సాధకులగు భక్తులకు పలుకులచేత, పనిచేత వెలుగు ప్రసరించుచు మూర్తీభవించిన పరమాత్మయైనాడు. భౌతిక తనువు మాత్రమిపుడు తొలగినది. కాని యిందధివసించిన బాబా అచ్యుతాత్మయై, తనను శరణొంది సుఖశాంతుల బడయగోరు లక్షోపలక్షల భక్తులకు పూర్వమువలె వెలికి గానరాకయే మౌనముగ దోడ్పడుచున్నాడు. కాని, సాధనకు తన విశ్వాసమును పాదుకొలుపుకొనుటకు ఇంద్రియగోచరమై మూర్తీభవించిన సత్యవస్తువు కావలయును. స్వామి (పూజ్యశ్రీ బి. వి. నరసింహస్వామి)చే ఏర్చికూర్చబడిన "శ్రీ సాయిబాబా అభయ ప్రదానములు - సూక్తులు" గ్రంథరూపమున మూర్తీభవించిన అపరతత్త్వ మగుచున్నది.

ఈకృతి సాధకులగు భక్తుల మార్గమునకు వెలుగు ప్రసరించు దీపజ్యోతి యగుటయేకాక, బాబా భౌతిక తనువు నందుండగ ఆ తండ్రిపాదముల

జేసుభాగ్యము గనిన నా యట్టి స్వల్పులకు ఆ తొంటిదేశ కాలానుభూతులకు మఱియొకమాఱు గొనిపోయి ఆ ప్రేమస్వరూపుడగు స్వామితో గడపిన ఆనంద ప్రద మధురస్మృతుల దిరిగి ప్రసాదింప దక్షమైనది.

ఈ "అభయ ప్రదానములు-సూక్తులు" భౌతిక-ఆధ్యాత్మిక ప్రపంచముల రెంట ధర్మనియమ బోధకములగును. బాబా దేహిగా-జీవిగ-పరమేశ్వరునిగ భావించి సేవించు భక్తునకు సాయీప్రభువునందు సహజ ప్రేమను పెంపొం దింప సమర్థులై యున్నవి. బాబా ఒక స్థితియందు "మీ సేవకుని సేవకుడను"- అని పలుకును. ఒకటి "నేను 'అల్లా' సేవకుడను"-అనును-అటులనియు మరల "నేను అతడ (అల్లా)ను - అని యనును. బుద్ధికిట నగమ్యముగ తోచును. కాని, మనోబుద్ధుల కతీతమైన "ఆత్మ" యిట వ్యక్తమగుచున్నది. దేహిగ గోచరించు బాబా ఒక అనామకుడైన, సామాన్య మానవవ్యక్తి. ఆ స్థితికి పరమేశ్వరునకు మధ్య అతడుజీవి- ఆ మహాయంత్రమున నొక చక్రము. ఈ రెండు స్థితుల నధిగమించి తానే పరమేశ్వరుడుగ నిలిచియున్నాడు. శాస్త్ర పరిజ్ఞానము పురోభివృద్ధినొందు నొలది యాత్రివిధావస్థలకేదొకనాడు బుద్ధిసీమ యందు సమన్వయము కుదిరితీరును. ఈ గ్రంథమున సూచింపబడిన అద్భుతా నేకములు సంశయగ్రస్తుని ఆశ్చర్యచకితుని జేయవచ్చును. అవ్యయాత్మయైన బాబా అనుయాయులకు భక్తులకు- పరిణామ విధానమున నవి కేవల మానవుల కద్భుతలీలలయ్యు, విశ్వాస ప్రేమల వెలుగున సమర్థనీయములే యగు చుండును.

బాబాయొక్క దివ్యవ్యక్తిత్వము ఈకృతి రూపమున మూర్తీభవింప జేయజాలిన శ్రీ నరసింహస్వామిగారి ప్రేమ ప్రపూర్ణకృషి కెవ్వరును తగిన రీతి కృతజ్ఞత తెలుపుకొనజాలరు. గురుదేవుడగు శ్రీ సాయీ మహాప్రభువునకు బాబాయొక్క వ్యాసుడైన శ్రీ నరసింహస్వామిగారికి జయ నమోవాకములు అర్పించు చున్నాడను. ఈ గ్రంథము భక్తివిశ్వాసములను పాదుకొలిపి పెంపొం దింపజేయుగాత.

(ఆంగ్ల మూలానువాదము) యం.బి. రేగే.

శ్రీ సాయీనాథాయ నమః

తొలిపలుకు

(ద్వితీయ ముద్రణము లోనిది)

సంసారమున సకల జీవులకును సుఖ మల్పముగను, దుఃఖ మధికముగను కలుగుట అనుభవమున గన్పించు చున్నది. జీవులకు దుఃఖము తాము కోరినది లభించక పోవుట చేతను, లభించినది నశించుటచేతను గలుగు చున్నది. ఇట్టి దుఃఖము పరమేశ్వరారాధనచే నుపశమించును. సంసారమను విష వృక్షమున కమృతోపమ మగు రెండు పండ్లు కలవట. పద్మనాభుని భజించుట యొకటి, సద్భక్త సాంగత్యము రెండవది. వీని వలన భక్తుడు తరింపగలడు.

ఎప్పుడెప్పుడు ధర్మమునకు హాని, అధర్మమునకు వృద్ధికలుగునో అప్పుడే అవతరింతునని శ్రీకృష్ణపరమాత్మని సూక్తి. శిష్ట రక్షణమునకు, దుష్ట శిక్షణమునకు పరమేశ్వరు డవతరించి, దుష్టులను దునిమి, శిష్టులను రక్షించును. దుష్టులనగా రాక్షసులు, శిష్టులనగా మునులు మాత్రమేకాదు. "సత్యాన్నాస్తి పరోధర్మః అహింసా పరమోధర్మః" అను సూక్తుల ప్రకారము అహింస - అధర్మములు లోకములో నమితమై సత్యాహింసలు తగ్గి ప్రజలు బాధపడుచున్న సమయమున పరమేశ్వరు డవతార మంది వానిని సరిచేయును. అవతార మనగా శంఖ చక్ర గదాదులతో అవతరింప నవసరము లేదు. మానవునిగా పుట్టవచ్చును. రామకృష్ణాద్యవతారము లట్టివేగదా! దశావ తారములే కాక యింకను పెక్కు అవతారములున్నవి. కపిలావతారము, దత్తాత్రేయావతారము మున్నగునవి.

అదే విధముగా ఆధునిక కాలమున కూడ భగవ దవతారములుగా పూజింపబడుచున్న మహా పురుషులు శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ హర నాథబాబా, శ్రీ రమణమహర్షి, శ్రీ షిర్డి సాయిబాబా మొదలగు మహనీయులు.

శ్రీ సాయిబాబావారు హిందూ బ్రాహ్మణ దంపతులకు జన్మించి మహ మ్మదీయ ఫకీరుచే పెంచబడి అఘటనఘటనా సమర్థుడై, జ్ఞాన వైరాగ్య సంప న్నుడై, భక్త మందారమై సకల మతముల వారిచేతను గురువుగా ఆరాధింప బడిన మహనీయుడు.

"యేయథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థసర్వశః॥"

ఎవరు నన్నే విధముగా కొలిచిన వారి నా విధముగనే పొందుదును. లోకము లోని ప్రజ లేయే కోరికలు కోరిన వా రవి పొందుదురు అను గీతాచార్యుని సూక్తి ప్రకారము ఈశ్వరుడన్నను, 'అల్లా' యన్నను, 'క్రీస్తు' అన్నను ఒక్కడే. వివిధ జాతి కుల మతముల వారలకు వేరు వేరు దేవుళ్ళు లేరు. దేవుడొక్కడే. అతడు పెక్కు రూపముల దాల్చగల సమర్థుడని ప్రత్యక్షముగా నిరూపించి నాడు శ్రీ సాయీ ప్రభువు.

శ్రీ సాయీప్రభువు నైజాము రాష్ట్రమున పత్రి గ్రామమున బ్రాహ్మణ దంపతులకు 1835 ప్రాంతమున జన్మించెను. రెండవ యేటనే పత్రి సమీపమునగల 'మన్వాత్' గ్రామనివాసియు, 'సూఫీ' మతానుయాయియైన ఫకీరుచే పెంచబడెను. సుమారు 4 సంవత్సరము లా ఫకీరు ఆ బాలుని పోషించి, మంచి ప్రవర్తనమును, భక్తిని సమకూర్చెను.

ఆ ఫకీరనంతరము సాయిబాబా వేంకుశుని 12 సంవత్సరములు సేవింప (1843-1855) గుర్వాజ్ఞచే సుమారు మూడు సంవత్సరము లటు నటు సంచరించి తుదకు 1858 లో షిర్డి పురము జేరి యచట గల మసీదులో నివాస మేర్పరచుకొని యా మసీదునకు 'ద్వారకామాయి' యను పేరుపెట్టి 1918 వఱకు సుమారు 60 సంవత్సరములు బాబా షిర్డి పురిలో భౌతిక తనువుతోనుండి అనేకమందిని తరింపజేసి, ఆది వ్యాధులను మాన్పి, దుర్మార్గులను సన్మార్గుల గావించి, దుష్టులను శిష్టులుగా నొనరించి నిర్ధనికులను ధనికులుగాజేసి, సంతానహీనులను సంతానవంతులుగా నొనర్చి, యజ్ఞానులను విజ్ఞానులుగా నొనర్చి, స్వర్గమున గల కామధేనువు, కల్పవృక్షము, చింతామణి షిర్డిలోనున్న సాయిబాబా రూపమేయని విజ్ఞులు ప్రస్తుతింప, దీనులు దీనత్వము బాయ, రోగులు-నిరోగులుగామార అజ్ఞానులు విజ్ఞానులై గ్రాలునట్లుగా నొనర్చి పిపీలికాది బ్రహ్మపర్యంతము తానేయని భక్తులకు నిరూపించిన మహనీయుడు శ్రీ సాయిబాబా. ఉన్నతోద్యోగులు మొదలు నిరుపేదలవఱకు నందఱిని

సమముగా నాదరించి వారి వాంఛల దీర్చిన సౌజన్యమూర్తి సాయిబాబా. నిస్వార్థపరుడై తనకుగల సర్వశక్తులు భక్తరక్షణార్థమే వినియోగించిన మహా త్యాగి శ్రీ సాయిబాబా. నాడేకాదు నేటికిని భక్తి ప్రపత్తులతో దన్ను కొలిచిన వారి వాంఛల నీడేర్చుచున్నాడు.

పూజ్యశ్రీ బి. వి. నరసింహస్వామి మహాశయు లాంగ్లమున రచించిన **"Saibaba's Charters and sayings"** అను గ్రంథమును 'మహాకవి' శ్రీ బాపట్ల హనుమంతరావు మహాశయులు 'శ్రీ సాయీనాథ భోధామృత'మను పేరున తియ్యని తెనుగులో ననువదించిరి. ఈ గ్రంథమున బాబా భక్తులకు బోధించిన యమృత సమాన బోధనలన్నియు నొకచోటచేర్చి కూర్చబడినది. భగవద్గీతవలె పరమ పవిత్రమైనది. భక్తుల వాంఛలను బట్టి వారివారి మనస్తత్వమునకు సరిపడునట్లు బాబానే నుడువబడిన వివిధ విజ్ఞాన భాండా గారమే యీ సాయినాథ బోధామృతము. వేదవేదాంత విజ్ఞాన క్షీరసాగరము మధించి వెలికి తీసినదీ సాయీనాథ బోధామృతము.

శ్రీ సాయినాథ బోధామృతము నాంధ్రీకరించినవారు పూజ్యులైన శ్రీ బాపట్ల హనుమంతరావుగారు వీరు 14-9-1902 న జన్మించిరి. ఆంధ్ర గీర్వాణ హూణభాషార్ణవములు కుంభసంభవునివలే కడుపార గ్రోలిన మహా నీయులు. సంస్కృతాంధ్ర కవిత్వము చిన్ననాడే వీరి కలవబడినది. వీరు శతాధిక గ్రంథకర్తలు. **1 st grade** తెలుగు పండితులుగా నుద్యోగించి పెక్కురు శిష్యులను తనంత వారినిగాజేసిన యాదర్శోపాధ్యాయుడు. సంస్కృ తాంధ్రాంగ్లములేకాక హిందీ, మరాటీ మొదలగు భాషలు నేర్చిరి. తులసీదాసు రామాయణమును చాలవఱకు తెనిగించిరి. కృష్ణకర్ణామృతము, భగవద్గీత, శంకరభగవత్పాదుల ప్రబోధ సుధాకరాది వింశతి ప్రముఖ సంస్కృత గ్రంథము లనువదించిన పుంభావ సరస్వతులు. వీరికి శ్రీ సాయిబాబా 27-12-1944 న స్వప్నమున సాక్షాత్కరించి యాశీర్వదించి వీరిని నిజాస్థాన కవిగా జేర్చుకొనెను. అది మొదలు సాయిబాబాను గురించి వ్రాయబడిన తెనుగువారు కని వినని వివిధ గ్రంథము లాంగ్లమునుండి, మరాఠ్యాది భాషల నుండియు ననువదించి తెనుగువారి జీవితములు సాయీపదకమలముల

భృంగములుగా జేసిరి. వీరి గ్రంధములు చదివి పెక్కురు బాబాభక్తులై, బాబా కరుణకు పాత్రులై వెలుగుచున్నారనుట యతిశయోక్తిగాదు. భక్తి గ్రంధములు పద్యములలోగాని, వచనములలోగాని వ్రాయుటలో వీరు సిద్ధహస్తులు. బహుశా శ్రీ పోతరాజామాత్యుఁడే మఱల శ్రీ సాయీచరిత్రమును నుడువ శ్రీ హనుమంతరాయామాత్యుఁడై పొడమి రనుటలో వీరి కవిత్వము చదివిన వారల కించుకయు సందేహములేదు. వీరు వచనములో రచించిన 'ఏమీ, నిన్నుపేక్షింతునా' యను భక్తుల వృత్తాంతములు రెండవ భాగవతమేయని చెప్పవచ్చును. వీరు 7-11-1973 న శ్రీ సాయిలో నైక్యమగువరకు బాబాను గురించి గ్రంథములు రచించుచునే యుండిరి. వీరు ఆదర్శపురుషులు. ధన్యజీవులు.

'ఆత్మావై పుత్రనామాసి' అను శ్రుతివాక్యము సార్థకము జేసినవారు శ్రీ బాపట్ల హనుమంతరావుగారి ప్రథమ పుత్రరత్నము శ్రీ వేంటకపార్ధసారధి గారు. వీరుకూడ తండ్రిగారివలెనే బహుభాషాకోవిదులు, సరసకవులు, వినయ సంపన్నులు, గ్రంథకర్తలు. వీరు శ్రీ సాయిబాబా శతకము, మారుతి తారావళి మున్నగు గ్రంథములు రచించి పండితామోదమందిరి. వీరు పితృభక్తిలో శ్రీరామచంద్రమూర్తితో తులతూగ గలిగిన వారనుటలో నతిశయోక్తిలేదు. వీరు తమ తండ్రిగారి ముద్రితాముద్రిత గ్రంథములను వెలువరింప కంకణము ధరించి యందు చాలమట్టుకు కృతార్థులైనారు. "శ్రీ హనుమంతరావుగారు రచించిన 'ఏమీ, నిన్నుపేక్షింతునా?' అను గ్రంథమును చతుర్థ సంపుటము వెలువరించు సమయమున నేనువ్రాసిన పద్యముదహరించుట అప్రస్తుతము కాదనుకొందును.

"చ॥ జనకుడొసంగు భూములు, విశాల గృహమ్ములు, దొడ్డ తోటలున్
ధనము గ్రహించు పుత్త్రికులు ధారుణి నుందురుగాని, మీవలెన్
జనకుడముద్రితమ్ములగు జాడను వీడిన గ్రంథజాలముల్
పనికొని యచ్చుగూర్చు గుణవర్యులు మృగ్యులు పార్థసారధీ॥"

....

కాగితమునకు ముద్రణమునకు కఱవేర్పడి, లక్షాధికారులు గూడ గ్రంథములు ముద్రించుటకు జంకి మిన్నకుండిన నేటి కఱవు దినములలో

వత్సరమున కొక గ్రంథము చొప్పున వెలువరించుచున్న మహనీయులు శ్రీ వేంకటపార్థసారథిగారు. వీరి సద్గుణములు వర్ణింప వేనోళ్ళ వారు కూడ వేసారుదన నల్పజ్ఞుడనగు నేనెంతవాడను. శ్రీ సాయిప్రభువు వీరికాయు రారోగ్య భోగ్యభాగ్యము లొసగుగాత యని ప్రార్థించుచున్నాను.

ఇట్టి పవిత్ర గ్రంథమునకు తొలిపలుకు వ్రాయుమని శ్రీ పార్థసారథి నన్ను కోరిరి.

"మన్దః కవియశః ప్రార్థీ గమిష్యా మ్యుపహాస్యతామ్
ప్రాంశులభ్యేఫలె లోభా దుద్బాహురివ వామనః"

అని కాళిదాస మహాకవియే పలికినాడు. నే ననయెంత? అల్పజ్ఞుడనగు నేను శ్రీ పార్థసారథిగారి కోరికను బాబా యానతిగా భావించి కలము బట్టి ఈ నాలుగు మాటలు వ్రాయ సాహసించితిని. ఆంధ్ర సోదర సోదరీమణు లెల్లరీ గ్రంథము నాదరించి, పఠించి, తక్కుగల గ్రంథములనుకూడ వెలువ రించుటకు యథోచిత సహాయము నొనరించి ధన్యులై శ్రీ సాయీ కరుణా మృతమున నోలలాడుదురుగాత. ఇట్టి సద్గ్రంథమును వెలువరించిన శ్రీ బాపట్ల వేంకట పార్థసారథిగారికి, సాహాయ్యము చేసిన భక్తబృందమునకు శ్రీ సాయి బాబా సర్వవిధముల కాపాడుగాతమని ప్రార్థించుచున్నాను.

ఉ॥ శ్రీ మహితాత్ములౌ అమరశేఖరు లబ్ధి జనించినట్టి ది
వ్యామృతమాని నిర్జరత నయ్యమృతత్వము నందినట్లుగన్
భూమిని సర్వమానవులు పూజ్యతరమ్మగు సాయినాథ బో
ధామృతమానిపొందు డజరామర సౌఖ్య చిరాయురున్నతుల్.

ఇట్లు
విధేయుఁడు
మధుర కవిరత్న, కవిభూషణ
మూలా పేరన్నశాస్త్రి

విజయనగరము
9-2-1981

—o—

నివేదన

(3వ కూర్పు)

విద్యార్థి దశనుండి గ్రంథ పఠనాసక్తి, సజ్జన సాంగత్యము నాకు అలవడుట సుకృతముగా భావింతును.

పెక్కు ఆధ్యాత్మిక గ్రంథముల అవబోధనము చేయు సందర్భమున షిర్డి సాయినాథుని గూర్చిన రచనలే నన్నెక్కువగా ఆకర్షించినవి. 'షిర్డి' దర్శనమువలన, సాయీ సమావేశములకు హాజరగుట వలన అత్యంత ఆనందము లభించుచున్నది. సాయిబాబని గూర్చిన రచనలు తెలుగు వచనములలో నున్న అశేష జనావళి వారి బోధామృతము గ్రోలుటకు వీలగునని తలపోయుచుంటిని.

ఒకానొక శుభసమయమున షిర్డి ఆస్థాన కవి కీ॥ శే॥ బాపట్ల హనుమంత రావుగారి కుమారుడు శ్రీ వేంకట పార్థసారధితో పరిచయమేర్పడి క్రమముగా గాఢమైత్రి గాఢపు దాల్చినది. వారి తండ్రిగారి రచనలు పునర్ముద్రించుటలో తోడ్పడవలెనని తలంచితిని. అనంతపురంలో మిత్రులు శ్రీ ఆర్.వి.యల్. నారాయణరావు స్నేహము నా కోరికకు బలము నిచ్చినది. ఫలితముగా ఈ గ్రంథ మొనరించుటలో యథాశక్తి తోడ్పడితిని. ఇదంతయూ సాయిబాబని కరుణగా భావించుచున్నాను.

అనంతపురం,
1-9-1988.

సాయీనాథ సేవలో,
సి. నారాయణరెడ్డి,
జిల్లా జడ్జ్ (రిటైర్డ్)

విజ్ఞప్తి

(మొదటి కూర్పు)

సోదరీ సోదర భక్తులారా!

శ్రీ సాయీమహాప్రభువు 27-12-1944, వేకువజామున స్వప్నమున గోచరించి, తన ఆస్థానమునకు జేరబిలిచి ఏవియో రచింపుమని ఆజ్ఞా పించుటయు, మఱునాడు 20-12-1944న పూజ్యశ్రీ బి.వి. నరసింహస్వామి గారిని చీరాలలో సందర్శించి వారి యాశీస్సుల బడసి వారి అనతి ప్రకారము బాబాను గూర్చిన కృతుల రచించుట మొదలగు విషయములు "శ్రీ సాయీ

మననము", "శ్రీ సాయీ కరుణ" గ్రంథములలో దెలుపుకొని యుంటిని. శ్రీ సాయీనాథుడు పూజ్యశ్రీ నరసింహస్వామిగారి ద్వారా వీనినొక ఉప కరణముగ వినియోగించుకొను చున్నాడు.

గురువర్యుడైన నరసింహస్వామిగారు ఆంగ్లమున రచించిన **Sri Sai Baba's Charters and Sayings** అను గ్రంథమును, 'శ్రీ సాయీకరుణ' అను పేర రచించి 1960లో ప్రచురించితిని. బాబా అభయ ప్రదానములు-సూక్తులు నిత్యస్మరణీయములను తలంపున కొంత భాగము పద్యరూపమున, కొంత వచనరూపమున రచించుట జరిగినది. పలువురు సోదర భక్తులు గ్రంథమంతయు వచన రూపముననున్న బాగుండెడిదని వారి అభిప్రాయము దెలిపిరి. వారి ఆశయము దీర్చుపని బాబాకే విడిచిపెట్టితిని.

3-5-1968న శ్రీ యస్. శేషాద్రిగారు (**Hon' Secretary, A. I. S. S. Mylapore, Madras**) "శ్రీ సాయిబాబా 50వ మహాసమాధి సర్ణోత్సవ స్మృతి చిహ్నముగ **Sri Sai Baba's Charters and Sayings** వీలైనన్ని భాషలలో అనువదింపించి ప్రచురించ వలయునని మన సమాజమువారు సంకల్పించినారు. మీరీ గ్రంథముకు తెనుగు వచనమున రచించి ప్రచు రించుపని పూనగలరా? యని (వయస్సు కారణముగ) సందేహించు చున్నాడను" - అని ఉత్తరము వ్రాసినారు. సమాధానముగ "నాయనా! ఇది నీ - నా సంకల్పముకాదు, బాబా సంకల్పమే. "శ్రీ సాయీకరుణ" ను పఠించిన సోదర భక్తులు పలువురీ గ్రంథము పూర్ణముగ తెనుగు వచనమున నుండిన తేలికగ అర్థమగునని తెలిపివారు. తన బిడ్డల కోరికను బాబా అనుగ్రహించినాడు. ఇది బాబా ఆజ్ఞగా శిరసావహింతును" అని తెలిపి ఈ పనికి బూనుకొంటిని. బాబా కరుణలేక ఆకేని అల్లాడదుగదా! ఈ 5 నెలలలో బాబా యీపని పూర్తికావించినాడు.

ఈ కృతికి "శ్రీసాయీనాథ బోధామృతము" అను పేరెంతయు దగునని, బాబా అభయ ప్రదానములు - సూక్తులు ఎల్లదేశముల - ఎల్లకాలముల-ఎల్లరు చక్కగ గ్రహించి అనుసరింపతగినవి. కావున ఇది అమృత స్వరూపమగు బోధ- బాబా ఎట్టుల అమృత స్వరూపుడో ఆ స్వామి బోధయు అమృతమే. ఇందు బాబా తన ఆశ్రితులను పురస్కరించుకొని కావించిన బోధలు- పలికిన

పలుకులు వారికి మాత్రమే నిర్దేశింపబడినవిగ తలపరాదు. ప్రతి భక్తుడు తనకు దెలుపబడినవిగ పాటించదగును. శ్రీమద్భగవద్గీతవలె ఈ గ్రంథము నిత్యము పఠించి స్మరింపదగినది. బాబా నిర్దేశించిన మార్గము అనుసరింప దగినది.

పూజ్యశ్రీ నరసింహస్వామిగారు మహర్షుల సాంప్రదాయమునకు జెందినవారు. పెక్కు వ్యయ ప్రయాసలకోర్చి భౌతికముగ సాయీబాబాతో అత్యంత సన్నిహిత సంబంధముగల భక్తులను గలిసి, వారివారి యనుభవముల నేర్చి కూర్చుటయేగాక "సాయీలీలామాసిక్" (మరాటీ) పత్రికలలో ప్రచురింపబడిన వివిధాంశములను సమగ్రముగ సేకరించి వీని నన్నిటిని ఏర్చి కూర్చి ఆంగ్లబాషలో **Life of Sai Baba, Sri Baba's Charters and Sayings** మొదలగు గ్రంథముల రచించినాడు. ఇట్టి మహనీయ నిస్స్వార్థసేవ కావించి బాబా భక్తులందఱకు మహోపకారము గావించిన స్వామివారియెడ కృతజ్ఞత దెలుపుకొనుట కెవ్వరుజాలరు అని శ్రీ రేగేమహరాజుగారు "తొలిపలుకు" నందు దెలిపిన విషయము త్రిసత్యము. "చంద్రునకు నూలుపోగు" - అను సామ్యమున ఈ కృతిని సద్గురు వర్యులగు పూజ్యశ్రీ బి. వి. నరసింహస్వామివారికి కృతజ్ఞతా పూర్వకముగ కృతిసమర్పణము గావించితిని. ఈ తెనిగింపునగల గుణములన్నియు శ్రీ సాయీ మహాప్రభువు యొక్కయు - శ్రీ సాయీ వ్యాసుడగు స్వామివారియొక్క అనుగ్రహ విశేషములుగను, ఎందేని బొసగిన దొసఁగులు అత్యల్పుడగు ఈ సేవకునివిగను భావించి పాఠక శ్రోతలు మన్నింతురని వినయముగ బ్రార్థించు చున్నాడను.

ఆంగ్లమున తాను రచించిన "తొలిపలుకు" తెనిగించి యిందు జేర్ప ననుమతి ప్రసాదించిన శ్రీ సాయీబాబా అంకితసంతతికి జెందిన శ్రీ యం.బి. రేగే మహారాజుగారికిని కృతాజ్ఞతాభివందనము లర్పించు చున్నాడను. ఈ గ్రంథ పాఠకశ్రోతలను శ్రీ సాయీనాథుడు సర్వదా అనుగ్రహించి రక్షించుగాతమని ప్రార్థించుచున్నాడను.

ఇట్లు విన్నవించు
శ్రీ సాయీభక్త చరణ పరిచరణుడు
బాపట్ల హనుమంతరావు
శ్రీ సాయీ శరణ్

శ్రీ సాయీ కుటీరము
చినగంజాము (ఆం. ప్ర.)
2-10-1968

ఓం శ్రీ సమర్థ సద్గురు సచ్చిదానంద సాయీనాథ మహారాజునకు జయము.

శ్యామ్ చరణ్ సందేశము

(రెండవ కూర్పు)

సచ్చిదానందుడవు కాగోరుదువేని సదా సాయీనామ సుధామృతమును హాయిగా నాస్వాదించు చుండుము.

భవబంధ విముక్తుడవు కాగోరుదువేని బాబా పవిత్ర పదపద్మముల నాశ్రయించి, నీ సర్వస్వమును ఆ తండ్రి పర మొనరింపుము.

నిష్ఠ, సబూరిలను (ప్రగాఢమగు విశ్వాసము, ధైర్యోత్సాహములతో గూడిన ఓర్పు) గలిగియున్న, నిర్భీతి నిన్నంటి యుండును - నిజధామమును - జేర గలవు - నిత్యానందము నంద గలవు.

పైన వ్రాయబడిన సందేశములు నిత్య సత్యములని అనుభవజ్ఞులగు శ్రీ సాయీబాబా పదాశ్రితులు సదా వచించు చుందురు. దానికి కారణం - అవన్నీ ఆ తండ్రి తన బిడ్డల శ్రేయముల కొరకై అనుగ్రహించిన ఆదేశములే!

శ్రీ సాయీబాబా చరిత్ర నెందరెందరో పఠించుచున్నారు. పారాయణ మొనరించు చున్నారు, కీర్తించుచున్నారు, ఇష్ట కామ్యార్థముల బడయు చున్నారు, తరించు చున్నారు.

తెలుసుకోగలిగిన వారికి శ్రీ సాయియే సకల దేవతా స్వరూపుడు, సకల సాధు స్వరూపుడు, సకలప్రాణికోటి స్వరూపుడు, సర్వాంతర్యామి, సర్వగతుడు, సకల చరాచరమున కాధారుడు, సమర్థ సద్గురుడు.

విమర్శల కంతు దొరకడు. వివాదముల కతీతుడు, విచారముల కనంతుడు. విజ్ఞానమున కాధారుడు. వివేక వైరాగ్యముల కధినాథుడు, విశ్వంభరుడు - శ్రీ సాయీనాథుడు.

శ్రీ సాయి- లోకహితార్థమై శరీరమును ధరించి సర్వజనులకు, చక్కగా బోధపడు రీతిలో, అనుభవముల కత్యంత సన్నిహితముగా, ఆలోచనల కందుబాటులో నుండు రీతిగా తన సందేశములను అనుగ్రహించినాడు.

ఆలోచింపజేసి, ఆచరించి, ఆనందించి, తరించునటుల బోధించినాడు. సర్వజాతి మత, కుల, వయో లింగ భేదముల కతీతుడై, వికల జనామోదుడై, సమ్మోహనుడై నిలిచి యున్నాడు.

తన వారల ననుగ్రహించుటకై తలకు గుడ్డను గట్టి, చేత సటకాను బట్టి, మసీదున ధునినిబెట్టి, శరీరమునకు సాయిబాబాయను పేరు బెట్టుకొన్నాడు. శరీరము సమాధిగతమైనది కానీ, పేరు మాత్రం ప్రణవమై పావనమై, ప్రభంజనమై, ప్రమాదకరమై ప్రపంచ మందంతట వ్యాపించి యున్నది.

ఇంతటి ఉత్కృష్టమగు శ్రీ సాయిబాబా అవతారధారి బోధామృతము నాస్వాదించి, తరించుటకు ఒకింత ఆలోచింతము, యేమని? బాబా సందేశములు, ఆదేశములు క్రొత్తవా? పాతవేనా? పాతవైనచో నింతవరకు వాటిని, అమలు పరచిన వారెవరున్నారు? క్రొత్తవైనచో, భగవానుడేల క్రొంగ్రొత్త యుపదేశముల జేయవలసి వచ్చెను?

ముఖ్యముగా, శ్రీ సాయి తనవారి నందరినీ నిష్ఠ సబూరిలను గలిగి యుండుమని ఆదేశించినాడు.

దైవమునందుగానీ, సమర్థ సద్గురునియందుగానీ, ధ్యేయమునందు గానీ నిష్ఠ సబూరిలను గలిగియున్న సత్ఫలితముల నందగలరని బాబా ఉపదేశించినాడు.

యుగ యుగాలుగా భగవద్దర్శనాసక్తులగు వారందరూ గలిగియుండినవి- ఆ రెండింటినే.

హిరణ్యకశ్యపుని ధ్యేయము - విష్ణువును దర్శించి, కదన మొనరించుట' కలియబడుట - దానికి కారణం - తానే అధికుడనన్న అహంకారము, స్వజన పక్షపాతములు.

మరణము లేకుండునటుల జేసికొను ధ్యేయమునందుగల ధ్యాసతో శారీరక, మానసిక బాధల సరకుగొనక నిష్ఠ, సబూరిలతో శ్రమించి, చివరకు సులభ మరణము లేకుండునటుల వరమును బొందగలిగెను.

హరిని దర్శింపవలయునవెడి కాంక్షతో, తపించి, తపించి, తన కుమారుడే తనకు శత్రువుగా మారినమా మానసిక క్లేశమనంతమైననూ,

పరిస్థితులతో రాజీపడక, పరిస్థితుల కనుగుణముగా తన ధ్యేయముల మార్చు కొనక ఏనాటికైననూ తన కోరిక నెరవేరగలదనెడి ప్రగాఢమగు విశ్వాసముతో ఎంతో ఓర్పుతో, ధైర్యోత్సాహముల వీడక అనేక రీతుల ప్రయత్నించి చివరకు దర్శించి ఆ దివ్య తేజములోనే లీనము కాగలిగినారు.

ఇక ప్రహ్లాదుని ధ్యేయము - విష్ణువును దర్శించి, కౌగిలించుకొని కడతీరుట - దానికి కారణం - నిరహంకారము, నిజధామాగమనము, నిర్మల చిత్తము, నిరంతర భగవన్నామ సంకీర్తనానంద సుఖానుభూతి.

"హరి ఎక్కడ?" అన్న తండ్రి ప్రశ్నలకు విసుగుజెందక, శారీరక, మానసిక, క్లేశపరంపరలకు లొంగక, "హరి ఎక్కడ నైననూ గలడనెడి" సమాధానముల నొసంగుచూ, తన ధ్యేయము నందుగల నిష్ఠ సబూరిలతో భగవానుని దర్శించి తరించెను. కాని పరిస్థితుల కనుగుణముగా తన ధ్యేయముల మార్చుకొనడయ్యెను.

శిబిచక్రవర్తి పరోపకార పరాయణత్వ ధ్యేయముతో, నిష్ఠ సబూరిల గలిగియుండి తన శరీరమునే కోసియిచ్చిన కారణము వలననే ఇంతవరకు కీర్తింపబడుచున్నాడు.

సత్యవ్రత పాలన యందుగల ధ్యేయము నిష్ఠ సబూరిలను గలిగించి హరిశ్చంద్రుని చరితార్థుని జేసినది.

బలిచక్రవర్తి, కర్ణుడు, దానగుణ ధ్యేయ మనస్కులై నిష్ఠ సబూరిల గలిగియున్నందున నింతవరకు వారి నామములను స్మరించుచున్నారు.

అలాగే ధృవుడు, మార్కండేయుడు, హనుమంతుడు మొదలగు వారెందరో చిరంజీవులుగా నున్నారు.

వారెవ్వరూ పరిస్థితుల కనుగుణముగా తమ ధ్యేయముల మార్చుకొన లేదు. ఆ ధ్యేయముల యందుగల ధ్యాసలే నిష్ఠ సబూరిలకు మూలము లయ్యెను.

కావున పరిస్థితుల కనుగుణముగా ధ్యేయముల మార్చుకొనిన నిష్ఠ సబూరిలభివృద్ధి జెందక సత్ఫలితముల నందరనియే శ్రీ సాయిబాబా తనవారికి బోధించినది - ఇది సనాతనమే - అధునాతనము కాదు.

శ్రీ సాయి సశరీరులుగా నున్నప్పుడు ఆ తండ్రిని సేవించిన వారెంతటి ధన్యులో.

ప్రస్తుతము శ్రీ సాయీ సచ్చరితముల జదువుచూ, బాబా భక్తుల అనుభవముల ననేకముల వినుచూ, ఆ తండ్రి శక్తి మహత్తులను గురించి అవగాహన కలిగిననూ, పరిపూర్ణమగు నిష్ఠసబూరిలు నాలాంటివారి మనస్సులలో నెలకొనుట - కష్టముగా నున్నది. ఇవన్నియూ ఏమియూ దెలియక ఆ తండ్రియందు నిష్ఠసబూరిల గలిగియుండి, సేవించిన వారిని మించిన భాగ్యవంతులగు వారెందరు?

ఎందరెందరో బాబాను దర్శించిననూ, "భక్తుడా?" యని మహల్సాపతి నొక్కనినే పిలిచినాడు. జీవన్ముక్తునిగా జేయనెంచి వివేక వైరాగ్యముల గలిగించి, లౌకిక సంపదల ననుభవింపనీయక, కడు నేర్పుగా నడిపించినాడు. మహల్సాపతి తనకు గలిగిన దానితో తృప్తిపడి జీవించి, ప్రభుని అనుగ్రహమునకు పాత్రుడైనాడు. బాబా భిక్షకై వెడలియుండినపుడు, 72 జన్మల ముందునుండి సంబంధము గలిగియుండిన "శ్యామ" (మాధవరావు దేశపాండే) ఒకసారి బాబాపేర వచ్చిన రెండు రూప్యములను బాబా కీయక తమాషాకై మసీదు ముంగిటనే గుంటలో దాచియుంచెను. 6 నెలలవరకు బాబా దానిని గురించి అడుగనందున బాబాకు తెలియక తాను దాచగలిగితినని భావించిన శ్యామా యింటిలో దొంగతనము జరిగెను. దొంగతనమును గురించి బాబాకు విన్నవించుకున్న శ్యామాతో బాబా "నీ యింటిలో జరిగిన దొంగతనమును గురించి నీవు చెప్పకుంటే వినుటకు నేనున్నాను కానీ నా రెండు రూపాయలు 6 నెలల క్రిందట పోయిన విషయము నేనెవరితో చెప్పుకోగలనని" అన్నాడు. అంత చిన్న తప్పుకు యింతటి పెద్ద శిక్షయా? యని ప్రశ్నించిన శ్యామాకు "నీకు 250 రూపాయలెంతో ఫకీరునగు నాకు 2 రూపాయలంతే" అని జవాబిచ్చినాడు. అప్పటినుండి శ్యామా బాబాతో పరాచికములాడుట మానివైచెను. మహాత్ములతో పరిహాసము, తమాషాలు చేయరాదు. ఇతరుల సొమ్మును తనవద్ద నుంచుకొనరాదనీ, ఎవ్వరైననూ తప్పుకు తగిన ప్రతి ఫలము ననుభవించ వలయుననీ" బాబా ఈ లీలల ద్వారా బోధించినాడు.

పేదవాడైన పురందరేను ఇల్లు కట్టుకొమ్మని జెప్పగా విననందున శిరోవేదనను గలిగించి, గృహప్రవేశ మొనరించు సమయమునకు దానిని మాయ మొనరించెను. తనబిడ్డల శ్రేయముల కొరకై బాబా అనేక స్వల్పశిక్షల నిచ్చుచూ కావలసినదాని నందించు చుండును. శ్రీ బాబాయే సర్వస్వమని నమ్మి చరించిన పురందరే బరువు బాధ్యతలను ప్రభువే భరియించెను.

దాసుగాణూ మహారాజు బాబా అజ్ఞానుసారముగా పోలీసు కానిస్టేబులు ఉద్యోగమునకు రాజీనామా చేయనందున అనేక అడ్డంకులను గల్గించి చివరకు తనంత తానుగా రాజీనామా నిచ్చునటుల జేసి బాబా, ఆయన కీర్తి చంద్రికలను తన నామమిలలో స్మరింపబడుదనుక నిలచియుండునటుల అనుగ్రహించినాడు. వారివారి యిచ్ఛానుసారముగా గాక, సమర్థ సద్గురువుల ఆదేశానుసారము చరియించుట శ్రేయస్కరము. బాబా అందరియొద్దనుండి దక్షిణలు స్వీకరించువాడు గాడు. ఒకపరి దక్షిణ నొసంగబోయిన నొకనితో "నీ ఉంపుడుకత్తె కిచ్చుకొమ్మని" గ్రహింప నిరాకరించెను. ఋజు ప్రవర్తన గలిగియుండిననే సద్గురువుల అనుగ్రహమును బొంధుట దుర్లభము.

ఇలాంటి భావనలు ప్రతియొక్కరికి కలుగ గలవు. అలా కలగడానికి కావలసిన దొకింత ఆలోచన మాత్రమే. శ్రీ సాయినాథునితో భక్తులకుగల సంబంధములను, వాటివలన గలిగిన అనుభవములను ఆలోచించగలిగినచో, వారివారి మనోభావముల కనుగుణ్యముగా, శ్రీ సాయీశ్వరుని సంకల్పాను సారముగా అనేకములగు ఆదేశములు, సందేశములు దెలియుచుండును.

శ్రీ సాయీప్రభువు పలుకుచుండిన విషయముల నన్నింటినీ, యథా శక్తిగా బడేబాబా గ్రంథస్థ మొనరించెను. తనవద్ద కేదేని సమస్యలతో వచ్చినవారికి, ఆ గ్రంథమును దెరచి అందుగల బాబావాణిని వినుపించు చుండెను. చిత్రాతి చిత్రముగా, సమస్యల కన్నింటికి పరిష్కారములు, సందేశముల, నుపదేశముల రీతిలో లభించుచుండెను. అలాగే శ్రీ సాయీ చరిత్రములను చదివిన వారికిని శ్రీ సాయీబాబా గురికుదురును. తమ కేవేని సమస్యలు వచ్చినపుడు ఆ తండ్రిని స్మరించి, భక్తివిస్వాస, శ్రద్ధా

గౌరవాదులతో శ్రీ సాయీనాథ బోధామృతమును దెరచినచో, తగు సలహాలను, పరిష్కార మార్గములనూ, సందేశములనూ బొందగలడు.

ఎవరికెయ్యది శ్రేయమో, దానినే ప్రభు వొనరించెను. తాను ఫకీరైననూ, అందరినీ ఫకీరులగమ్మని ఆదేశించలేదు. సంసారులను సన్యాసుల గమ్మనలేదు. బ్రహ్మచారులైనా, సన్న్యాసులైనా, ఏ ఆశ్రమ ధర్మ మార్గావలంబకులైనా - బాబా బోధించిన దొక్కటే - అదియే కర్మ ఫలత్యాగము - శ్రీకృష్ణ సందేశమే! సద్గురువునందు నిష్ఠ సబూరిల గలిగి యుండి తనకు ప్రసాదింపబడిన ఆశ్రమ ధర్మమును త్రికరణ శుద్ధిగా ఆచరించమనీ, తరించమనీ ఉపదేశించిన బాబా, తాను పాటించి భక్తులకు మార్గముల నిర్దేశించినారు.

అన్నదానము నొనరించమని, తాను స్వయముగా వండి భక్తులకు సంతుష్టిగా దినబెట్టినాడు.

తన నాశ్రయించిన, అర్థాసక్తులకు, భక్తులకు ప్రేమతో అనేకార్థముల ననుగ్రహించినాడు.

ఎవరినుండి ఉచితముగ ఏ సేవను గొనక, తగురీతిగా బహూకరించినాడు.

తనను శిష్యునిగా పరిగణించిన "జవ్హరలి" ఫకీరునకు, శిష్యునివలే సపర్యలజేసి నిరహంకారతత్త్వము నుపదేశించినాడు.

పంచ ప్రదేశముల దెచ్చుకొన్నట్టి భిక్షాన్నమును ఏ కొద్దిగనో స్వీకరించుచూ, తనకు సమర్పింప బడుచుండిన సమస్త రుచ్యములగు పదార్థముల యందేమాత్రము ధ్యాసలేక, జిహ్వా చాపల్యమును గలిగి యుండకుడని బోధించినాడు. పాపజీవనులైననూ.... పశ్చాత్తాపము నొంది తనను శరణన్న వారిని పాపవిముక్తుల గావించి, సన్మార్గవర్తనుల నొనరించి, సద్గతుల నందించినాడు.

మానవ, జంతు, పశు, పక్ష్యాది భేదములెంచక, అణువణువులో తననే దర్శించినాడు.

తనను దర్శించిన వారికి అవ్యక్తానందాను భూతులను ప్రసాదించినాడు.

ప్రేమామృతమును పంచినాడు. అందరిలో పెంచినాడు.

కరుణను బరపి కన్నీరుల దుడిచి లోకకల్యాణ మొనరించినాడు.

దయను ప్రసరించి దీనులకు దిక్కై, ధర్మబద్ధమగు కామ్యముల నెరవేర్చినాడు.

అభయప్రదాతయై, తన భక్తులకు నిర్భయత్వముల పాదుకొలిపినాడు.

శరీరమును ధరించినందున, శారీరక బాధలను భరించి ప్రకృతి ధర్మము ననుసరించి శరీరములకు బాధలు సహజములనెడి సత్యమును తన బిడ్డల కవగత మొనరించినాడు.

ఏ ప్రాణినీ నిరాదరించలేదు, నిరాకరించలేదు. వారివారి భావముల ననుసరించి అనుభవముల ననుగ్రహించినాడు.

ధనాసక్తులకు ధనమును, సంతానాసక్తులకు సత్సంతానమును, ధర్మాసక్తులకు ధర్మబుద్ధిని, మోక్షాసక్తులకు మోక్షమును ప్రసాదించినాడు.

సర్వకాల సర్వావస్థలయందు తానుందుననీ తన భక్తుల యోగ క్షేమములను విచారించుచుందుననీ, నిదర్శనా పూర్వకముగా అనుభూత మొసర్చుచున్న "శ్రీ సాయి" నామ రూప ధ్యానమే "ధ్యేయముగా గలిగినచో" సద్గతినందుట సులభసాధ్యము.

అనంత విశ్వములో భూమి ఒక అణువుగా నుండునేమో! ఇక మానవుడెంత???

సృష్టి స్థితి లయ కారకుడగు భగవానుని దెలుసుకో గలుగుట మానవున కసాధ్యము.

"భగవంతుడొక పంచదార పర్వతమగునేని, వ్యాస, శుక, నారదాదులు గండు చీమలవంటివారని" శ్రీ రామకృష్ణ పరమహంస విశదీకరించిరి. నారాయణ స్వరూపమగు వ్యాసుడే గండుచీమయైనచో నిక నాలాంటి అల్పజ్ఞుడు....???

దైవతత్త్వమును విశదీకరించుటకు, వివరించుటకు వీలుకాదు. దానిని ఎవరంతట వారు అనుభూత మొనర్చుకొన వలసినదే! షడ్రుచులు, అరిషడ్వర్గములు, తదితర వాసనలు - ఆత్మ శరీరము నంటిపెట్టుకొని యుండునంతవరకు, అనుభూత మగుచుండును. హావభావ ప్రకటనలను చర్య ప్రతిచర్యలను బట్టి మాత్రమే అవి అవగత మగుచుండునేగాని, శరీరమునందెక్కడనూ అవి కనిపించవు.

ఆత్మ శరీరమును వదలిన క్షణముననే అవన్నీ మాయమగును. అలాగే భగవత్స్వరూపుడు శ్రీ సాయీప్రభుని ప్రేమ, దయ, కరుణ, అనుగ్రహములను ఎవరంతట వారే అనుభవించి తెలుసుకోవలసినదేగాని, వ్యక్తీకరించుట కసంభవము. ఒక్కొక్క భక్తుని అనుభవములే ఒక్కొక్క బృహద్గ్రంథము కాగలదు. కోట్లాది భక్తుల అనుభవములు....?

శ్రీ సాయీప్రభువు ప్రతి యొక్కరికీ స్వంతమే! ఆ తండ్రిని స్మరించుటకు, దర్శించుటకు, అనుగ్రహము నందుటకు నితరుల సిఫార్సులనవసరము. భక్తిభావమే భగవానుని భక్తునకు వశపఱచగలదు.

వేదశాస్త్ర, ఉపనిషత్, పురాణాదులను మధించి, శ్రీ సాయీప్రభువు నిష్ఠసబూరిలను రెండు అమృత ఫలములను అనుగ్రహించినాడు. వాటిని ఆరగించి, జీర్ణించుకోగలిగినచో, ఆనందారోగ్య సౌభాగ్యవంతము లనుభూతములగును.

ఆలోచనలు - సాయియే, ఆచరణ సాయియే, ఆవేదనా నందానుభూతులు-సాయియే, అణువణువూ-సాయియే, క్షణక్షణమూ -సాయియే, ఇక ఈ దీనుడెక్కడున్నాడు? వీనిదేమి గలదు?

లీలానాటక సూత్రధారి తన యిచ్ఛవచ్చినటుల - జరిపించుచుండును.

అసాధ్యమని విన్నవించుకోబడిననూ, అర్థరహితమని అర్థించిననూ అంగీకరించక "శ్యామ సందేశమని" వ్రాయుమని శ్రీ సాయియే - మహాత్ములగు సోదరులు పూజ్యశ్రీ బాపట్ల వేంకటపార్థసారథిగారి ద్వారా ప్రోద్బల మొనరించి తన సంకల్పమును సంఘటింప జేసుకున్నాడు.

తెరవెనుక నుండవలయు ననెడి కాంక్షను ఆమోదించక, మెడబట్టి ముందుకు దోసి ఆటల నాడించుచున్నాడు బాబా.

ప్రభునిచేత ఉపకరణమగు ఈ జీవిని నిమిత్తమాత్రునిగా నుంచుకొని ఏమి జేయనెంచెనో! ప్రశంసనములు - నృశంసనములు సమముగా నెంచుమని, మదిలో నుంచుమని తదనుగుణముగా శిక్షణ నొసగుచున్నాడు, శోధించుచున్నాడు.

శ్రీ సాయీ స్వరూపులగు భక్తులందరకూ ప్రణామ శత సహస్రనేకంబులు.

'బాబా' ఈ జీవిద్వారా వ్రాయించిన సందేశము సత్ఫలితముల నొసగి, భక్తి, ప్రేమ, నిష్ఠసబూరిల నొక్కరిలోనైనా గలిగించినచో, ఆనందమే లేకుండిననూ - తండ్రిసంకల్పమే యని దలంగవలసినదే!

ఎవరి నమ్మకము వారిని నడిపించును. అపనమ్మకము ముంచును.

త్యాగపూరితమగు ప్రేమయే దైవము. అటువంటి ప్రేమగలిగిన దైవస్వరూపులే. ఈ లోకములో ఎవరెంతటి సంపద, ఆరోగ్యము, గౌరవము, అంతస్తులను గలిగియున్నను.... ఎప్పుడో ఒకప్పుడు మనశ్శాంతి కొరకారాటపడక తప్పదు. అప్పుడు దానిని ప్రసాదించగల శక్తి ఒక్క దైవమునకే గలదు. ప్రతియొక్కరూ, ఏదో ఒకరీతిగా ఆ దైవము నాశ్రయించక శాంతిని పొందలేరు. దైవమువాఙ్మానసగోచరుడై నందున శరీరధారియగు సద్గురువే శాంతిని ప్రసాదించి మానవులకు ఓదార్పుల నందించగలడు.

మానవుడు సద్గురువుల నాశ్రయించి వారి బోధనల నాచరించి మహాత్ముడు కాగలడు. మహాత్ముడు పరమాత్మతో తాదాత్మ్యము నంద గలడు. మానవునిగా నున్నంతవరకు - మహాత్ముల నాశ్రయించక తప్పదు.

ఎవరంతట వారాలోచించుకొని - నిర్ణయించుకొని - ఆచరించుటయే- దైవనిర్ణయము.

సర్వేజనాః సుఖినో భవంతు !

శ్యామచరణుడు
24-2-1983

ప్రశంసలు

(రెండవ కూర్పు)

In this world where rank materialism reigns supreme, the effort to bring out books on God is really laudable. Every spiritual aspirant who wants to drown himself in the sea of Sri Sai Baba's benevolence, knows the selfless endeavours of Sri B. V. Pardhasarathi to spread the message of the Great Master. Devotion to Bhagavan Sri Sai Baba flows in the veins of the Bapatla vari family.

The father of Sri B. V. Pardhasarathi, Late Sri B. Hanumantha Rao was the poet laureat of Shirdi. His works on Sri Shirdi Sai Baba are commendable. He stood in the van of Sri Sai devotees. He was the blessed son of Sri Sai Baba. He presented the profound philosophy of God in an easy vein. His writings show his sincerity and utter devotion to Sri Sai Baba. This pen finds itself quite incompetent to depict the complete picture of that greaf devotee.

Whenever I read the books on Sri Sai baba by Sri B. Hanumantha Rao, my heart is filled with joy, and tears well up in my eyes. Words cannot describe the greatness of Sri Sai Baba. His Kindness is boundless and his greatness is limitless. If we pray to him surrendering our body, mind and soul, he is always ready to give His guidance and blessings. This is the experience of millions of people.

The author did great service to the seekers of Sri Sai Baba's blessings by presenting this book to the world. I sincerely pray to Bhagavan Sri Sai Baba to shower his benisons on Sri B. V. Pardhasarathi and his family.

Markapur.
25-9-80

In the service of Sri Sai Baba
RAMACHANDRA RAO, R.

Dear Sri Pardhasarathi garu

Though I am not blessed to have had the personal acquaintance with your father, Poojya Sri Bapatla Hanumantha Rao before he shed his mortal coil, so as to have the unique benefit of His spiritual influence and blessings directly and personally, yet his works, which at least I am fortunate to come across and go through and which reflect and be speak of his divine personality, have given me considerable fillip and inspiration on the spiritual path. However feeble and inadequate may be my words in expressing what I actually feel about him in the core of my heart, yet I cannot refrain myself from trying to express in my own humble way what little I can from the vast inexpressible. To be apt and brief I would only say that I find in him a God - intoxicated person, a saint, a seer, an ardent devotee, a self-surrendered and dedicated soul, a Karma Yogi and, above all, an instrument of God (Sri Sai Baba). I find all these at once in him.

At first I happened to read his poems in Sri Sai Mananam.' The poems are superb and thrilling, full of devotional fervour and the impression they left in me was profound. I feft they are more intuitional and spontaneous, because of his total surrender and dedication to Lord Sri Sai Baba, than a mere literary composition based on his learning in course of time, It could secure his some other books and read them one by one. All his works are equally inspiring and elevating. While reading his bocks I invariably remember. Bhakta Pothana, the famous author of Srimad Andhra Bhagavatam, with whom Sri Bapatla Hanumantha Rao can be well compared, since it is only a divine personality like Pothana who sees only God, God's action, and God's will in everything and attributes and dedicates everything to God, that can write such thrilling poetry.

I have no doubt that the present publication viz. "Sri Sainatha Bodhamritam" will be a crowned master-

piece among his works and will shine forth as an invaluble gem in the hearts of all devotees and that it will inspire and embrace hundreds and thousands of people into its divine fold.

1-10-129,
Ashok Nagar,
Hyderabad-20.

Yours Sincerely,
In the service of Sri Sai Baba,
N. VENUGOPAL.

శ్రీ సాయిబాబా బోధనలు - సూక్తులు అన్నీ సేకరించి "శ్రీ సాయినాథ బోధామృతము" అనే పేరుతో 'Sai Baba's Charters and Sayings' అనే గ్రంధానికి తెలుగు అనువాదం ఈ రచయిత సరళమైన భాషలో తెలుగు వారి కందించారు. అభయప్రదానములు - సూక్తులు- ఆత్మవిచారము వగైరా పలు శీర్షికలలో పొందుపరచటం జరిగింది. ఈ పుస్తకం సాయి భక్తులకు ఒక కానుకలాంటిదే అని చెప్పవచ్చు. సాయి భక్తులేకాక అందరూ పఠించ దగ్గ ఆధ్యాత్మిక గ్రంథం ఇది.

" ఈనాడు " 19-11-1995

అనూహ్య, అగ్రాహ్య, క్లిష్ట సంకట పరిస్థితు లెట్టివైనను పరిష్కరింప బడుటకు "సంఖ్యామంత్రములు" ఈ దివ్య శ్రీ సాయీనాథ బోధామృతములోని 643 ప్రబోధములు.

- రెబ్బాప్రగడ వెంకటరాజేశ్వరరావు,
ఎం.ఎ.,బి.ఎల్, కొవ్వూరు.

సాయీ ప్రేమికులందరి
నేయమ్మన సాగు సేవ నిరవధికంబై
ధ్యేయము సర్వజనాళికి
సాయీ బోధామృతంబు చదువ ఫలించున్.

జిల్లేపల్లి భాస్కరరావు,
"షిర్డి సాయి" సంపాదకులు

ఓమ్ శ్రీ సాయి శరణం మమ

ప్రశంస

భగవదవతారము, పరబ్రహ్మ స్వరూపుడును, మహాయోగీశ్వరుడునగు శ్రీ సాయీనాథునకు, సద్గురువర్యులు కీ. శే. శ్రీ బాపట్ల హనుమంతరావుగారి పాద పద్మములకు సాష్టాంగ నమస్కారములు. పూజనీయులు శ్రీ బాపట్ల వేంకటపార్థసారధిగారు 'ప్రశంస' వ్రాయుమని ఆదేశించి, ఆశీస్సులు అందించినందున, నాకేలాటి అర్హతలేకయున్నను ఆజ్ఞపాటించవలసి యున్నం దున శ్రీ సాయినాథుని ప్రార్థించితిని. ఆ ప్రభువు నా మనస్సునందు ప్రవేశించి పలికించిన వాక్యములు లభ్యమగుట శ్రీ హనుమంతరావుగారి సద్గ్రంథముల పఠన ప్రభావమే.

శ్రీ హనుమంతరావుగారి రచనములు అపారములు - అమోఘములు. వీరు దైవాంశ సంభూతులు. అందు "శ్రీ సాయినాథ బోధామృతము" ఒక మణిరత్నము. మానవుని ఐహికాభ్యుదయానికి, పారమార్థికాభ్యున్నతికి అవశ్యక మైన విషయసంగ్రహ మిందు నిమిడింపబడినది. కస్తూరి నుండి సుగంధపు పరిమళాలవలె యీ బోధామృతము నుండి బోధనలు గుబాళించి మనలను ప్రభావితము చేస్తాయి. శ్రీ హనుమంతరావుగారు శ్రీ షిరిడి సాయి అస్థాన విద్వాంసులను బిరుదమందినవారు, అంకితం బిడ్డ. శ్రీ సాయీనాథుని స్వప్న సాక్షాత్కారము పొంది, వారి ఆదేశానుసారముగ వేదాంత - ఆధ్యాత్మిక - భక్తి జ్ఞాన ప్రబోధక రత్నములందించిన పుణ్యాత్ములు - పూజ్యులు. ఈకృతి పునర్ముద్రణ కొఱ కెందరో ఎంతో కాలమునుండి నిరీక్షించుచున్న విషయము గుర్తించి, అచంచల దీక్షతో బహువ్యయ ప్రయాసల కోర్చి, యీ బోధామృతమునే కాక మరెన్నో ఉత్తమ గ్రంథ రత్నములను మరల మరల ప్రచురించుచు తన తండ్రి కీర్తిని నలుదిశల వ్యాపింపజేయుచు తండ్రిగారి బాటలో పయనిస్తూ తండ్రి యందుగల గౌరవప్రపత్తులే మూల ధనముగ, ఆత్మానందమే ఆశయముగ 'బాపట్ల' వంశమునకే వన్నెతెచ్చుచూ, తండ్రికి తగిన తనయుడుగ అడుగులిడుచున్న శ్రీ బాపట్ల వేంకటపార్థసారధి గారు శ్లాఘనీయులు - అదృష్టవంతులు. అది వారి పూర్వజన్మ పుణ్యఫలము, వారికి మనమెంతో ఋణపడియున్నాము. శ్రీ సాయినాథుడే వారికి తోడునీడయై నిలబడి సకలము సమకూర్చుచున్నారు. వారికి నా హృదయపూర్వక పాదాభి వందనములు.

భక్తిమార్గ ప్రబోధకరమైన యీ గ్రంథము నందలి బోధలు పరమామృతములు. ప్రాపంచిక కష్టముల దుఃఖముల గ్రుంగి, కృశించు, మానవులకు ఉత్సాహమును - మనశ్శాంతిని, ఆనందమును కలిగించి, లౌకిక, పారలౌకిక విజ్ఞానమును ప్రసాదింప సమర్థనీయములు.

బాబాబోధలు విని మననము గావించు భక్తులకు చిరకాల వాంఛితములగు అష్టాంగ యోగసిద్ధి - కలుగును. సాయిభక్తిని ప్రజలలో పేరేపించేందుకు ఉపకరణీయములు. సాయి మహిమలు, లీలలు, భక్తరక్షణము, సాయితత్త్వము, భక్తులొనర్చవలసిన కర్మములన్నియు నిందు పొందు పరుపబడినవి. ఇది భక్తులపాలిటి కామధేనువు. తనదైన శైలిలో, సరళ, సుందర, మృదు, మధుర, గంభీర పదముల వరవడితో, సుబోధకముగ భక్తుల హృదయములకు హత్తుకొను నటుల రచయిత తెనుగున స్వేచ్ఛానువాదమొనర్చిన "శ్రీ సాయినాథ బోధామృతము" ఒక "సాయీ భగవద్గీత".

శ్రీశ్రీశ్రీ బి. వి. నరసింహస్వామిగారి అంగ్ల రచనలోని భాష భావములతో పోటీపడునట్లింకా అంతకుమించిన స్థాయిలో తెనుగులో అందించగల సమర్థత - భావ ప్రకటన-భక్తి - భాషా నైపుణ్యము -పదజాలపు వరవడి శ్రీ హనుమంతరావుగారికే స్వంతమైనవని పాఠకులకు స్ఫురింప తప్పదు. ఈ మహనీయుని కలమునుండి వెలువడిన రచన లన్నియు చదువ మొదలిడిన అవి పూర్తియగు నంతవరకు ఆనందాంబుధిలో మునిగి తేలి పోవుదుము. ఈ బోధామృతమును వ్రాసినవారు సాయి మహిమను-సర్వాంతర్యామిత్వమును - చక్కగ అవగాహన చేసికొని శ్రీ సాయినాథుని దివ్యానుగ్రహమును, తద్వారా కైవల్యం సిద్ధిని పొందగలరు.

పంతులుగారి " శ్రీ సాయీనాథ బోధామృతము" మొదటినుండి చివరి వరకు భక్తి విశ్వాస శ్రద్ధలతో పఠించి, ఆ బోధనలను జీర్ణించుకొని, తమ నిజ జీవితమందు అనుష్ఠించి, ఆచరించి, ఆ శ్రీ సాయినాథుని దివ్యానుగ్రహమును పొందుదురని విశ్వసించుచున్నాను.

ఇట్లు

ప్రొద్దుటూరు
21-12-1994

శ్రీ సాయి సేవకుడు
సత్రం వేంకటేశ్వర్లు

ఓం శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయినాథాయ నమః

విజ్ఞప్తి

జనకు చరణాబ్జములె నాకు శరణమగును

శ్రీ సాయి నిలయ ప్రచురణములు ప్రకటించు ప్రక్రియలో ప్రవేశ పెట్టి ఆశీర్వదించిన అఖిల భారత సాయి సంఘాధ్యక్షులు శ్రీ సాయి పాదా నంద రాధాకృష్ణస్వామిజీని, శ్రీ మంచిరాజు సూర్యనారాయణమూర్తి గారు (కొవ్వూరు), శ్రీ కేశిరాజు వెంకట నృసింగ అప్పారావుగారు, కళాప్రపూర్ణ - శ్రీ పాదిల విశ్వనాథశర్మగారు(ఇల్లిందలపర్రు), శ్రీ చోడవరపు సాంబమూర్తి గారు (హైదరాబాదు), శ్రీ వాడేవ్రు గురవరాజుగారు (అంబాజీపేట), శ్రీ గోరుగంతుల రాజశేఖరరావుగారు (కాకినాడ), మాతాజి కృష్ణప్రియ (నాగపూర్), మాతాజి "పూలమ్మ" (నండూరు) ప్రభృతులకు ప్రణామములు. వీరు అమరులు, నిత్యస్మరణీయులు.

శ్రీ సాయి భక్తాగ్రగణ్యులు, ప్రేమస్వరూపులు, సాయితత్త్వాన్ని ప్రజలకు ప్రబోధిస్తూ, శ్రీ సాయి సత్యవ్రతములు వేలకొలది గృహములలో నిర్వహింపచేస్తూ, నన్ను పుత్రునిగ దీవిస్తూ ఆనందపరుస్తున్న శ్రీ శ్రీ శ్రీ కొప్పరపు రామారావు పంతులుగారి (విజయవాడ) పాదపద్మములకు సాష్టాంగ ప్రణామములు సమర్పించు కొనుచున్నాను.

ప్రాపంచిక విషమ విషయ వ్యామోహములకు లొంగక, అజ్ఞానాంధ కారమున బడనీయక, అహంకారపూరిత హృదయ కాఠిన్యమును పూర్తిగ రూపుమాపి, ప్రేమ బీజములనాటి, దినదిన ప్రవర్ధమానముగ పెంచుకొనుచు శ్రీ సాయిచరణ సేవచేయు భాగ్యమును కల్పించి, ఒక కంట కనిపెట్టి పరీ క్షించుచు, పరిరక్షించుచున్న భక్తశిఖామణి, విజ్ఞాన సంపన్నుడు, ఆత్మీయ సోదరుడు పూజ్యశ్రీ చిరంజీవి శ్యామ్‌చరణ్‌బాబా (జయసాయి కరుణాలయమ్, 25-461 మేడమీద, ఆర్. యస్. రోడ్, నంద్యాల - 518 501.) వారికి నిత్యము నమస్కరించుకొనుచున్నాను.

సోదరీ సోదర సాయిబాబా భక్తులారా!

శ్రీ సమర్థ సచ్చిదానంద సద్గురు దేవుడగు శ్రీ సాయి ప్రభుని సంపూర్ణ కరుణాకటాక్ష ప్రభావము, మీ అందరి సహాయ సంపత్తి యాధారమున

శ్రీ సాయీ ప్రసన్న బిరుదాంకితులు, పూజ్యులు, కీర్తిశేషులునగు మా తండ్రి శ్రీ బాపట్ల హనుమంతరావు పంతులుగారు రచించిన "శ్రీ సాయీనాథ బోధామృతము"ను పునర్ముద్రణ చేయించి మీ కందించు భాగ్యము నాకు సంప్రాప్తమైనది.

సర్వజ్ఞుడు, సర్వశక్తియుతుడు, సర్వ వ్యాపకుడునగు శ్రీమన్నారాయణుడు ఈ విశ్వమును సృష్టించి, సమస్తము చక్కగ కొనసాగుటకు వేదములందు సనాతన ధర్మమును ప్రసాదించి, కలియుగములో ఈ ధర్మము క్షీణగతి పట్టిన కారణముగ "యదాయదాహి ధర్మస్య...." అని శ్రీకృష్ణ భగవానుడు గీత యందు పలికినట్లు శ్రీ సాయీ ప్రభువు రూపంలో మహారాష్ట్రములో అవతరించెను.

శ్రీ సాయిబాబా ఆచరణలు, ప్రబోధములు, విశ్వజనీనములు. జాతి, మత, కుల శాఖాదుల కతీతములు. వివిధ జాతి, కుల మతానుయాయులైన తన భక్తుల నందఱను సమానదృష్టితో సమాదరించి లౌకిక విషయములందు తన ప్రత్యేక మహాద్భుత శక్తి మహిమముల బఱపుచు అనుగ్రహించినాడు. గాఢ విశ్వాసము-ధైర్యముతో గూడిన ఓర్పు (నిష్ఠ-సబూరి) కలిగి, ఆశ్రయించి, సేవించు జీవులను బాబా అనుగ్రహించి తీరును. ఈ విశ్వమున గల సకల శాస్త్రములలో ప్రతిపాదింపబడిన వివిధ మతాధ్యాత్మిక విజ్ఞానాంశములను, వ్యాఖ్యానముల ప్రవచనములతోకాక ఆ యా భక్తుల నిత్యానుభవములలో దృష్టాంత పూర్వకముగ పరమ సత్యమును ఎరుకపరచిన వాక్కులు "శ్రీ సాయినాథ బోధామృతము" రూపము దాల్చినది. ఎల్లరకు నెల్లెడల ఈ పరమార్థమును ప్రత్యేకానుభవముల ద్వారా బాబా బోధలందు విశద పఱచినాడు. ఇతరుల ద్వారా బాబా మహత్మ్యములను తెలిసికొనుట సహింపక ఎవరికివారు స్వయముగనే యెరుగ వలెనని బాబా బోధించెను, (405 చూడుడు.) జీవకోటిని సత్యమార్గమున నడిపించుటకే బాబా మూర్తీభవించెను (చూడుడు 581-61-62). 'బ్రహ్మము నా తండ్రి - మాయ నా తల్లి - షీర్డి నా నెలవు-విశ్వమంతట నుందును. వయస్సు లక్షలకొలది సంవత్సరములు.

శ్రీ సాయీప్రభువు అత్యద్భుతమైన భగవదవతారము. దుష్టహృదయ పరివర్తన - ధర్మ సంస్థాపనము, భగవదవతార కర్తవ్యములు - భక్త హృదయములను సంతుష్టి సంతృప్తుల బఱపుటకొరకు ఆ భగవానుడు వివిధ

రూపముల తన అద్భుత లీలలను బఱపును. భక్తులకు సేవలుచేయును. 'మై అల్లా హూఁ' అని బాబా చెప్పగలిగెను. ఆయా భక్తులు వారివారి దృక్పథముల - ఆశయముల ననుసరించి-వారివారి యిష్టదైవముగ-సద్గురువుగ భగవానునిగ - రక్షకునిగ - శ్రీరామ - శ్రీకృష్ణ - శంకర - గణపతి - విఠోబ దత్త - మారుతి - అకల్‌కోట మహారాజు - ధోలప్ మహారాజు-ఇత్యాదులుగ బాబాను వీక్షించి, సేవించి, ఆ తండ్రి రక్షణకు, కృపకు పాత్రులైరి.

ఈ విశ్వమునగల ప్రతి జీవియు - ఆత్మ స్వరూపమని బాబా ప్రకటించినాడు. ఏ జీవిని సంతృప్తి పఱచినను తనను సంతృప్తి పరచినట్లే - ఏ జీవిని బాధించినను తనను బాధించినట్లే అనుభవపూర్వకముగ బాబా తన బిడ్డల కెరుకపఱచినాడు. ప్రతి మతమునగల ప్రాధాన్యముల ఆదరించి అప్రాధాన్యముల విసర్జించుటయే బాబా ఆచరణ బోధలలోని సారాంశము (చూడుడు 65) శ్రేయస్కాముడగు సాధకుడు తన మతముగాని, యిష్ట దైవమునుగాని, గురువునుగాని విడనాడ దగదని తెలిపినాడు.

అవతార పురుషులగు సద్గురువుల బోధలను గూర్చి తలంచుట, పలుకుట, కీర్తించుట, రచించుట, ఆలకించుట, వ్యాప్తిపఱపుట మహదానందకరములు - సౌభాగ్య వర్ధనములు - ఆ యా వ్యక్తులకు ఆధ్యాత్మిక ప్రబోధ కల్పించ, పవిత్రుల గావించ, ఉత్తేజపఱచి, సముద్ధరించి, దైవ సాక్షాత్కృతి ప్రసాదింప సమర్థములైనవి.

బాబా జీవిత చరిత్ర యంతయు "త్యాగ-సేవలతో గూడినది - బాబా కావించిన ప్రతి కార్యము నిస్వార్థ పూరితము - లోకోద్ధరణ దక్షమైయున్నది. ఆశ్రిత కోటికి లౌకిక కామితముల బ్రసాదించుచున్న వాడయ్యును, శ్రీ సాయీనాథుడు తన బిడ్డలకు జీవితాశయము - లక్ష్యము నెఱుకపరచి, ప్రియవస్తువు నుండి పరమ శ్రేయో వస్తువు దఱికి - పరమాత్మ దఱికి వారా జీవితమున పురోగమించగల యంతదనుక గొనిపోయి తన సర్వవ్యాపకత్వ సర్వజ్ఞత్వ సర్వ సమర్థతలను నిలుపుకొనగలడు.

"అసలీసులు - లోభము - అన్యచింత
కపటము, నసత్యమును కాముక ప్రవృత్తి
అగ్రహంబను నెనిమిది యవ గుణములు
అవల ద్రోయనొ సాయి పదాంకితుండు."

మాయావరణ బద్ధుడగు జీవి యీ అపగుణములు దనకుదా వదలజాలడు. శ్రీ సాయీ ప్రభుని కరుణా ప్రభావముచే తొలగవలసినదే! దానికై నిష్ఠ - సబూరి- రెండు కానుకలు సమర్పించి, ఊరకయే కూర్చుండు విచారంబుల దక్క" అనినాడు. "నా ఆశ్రితుని సకల భారంబులు నేనే వహించి, వానిని సక్రమ మార్గమున నడిపించి గమ్యమును చేర్చగలను" అని అభయ ప్రదానము గావించెను.

దురహంకారము కలిగి, దుర్వ్యసనములకు లోనై "బాబా దేవుడా?" అని సందేహించు భక్తులను సైతము బాబా తనను చేర రమ్మని పిలుచుచునే యుండెను.

"బాబా - తనరక్షకుడు" అను గాఢవిశ్వాసము గలిగి ఆ స్థానము నుండి తొలగని వానికి భయముగాని, వ్యసనముగాని లేదు. "స్వామీ! సాయీ! నా సర్వస్వము నీకు సమర్పణ గావించుకొంటిని. నా సకల సంకల్పములు నీకు విడచితిని. నిన్నుగాక అన్యము శరణుగోరను" అని సంపూర్ణ శరణాగతి నొందు భక్తునికి సర్వకార్యములు సానుకూలమై శాంతి, సుఖ సంతృప్తులు కరతలామలకములగును. వానికి విశ్వమున భయ బాధావ్యసన కారణములుండవు. వానికి దృశ్యప్రపంచము దైవ స్వరూపముగనే గోచరించును. అట్టివాడు "బాబా! నీయాజ్ఞ పరిపాలింతును" అని త్రికరణ శుద్ధిగ వచింప జాలును.

మనకు గలుగు సుఖలేశములు బాబా అనుగ్రహలబ్ధము లనియు, ప్రాప్తించు కష్టనష్టములు, వ్యసనములు, మన ప్రవర్తనమునగల లోపములను జక్కబెట్టుటకై దైవసంఘటితములగు శిక్షలనియు దృఢ విశ్వాసముగలిగి యుండవలయును. 'నాది' అనుటయే బంధహేతువు. 'నాదికాదు' అనుటయే ఆనంద హేతువు.

"శ్రీసాయీనాథ బోధామృతము" ఏకకాలమున ఒకే ప్రదేశమున" ఒక వ్యక్తినిగూర్చి పలుకబడకున్నను నీ సార్వకాలిక సత్యప్రబోధములు మన కందరకు వినబడుచువే యున్నవి, అందఱనుద్దేశించినవి. ఇవి శ్రీ సాయిబాబా శ్రీ ముఖోద్గతము లగుటచే త్రికాల సత్యములు, విశ్వాస కృతజ్ఞతా

పూర్వకముగ స్వీకరింపదగును. ఇవి మన బంధవిముక్తి కొఱకు మన శ్రేయస్సు కొరకు నుద్దేశింపబడి పలుకబడినవి. కావున సాయీ భక్తులెల్లరు హృదయ ఫలకమున భద్రపరచుకొనదగును.

ప్రేమామృత పూరితములు, దయా కలితములునగు నీ మధురసూక్తులు మనల మేలుకొలిపి మనకల్మష పూరిత హృదయముల పరివర్తనచేసి బాబా దఱిచేర్చుచున్నవి. "మీరు నా బిడ్డలు - మీ సకలాభీష్టములను నావలన మీరు పొందవలయును" అని బాబా బోధించినాడు. (చూడుడు. 31-301-331-181-383)

శ్రీ సాయి పదాశ్రితులమగు మనము ఆ తండ్రి బహూకృతులను స్వీకరించి, ప్రశాంతి బడయుటకు బాబాను జేరవలయును. మనకొఱకు సిద్ధపరచిన ప్రేమామృతమును తనివిదీర నాస్వాదింపవలయును. మన ఆలోచనలకు, ఆచరణలకు, సంశయములకు, సంకటములకు, సంబంధమగు సమాధానములన్నియు "శ్రీ సాయీనాథ బోధామృతము" నుండి ఎఱుక పరచుకొని, సందేహనివృత్తి బడయుట సుసాధ్యము. కావున మీరెల్లరు నీ సత్యమును గుర్తించి స్వానుభవమును సంపాదించి యీ అమృతమును గ్రోలి సంతృప్తి, శాంతిని బడయగలరని నా ఆకాంక్ష. ఇట్టి పరమ మధురామృతమును విశ్వమానవులకు ఆంగ్లమున అందించిన మహర్షి పూజ్యశ్రీ బి. వి. నరసింహస్వామిగార్కి, ఆంధ్రదేశమన మన కెల్లరకు తేటతెనుగున అనువదించిన గురువర్యులు శ్రీ షిర్డి సాయీ సంస్థాన పండితులు, మార్గదర్శకులు, నగు పూజ్యశ్రీ బాపట్ల హనుమంతరావు పంతులుగారికి మనము నిత్యము ప్రణమిల్లి కృతజ్ఞతలు చెప్పుకొనవలెను.

సాయినాథుని బోధల సారమిదియ।
సులభతరముగ జనకుండు పలికె వీని
అభ్యసించి యానందము ననుభవించి
'హనుమ' రచనలు ప్రకటింప నాదుకొనుడు !

మనము యికముందు ప్రచురణ, పునర్ముద్రణము చేయవలసిన గ్రంథములు :

1. ఏమీ! నిన్నుపేక్షింతునా? ద్వితీయభాగం
2. శ్రీ ప్రేమామృతము: (నారద భక్తి సూత్రములు - వ్యాఖ్య)
(శ్రీ సత్యసాయిబాబావారు ఆవిష్కరించి ఆశీర్వదించిన పవిత్ర గ్రంథరాజం)

3. శ్రీ పుండరీకుని చరిత్రము
4. శ్రీ సాయీ మననము
5. శ్రీకృష్ణ కర్ణామృతము (శ్రీ లీలాశుకరచనకు పద్యానువాదం)

రు. 1016/- మహారాజ పోషకులు, రు 503/- రాజపోషకులు, రు. 350/- జీవిత సభ్యులుగ చేరి పై కృతులకు సహాయపడండి.

ఈ పుస్తకములు సకాలమున వెలువడ జేయుటకు శక్తిసామర్థ్యములను శ్రీ సాయి మనకు ప్రసాదించగలడని, ఈ కృషిని మీరెల్లరు సహృదయముతో గుర్తించి, పూర్వమువలె పూర్తి సహకారమును అందించి, పోషకులనుచేర్చి, విరాళములుపంపి, నన్ను కృతకృత్యుని గావింపగలరని నాదృఢ విశ్వాసము. ప్రతి బాబా భక్తుడు గ్రంథపోషకుడే! ప్రతిపోషకుడు శ్రీ సాయినిలయ ప్రచురణములందు భాగస్వామియే! కనుక నావద్ద లభ్యమగు గ్రంథములను సోదర భక్తులకు అందించుడు. ముందు జరుగు ముద్రణములకు ఆదుకొనుడు. ఇదియే నా ఆశయము. ఇదే నాకు బాబా అందించిన ఆదేశము.

శ్రీ సాయీ ప్రభువు పోషక మహాశయుల నెల్లరను సంపూర్ణ కృపాకటాక్ష వీక్షణములతో తన అంకిత సంతతిగ తీర్చిదిద్ది ఆయురారోగ్య ఐశ్వర్యములు, సుఖశాంతులు ప్రసాదించి సర్వదా సంరక్షించ నా ప్రార్థన.

పలుకవచ్చు ప్రియోక్తులు పలు విధాలు
ధనము త్యాగంబుఁ జేయ సాధ్యంబె తలప?
కలదా! లేదా! యెఱుఁగఁ, బోషకులుగఁ జేరి
నారు, వీరిఁ బ్రోవుము! సాయినాథ! కృపను.

ఈ గ్రంథమును శ్రద్ధతో ముద్రించిన శ్రీ సాయీ భక్తులు
చి॥ శ్రీ పి. రాధాకృష్ణమూర్తిగారు (శ్రీరాధాకృష్ణ ముద్రణాలయాధినేత) బాపట్ల
వీరిని, వీరి కుటుంబమును శ్రీ సాయీ ప్రభువు రక్షించుగాక!

కృషి కృతార్థమగును సాయికృపనుఁ బడయ!

శ్రీసాయీనిలయమ్
చెరువు
4-3-1999

ఇట్లు,
శ్రీ సాయిచరణ సేవలో, మీ
బాపట్ల వేంకటపార్థసారధి

ఈ గ్రంథ ముద్రణమునకు తోడ్పడిన

మహారాజ పోషకులు

చి. శ్రీ పసుపులేటి జ్ఞానివెంకటేశ్వర్,
(హైదరాబాదు) రూ 1355/- లు

,, కొత్తూరి లక్ష్మీనరసింహారావు,
(అరోరా - అమెరికా) రూ 1222/- లు

,, మాధవపెద్ది సురేష్‌చంద్ర,
(మద్రాసు [చెన్నై]) రూ 1116/- లు

,, మంచికంటి వెంకటసాయిరామ
గోపాల్, (హైదరాబాదు) రూ 1116/-

,, ఆత్మకూరు కేశవదాస్,
(గుంటూరు) రూ 1116/- లు

,, ఆర్. నరసింహారావు,
(హైదరాబాదు) రూ 1116/- లు

రాజపోషకులు

శ్రీమతి అవుల ఝాన్సీలక్ష్మి, (గుంటూరు) రూ 503/- లు

శ్రీ యన్. వేణుగోపాల్, (హైదరాబాదు) రూ 503/- లు

శ్రీమతి & శ్రీ స్వర్ణ విజయలక్ష్మి, సుబ్బారావు దంపతులు,
(గుంటూరు) రూ 503/- లు

శ్రీ టి. శివశంకరరావు, (హైదరాబాదు) రూ503/- లు

జీవిత సభ్యులు

(రు. 350/- లు సమర్పించినవారు)

సర్వశ్రీ డి. ప్రభాకరరావు,	హైదరాబాదు
జి. వి.యస్.యల్.యన్ ఆచార్యులు	,,
డి. నారాయణరావు	,,
పి. సాంబశివరావు, బి.ఇ.యం.ఐ.ఇ.	విశాఖపట్టణం
శనగపల్లి వెంకటేశ్వర్లు	విజయవాడ
కె. సాయిప్రసాద్	పెనుగంచిప్రోలు
మాధవపెద్ది నాగేశ్వరరావు	గుంటూరు
మాజేటి శివరామకృష్ణయ్య	,,
జాగర్లమూడి మహేశ్వరరావు	,,
లింగంమల్లు మల్లిఖార్జునరావు	,,
మద్దుకూరి వెంకటేశ్వర్లు, యం.ఆర్.ఒ.	బాపట్ల
జి. సి. వి. రాఘవులు	ఒంగోలు
జె. రామకోటేశ్వరరావు	చీరాల
పి. రాజశేఖరరెడ్డి	నల్లమడ
ఇ. శ్రీనివాస్, యం.ఇ.	శ్రీకాకుళం
దువ్వాడ వేంకటేశ్వరరావుచౌదరి	,,
దంతుర్తి కామేశ్వరరావు	,,
గన్నవరపు అప్పారావు	చిలకలూరిపేట
డి. వి. సుబ్బారావు	,,
అయినవోలు హనుమంతరావు	,,
యం. పి. రమణయ్య	కొవ్వూరు
శ్రీమతి యం. విజయకుమారి	అనంతపురం

కృతజ్ఞతలు: మహారాజ పోషకులు

"పైడిపాల" సద్గోత్ర సంభవుడు "పసుపు
లేటి" వంశభూషణమణి మేటి సాయి
భక్తుడౌ "జ్ఞానివేంకటేశ్వరు" డొసంగె
భూరికాన్క నితని "బాబా" బ్రోచు సతము!

....

పరదేశాన నివాసముండియును నీపై భక్తి పెంపొందగా
పరమోత్సాహముతోడ సత్కృతికి ముప్పై డాలరుల్ పంపె శ్రీ
"నరసింహా"ఖ్యుడు తత్కుటుంబమును నానా భోగభాగ్యాలు చే
కుఱ షిర్డీపురసాయి! బ్రోవగదె శ్రీ "కొత్తూరి" వంశోద్భవున్!

....

దాన పరాయణుల్ కనిన తల్లియు - తండ్రియు, తాత - లీతడున్
మానక నీదుసేవ నియమంబుగఁ జేయుఁ జిత్ర సీమలో
గానవిభాగ దర్శకుడుగా కడు ఖ్యాతి గడించినాడు నీ
దైన కృపాకటాక్షమును నమ్మిలి కోరి విరాళమిచ్చె మో
దాన; కుటుంబ సభ్యులను ధన్యుల జేసి సతంబు సత్కృపన్
మానుషరూప! సాయి! కను! "మాధవపెద్ది సురేషచంద్రు"నిన్!

....

ఉ॥ తాతయు-బామ్మ-తల్లియును-దండ్రియు-" శ్రీ హనుమంతరాట్క"విన్
బ్రీతిని దైవమున్- గురువు రీతిగ భక్తిఁ దలంత్రు; నీవు నీ
జీతమునుండి ముందుగనె షిరిడి స్వామికి ద్రవ్యమిచ్చితే
కౌతుక మొప్ప నీకృతికి - కల్గు శుభమ్ములు నీకు వెల్లఁడన్! ౧

ఉ॥ శ్రీపతి సర్వ భోగము లశేషముగా నొనగూర్చుగాత! వా
ణీపతి యాయురభ్యుదయ నిర్భర సౌఖ్యములిచ్చుగాత! గౌ
రీపతి జ్ఞాన కోవిద పరీమళుఁ జేయునుగాత; చేయు షి
ర్డీపతి భక్తి మార్గము వరింపగ! "వేంకటసాయిరాము"నిన్! ౨

తే: ప్రధిత "మంచికంటి" వంశమణి వవంగ
ఇంజనీయరగుదు వేపుమీఱి
"సాయిహనుమ" కృపను "సాయిరాం గోపాల!"
మంచిపదవి వడి లభించు నీకు! ౩

జనకుండు "రామరావు" జ
నని "సీతారామయమయు" నాకము(జేరన్
యనువగు స్మృతి చిహ్నంబని
హెనరగ నితడు మహారాజ పోషకు(డయ్యెన్! ౧

ఏమని పల్కువాడను! మహీ స్థలి నీ మహిమంబు? సాయి బో
ధామృత మచ్చుగూర్చుతరి దాతగ "కేశవదాసు(" పోషక
శ్రీ మహరాజు(జేసితి విచిత్రము! వీని కుటుంబ సభ్యులన్
క్షేమము భోగభాగ్యములు జేకుఱ బ్రోవుము సాయిసద్గురూ! ౨

....

మేలున్ గూర్చె విరాళమిచ్చెమును స్వామీ! గ్రంథ మచ్చొత్త నిం
దే లోటున్ గననీక వెండియు ధనంబిచ్చెన్ మహెూదారుడై
శ్రీ లాభంబులు వాంఛితార్థములు షిర్డీ సాయిదేవా! యశః
శ్రీలన్ "ఆర్. నరసింహరావు"నకు కూర్మిన్ గూర్చి బ్రోవంగదే!

రాజపోషకులు

"పోగునోళ్ళ" గోత్రంబున బుట్టినారు!
ఉద్ధరింతురుగాక! "అవుల" కులంబు
శ్రీయు-వాణియు మీయింట(జెలిమి నిలువ
సర్వ వాంఛితార్థములు శ్రీ సాయి గూర్ప
బ్రీతి వైద్య విద్యలను "శిరీష" నేర్వ
జగతి "ఝాన్సీలక్ష్మి, ఉదయచందు" లెదుగు! 1

మ॥ నిను గీర్తించుచు గొల్చుచుండు సతమున్ నీ పాదపద్మమ్ములన్
జనకుండెంతయు భక్తిగూర్చిన కృతుల్ సంతోషమున్ గూర్పగా
నను బ్రేరేపణ జేయు, వచ్చిడుటకై! "నంద్యాల" సద్వంశు, వే
ర్మిని క్షేమమ్ములగూర్చి సాయి! కనుమా! "శ్రీ వేణుగోపాలు"నిన్! 2

శా॥ అబ్బో! యెంతటి భక్తిభావమొ! మహాహ్లాదంబు సంధిల్లగా
డబ్బుల్ వందల నైదు నీకృతికి వేడ్కన్ దెచ్చి; యర్పించె; నా
కబ్బమ్ముల్ విని మెచ్చె; "స్వర్ణ"కుల ప్రజ్ఞాశాలి - విజ్ఞాని, మా
"సుబ్బారావు(" గుటుంబ సభ్యులకు గూర్చున్ సాయి భద్రమ్ములన్! 3

పోషకులు

మోద మిగురొత్త నీకృతి ముద్రణమున సాయపడినారు - జీవిత సభ్యులగుచు
సకల శుభముల గూర్చి శ్రీ సాయిబాబ రక్షణము నిచ్చు వీరి కనుక్షణంబు!

విషయ సూచిక

విషయము	పరిచ్ఛేదము-సంఖ్య

ద్వారకామాయి (మసీదు ఆయి) రూపమున	
బాబా అభయ ప్రదానములు	1-8
శ్రీ సాయిబాబా అభయ ప్రదానములు	9-52
బాబా నియమములు	53-57
బాబా సూక్తులు	58-65
బాబా సర్వవ్యాపకత్వము	66-63
బాబా - ఇతర సాధువులు	74-89
బాబా-కార్యములు	90-107
ఆత్మ విచారము	108-109
భేదము అసత్యము	110-112

మోక్ష మార్గము

సంసారము	113
సత్యసుఖము (లేక) ఆనందము	114-115
సంసారమున వర్తింపదగు విధము	116
భక్తి - నవవిధ భక్తి	117
జ్ఞానము - భక్తి	118
1. నీ వెవడవు? ఎందున్నాడవు?	119
2. నే నెవడను? మన మెవరము?	120
3. మన మెఱుగవలసినది ఆత్మ మాత్రమే	120
4. నీ వెవడవో ఆలోచించుకొనుము	121
5. దైవ మెవరు? అతడెట్లుండును?	122
అతడెక్కడ నున్నాడు? దైవము నెట్లు చూడగలము?	123
మోక్షమును బడయుట ఎట్లు?	123

6. దైవమును పొందుట - విధానము

1. వివేకము	2. వైరాగ్యము	124
3. శమదమాదులు	4. ముముక్షుత్వము	

మోక్షమన నేమి? దానిని పొందుట ఎట్లు? శుద్ధ చైతన్యము - మాయ 125
మాయ ఎవరు? (శ్రీ భాగ. 11-2) (55-58) 126
దైవము నెఱుగుట - (సాక్షాత్కారము) దైవ మెవరు? 127
దాస్‌గాణూ - 129
సాధారణముగ సాక్షాత్కారము క్షణికము - హ. సీ. దీక్షిత్తు 130

ఆత్మజ్ఞానము - అధికారి

1. స్వీకారము 131
2. అర్హతను పొంది పిదప అడుగుము 132
3. బ్రహ్మమును తెలిసికొనగోరిన ఐదు సమర్పింపుము 133
బాబాను జేరువాఅందరు ఫలమును బడయుదురా? 134

7. బాబా కోరునది సంపూర్ణ శరణాగతి

(సర్వ సమర్పణము) గో. బూటి 135
అన్నాసాహెబ్ దభోల్కర్ 136
రాధాబాయి దేశముఖిన్ 137
'నిష్ఠ' - 'సబూరి' - కలిగి గురువును సమాశ్రయింపుము 137ఎ-138
(శ్రవణ-మనన-నిధి ధ్యాసలతో) ధ్యానము చేయుము 139
ఋణానుబంధము 140

సాధనము-1

1. విశ్వాసము, సహన సంతృప్తి, బాబా విశ్వాసము పరీక్షచేయుట 141
ఉదాహరణములు 142-142
బాబాకు హైందవ దైవములందుగల ఆదరణ - మారుతి, మోహినీరాజ్-శ్రీరామ-శ్రీకృష్ణ విఠల్ 144-146
బాబా - హైందవ దైవములు - అవతారములు - 147-148బి
భగవానునిగూర్చి ఎఱుగవలసినదేకాని పలుకరాదు 149-151
ఈ దినములందు విశ్వాసము క్షీణించు చున్నది. మొ. 152-154

సాధనము-2 వస్తువులను పూజించుట

ఎ) విగ్రహములు బి) పాదుకలు సి) నాణెములు 155
డి) సమాధిపూజ ఇ) పటము యఫ్) పటము పూజ 156

దైవమునందు విశ్వాసము బాబా పాదుకొలుపుట మొ. 167-171
విగ్రహారాధనము 172-173
పురాతనములను నిలువదగును. విగ్రహముల మార్చరాదు 174

సాధనము-3

సాయీ పూర్వగురు మహిమ (వనజారి) 175
గురువు అవసరము 176-177
ఈ పుట్టువున గురువైన 'వేంకుశని' గూర్చి - బాబా 178-180
తొంటిగురువు కబీరు - ఉపాసనము 181
భక్తుడు తనకుతానే నిర్ణయించుకొని గురువును పొందవలయును 182
బ్రహ్మము (లేక) జ్ఞానముయొక్క స్వభావము
గురుద్వారా దానిని బడయు విధానము 183

సాధనము-4

(ఎ) గ్రంథములు - (పోటీ) పారాయణము 183ఎ-190
చదువ వలదు - ధ్యానింపుము - రేగే 191
(బి) నామజపము
1. రామనామము 2. సాయీ నామము 192-198

సాధనము 5

సకలము నందున్న దైవముగ బాబాపూజ 199
సాధనము-6 ప్రకృతి దృశ్యములు సాధనము-7
సంగీతము - (గానము) లయ - బ్రహ్మ సంబంధమైన విద్య -
బాబా సంగీతము 201-202

నైతిక బోధలు - చక్కదిద్దుట

శత్రుషట్కము - జోగ్‌నకు బోధ 203
1. కామము (ఎ) దేవదాసు - 204
కామవ్యామోహము జయించుట
(బి) నా. గో. చందోర్కర్ 205
(సి) హెచ్. వి. సాతే. 206
2. కోపము (ఎ) రామదాసి (బి) జోగ్ (సి) పురందర్.

డి) ప్రధాన్ సతి 207-211
ఇ) బాబా కోపజయము 212-218ఎ

3. గర్వము 219-223

ఎ) హాజీ బి) హెచ్. వి. సాఠే సి) దాస్‌గాణూ
డి) కులగర్వము. ద. ఆ. డాక్టర్ ఇ) మూలేశాస్త్రి
యఫ్) బయ్యాజి. (బాబా బలగర్వమడచుట) 224

మత్సరము (ఈర్ష్య) 225

లోభము (పేరాస) 226-30

వా.గో. చందోర్కర్; జయగడి; అట్టాయి; జోగ్, (సాధుశ్రేయము)
కోరుకొవెను - బడేభాబా - అటులకాదు 231

యప్. అర్. - సహస్రబుద్ధే 232

(సంపద. (కాంచనము)

ఎ) దక్షిణ - అర్. బి. పురందర్ 233-35
యస్. అర్. వి. జయకర్. 236
పి. అర్. అవస్తే 237
యన్. బి. ధుమాల్ 238
యస్. డి. నిమోన్కర్ 239
దక్షిణ-భవిష్యత్సూచకము-నిర్ణయము అర్. యస్. దేవ్. 240
నాచ్నే - శంకరరావు 241
దక్షిణ - తొలిఫలము గై కొనుట - దాజీహరిలేలే 242
దక్షిణ-తగనిధనము పరిహరింపబడుట యస్. బి. ధుమాల్ 243
దక్షిణ-సంకల్ప సిద్ధికొఱకు స్వీకరింపబడుట ప్రధాన్ 244
దక్షిణ-మఱియొక అర్థము - బి. వి. దేవ్ 245
దక్షిణ-మఱియొక అర్థము జి. జి. నార్కే 246
దక్షిణ-మఱియొక అర్థము - అర్. బి. పురందర్ 247
దక్షిణ-మఱియొక అర్థము - తార్కాడ్ సతి 248
దక్షిణ నీతిగఱపుట - యం. బి. రేగే 249

సంపదలయెడ బాబా నిర్లక్ష్యము

బాబాకు ఇచ్చుట నష్టముకాదు బా. గో. ఉపాసనీ	250
వైరాగ్యమును పెంపొందించుట. హ. సి. దీక్షిత్తు	251
వెండిపాలకి - వెండిగుఱ్ఱములు	252
లాభములతో భాగము - (డా. రసానే)	253
కుండనిండుగ నాణెములు	254
ఇరువురు దక్షిణదేశ బ్రాహ్మణులు-(గోవానుండి) రు.15/- రు.35/-	255
ఆస్తి-సంపద-మార్వాడి గడ్డివామి	256
ఆవు - (సంపదల గూర్చి బాబా నిరూపణము)	257-59
దురదృష్ట విత్తము - జయకర్	260
పేదరికము - ఫకీరు - అవక్ల పాదుషా	261
(దైవము) - విధి	262
నైతిక బోధలు	
బాబా వివిధ భావములు - దైవభక్తుడుగ	263-266
సంతృప్తి - శరణాగతి	267
సకల జీవములను ప్రేమించుట	268
అలసత సోమరితనము	269
ఇతర నైతిక బోధలు (అద్వేషము)	270
తల్లి దండ్రులయెడ [illegible] రత	271
మిత్రులను విడువరు	271ఎ
దయ్యములు-భూతవై. య	272
అమానిత్వము	274
సహనము - ఓర్పు	275
సందేహము పట్టున విశ్వాసమును పాటింపుము	276
విపరీత వ్రత నియమము	277-77ఎ
హ. సీ. దీక్షిత్తు-ఉపవాసము	278
గోఖేల్ సతి- ఉపవాసము	279
యస్. బి. నాచ్నే- ఉపవాసము	280
యోగము—ఉల్లి భక్షణము యోగాభ్యాసి	281
బాబా—దాస్‌గాణూను ఉల్లి తినిపించిన విధము	282

కుశభావ్–ఉల్లి 283
దాదాకేల్కార్–ఉల్లి 284
ఆదరణము–అతిధి సత్కారము 285–288
ఏ) సంభారే బి) దభోల్కర్ సి) నా. గో. చందోర్కర్
ఏకమత్యము–పొందిక 289
పరిశ్రమము-సహనము-యోగయాగ తపోజ్ఞాన సముపార్జన- 290–292
త్రాగుడు దురభ్యాసమును బాబా తొలగించుట 292ఎ
మసీదున బల్లపలకపై బాబా తపస్సు జాగరూకత 293
సాధకులకు బోధ–అబ్దుల్‌కు కావించిన బోధ 294–294ఎ
పరనింద– 295–296
అహింస : ఎ] మహల్సాపతి–కుక్క 297
బి] హ. సి. దీక్షిత్తు–సర్పము 298
సి] పిచ్చికుక్క యెడ దయ 299
కీడునకు ప్రతిఘటనము తగదు
ఏ] అట్టాయి బి] హ. వి. సాతే సి] జవర్ అలీ 300
బాబా అడుకువ – (గురుబాబా–దైవము అగును–కాడు)
కుమార్ తార్కాడ్ 301
కుమార్ తార్కాడ్– కొందరు భక్తులు 301ఏ
కుమార్ తార్కాడ్– తన భక్తులతో 302
కుమార్ తార్కాడ్– బర్డిస్ రాక 303
కుమార్ తార్కాడ్– జవర్ అలే దేవ్. 304
కుమార్ తార్కాడ్– నానావలీ 305
అన్నదానము – బిచ్చము పెట్టుట
ఏ] మంచితనము-సరళ భావముతో పెట్టుట నా.గో.చం. 306
బీ] గర్వము కోపములేక బిచ్చము పెట్టుట నా.గో.చం. 367–308
సి] విచక్షణ పాటింపక బిచ్చము పెట్టుట 309
[అతిధి (శబ్ద) వివరణ] కర్మ సిద్ధాంతము-పూర్వకర్మ 310-312
సత్సంగము-యమ నియమములు మొదలగునవి 313
బాబా-ప్రేమను ప్రసాదించుట 313ఎ
బాబా-ప్రేమను విశ్వాసమును ప్రసాదించుట 313బి

నైతిక బోధలు-(పుట్టుక-చావులు) మృతి 314
జననము (పుట్టుక) 315
దుఃఖము-స్వార్థ పరత 316
పుత్ర పుత్రికా మరణములు మొదలగునవి 317-318
జ్ఞాని-నిర్యాణము 319

బాబా మృతిని తప్పింపబోని సమయము

ఏ] బెంద్రేకు బి] సర్పదష్టుడైన బాలుని తల్లికి
సి] ప్రిదివిన పెదవిగల పిల్ల తండ్రికి 320-323ఎ
డి] అప్పాకులకర్ణికి బాబా హెచ్చరిక చేయుట
మృతిని తప్పించు యత్నము (నిగోజి) విఫల మగుట 324
మృతి విషయమున ఓదార్పు 325-326

బాబా — మృత్యువును తప్పించుట

ఎ] అభినవ మార్కండేయుడు 327
బి] బాబా నిర్యాణము. ప్రయత్నము (1) 1886 లో 328
బాబా నిర్యాణము (2) 1916 లో 329

బాబా తన మహాసమాధి సమీపించు చుండెనని తెలుపుట

4. మహాసమాధి-దేవాలయము 331

[సి] సద్గతి

1. గ్రుడ్డివాడు. 2. యల్. కె. నూల్కర్ 332-333
3. విజయానందస్వామి 4. యస్. బి. ధుమాల్ సతి 334-335
5. ఉపాసనీ మహారాజు-సతి 6. జంతువులకు సద్గతి-గేదే 336-337
7. రేగె బిడ్డ - సద్గతి 337ఎ

శక్తులు - సమర్థతలు

యోగ మార్గము, సిద్ధులగూర్చి బాబా అభిప్రాయము 338
బాబా దృష్టిని ప్రసాదించుట, వి. వై. దేశపాండే
బాస్సీను కాంతకు తాత్కాలిక దృష్టి 339
బాబా - తుఫానురాక గుర్తించుట,
తుఫాను తన అధీనమందుంచుట 340-341

అగ్నిని అధీనమందుంచుట

ఎ) కొండాజీ గడ్డివామి   బి) ధునిలోని మంట 341ఎ-343
సి) ఎండ వేడిని అదుపున నుంచుట 344
జీవాత్మలను అధీనమందుంచుకొనుట - మార్గము నిర్దేశించుట 345
అనుగ్రహ నిదర్శనము - గాడ్గిల్ - ఉధి 346
కుశభావ్ - ఉధి ప్రసాదము 347
దాస్‌గాణూ - బాబా పాదముల గంగోద్భవము 348
శక్తిని ప్రసాదించుటకు శక్తి (నా.గో.చం.) 349
రాతి నుండి నీరు పుట్టుట హరిశ్చంద్రనగము
గింజలుగల ద్రాక్షలు గింజలులేని ద్రాక్షలుగ మార్పు 350
జతభాయ్ (1) దక్షిణ విషయము 351-351ఎ
(2) పులుపు - పులుపు కాదు—మూర్తీభవించుట-ప్రత్యక్ష నిదర్శనము
1. జజూరిలో మహల్సాపతికి 352
2. మూలేశాస్త్రికి ఘోలప్ మహరాజుగ
3. నిర్గుణోపాసకుని తండ్రి కంఠ ధ్వని 353
ఇతర సాధువులు, తాను ఏకమని బాబా నిరూపించుట
యస్. బి. నాచ్నే. 354
బా. కృ. గో. ఉపాసనీ 355
బోర్కర్ సతి 355ఎ
బాబా - అనసూయ - దత్తస్వామి, అభేదస్థితి 356
బాబా ఇతర సాధురూపముల దర్శన మిచ్చుట
బి. వి. దేవ్ దగ్గఱకు సన్న్యాసిగ 357
ఆదం దలాలి దగ్గఱకు మార్వాడి భిక్షువుగ 358
కుక్క రూపమున బాబా - (జి.యస్. కపర్దే సతి) 359
బాబా - భవిష్యత్సూచనము - నియంతృత్వము అధిపత్యము
షిర్డి ఖ్యాతిని గూర్చి 360
యల్. వి. నాడ్కర్ - రైలు ఆలస్యము 361
డి. వి. సంభారే - నా. గో. చందోర్కర్ 362
మహల్సాపతి - విందు అవమానము 363
మహల్సాపతి పారాయణము - కలహములు 364

సింగ్వేకర్ పరీక్షలో గెలుపు	365
యస్. ఎ. సామంత్, ఐదు రూపాయలు అపహరణము	366
టెండల్కర్ - సపత్నేకర్ మిత్రుడు	367
పార్శీ వర్తకుని తప్పిపోయిన బిడ్డ	368
మతిచెడిన పార్శీబాలుని ఆరోగ్యము	369
న్యాయవాది సోదరుని ఉన్మాదము	370
శ్రీ ఎ. మనశ్చాంచల్యము	370ఎ

అద్భుతములు - భవిష్యత్ జ్ఞానము - భేదము

బాబా వచనము (నా. గో. చందోర్కర్‌తో)	371
నారాయణరావు - జానీ	372
1. నాచ్నే బొంబాయికి బదిలీ - పిచ్చివారలను నమ్మకుము	373
శంకరరావు - నాచ్నే రు. 64/- లు	374
దీక్షిత్తు కుమారుడు	375
జోగ్‌నకు గోదావరి జలము	376
జోగ్ పితృశ్రాద్ధము - బ్రాహ్మణులు	377
జోగ్ యిచ్చిన అప్పు రు. 1400/- లు	378
నార్కే యుద్యోగము-సంతానము- ధర్మకర్తృత్వము	379-80
ప్రధాన్‌సతి - బిడ్డమూర్ఛ	381
కల్యాణ్ కార్ణిక్ - సావుకారు	382
శ్యామావదిన - ప్లేగువ్యాధి	383
బల్వంత్ - జి. కపర్దే - ప్లేగువ్యాధి	384
ఆదం దలాలీ - అపరాధ ఆరోపణము	385
హెచ్. యం. పాన్సే నేరము - తీర్పు - అప్పీలు	386
ఒక బ్రాహ్మణునకు మరణ దండనము - (తొలగింపబడుట)	387
విద్యార్థులకు (పరీక్షలలో) బాబా సహాయము	388
బాబా - సంస్కృతము బోధించుట	389-390
బాబా ఔషధయోగములు (నిర్దేశించు ఔషధములు)	391-396
బాబా ఔషధయోగములు - డాక్టరు పిళ్ళే - నారకురుపు	397
శరణాగతుడు కర్మము నతిక్రమించుట భీమాజీపటేల్ - క్షయవ్యాధి ప్రారబ్ధము వ్యతిరేకముగ నున్నను.	398

బాబాసంతతి ననుగ్రహించుట 399
బాబా ఔషధము లేకయే వ్యాధి నివారించుట
మహల్సాపతి భార్య 400
మహల్సాపతిభార్య, హ. సి. దీక్షిత్తు సోదరుడు 401
బాబా తన ఇచ్ఛాశక్తిచే నితరుల లోగజేయుట
ఇతరుల బుద్ధులను నియమించు శక్తి
జి. యస్. కపర్దే - శ్రీ 'ఏ' - బి. వి. దేవ్ 402-402ఎ-403
బాబాసేవకునిపై నేరము తీర్పు-అప్పీలు 404
బాబా - ఇతరుల నియమించి ఆటంకములు
తొలగించుట - మామ్లత్ దార్ 405
పరమానందబాబా 405ఏ

అంతర్జ్ఞానము (ఋతంభరప్రజ్ఞ)

1. బాబా స్పష్టీకరణము 406
2. బాబా తన సర్వజ్ఞత్వము నిరూపించుట
స్థిర నిదర్శనములను హ. సీ. దీక్షిత్తు తెలుపుట 407
3. బాబా - గజానన్ మహారాజు నిర్యాణము 408
4. దాస్‌గాణూ పోలీసు ఇన్‌స్పెక్టరు పదవి 409
5. తెంబేస్వామి.-కొబ్బరికాయ 410
6. కాకామహారాజు నిర్యాణము 411
7. గాడ్గిల్ బాబాను ప్రథమమున దర్శించుట
భీమశంకర్‌నుండి ఆగమనము 412
8. గాడ్గిల్ బహూకరణములు 413
9. గాడ్గిల్ బాబాను గణపతిగ బూజించుట 417
10. ఆర్. యస్. - దేవు తలంపులు - ఉపదేశము 414
11. డాక్టర్ ముల్కీ తప్పిదము 415
12. జి. జి. నార్కే - బాబా పిచ్చివాడు 416
13. జి జి. నార్కే - బాబా భిక్షాపాత్రము 418
14. జి. జి. నార్కే - బాబా కుప్పి బహుమతి 419
15. యస్. బి. నాచ్నే - సెలవు 420
16. యస్. బి. నాచ్నే - రెండు అణాలు 421
17. దాతే - నారింజలు 422

18. రాజబల్లీ మహమ్మద్ - చెట్టుపట్టా 423
19. మేఘుని కులాభిమానము 424
20 యన్ - లోండా - కులాభిమానము 425
21. హరికనోబా - పాదరక్షలు 426
22. సోమదేవస్వామి - బాబా జెండాలు 426ఎ
23. గుర్జార్ - ఒకరూపాయి 427
24. మాన్కర్ తార్కాడ్‌సతి యొసగిన 'పేడా'
సమర్పింపక పోవుట 428
25. బల్లి పలుకు 428ఎ
26. చోల్కారునకు పంచదారతో తేనీరు 429
27. పండరి న్యాయవాది - వక్రప్రవర్తనము
పరదూషణము - ప్రకటింపబడుట 430
28. వి. హెచ్. దున్నపోతుపై స్వారి 431
29. మోదక్ మిత్రుడు 432
30. యస్. ఆర్. యస్. బాంధవ్యము 433
31 జయకర్ సందేహములు నివారణమగుట 434
దక్షిణలు మొదలగు తలంపులను-విధులను నిర్వర్తింపజేయుట
32. దీక్షిత్తు 25 రూపాయలు దక్షిణ 435
33. దీక్షిత్తు - తాంబూలము 436
34. కపర్దే - దక్షిణ 437
35. ఉద్ధవేశభావ్ - ధననష్టము - దప్పిక 438
36. వి. యస్. మ్హాల్సాకర్ - పక్కా భక్తుడు 439
37. ప్రత్యేక పేడా - మల్హార్కర్‌సతి జీవితము 440
38. డి. డి. రసానే - జేబులో నింకను ధనము కలదు 441
39. బాబూరావ్ - బోరవ్కే మఱచిన రూపాయి 442
40. అచ్చువేయువాని (యన్. వి.) యుక్తిని వెలిపఱచుట 443
41. శ్రీ టి. తప్పును సరిదిద్దుకొనవలయును 444
42. లాలా లక్ష్మీచంద్ 445
43. లాలా లక్ష్మీచంద్ సాంజా (గోధుమ కుడుము) 446
ఆకలిగొన్నవానియెడ బాబా ఆదరణము
44. ధనికుని దత్త పుత్రుడు 447

45. పోలీసు ఉద్యోగి 50 రూపాయలు - దాని అవసరము 448

బాబా - భూతముల సహాయమున ఇంద్రజాలము

1. తత్త్వజ్ఞాన సామాజకురాలు 449
2. కుశభావ్ 450
3. ఇంద్రజాల విద్యాప్రయోగ బాధితుడు 451
4. భూత పేరితాదులచే బాధితులు 452
ఎ) హన్సిరాజ్ బి) టిప్నిన్‌సతి 452

భవిష్యత్ నెఱుగుటవలన లాభములు

ధైర్యము - సహనము 1. ఆర్. బి. పురందర్ 453
2. హ. సీ. దీక్షిత్తు 454

బాబా పూర్వ వృత్తాంతములు

ఎ. బాబా - ఇతరుల పూర్వజన్మ వృత్తాంతములు 455-463
జి. యన్. కపర్దే - గ్వాలంకర్ - కార్ణిక్ 464-466
ఉరిదీయువాడు - పగదీర్చుకొన తిరిగి పుట్టుట
పునర్జన్మము - కర్మఫలమనుభవించుట- నా. గో. చందోర్కర్ 467-468
శిష్య (లేక) పిష్య - బాబా - ప్రధాన్ 469-470
బాబా - జీవుల పూర్వజన్మ స్మృతులు - మేకలు 471

జన్మజన్మముల గురువు భక్తులు ననుసరించుట

తార్కాడ్‌సతి 472
బాబా ప్రస్తుత జన్మవృత్తాంతము 472ఎ-472బి
బాబా - పునర్జన్మము (1, 2, 3) 472సి
స్వీయ చరిత్రాకములగు పూర్వజన్మ స్మృతులు
పాము-కప్ప పగతీర్చుకొన మరల పుట్టుట
వాసనల పెంపు - దైవనిర్ణయము - న్యాయము 473
బాబా పూర్వజన్మస్మృతులు - నిబద్ధ పరిశ్రమ -
సాధనము- నిరంతర నిస్వార్థసేవ 474-499ఎ

ఋణానుబంధము
ఋణ బంధనమున జేసిన జనులను
బాబా తనదరికాకర్షించువాడు

1. నా. గో. చందోర్కర్ 500-50[illegible]
2. క్షీరసాగర్ 5[illegible]
3, 4 పూర్వజన్మమున బాబా సంబంధీయులు 502
5. తరిమివేయుట తగదు
6. జంతువుల ఋణానుబంధము 5[illegible]
బాబా తానీ జన్మమున బ్రాహ్మణుడనని సూచించుట 505-[illegible]

బాబా భక్తులయెడ గల ప్రేమ
బాబా ప్రేమ నభినందించుట

ఎ) వి. యస్. గిరిధర్ సతి బి) ఆర్. బి. పురందర్ 507-508
నందరామ్ మార్వాడి-సాయిశబరి-సాయికుచేల 509-510-511
వఖర్కర్ - అరటిపండ్లు - సంక్రాంతి హల్వా 512-513
పురందర్‌సతి, వంకాయ; తార్ఖాడ్‌సతి, పేడా 514-515
కపర్దేసతి, నైవేద్యము; కుష్ఠరోగి, పేడా 516-517

నిర్మల మతితో సమర్పించు బహుమతులు

గార్డే, మామిడిపండ్లు X పండిడ్, భుక్తశేషమైన లడ్లు 518
మలిన మనస్సుతో నొసగు బహుమతులు
భిక్కూబాయి పూలమాల, కర్బూజా ఫలములు, దూద్ పేడా 519
సంశయాత్మక బహుమతులు- కనిత్కార్ సతి- ద్రాక్షలు 520

3. బాబా భక్తులకొఱకు స్వార్థ త్యాగము

ఏ. బల్వంతు, జి. కపర్దే - ప్లేగువ్యాధి 521
బి. బాబా - తన కంఠమును సమర్పించుట 522
సి. బాబా - ఆరోగ్యత్యాగము 523

3. బాబా - భక్తుల తలంపులను మన్నించుట

హరిభావ్ పన్సే - తల్లి ప్రార్థనము 524
బి. కుశభావ్ పవిత్రమైన కోరిక 525

సి) మావృషే తలంపులు డి) నాచ్నే అత్త 526
ఇ) వధవ్కర్ - ఆకలి 527
ఎఫ్) వైద్య ఆరోగ్యము - రక్షణము 528
జి) ప్రధాన్‌సతి - పసిబిడ్డ యేడ్పు - బాబా వినుట 529
హెచ్) పురందర్ మూర్ఖపు పట్టుదల 530
ఐ) వార్దే - మూర్ఖపు పట్టుదల 531

4 బాబా - బిడ్డలను ప్రేమతో కనిపెట్టి రక్షించుట

1. ధులియా బహాల్కర్ బిడ్డజబ్బు 532
2. మహాల్సాపతి - సర్పములు 533
3. తార్కాడ్‌సతి - సర్పము 534
4. మిరికరునకు అభయము - సర్పము 535
5. బూటీ గండము - బాబా అభయము 536

5. బాబా - భక్తుల విషయమై ఆలోచన బాలషింప 537

బాబా - కుష్ఠరోగులయెడ ఆదరణము 538

6. సహాయములు - సంతతి ననుగ్రహించుట

ఎ) డి. యస్. రసానే బి) హెచ్. వి. సాతే 539-540
సి) సపత్నేకర్ 541
డి) ఔరంగబాద్కర్‌సతి 542
ఇ) చింతామణిరావు 543
ఎఫ్) మహాల్సాపతి జి) రతన్‌జీ సేత్ 544-45
బిడ్డలకు బాబా దీర్ఘాయువు ప్రసాదించుట - (నార్కే) 545ఎ

7. భక్తుల సంసార విషయముల బాబా సహాయము

ఎ) నిమోన్కర్ దంపతులు 546
బి) హెచ్. వి. సాతే దంపతులు 547

8. వ్యాపారమున సహాయము

ఎ) డి. యస్. రసానే - ధాన్యవ్యాపారము 548
బి) బయ్యాజీ పటేల్ - చెఱకు పైరు 549
సి) రావ్‌బహదూర్ యస్. బి. ధుమాల్
పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉద్యోగము 550

9. భక్తుల ప్రేమకులొంగి బాబా తన పూజకు
సమ్మతించుట - బాబా - రంగారి 551
బాబా గురుపూర్ణిమ జరుప నియమించుట 552

10. భక్తులయెడ బాబా జాగరూకత

నా. గో. చందోర్కర్ 553
తానా ప్లీడరు జోషి 554
కాకా మహాజని 555
రావ్ బహద్దూర్ యం. డబ్ల్యు. ప్రధాన్ - తల్లి 556
సదాశివ తార్ఖాడ్ సతి - సేవకుడు 557

11. బాబా జాగృతి - భవిష్యత్ జ్ఞానము

ఎ) జి. జి. నార్కే - ప్లేగుగల యింటి 'హల్వా' 557
బి) యస్. బి. ధుమాల్ - ప్లేగు సమయమున
ఇండ్ల మార్పు 559
షిర్డిలో ప్లేగు - జనుల భయము 559ఎ

12. బాబా తన భక్తుల అధిపతి - యజమాని

ఎ) కాకా మహాజని బి) ఆర్. బి. పురందర్ 560-561
ఒక భక్తుడు 562
13. అపరాధియెడ బాబా కరుణ 563
14. ప్రయాణములందు బాబా సహాయము 564-574ఎ
15. వివాహములందు బాబా సహాయము
ఏ) ఆదం దలాలి డి) యల్. జి. ముగ్గే
సి) దామోదర్ రసానే
డి) యస్. బి. ధుమాల్ 575-577
16. యం. బి. రేగేయెడ బాబా ప్రేమ 578
17. ప్రాణ రక్షణము ఎ) యస్. బి. నాచ్నే 579
బి) నిమోన్కర్ బిడ్డ 580

బాబా సర్వతంత్ర స్వతంత్రత

ఎ. ధులియా కోర్టు కమీషన్	581
బి. సర్. జి. సేమోర్ కర్టిస్ బాబాను దర్శించుట	582

బాబా నిర్భయము

బాబా - గంధ సమర్పణము - ముస్లిములు కర్రలతో చేరుట	583
బాబా న్యాయ విధానము	584
బాబా నీతి - సమత్వము కపర్దే డైరీ	585
ఎ. వేపచెట్టు కొమ్మ	586
బి. యస్. బి. నాచ్నే అత్తగారి ప్రతీకారము	587
సి. బాబా పటిల్ డి. చక్రనారాయణ	588-589
ఇ. పెష్టన్ జామన్ యఫ్. తుకారాం బర్కు	590-591
బాబా - జంతువులు	592-592ఎ
బాబా మత సామరస్యము	593-594
బాబా - మతాంతరీకరణము నిరసించుట	595
బాబా - ప్రార్థనలు	596-599
బాబా - విజ్ఞానము - వైరాగ్యము (బేరము) సీతాఫలం	600-605
బాబా పూర్వాచార పాలనము	606-607
మృతాశౌచము-భక్తులు పాటించు సందర్భము	
బాబా నిగూఢ ఆచార ధర్మము – ఎలుక	608

వివిధ నియమములు

వచనమున బాబా ఆదేశములు	609
బాబా పలుకులందు ప్రత్యేకత – వైపరీత్య భావము	610-618
బాబా ప్రత్యేక హాస్యము-హేళనము	619-620
బాబా ప్రత్యేక బోధా విధానము	621-625
బాబా ఛాయా పటము తీయు విధము	626
బాబా నీతి కథలు	627-634
బాబా–కాశీనాథ ఉపాసనీ మహారాజుతో పలికిన పలుకులు	635-643

సాయినగు నేన - ద్వారకామాయి నగుదు!

ద్వారకామాయి కననీదు తానకంబు- ద్వారకామాయి శ్రితజన తారకంబు
ద్వారకామాయి పాప నివారకంబు-ద్వారకామాయి సుమ సుధా ధారకంబు

ఇచట నేనుండ నీఁక భయమేల? విడుము-నీ బరువుల నాపై నేన నిర్వహింతు;
నన్ను గనుము-వేఁగన్నుల నిన్నుఁగందు-శ్రితుని నిన్నెప్పుడే నుపేక్షింతునేమి?

పూజ్యులు శ్రీ బి. వి. నరసింహస్వామీజీ

అంజలి

శ్రీ సాయినాథ కథాసవమ్మును, విశ్వమంతయుఁ ద్రావ నట్లమరఁజేసె
సాయీ మహా ప్రభుఁ సత్సూక్తు లభయ ప్రదానబోధలఁ బ్రజన్ దనిపినాఁడు,
సాయిబాబా విశిష్టావతారాంచిత, వృత్త మెల్లర కెఱిఁగించినాఁడు,
సాయీశ పదభక్తి - జాతిమతాది వైషమ్యదూరంబని చాటినాఁడు.

అఖిల భారత సాయి సంఘాధినేత
సాయి సద్గురు వ్యాసుఁడౌ, స్వామి - బీ.వి.
నారసింహుని దివ్యపాదారవింద
ములకు భక్తిమై నిత్యమంజలి ఘటింతు.

నమః శ్రీ కృష్ణాయ భగవతే

శ్రీ సాయీ సద్గురవేనమః

శ్రీ సాయీనాథ బోధామృతము

(శ్రీ సాయీబాబా అభయప్రదానములు-సూక్తులు)

* ద్వారకామాయీ రూపమున బాబా అభయ ప్రదానములు -

1. నీవుచేరి కూర్చున్న యిది- మన "ద్వారకామాయి" తన బిడ్డల అపాయములను, కష్టములను దొలగింప సమర్థమైనది. ఈ మసీదు ఆయి మిక్కిలి దయామయి, తన్ను నెఱనమ్ము బిడ్డలకీమె అనుగుతల్లి. వారు ఆపదలోనున్న ఈమె రక్షించును. ఒకపరి నీమె అంకమున జేరిన వాని కష్టము లన్నియు తొలగిపోవును. ఈమె నీడ యందు విశ్రమించువాడు అవ్యయానందము బడయును.

2. ద్వారకామాయి బిడ్డలగు వారిని సర్పమేమి చేయ గలదు? సర్పము కనబడెనేని వారు దానిని వినోదముగ జూతురు. ద్వారకామాయి రక్షణమున నున్న వానిని సర్పము తాకగలదా?

3. మనము భయపడవలసిన పనిలేదు. తాకుము! నీ వెటుల తాకి చంపగలవో చూచెదగాక! (అని ద్వారకామాయి కేక పెట్టును.)

(36, 474)

4. ఇది మసీదు కాదు. ఇది ద్వారక. ఈమె శరణు పొందిన వారెన్నడు ఆపదల పాల్పడరు.

5. ఈ మసీదు నందలి మెట్లెక్కినవాని పూర్వ కర్మ జనితము లైన బాధ లన్నియు తుదిముట్టి సుఖ సంతోషములు ప్రాప్తించును. ఆ ఫకీరు - భగవానుడు మిక్కిలి దయామయుడు. మీ కష్టములను తొలగించును.

6. ఈ ద్వారకామాయిని ప్రవేశించెనేని వాని గమ్యము (సంకల్పము) సిద్ధించును.

7, ఈ ప్రదేశము (ద్వారక) తారణము - జనులను రక్షించునది. కాని, మారణము - చంపునది కాదు.

ద్వారకామాయి - మసూది అయి - ద్వారకామాయియే - సాయి

8. నే నేమియు చేయను - నేను దేనిని స్వీకరింపను. దత్త స్వామియే తన సొమ్మును తానడుగుచున్నాడు. తనకు చెందవలసిన 15 రూపాయలు రాబట్టుకొని మసూది అయికి యిచ్చినాడు. కావున ఆ ధనము (నాచే) స్వీకరింపబడెను.

బాబా అభయ ప్రదానములు

9. నా (జాగరూకత గల) దృష్టి యెల్లప్పుడు నన్ను ప్రేమించు వారి యందే ప్రసరించును. నీ వేమి చేయుచున్నను, నీ వెక్కడ నున్నను నీవు చేయు ప్రతి కార్యము నే నెఱుగజాలుదును అను విషయము నీవు గుర్తించుకొనుము.

10. నన్ను ధ్యానించుచు, నా నామము స్మరించుచు నా లీలల కీర్తించుచుండు నతడు నాయనుభావము పొందగలడు. వాని సకల కర్మములు విడిపోవును. నే నెల్ల వేళల వాని వెంతనే యుందును.

11. ఎల్లప్పుడు నీవు సత్య మాధారముగ సంచరింపుము. నీ వెక్కడనున్న నెల్ల వేళల నిన్ను విడనాడక నీ వెంట నుందును.

12. నీ వెప్పు డెక్కడ నన్ను తలచిన వైళమ నీ దరి జేరుదును. నీవు భయపడవలసిన పనిలేదు.

13. అనన్య భక్తితో నన్ను చింతించుచు నన్ను శరణొందిన వానికి నేను ఋణపడిన వాడను. నా తలనైన వెచ్చించి వానిని రక్షించి తీరుదును.

14. నాయం దెల్లప్పుడు మనస్సు నిలిపి, నాకు ముందుగ సమర్పింపక యే లవమేనియు చవిచూడని వానికి, నా యందు ప్రేమ విశ్వాసముల బలుపుచు నా కొరకై క్షుత్పిపాసలు గని, యితర మేదియు లెక్కిడకుండు వానికిని నేను బానిసీడ నగుదును.

15. నేను భక్తపరాధీనుడను. నా భక్తుని చేజిక్కిన సేవకుడను. నేను భక్తిని ప్రేమింతును.

16. కాంతా పుత్ర జననీ జనకాప్త బంధు మిత్రాదుల నుండి హృదయమును మరల్చి నన్ను ప్రేమించువాడే నా యదార్థ భక్తుడు. సముద్రమును జొచ్చు నదివలె అట్టివాడు నా యందు లయమగుచున్నాడు.

17. సా. బా. :- నా ధనాగార బీగ మిపుడు నీ చేతుల యందు వుంచితిని. నీవు కావలసినది కోరుకొనుము. నెలకు రు. 5/- లేక రు. 100/- లేక ఏమి కావలయునో కోరుకొనుము. నేను నీ కిచ్చెదను.

భక్తుడు :- (యం. బి. రేగే) నా కేమియు వలదు.

సా. బా. :- ఏదైన కోరుకొనుము. నీ కీయ నభిలషించుచున్నాడను

భక్తుడు :- నేను కోరిన దేమైన నిచ్చుటకు సమ్మతించి నట్లేనా?

సా. బా. :- సందేహ మేమి? తప్పక యిత్తును.

భక్తుడు:- అట్లయిన, బాబా! నా కోరిక యిది. ఈ పుట్టువున, ఇకముందు నాకు గలుగనున్న మఱి ఏ పుట్టువు నందైన నీవు నన్ను విడిచి పోవలదు. నీవు నా తోడనే యుండ వలయును.

సా.బా.:- తప్పక - నీ వెటుల నున్నను - ఏమి చేయుచున్నను, నీ లోన - నీ వెలుపల - నీ తోడ నుందును.

18. నా భక్తుడు నీ యందు - తన యందు - సకల భూతము లందు నన్ను గుర్తించును. సకలమును తన గురువుగ జూచును. వాడు నా అను భావమును (సాదృశ్యమును) పొందును.

19. నీ సకల సంకల్పములను నన్నేకైక లక్ష్యముగ జేసికొంటి వేని నీవు పరమార్థము బడయ గలవు. నన్ను చూడుము! నేను నిన్ను చూతును. నీ గురువును గాఢముగ విశ్వసింపుము. అదియే సాధనము. సకల దైవములు గురువే.

20. వెండు మనస్సు నా కర్పించి, నా యందు విశ్రమించువాడు, తన దేహమును గూర్చియేని, తన ఆత్మను గూర్చికాని భయపడవలసిన పనిలేదు. నన్నొక్కనినే చూచుచు, నన్ను గూర్చియే వినుచు, పలుకుచు నా యందే భక్తి సలుపువాడు (చైతన్యమును) దైవమును పొందును. నిత్య శుద్ధబుద్ధునిగ నన్ను సేవించువాడు నన్ను జేరును.

21. నిరంతరము నా నామము స్మరించువారు వారి గమ్యమును జేరుదును.

22. ఉప్పొంగు హృదయంతో 'సాయీ' - 'సాయీ' అని ఈ రెండక్షరముల మాత్రమే స్మరింపుము. నీ బాహ్యాడంబరములతో నాకు పని లేదు. అట్టి భక్తుల యందే నే నధివసింతును.

23. నా నామము జపింపుము. నన్ను శరణు పొందుము. 'నే నెవడను?' - అని తెలిసికొనుటకు శ్రవణ మననముల గావింపుము.

24. నేను నిరాకారుడను. సర్వవ్యాపిని.

25. తన భారములు నాపై నిలిపి, నన్ను చింతించు వానిని సర్వ విధముల ఆదుకొని రక్షింతును.

"యోగక్షేమం వహామ్యహమ్"

26. సత్యము! నీ సకల భారముల నాపై నిలుపుము.

27. నా భక్తుని యింట తిండి గుడ్డలకు కఱవు కలుగదు.

28. భక్తులు మీరు నా బిడ్డలు. నేను మీ తండ్రిని. ప్రతి వస్తువు నా వలన మీరు పొందవలయును. (సాయి దేవుడు కాడు అని) అటుల మీరు పలుక రాదు.

29. నీ వాందోళన జెంద నేల? నీ సకల బాధ్యతల నేనే వహింతును.

30. ఊరక కూర్చుండుము! (ఊగేమూగే) అవసరముల నేను తీర్చెదను. నిన్ను గమ్యమునకు జేర్చుదును.

31. బాబుగిర్! పొమ్ము సకలము సమకూర్చబడును. గాణూ! నేను నీకు సమకూర్చుదును.

మాన్కర్ పుత్రుల కెట్టి లోటును కలుగ నీయను.

అభయం – మా భై

32. నీవు భయపడ నేల? [నీవు విశ్రమింపబోవు చోట] నే నచట లేనా?

33. ఇక్కడ నుండుము. దీనిని నీ గృహముగ భావింపుము.

గవర్నరు బల్లెము చేబూని దాదాను [జి. యస్. కపర్దే] పొడువ వచ్చెను. నే నాతని ప్రతిఘటించి తరిమి వైచితిని, తుద కాతని సమాధాన పఱచితిని. నే నిక్కడనుండ నెవరేని ఏల భయపడవలె?

34. ఈ బిడ్డ నిదురించు నపుడు మనము ప్రక్కన నిలిచి జాగ్రత వహించి, కాపుండి శ్రమపడవలయును. 'ఏషసుప్తేషు జాగర్తి, భూతేషు పరినిష్ఠితః'

35. నా భక్తులను ఆపదల పాల్పడనీయను. నా భక్తులగూర్చి యోచించు చుండవలెను. నా వాడు కూలనున్న తఱి నా చేతుల – నా నాలుగు చేతుల [అనంత కరముల] ఒక్కమారుక జూచి ఆదుకొందును. నా భక్తుడగు వానినే తరుణ మందున బడనీయును.

"ఏ సమాపత్సుకృచ్ఛ్రేషు కాంతారేషు భయేషుచ
కీర్తయన్ పురుషః కశ్చిత్ నావసీదతి నిశ్చితమ్"

36. నేను దాని [కప్ప] తండ్రిని, యిక్కడ నుంటిని, దానిని ఆ సర్పము నోట బడనీయుదునా? దాని నెట్లు విడపింతునో చూడుము! ఓయీ! వీరభద్రప్ప! నీ ద్వేష బుద్ధికి సిగ్గుపడుము. ద్వేషము విడువుము.

(సర్పము కప్పను విడిచెను) నే నిచ్చిన మాటను నిలుపుకొని కప్పయైన బసప్పను సర్పమైన వీరభద్రప్ప నుండి రక్షించితిని. నన్నిటకు బంపి దైవ మాతని రక్షించినాడు.

37. నీ బాధలను తొలగించుటకై, నీ కొఱకు నేను బాధపడవలసి వచ్చినది – చూడుము!

నిన్ను మృతినొంద నీయను, నిన్ను [నందరాము] మృతినొంద నీయుటకు ముందుగ, నేనే మరణింతును. [నందరామ్] 1918 తరువాత చాలాకాలము జీవించినాడు.

'నానా' ప్రాణాపాయ స్థితియందున్న వాడు. కాని నేను మరణింప నీయుదునా? [535 ఎ]

ఫకీరు [భగవానుడు] దాదా సాహెబును [జి. యస్. కపర్దే] చంప దలచినాడు. కాని నేనది సాధ్యపడనీయను.

ఓ అన్నా! నేనొక్క నిముస మాలసించితినేని ఈతడు [యస్. బి. నాచ్నే] మరణించెడివాడు. ఆ పిచ్చివాడతని కంఠమును గూడ పట్టుకొని నాడు. కాని, నే నాతని దూరముగ గెంటివైచితిని. ఏమి చేయవలె? నావాని నేను రక్షింప నేని యింక రక్షింపజాలు వారెవరు?

38. అతడు నా వాడు, నాకే చెందినవాడు. వానిని తరింప జేయుటకు నేనే బాధ్యత వహించితీరవలె, నాకంటె వాని కింకెవరుగలరు?

39. [కలరా పిశాచి తరిమి వేయబడిన తరువాత] నీ విప్పుడు భద్రత గంటివి – పొమ్ము!

40. రేయింబవళ్ళు నా బిడ్డలగూర్చి మఱి మఱి యోచించు చుందును. వారిని వేర్వేరు పలుమాఱులు గణింతును.

(యస్. బి. ధుమాల్ తో) భావూ! రాత్రి యంతయు నిద్ర యెట్టిదో నే నెఱుగను. నిన్ను గూర్చియే తలంచుచు తలంచుచు పరుంటిని.

ప్రతి పదమున నిన్ను గూర్చి జాగ్రత పడవలసి వచ్చినది. లేకున్న ఏమైయుండెడిదియో! ఆ దైవమునకే యెఱుక!

41. ఏ వేళయందును నేను నా వానిని మఱువను. అతడు రెండు వేల మైళ్ళ దూరము నందున్నను అతనిని జ్ఞప్తి యందుంచుకొందును. అతనిని విడిచి నే నేమియు నారగింపను.

42. నా కెవరి యెడను కోపము లేదు. తల్లి బిడ్డలపై కోపము వహించునా? సముద్రము నదుల జలముల నాయా నదులలోనికి త్రోసి

వేయునా? నేను భక్తిని ప్రేమింతును. నా భక్తులకు నేను సేవకుడను, భక్త పరాధీనుడను.

43. నా బిడ్డల నాకటి చిచ్చుచే నే నెట్లు బాధ పడనిత్తును.

44. అయ్యలారా! రండి! సంచుల నిండుగ 'ఉధి' గొనిపొండు. మీ తల్లి ధనరాసులను బండ్ల కెక్కించుకొని పొండు! ఇటు చూడుడు; జనులు వచ్చి, బాబా! 'మాకీయుము! మాకీయుము!' – అని కోరుదురు. తీసికొనుడని నేను చెప్పుదును. ఎవడు తీసికొనడు.

45. 'అడిగిన వారలకు లేదనక సమృద్ధిగ నీయుము' అని, నా గురు డానతి నిచ్చెను. సద్బుద్ధితో నా మాటలు వినువారు లేరు. నా ధనాగారము తెరువబడియే యున్నది. ఎవ్వరు నా ధనమును బండ్ల కెక్కింప జూడరు. త్రవ్వుడీ! యని యందును. ఎవ్వరే మాత్రం శ్రమ పడరు. 'త్రవ్వి వెలికి దీసి బండ్ల కెక్కించుకొని పొండు! మాతృ గౌరవమును నిలుప దగిన బిడ్డలు కండు! మీ కొట్ల నిండించు కొనుడు! మన మేమి కానుంటిమో! యిక? – ఈ జీవిత మేమగునో? పృథివి, పృథివిని, జలము – జలమును, అగ్ని – అగ్నిని, వాయువు – వాయువును, ఆకాశము – ఆకాశమును జేరును. ఇట్టి మంచి అవకాశం మీకు గలుగబోదు' – అని చెప్పితిని.

"యాత్యేవ యమునా పూర్ణం సముద్రముదకార్ణవమ్
ఆత్యేతి రజనీ యాతు సా న ప్రతి నివర్తతే"

46. నా పలుకు లందు గాఢ విశ్వాస ముంచుడు! మీ ఆశయము సిద్ధించును.

ఈ సమాధియే శ్రీ సాయి యెలుగు వినుచు
"చిరను పాంతరాత్మగ సాయి పలుగు ననుచు.

47. 15–10–1918 నాడు లక్ష్మన్‌తో బాబా స్వప్నమున–"నేను మరణించితినని 'జోగ్' తలంచుచున్నాడు. నేను జీవించియే యున్నాడను. రమ్ము! ప్రభాత హారతి గావింపుము".

48. నా రు. 1-4-0 లు నా కిమ్ము! (ముజ్యా సవ్వా రూప్యాదేవో!)

49. నన్ను అనన్యగతి శరణొందిన వారిని-విడనాడక నా సమాధియే వారితో పలుకాడును.

50. ఈ సమాధి నుండియే నేనెక్కుడు చురుకుగ బలముగ నా విధులను దీర్తును.

51. నా మహా సమాధి తరువాతనేని నీ వెక్కడ ఏ క్షణమున నన్ను దలంతువో అక్కడ కాక్షణమున నిన్ను జేరుదును.

51 ఎ. 23-8-1954న అహమ్మదాబాదునందు 'సి. సి. మానిక్కవాలా' ఎదుట బాబా పొడమి యిట్లనెను.

"బాబా ఎల్లవేళల తన భక్తుల సమక్షముననే యున్నవాడు: సర్వవ్యాపియై తన భక్తులను ఈ విశ్వమును - శుభ్రిమార్గమున నడిపించుచు, గమ్యమును జేరుటకు చక్కదిద్దుచు నున్నవాడు-అని బి. వి. నరసింహస్వామికి లేఖ వ్రాసి, తెలియజెప్పుము".

52. ప్రేమతో నా భక్తుడు నన్ను పిలిచిన మాత్రమున ప్రత్యక్షమగుదును. నా ప్రయాణమునకెట్టి వాహనములు అవసరములేదు.

* బాబా నియమములు *

53. ఆశ్రితులగు భక్తుల లౌకిక పారలౌకిక ప్రయోజనములను ప్రసాదించుటకు సాధు సత్పురుషులు పొలుతురు. దీనికై "డాక్టరు పిళ్ళై" యింక పది జన్మలు పొందవలసిన పనిలేదు. ఆ బాధ యంతయు పది దినములలో సహింపబడును.

54. భక్తులకట్టి హితాభీష్టలను ప్రసాదించుటకే నేను వచ్చితిని.

55. ఆశీస్సులను ప్రసాదించుటే నా పని.

56. ఐహిక లాభములను - ఉద్యోగములను, ధనమును, సంతానమును, వ్యాధి నివారణములను గోరి బాబాను ఆశ్రయించు జనుల నొక భక్తుడు నివారించెను.

సా. బా:- ఆ పని చేయకుము! నావారు మొదట ఆ తలంపుతోడనే నన్ను జేరుదురు. వారి హృదయ కామితములను పొందుదురు. జీవితముల సుఖ సంతోషముల బడయుదురు. అపుడు వారు నన్ననుసరించి పురోగమింతురు. పలువిధములగు కారణముల నావారిని దూర దూరములనుండి నా దరికి నేను ఆకర్షింతును. నేనే యేరికోరి వారిని నా దాపునకు జేర్చుకొందును. వారంతట వారువారు, నేనే నా దరికి వారిని జేర్చుకొందును. ఎంతెంత దవ్వుల - వేలకొలది మైళ్ళ దూరముననేని వారున్నను, పిట్టల కాళ్ళకు త్రాళ్ళుగట్టి తమ దరికి లాగుకొను విధమున - నేనే వారిని నా చెంతకు జేరదీయును.

57. ఈతడు బ్రాహ్మణుడు, స్వచ్ఛమైన బ్రాహ్మణుడు, పరమ పవిత్రుడైన బ్రాహ్మణుడు. ఈ బ్రాహ్మణుడు లక్షలకొలది జనులను శుభ్రమార్గమున నడిపించి, గమ్యమునకు - సచ్చిదానందధామమునకు జేర్చగలడు. ఇది బ్రాహ్మణ మసీదు.

* బాబా సూక్తులు *

(సహజ స్వభావ - శక్తి - సామర్థ్య సూచకములు) బాబా సహజస్థితి.

58. నేను దైవమును (అల్లా). నేను మహాలక్ష్మిని. ఈ మసీదున గూర్చున్న నేను సత్యమును పలుకుదును.

[పండరియందు వితోబాను - నేను] హొమ్మ; నేను పండరీయం దున్నాడను. (నా. గో. చం)

[నేను గణపతిని] అమ్మా! గణపతికి నీవు సమర్పించినవన్నియు నాకు జేరినవి.

[నేను దత్తాత్రేయుడను] నీవు గర్వించుచున్నావా? పురుష సంతతి బడయు అదృష్టము నీ కెక్కడ కలదు? (గంగాపురమున దత్తస్వామి సన్నిధి నీవు కావించిన ప్రార్థనల ఆదరించి) ఈ తనువును చీల్చి, నీకు పుత్రుని ప్రసాదించితిని.

[నేను లక్ష్మీనారాయణుడు] గంగ కొఱకు నీ వెక్కడకో పోనేల? నా పాదముల దఱి దోసిలిని పట్టుము. ఇక్కడే గంగ ప్రవహించును.

నీ ధ్యాన నిష్ఠయందు ఈ (సాయీ) మూర్తిని జూచిన నేమి? లేక లక్ష్మీనారాయణ రూపము జూచిననేమి?

[నేను మారుతిని] నా తండ్రి నన్ను మారుతికి అంకితము గావించెను. నేను మారుతి దేవాలయమునకు ముందునిలిచి, నే నాతని సోదరుడనని సైగలు చేయుచుందును.

59. (నేను శ్రీ కృష్ణుడను) (ద్వారకామాయి యందుండి)

సా. బా:- (ఉద్ధవేశ భావ్‌తో) రు. 11-0-0 లు దక్షిణ నాకిమ్ము!

ఉ. భా:- నా పది యింద్రియములు - మనస్సు నర్పించితిని.

సా. బా:- కాదు. వాని నిచ్చుటకు నీవెవడవు? ఇంతకుమున్నే అవి నాకు జెందినవి. పారాయణము చేయుము.

ఉ. భా:- ఏ పురాణమును?

సా. బా:- నేను పూర్వము బోధించినది - నేటికిని నేను బోధించుచున్నది యేదో - ఆ పురాణమును.

ఉ. భా:- అది గీతా? - జ్ఞానేశ్వరియా?

సా. బా:- ఔమ్మ! బాపూసాహెబ్ జోగ్ చదువుచున్న దానిని తెమ్ము! జోగ్ దగ్గరనుండి భాగవతము ఏకాదశ స్కంధమును ఉద్ధవేశభావ్ తీసికొనివచ్చెను.

సా. బా:- (అదాటున తన వ్రేలా గ్రంధమున జొనిపి, తెఱచి) దీనిని చదువుము! (అది కృష్ణోద్ధవ సంవాద ఘట్టము) నిత్యము దీనిని పఠింపుము. నా పదసన్నిధిఁజేరి, చదివినది మననము చేయుము.

(గమనిక- ఆ ఏకాదశ స్కంధ మననమే హృదయ స్థాయియైన శ్రీ కృష్ణసాయికి - బాబాకు 11 రూపాయల దక్షిణ సమర్పణము)

60. (రోహిల్లాతో) అదంతయు (వివిధదైవములు) "అల్లా" అగును.

61. ప్రశ్న :- బాబా! నీ వెవడవు? ఎందుండువు?

సా. బా:- (అద్వైతస్థిలో నేను నిరాకారుడను. సంపూర్ణుడను. నిర్గుణుడను. నాకొక పేరులేదు - నివాసము లేదు. (మరల ద్వైత భావనమున) కర్మచే బద్ధుడనై ఒక దేహమునజేరితిని (కావున) ఒక పేరు-నివాసము పొందితిని. నా పేరు - 'దేహి' ఈ ప్రపంచము నా నివాసము బ్రహ్మము నా తండ్రి. మాయ నా తల్లి. వారి కలయిక వల ఈ దేహము బొందితిని. ఈ విశ్వము అశాశ్వతము పరిణామము మార్పు – పొందునది.

62. నేను పర్వర్దిగర్ (దైవము) అగుదును. నేను షిరి యందును, ఎల్ల యెడల నుందును.

నా వయస్సు లక్షల సంవత్సరములు, నాపని ఆశీస్సులు పలుపు సమస్త వస్తువులు నాకు జెందినవే, ప్రతి వస్తువు - ప్రతి జీవికిని నేనే యిత్తు

63. నేను గంగాపురమున, పండరీపురమున, ఎల్ల ప్రదేశము నున్నాను. ఈ విశ్వమునగల ప్రత్యణువునందు నేనున్నవాడను.

64. ఈ విశ్వము సర్వము నా యందున్నది.

65. నీవు గాఢముగ ప్రేమించి సేవించు వానియందే హత్తుక యుండుము, దైవము నిన్ను వేగము రక్షించును.

65 ఎ. సా. బా: (శంకరరావు గౌహంకర్‌తో) వారికి బాధాకర లైనవి అనేకములు గలవు. నా దగ్గర వున్నంతవరకు ఆ కష్టము వారు బాధ పడరు. బాధ కలిగించు వారిని దైవము శిక్షించును. దైవ మంచి చేయువారిని రక్షించి తోడ్పడును. చెడు చేయువారిని శిక్షించును

♦ సర్వ వ్యాపకత్వము ♦

66. నేను నిరాకారుడను. ఎల్లెడల నున్నవాడను. నేను ప్రతి వస్తువునందు నున్నవాడను. నేను ప్రతి పదార్థమున దాని కావలనున్నవాడను. నే నాకాశము నంతట నిండియున్న వాడను.

నీ దృష్టి గోచరమగునది సకలము నేనే. నేను చలింపను – కదలను.

67. ఈ దృశ్యము సమస్తము నా ఆకారమే; చీమ,ఈగ,రాజు,పేద.

68. నేను జలముల, స్థలముల, అడవుల, జన సమూహముల, అరణ్యముల, ఎడారుల నున్నాడను. అగ్నియందు గలను. ఆకాశమున గలను. ఏ ఒక్క తావునకే నే నంటికొని యుండలేదు.

69. ఆకలి నొందు కుక్కకు అన్నము పెట్టుట నన్ను భుజింప బెట్టుటయే. దాని ఆకలి తీరిన నా ఆకలి శమించును.

సా. బా:- (లక్ష్మీబాయ్ సింధితో) అమ్మా! నాకు ఆకలిగ నున్నది.

ల. సిం:- బాబా! నేను వెళ్ళి ఆహారము తీసుని వత్తునా?

సా. బా:- తీసికొని రమ్మా!

లక్ష్మీబాయి సింధీ పళ్ళెరములో ఆహారము గొనివచ్చును. బాబా అందేమియు తినక దాపుచేరిన కుక్కముందా పళ్ళెరముంచెను.

ల. సిం:- బాబా! నీ కొఱకు తెచ్చినదాకుక్కకు పెట్టితి వేమి?

సా. బా:- అమ్మా! ఆ కుక్కయు నొక జీవి కాదా? మనము చెప్పుకొందుము అది చెప్పుకొన లేదు. అదియు ఆకలి నొందినది. అదియు నేను అభేదము. నేను తినిన, అది తినిన ఒక్కటే.

70. ఈ ఉదయం నీవు కుక్కకిడిన ఆహారమున నే నింకను త్రేన్పుచున్నాను. ఆ బురదగుంటలో పడియున్న పందిని నేనే. (నీ దగ్గఱకు వచ్చినను దాని కేమియు దిన నిడవైతివి! - బొంబాయి కాంతతో) నన్ను సేవింప తలతువా - భేద బుద్ధిని విడువుము!

71. ఒక్కొక్క వేళ కుక్కగ - ఒక్కొక్కతఱి పందిగ – నేను వత్తును. ఏ భక్తుడు ప్రతి జీవియందు నన్ను గుర్తించి, తగిన రీతిని ఆదరించునో అతడనుగ్రహింపబడును.

72. సా. బా:- నానా! నాతో 18 సంవత్సరముల నుండి యున్నాడవు. ఈ 3-1/2 మూరల దేహమునందున్నవాడే 'సాయి' అనియేనా నీవు గ్రహించినది? నేను చీమ యందు, ఈగ యందు నున్నవాడను. (బాబా ఏదో సైగ జేసి) ఈ గుర్తు నీవు గమవించినపుడెల్ల నే నందుంటినని జ్ఞప్తి యుందుంచుకొనుము! చీమలుగ, ఈగలుగ నీ విడు ఆహారము స్వీకరించగల ననియు తెలిసికొనుము. (చూ. 199)

72 ఎ. ఈ శరీరము నా గృహము మాత్రమే. ఈ యింట నుండి నన్ను నా గురుదేవు డేనాడో యెత్తుకొని పోయెను.

73. ఈతని (హన్సిరాడ్) రక్షించుటకై, అతడెంత ద్వేషించుకొనుచున్నను ఒక పిల్లిగ వెళ్ళి అతడు దాచిపెట్టుకొనిన పెరుగును త్రాగుచుంటిని. ఈనాడీతడు నన్ను కర్రతో కొట్టినాడు.

ఆ నల్ల కుక్క నేనే యగుదును. ఆ రోగిష్టియైన శూద్రుడను నేనే. ప్రతి వస్తువు నందు దాని కావల, నంతట నే నున్నాడను. బొంబాయిలో నిన్ను యాచించిన ఫకీరును నేనే.

అర్ధ రాత్రమున ఆ చెట్టు క్రింద నీవు చూచిన భూతము నేనే. (నేను అకల్‌కోట మహారాజును) నే నీకు 2 రూపాయలు యిచ్చితిని.

♦ పిల్లి రూపమున నున్న బాబా కొట్టబడెను ♦

73 ఎ. బాబా - ఉబ్బసము రోగిష్టియైన హన్సిరాజును "పెరుగుత్రాగ

వలదు, పులుపు పదార్థములు తినకుము" అని చెప్పెను కాని, హన్సిరాజు ప్రతి దినము రాత్రు లందు పాలు తోడు పెట్టించుకొనుచు మరునాడు మధ్యాహ్న భోజనమున ఉపయోగింప దలచెను. ప్రతి దిన మొక పిల్లి ఆ పెరుగు త్రాగి పోవుచుండెను. ఒక దినమున నతడు దానిని కర్రతో కొట్టెను.

సా. బా:- (హన్సిరాజు యెదుట యితరులతో) ఒక గ్రామమున నొక మూర్ఖుడు గలడు. అతనిని పెరుగు త్రాగవలదంటిని. కాని, అతడు ప్రతి దినము పెరుగు సిద్ధపఱచుకొను చుండెను. వానిని రక్షింప నేను పిల్లిగా వెళ్ళి ఆ పెరుగు త్రాగు చుంటిని. ఈ దినమున మరల వెళ్ళితిని. వాడేమి చేసేనో మీకు తెలియునా? నా భుజముపై కొట్టినాడు ఇటు చూడుడు! (హన్సిరాజు తాను కొట్టినది పిల్లియైనను బాబా భుజమున గల కర్రవేటు క్రొత్తవాతను చూచి చకితుడయ్యెను.) (చూ. 359)

73 బి. (బాబా కుక్కగ – రోగియైన శూద్రుడుగ). 1911–1914 కాశీనాధ గోవింద ఉపాసనీ మహారాజు షిర్డి యందుండెను. క్రొత్తలో ఒకనాడు వంట జేసికొనుచుండ ఒక నల్ల కుక్క దూరము నందుండి చూచుచుండెను. దాని కేమియు పెట్టక కా. గో. ఉ. ఆ పదార్థముల మసీదునకు గొనిపోయి బాబా ముందుంచెను.

సా. బా:- నీ విక్కడ కేల తెచ్చితివి? నే నక్కడే యుంటిని.

కా. గో. ఉ:- బాబా! అక్కడ ఒక నల్లకుక్క తప్ప మరెవ్వరు లేరు.

సా. బా:- ఆ నల్ల కుక్కను నేనే.

బాబా ఆ దినమున ఆ పదార్థముల గొనక నిరాకరించెను. మరునాడు కా. గో. ఉ. తన విడిదియందు వంట జేసికొనెను. అచట కుక్క కానరాలేదు. కాని, రోగియైన శూద్రు డొకడు గోడనానుకొని ఆ ఆహారములను చూచుచుండెను. కర్మఠుడైన కా. గో. ఉ. ఆ శూద్రు నచట నుండి తరిమివైచి ఆ పదార్థములను బాబా దగ్గరకు తీసికొని వెళ్లెను.

సా. బా;– క్రిందటి దినము నా కేమియు బెట్టవైతివి. ఈ రోజు నన్ను తరిమివైచితివి! ఆ పదార్థము లిటకు గొనిరానేల?

కా. గో. ఉ:– బాబా! నీ వచట ఎక్కడ వుంటివి?

సా. బా:– ఆ గోడ నానుకొని యున్నవాడను నేనుగానా?

కా. గో. ఉ:– ఏమీ! నీ వట్టి మనుష్య నందుందువా?

సా. బా:– అవును! నేను ప్రతి వస్తువునందు – సర్వత్ర నుందును. "సభూమిం విశ్వతో 22వృత్వా అత్యతిష్ఠత్ దశాంగులమ్" (పురుష సూక్తము) ఆతడీ భూ తలమున మఱి విశ్వమందంతట వ్యాపించియున్నాడు.

* బాబా – ఇతర సాధువులు *

74. 1878 యందు అకల్‌కోట మహారాజు నిర్యాణ సమయమున 'తార్దేవ్' నివాసి కేశవనాయక్ అను నతడు ఆ స్వామితో నిట్లనెను.

"మహారాజ్! మీరు మమ్ము వీడిపోయిన తర్వాత మా కాధార మింకేమి కలదు!"

అ. మ:– [తన పాదుకలను పూజింపుమని ప్రసాదించుచు] నా అవతారము-[ఆత్మ] అహమ్మద్ నగర్ జిల్లాలోని షిర్డి యందుండును. నిరతము అక్కడకు పొమ్ము. అచట భక్తి నలుపుము, సేవటుల గావించితివా నేను లేనికొరత నీకు గలుగదు. సేవానందము పొందుదువు.

అకల్‌కోట మహారాజు నిర్యాణాంతరము కేశవనాయక్, అతని కుమారుడు రామచంద్రనాయక్ మఱి యిరువురు నైష్ఠిక బ్రాహ్మణుల గూడి షిర్డి యందున్న సాయిబాబా దగ్గఱకు వెళ్ళిరి. మార్గమధ్యమున ఆ విప్రులు బాబాను గూర్చి యాతడొక పిచ్చి ముస్లిం ఫకీరనియు, బ్రాహ్మణు లెవ్వరాతనికి మ్రొక్కరనియు నేమేమో పలికిరి. ఆ నలుగురు బాబాను చేరిన పిదప –

సా. బా:- (కేశవనాయక్‌తో) నీవు, నీ కుమారుడు రాదలచిన నా దగ్గఱకు రండు! (తక్కిన ఇరువురు జూపుచు) వారు కర్మఠులైన బ్రాహ్మణులు (రామచంద్రనాయక్‌తో) వేపాకులను గొన్ని తీసుకరమ్ము!

రా. చం. నా:- కొన్ని వేపాకులను దెచ్చెను. బాబా ఆ వేపాకులు నలుగురకు పంచిపెట్టెను.

సా. బా:- ఆ ఆకులను తినుడు; అవి ఎట్లు రుచించుచున్నవి?

బ్రాహ్మణులు:- [ముఖము చిట్లించుచు] మిక్కిలి చేదుగ నున్నవి.

తండ్రి కొడుకులు:- ఈ ఆకులు మధురములుగ నున్నవి. మిక్కుటముగ తింటిమి.

బాబా యీ విధముగ తన భక్తులెవరో నిరూపించి, అకల్‌కోట మహారాజు పలుకులను ధ్రువపఱచెను.

♦ ♦ ♦

నేను మిర్జ్‌గోన్ [ఫకీర్ బావ్] లో నుంటిని. [కుశభావ్‌తో] నీ విక్కడకు రానేల? నేను బాంద్రాలోని మౌలాను. [నేను వాందేడు మౌలాను] రు. 3-14-0 లు నాకు ఇదివరకే యిచ్చితివి.

75. నీ వెక్కడనున్నను నేను నీ వెంట నున్నాడను, నన్ను తీసుకొని పోవుటకు వాహనములు అవసరములేదు.

76. 1914 మే నెల, బాంద్రా నివాసిని తార్ఖాడ్ సతి, ఆమె కుమారుడు తర్ఖాడ్ షిర్డికి వచ్చినపుడు వారితో-

సా. బా:- అమ్మా! దినమునకు మూడు పర్యాయములు మీ ఇంటికి వచ్చుచుంటిని.

తా. సతి: - సత్యము – బాబా!

షిర్డి యందున్న ఒక కాంత బాబాను నిత్యము షిర్డియందు జూచుచున్న దగుటచే ఆశ్చర్యపడి-

షి. కాంత:- బాబా! ఏమి? ఈ వింత పలుకులు పలుకుచున్నావు?

సా. బా:- నేను కల్ల లెప్పుడేనియు బలుకను. నేను మహాలక్ష్మిని. (బాం. కాంతతో) అమ్మా! నేను నీ గృహమునకు జేరుచుందును. నీవు తినబెట్టుదవు. సత్యముకాదా?

బాం. సతి:- బాబా! సత్యము.

షి. కాంత:- సత్యముగ బాబా నీ దగ్గరకు వచ్చునా? నీవు తిన బెట్టుదువా?

బాం. సతి:- సత్యము.

సా. బా:- (కుమార్ తార్కాడ్‌తో) మీ యింటికి వచ్చుచుంటినా?

కు. తా:- సత్యము, బాబా!

సా. బా:- (షిర్డికాంతతో) సత్యము తల్లీ! బాంద్రాలోని భావ్ గృహమునకు నేను తేలికగ వెళ్లుదును. మధ్య నొక గోడగలదు. దానిని దాటిన తరువాత అయోమార్గము – దాని కావల భావ్ గృహము.

(ఇచట బాబా షిర్డినుండి బాంద్రాలోని తార్కాడ్ సతి గృహమునకు కాకి రూపమున జేరుచున్న విధము తెలుపబడినది.

నేను గోడలు, అగడ్తలు దాటుచు నెగురవలయును.

77. బాంద్రాలోని టెండల్కర్ సతి తన గృహమున బాబా పటమును వకుళ పుష్పమాలలతో రెండు నెలలు నిత్యము నిండించెను. తరువాత షిర్డికి వెళ్లెను.

సా. బా:- ఓయీ! కాకా! (హ. సీ. దీక్షిత్) ఈ రెండు, మూడు నెలలు నేను షిర్డిలో లేనేలేను. ఈ తల్లి నన్ను వకుళ పుష్పములతో నునుపినది – దిమ్మదిరిగి స్మృతి తప్పియున్నాను. ఇప్పుడు మెల్లగా కోలు కొనుచుంటిని.

78. నేను బాంద్రాలోని భావ్ గృహమునకు వెళ్లితిని. భావ్ తినుటకు నాకేమియు నొసగలేదు – అందుచే ఆకలితో తిరిగి వచ్చితిని.

79. నీ భోజన సమయమున నన్ను దలంతువా? నేను నీ చెంగటలేనా? నీ వొక మెతుకైనా నాకర్పింతువా?

80. నేను షిర్డిలోనే ఉన్నవాడను కాను. అంతటగలను.

81. షిర్డియందే 'సాయిబాబా ఉన్నవాడు' – అని తలచువాడు బాబాను యదార్థముగ నెఱుగ జాలని వాడేసుమా!

82. ఏల నీవు (దుఃఖించుచు) పిచ్చివానివలె ప్రవర్తించెదవు? (బొంబాయిలో) నీ చెంత నేను లేనా?

83. ఎవరు (సాయి) షిర్డి యందున్నాడో అతడిక్కడ 'మా చంద్ర ఘడ్'లో కూడ నున్నాడు– ఈవిషయము నీకు (మాన్కర్) బోధ పఱచుటకే నిన్నిక్కడికి పంపితిని.

84. నేనిప్పుడే కాశికి వెళ్ళి స్నాన మాచరించితిని.

(ఉపాసనీ కుమారునితో) నేను ధూలియా యందుంటిని. నీవు నన్ను చూడలేదా?

(మేఘునితో) నా కంఠ ధ్వని వినినపుడు సందేహమేల? గడియ వేయబడిన తలుపులు నారాక నడ్డగింపజాలవు.

85. నేను నీ వెంట (అదృశ్యముగ) వత్తును. అమ్మా! విచారము వలదు. నీ కుటుంబమును కనిపెట్టి యుందును. మంచిది పొమ్ము! నేను నీ చెంతనే యున్నాడను.

86. (పురందరుతో) నేనే అక్కడ (అదృశ్యముగ) కూర్చుండి నిన్ను నీ, భార్యను కాపాడుచున్నాడను.

87. నీ వెక్కడ నుండినను నన్ను తలంచు మాత్రమున నీ చెంతకు జేరుదును.

88 మీరెక్కడ నున్నను నా భక్తులలో నెవరేమి తలచినను, పలికినను, చేసినను ఆ క్షణముననే దానినంతయు నేనెఱుగ జాలుదును.

'కొరాన్' నా సేవకులు నన్ను గూర్చి నిన్ను కోరినపుడు ఆ క్షణమున వారిని సమీపింతును. నాకొఱకు ప్రార్థించువారి ప్రార్థనము నను గ్రహింతును.

89. ఎల్లరయెడ సమదృష్టి వలయును. నా కరుణలేక ఆకైనను కదల జాలదు. అందఱను సమదృష్టితో చూతును.

♦ బాబా కార్యములు ♦

90. నేను ఈశ్వరుని సేవకుడను, భగవానుడు మహాప్రభువు – యజమాని.

91. ఎల్లెడల భగవానుని ప్రతినిధులు కలరు. వారు అపారములగు శక్తులు గలిగి యున్నారు.

నేను మిక్కలి గొప్ప శక్తులు కలిగి యున్నవాడను.

92. [బాబా ఆజ్ఞ ప్రకారము 'అప్పాకులకర్ణి' నివాస్ పురములోని మోహినీ రాజు [శంకరుడు] ను సందర్శించి, [చూ. 145] అచట డిప్యూటీ కలెక్టరుచే జరుపబడిన విచారణయందు – కులకర్ణిపై మోపబడిన నేరములాధారశూన్యము లనియు అతడు నిర్దోషి యనియు తీర్పు చెప్పబడిన తరువాత షిర్డికి తిరిగివచ్చి బాబాతో]

అ. కు:- బాబా! నీవు నన్ను రక్షించినావు.

సా. బా:- అప్పా! భగవానుడు నిన్ను రక్షించినాడు. అతడు తన భక్తులకు దుర్ఘటములనేని సంఘటింపగలడు.

92 బి. జి. డి. పెన్సారే – అను నతడు బాబాను ప్రార్థించి పరీక్షయందు త్తీర్ణుడై ఉద్యోగమును సంపాదించుకొనెను. పిదప బాబాను జేరి మ్రొక్కెను.

సా. బా:- నీ ఉద్యోగ మేమి?

జి. డి. పె:- నేను ఉపాధ్యాయుడను - బాబా! నీ వనుగ్రహించిన ఉద్యోగము.

సా. బా:- నేను నీకు ఉద్యోగమీయలేదు. అల్లా [దైవము] యిచ్చినాడు.

93. మృతి నొందిన ఆ బాలుని ఆత్మను ఆ ప్రవేశించిన నూతన తనువును పరిమార్చి, అందుండి కొనివచ్చి యీ మృత కళేబరమున జేర్చి, పునర్జీవితుని చేయగలను. కాని, ఆ నూతన తనువున చేయగల మంచి పనులను చెఱచినవాడ నగుదును.

94. ఆ మృతి నొందిన ఆమె [ఆత్మ] నన్ను జేరినది.

95. [షీర్డి నుండి] వేల మైళ్ల దూరమున మృతి నొందినను నా భక్తుని నాదఱికి ఆకర్షించు కొందును.

96. నా భక్తుడగు వానిని నేను చేడ్పడ నీయను. నాకు సమర్పితములైన వాని నన్నిటిని గూర్చి భగవానునకు నేను లెక్క చెప్పుకొందును.

97. 1918 లో తార్కాడ్ సతి, ఆమె కుమారుడు – కుమార్ తార్కాడ్ - బాబాను సందర్శించిరి.

సా. బా:- అమ్మా! ఈ రోజులలో నేను మిక్కిలి బాధింపబడు చున్నాడను. కొందఱు ధనమును, కొందఱు భార్యలను, మఱికొందరు బిడ్డలను మొదలగు వానిని కోరుదురు. ఆహా! నా దగ్గరగల దానిని కోరు వారెవ్వరు లేరు. నే నిట్లు వేచి, వేచి, ఎప్పుడో ఒకనాడు అదృశ్యుడ నగుదును. నేను మిక్కిలి విసుగు చెందితిని.

తా. సతి:- బాబా! నీ వటులేల పలికెదవు? అపుడు మా గతి ఏమి?

సా. బా:- నీకు విచార మేల? దైవము నీ యోగక్షేమము లరయుట లేదా? నా బిడ్డలు నన్ను చేరినపుడు మిక్కిలి సంతోషింతును. ఏదో రెండు మెతుకులు అదాటున భుజించి దేహపుష్టి పొందుదును.

కుమార్ తా:- బాబా! నీ దగ్గర గల దానిని కోరుటకే మేము వచ్చినది. ఆ సంగతి నీ వెరుగవా?

సా. బా:- ఎఱుగుదును. నీవు పొందుదువు.

కుమార్ తా:- సరే! మే మది విశ్వసించియే యున్నారము. కాని యెప్పుడు?

సా. బా:- మిక్కిలి త్వరలోనే.

కుమార్ తా.:- బాబా! దానిని పొందుటకు ఇంక యెన్ని పుట్టువులు నేను పొందవలయునో నీ నుండి నాకభయం కావలయును (చూ. 113)

సా. బా:- ఇంక మూడు పుట్టువులు చాలును.

కుమార్ తా.:- కాని, బాబా! యెప్పుడు నీవు మా వెంట నుండవా!

సా. బా:- అహా! ఇప్పటి కెన్ని జన్మల నుండి మీ వెంట నుంటిని? మనము మరల, మరల కలియుచుందుము. రేయింబవళ్ళు నా బిడ్డలను గూర్చి జాగ్రత్త పడవలయును. ప్రతి పైసాకు నేను భగవానునకు లెక్క చెప్పు కొనవలయును.

98. రోహిల్లాను, పిష్యాను, రావ్ సాహెబ్ గాల్వంకర్‌ను వీరల వేర్వేరుగ మాతృ గర్భముల చేర్చితిని.

99. (అకల్‌కోట సపత్నికర్‌తో) మృతి నొందిన నీ కుమారుని ఆత్మనే మరల నీ భార్య గర్భమున చేర్చితీరుదును. (సంవత్సరము లోపల అ. సపత్నికర్ నకు పుత్రుడు పుట్టెను.)

100. నా 'కాకా' ను (హ. సీ. దీక్షిత్తును) విమానమున గొని పోవుదును. (హ. సీ. దీక్షిత్తును – ఆనందముగ అనాయాసముగ తనువు విడిచెను.)

• బాబా – భగవానుని చేతిలోని ఉపకరణము •

101. భగవంతుని అనుమతి లేనిదే నే నేమియు చేయు జాలను.

102. (జి. జి. నార్కేతో) నీకు 'కుపినీ' యీయలేదని నన్ను నిందించకుము. ఆ ఫకీరు [దైవము] నా కనుమతి నీయ లేదు.

103. అహొా! నేను దక్షిణను అందఱ నడుగుదునా? ఆ ఫకీరు [దైవము] నిర్దేశించువారినే అడుగుదును. వారి వద్దనుండియే స్వీకరింతును.

నేనేమియు చేయను. దేనిని స్వీకరింపను. దత్తస్వామి తనకు చెందవలసినదే అడిగినాడు. తనకు చెందవలసిన 15 రూపాయలు

రాబట్టికొనివాడు. మసూది అయికి యిచ్చినాడు. కావున ఆ ధనము [నాచే] స్వీకరింపబడినది. [చూ. 255]

104. మార్గ మధ్యమున సులభముగ లభ్యపడునపుడు దత్తస్వామి మొదలగు దైవ మూర్తులను సందర్శింపక వచ్చిన వారికి నేనెటుల తోడ్పడ గలను.

104 ఎ. బాబా ఒక ఫలదాత మాత్రమే. నీవు మంచి చేయ వలయును.

సా. బా:- నీవు మంచిపని కావించి భగవదర్పణము చేసిన నీకు మేలు కలుగును. మంచి కావించు వారికి దైవము రక్షకుడు. మంచి వారు, పెద్దవారు నా వలన శుభములు కోరుదురా? ఎట్లు [ఎచటనుండి] నే నీయగలను? - [అనగా - శుభఫలముల ప్రసాదింపగల మంచి కర్మములు చేయని యెడల] [చూ 371]

"పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం నే చ్ఛంతి మానవాః
నపాప ఫలమిచ్ఛంతి పాపమే వా చరంతిహి."
పుణ్య ఫలము గోర బూనుదురే కాని,
పుణ్య మాచరింపబోరు జనులు!
పాపఫలము బడయ నోపరెవ్వారలు
పాపముల నొనర్ప వలతు రెల్ల!

బాబా – సహజస్థితి

[నిరాకారుడు మఱియు సాకారుడు]

105. నేను దైవమును - కేవల ఆనంద నిరాకారునిగ నన్ను ధ్యానింపుడు! అట్లుచేయ సాధ్యము కానియెడల ఈ మిరు చూచు సాయీ రూపమును వున్నది వున్నటుల ధ్యానింపుడు.

106. ఈ దేహము కాని, ఇంద్రియములు కాని, నేను కాను. వీని నన్నిటిని గమనించు సాక్షి మాత్రము నే నగుదును. నే నేమియు జేయను. నేను దేనిని స్వీకరింపను.

107. భక్తుడు:- బాబా! నీ చేతిపై కాలిన బొబ్బ పుండును చికిత్స జేయనిమ్ము. అది నిన్ను మిక్కిలిగ బాధించుచుండును గదా?

సా. బా:- ఈ (సాయిబాబా) దేహమునంతయు ఆవు పిడకల చితిపై జేర్చి కాల్చునపుడు దగ్గరజేరి చూచుట (నాకు) ఎంత వేడుకగా నుండునో!

* ఆత్మ విచారము *

108. నన్నెఱుగుటకు శ్రవణ మననములద్వారా "నే నెవడను?"- అని నిరంతరము తలంపుము. మన మెవరము? – మన మేమియై యున్నారము? నేనెక్కడ నున్నాడను? నీ వెక్కడ నున్నాడవు? ఈ విశ్వమంతయు నెక్కడనున్నది?

నీ భర్త తెలిపినదంతయు యోజింపుము! యోజింపుము! (అనగా పారమార్థికముగ నీవు దైవమునకు భిన్నముకావు.)

109. మన ఆత్మను మనమెరుగవలయును.

* భేదము అసత్యము *

110. అతడు నాకు విరోధి - యని ఎవరినిగూర్చియు పలుకకుము. ఎవడు ఎవని శత్రువు? ఎవని ఎడలను ద్వేషభావమును నీ హృదయమున జేరనీయకుము. ఈ సకలము ఏకము – అభిన్నము.

111. జనములు – తమదియని, ఇతరులదియని, పరస్పర భేదము వహింతురు - (అనగా - ఇవి తమ సంపదలని - అవి యితరుల సంపదలని) ఇది పొరపాటు. (పురందర్‌తో) నేను నీయందున్నాడను. నీవు నాయందున్నాడవు. నిన్ను నన్ను ఎడము చేయునది యీ (తెర) గోడ. ఈ గోడను కూల్చుము. అపుడు మన మొండొరుల ముఖములను స్పష్టముగా జూడగలము.

సాధువు లిట్టి భేదబుద్ధిని పాటింపరు. నన్ను సేవింపదలచిన ఈ భేదబుద్ధిని విడనాడుము. నిరంతర మీ విధమున యోచన చేయుచుండుము. అపుడు నీకు 'ఎరుక' గలుగును. శ్రుతి స్మృతి శాస్త్రాదుల పరిశోధించుము- ఆత్మ - ఏకమో - లేక అనేకమో చూడుము!

112. ఉపాసనీ మహారాజ్ :- నేనెవడను?

సా. బా:- నేనే నీవు – నీవే నేను. నీకు నాకు భేదములేదు. నేను దేనిచే కూర్చబడితినో నీవును దానిచే కూర్చబడితివి.

"అహంభవా న్న చాన్య స్త్వం – త్వమే వాహం విచక్ష్వ భో!
ననౌపశ్యంతికవయః ఛిద్రంజాతు మనాగపి" (శ్రీమద్భాగవతము)

సతారాలోని 'వాయి' గ్రామమున నారాయణ ఆశ్రమయతికి (అప్పటి పేరు - టోసర్). 1914లో బాబా అభేద బుద్ధిని ప్రసాదించినాడు. (నా.ఆ.) అతడు షిర్డి యందున్న కాలమున అభేద రూపమగు ఎఱుక - ఆనందము పొందగలిగినాడు. సూర్యోదయ కాలమున పడమట దిక్కున దృష్టిని నిలిపి తన ఛాయను వీక్షించు 'భీష్మ' అనువానికి విశ్వాత్మాను భూతిని బాబా ప్రసాదించినాడు.

మోక్షమార్గము (సంసారము)

113. నానాసాహెబ్ గోవింద చందోర్కరర్ బాబాను మ్రొక్కి -

నా.గో.చం:- బాబా! ఈ సంసారము నాకు వలదు. సకల శాస్త్రములు తెలుపునటుల సంసారము యథార్థముగ నిస్సారము, నిష్ప్రయోజనము. నా యీ సంసృతి బంధములను విచ్ఛేదము చేయుము. ఏది తొలుదొలుత సంతోషముగ గోచరించునో తుదకది దుఃఖకారణమే యగుచున్నది. విధి మనల నిక్కడ-అక్కడ మిక్కిలి చమత్కారముగ నాడించుచుండును. ఈ సంసార మందేలవమేని సుఖము నాకు కానరాదు. నేను మిక్కిలి విసుగు నొందితిని. బాబా! ఇకనే మాత్రము దీనిని తాకుటకు కాంక్షింపను.

సా. బా:- నానా! ఈ పలుకు లెంత భ్రమ జనికములు! వెఱ్ఱివి! దోషమిశ్రితమైన సత్యమందించుక కలదు. ఈ దేహమున్నంత వరకు సంసారము కూడ నుండును. ఎవరును దీనిని తప్పుకొనలేరు. నీ వెటుల తప్పుకొన గలవు? నేనుకూడ దీనిలో చిక్కుకొని యున్నాడను. (చూ. 17, 79, 119) సంసృతి పలు విధములు. అవి దేహము యొక్క పై భాగమువలె నున్నవి. కామక్రోధాదులం దొండొంటి కలయికయే సంసారము - మానసిక దైహిక కార్యకలాపమే సంసారము - ఏ రెండు

వస్తువులు చేరిన సంసారము - అడవులకు పాఱిపోయిన మాత్రమున సంసారమును తప్పుకొనలేవు. ఇప్పటి నీ యీ స్థితి నీవు తెచ్చి పెట్టుకొనినదే. దీనిని నీవు కోపించిన నేమి ప్రయోజనము?

నీ దేహ ప్రారబ్ధము నీ పురాకృత కర్మఫలము. కావున ఈ దేహము కలిగినది. జీవి పూర్వకర్మఫల మనుభవించుట కీ దేహమున చేరినాడు. నీ ప్రారబ్ధకర్మ ఫల మనుభవింపనిదే నీవు దీనినుండి విడివడజాలవు. ఎల్లరు జనులు – సకల జీవములు వేర్వేఱు రూపముల నుండును. ఏల? ఆయా జీవుల పూర్వకర్మమే కారణము. వివిధ జీవ జాతులందు, వ్యక్తులందు పరస్పర భేదము కలుగుట కదియే కారణము. ధనికుని కుక్క దూది పరుపులపై పొరలుచుండుట, పేదవాని కుక్క వీధిలో పాఱవైచిన రొట్టె ముక్కల కొఱకు పరువులెత్తుట - గమనింపుము. దాని కారణము దేహ ప్రారబ్ధము.

* సత్య సుఖము *

114. నా.గో.చం:- (ప్రశ్న) సంసారమున గలుగు సుఖదుఃఖములు మనుజుని మిక్కిలిగ కలతపెట్టు చుండును. కావున మనము సంసారమును పరిత్యజించ వలదా?

సా. బా:- (సమాధానము) సుఖ దుఃఖములు కేవలము భ్రమ జనితములు. మనకు తోచు ప్రాపంచక సుఖము సత్య సుఖము కాదు. అది సత్య సుఖముగ తోచుటచే ప్రాకృత పురుషుడు దాని వైపునకు బలవంతముగ ఆకర్షింపబడుచున్నాడు. ఆయా జీవుల ప్రారబ్ధము ననుసరించి ఒకడు షడ్రసోపేత భోజనము చేయును. ఒకడు చప్పని రొట్టె ముక్కలను, మఱియొకడు గంజినీరము నారగించును. మొదటి వాడు సకలము లభించె ననుకొనును. తక్కినవారు దారిద్ర్య మనుకొని ఖేద పడుదురు. ఇందరకు ఫలము ఆకలి తీర్చుకొనుటయే. కొందఱు జలతారు పట్టుశాలువలు తాల్తురు. మఱికొందరు నార వస్త్రముల ధరింతురు. ఈ యిరు తెగలవారు కావించునది దేహమును కప్పుకొనుటయే. ఈ సుఖము – దుఃఖము - అభిప్రాయభేదము ననుసరించి కలుగును. ఇది భ్రమ - అనర్థ మూలము. ఈసుఖము, దుఃఖమునుగూర్చిన తలంపు నీ మనస్సున పొడమెనేని దానిని నిరోధించుము. దాని కవకాశమీయరాదు. అది కేవలము భ్రమ.

కామ, క్రోధ, మోహ, మదమత్సరములు – షడ్రిపులు – భ్రమ కారణములు. అవి అసత్యమును సత్యముగ తోపజేయును. ధనికుడు సువర్ణాభరణముల దాల్చిన, పేదవాడు ఈర్ష్య వహించును. తనకును కలిగిన బాగుండునని తలంచును. ఇది లోభము.

సకలము ఈ విధముగ నుండును. కావున శ్రేయస్కాముడు ఈ ఆర్గురు శత్రువులను జయింపవలయును – అవి జయింపబడిన నిక ఆశాతరంగములు పొడమవు. లేకున్న అవి నిన్ను బానిసగ జేసికొనును. వానిని నిర్జించి నీ బుద్ధి యధీనమున వానినుంచుకొనిన యీ భ్రమ జనితములగు సుఖ దుఃఖము మొదలగునవి నిన్నధీనుని జేసికొన జాలవు. సుఖ దుఃఖాదులచే నీవు కలచబడవు.

♦ సత్య సుఖము (లేక) ఆనందము ♦

115. ముక్తి (మోక్షము) - ఒక్కటే. సత్యమగు సుఖము - ఆనందము. జనన మరణ చక్రమున భ్రమించుటే - పుట్టుట - చచ్చుటలే దుఃఖము. ఈ సంసార సంబంధములగు సుఖ దుఃఖములు అసత్యములు.

— సంసారమున ప్రవర్తింపదగు విధము —

116. సంసారమున ప్రవర్తింపదగు విధము నీ కెఱింగింతును. వివేకియగువాడు సకలము తన దేహ ప్రారబ్ధము ననుసరించి ప్రాప్తించునవి యగుటచే తనకు గల వానితో సంతోష సంతృప్తుల బడయదగును. కంటకములను (ముండ్లను) కాళ్ళతో తన్న చూడకుము.

ధనము గలిగిన అడకువ కలిగియుండుము. ఎల్ల యెడ అడకువ తగదు. క్రూరులు, దుర్మార్గులగు వారియెడ కఠినత వహింపవలసినదే. కాని, సాధులయెడ నమ్రతకలిగి యుండుము. గౌరవించుము.

దానధర్మములకు ధనము వెచ్చింపుము. మితి మీఱి వెచ్చింపదగదు. ఈ విశ్వమశ్వరమే - సందేహములేదు. కాని, ప్రపంచ ముండునంతవరకు దేహమునకు పైత్యరసమువలె మనుష్యులకు ధనమవసరమే. ధన గర్వమున తొందరపాటు తగదు. ధనమునకు లోగకుము. లుబ్ధత్వము తగదు. ఉదారబుద్ధి కలిగియుండుము. కాని, అతివ్యయము, దుర్వ్యయము కూడదు.

నీ విధ్యుక్తములగు లౌకిక కార్యములందు ఉత్సాహముతో పాల్గొనుము. కాని, దైవమును మాత్రమే సమయమున మఱువరాదు. దైవమును ఎల్లవేళల జ్ఞప్తి యందుంచుకొనుము. నీవు మేల్కొనియుండు నంతవరకు "ఈ సంసారము భగవానునిది కాని, నాది కాదు" అనియే తలచుచుండుము. పేదల దీనులయందు దయగలిగి యుండుము. వారలను చీదరించి నిరాదరింపకుము. "నేనెవడను?" అని యెల్లవేళల విచారము చేసికొనుము.

♦ భక్తి [నవవిధభక్తి] ♦

117. అనంతరావ్ పటాన్‌కర్ :- బాబా! నేను పెక్కుశాస్త్రిదులను చదివితిని. కాని నాకు మనశ్శాంతిలేదు. నన్ను ఆశీర్వదించి యనుగ్రహింప నిన్ను వేడుచున్నాడను.

సా. బా:- ఒక సమయమున నొక వర్తకుడిక్కడకు వచ్చెను. వాని యెదుట నొక పశువు తొమ్మిది పేడ పెంటికలను వేసెను. అతడు తన అన్వేషణ సిద్ధికొఱకు దాని తోకదగ్గఱ వస్త్రము పఱచి ఆ తొమ్మిది పెంటికలను తీసికొని వెళ్ళెను. వాని కేకాగ్రత - మనశ్శాంతి లభించెను.

అ. రా. ప:- (ఈ నీతి కథ యందలి భావము గ్రహింపలేక తరువాత దాదాకేల్కారుతో) బాబా అభిప్రాయమేమి?

దా. కే:- దైవకరుణ - ఆ పశువు. అది విసర్జించిన తొమ్మిది పేడ పెంటికలు - నవవిధ భక్తులు. నీవావర్తకుని స్థానము నందుండవలయును. నీవా నవవిధ భక్తులను అనుసరించితివా మనశ్శాంతిని పడయగలవు.

(మరల అనంతరావు బాబాను సమీపించెను.)

సా. బా:- నీవా తొమ్మిది పేడ పెంటికలను ప్రోగుచేసి కొంటివా?

అ. రా. ప:- బాబా! దానికిని నీ కరుణ ప్రసాదింప బడవలయును.

సా. బా:- దైవము నిన్ను నుగ్రహించును.

♦ జ్ఞానము—భక్తి ♦

118. సా. బా:- జ్ఞానమార్గము - రామాఫలము వంటిది. భక్తి సీతాఫలము వంటిదె. ఇది సులువుగ లభ్యమగును. మిక్కిలి మధురముగ నుండును. రామాఫలము గుజ్జు లోపల నుండును. దానిని పొందుట కష్టము.

రామాఫలము చెట్టున పండవలయును. దానిని కోసి కొనవలె. అది క్రిందపడెనా చెడిపోవును. కావున జ్ఞానమార్గగామి పతనమొందెనా వాడు చెడును. ఏ స్వల్పమగు అజాగ్రత - అశ్రద్ధ వలన వానికి పతన ప్రమాదము కలదు.

* ఆత్మ విచారము (జ్ఞానము) [1] *

119. [ప్రశ్న] బాబా! నీవెవరవు? ఎందున్నావు?

[సమాధానము] సా. బా:- [నిర్గుణతత్త్వమున] నాకు నెలవు లేదు. నేను నిరాకారుడను. కేవలుడను. నిర్గుణుడను. [సగుణతత్త్వమున] కర్మకారణమున బద్ధుడనై ఒక దేహమున జేరితిని. నా పేరు 'దేహి', ఈ ప్రపంచము నా నివాసము. బ్రహ్మము నా తండ్రి. మాయ నా తల్లి. వారి సంయోగమున నేనీ దేహమును పొందితిని. ఈ విశ్వమశాశ్వతము. పరిణామము (మార్పు) పొందునది.

(అప్పాకులకర్ణితో) అల్లా - ఆ నిర్గుణ పరబ్రహ్మము 'నివాస్' అను పురమున సగుణ పరబ్రహ్మమై, 'మోహినీరాజు' అని పిలువబడుచున్నాడు. అచటకువెళ్ళి ఆ స్వామికి మ్రొక్కుము. భగవానుడు తన భక్తుల నను గ్రహించుటకు సకల శక్తులను ప్రకటించును. (చూ. 145)

నేనెవడను? మన మెవరము? (2)

120. బాబా తఱచుగ పలుకువాడు – 'మన మెవరము? – అని, దీనిని గూర్చి రేయింబవళ్ళు తలచుచుండుము!

ఆర్. ఎ. తార్కాడ్ – 1915 ప్రాంతమున బొంబాయిలోని ఒక యంత్రము [మిల్లు] యొక్క కార్యనిర్వాహక భాగస్వామి. షిర్డికి వచ్చుచు 'మన్మాడ్' స్టేషన్ దగ్గఱ చీకటిలో నొకరైలు పెట్టెలోనికెక్కి స్థలము కొఱకు ఒక పోలీసు ఉద్యోగితో తగవులాడెను. తార్కాడ్ షిర్డికిజేరి బాబాకు మ్రొక్కెను.

సా. బా:- ఈ ఉదయము ఎవరుతో వాదించుచు తగవులాడు చుంటివి? భావ్ [సోదరా!] అట్టి జనులతో మనమెప్పుడు తగవులాడరాదు. మనమెవరము? – అని విచారణచేసి కొనవలయును.

తార్కాడ్ తొలుత బాబా తెలిపిన అంశము. సాంఘిక సమరస సమత్వభావము పెంపొందించుకొనవలెనని తలంచెను. ఆ తరువాత (వాదోపవాదములు చేయువారు) 'ఈ ఉభయులు ఆధ్యాత్మికముగ ఏకమే కాని భిన్నులుకారు' అని గ్రహించినాడు. "త్వయిమయి సర్వత్రైకోవిష్ణుః వ్యర్థంకుప్యసిమయ్యసహిష్ణుః" (శంకర భగవత్పాదులు).

(3) సా. బా:- బాలభావ్‌తో - (సీతారాందేవ్) మన మెఱుగవలసినది మన 'ఆత్మ' మాత్రమే.

(4) 121. (1917 అక్టోబరులో ఒక బొంబాయి కాంతతో)

సా. బా:- అమ్మా! నీకేమి కావలయును? దానిని కోరుకొనుము.

బొం. కాంత:- బాబా! ఈ జనన, మరణముల సుడినుండి నన్ను విడిపింపుము.

సా. బా:- (నవ్వుచు) నీకు కావలసినదంతయు ఇదియేనా? ఏమి? మరణించుటకు వచ్చితివా!

బొం. కాంత:- (చకితయై) బాబా! నీ పలుకులు నాకే మాత్రము బోధపడలేదు.

సా. బా:- నీ వెవరవో ఆలోచించుకొనుము!

బొం. కాంత:- నేను గ్రహింపజాలకున్నాను.

సా. బా:- (ఆమె భర్తవైపు చూపుచు) ఈతడు నీకు దెలుపును.

(ఆ తరువాత ఆమె భర్తతోడ విడిదికి చేరి బాబా అభిప్రాయమేమి? అని ప్రశ్నించెను.)

భర్త :- బాబా పలుకులు నిగూఢములు, ఆశ్చర్యకరములు. బాబా అభిప్రాయము నేను గ్రహించినని నమ్మకములేదు. బహుశః బాబా అభిప్రాయమిదియై యుండవచ్చును.

దైవ (ఆత్మ) సాక్షాత్కార ప్రాప్తికలుగు వరకే జీవి పెక్కుమారులు జనన, మరణములు పొందుచునే యుండును. బాబా – భగవానుడు.

కాని, జనులు, బాబాను చూచియు గాఢవిశ్వాసము వహించి 'బాబా దైవము' అని గ్రహింపజాలరు. కావున వారికి ముక్తిలేదు.

శాస్త్రానుసారముగ – పారమార్థికముగ జీవుడు – శివుడు ఏకము. నీవు 'నేను జీవిని' – అని తలంచుచున్నావు – కాదా?

బొం. కాంత:- అవును.

భర్త :- శాస్త్రములు – నీవు శివుడవు [దైవమవు] అని తలంపుమని పలుకుచున్నవి.

బొం. కాం:- కాదు – కాదు. నే నొక పాపిని. ఒక జీవిని కాని, ఆ మహాశివుడను కాను.

భర్త :- నిజమే! అది నీ తలంపు. కాని బాబా అభిప్రాయము – నీవు నిరంతరము. "నేను ఆత్మను – దైవము" అని భావించుకొలది నీ యందు గాఢముగ పాదుకొనిన 'నే నొక అల్పజీవిని అను బుద్ధి తొలగును. ఇట్టి భావన పెంపొందిన కొలది పెక్కు జన్మలు గడిచిన పిదప, సాధు సత్పురుషుల సాంగత్యమున వారి అనుగ్రహమున నీవు బ్రహ్మమవు – అను ఎఱుక ప్రాప్తించును అని బాబా అభిప్రాయమై యుండును. (ఆ దంపతులు తరువాత ద్వారకామాయి జేరిరి).

సా. బా:- అమ్మా! నే నిక్కడ నుండియే నీ భర్త నీకు తెలిపిన దంతయు వినినాను. దానిని నీ మనస్సున భద్రపరచుకొనుము!

* దైవ మెవరు! (5) *

122. (నానాసాహెబ్ గోవిందచందోర్కర్ – బాబాతో)

౧. దైవ మెవరు? ౨. అతడెట్లుండును? ౩. అతడెక్కడ నున్నాడు? ౪. మన మా దైవము నెట్లు చూడగలము?

సా. బా:- నేను నీకు తరువాత చెప్పెదను. (ఒక సమయమున)

సా. బా:- బద్ధులు:- (లౌకిక విషయలంపటులు) మంచి చెడు యెఱుగరు. ఎఱుగుటకు ప్రయత్నింపరు. దైవ మెవరో యెరుగరు. నైతిక పరివర్తనమైనను పాటింపరు.

నిరంతరము లౌకిక విషయముల మునిగి [హృదయ మాలిన్యము కలిగి] శాస్త్రములందు - సాధు సత్పురుషులందు విశ్వాసములేక వారు దైవమును జేరనేరక దుర్గతి గాంతురు. [నరకమును పొందుదురు].

ముముక్షువులు - [పైన దెలిపిన] బద్ధ స్థితికి విసుగునొంది విచారము-వివేకము వైపునకు దృష్టి మరల్చి భగవంతుని దర్శింపవలయునను 'పిపాస' గలిగి యుందురు. వారు దైవ భక్తి సలుపుచు నైతిక ప్రవర్తనము గలిగి యుందురు.

వారు 'సాధకులు' సాధన లభ్యసింతురు, ధ్యానము సలుపుచు, విషయముల నుండి యింద్రియములను మరల్చి, జనుల కూటములందాసక్తి కనక ఏకాంతవాసము సలుపుదురు. వారు సాధు సత్పురుషుల సాంగత్యమును ప్రేమింతురు.

వీరు సాధనలందు పరిపూర్ణులైన పిదప 'సిద్ధులు' - అనబడుదురు. అట్టి స్థితియందు దైవమే మానవుడుగ పరిణమించును. వాట్టివానికి నిందా - స్తుతులు సమానములు. వారికి కోరిక లుండవు. వారికి దేహాత్మ బుద్ధి - దేహమే తానను బుద్ధి - యుండదు. వారి ఆత్మ - పరమాత్మలో నైక్యము పొందును. 'బ్రహ్మాఽస్మి' భావము పొందుదురు.

దైవము నెరుంగుటకు, ఈ మూడు స్థితులందు దైవ మెట్లుగ పరిగణింపబడుచున్నాడో గమనింపుము. పర్యవసానమున చేతనాఽచేతనము లందన్ని రూపముల దైవము చూడబడుచున్నాడు.

భగవానుడంతట గలడు. దైవము లేని స్థానము విశ్వమునందెందును లేదు. ఈ సకలమునం దావరించియున్న ఈశ్వరుని, కనుగొని గుర్తింపనీయని 'మాయా' ప్రభావమును చూడుము! నేను నీవు - ఈ విశ్వమున సకలము (ఈశ్వరుని) అంశయై యున్నారము - ఆ మహాప్రభువులోని భాగములము. కావున నెవరు నితరులను ద్వేషింపరాదు. దైవమెల్లడల గలడను విషయమును మరువకుము. ఈ కారణమున 'ప్రేమ' [అద్వేషము] స్వయముగ నంతట గలదు. అది బహిర్గతమైన సకలము సిద్ధించును.

◆ మనము దైవము నెట్లు చూడ గలము? ◆

123. మనస్సు చంచలము. దానిని స్థిరము చేయుటకు ప్రయత్న మవసరము. ఈగ అటునిటు ఎగురుచు ఎల్ల వస్తువులపై వ్రాలి కూర్చుండును. నిప్పును దాసిన క్షణమున అది దూరదూరముగ తొలగి పోవును. ఆ విధముగ మనస్సు విషయములను కోరును. వానితో ఆనందించును. వానియందు లీన మొందును. అది బ్రహ్మమును చూచిన, చూడ ప్రయత్నించి నపుడు పెడ ముఖము పెట్టి పారిపోవును. అధీనము కాని - లొంగని ఆ మనస్సు బ్రహ్మము [దైవము] నందు లయమొందని యంతవఱకు జనన, మరణాత్మక సంసారము అనివార్యము. మనస్సు నిగ్రహింప బడనియంత ధనుక జీవి పుట్టవలసినదే. కాని, జన్మములలో మనుష్య జన్మము అమూల్యమైనది [గొప్ప విలువకలది]. కావున మూర్తిపూజ కావింపుము. అనగా దైవము యొక్క సగుణ రూపములను- విగ్రహములను- పటములను [మనస్సును నిలిపి కేంద్రీకరించుటకు] పూజించి, సేవింపుము: ఆ విగ్రహము - పటము సైతము దైవమే - పరమేశ్వరుడే. విగ్రహములను త్రోసి వేయకుము. దైవవిగ్రహములను గాఢ భక్తితో పూజించుచున్న మనస్సు ఏకాగ్రత వహించును. అది కలుగదేని మనస్సు స్థిరము కాదు.

ఆ పిదప మననము - ధ్యానము నభ్యసింపుము. ఆధ్యాత్మిక గ్రంథములను పఠింపుము. అందు దెలుపబడిన అంశములను పాటించి, అభ్యసింపుము. అన్ని విద్యల కంటె 'ఆత్మవిద్య' ఉత్తమోత్తమము. దాని యందు నీవు పరిపూర్ణత గడించిన ముక్తి (మోక్షము)- సుగమము.. అప్పుడు హరి - నీ యిష్టదైవము (వశవర్తి) నీ సేవకుడగును.

అట్టి బ్రహ్మవిద్య బడసి తద్వారా మోక్షము పడయుటకు బ్రహ్మజ్ఞుడ వగుటకు సులభోపాయములు.

◆ మోక్షము పడయుట యెట్లు ◆

సాధన చతుష్టయము - 4 విధములగు సాధనముల గడింపవలెను.

1. నిత్యాఽనిత్య వస్తువివేకము — ఈ విశ్వమున సత్యము [స్థిరము] ఏది? అసత్యము [అస్థిరము] ఏది? అను ఎఱుక.

2. వైరాగ్యము – లౌకిక విషయములందు విరక్తి.

3. శమ దమది గుణ సంపత్తి – మనోనిగ్రహము – ఇంద్రియ నిగ్రహము – ముముక్షుత్వము (మోక్షము పొందవలయునను ఇచ్ఛ).

4. నవవిధ భక్తి అభ్యసింప వలయును. భగవానునకు ఆత్మ నివేదనము (ప్రపత్తి) కావింపవలయును.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్"

ఇందు తొమ్మిది విధములగు భక్తులు తెలుపబడినవి.

౧. శ్రవణము :- పవిత్ర గ్రంథములు – భగవంతుని – సాధు సత్పురుషుల లీలలను దెలుపు గ్రంథములు చదువుట – వినుట.

౨. కీర్తనము :- భగవానుని నామ లీలాదులను కీర్తించుట.

౩. స్మరణము :- దైవమును స్మరించుట.

౪. పాద సేవనము:- భగవంతుని పాదముల మ్రొక్కుట-సేవించుట.

౫. అర్చనము :- భగవానుని రూపచిహ్నములను పూజించుట.

౬. వందనము :- దైవమునకు, దైవసములగు సాధు సత్పురుషులకు మ్రొక్కుట.

౭. దాస్యము :- దైవమునకు, తత్సములగు సాధు సత్పురుషులకు సేవలు సలుపుట.

౮. సఖ్యము :- సాధు సత్పురుషులతో సాంగత్యము కలిగియుండుట.

౯. ఆత్మ నివేదనము :- సంపూర్ణ శరణాగతి (ప్రపత్తి) చేయుట.

నిత్యము సిద్ధ సత్పురుషులను సందర్శింపుము. చక్కని నైతిక ప్రవర్తనము కలిగి యుండుము. అపుడు దేహావసాన సమయమునను పవిత్రుడవగుదువు. అవసాన కాలమున ఏ విధమైన కోరికలు కలిగి

యుండకుము. ఇష్టదైవమునందు మనస్సు నిలుపుము. నీ మనస్సు నీ యిష్టదైవమునందు లయించి యున్నపుడు స్మృతి గలిగిన నీవు ముక్తుడ వగుదువు.

• దైవమును పొందుట–విధానము (6) •

124. నా. గో. చం:- బాబా! నిన్ను మరల మూడవ మారు ప్రశ్నించు చున్నాడను. దైవ మెవరు? ఆత డెట్లుండును? ఆత డెక్కడ నుండును?

సా. బా:- నే నిదివరకే తెలిపితిని. నేను తెలిపిన విధమున ప్రవర్తింతువేని సాధన చతుష్టయము – నాలుగు విధములగు సాధనలు నీకు తోడ్పడును.

1. వివేకము (మొదటి సహాయము)

నా. గో. చం:- అవి యేవి?

సా. బా:- మొదటిది నిత్య – అనిత్య వస్తు వివేకము. అనగా – సత్యము నిత్యమైన వస్తువేదో – అసత్యము – అనిత్యము అయిన వస్తువేదో – విభజించి తెలిసికొనుట. కొందఱు జనులు తాము వివేకులమని యితరుల నమ్మింప జూతురు. యథార్థముగ 'హరి' ఎవరో, యెక్కడ ఎట్లుండునో యెఱుగని వారయ్యు తాము 'వార్కారులు'– పండరి యాత్రికుల మని లోకులను నమ్మింప జూతురు. కాని యిట్టి తీర్థ యాత్రిక విధానము నిజమైన భక్తికాదు. ఇతరుల వలన గౌరవము - మన్ననలు పడయుటకు ఒక యెత్తుగడ మాత్రమే.

మనుష్యులు కొందఱు వారి హృదయములను నిర్మలములు గావించు కొనకయే పెక్కు గ్రంథములను పఠించి వల్లించి, సభలయందు తమ వాచాప్రాగల్భ్యముల బ్రకటించుకొనుచు, ఇతరులను తూలనాడుచు, స్వాత్మస్తుతులను గావించుకొనుచుందురు: వారు వివేకులుకారు. బ్రహ్మ జ్ఞానమును బడయజాలరు.

2. వైరాగ్యము (రెండవ సహాయము)

నిక్కమగు విరాగి యీ లోకమున, పరలోకమునగల యే వస్తువునేనియు లెక్క చేయడు.

బాబా వైరాగ్యము. (1) 'దామియా రసానే' తాను చేయబోవు వ్యాపారమున వచ్చు లాభములో బాబాకు భాగమిత్తునని పలుకగా-

సా. బా:- నేను దేనిలోను సంబంధము లేనివాడను.

(2) మద్రాసు స్వామికి బాబా కావించిన బోధ-

సా. బా:- (విజయానంద స్వామితో) నీ తల్లిపై నీ కంత ప్రేమయున్న నీవీ సన్యాసి వేషము (కాషాయ వస్త్రధారణము) ఏల వేసితివి? 'కాషాయము - మమత' రెండును కలియవు. వెళ్లుము. నీ విడిది యందుడుము; అచట దొంగలున్నారు. నీ సర్వస్వము దోచుకొని పోదురు. గడియవైచి నీ జాగ్రత యందుండుము. జరుగ నున్నది జరిగి తీరును.

ధనము - బంధు మిత్రులు సకలము అనిత్యములు. భయాస్పదములు. సంపూర్ణ పరిత్యాగమే ఆనందమును ప్రసాదించును. మనస్సును నిలిపి భాగవత సప్తాహము ముమ్మారు గావింపుము. సకల వాసనలు దానితో క్షయించును. భ్రాంతి అంతరించును - ఆ విజయానంద స్వామి అటుల కావించి 22వ దినమున పరీక్షిత్తువలె పరమపద మొందెను.

3. శమదమాదులు (మూడవ సహాయము)

శమము :- మనస్సును విషయముల నుండి మరలించుట.

దమము :- బాహ్యేంద్రియ నిగ్రహము ద్వారా అంతర్ముఖమైన మనస్సును వెలికి పోనీయక నిలుపుట.

తితిక్ష :- ప్రారబ్ధ కర్మఫలముగ ప్రాప్తమగు అధివ్యాధి బాధలను సహించుట.

ఉపరతి :- సంపదలు - కాంతలు - సంతానము - మిత్రులు మొదలగునవి అనిత్యములుగ గుర్తించి మాయా బంధముల నుండి తప్పుకొనుట.

శ్రద్ధ :- విశ్వాసము. (మనస్సునందు గాఢమగు నమ్మకము).

సమాధానము :- సుఖదుఃఖాది ద్వంద్వములను నిశ్చల మనస్సుతో సమదృష్టితో సహించుట.

4. ముముక్షుత్వము (నాల్గవ సహాయము)

(మోక్షము – అన నేమి? దానిని పొందుట యెట్లు?)

దనిష్ఠము వహించి అపరోక్ష జ్ఞానము – బ్రహ్మము నెరుగుటయే కర్తవ్యమని మోక్షమునందు మిక్కిలి ఆసక్తి కలిగి యుండుట. మోక్షము ఆకాశమున – కైలాసమున-వైకుంఠమున లేదు. అది సూక్ష్మము. స్థూలము కాదు. అది అదృశ్యమగు విశ్వమూల కారణము. శుద్ధ చైతన్యము, శుద్ధ చైతన్యము పొందుట–శుద్ధ చైతన్య మగుటయే మోక్షము. అది అమృతత్వము. అది మానవ జీవితమునకు గమ్య స్థానము. తక్కిన ఊహలు – ఆలోచన లన్నియు నిష్ప్రయోజనములు.

125. నా.గో.చం:- బాబా! శుద్ధ చైతన్యమననేమో వివరింపుము.

సా. బా:- అది అఖిల విశ్వమునకు మూల కారణము. తదంతర్గత సారము – ఆధారము నగును. సృష్టి స్థితి లయముల కది ఏకైక పదము. అది మనకు తెలిసియు తెలియబడక యుండును. శుద్ధ చైతన్యము విధమిది-యని పలుక నలవి కాదు. కాని, ప్రతి క్షణమున నీ యునికి యందది ద్యోతక మగుచుండును. అదిలేని తావులేదు. దానికి రూపములేదు. నామములేదు. అది ఆకారములేని వాయువును పోలియుండును. దాని యునికి విషయమున సందేహములేదు. శుద్ధ చైతన్యమే బ్రహ్మము – అనబడును. బుద్ధిమంతులు దానిని "బ్రహ్మము" అను పేర నుపాసింతురు. అట్లగుటవారు "బ్రహ్మవిదులు" అనబడుచున్నారు. తరు జంతు మానవాది సకల జీవములు దానియందేయున్నవి. కనుటకు, తాకుటకు, ఎఱుగుటకు అది మూలకారణము. అనేకములకిది ఏకైక మూలము. అది సకలమున వ్యాపించియున్నది. అది సత్ చిత్ ఆనందము (సచ్చిదానందము) సత్యము– జ్ఞానము– ఆనందము– ఏకము అగుచున్నది. మనమందరము అదియే. దానినుండి మనము వేఱుగలేము

నా. గో. చం:- బాబా! బ్రహ్మము – ఆనందమనినాడవు. ఏ విధమైన బాధలు లేనిదని, ఏకమని (పెక్కులులేవని) పలికితివి – ఈ విశ్వమున సకలము ప్రతి వస్తువు బ్రహ్మము – అనినాడవు. ఈ ప్రపంచమున అనేకత్వమే కాదు – బాధలు కానవచ్చు చున్నవికద! అట్టియెడ ఆనందము

బాధలు, కష్టములు పొందుచున్నట్లు గోచరించుట యెట్లు పొసగును? సత్యమైనది అసత్యముగ నెట్లు పొలుచును? మనలో ప్రతి మానవుడు తాను బ్రహ్మము - చైతన్యము అని గుర్తించునేని అపుడు పలువురు బ్రహ్మము లుండవలదా? అదియుగాక మన మందఱమొకే బ్రహ్మమగుదుమేని ఒకడు పొందు బాధలు, కష్టములు అందరు పొందవలయును గదా! అటుల పొందుటలేదు. మన దేహము లెట్లు భిన్నములో ఆత్మలు గూడ భిన్నములై యుండవలయునేకాని, ఏకము కాదు. అనుగ్రహించి యీ సందేహమును వారింప గోరెద.

సా. బా:- నీవు పొరపడుచున్నాడవు. ఎరుపు, నలుపు, తెలుపు, నీలము, పసుపు మొదలగు పలువిధములైన రంగులు కలవు. వానిని వేలువేలు నీళ్ళలో కలుపుము. రంగులు చేరియున్నను నీరు పూర్వము నీరేకదా! నీటినుండి ఆ రంగులను దూరముచేసిన నీవది గుర్తింపగలవు. అనగా ప్రతిపాత్రనుండి నీవు తీయునది నీరే. ఆ విధముగానే ఆత్మ లేక బ్రహ్మము ఒకటే. అది ఆక్రమించు హృదయములు వివిధములు. సకల భూత హృదయములందు అధివసించియున్న ఆత్మ ఒక్కటే సుఖ, దుఃఖాదు లనినవో అవి బ్రహ్మము లేక ఆత్మయొక్క కార్యములు కావు. అవి హృదయముల పనులు, హృదయ హృదిత్వము కలిగించుటే బ్రహ్మము లేక ఆత్మ యొక్క పని అనగా,ఆత్మ సన్నిధి మాత్రముననే హృది హృదయత్వ మొందును.

ఈ విషయము విపులముగ వివరింతును. ఈ శుద్ధ చైతన్యము త్రిగుణముల ద్వారా ముప్విధముల విభజింప దగును. అవి (1) పారమార్థిక సత్యము. (2) వ్యావహారిక సత్యము. (3) ప్రాతిభాసిక సత్యము. అని; దేహమునకు బాల్య, యౌవన, వార్ధక్యము లను మూడు స్థితులున్నట్లు ఈ సత్యమునకు మూడు స్థితులు గలవు. పారమార్థిక స్థితియందున్న వాడు (సత్పురుషుడు). ఆ సత్యమును సత్యముగ భేద రహితముగ చూచును. శాస్త్రాను గుణముగ సకలము ఆచరించును. 'వ్యావహారిక స్థితి' యందున్నవాడు (మంచివాడు) శాస్త్ర బోధల ననుసరించును. కాని, ప్రతి పదమున భేదము పాటించుచు, మంచిని మాత్రము స్వీకరించుచు చెడును త్రోసివేయు చుండును. ఇక 'ప్రాతిభాసిక స్థితి' యందున్న వాడు (మూఢుడు) సత్యమును యథార్థముగ గాని వున్నది వున్నట్లుగాని

చూడక భేదమును తారుమారుగ గాంచును. (అనగా మంచిని చెడుగ, చెడ్డను మంచిగ చూచును.) వ్యావహారిక స్థితిలోని వానికి వ్యతిరేకముగ పాటించును. కాని, ఆత్మ – బ్రహ్మము. ఈ ముగ్వుర స్థితియందు సమానమే.

మఱియొక ఉదాహరణము తెలుపుదును. 1. రాజు, 2. రాజప్రతినిధి, 3. రాజదూత – కలరు. ఈ ముగ్వుర సమానాంశ మొకటి వర్తించుట గనునింపుము. అది 'రాచఱికము' కాని యీ ముగ్వురు భిన్నులు. ఆ విధముగ బ్రహ్మము పై ముగ్వుఱ స్థితియందు పఱగుచు భిన్నముగ గోచరించును.

నా. గో. చం:- రాచరికము, (సార్వభౌమత్వము) ఎట్లు విభజింప నగును? అది భేదింపరానిది గదా?

సా. బా:- అవును. సార్వభౌమత్వమేకము. అవిభాజ్యము. కాని, ఆ రాచరికమును పై మువ్వురు అంశముల గనుచున్నారము. ఆ ముగ్వుర భేదము గమనించుచున్నారము. ఆ విధముగనే చైతన్యము (బ్రహ్మము) అనంతము అపారము కాని, పరిమితమైన ప్రతి జీవాత్మ (అహమ్) దాని దాని శక్తికొలది పంచుకొని ఆ చైతన్యమును – ఆ రాచఱికమును ప్రకటించు చున్నది. మఱియొక దృష్టాంతము గమనింపుము. 'ఆకాశము' ఇది అనంతము-అపారము. ఒక ఘటము (కుండ) నందు చేరి 'ఘటాకాశము' అనియు, కుంభము (బాన) నందు జేరి 'కుంభాకాశ' మనియు, ఈ విధముగ వేర్వేరు నామముల వ్యవహరింపబడు చున్నది. ఇవన్నియు పరిమాణము - తర తమ భేదముల ననుసరించి ఆకాశమును గలిగి యున్నవి. ఆ విధముగ బ్రహ్మము ఈ ప్రపంచమున వివిధ రూపముల గోచరించును. ఇది మాయా ప్రభావము (క్రీడ) బ్రహ్మము-మాయ యొక్క కలయికయే ఈ విశ్వము - బ్రహ్మాండము యొక్క కారణము.

126. నా. గో. చం:- ఈ మాయ యెవరు? ఆమె నెవరు సృష్టించిరి? ఆమె యెట్లుండును? నీ వింతకుముందు ఈ విశ్వ సృష్టికి మూల కారణము - (చైతన్యము) అని తెలిపితివి. అట్టియెడ ఈ మాయ యెందుండి చేరును.

సా. బా:- ఆమె యెక్కడ ఎట్లుచేరునో వివరింతును. చైతన్యమును వివిధ రూపముల గోచరింపజేయు ఆ చైతన్యము యొక్క శక్తికి 'మాయ' అను పేరు నిర్దేశింపబడినది. చైతన్యమును దాని శక్తి నుండి వేర్పరుప గలవా? నీకు సాధ్యముకాదు. గుడమును (బెల్లమును) మధురత్వము (తీపి) నుండి, సూర్యుని కాంతినుండి వేర్పరుప జాలవుకదా! బ్రహ్మము నందు లయ మొందినపుడే 'మాయ' విడివడును. (మాయ అంతమగుటయే బ్రహ్మము నుండి విడివడుట). చైతన్య మెరుగబడిన మాయ అంతమగును. చైతన్యము అనంతము. చైతన్యము - మాయ. ఈ రెండు అనాదులు. మాయా చైతన్యములు - ప్రకృతి పురుషులు అను నామమున వ్యవహరింపబడు చున్నవి. జ్ఞానేశ్వరియందు వీనిని గూర్చి విపులముగ వివరింపబడినది. దానిని అధ్యయనము చేయుదువేని ఆత్మజ్ఞానము పడయగలవు.

చైతన్య మొక గుహ, ఆ గుహను చొచ్చినవాడు తిరిగిరాడు. ఆ గుహయే అగుచున్నాడు.

మాయ కార్యమగును. చిత్రవిచిత్ర గుణములు కలది. నేనట్టివాడను- ఇట్టివాడను. నీ వట్టివాడవు - ఇట్టివాడవు అని తోపజేయుట మాయయొక్కపని. ఇవన్నియు అసత్యములైన భేదములు. నీవు మాయ అధీనమున నున్నంతవరకు [అభేదము] సత్యము నీకు బోధపడదు. మాయ ద్వివిధ శక్తులు కలది.
1. 'ఆవరణ శక్తి' దీనిచే ఆత్మజ్ఞానమును - ఆత్మను కప్పిపుచ్చును.
2. 'విక్షేప శక్తి' అటుల కప్పిపుచ్చిన దానిపైన (ఆ కప్పుపైన) కల్పనా చాతుర్యమున ఆరోపితములను [భ్రమలను] కన్పింప జేయును. ఈ దృష్టాంతము గమనింపుము.

ఒక కష్టజీవి తాను రాజు అయినట్లు కలగనును. అపుడు వాడు తన కష్టజీవనమును మఱచును. ఆ కష్టజీవన స్థితి మాయ యొక్క ఆవరణ శక్తిచే కప్పబడినది. ఆ కప్పుపైన రాచరికము - ఆ మాయ యొక్క విక్షేపశక్తిచే తోపజేయబడినది. ఆ విధముగ మాయ బ్రహ్మమును [ఆత్మను] కప్పి, దానిపైన ప్రాపంచిక రూపములను కనబడజేయును. వాస్తవముగ ఈ ప్రపంచము లేనిదే - ఉన్నది ఒక సత్యవస్తువు - ఆత్మ [లేక] బ్రహ్మము - మాత్రమే. కాని, యీ దృశ్యములు సత్యములని భావింపడు చున్నవి. అదియే మోసము, [లేక] భ్రాంతి. కావున ఈ

మాయను త్రోసి పుచ్చి, బ్రహ్మమును తిరిగి పడయుము. ఎట్లు? నిన్ను నీవు శుద్ధ చైతన్యముగ భావింపుము. జలమునందు గల కల్మషము తొలగింప బడెనేని అది స్వచ్ఛజలమే యగును. ఆ విధముగ ఈ దృశ్య ప్రపంచము నుండి మాయా కల్మషమును తొలగింపుము – అపుడా దృశ్యము సత్యమే యగును. ఇది సద్వస్తువుయొక్క ఉపాసనమగును (సత్యోపాసనమగును.) దీనిని గూర్చి నిరంతరము తలంచుము. ఎల్లరకు నేను చేయుబోధ యిదియే. ఈ సద్వస్తువు ఆత్మనుగూర్చి నిరంతరధ్యానమే ఆధ్యాత్మము. నీవు ఆత్మగా నిన్ను తెలిసికొని యీ పుట్టువుననే ముక్తుడవు కావలయును.

5. దైవము నెఱుగుట – సాక్షాత్కారము, దైవమెవరు?

(సాక్షాత్కారము :- భగవంతుని గూర్చిన అభిప్రాయములు, భగవత్సాక్షాత్కారమును గూర్చిన తలంపులు వివిధములు. భగవానుడు నిరాకారుడు కాడని, సాకారుడైన వాడని విశ్వసించు వారికి అట్టి రూపమును సందర్శించుటయే సాక్షాత్కారము. ఆధ్యాత్మిక నిశ్రేణి (నిచ్చెన) యందలి తుదిమెట్టు. దైవముగ భావింపబడు రూపములను విశ్వసింపక దైవము నిరాకారుడని తలంచువారికి తమ ప్రత్యగాత్మ – పరమాత్మయందు లయము పొందుటయే సాక్షాత్కారముగ భావింపబడు చున్నది. (జీవాత్మ పరమాత్మ యందు లయమగుట.)

(దాస్‌గాణూ మహారాజు రెండవ తరగతి వారికి చెందడు. మొదటి తరగతికి చెందినవాడే. అతడు పండరి వార్కారుల కోవకు చేరినవాడు. కటిన్యస్త హస్తుడైన పాండురంగడే అయన సృష్టియందు పరతత్త్వమైన దైవము.) (శ్రీ బి. వి. యస్. స్వామి.)

127. దాస్. గాణూ :- (బాబాతో) బాబా! నాకు సాక్షాత్కారము కావలయును. నీవు భాగవత సప్తాహము కావింపు మంటివి. దాని ఫలితముగ సాక్షాత్కారము ప్రసాదింతువా?

సా.బా:- విఠల్ సాక్షాత్కరించును. కాని గాఢభక్తిభావము అవసరము.

(దా. గా. భగవత సప్తాహము కావించెను. కాని సాక్షాత్కార ప్రాప్తి కలుగలేదు.)

దా. గా:- (బాబాతో) బాబా! నీవు సాక్షాత్కారము వాగ్దానము చేసితివి. కాని తత్ప్రాప్తి నాకు కలుగలేదు.

6)

సా. బా:- నిదానింపుము - దానిని పొందుదువు.

(బాబా- దాస్‌గాణునందు తగిన విశ్వాసము పెంపొందుటకు- తీవ్రమగు ఆసక్తి కలుగుటకు వేచియున్నాడు)

128. 1916 భాద్రపదమందు దాస్‌గాణూ పండరీకి వెళ్ళవలయునని తీవ్రాసక్తితో నుండెను. కాని నా.గో.చం. అతనిని షిర్డీకి గొనిపోయి సంకీర్తనల జరిపించి, బాబా అంగీకారముతో నతని ఆశ్వయుజ పూర్ణిమ వరకు నిలుపుచుండెను. పండరికి వెళ్ళి దైవమును దర్శింపనీయక నన్నిట నిలుపు బాబా గురువెట్లగును? - అని దా. గా. తనలో తాననుకొనెను. అతడు బాబా తన గురువని భావించకుండెను.

సా. బా:- (గాణూతో) పండరికి పొమ్ము.

కావున దా. గా. పండరినాథుడు విఠలే తన దైవమని, బాబాకాడని భావించిన వాడగుటచేత అతడు ఆశ్వయుజ పూర్ణిమకు పండరికి వెళ్ళెను. తరువాత షిర్డికి తిరిగివచ్చెను.

129. దా. గా:- బాబా! నా అభీష్టము ప్రసాదింపక చాలాకాలము గడుపుచున్నాడవు. సాక్షాత్కార మెప్పుడు నా కనుగ్రహింతువు?

సా.బా:- నన్ను చూడుము! అదియే సాక్షత్కారము. నేను దైవమును

దా. గా:- నీవటుల పలుకుదువని నేను తలంచుచునే యున్నాడను. నేను తృప్తినొందుటలేదు. *

జీసెస్ క్రైస్తు :- ఫిలిప్! మీతో ఇంత పెద్దకాలము చేరియుంటిని. ఇప్పటికిని నన్నెఱుగజాలకుంటివి. నన్ను చూచినవాడు ఆ తండ్రిని చూచినవాడే. "మాకు తండ్రిని చూపుము" - అని పలుకుదువా?

నాయందున్న ఆ తండ్రియే ఈ లీలలు ఘటించుచున్నాడు. ఆ తండ్రిలో నేనున్నాడను. అతడు నాలో నున్నాడు అని విశ్వసింపుము. లేదా - ఈ లీలలను గూర్చియైన నన్ను విశ్వసింపుము!

(* మానవరూపమున దైవము - సైంట్ జాన్ XIV8-14.)
ప్రభూ! తండ్రిని మాకు చూపించుము! అది మాకు చాలును - తృప్తి కలిగించును.

నా పేరున నీవేమి కోరినను నే ననుగ్రహింతును.

నేను నా తండ్రిలో నున్నాను. నీవు నాలో నున్నావు. నేను నీలో నున్నాను.

సాధారణముగ సాక్షాత్కారములు క్షణికములు –

130. హ. సీ. దీక్షిత్ ఒక దినమున విఠోబా సాక్షాత్కారము నొందెను. కాని అతనికి గోచరించిన ఆ రూప మేమైనది బాగుగ బోధ పడలేదు. అతడు బాబా దగ్గరకు వెళ్ళెను.

సా. బా:- విఠల్ ప్రభువు దర్శన మీయలేదా? నీవు ఆయనను చూడలేదా? ఆ విఠల్ క్షణములో తప్పించుకొని పోవువాడు. ఆతనిని గట్టిగా బంధింపుము. ఏమఱుపాటున దృష్టి మరల్చితివా క్షణములో అదృశ్యుడగును.

ఆత్మ జ్ఞానము - అధికారి

(1) స్వీకరణము

131. (బాబా కుండలను శుభ్రపఱచి బోరగిల పెట్టుచుండెను.)

బాబా యందు విశ్వాసములేని కోవర్గాం స్టేషన్ మాష్టరు బాబాతో ఇదంతయు ఏమి? అని అడిగెను.

సా. బా:- నా దగ్గఱకు వచ్చు ప్రతిపాత్ర మూతిని క్రిందు చేసికొని వచ్చును. (అనగా (జలము) స్వీకరించుటకు వీలుపడని విధముగ)

(2) అర్హతను పొంది పిదప అడుగుము.

132. చూడవచ్చినవాడు :- బాబా! భగవాను డెట్లుండును?

సా. బా:- (ఆ ప్రేక్షకునిగాక ఒక భక్తునిచూచి) మార్వాడీబాగ్ చందు దగ్గఱకు వెళ్ళి, బాబాకు నూరు రూపాయలు కావలెనని అడిగి తీసికొనిరమ్ము!

భక్తుడు :- (వెళ్లి వెంటనే తిరిగివచ్చి) ఆ మార్వాడి తన దగ్గఱ ధనము లేదని, తన వందనము లర్పింపుమనినాడు.

సా. బా:- (వేరొక ఋణదాత పేరు చెప్పి) అతని దగ్గఱకు వెళ్లి నూరు రూపాయలు అప్పు అడిగి తెమ్ము.

భక్తుడు :- (వెళ్లి తిరిగివచ్చి) తన దగ్గఱ పైకము లేదనినాడు.

సా. బా:- నానాసాహెబ్ చందోర్కరును పిలువుము!

(చందోర్కర్ రాగానే)

సా. బా:- నానా! నాకు నూరు రూపాయలు కావలెను.

నా. గో. చం:- వెంటనే బాగ్‌చంద్ మార్వాడీకి నూరు రూపాయలు పంపుమని చీటి వ్రాసి పంపెను. మార్వాడీ పైకము పంపెను.

సా. బా:- ఈ ప్రపంచమున సకలము ఇట్లుండును.

ప్రేక్షకుడు :- (తరువాత దాస్ గాణూతో) బాబా నా ప్రశ్నమున కేల సమాధాన మీయలేదు?

దా. గా:- సమాధాన మిచ్చినాడు.

ప్రేక్షకుడు :- ఎట్లు?

దా. గా:- ఇతరులడిగిన ధనము దొరకలేదు. చందోర్కరు అడిగిన వెంటనే లభ్యమయ్యెను. ఆ విధమున బ్రహ్మమును గూర్చి తెలిసికొన గోరిన మాత్రమున నతడు తెలిసికొనలేడు. అర్హతపొంది అవల బ్రహ్మమును గూర్చి తెలిసికొన గోరుమని బాబా సమాధాన మిచ్చినాడు.

3. బ్రహ్మము తెలిసికొన గోరిన అయిదు సమర్పింపుము.

132. ఒక దినమున నొక ధనికుడు జేబునిండుగ కరెన్సీనోట్లు పెట్టుకొని బాబాను దర్శించుటకు షిర్డికిజేరెను. రానుపోను బాడుగకు టాంగా మాట్లాడుకొనెను. షిర్డియందాలస్యము చేసిన బండి మనిషి ఎక్కువ బాడుగ అడుగునేమోయని జంకుచుండెను.

బాబాను జేరి మ్రొక్కి -

ధనికుడు :- బాబా! నాకు సకలము కలదు, ఏలోటు లేదు. నాకు దైవమును జూపుము. నే నింతదూరము దానికొఱకే వచ్చితిని. అందరు 'షిర్డిబాబా' దైవమును శీఘ్రముగ జూపగలడని చెప్పుదురు.

సా. బా:- మంచిది! సందేహింపకుము. ఇప్పుడే స్పష్టముగ జూపుదును. ఇది జాగుచేయదగిన విషయము కాదు. దైవము కొఱకై కోరువారు దొరకుట చాల అరుదు. ఇచటకు చేరువారు పలువురు ధనము – ఆరోగ్యము – సుఖము – కీర్తి – సంతానము – ఉదోగ్యము మొదలగునవి కోరుదురేకాని, దైవము నెవ్వరు కోరరు. దైవముకోరు వారికొరకు నే నెదురు చూచుదును.

ఈ విశ్వమునకు బ్రహ్మము మూలకారణము. సూర్యచంద్రాది గ్రహములు – దివారాత్రిములు – ఋతువులు హాయనములు దైవము నాధారము చేసికొని వర్తించుచుండును. అట్టి బ్రహ్మమును జీవి తన దేహ పతనమునకు పూర్వమే యెరుగవలయును. లేనిచో జననమరణ చక్రమున బడి తిరుగుచుండును. 'ఎఱుక' వలన కేవలాద్వైత సుఖము జీవికి ప్రాప్తించును. గురువు ఆ "ఎఱుక"ను ప్రసాదింపగలడు. అది గురువునకే సాధ్యమగును.

♦ (బాబా ప్రక్కకు తిరిగి ఒక పిల్లవానిని పిలిచి) ♦

సా. బా:- మార్వాడీ నందలాల్ దగ్గరకు వెళ్ళి నాకు 5 రూపాయలు అప్పు కావలయునని అడిగి తీసికొనిరమ్ము – ఆ బాలుడు తిరిగి వచ్చి నందలాల్ లేడని చెప్పెను. ఆ విధముగ బాబా ఇండ్లలో లేని వారి దగ్గర కాబాలుని పంపెను. ఆ బాలుడు రిక్తహస్తములతో తిరిగి వచ్చెను. ఆ వచ్చిన ధనికుడు మిక్కిలి చీకాకు పడుచుండెను. దైవము నెరుగుటను గూర్చి కాదు. షిర్డియందు ఆలస్యము చేసినకొలది, టాంగావాడు పెచ్చుబాడుగ కోరునేమోయని అతని ఆందోళనము. బాబా దైవ సాక్షాత్కారము – (ఆత్మజ్ఞానము) వెంటనే ప్రసాదింపడేమి?– యని విసుగొందుచుండెను. బాబా 5 రూపాయలు కొరకు ఆ పిల్లవానిని పలు తావులకు త్రిప్పుచుండుట అతడు చూచుచునే యుండెను. అతని జేబులో ఏబది 5 రూపాయలు నోట్లుండెను. 5 రూపాయలు బాబాకు అప్పు యిచ్చిన, వానిని తిరిగి రాబట్టుకొన జాలమేమోయని అతని జంకు. ఆ ధనికుడు ఆలస్యమును సహింపలేక –

ధనికుడు :- బాబా! బ్రహ్మమును నేను పడయుటకు సాయపడుదువా? లేదా?

సా. బా:- నీవు బ్రహ్మమును పడయుట కొఱకే నే నింత వరకు ప్రయత్నించు చున్నాడను. నీవు చూచు చుంటివి గదా! కూర్చున్న వాడవు కూర్చున్నట్లే నీవు బ్రహ్మమును గాంచునట్లు చేయు ప్రయత్నించు చుంటిని.

ధనికుడు :- బాబా! నేను త్వరగా వెళ్ళవలె. దయయుంచి బ్రహ్మమును జూపుము.

సా. బా:- నీ వేమియు గ్రహించ లేదా? నాకు అయిదు కావలయును. బ్రహ్మమును జేరుటకు నరుడు ఐదు సమర్పింపవలయును.

ఐదు అనగా 1. ఇంద్రియములు, 2. ప్రాణములు, 3. మనస్సు, 4. బుద్ధి, 5. అహంకారములు. (ఇట్టి సమర్పణము వైరాగ్య మనబడును.) బ్రహ్మజ్ఞాన మార్గము చరింప మిక్కిలి కష్టమైనది. ఎల్లరా మార్గమున నడువ జాలరు. [ఆ వైరాగ్యము] అది వుదయమైన వెలుతురు పొసగును. లౌకిక పారలౌకిక విషయముల విరక్తి గాంచువాడు మాత్రమే బ్రహ్మ జ్ఞానము పడయ దగినవాడు. (తనకు బ్రహ్మజ్ఞానోపదేశము పొందుటకంటె 5 రూపాయల మీదగల గాఢమగు ఆసక్తిని బాబా తెలిసికొన జాలెనని ఆ ధనికుడు గ్రహించి సిగ్గున వెడలెను.)

బాబాను జేరువారందరు ఫలము బడయుదురా?

134. దామోదర్. యస్. రసానే ఈ ప్రశ్నము తలంచుచు బాబా మ్రోల కూర్చుండెను.

సా. బా:- (రసానేతో) ఆ పూచిన మామిడి చెట్టును చూడుము! ఆ పూత అంతయు కాయలు కాని పండిన అది యెంత చక్కని పంట అగును? కాని, కాయునా? పూతగనో, పిందెలుగనో గాలికి చాల భాగము రాలి పోవుచు, ఎ కొలదియో శేషించును.

7 బాబా కోరునది సంపూర్ణ శరణాగతి (సర్వ సమర్పణము)

125. సా.బా:- (గోపాలరావు బూటీతో) నాకు 16-1/2 రూపాయలు దక్షిణ యిమ్ము!

బూటీ :- ఇప్పు డిచట నా దగ్గఱ పైకము లేదు.

సా. బా:- కాకాదగ్గఱకు వెళ్ళి 16-1/2 రూ. అడుగుము. అతడు పఠించుచున్న పారాయణ గ్రంథము వినుము.

బూటీ హ. సీ. దీక్షితు దగ్గర కేగి 16-1/2 రూపాయ లడిగెను.

హ. సి. దీ:- ఒక్క రూపాయి మాత్ర మున్నది. రు. 16-1/2 ఈయ జాలను.

బూటీ:- బాబా నీవు పఠించు గ్రంథము వినుమనినాడు. అంతట హ. సీ. దీక్షిత్తు భాగవతము చదువదొడగెను. అపుడు చదివిన శ్లోకము.

"కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనావా ప్రకృతేస్వభావాత్
కరోమి యద్యత్సకలంపరస్మై నారాయణాయేతి సమర్పయామి".

ఇందు మనము చేయు సకల కర్మములు దైవమునకు సమర్పణ చేయుడని తెలుపబడినది. తాను దైవమగుటచే బాబా తనకు సర్వ సమర్పణ చేయుడని తెలిపినాడు. కాని, అందు 16-1/2 రూపాయలు ఆ శ్లోకమున యెచట కలవు? ఒక విధముగ నందు 17 శబ్దములు గలవు. మఱియొక విధమున సమర్పణ చేయబడదగిన వస్తువులు 16. కాని మూలమున చిత్తము విడువ బడినది. అపుడు 17 అగును. కాని 'చిత్తము' అర్థమే (1/2) అగును. అట్లగుట అందు తెలుపబడిన 16-1/2 వస్తువులు బాబాకు సమర్పణ చేయబడదగును - అపుడు 'సర్వసమర్పణ' మగును.

అన్నాసాహెబ్ దభోల్కర్

136. అన్నాసాహెబ్ దభోల్కర్ - సాక్షాత్కారము పొందవలయు నను ఆసక్తితో బాబా మ్రోల కూర్చుండి 'బాబా ఏదియో యొక దినమున నాకు ఉపదేశము చేయకుండునా?' అని తనలో తలంచెను.

సా. బా:- తెమ్ము - శ్యామా దగ్గఱకు పొమ్ము! అతని దగ్గఱ నుండి 15 రూపాయలు దక్షిణ తెమ్ము. అచట కొంత తడవుండి సంభాషించుము. తరువాత దక్షిణ తెమ్ము - అతడిచ్చును.

దభోల్కరు – శ్యామా దగ్గరకు వెళ్ళి ఆ విషయము తెలిపెను.

శ్యామా:- 15 రూపాయలు దక్షిణ బదులు నా 15 నమస్కారములు సమర్పించి అదియే నా దక్షిణ యని చెప్పుము.

దభోల్కర్ :- కాని, బాబా నీ దగ్గర కొంత తడవుండి సంభాషించి తరువాత నీ విచ్చు దక్షిణ కొనిరమ్మనినాడు. ఇదంతయు నేను బాబా మ్రోల కూర్చుండి బాబా నా కుపదేశము తప్పక చేయును అని తలంచుచున్న కారణము.

శ్యామా :- సర్వసాధారణముగ బాబా యెన్నడు యెవరికి ఉపదేశము చేయడనియే అందఱి అభిప్రాయము. ఏ భక్తుని చెవిలో మంత్రము ఊది యెఱుగడు. అట్టి మంత్రోపదేశ నిరాకరణము గూర్చి యొక వృత్తాంతముకలదు.

126. రాధాబాయి దేశముఖిన్ అను అమె బాబా వలన ఉపదేశము పొందగోరి బాబా దగ్గరకు వచ్చెను. బాబా ఉపదేశింపని కారణమున సత్యా గ్రహమునకు నిశ్చయించుకొనెను. బాబా వలన ఉపదేశము పొందుటయో లేక ప్రాణత్యాగము కావించుటో యేదియో ఒకటి జరిగి తీరవలయునని ప్రాయోపవేశము చేసి ఉపవసించెను. అటుల మూడు దినములు వ్యర్థముగ ఉపవసించిన పిదప, అమె కొరకు నేను జోక్యము కల్పించుకొని, ఏదో ఒక దైవనామమంత్రమామెకు ఉపదేసింపుమని బాబాను కోరితిని. ఆమెను పిలువ నంపి బాబా ఆమెతో నీ విధముగ బలికెను.

"అమ్మా! మరణింపవలయునని తలంచి నీ వేల హింస కావించుకొన జూచెదవు? నీ బిడ్డనగు నాపై దయ వహింపుము. నేనొక ఫకీరును. భిక్షుడను- ఇటు చూడుము! నా గురువు గొప్ప సాధు సత్పురుషుడు. అపార కరుణా మయుడు. ఆయనను సేవించుటకు మిక్కిలి శ్రమించితిని. కాని, ఆయన నా చెవిలో ఏ మంత్రము పలికి యెరుగడు. ఉపదేసించుటకు బదులు నా తల శుభ్రముగ గొరిగించి రెండు పైసాలు నన్నీయమని కోరెను. ఆయనకు కావలసినవి నాణెములు కావు. బంగారు రాసులనేని ఆయన లెక్కగొనడు. కాని, అవి 1. నిష్ఠ (గాఢ విశ్వాసము), 2. సబూరి (ధైర్యముతో కూడిన ఓర్పు). నేను వెంటనే సమర్పించితిని. ఆయన సంతోషించెను.

తల్లీ! 'సబూరి' అనునది ధైర్యము. దానిని విడనాడకుము. దవ్వులనున్న గమ్యమునకది నిన్ను మోసికొనిపోవును. అది మానవులందు మానవత్వమును ప్రసాదించును. పాపముల నిర్మూలించును. నిరాశా నిస్పృహలను బాపును. సకల భయములను ప్రతిఘటించును.

సాటిలేని కరుణా స్వరూపుడగు నా గురువును 12 సంవత్సరములు సేవించితిని. నాయెడ నా గురుస్వామి వఱపిన ప్రేమ యేమని - ఎంతని వివరింపగలను? ఆయన ధ్యాన నిష్ఠయందున్న తఱి యెదుట గూర్చుండి నా దృష్టి నా గురువుమీదనే కేంద్రీకరించితిని. ఇరువురము ఆనంద పరిపూర్ణులమైతిమి. ఇతరులమీద నా దృష్టి సారించి యెఱుగను. ఆకలి దప్పులను మఱచి రేయింబవళ్ళు నా గురుదేవుని ముఖాబ్జమునే అవలోకించితిని. నా గురుస్వామి యెడబాటు క్షణమైనను నాకు అశాంతి కలిగించెడిది. నా గురువునుతప్ప నితరమును ధ్యానించి యెఱుగను. గురువున కంటె నితర ఆశయము - గమ్యము నాకులేదు. నిరంతరము నా మనస్సు [లక్ష్యము] ఆయన మీదనే నిలుపబడి యుండును. నా గురుదేవుని లీలలు అత్యద్భుతములు. నా గురువును తప్ప నితరమును నేను కోరి యెఱుగను. నా ప్రేమను తప్ప నితరమును నా వలన ఆయన కోరి యెఱుగడు. ఏమియు చేయని యట్లు వెలికి ఆయన తోచినను నన్నెప్పుడు ఏమఱి యెరుగడు. కరుణాకటాక్షవీక్షణమున నన్ను రక్షించినాడు.

ఈ మసీదున కూర్చుండి నేను యథార్థము పలుకుచున్నాడను. నా గురుస్వామి నా చెవిలో నేమంత్రము ఊది యెఱుగడు. నేనును నీ చెవిలో ఊదగలిగినది యేమియులేదు. వెళ్లుము - నీవును ఆవిధముగ జేయుము.

నీ తలంపులకు నన్నేకైక లక్ష్యము చేసికొంటివా నీవు పరమార్థము పడయగలవు. చలింపని శ్రద్ధతో నన్ను చూడుము. నేనును నిన్ను చూతును. నా గురుదేవుడు నాకు బోధించిన ఏకైక సత్యము ఇది యొక్కటె. చతుర్విధ సాధనములతో, ఆరుశాస్త్రములతో నీకు అవసరములేదు. గాఢమైన విశ్వాసము [శ్రద్ధ]తో నీ గురువును విశ్వసింపుము. అది చాలును.

శ్యామా :- ఆ కాంత ప్రణమిల్లి బాబా బోధల స్వీకరించి సత్యాగ్రహము విరమించెను. అంత దభోల్కరు బాబానుజేరి జరిగిన విషయ మంతయు బాబాకు తెలిపెను.

7)

137-ఎ. మంత్రోపదేశము బాబా కాని, బాబా గురువులు గాని ఆశ్రితులగు శిష్యుల కెవరికిని చెవిలో మంత్రోపదేశములు చేసి యెఱుగరు. (చూ. 623-4) కాని, రామమంత్రము జపింపుమని ప్రధాన్ మొదలగు వారికి దెలిపినాడు (చూ. 192 మొదలు 198 వరకు).

138. మా విధానము ప్రత్యేకము. ఇది జ్ఞప్తియందుంచుకొనుము. ఆత్మజ్ఞానము పడయుటకు ధ్యానము అవసరము (అనగా) ఆత్మానుష్ఠానము మనస్సునకు ప్రశాంతిగూర్చి సమాధికి గొనిపోవును. కావున సకల కామితముల పరిత్యజించి, సకలమున అధివసించియున్న దైవమునందు నీ మనస్సును నిలుపుము. మనస్సు ఆ విధముగ కేంద్రీకరింపబడిన గమ్యము సిద్ధించును.

ధ్యానమునకు నాసగుణ రూపమునుగాని లేక నా నిర్గుణ (ఆనంద) స్వరూపమునుగాని చింతింపుము. అట్టి నిరాకార ధ్యానము కష్టముగ తోచిన నీ విచట చూచు నా రూపమును ధ్యానింపుము. రేయింబవళ్ళు దానిని తలంచుము. అట్టి నిరంతర ధ్యానమున మనస్సు (పరతత్త్వమున)లయించును. అపుడు ధ్యేయము – ధ్యాత - భేదము, తుదకు ధ్యాన క్రియయు శమించును. ఇదియే చైతన్యఘనత - బ్రహ్మ సమరసతగ పరిణమించును. గురుదేవుని కరుణారసార్ద్ర దృష్టియే ఆశ్రితుడగు శిష్యునకు షడ్రసోపేత భోజనము.

139. అపుడు కలకండ ప్రసాదము దభోల్కరునకు ఒసంగి యిట్లనెను.

"ఈ సుబోధ నీ మనస్సున పాదుకొలుపు కొందువేని నీ జీవితము ఈ కలకండవలె మిక్కిలి మధుర మగును - సద్గ్రంథ పఠనము – శ్రవణము, మననము, నిధిధ్యాస, స్మరణము, ధ్యానము ఇవి యన్నియు ఆనంద ఘనప్రాప్తికి సాధనములు" - అని బాబా తెలిపెను. ఈదృశ్య ప్రపంచమంతయు మాయద్వారా ఆవిష్కరింపబడిన బ్రహ్మము యొక్క రూపము. ఇది తిరిగి బ్రహ్మము నందు లయించును. ఆత్మ యొకడో లేక యీ జీవులవలె అనేకులో సకల శాస్త్రములను పరిశీలింపుము. ఎందుండి యీ సకలము ఆవిర్భవించెనో అట్టి కేవల ఆత్మ నెఱుగుటయే జ్ఞానము యొక్క పరమావధి (మకుటము).

140. ఋణాను బంధమున జేసి నీవు నన్ను జేరితివి. ఇట్టి ఋణాను బంధము నాదరింపుము. ఏ ప్రాణియైన నిన్ను జేరనేని నిరసించి, వెడల నడపకుము. సాధ్యమగు నట్లాదరింపుము. ఆకలిగొన్న వానికి అన్నము, దప్పి గొనిన వానికి నీరము, వస్త్రహీనునకు వస్త్రము యథా సాధ్యముగ నొసంగుము. అట్లు కావించితివేని భగవానుడు సంతసించును. ఇతరులపై ఆగ్రహావేశముల బ్రకటించి, కటువుల బలుకకుము. ఇతరులతో కలహింపకుము. ఇతరులు నిందించిన ఓర్పు వహింపుము. శాంత వచనములు పలుకుము. ఇది సుఖప్రాప్తికి మార్గము. ఇతరులు - ప్రపంచము తలక్రిందులు గానిమ్ము! దానిని నీవు పాటింపకుము. చలింపక ముక్కునకు సూటిగ నీ మార్గమున పొమ్ము.

ఈ ప్రపంచమున నిన్ను - నన్ను, ఒక జీవినుండి మఱియొక జీవిని వేర్పఱచు గోడ "భేదకుడ్యము" కలదు. ఈ గోడను పడగూల్చుము. భగవానుడే మహాప్రభువు. ఆ దైవకార్యములు (లీలలు) అద్భుతములు - అమూల్యములు - శాశ్వతములు. క్రమముగ నీ ఆశయములు ఫలించును. మనము పరస్పరము ప్రేమాభివృద్ధిబడసి, శాశ్వతానందము పొందగలము.

సాధనములు 1. సాధనము - విశ్వాసము

141. తన గురువు తనవలన కోరిన విధమున - బాబా తన వారి వలన గాఢవిశ్వాసము కోరువాడు.

నా గురుదేవుడు నాకుగల సకలమును తొలగించి, రెండు పైసాలు ఈయమనికోరెను. నేను సమర్పించితిని. ఆయన కోరినవి నాణెములుకావు.

ఆయన కోరినది. 1. నిష్ఠ (విశ్వాసము) 2. సబూరి - (ఓర్పు) (ఉత్సాహ ధైర్యములతో గూడిన సహనము).

142. పురందర్! నాకు రెండు రూపాయలు దక్షిణ నిమ్ము! నేను కోరునది యీ నాణెములు కావు - నేను కోరునది.

1. విశ్వాసము - 2. సహన సంతృప్తి.

143. బాబా పరీక్ష. విశ్వాసము పెంపుచేయుట. ఉదా -

1. నానా! (గో.చం.) భోజనముచేసి రైలునకు వెళ్లుము. వ్యవధికలదు.

2. నానా! ఈ దినమున కోపర్గాంనకు కలెక్టరును కలియుటకై వెళ్ళవలదు. (కలెక్టరు ఆ దినమున రాలేదు తంతినంపెను).

3. దాదా! (కేల్కారు) సాహెబ్‌ను (హ. వి. సాతే) అధికారులను కలియుటకు మన్మాడు వెళ్ళనీయకుము.

(అధికారులు వారి కార్యక్రమమును రద్దుచేసికొనిరి).

4. బాబా! (దీక్షిత్) 'విల్లు' వ్యాజ్యము గూర్చి వాదించుటకు బొంబాయికి వెళ్ళవద్దు. (ఆ వ్యాజ్యమా దినమున విచారణకు తీసికొనబడలేదు).

5. కాకా! నీ పిల్లవానిని పరీక్షలకిపుడు పంపవలదు. (ప్లేగు వలన పరీక్షలు కొన్ని దినముల తరువాతకు మార్చబడినవి).

6. మౌలానా! నీమీద మోపబడిన నేరము విచారణకు మేజిస్ట్రేటు కోర్టునకు ఈ రోజు వెళ్ళవలదు.

(ఆ విచారణ వాయిదా వేయబడినది)

7. తాత్యా! నీ వీ రోజున బజారునకు వెళ్ళవలదు.

8. తాత్యా! ఈ రోజున కోర్టునకు వెళ్ళవలదు.

(విచారణ వాయిదా వేయబడినది)

9. రంగారి భాస్కర్! తిరిగి వెళ్ళకుము –

(అతడు వెళ్ళెను – మార్గమున జట్కా బండి విరిగెను.)

10. మేనేజర్! (సదాశివ్ తార్కాడ్) వెంటనే పూనాకు వెళ్ళుము.

11. హస్విరాజ్! నీ ఉబ్బసము వ్యాధికి మందు లేమియు తీసికొన వలదు.

12. బాబుగిర్! (గోసావి) జల్గోమునకు పొమ్ము! సకలము సమకూర్చబడును.

(నా. గో. చం. కుమార్తె మినాతాయి ప్రసూతి సందర్భమున జామ్నేరు ప్రయాణము)

13. భావ్! (పురందర్) రైలు వేళ దాటినను కోపర్గామునకు పొమ్ము! (రైలు ఆలస్యముగ వచ్చెను).

*14. బేరే! కోపర్గామునకు వెంటనే పొమ్ము. దారిలో ఆగవద్దు. ఆలస్యము చేయవలదు.

(బేరే దొంగలదాడి తప్పుకొనెను).

బాబాకు హైందవ దైవములందుగల ఆదరణ

144. ఒక సమయమున బాబా కూర్చున్న చావడిలోనికి వర్షము జల్లు పడుచుండెను. అక్కడ భక్తులు మారుతి విగ్రహము నిలుపబడిన యెత్తు అరుగుమీద గూర్చుండుమని బాబాను కోరిరి.

సా. బా!- దైవమునకు సమాన స్థానమున మనమెట్లు కూర్చుండ గలము?

144-ఎ. 175 గోప్యవిషయమున బాబా ఆజ్ఞ -

తాయిబాయి జోగ్‌నకు నేత్రబాధ కలిగెను - నేత్రములు లోలోనికి కుచించుకు చుండెను. బాబా ఒక సాధారణమైన తేలిక చికిత్స తెలిపి, 'దీనిని గోప్యముగ నుంచుము. ఇతరుల యెదుట ఆ ఔషధము వాడ వలదు' అనెను. బాబా తెలిపిన విధమున ఆమె చేసెను. వ్యాధి నివారణ మయ్యెను.

"ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం మంత్రౌషధ సమాగమాః
దానమానావమానాశ్చ నవగోప్యా మనీషిభిః"

145. సా. బా:- (అప్పా కులకర్ణితో) నివాస్‌లోని మోహినీ రాజు [శివావతారము] సగుణబ్రహ్మము. వెళ్ళుము – డిప్యూటి కలెక్టరు ఎదుట హాజరగుటకు పూర్వము స్వామి దర్శనము చేసికొని పొమ్ము. [అ. కు. ఆ విధముగ జేసెను. అతడు నిర్దోషియని తీర్పు చెప్పబడెను].

---

* గమనిక :- బాబా పలికిన పలుకులను గూర్చిన వివరములు 'బాబా శక్తులు – తన బిడ్డలపై బాబా ప్రేమ' అను శీర్షిక క్రింద తరువాత తెలుపబడినవి.

శ్యామా మరి యితరులు :- (బాబాతో) బాబా! పురాణములు సత్యములేనా?

సా. బా:- అవును. సత్యములే.

శ్యామా :- శ్రీరాముడు – శ్రీకృష్ణుడు వీరినిగూర్చి నీ అభిప్రాయమేమి?

సా. బా:- వారు మహాత్ములు – వారు దైవములు – అవతారములు.

విఠల్ యెడ బాబాకుగల ఆదరణము

147. బల్వంతరావు క్షీరసాగర్ – షిర్డీకి వచ్చినపుడు.

సా. బా:- ఈ కుమారుడు తన తండ్రి కావించినటుల విఠోబాను పూజింపడు. నైవేద్యము సమర్పింపడు. విఠోబాను నన్ను పస్తుపెట్టు చున్నాడు. ఈతని తండ్రి నా మిత్రుడు. కావున నీతని నిక్కడకు నాకర్షించితిని. ఈతని తండ్రి కావించిన పూజ తిరిగి ప్రారంభింపుమని జ్ఞప్తిపఱపు చున్నాను.

బాబా – హైందవ దైవములు – అవతారములు

147. (బాబా అబ్దుల్ భాయి సమక్షమున నిట్లు పలికెను.)

ప్రథమమున – ఓంకారము

ఓంకారము	నుండి	భావకారము
భావకారము	నుండి	అధ్
అధ్	నుండి	అలెక్
అలెక్	నుండి	నిరంజనము
నిరంజనము	నుండి	నిరాకారము
నిరాకారము	నుండి	నిలము
నిలము	నుండి	అనిలము
అనిలము	నుండి	సున్నె
సున్నె		
కేశవ		
అమృ		
ఉత్తర		
పూర్వ		

రక్ష
మత్స్యావతారము
మానవత
అస్మిత్ర
ఇమ్రిడ్
భగిరిథ్ (భగీరథ?)
ఉత్పయత నుండి దేఖయత
భలింతర (బలి?)
తిర్మక్ర (త్రివిక్రమ?)
కచ్ఛావతారము
ఉచ్చాయత్ నుండి దేఖాయత్
ప్రిజాపత్
ఉగ్రనేన్
కాదిన్
దల్బరక్షర
వరాహావతారము
ఖాలేపత (గౌతమ?)
గోత్ర
విష్ణు
హరీతక
బబ్రసేర
నరసింహావతారము
సేజ్బార్
రేబక
బందోపస్త
బైల్‌చంద్
కాశిప (కాశ్యప?)
వామనావతారము
సామ
జాన్న
మైయాన

మూర్
తేజ
కమాల్
కద్రిమ
అద్భుద
గుప్తత్వ
కద్వాయ్ (కవి?)
అనర్థ
జయవ
అవి
అథస్త ధర్మ
మాంధాత
విప్రవ
జమదగ్ని
పరశురామ
తాజాజి (అవతారము)
కావడిక జాతి
ధాజ
రామచంద్రజీ దశరథ
అంకుశ (అవతారము)
ధద్మపురుష
హిర్బలి
దొజల
పిర్తు
ఇదురత్స (పృథు?)
శూరసేన (యదు?)
వాసుదేవ
శ్రీకృష్ణ
[అవతారము]

పిదప ప్రతిమదన [ప్రద్యుమ్న?] అనురుద్ధ - [అనిరుద్ధ?] ఈశితార్ - బుద్ధ [బుద్ధ?] జాలి - అవతారము [కలిక్యవతారము]

బ్రాహ్మణ- రాజపుట్ [క్షత్రియ] గౌలి [వైశ్య] తరువాత ముసల్మాన

చతుర్యుగ – కృతయుగమున నాలుగు అవతారములు, త్రిత (త్రేతా యుగమున) మూడు అవతారములు, ద్వాపరమున రెండు అవతారములు.

అధర్వనలో (కలియుగమున) ఒక అవతారము, దశావతారములు మత్స్య, కచ్ఛప, వరాహ, నరసింహ, వామన, పరశురామ, (శ్రీరామ) శ్రీకృష్ణ, బుద్ధ, కలికి, ఇబ్రహిం 4 వేదములను సిద్ధపఱచెను. దీనిని ప్రతి పాదించుటకు కలమ్ – షరిఫ్ వెలువరింపబడెను. దైవ విధాన మంతయు భగవానునికే యెరుక.

ఖుదరత్ ప్రతి వేదమునందు వేల అవతారములు వెలువడెను. కాని ప్రతి జమానా (జీవితము)యందు రూపములు (ఇవాదత్) వేర్వేరు, నూతనము. 8 మంది యూబి చక్రవర్తులు హిందూస్థానమును పాలింతురు. ఇది 18వ పురాణము 'ఖురాను' నందు కలదు.

హైందవ దైవములందు – పూజా విధానములందు
బాబాకుగల ఆదరము

148. సా. బా:- (సగుణ్ మేరు నాయక్‌తో) అన్నమునందు నేతిని జేర్చి ధుని (అగ్ని) యందు ఆహుతి కావింపుము. అన్నాహుతి తరువాత నాకు సమర్పింపుము.

148-ఎ. (రోహిల్లాతో) విఠల్ మొదలగు వారందరు 'అల్లా' అయి యున్నారు.

148-బి. (దా. గాణా - ఉపాసనితో) ఖండోబా - శివావతారము, విఠోబా – విష్ణు అవతారము. ఇరువురు నొకరే.

భగవానుని గూర్చి ఎఱుగవలసినదే కాని పలుకరాదు.

149. సా. బా:- (దైవమును గూర్చి యేమేమో పలుకుచున్న వానితో) 'దేవుడు – దేవుడు' – అని యేమేమో పలుకుచుంటివేల? దేవుడు నా జేబులో నున్నాడు.

150. "చంపువాడు రక్షించువాడు. రక్షించువాడు చంపువాడు."

151. సా. బా:- (టి. ఏ. కార్తిక్‌తో) దేవుడు అంతదూరమున నున్నాడా?

"నహి ఆకాశకో ఉపర్ - నహి పాతాల్‌కే అందర్
సదాతో పాస్‌హైతేరా - కహాఢుండన్కు జాతాహై!"
(బ్రహ్మానందుని గేయము)

అతడు ఆకాశముపైనలేడు. పాతాళముక్రిందలేడు. ఎల్లపుడు అతడు నీ దగ్గఱనేయున్నాడు. అయినను వెదకుటకు నీవెక్కడకు పోవుచున్నావు.

(మానవ రూపమున గల దైవమును జూడుము.)

ఈ దినములందు విశ్వాసము క్షీణించుచున్నది మొ॥

152. సా. బా:- ఇది పిదప కాలముగ నేర్పడినది. జనము లితరులను ద్వేషించుచు నిందించుచుందురు. నాకు ప్రతీకార వాంఛలేదు. అట్టిపలుకులను లవమేని వినగోరను.

జనులంతకంతకు మూర్ఖులగుచున్నారు. వారెల్ల వేళల నెల్లెడల మలినము, చెడువైపునకే దృష్టిమరల్చు చుందురు.

కోరికలులేని ఫకీరులు అరుదుగ నున్నారు.

మంచి ఫకీరును కనుగొనుట కష్టము.

153. నేను పెద్దకాలము యోజించుచు రేయింబవళ్ళు తలంచు చునే యున్నాను. అందఱు దొంగలే. కాని వారితో మనము మెలగవలయును. అట్టి వారిని చక్కదిద్దుటయో లేక తొలగించుటో ఏదో ఒకపని చేయుమని దైవము నహర్నిశలు ప్రార్థించు చున్నాను. కాని దైవము జాగు చేయు చున్నాడు. నా ప్రార్థనమును మన్నించి అనుగ్రహించుటలేదు. ఒకటి రెండు నెలలు వేచిచూచెదను. బ్రతికిన చచ్చిన నేను ప్రార్థించునది తప్పక పొందుదును. నేను వారిని-వీరిని జేరి చెప్పను, ప్రార్థింపను. జనులు సాధారణముగ సాధువర్తనులై దైవభక్తి సలుపరు. వారు స్థిర బుద్ధి లేనివారు. ఏ కొలదిమంది మిత్రులుచేరి, దైవమును గూర్చి భాషించుచు కూర్చుండి యోజింతురు.

154. (1918) జనులు దుష్టులై కష్టములను కలిగించు చున్నారు. ధనమునకై నన్ను బాధింతురు. సిగ్గును సైతము విడనాడు చున్నారు. నేనిపుడు విసుగు నొందుచున్నాడను.

సాధనము 2. వస్తువులను పూజించుట

(ఎ) విగ్రహములు

155. మార్గమధ్యమున సులువుగ అందుబాటై యున్న దత్తస్వామి మొదలగు దైవమూర్తులను దర్శింపక వచ్చువానికి నేనెటుల తోడ్పడగలను?

నివాస్ పురమున మోహినీ రాజు కలడు. అతడు సగుణుడైన అల్లా. అప్పాకులకర్ణి! నీవు వెళ్ళి, ముందుగ ఆ స్వామికి మ్రొక్కి తరువాత నీపై మోపబడిన నేరము విచారణకు డిప్యూటీ కలెక్టరు కచేరికి పొమ్ము. (అప్పా అటుల కావించెను. నిర్దోషియని తీర్పు చెప్పబడెను.) (రూ. 119, 145.)

156. భగవానుడు తన ఆశ్రితులగు భక్తులను రక్షించుటకై సకల శక్తుల బ్రకటించును.

157. మేఘా! పూజకొఱకీ లింగమును స్వీకరింపుము.

158. మేఘా! ఖండోబా దేవాలయమున పూజింపక నన్ను పూజించుటకై యిటకేలవచ్చితివి? పొమ్ము! ఖండోబాను ఇపుడు పూజింపుము. కోవెల తలుపులు తెరువబడి యున్నవి.

(బి) పాదుకలు

159. నాచ్నే! ఈ పాదుకలు ఉంచుకొని పూజింపుము.

160. ఆత్మారాం. ఎచ్. చాన్ భాయి వెండిపాదుకలు బాబా దగ్గరకు గొనిపోయెను. బాబా తన పాదములు దానిపైనిలిపి, "ఇవి చక్కగ నున్నవి. వీనిని పూజయందుంచుకొనుము" అని ఆ పాదుకల నతనికి బ్రసాదించెను. ఒక పరి అవి పోయినవి. ఆశ్చర్యముగ నవి మరల లబ్ధములయ్యెను.

161. యం. డబ్ల్యు ప్రధాన్ సతికి వెండిపాదుకల తన పాదముల క్రింద నిలిపి పూజించుటకు సమ్మతించి, బాబా ఆ పాదుకల నామెకు ప్రసాదించును.

సా. బా:- చూడుము! నానా! ఈ తల్లి నా పాదములను ఛేదించి తీసికొనిపోయినది. (అనగా – ఆపాదుకలయందు బాబా ఉన్నాడని– భావము)

(సి) నాణెములు

162. [1908] లో బాలకృష్ణ రామచంద్ర ఖైరికర్ – ద్వారకామాయీ మసీదులోనికి బోవుచు ఒక అణా నాణెమును త్రొక్కెను.దాని నేరికొని శుభ్రపఱచి బాబాకు సమర్పించుచు –

బా. రా. ఖై :- బాబా! ఇది నీ నాణెము, దీనిని దాచుకొనుము!

సా. బా:- [తిరిగి ప్రసాదించుచు] మంచిది. దీని నింటికి గొని పొమ్ము. నీవు పూజించు విగ్రహములతోబాటు దీనిని పూజింపుము.

[ఖైరికర్ దానిని 3 సంవత్సరములు పూజించి సంపదల గడించెను. పిదప ఆ నాణెమును పోగొట్టుకొనెను. సంపదలను నశించెను.]

163. సా. బా:- [యస్. బి. ధుమాలునకు ఒక నాణెమును ప్రసాదించుచు] దీనిని జాగ్రత్తగ భద్రపఱచుకొనుము. దానిని విడనాడకుము. ఎవరికీ నీయకుము – వ్యయ పెట్టకుము!

(డి) సమాధి పూజ

[164. సా. బా:- ఈ మధురనింబ వృక్షము నీడనగల నా గురుదేవుని సమాధిని ప్రతి గురు శుక్రవారముల సాయంసమయమున గోమయముతో శుభ్రపఱచి అగరువత్తులు వెలిగించి సేవించువారు దైవానుగ్రహమును బడయుదురు.]

(సి) పటము

బాబా తన చిత్రపటమును పూజించుటకుగూడ సమ్మతించి తన భక్తులను ప్రోత్సహించినాడు.

165. యస్. బి. ధుమాల్ చిత్రముతో ఓగింపబడిన బాబా చిత్ర

పటము పెద్దది మసీదు ప్రక్కగ గొనిపోవుచుండెను. బాబా అతనిని పిలిచెను.

సా. బా:- భావ్! ఇటురమ్ము. ఇది యేమిటి?

ధుమాల్ :- బాబా నీ విందున్నాడవు.

సా. బా:- దానిని నాకిమ్ము!

ధుమాల్ దగ్గఱనుండి బాబా ఆ పటమును తీసుకొని అటునిటు అన్నివైపుల త్రిప్పిచూచి దానిని తిరిగి ప్రసాదించుచు –

సా. బా:- దీనిని భద్రపఱచుకొనుము!

ధుమాల్ ఆ చిత్రపటమును భద్రము చేసికొని జీవిత పర్యంతము పూజించెను.

(ఎఫ్) పటము పూజ

పూజింపబడు పటములందు బాబా కలడు –

166. బాలభావ్ సుతార్ భజంకర్ – బొంబాయి నివాసి ప్రప్రథమమున 1917లో షిర్డికి జేరి బాబాకు మ్రొక్కెను.

సా. బా:- (ఇతరులతో) ఈతనిని నేను 4 సంవత్సరముల నుండి యెఱుగుదును.

అంతకు పూర్వము బాబాను సందర్శింపని వాడగుటచే బాలభావ్ ఆశ్చర్యపడెను. కాని, 4 సంవత్సరముల పూర్వము బొంబాయిలో బాబా చిత్రపటమునకు మ్రొక్కిన విషయము జ్ఞప్తికి దెచ్చుకొనెను.

(చూ:- గయలో శ్యామా, బాబా చిత్రపటమును చూచుట.)

విశ్వాసము

167. దైవమునందు విశ్వాసము బాబా పాదుకొలుపుట. మొ॥

సా. బా:- మేఘా! త్రిశూలము లిఖింపుము.

సా. బా:- మేఘా! ఈ లింగమును పూజింపుము.

168. నాచ్నే! దేవపూరునకు వెళ్ళుము. అందు మీ పూర్వీకులు పూజించిన రాతి విగ్రహములను పూజింపుము.

169. సా. బా:- శ్యామా! సప్తశృంగికి వెళ్ళుము. నీవు చేయించిన వెండి స్తనములను అచట వాణీదేవికి సమర్పింపుము.

170. సా. బా:- కుశభావ్! వెళ్లుము. మూడు ముఖముల స్వామిని (దత్తస్వామిని) సందర్శించు కొనుము.

171. సా. బా:- (రావు బహుద్దూర్ యం. డబ్ల్యు. ప్రధాన్‌తో) పూజ కొఱకు గణపతిని దెచ్చుకొనుము.

విగ్రహారాధనము

172. బాంద్రాలోని ఒక కాంత 7 సంవత్సరముల నుండి తల నొప్పితో బాధపడుచున్నది. అమె షిర్డికి జేరి బాబాకు ప్రణమిల్లి ఎదుట కూర్చుండెను.

సా. బా:- (అమె తలను తాకి మెల్లగ తట్టుచు) నీ తల నొప్పిగ నున్నది – కాదా?

బాం. కాంత:- బాబా! ఇంతకు పూర్వము. ఇప్పుడు తగ్గినది. (దీర్ఘకాల శిరోవ్యాధి సాంతము శమించెను.)

సా. బా:- అమ్మా! నీ విన్ని సంవత్సరముల నుండి సమృద్ధిగ తినబెట్టుచున్నావు.

బాం. కాం:- బాబా! మీ దర్శన భాగ్యము కలిగినదిపుడే కదా!

సా. బా:- కాని, నిన్ను నీ చిన్నతనము నుండి చూచుచునేయున్నాను.

బాం. కాంత:- (మిక్కిలి ఆశ్చర్యపడెను.)

సా. బా:- మీ గృహమున ఏ పూజ చేయుచుందువు?

బాం. కాంత:- గణపతి పూజ.

సా. బా:- మీ తల్లిగారి యింటనో?

బాం. కాంత:- గణపతి. పుష్పములు - ఫలములు, తిను పదార్థములు సకలము గణపతికి సమర్పింతును.

సా. బా:- అవియన్నియు నాకు చెందినవి. కావున నీ బాల్యదశ నుండి నిన్ను నేనెఱుగుదును.

173. బాం. కాం:- బాబా! నా గణపతి కుడిచేతివాడని అందఱు అనుచున్నారు. అదియేగాక ఒక చేయి విరిగినది. అందుచే ఆ విగ్రహమును ఆవల పాఱవేయుచున్నారు. ఆ మాటలు యథార్థములేనా?

సా. బా:- నీ బిడ్డ ఒక చేతిని విఱుగకొట్టుకొనిన ఆ బిడ్డను నీటిలో పాఱవైచెదవా? - నిత్యము ఆ విగ్రహమునే పూజింపుము.

సా. బా:· అమ్మా! మీ యింటికి నిత్యము ముమ్మారు వచ్చుచున్నాను. [లోగడ 76 లోని సంభాషణ చూడు]

పురాతనముల నిలుపదగును, విగ్రహముల మార్చరాదు.

174. ఒక సమయమున కాప్లేపటేల్, ఆయన మామ్లత్ దార్ – బి. వి. దేవ్‌తో కలిసి షీర్డికి జేరి, తాను (కాప్లే) కట్టించిన నూతన దేవాలయమున పురాతన విగ్రహముల నుంచుటయా? లేక ఆయన గురువు నిర్దేశించినట్లు"వానీ"నుండి నూతన విగ్రహముల తెప్పించి ప్రతిష్ఠించుటయా? ఈ విషయము బాబావలన తెలిసికొనగోరి, శ్యామాద్వారా బాబాను అడిగించెను.

శ్యామా :- బాబా! కాప్లే పటేల్ క్రొత్తగా కట్టించిన దేవాలయమున ఏ విగ్రహముల ప్రతిష్ఠింపవలయునో నీవలన తెలిసికొన గోరుచున్నాడు.

సా. బా:- వారి వంశీయులు పూర్వమునుండి పూజించుచున్న పురాతన విగ్రహములనే ప్రతిష్ఠింపుమనుము, నూతనములు వలదు.

శ్యామా :- వానీ నుండి తెప్పించు నూతన విగ్రహములను ప్రతిష్ఠించుట వలన (హాని) లోపమేమి?

సా. బా:- శ్యామా! మీ యిష్ట ప్రకారము చేయండి! ప్రతిష్ఠించండి లేక ఊరుకొనండి!

శ్యామా :- బాబా! వానీ నుండి విగ్రహములు తెప్పించి ప్రతిష్ఠించ వచ్చునా? – ప్రతిష్ఠింపరాదా? దయతో విశదముగ తెలుపుము.

సా. బా:- ఆ విగ్రహమే అతడు కావలయుననిన – దాని హస్తములు, పాదములు ఛేదించి, ప్రతిష్ఠించి పూజింపుమనుము. నన్ను మరల మరల ప్రశ్నింపకుము! ఒకపరి నా మిత్రునితో నూరార తిరిగితిని. అతడొక ఆవును కొనదలచెను. నేను వలదు – అంటిని. కాని, వాడొక ఆవును కొని ఒక గ్రామమునకు దానిని తోలుకొని వచ్చెను. అచట అంటువ్యాధి ఏర్పడి పలువురు మరణించిరి.

శ్యామా :- (ఆదినము సాయంత్రమున) బాబా! క్రొత్త విగ్రహముల దెచ్చిన ఏమి హాని కలుగును?

సా. బా:- అతనిని పురాతన విగ్రహములనే పూజింపుమనుము. క్రొత్తవి యేవియు తీసికొని రావలదు.

శ్యామా :- క్రొత్తవానిని ప్రతిష్ఠించుటలో కలుగు హాని యేమి?

సా. బా:- (కోపముతో) నేను నోటితో మాటాడుచున్నాడను. మఱి యేయితరములతో మాటాడుట లేదు.

కాప్లేపటేల్ బాబాయందు విశ్వాసము [నమ్మకము] లేక తన గురువునందే గొప్ప నమ్మకము కలిగి వానీనుండి విగ్రహములను తన గురువు గ్రామమునకు తెప్పించెను. అచ్చట ప్లేగువ్యాధి ఏర్పడి పలువురు మరణించిరి. ఆ గురువు అంతకు పూర్వమే 3, 4 వందలు రూపాయలు స్వీకరించియు, ఆ పటేల్ తన భూమిని రిజిష్టరు ద్వారా దఖలు పరచినతప్ప లేనియెడ అతడు [పటేల్] నాశనమగునట్లు శపింతునని వర్తమాన మంపెను. అప్పటికా పటేల్ మేలుకొనెను. బాబాయొక్క నిస్వార్థ ప్రజ్ఞా విశేషమును గ్రహించెను. తన గురువుయొక్క క్రౌర్యము, స్వార్థపరత తెలిసికొనెను. తనవంశ పరంపరా గతములైన పురాతన విగ్రహములనే ఆ క్రొత్తదేవాలయమున ప్రతిష్ఠించెను.

సాధనము 3 గురువు

సాయీ పూర్వ గురుమహిమ

175. తన గురువును తానెట్లు కలిసినది బాబా స్వయముగ తెలిపెను. ఒకపరి నేను మఱి ముగ్గురము శాస్త్ర గ్రంథములను చదువుచు జ్ఞానసిద్ధి పడయు మార్గములను చర్చించుచుంటిమి.

మాలో నొకడు "ఉద్ధరే వాత్మనాత్మానం" (తన ఆత్మను ఆత్మ చేతనే ఉద్ధరించు కొనదగును) అని గీత తెలుపుటచేత మనము మనమీదనే ఆధారపడి యుండవలయునుగాని ఒక గురువుపై నాధారపడి యుండరాదు – అని పలికెను.

రెండవవాడు "తలంపులను సందేహములను విడిచి, మనస్సును మన స్వాధీనములో నుంచుకొనవలయును. ఎల్లెడ ఎల్ల వస్తువులందు ఉన్నది మనమే" అని పలికెను.

మూడవవాడు "ఈ దృశ్యమాన ప్రపంచము రూపము నిరంతరము మార్పు నొందునది. నిరాకారమైనదే మార్పులేనిది. కావున మనము విచారము చేత నిత్యమైన వస్తువునుండి – అనిత్యమైన దానిని వేర్పఱచుట చేత (నిత్యా2నిత్యవివేకమున) ఎఱుక పొందవలయును" అని పలికెను.

నాల్గవవాడు (సా. బా.) గ్రంథ పఠనమున పడయు జ్ఞానము నేవగించి "మనవిధ్యుక్త ధర్మముల నాచరించి, మన తనువును, వాక్కును, జీవితమును సర్వవ్యాపియైన గురువునకు అర్పించుదము, గురువునందు గాఢవిశ్వాసము మనకు కావలసినది" అని పలికెను.

మేము అడవులబడి సంచరించుచుండగా ఒకవనజారిని (ధాన్యము – ఉప్పు మొదలగునవి ఒక చోటనుండి మఱియొక చోటకు గొనిపోయి వర్తకము చేయువాడు) కలిసితిమి. "ఈ ఎండలో అడవులబడి ఎచటకు బోవుచున్నారు?" – అని, అతడు మమ్ము ప్రశ్నించెను. మేము సరియగు సమాధాన మీయలేదు. "అగమ్యమై దారికానరాని యీ యరణ్యముల వ్యర్థముగ సంచరింపవలదు" అని ప్రేమతో నతడు హెచ్చరించెను. తనతో భుజింపరండని ఆహ్వానించెను.

అతని హితబోధను నిరాకరించి ముందుకు సాగితిమి. ఆ మహారణ్యమున మేము దారితప్పితిమి. అతడు మరల మా కెదురుపడి "మీ తెలివిపై మీరు ఆధారపడుట వలన పెడదారి పట్టితిరి. మార్గమెఱుకపఱచుటకు తోడు అవసరము. భుజింప రమ్మనిన నిరాకరింప దగదు. అట్టి పిలుపు శుభప్రదము. చేయు ప్రయత్నమున అది విజయసూచకము" అని పలికి అతడు మఱల తనతో భుజింపరండు అని మమ్మాహ్వానించెను.

మరల మేము నిరాకరించ వెళ్ళితిమి. వెంటనే నేను ఆకలినొంది, ఆ
జేరి కొద్దిగా రొట్టెను తిని కొంచెము నీరు త్రాగితిని.

అపుడా గురువు "మీ వివాదమేమి?" యని ప్రశ్నించెను.
సంభాషణమంతయు నాతనికి దెలిపితిని. తక్కిన ముగ్గురాతనిని లెక్కించ
వెడలిరి. నేను మాత్రము సగౌరవముగ మ్రొక్కితిని. అంత నతడు నన్ను
నూతికడకు గొనిపోయి, నా కాళ్ళను త్రాటితో బంధించి ఒక చెట్టునుండ
బావిలోనికి తలక్రిందుగ నన్ను వ్రేలాడగట్టెను. నా తల నీటిని తాకక
మూడడుగుల ఎత్తున నుండెను. నన్నట్లు దిగవిడచి, నా గురువెచట కేగెనో
దైవమున కెఱుక! నాలుగైదు గంటల తరువాత అతడు తిరిగి వచ్చి, ఎట్లు
గడపితివి? – అని నన్ను ప్రశ్నించెను. 'బ్రహ్మానందముగ నా కాలమ
గడచెను – అని, సమాధాన మిచ్చితిని. ఆ గురువు నా మాటలకు మిక్కిలి
సంతోషించి, నన్ను దరికి జేర్చుకొని, తన అర చేతితో నాతలను, శరీరమును
స్పృశించి, ప్రేమరసము లొలుకు పలుకులు పలికి తన ఒడిలో నన్ను జేర్చు
కొనెను. ఆ ఒడిలో నున్నపుడు నా తండ్రిని, తల్లిని, ఎల్లబంధములను,
ఎల్లకోరికలను పూర్ణముగ మఱచితిని.

ఆయనపై చూపు నిలుపుటకు మిక్కిలి ప్రేమింతును. చూచుట కాయన
నా యెదుట లేనియెడ నా కన్నుల కలిమినే నే సేవగింతును. తిరిగి వెళ్ళ
వలయునని నేను కోరలేదు. గురువునుతప్ప ఇతరములను, సమస్తమును
మరచితిని. నా ప్రాణములు నా చూపునందు, నా చూపు ఆయన యందు
కేంద్రీకరింప బడినది. అదియే నా ధ్యానము – లక్ష్యము. మౌనముగ
ప్రణమిల్లితిని.

(అనగా) ఎట్టి ప్రయత్నములు – అధ్యయనములు మొదలగునవి
లేకయే, నా గురువు అనుగ్రహముననే యెఱుక తనకుదానే పొడమినది.

గురువు అనుగ్రహ మొకటియే మన సాధనము. దానివలన జ్ఞానము
అనుభూత మగును.

గురువు అవసరము

176. భక్తుడు :- బాబా! ప్రతి వ్యక్తి యెక్కడకు పోవలెను?

సా. బా:- దీనిపైకి

భక్తుడు :- మార్గమేది?

సా. బా:- ప్రతి ప్రదేశము నుండి కావలసినన్ని మార్గములుకలవు. నీకు ఇక్కడ నుండి మార్గము కలదు. కాని, దారి ఒడుదుడుకులు కలది. (మిట్టపల్లములు కలది.) మార్గమున పులులు - ఎలుగులు కలవు.

హ. సీ. దీక్షిత్ :- కాని బాబా! అతనికి తోడు వెంటనున్న-అపుడో?

సా. బా:- అతనివెంట తోడున్న - అపుడు కష్టము లేదు. ఆ పులులు - ఎలుగులు ప్రక్కకు తొలగిపోవును. తోడు లేనియెడ మార్గమున నొక పెద్ద అఘాతము (గుంట) కలదు. ఆ అగడ్తలోపడే ప్రమాదము - అపాయము కలదు. (తోడు - గురువు, అగడ్త - నరకము)

"గురుబినా కోనబనావే బాట్" (కబీరు)

177. సా. బా:- ఇతర గురువు లెంత మహిమలుగల గొప్పవారైనను, నీ గురువే మహిమలులేని వాడైనను చలింపని విశ్వాసముతో నీ గురువును హత్తుకొనియుండుము. పంత్! మన గురువుతోడి సంబంధము ండనాడరాదు. అతని యందే గాఢముగ హత్తుకొనియుండుము.

ఈ పుట్టువున గురువైన 'వేంకుశ' ని గూర్చి - బాబా

178. సాటిలేని ప్రేమ ప్రపూర్ణుడైన నా గురువును 12 సంవత్సరములు సేవించితిని. ఆయన నాపై పఱపు ప్రేమ నేనేమని - యెంతని వరింపగలను! ఆయన ధ్యాన నిష్ఠ యందున్న తఱి ఎదుట గూర్చుండి ఆయనను వీక్షించు చుందును. ఇరువురము ఆనంద పరిపూర్ణులమైతిమి. నా దృష్టిని యితరములపై మరలించి యెఱుగను. రేయింబవళ్ళు ఆకలి దప్పులను మఱచి, ఆయన ముఖాబ్జమునందు మిక్కిలి ప్రేమతో దృష్టి నిలిపి యుంటిని. గురుదేవుని యెడబాటు ఒక క్షణమైనను నాకు అశాంతి గలిగించెడిది. నా గురువును తప్ప నితరమును ధ్యానించి యెఱుగను. ఈ గాఢమైన ప్రేమతప్ప నా వలన యితరము నా గురువుకోరి యెరుగడు. ఏమియు చేయని యటుల వెలికి కనబడినను నన్నెప్పుడును మఱచి యెఱుగడు. దయార్ద్ర వీక్షణముల నన్నెల్ల వేళల రక్షించువాడు. ఆ గురువు నా చెవిలో నెట్టి మంత్రముల నూది యెరుగడు. ఆయన కరుణా ప్రభావముననే నిట్టి స్థితిని పొందగలిగితిని. గురువు నొక్కనినే మన తలంపులకు, ఆశయములకు ఏకైక లక్ష్యము చేసికొనజాలినవాడు పరమార్థము సత్యధామము - గమ్యము పొందును. నా గురువు నాకు

బోధించిన సత్యమిది యొక్కటియే. చతుర్విధ సాధనములు, ఆరు శాస్త్రములు అవసరము లేదు. గురువు నందు సంపూర్ణ విశ్వాస బుద్ధి కలిగియున్న చాలును. అదియే ఏకైక సాధనము. ఆ ఫకీరు భార్య నన్ను సేలునందు వేంకుశనివద్ద విడిచెను. 12 సంవత్సరములు నా గురువును సేవించి 'సేలు' విడిచితిని.

178-ఎ. ఈ ఇటుకరాయి. (బాబా పగలు తన చేతిక్రింద, రేయి తలక్రింద ఆధారముగ నిలుపుకొనును). నా గురుదేవుడు ప్రసాదించిన బహుమానము. నా ప్రాణమిత్రము. ఇప్పుడిది విఱిగినది (పగిలినది) ఇటుక రాయి కాదు. నా కర్మమే – (ప్రారబ్ధము) యిపుడు విచ్ఛిన్నమైనది. ఈ ఇటుక రాయి పగిలిన తరువాత నేనిక జీవింపజాలను.

(1918 అక్టోబరు మొదటివారమున బాబా పలికిన పలుకులివి. 'మాధవ ఫానే' అను నతడు అజాగ్రత్తతో నా రాతిని జారవిడిచెను. అది రెండుగ పగిలెను. బాబా ఆ యిటుకరాతి ముక్కలను చూచి విచారము ప్రకటించుచు పై విధమున పలికినాడు.)

179. సా బా:- నానా! నీపై నాకు కోపములేదు. మీరు నాబిడ్డలు మీరు నన్ను కోపించవచ్చును. వేంకుశుడే జీవించియున్న నే వాయనపై కోపింతును. (చూ. 216)

180. తన గురువును గాని, సాధు సత్పురుషులను గూర్చి కాని నిందకావింపబడు ఏ తావులనే శ్రేయము కోరువాడు క్షణమేని నిలువరాదు.

తొంటి గురువు — కబీరు
(ఉపాసనము)

మధురనింబవృక్షము క్రిందనున్నది కబీరు సమాధి. కబీరు నిర్యాణ మొందిన పిదప ఆయన శరీరము పుష్పములుగ మారెను.

181. కబీరు నా గురువై యుండెను. (చూ. 477)

ఆ కారణమున ఈ మధుర నింబ వృక్షముక్రింద నా నివాస మేర్పరచు కొంటిని. గురు శుక్రవారముల నిచట అగరుపత్తులను వెలిగించి సేవించు వారిని దైవము అనుగ్రహించును. (చూ. 164)

భక్తుడు తనకు తానే నిర్ణయించుకొని గురువును పొందవలెను.

182. ఒక ధనికురాలు ఒక పళ్ళెరమునిండ రూపాయలను నింపుకొని బాబాయెదుట నాలుగు దినములు నిలిచియుండెను. కాని, బాబా ఆమెనేమియు దక్షిణకోరి యుండలేదు.

ధనికురాలు : (నాల్గవ దినమున) బాబా! నేను గురువు కొఱకు ఇచ్చటకు వచ్చితిని. ఇప్పుడీ నా దక్షిణ స్వీకరింపుము. నాకు గురువువై ఉపదేశింపుము.

సా. బా: గురువు తనకు దానుగ నీకు గురువుకాడు. నీవే అతనిని గురువుగ సంభావింప వలయును. (అనగా) విశ్వసింప వలయును. ఒక చెల్ల పెంకును స్వీకరించి దానిని నీ గురువుగ సంభావించి సేవించి చూడుము! నీవు గమ్యమును – పరమార్థమును పొందెదవో లేదో నీవే పరీక్షించుకొనుము. (ఏకలవ్యుని వృత్తాంతము గమనింపుడు)

బ్రహ్మము (లేక) జ్ఞానము యొక్క స్వభావము.

గురువుద్వారా దానిని బడయు విధానము.

183. నా. గో. చం: సంస్కృతమున చక్కని సాహిత్యమును గడించి, భగవద్గీతలకు శంకర భాష్యమును అధ్యయనము చేసిన పట్టభద్రుడు ఒక సమయమున ద్వారకామాయి మసీదునందు బాబాపాదము లొత్తుచుండెను.

సా. బా: నానా! నీవు లోలోన ఏమి గొనుగుకొనుచున్నావు?

నా. గో. చం: ఒక సంస్కృత శ్లోకము.

సా. బా: ఆ శ్లోకమేమి?

నా. గో. చం: భగవద్గీతలోని శ్లోకము.

సా. బా: పెద్దగా వినబడునట్లు చదువుము.

అంతట చందోర్కరు భగవద్గీతలోని 4 అధ్యాయము 34 శ్లోకమిట్లు చదివెను.

తద్విద్ధి ప్రణిపాతేన పరి ప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వ దర్శినః

సా. బా:- నానా! దీనిని నీవు అవగాహనము చేసికొంటివా?

నా. గో. చం:- గ్రహించితిని.

సా. బా:- అట్లయిన, భావము తెలుపుము.

అంత నా. గో. చం:- ఆ శ్లోక భావమును దెలిపెను.

సా. బా:- దాని సారాంశము కాదు - ప్రతిపదార్థము - శబ్ద - ధాతు- వ్యాకరణ విశేషాంశములతో తెలుపుము.

బాబా సంస్కృత వ్యాకరణాది విశేషాంశములను గ్రహింపగలడా? అని, ఆశ్చర్యపడుచు ఆ శ్లోకమునకు చందోర్కరు వ్యాఖ్యానము గావించెను. బాబా అందలి భావ వ్యాకరణాంశములతోగూడ కఠినముగ ప్రశ్నించెను?

సా. బా:- తద్విద్ధి - అనుటలో 'తత్' – (దేనిని సూచించుచున్నది) అననేమి?

నా. గో. చం:- జ్ఞానము.

సా. బా:- ఏ జ్ఞానము? (లేక) దేని జ్ఞానము?

నా. గో. చం:- వెనుక శ్లోకములందు దెలుపబడిన జ్ఞానము.

సా. బా:- ప్రణిపాతము - అననేమి?

నా. గో. చం:- ప్రణమిల్లుట.

సా. బా:- 'పాతము' - అనిననో?

నా. గో. చం:- అదే అర్థము.

సా. బా:- ప్రణిపాతము- పాతము ఈ రెండు ఒకే అర్థమైన- వ్యాసుడు అనవసరముగ రెండక్షరముల ప్రత్యయమునుజేర్చి యుండునా?

నా. గో. చం:- ఆ రెంటిలోని భేదము నాకు తెలియదు.

సా. బా:- ప్రశ్న - అన అర్థమేమి?

నా. గో. చం:- ప్రశ్నించుట.

సా. బా: పరిప్రశ్న - అనిననో?

నా. గో. చం: అదే అర్థము.

సా. బా: రెండు పదములు ఒకే అర్థమైన వ్యాసుడు తలతిక్కతో పెద్ద పదము ప్రయోగించియుండునా?

నా. గో. చం: ఏమైనను - నాకు భేదము కానవచ్చుటలేదు.

సా. బా: 'సేవ' - అననేమి?

నా. గో. చం: పరిచర్యచేయుట - పాదములొత్తుట మొదలగు సేవలు.

సా. బా: అంతకంటె హెచ్చులేదా?

నా. గో. చం: అంతకంటే నేమి విశేషార్థము చూచించునో నాకు తెలియదు.

సా. బా: సరే దానిని విడువుము. చివర రెండు పాదములలో కత్త్వ దర్శులైన జ్ఞానులవలన జ్ఞానము పడయుమని అర్జునునకు బోధించి నానే, కృష్ణుడు జ్ఞానికాడా?

నా. గో. చం: అవును జ్ఞానియే.

సా. బా: అట్టియెడ, తానేల జ్ఞానము తెలుపక ఇతరుల వలన తెలిసికొనుమని అర్జునకు బోధించెను?

నా. గో. చం: నేను చెప్పజాలను.

సా. బా: అర్జునుడు - ఒక జీవి. చైతన్యాంశము కాదా?

నా. గో. చం: అవును.

సా. బా: అట్టియెడ ఆ జీవికి - సహజముగ చైతన్యాంశము - జ్ఞానాంశ యగువానికి జ్ఞాన మెట్లీయబడును?

నా. గో. చం: దానినట్లుంచుము - ఆ శ్లోకము రెండవభాగమున ప్రత్యయము - లేక - అక్షరముజేర్చి చదువనగునా?

నా. గో. చం: అగును.

సా. బా: ఎట్లు?

నా. గో. చం:- జ్ఞాన శబ్దమునకు ముందు - అవగ్రిహము- అకార ప్రిశ్లేషచేర్చి చదువవచ్చును.

సా. బా:- అపుడెట్లు చదువదగును?

నా. గో. చం:- 'ఉపదేక్ష్యంతి తె౽జ్ఞానం' - అని. కాని బాబా ఈ పాఠము సంస్కృత వ్యాఖ్యానమున గానరాదు.

సా. బా:- లేకున్ననేమి? అది సముచితమైన అర్థము నిచ్చునేని దానివలన నేమి హాని?

నా. గో. చం:- అది ఎట్లు తగిన అర్థమిచ్చునో నే నెఱుంగజాల.

సా. బా:- నీ వెఱుగుదువు.

అంతట చందోర్కరు లోగడ బాబా తన్నడిగిన ప్రశ్నలకు సమాధాన మిచ్చుచు, తన భావానుసారమా శ్లోకములోని అంశములను వివరింపుమని బాబాను కోరెను.

సా. బా:- ఆ శ్లోకము సత్యతత్త్వ మెఱుగుటకు శిష్యుడు తన గురువునెట్లు ఆశ్రయింప వలయునో తెలుపబడినది. తనువును, మనమును, ఆత్మను సకలమును గురువునకు సంపూర్ణ సమర్పణము గావించి, శిష్యుడు గురువు నాశ్రియింపవలయును. ఆ ప్రణిపాతము అట్టి సమర్పణ బుద్ధితో కూడియుండవలయును.

ఇక పరిప్రశ్నము - అనగ - అలసతతోడనే (లేక) వేడుకకో - ఋజు భావములేక - వంచనేచ్ఛతో గురువునందు తప్పునెదుకు తలంపుతో గాక యథార్థ జిజ్ఞాస (పరతత్త్వము నెఱుగవలయునను కాంక్ష) గలిగి, విధేయతతో చక్కగ బోధపడువరకు పలుమారులు ప్రశ్నించి తెలిసికొనవలయునని భావము.

ఇక సేవ అనగా పాదములొత్తుట మొదలగునవి మాత్రమేకాదు. గురువు ఆనతి పరిపాలించుటకు జంకు - గొంకు - అలసత - పనికిరావు. తన దేహమునకు తానధిపతినని తలంచరాదు. అది గురువునకు, చెందినదై గురుసేవకొరకై అంకితమైయున్నదిగ భావింపవలయును.

ఇక గురువు శిష్యునకు అజ్ఞానము దెలుపుటను గూర్చి విచారించుదుము-

సా. బా: బ్రహ్మము – జ్ఞానము, శుద్ధ సత్త్వ వస్తువుకదా?

నా. గో. చం: అవును.

సా. బా: తక్కినది (బ్రహ్మేతరము) అంతయు – అసత్తు – అజ్ఞానముకాదా?

నా. గో. చం: అవును.

సా. బా: 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ' వాక్కునకు మనస్సునకు అందరానిది – అని శాస్త్రములు బ్రహ్మమును గూర్చి భాషించుటలేదా?

నా. గో. చం: అవును.

సా. బా: అపుడు గురువు పలుకులు – 'బ్రహ్మము' – జ్ఞానము' కాదు గదా!

నా. గో. చం: కాదు – బ్రహ్మము కాదు.

సా. బా: అట్టియెడ గురువు తెలుపునది (పలుకునది) జ్ఞానము కాదు. అజ్ఞానము గూర్చియే కదా!

నా. గో. చం: అటులనే తోచుచున్నది.

సా. బా: శిష్యుని అజ్ఞానమును తొలగించుటకు గురువు కావించు బోధ ఒక విధమైన అజ్ఞానమే అగుచున్నది. ముల్లును తొలగించుటకుపయోగించు మఱియొక ముల్లు విధమున.

"శ్రితం సర్వమసద్విద్ధి వేదం సర్వమసత్ సదా.
గురు శిష్యా వసద్విద్ధి గురోర్మంత్ర మసత్తతః"

అగునా? కాదా?

నా. గో. చం: అవును.

సా. బా: శిష్యుడు ఒక జీవి. అతని సహజ స్థితి జ్ఞానము – కాదా?

నా. గో. చం: అవును.

సా. బా:- ఆమె యెక్కడ ఎ
వివిధ రూపముల గోచరింపజేయు ఆ
అను పేరు నిర్దేశింపబడినది. చైతన
గలవా? నీకు సాధ్యముకాదు.
(తీపి) నుండి, సూర్యుని కాంతినుం
వందు లయ మొందినపుడే 'మాయ'
బ్రహ్మము నుండి విడివడుట). చై
చైతన్యము అనంతము. చైతన్యమ
మాయా చైతన్యములు - ప్రకృతి పురు
చున్నవి. జ్ఞానేశ్వరియందు వీనిని
దానిని అధ్యయనము చేయుదువేని అ

చైతన్య మొక గుహ, అ
ఆ గుహయే అగుచున్నాడు.

మాయ కార్యమగును. చిత్రవి
ఇట్టివాడను. నీ వట్టివాడవు - ఇట్టివా
ఇవన్నియు అసత్యములైన భేదముల
[అభేదము] సత్యము నీకు బోధపడ
1. 'ఆవరణ శక్తి' దీనిచే ఆ
2. 'విక్షేప శక్తి' అటుల కప్పిపుచ్చి
చాతుర్యమున ఆరోపితములను [
దృష్టాంతము గమనింపుము.

ఒక కష్టజీవి తాను రాజు అ
తన కష్టజీవనమును మఱచును.
ఆవరణ శక్తిచే కప్పబడినది. అ
యొక్క విక్షేపశక్తిచే తోపజేయబడి
[ఆత్మను] కప్పి, దానిపైన ప్రాప
వాస్తవముగ ఈ ప్రపంచము లేని
[లేక] బ్రహ్మము - మాత్రమే. కా
భావింపడు చున్నవి. అదియే మోస

జ్ఞానమును ప్రసాదింప వలసిన పనిలేదు.
తెరను (అజ్ఞానమును) మాత్రము తొలగజేయు

అట్లు.

ఆ పని ఒక్కమాఱుగ కావింప సాధ్యము
వివిధ జన్మపరంపరాగతమైన అజ్ఞాన పంకమున
అనేక జన్మములుగ పలుమాఱులు బోధింప
పంకము (బురదగుంట) నుండి విడివడజాలడు.

ఆ సత్య తత్త్వమును గూర్చి తెలుపబడు
? అది ఆ కప్పును - ఆవరణమును
నాడు కప్పిపుచ్చునట్లు జ్ఞానమజ్ఞానముచే
తొలగజేయుము. స్వచ్ఛమైన జలముతో చును.
నీరు అందే కలదు. గ్రహణ సమయమున
న్నారు. రాహువు కేతువు వారిని మన
పులు తొలగిన అంతకుపూర్వమే
లు మనకు దృగ్గోచరములగును.

మనము నేత్రములతో సకలము
మున చూడలేము. పొరను తొలగించుము.
జ్ఞానమే పొర.

మాయచే కల్పితమైనదీ ప్రపంచము
జ్ఞానమే అజ్ఞానమును భాసిల్లజేయును.

వలసినదే కాని, ప్రత్యక్షముగ ఉప
ప్రణిపాత, పరిప్రశ్న సేవలివన్నియు
పడయుటకు సాధనములు.

తలంపు కేవలము భ్రాంతి. ఇది జ్ఞానమును
తెరను చీల్చివేయుము. అపుడు "ప్రజ్ఞాన

ఈ సంస్కృతి బీజము అజ్ఞానము. గురుకృప అను అంజనము (కాటుక) కనులకు పెట్టుకొనిన మాయయను తెరతొలగును. జ్ఞానము శేషించును. జ్ఞానము ఒక కార్యముకాదు. అది యెల్ల వేళల సహజ సిద్ధమైయున్నది. అజ్ఞానము విషయము అటులకాదు. దానికి కారణము – అంతము-కలదు. "భగవంతుడొకడు-భక్తుడుమఱియొకడు." ఇదియే అజ్ఞానమునకు మూలము. దానిని తొలగించుము. జ్ఞానము శేషించును. అజ్ఞానము – త్రాడునందు సర్పమును చూచును. అజ్ఞానమును తొలగింపుము. అపుడు అది పూర్వమువలె త్రాడు–త్రాడుగనే తోచును. అజ్ఞాన స్థితికి పూర్వము అజ్ఞానము తొలగిన తరువాత అది త్రాడేకాని పాము ఎన్నడును కాదు.

ఇక కృష్ణుడు తాను స్వయముగ బోధింపక తత్త్వవిదులు - జ్ఞానులైన గురువుల నాశ్రయింపుమని అర్జునునకు చెప్పనేల? అను విషయము శ్రీ కృష్ణుడు జ్ఞానులను తనకు భిన్నులుగా చూచినాడా? "జ్ఞానీ త్వాత్మైవ మేమతం" జ్ఞానియు నేను ఏకము - అభిన్నము అని తెలుపలేదా? వారి బోధయే తన బోధ కాదా?

నా. గో. చం: అవును. బాబా! భగవద్గీతను సంపూర్ణముగ నాకు బోధింపుము.

సా. బా: ప్రతి దినము ఒక అధ్యాయము అధ్యయనము చేసి నా దగ్గఱకు వచ్చి కూర్చుండుము.

నా. గో. చం! ఆ విధముగనే చేయుదును.

అది మొదలు నానా ప్రతిదినమొక అధ్యాయము చదివి వెళ్ళి బాబా పాదముల ముాలగూర్చుండెను. అందలి భావమతనికి చక్కగ బోధపడెను.

సాధనము 5

(ఎ) గ్రంథములు - (పోటీ) పారాయణము.

(ఎ) హరి సీతారాం దీక్షిత్తు

138-ఎ. సా. బా: కాకా! ఈ రెండు చాలును. అవి 1. అధ్యాత్మ (భావార్థ) రామాయణము 2. ఏకనాథ భాగవతము. వీనిని పఠింపుము. (తరువాత దీక్షిత్తు కూతురు మరణించెను. అధ్యాత్మ రామాయణమున

శ్రీ రాముడు మండోదరిని ఓదార్చు ఘట్టము చదువుమని బాబా బోధించెను.)

(బి) లక్ష్మన్.

184. సా. బా: (లక్ష్మణ్‌తో) ఇది – తిలక్ గీతా భాష్యము మంచిది. బాబా ఆ గ్రంథముతో గూడ ఒక రూపాయి ఇచ్చెను.

(సి) కుశభావ్

185. సా. బా: (కుశభావ్‌తో) ఈ మసీదునకు వచ్చి గురు చరిత్రము చదువుచుండుము.

185-ఎ. సా. బా: దాసబోధ పఠింపుము!

(డి) జి. జి. నార్కే

186. సా. బా: (నార్కేతో) ఉత్తమమైన గ్రంథమును (యోగ వాసిష్ఠమును) చదువు చున్నాడవు. అందుండి 15 రూపాయలు దక్షిణ నాకిమ్ము (అనగా – యోగ వాసిష్ఠమున 15 అంశములకు సంబంధించిన కొన్ని పరిచ్ఛేదములను చదివి, వానిని మననము చేసి, హృదయమున హత్తజేసికొనుము. ఆ విధముగ తన హృదయాసీనుడైన బాబాకు వానిని దక్షిణ నిచ్చినట్లగును – అని బాబా కావించిన బోధ.)

(ఇ) ఉపాసనీ మహారాజు

187. సా. బా: (ఉ. మ.తో) ఇది (పంచదశి) మా (ఖజానా) ధనాగారమై యున్నది. (మాకు కావలసినదంతయు నిందుకలదు అని భావము)

(ఎఫ్) మూలేశాస్త్రి

188. సా. బా: (మూలేశాస్త్రి) ఈ ద్వారకామాయి యందు పది దినములు నారాయణోపనిషత్తు – తైత్తిరీయ భాగము అవృత్తి చేయు చుండుము. (ఆ విధముగ జరుపబడెను.)

(జి) బి. వి. దేవ్

189. సా. బా: [బి. వి. దేవ్‌తో] జ్ఞానేశ్వరి [భగవద్గీతలకు సుప్రసిద్ధమైన మరాటి వ్యాఖ్య] పారాయణము చేయుము. చూ. 126

[హెచ్] రామవిజయము

190. సా. బా: [చరమకాలమున] మృత్యుంజయ ప్రీతికొఱకు రామవిజయము ఇక్కడ [మసీదునందు] పఠించుచుండుము. [ఆ విధముగ జేయబడెను.]

[ఐ] యం. బి. రేగే

191. సా. బా: [రేగేతో] నీ వేమియు గ్రంథపఠనము చేయనక్కఱ లేదు. కాని, నన్ను నీ హృదయమున నిలుపుకొనుము.

ప్రతి గురుపూర్ణిమనాడు బాబా ద్వారకామాయి మసీదున తన గద్దెపై కూర్చుండువాడు. భక్తులు తమ కిష్టములగు గ్రంథములను తీసికొనివచ్చి బాబాను జేరి సమర్పించువారు. బాబా వానిని స్పృశించి, ఆశీస్సులతో వానిని తమకు తిరిగి ప్రసాదించిన తమ పఠనసిద్ధి ఫలము లభించునని వారి సంకల్పము.

బాబా సాధారణముగ అటులకొనిరాబడిన గ్రంథముల తెచ్చిన వారికి తెచ్చినవి తిరిగి యిచ్చువాడు. ఒక్కొక్కవేళ ఒకరు తెచ్చినది మఱియొకరికి పర్యాయముగ మార్చి యిచ్చుచుండువాడు. ఒక గురిపూర్ణిమకు ఒక భక్తుడు [యం. బి. రేగే] ఏ పుస్తకము తీసికొనిరాలేదు.

సా. బా: [రేగేవంక చూచుచు నీవు మంచిపని చేసితివి. నీవే గ్రంథమును చదువవలదు! వీరీ గ్రంథములందు బ్రహ్మమును [ద్వైవమును] చూడగలమని తలంచుచున్నారు. కాని వారు కాంచునది 'భ్రమ' మాత్రమే. నన్ను నీ హృదయమున నిలుపుకొనుము. నీ మనస్సును, బుద్ధిని ఏకము చేయుము! చాలును.

బి. నామజపము

192. సా. బా: [యస్. ఆర్. యస్. తో] "రాం రామీఘ్యా"
[అనగా – రామనామము స్మరింపుము]

193. సా. బా: [జి. యస్. కపర్దేతో] ఎల్లప్పుడు "రాజారాం -

రాజారాం" అని స్మరింపుము! నీ వటుల గావించిన నీ జీవితము ధన్య మగును. నీవును శాంతిని, అనంత శ్రేయమును పొందుదువు.

సా. బా: (రావుబహద్దూర్ యం. డబ్ల్యు. ప్రధాన్‌తో) మనమేమి స్మరింప వలయును? "శ్రీరాం - జయరాం - జయజయరాం -"

195. సా. బా: (హ. సీ. దీక్షిత్‌తో) (చూ. 293 నామస్మరణము)

నేను నిరంతరము 'హరి' - 'హరి' యని స్మరించుచుంటిని. హరి నా కపుడు ప్రత్యక్షమయ్యెను. అప్పటినుండి ఔషధము లిచ్చుటమాని 'ఉధి' ప్రసాదించితిని.

196. సా. బా: (ఒకరితో) అల్లా అచ్ఛా కరేగా!

రాం - రాం - హ్మణా! (రాం - రాం - అని స్మరింపుము. దైవము నిన్ననుగ్రహించును.)

197. సా. బా: (బాంద్రాబాలునితో) పోటీ పఠింపుము - అనగా పారాయణము చేయుము! ఏదో ఒక నామజపము చేయుము!

బాం. బా: బాబా! నేను చేయను. ఎప్పుడైన నేను మఱచిన నాకు పాపము కలుగును.

సా. బా: (తల్లితో) అమ్మా! నేనిపు డీతని సంపూర్ణ బాధ్యతలు వహింపవలయును.

198. సా. బా: నాకు హృద్రోగముండెను. విష్ణుసహస్రనామములు నా హృదయమున హత్తుకొనియుంటిని. హరి యందుండి దిగివచ్చెను. (అవతరించెను) నాకు స్వస్థత కలిగెను.

2. సాయినామము

జస్టిస్ యం. బి. రేగే కావించు సాయీ నామజపము బాబా అంగీక రించెను.

సాధనము 5.

సకలము నందున్న దైవముగ బాబాపూజ

199. సా. బా: నానా! పూరణ పోలీ నాకు ప్రియము. నైవేద్యము నకు సిద్ధముచేసి తీసికొనిరమ్ము.

నా. గో. చం: బాబా! ఆలస్యమైనది వంటమనిషిలేడు.

సా. బా: సందేహింపకుము.

అంత చందోర్కరు 8 పూరణ పోలీలు అనుపాకములతో పళ్ళెరముల గొనివచ్చి బాబా ముందుంచెను.

నా. గో. చం: బాబా! ఆరగింపుము!

బాబా కొంత తడవువేచెను. అపుడు చీమలు - ఈగలు పోలీలపై చేరెను.

సా. బా: మంచిది. ఈ పళ్లెరముల గొనిపొమ్ము!

నా. గో. చం: బాబా! వానిని తాకనైన తాకక, తీసికొని పొమ్మందువిదియేమి? నీవేమియు భుజింపనియెడ నన్నేల వానిని సిద్ధపఱుప మంటివి? నీవే కొలదియేని స్వీకరింపని యెడల ఈ పళ్లెరముల తీసికొని పోవను - నేనును భుజింపను.

సా. బా: నేను పోళీలను తింటిని. ఈ పళ్లెరముల గొనిపొమ్ము. నీవు భుజింపుము.

నా. గో. చం: నీవు పోలీ భుజించితివా? ఎప్పుడు? పళ్లెరములలో తెచ్చినవి తెచ్చినట్లున్నవి. నీవు తిననితప్ప - వాని నిచట నుండి తీసికొని పోవను.

నా. గో. చం: ద్వారకామాయి మసీదునుండి వెళ్ళి చావడితో ఆకటితో పరుండెను.

(బాబా తన బిడ్డ పొందు బాధచూచి సహింపజాలక నానాను పిలిపించెను.)

సా. బా: నానా! నేను పోలీ యింతకుముందు భుజించితిని. మూర్ఖత వహింపక పళ్ళెరములను తీసికొనిపొమ్ము. నీవు భుజింపుము.

నా. గో. చం: (దులబరించుకొనుచు చావడికి తిరిగి వెళ్ళెను - బాబా మరల పిలువనంపెను.)

సా. బా: ఏమి? నానా! నీవు నాదగ్గఱ 18 సంవత్సరముల నుండి యున్నావు. ఈ మాత్రమేనా నీవు గ్రహించినది? నన్ను గూర్చి నీ అభిప్రాయమిదియేనా? ఈ 3-1/2 మూరల ప్రమాణము గల దేహమే బాబా - అని నీవు గ్రహించితివా? ఆ మాత్రమేనా?

అహా! చిన్న చీమగా నేను భుజింతును. ఆ భుజించు ఈగ యందుండి నేను భుజింతును. నేను కోరిన రూపమునందుండి ఆ రూపమున నేనే భుజింతును. నీ పోలీ యెప్పుడో నేను భుజించితిని. క్షమింపరాని మౌఢ్య మింకేమాత్రము వహింపకుము.

నా. గో. చం: బాబా! నీవిటుల చెప్పినను నే నేమియు గ్రహింప జాలను. నేనేమి చేయగలను? నేను గ్రహించు నటుల చేయుదువేని ఈ పళ్ళెరముల తీసికొని వెళ్ళెదను. నేను భుజించెదను.

అంతట బాబా, నానా హృదయ మందడగియున్న నాకగోప్యమగు విషయము బోధపడునట్లేదో సైగచేసెను. దాని భావము నానాకు తప్ప ఇతరులకు బోధపడలేదు. అంతట చందోర్కరు శ్రీ సాయిబాబా తన అంతర్యామి యనియు, అట్లగుటచే సర్వాంతర్యామి యనియు - అనగా చీమలు - ఈగలు మొదలగు జీవములం దధివసించియున్న వాడని స్వానుభవమున గ్రహింపజాలెను.

నా. గో. చం: బాబా! ఈ పళ్ళెరములను తీసికొని వెళ్ళెదను.

సా. బా: నానా! ఈ నా (గుర్తు) సైగ నీవు గమనింతువేని నేనా యా రూపముల నీవిడు పదార్థములను స్వీకరింతునని తెలిసికొనగలవు. (చూ. 72.)

ప్రత్యుద్గమ ప్రశ్రయణాభి వాదనం విధీయతే సాధు మిథఃసుమధ్యమే
ప్రాజ్ఞైపరస్మై పురుషాయచేత సా గుహాశయా యైవ సదేహ మానినే
సత్త్వంవిశుద్ధం వసుదేవశబ్దితం యదీయతే తత్రపుమా నపావృతః
సత్త్వేచ తస్మిన్ భగవాన్ వాసుదేవో హ్యధోక్షజో మే మనసా విధీయతే.

శ్రీమద్భాగవతము 4 – (3) 22, 29

(శివుడు దాక్షాయణితో చెప్పు పలుకులు)

(లోకంబున జనులన్యోన్యంబును ప్రత్యుత్థానాభి వందనంబులు గావింతురు. అదియు ప్రాజ్ఞులయినవారు సర్వ భూతాంతర్యామియైన పరమపురుషుండు నిత్య పరిపూర్ణుండు గావున కాయికవ్యాపారం బయుక్తంబని తదుద్దేశంబుగా మనంబునంద నమస్కారాదికంబు లాచరింతురుగాని దేహాభిమానంబులు గల పురుషులందు గావింపరు. గాన యేనును వాసుదేవ శబ్దవాచ్యుడు శుద్ధసత్త్వమయుండు అంతఃకరణంబు నందు ఆవరణ రహితుండునయి ప్రకాశించు వాసుదేవునకు నా హృదయంబున నెల్లప్పుడు నమస్కరించు చుందును.)

సాధనము 6 ప్రకృతి దృశ్యములు

200-(ఎ) బాబా తఱచుగ అస్తమించు సూర్యునివైపు చూచుచుండును. ఒక్కొక్కయెడ పెద్దపావురాళ్ళ గుంపు సొంపును గని ప్రేమించువాడు.

(బి) కె. జి. భీష్మ, బల్వంతు కపర్దే కలిసి షిర్డియందొకనాటి ఉదయకాలమున విహారమేగిరి. స్వల్పముగ మంచు గురియుచుండెను. సూర్యుడుదయించు చుండెను. భీష్మ – పడమరకు తిరిగెను. అతని పాదముల దగ్గఱ నుండి పడమట దిక్కు కొనవఱకు అపార దూర మాతని నీడ వ్యాపించినట్లుండెను. పడమట ఆకాశమున అతని నీడ ఇంద్రధనుస్సును గూడి, తలపై కిరీటమును పెట్టినట్లుండెను. ఆ దృశ్యమతనికి గొప్ప ఆనందమును గూర్చెను. అది అనంతము ప్రకాశవంతమగు అతని ఛాయయే. జీవాత్మ – పరమాత్మను చేరుచుండెనా! యనునట్లుండెను. క్షణకాలమతడు అపరిమితానందమున తేలెను. బల్వంతు కూడ ఆ విధమగు ఆనందము నొందెను. ఇరువురు తిరిగి వెళ్ళగా జి. యస్. కపర్దే వారికి బాబా క్షణమాత్రము ఆత్మసాక్షాత్కార

భాగ్యము అనుగ్రహించెనని పలికెను. అంత వారిరువురు బాబా ధగ్గఱకు చేరగా, కపర్దే మాటలకు తన అంగీకారము దెలుపుచుండెనా యనునట్లు బాబా చిఱునవ్వు నవ్వెను.

గమనిక : సింధునది – నారాయణ సరస్సుదగ్గఱ సముద్రమును జేరు దృశ్యానుభూతి (భాగ 6-5) – 3-5)

"తదుప స్పర్శనాదేవ వినిర్ధూత మలాశయాః
ధర్మే పారహంస్యేచ ప్రోత్పన్న మతయోప్యత"

సాధనము 7 సంగీతము – (గానము)

1. లయ – బ్రహ్మ సంబంధమైన విద్య – బాబా – సంగీతము.

201. సంగీతమునందు చక్కని ప్రవేశముగల భక్తుని (యం. వి. రేగే) బాబా పిలువనంపి -

సా. బా: కానిమ్ము? గానము సలుపుము.

భక్తుడు పాడెను. అందలి లోపములను బాబా సవరించి మఱికొన్ని శృతులను - స్వరముల నాలపించు విధానమును సూచించెను.

బాబా షిర్డికి జేరిన క్రొత్తలో తఱచుగ రాత్రులందు 'తాకియా' (మహమ్మదీయుల విడిది గృహము) యందు కాళ్ళకు చిఱుగజ్జెలు కట్టుకొని నృత్యముచేయుచు కబీరు గేయములు మొదలగునవి కీర్తించువాడు. 1890 తరువాత చాల అరుదుగ కావించెను.

202. సా. బా: (అబ్దుల్ రహీం రంగారీతో) నీవు నిన్న వచ్చి యుండిన ఇంకను బాగుండెడిది.

అబ్దుల్ : ఏల?

సా. బా: గానము! సంగీతము జరిగెను. నేను రాత్రి యంతయు ఏడ్చితిని. వారు నన్ను దూషించిరి.

అబ్దుల్ : వారేల నిన్ను దూషించిరి?

సా. బా: నేను "దూషించిరి" - అనిన జనులు సాధారణముగ గ్రహించలేరు. నీవు గ్రహింపగలవు.

అబ్దుల్ : భగవానుని ప్రేమించువాడు దైవ సంకీర్తనము కావింప బడు చుండుగ ఏడ్చును, నవ్వును, ఆనందమున నాట్యము చేయును.

సా. బా: అవును సత్యమును పలికితివి. నీకు గురువు కలడుగదా?

అబ్దుల్ : కలడు, "బీబీ బరీషా - చిష్టి - నిజమా." *

సా. బా: కావుననే నీవు గ్రహింపగలవు.

1. వీణావాదన తత్త్వజ్ఞః శ్రుతిజాతివిశారదః
   తాలజ్ఞశ్చా ప్రయాసేనమోక్షమార్గంపగచ్ఛతి.(యాజ్ఞవల్క్యస్మృతి)
2. స్వరబ్రహ్మణి నిర్భాత హృషీకేశ పదాంబుజే
   అఖండ చిత్తమావేశ్యలోకానను చరన్మునిః (భాగ 6 (5)-22)
   "గీతార్థము - సంగీతానందము" (త్యాగరాజకృతులు)

(భగవద్గీతలోని అర్థము - సంగీతానందములలో (హనుమంతునిలో) కలదు - అని శ్రీరాముడు మారుతికి దెలుపుచున్నాడు.)

నైతిక బోధలు - చక్కదిద్దుట.

శత్రుషట్కము - కామము - కోపము - లోభము -
మోహము - మదము - మాత్సర్యము.

203. బాపూసాహెబ్ జోగ్ : బాబా! అనన్యభావమున ఇంత కాలమునుండి నీసేవ చేయుచున్నాడను. నా సేవ ఫలించెనని నే నెట్లు తెలిసికొనగలను?

సా. బా: నీవు నావలె సర్వబంధములనుండి విడివడి నా భావము పొంది, నావలె 'కుఫ్నీ' ధరించి, భిక్షించి జీవింప నేర్చినపుడు మన యిరువుర హృదయములను ఆనందింపజేయు నీ సేవ సఫలమైనది - అని గ్రహింపుము.

---

* ఈ చిష్టీగురు వెక్కడికి ప్రయాణము చేసినను మేళతాళములతో పోవును. ఈ చిష్టీపంథావారు సంగీతమును మనోలయ సాధనముగ నుపయోగింతురు.

కామము (ఎ) దేవదాసు

204. సా. బా: సన్న్యాసియైన దేవదాసుతో 1. వైరాగ్యము పొందు కొలుపుకొనుము. 2. యతులకు కాంతలు అపాయ కారకములు - ప్రతిబంధములని గ్రహింపుము. 3. మోహము - సుఖము మొదలగు ఉపాధులను విడువుము. 4. భగవానుని ధ్యానింపుము. అజ్ఞానమును త్యజింపుము. కామమును జయింపలేని వానికి దైవప్రాప్తిలేదు - దైవ సాక్షాత్కారమును పడయజాలడు.

కామ వ్యామోహమును జయించుట. (బి) నా. గో. చందోర్కరు.

205. నా. గో. చందోర్కరు బాబాచెంత మసీదులో కూర్చుండి యుండగ ఇరువురు ముస్లింకాంతలు (గోషాస్త్రీలు) బాబాను సందర్శించుటకు వచ్చిరి. చందోర్కరు లేచి యావలకు వెళ్ళ బ్రయత్నించెను.

సా. బా: నీవు వెళ్ళలవదు; ఉండుము. వారు రాదలచిన రానిమ్ము!

ఆకాంతలు బాబాను సమీపించిరి. వారిలో వృద్ధవనిత ముసుగు తొలగించి బాబా దర్శనము చేసికొనెను. ఆపిదప రెండవ యువతి ముసుగును తొలగించి బాబాను సందర్శించి, మరల ముసుగు కప్పుకొనెను. నానా ఆమె చక్కదనమున కబ్బురపడి - "ఈ అసాధారణ సుందర ముఖము మఱియొకమాఱు చూడగలనా?" అని, తనలో దలంచెను. బాబా వెంటనే అతని తొడపై చఱచెను.

సా. బా: నానా! నేనెందుకు కొట్టితినో నీ వెఱుగుదువా?

నా. గో. చం: సర్వజ్ఞుడైన నా గురుదేవుని నుండి నేనేమి మఱుగు జేయగలను? బాబా! మీ సమక్షమున నుండగ అట్టి అల్ప సంకల్పములు నా మనస్సు నెట్లు లోగొనుచున్నవో నేనెఱుగజాలను.

సా. బా: నానా! నీవు కేవలము మానవమాత్రుడవు. కాదా? దేహము కోరికలతో నిండినది. ఏదేని విషయము ఇంద్రియగోచరమైన మాత్రమున ఆ కోరిక వెలికి తోచును. కానీ, చిత్రవిచిత్ర వర్ణశోభితములు, సుందర బాహ్యాకారములు గల దేవాలయము లీప్రపంచమున అరుదా? మన మచటకు వెళ్ళినపుడు ఆ వెలుపలి రమ్యాలంకారములను జూచి ఆనందించుటా? లేక, ఆ గుడియందున్న దైవమును జూచుటా? లోపలనున్న

దైవమును చూచుచున్నపుడా వెలుపల సౌందర్యమును లెక్కింతువా? లేక ఆ పరమాత్మ స్వరూపమును లక్షింతువా? భగవానుడొక్క దేవళమునందే యున్నాడా? దేవాలయము లందున్నటుల ఈ ప్రపంచమున సకలవస్తువు లందును దైవములేడా? మనమెల్లవేళల గుర్తింపవలసినది ఆ వెలికితోచు సురూప కురూపములను గాదు. అందు అధివసించియున్న దైవమునే.

బాహ్య సౌందర్య రూపములను జూచుటయందు లోపమేమియును లేదు. కాని, అటుల చూచునపుడు అట్టి మనోహరమైన నివాసమును కల్పింపజాలిన ఆ దైవమెంత శక్తిసంపన్నుడో! ఎంత నేర్పరియైన శిల్పియో మన మూహించుకొనవలయును.

నానా! నీ తలంపు లీమార్గమున నడచిన నీవా ముస్లిం యువతి ముఖరామణీయమును మఱియొక మాఱు చూడవలయునని కోరుకొని యుండవు. ఈ విషయము నీ మనస్సు నందెల్ల వేళల నిలుపుకొనుము!

(సి) హెచ్. వి. సాతే

206. హెచ్. వి. సాతే – ఒక సెటిల్మెంటు ఆఫీసరు బాబా భక్తుడు. షిర్డియందు సాతేవాడలో తన నివాసమున నున్నవాడు. ఒకనాడు వేడుకకై మంచి నడవడిలేని బాబా భక్తురాలిని చూడబోయెను. వెళ్ళుటకు ముందు ఆ ఉదయమున బాబాను సందర్శించినాడు.

సా. బా: సాహెబ్! 'శాలకు' వెళ్ళియుంటివా?

సాతే : ఏమి బాబా! నన్ను బడికి పంపకయే డిప్యూటి కలెక్టరును కావించితివా?

బాబా 'శాల' అను పదమునకు స్థానిక అర్థము. అతడు గ్రహించలేదని ఆ విషయమును అంతటితో నిలిపెను. తరువాత సాతే 'శాల' అని ఆచట పిలువబడు ఆ చెడిపయింటికి వెళ్ళెను. ఆమెతోడి సంభాషణలు క్రమముగ వ్యామోహావేశకరములై అతనికి పతనముగూర్చు స్థితికి గొని వచ్చినవి. తటాలున వాకిలి తలుపు తెరువబడెను. బాబా ఆ తలుపుదగ్గఱ నిలబడి, యేవియో సైగలు – అహా! ఇంతదూరము నీ గురువుదగ్గఱకు వచ్చితివి. ఇపుడు నరకమునకు దిగుచుంటివా– యేమి? ఎంత చక్కని ప్రవర్తనము? – అను భావము ప్రకటమగునట్లు చేసెను.

అంతట బాబా అదృశ్యుడయ్యెను. ఈ విధముగ తన నియంతమైన బాబాచే అదనున సాతే రక్షింపబడెను. సాతే ఆ 'శాలను' వెంటనే విడిచి వెళ్ళెను. మరల ఆ చెడిపను చూడలేదు.

కోపము (ఎ) రామదాసి

207. సా. బా: (రామదాసి) నీవు నిరంతరము ఆధ్యాత్మ రామాయణము పారాయణము చేయుచుంటివి. ఇంకను నీ హృదయము కల్మషరహితము కాలేదు. నీవు సహస్రనామములను వల్లింతువు - కాని, నీ కష్టములు తొలగలేదు. నీవు నన్ను 'రామదాసి' యని చెప్పుకొను చున్నావు. నీవు రామదాసివే అయిన సకల విషయములకు విముఖుడవు కావలయును. నీవు దేనియందును 'మమత' కలిగియుండరాదు. సకలమున 'సమత' పాటించుచు, సకలమును సమదృష్టితో చూడవలెను. నీవు పిల్ల వానివలె ప్రవర్తించుచు ఒక పుస్తకము కొఱకు తగవులాడు చున్నాడవు. ధనమును వెచ్చించిన పుస్తకములు కోకొల్లలుగ దొరకును. కాని, మనుష్యులు-మిత్రులు దొరకరు.

208. సా. బా: ఎవడేని ఇతరుని కోపించెనేని నేను వెంటనే బాధపడుదును. ఇతరుని ఎవడేని నిందించిన నేను నొచ్చుకొందును. ఇతరులు నిందించిన ధైర్యముతో సహించువానిని గూర్చి మిక్కిలి సంతోషింతును. (చూ. 289.)

(బి) జోగ్

209. సా. బా: (జోగ్‌తో) దక్షిణ నిమ్ము!

జోగ్ : (కోపముతో) బాబా! నా దగ్గర ఒక పైసాకూడా లేదని నీ వెఱుగుదువు. నేనెట్లీయగలను?

సా. బా: ఈయకుము - కాని, నీకా ఆగ్రహావేశమెందుకు?

[సి] ఆర్. బి. పురందర్

210. సా. బా: [పురందర్‌తో] ఎవరేనివచ్చి నిన్ను తిట్టిన, కొట్టినను వానితో పోరాడకుము. నీవు సహించలేనియెడ సౌమ్యముగ నొకటి రెండు పలుకులు పలుకుము. కాదా - అచ్చోట విడిచిపొమ్ము.

కాని. వానితో గ్రుద్దులాడి ప్రతీకారము కావింపకుము. నీవు ఇతరులతో కలహించుచున్న నేను విసుగునొంది బాధపడుదును.

[డి] ప్రధాన్ సతి

211. సా. బా: [ప్రధాన్‌సతితో] ఎవరేని మనల పదిమాటలనిన సమాధానము చెప్పదలచిన ఒక్కమాటతో సరిపుచ్చుము. ఎవరితోడను కలహింపవలదు.

[ఇ] బాబా - కోపజయము

212. బాబా కోపోద్రిక్త సమయమున నుండగా ఉద్దవేశభావ్ బాబాను సమీపించి, ప్రణమిల్లి, సెలవుకోరెను. బాబా వెంటనే శాంతించి, మిక్కిలి సౌమ్యముగ "వెళ్ళుచున్నావా! ఎప్పుడు వచ్చెదవు? మరలమరల పక్షమున కొకమారు రావలదు. నేను నీతోడ నున్నాడను. మంచిది! వెళ్ళిరమ్ము!" అనెను.

213. బాబా మిక్కిలి కోపావేశముననున్న సమయమున సామంతు [పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు] కొంచెము దూరమున నిలిచియుండి "బాబా వెంటనే సెలవు ఇచ్చినగాని వెళ్ళి, రైలుబండిని అందుకొనుటకు సాధ్య పడదని, లేకున్న పైయధికారివలన మాట వచ్చునని" తలంచెను.

సా. బా: వెళ్ళదలచిన వారినందఱను వచ్చి 'ఊధి' తీసికొనుడని చెప్పుము!

214. కాకా ధూపేశ్వర్ పనుపున షిర్డి మసీదునుజేరిన 'తానా' ప్లీడరు 'జోషి'ని, మఱియొకనిని కోపావేశముననున్న బాబా చూచెను.

సా. బా: వారినిక్కడకు దీసికొనిరమ్ము! వారు సమీపింపగనే బాబా మిక్కిలి శాంతించి, "ఆ ముసలివానిని జంపి ఇక్కడకు వచ్చినారా?" అని అడిగెను.

గమనిక : వారిని షిర్డికి వెళ్లుడని ఆదేశించిన పిదప
కాకా ధూపేశ్వర్ మరణించెనని భావము. [చూ. 411]

బాబా – కోపము

215. సా. బా: నా కెవరిమీదను కోపములేదు. తల్లి బిడ్డలకు హానిచేయునా? సముద్రము నదీ జలములను వెనుకకు త్రోసివేయునా? నేను భక్తిని ప్రేమింతును. నా భక్తులకు నేను సేవకుడను.

216. సా. బా: నానా! నీపై నాకు కోపములేదు. నా బిడ్డలైన మీకు నాపై కోపపడుటకు అధికారము గలదు. వేంకుశుడే యిచ్చట నున్న నే నాయనపై కోపపడుదును. (చూ. 179)

217. సా. బా: (బాబా కోపించుచునని భయపడుచున్న ప్రధాన్ సతితో) చూడుము! నే నీ దినమున నెవరిని కోపించుట లేదు.

218. సా. బా: (తీవ్రకోపావేశమున నున్న సమయమున) ఎల్లరకు శుభాశీస్సులు! – శుభములు కలుగు గాక!

218-ఏ. (226) (ద్వేషము) సా. బా: (షిర్డిలో నొక యింటి యజమాని తనకు విరోధి యగుటచే తనను విందునకు పిలువ లేదని చెప్పిన దాస్‌గాణూతో) ఎవరు దేని నెవరి కిత్తురు? ఈ విందేమిటి? యెవరు భుజింతురు? నీకు విరోధియని యెవరిని గూర్చి పలుకకుము. యెవరు యెవరి విరోధి? యెవరియెడ ద్వేష బుద్ధి వహింపకుము. ఎల్లరు ఒకరే - అభిన్నులే.

"త్వయిమయిసర్వత్రైకోవిష్ణుః వ్యర్థం కుప్యసిమయ్యసహిష్ణుః
భవసమచిత్తస్సర్వత్రత్వం వాంఛస్యచిరాద్యదివిష్ణుత్వమ్"

(మోహము ద్గర)

గర్వము

(ఎ) తీర్థ యాత్రిక గర్వము : (బాబా - హాజీ గర్వమడచుట.)

219. (మక్కా తీర్థయాత్ర చేసివచ్చిన) ఒక హాజీ షిర్డి మసీదునకు జేరవచ్చెను.

సా. బా: మసీదు లోనికి రావలదు! ఆ హాజీ వెనుకకు తిరిగి వెళ్ళెను. మసీదు లోనికి బాబా అతనిని రానీయకుండుటచే షిర్డియందే

యుండెను. కొన్ని నెలల తరువాత శ్యామా ద్వారా బాబాకు తన విషయము చెప్పించుకొనెను. బాబా ఆ హాజీని పరీక్షించి అతని గర్వము నడచెను.

సా. బా: (శ్యామాతో) బార్వేబావి దగ్గరనున్న పొదల మధ్యగ యిరుకు కాలిబాటన సూటిగ నడచి వత్తువా? యని, చావడికి వెళ్ళి ఆ మనిషిని అడిగి రమ్ము!

శ్యామా వెళ్ళి ఆ హాజీ సమ్మతి గొనివచ్చెను.

సా. బా: (శ్యామాతో) వెళ్ళి, నాలుగు 'దఫాలుగ' 40 వేల రూపాయల నిచ్చునేమో అడిగిరమ్ము.

శ్యామా వెళ్ళి '40 లక్షల రూపాయల నిత్తు' నను సమాధానము గొని వచ్చెను.

సా. బా: (మరల మూడవ మాలు శ్యామాతో) శ్యామా! వెళ్లి అతనిని మేక మాంసమా? పిఱుదు టెముక మాంసమా? లేక, వృషణములా? — ఏది యిష్టమో — అడిగి రమ్ము!

శ్యామా వెళ్లి, "బాబా (కోలంబ) మట్టిపాత్రలోని ఒక చిన్న రొట్టె ముక్కతో మిక్కిలి సంతోషింతును" — అను సమాధానము గొనివచ్చెను.

అంతట బాబా స్వయముగ చావడికి వెళ్ళి ఆ హాజీని చెడతిట్టి (తనను వ్రేలితో జూపుచు) "ఇక్కడ నున్నది యెవరనుకొన్నావు? నీవు వ్యర్థముగ డంబములు చెప్పుకొనుచు 'గొప్పవాడను' — అని తలచు చున్నావు. 'కొరాను' — నిన్నటుల వర్తింపుమని బోధించు చున్నదా? మక్కా తీర్థ యాత్రను తలంచుకొని గర్వించుచున్నాడవు. కాని, నీవు నన్నెఱుగవు" అని, కఠినముగ పలికెను.

ఆ హాజీ భయభ్రాంతుడయ్యెను - బాబా మసీదునకు తిరిగివెళ్ళి, పండ్లను కొని, ఒక బుట్ట నిండుగనింపి, హాజీకి పంపెను. తరువాత 50 రూపాయల నిచ్చెను. అది మొదలు అతని యిష్టము చొప్పున మసీదునకు రావచ్చునని అనుమతి నిచ్చెను.

12)

(బి) హెచ్. వి. సాతే

220. సా. బా: (సాతేతో) (శంకుస్థాపనము చేయుటకు) నీ వచటకు ఏలపోవలయును? వీని అన్నిటితో మనకేమి సంబంధము గలదు? బేల్దారీలు, ఇతర పనివారలా పనిని గావింతురు.

(సి) దాస్‌గాణూ

221. సా. బా: (దాసుగాణూతో) సంకీర్తనము కావించుటకు ఒక పెండ్లికొమారునివలె ఆ వేషమేమిటి? నడుము పైభాగమున గల ఆ దుస్తులను-జరీతలపాగను – అవన్నియు తీసివేయుము. నారదమహర్షి కీర్తన పద్ధతి నిర్దేశించినాడు. కావున నారదుని మార్గమునే అనుసరింప వలయును.

(ధోవతి – నడుమునకు బిగించిన ఉత్తరీయము – చేతుల చిఱుతలు తాంబుర – ఇవి మాత్రమే ధరించవలెనని భావము.)

కుల గర్వము

(డి) ద. ఆఫ్రికా డాక్టరు (బ్రాహ్మణుడు)

222. మామ్లత్‌దార్ : (ద. ఆ. డాక్టరుతో) రమ్ము. సాయిబాబాను చూచి వచ్చెదము?

డాక్టరు : నేను రామోపాసకుడను. నేనితరులకు మ్రొక్కను.

మామ్లత్‌దార్ : వేఱుగ తలంపకుము – రమ్ము. నీవు మ్రొక్క వలసిన పనిలేదు.

ఆరతి సమయమున మసీదుదగ్గఱ కొంచెము దూరమున నిలచియున్న డాక్టరు తటాలున మసీదులోనికి దూసుకొనివచ్చి బాబా పాదముల వ్రాలెను.

మామ్లత్‌దార్ : (తరువాత) నీ మనస్సు నేల మార్చుకొని మ్రొక్కితివి?

డాక్టరు : సాయీబాబా శ్యామసుందరుడైన శ్రీరాముడుగ నాకు దర్శన మిచ్చినాడు. అందుచే మ్రొక్కితిని. ఈ సాయి యోగసంపూర్ణావతారుడు.

(మద్రాసీ రామదాసికిగూడ బాబా శ్రీరామచంద్రుడుగ దర్శనమిచ్చెను.)

ఆ డాక్టరు సత్యాగ్రహమునకు దొడగెను. బాబా తనను పిలువనంపి బ్రహ్మానందము – ఆత్మసాక్షాత్కారము ప్రసాదించు నంతవరకు మసీదునకు వెళ్ళనని మూడుదినము లుపవసించెను. కాని, నాల్గవనాడు చాల కాలమునుండి దూరమైన ఒక మిత్రునితో గూడి మసీదు జేరెను.

సా. బా: నిన్నెవరేని ఇక్కడకు రమ్మని పిలిచినారా?

డాక్టరు సిగ్గునొంది, తనకు పరమానందమును ప్రసాదింపుమని మానసికముగ బాబాను ప్రార్థించెను. ఆ రాత్రి షిర్డియందు, తరువాత తన పురమునందు బ్రహ్మానందానుభూతిని పొందగలిగినాడు.
(చూ. 112 జి. యస్. కపర్దే - బాబా యోగదృష్టి. మేనేజర్ సతి- అనుభూతి.)

(ఇ) మూలేశాస్త్రి

223. నాశిక్ నివాసి కులగర్వితుడైన మూలేశాస్త్రి షిర్డికి వచ్చినపుడు-

సా. బా: (ఒకరితో) నా వస్త్రములకు రంగు వేసుకొనుటకు కావి రంగు తీసికొనిరమ్ము.

(బాబా ఆ దినముననగాని, మఱి యే దినముననగాని కావిరంగు వస్త్రములను ధరించి యెఱుగడు.)

సా. బా: (బూటీతో) వెళ్ళి, క్రొత్తగావచ్చిన నాశిక్ బ్రాహ్మణుని వద్దనుండి నాకు దక్షిణగొనిరమ్ము.

ఆ నాశిక్ బ్రాహ్మణుడు "మూలే" వచ్చి మసీదులోనికి బోయిన మైల సోకునను తలంపున మసీదునకు కొంచెము దూరమున నిలబడి యుండెను.

అంతట మూలేశాస్త్రి బాబా స్థానమున తన గురువును చూచి, మసీదు లోనికి పరుగున వెళ్ళి, జై! గురు జై! ఘోలప్ మహరాజ్! అని పలుకుచు బాబా పాదముల వ్రాలెను.

సా. బా: దక్షిణ నిమ్ము!

కాని వస్త్రములు ధరించిన తన బ్రాహ్మణగురువు – ధోలప్ మహరాజ తటాలున అదృశ్యుడై ఆ స్థానమున బాబా కూర్చుండెను. అతడు బాబాకు దక్షిణ నొసంగెను.

(ఎఫ్) బాబా – బలగర్వమణచుట

224. బయ్యాజి - అప్పాజీ - పటేల్ - తనకు భీమ బలము కలదని గర్వించువాడు. బాబా తనువును "మాలీస్" - (ఒడలు పట్టుట) చేసిన తరువాత బాబాను తన చేతులలో లేవనెత్తుకొనివెళ్ళి, "ధుని"కి దగ్గఱగ దించువాడు. ఒక దినమున అటుల బాబాను లేవనె త్తదలచెను. కాని, సాధ్యము కాలేదు. అతనివంక జూచి బాబా నవ్వెను. ఆ నవ్వు అతని బల గర్వమును తొలగించు చిహ్నము.

(గమనిక : వాయువు ఒక తృణమును లేవనెత్త వ్యర్థ ప్రయత్నము చేయుట - కేనోపనిషత్తు.)

(జి) నా. గో. చందోర్కరు విద్యాగర్వము.

సంస్కృత భాషా పాండిత్యము - ముఖ్యముగ గీతా భాష్య గ్రహణ శక్తి కలదని గర్వించు నా. గో. చందోర్కరు విద్యాగర్వమును బాబా అడచెను. (చూ. 182)

మత్సరము (ఈర్ష్య)

225. సా. బా: (నా. గో. చందోర్కరుతో) షడ్వికారములలో మిక్కిలి సులువుగ జయింప దగినది మత్సరము లేక ఈర్ష్య. ఈ వికారమును జయించుటలో మనకు గలుగు లాభముగాని, నష్టముగాని లేదు. ఇతరుల లాభసంపదల గాంచి సహింపలేక పోవుటయే ఈర్ష్య. ఇతరుడు భాగ్య సంపదలు- ఉన్నతశక్తి- అధికారము సంపాదించిన మనముచూచి ఓర్వలేము. పైగా - అతనినిగూర్చి నిందలు పలుకుదము. అతనికి నష్ట కష్టములు కలిగిన సంతోషింతుము - ఆనందింతుము. కాని, యట్టి వర్తనము మంచిదా? అతడు గొప్ప ఐశ్వర్యములను పొందిన మనకు వాస్తవముగ నష్టమేమికలదు? కాని, జనులు ఈదృష్టి వహింపరు. అతడు మేలుపొందిన అతనితోబాటు మనము ను ఆనందింపదగును. మనముకూడ అదృష్టవంతులమని, మేలుపొందితిమని

భావింపనగును. లేక, మనముకూడ అట్టి మేలుపొందుటకు ప్రయత్నము చేయదగును. మనకోరిక - మన నిశ్చయము ఆరీతిగ నుండవలయును. మనవద్దనుండి అతడేమి తీసికొనెను? - ఏమియులేదు. అతని పురాకృత సుకృత కర్మఫలముగ నతడా సంపదలను పొందెను. అట్టి దానిని గూర్చి మనమేల విచారపడవలయును? కావున, నానా! ముందుగ ఈర్ష్యను (మత్సరమును) జయింపుము.

లోభము - [పేరాశ]

226. సా. బా: ఇతరులయొక్క శ్రమ [కష్టము] గాని ధనముగాని ఉచితముగ స్వీకరింపకుము. దీనిని నీ జీవిత నియమముగ పాటింపవలయును.

[ఒక యింటి కప్పుమీద నుండి క్రిందకి దిగుటకు నిచ్చెన తెచ్చిన వానికి 2 రూపాయలిచ్చుచు బాబా పలికిన మాటలివి.]

227. సా. బా: [నా. గో. చం. తో] ఇతడొక పెట్టెను మనదగ్గఱ విడిచిపెట్టి వెళ్ళినాడు. ఇప్పుడు దానిని తిరిగి కోరుచున్నాడు. నిరాకరించుట మనకు తగదు. అతనికి చెందినదాని నతనికి తిరిగి యీయవలయును.

228. సా. బా: [జయగుడి బాలనివాస్కరుతో] ఆ భూములు తిరిగి బిడ్డలకు [కౌలునకిచ్చిన ఖామందులకు] ఇమ్ము. వారిని బాధింపవేల?

[క్షీరసాగర్ భూములను కౌలునకు తీసికొనిన "బాలనివాస్కర్" తో బాబా అనిన మాటలివి. ఈ భూములపై వచ్చు ఆదాయము బాబాకు సమర్పింపబడినది. కాని 'నివాస్కర్' ఆ భూములను తిరిగి యజమానికి విడుదలచేయ నిరాకరించెను.]

229. సా. బా: [అట్టాయీతో] నీ ఆస్తి సంపదలను అనుభవించువాడు - అన్నా నీ తండ్రి. అతనినే తిననిమ్ము. అతనితో వ్యాజ్యముల కల్పించుకొనకుము, దైవము నీకు సమృద్ధిగ కూర్చును.

230. సా. బా: [జోగ్‌తో] నీ ధనమునడుగుటకై నీకు బాకీ పడినవాని గ్రామమునకు వెళ్ళకుము. అప్పు తీసికొనినవాడే యిచటకు వచ్చును.

జోగ్ : బాబా! వానియంతటవాడువచ్చునా? ఎట్లు వచ్చును? వాడు వ్రాసి యిచ్చిన కాగితము (నోటు) వాయిదా కడవనున్నది.

సా. బా: వేచి యుండుము!

జోగ్ వేచియుండెను. వాయిదా దాటెను. ఆ బాకీపడిన వాడు స్వయముగ వచ్చి, అప్పు తీసికొనిన పైకము (అసలు) 1400 రూపాయలు చెల్లించెను. (చూ. 378)

(సాదు – శ్రేయమును కోరుకొనెను; బడేబాబా అటుల కాదు.)

231. 15-2-1915న సాయంత్రం 4 గంటలకు సాదుభయ్యా (సదాశివదండిరాజు) 'హర్దా' గ్రామమున కొందరు మిత్రులతో గూడి నడచుచుండెను. అతని యెదురు మార్గమునుండి బాబా నడచుచు వచ్చి అతని చేతిలో ఒక పల్లుకుట్టుపుడక నుంచి యదృశ్యుడయ్యెను (ఆవిర్భావము చూ. 52)

దైవమును విశ్వసింపని మిత్రుడు : ఇపుడు జరిగినదేమి?

సాదుభయ్యా : ఇది సత్యము. మనము వచ్చునపుడు నా చేతిలో పల్లుకుట్టుపుడక లేదు. ఇపుడు నా దగ్గర ఒకటి కలదు. బాబా దీనిని నా కిచ్చినాడు.

మిత్రుడు : షిర్డికి ఉత్తరము వ్రాసి, ఈ విషయమేల నిర్ణయింపరాదు?

సాదుభయ్యా : శ్యామాకు ఉత్తరము వ్రాసెను. శ్యామా పిలుపు ననుసరించి, భయ్యా షిర్డికి వెళ్ళి బాబా సమక్షమున జరిగిన దంతయు దెలిపెను.

సా. బా: సాదు! వెళ్ళి, బడేబాబాకు ఇదంతయు చెప్పుము. [సాదుభయ్యావెళ్ళి బడేబాబా డాక్టరుపిళ్ళె - మొదలగు వారియెదుట హర్దాలో జరిగిన వృత్తాంతము తెలిపెను. బడేబాబా చకితుడై, యోచించుచు, ఏడ్చుచు బాబా దగ్గఱకేగెను.]

బడేబాబా : ఏమి? బాబా! నీ వెంతసేపు నాకు ధనము మాత్రమే యిచ్చుచుంటివి. కాని, సాదుభయ్యాకు సాక్షాత్కారము ప్రసాదించితివి! [అని ఏడ్చెను.]

సా. బా: ఏమి చేయగలము? ఎవరు కోరునది వారు పొందుచుందురు.

[బడేబాబా అపరిమిత ధనముపొందుచు, దానిపై రాబడి పన్నులు చెల్లించినాడు. తుదకా ధనమంతయు కోల్పోయి మరణించెను.]

232. యస్. ఆర్. సహస్రబుద్ధి - భక్తులందఱకు బాబా ప్రసాదము పంచిపెట్టుట చూచెను. బాబా చేతిలో నున్న ప్రసాదమంతయు తఱిగి పోయినది. స్వల్పముగ నుండుటచే తనకేమియు ప్రసాదము మిగులదేమో! యని సహస్రబుద్ధి తలంచెను.

సా. బా: [అతని చేతిలో నొక రవ్వ ప్రసాదముపెట్టి] నీ కేమియు మిగులలేదు; అని అతని లౌకిక బంధములను - ఆశలను నిరసించినాడు.]

సంపద - [కాంచనము]

[ఎ] దక్షిణ.

233. భక్తుడు : [పురందర్] బాబా! అంత ధనము నీవేల అడుగుచున్నాడవు?

సా. బా: నేను ప్రతి వ్యక్తిని అడుగుటలేదు. ఆ ఫకీరు [దైవము] నిర్దేశించు వానినే అడుగుదును. కాని, అట్టి దానికి పదిమడుంగులు తిరిగి యీయవలయును. నాకొఱకు నేను ధనము తీసికొనను. నాకు కుటుంబములేదు.

ప్రతి ఉదయము బాబా ఒక పైసాకూడ లేని పేదఫకీరే. పగలంతయు అపారముగ దక్షిణలు ప్రోగగును. సాయంత్రము - చీకటి పడునప్పటికి అటుల ప్రోగైన ధనమంతయు పంచిపెట్టబడును.

పది సంవత్సరముల కాలము ఒక గవర్నరు ఆదాయము మించిన ధనము బాబా స్వీకరించినను మహాసమాధి నొందునాటికి ఆ తండ్రిదగ్గర 16 రూపాయలు మాత్రమే యుండెను.

234. ఇంటనొక ఉంపుడుకత్తె నుంచుకొని సుఖరోగములతో బాధ పడు నొకడు షిర్డికిజేరి బాబాకు మ్రొక్కి "బాబా! ఈ 500 రూపాయలు తీసికొను" మనెను.

సా. బా: (కోపముతో) నీ ధనము నాకేమియువలదు. నీయింట నొకతె నుంచుకొంటివి కదా? ఆమె కీధనము నిచ్చుకొనుము.

(తన గుట్టు వెలిబుచ్చబడుటచే నతడు సిగ్గునొంది వెడలిపోయెను.)

235. కొందఱు బాబాఉన్న మసీదునకు ప్రయాణమైవచ్చుచుండిరి.

సా. బా: (కోపముతో తీవ్రముగ తిట్టుచు వారు కావించిన దుష్ట పాపకార్యముల వెల్లడించుచు) దుష్టులు వారేమి మేలు పొందగలరు?

దూషణలు పూర్తియగు నప్పటికి ఆ మనుషులు గొప్ప గొప్ప బహుమానములతో మసీదులోనికి ప్రవేశించిరి.

సా. బా: నేనిపుడు చెప్పుచున్నది యీ విషయమే!

(అని, బాబావారి బహుమతుల నిరాకరించి, వారి ననుగ్రహింపకయే వెడల నంపెను.)

(గమనిక : భక్తుని సర్వబంథముల నుండి విడివడ జేయు నొక సాథనము – దక్షిణ.)

యస్యానుగ్రహమిచ్ఛామి తస్యసర్వం హరామ్యహమ్"

నేను అనుగ్రహింప దలచినవాని సర్వస్వమును హరింతును.

236. యస్. ఆర్. వి. జయకర్ – ద్వారకామాయి మసీదు నందుంచబడిన బాబా చిత్రపటమును లిఖించిన చిత్రకారుడు – జేబులో 2-1/2 రూపాయలుంచుకొని, బాబా యెదుట నిలచియుండెను. బొంబాయి నుండి "వార్దే" అను నతడు బాబానుచేరి –

వార్దే : బాబా! సత్యనారాయణ వ్రతము జరుపుకొనుటకు నా దగ్గర ధనములేదు.

సా. బా: నీకెంత కావలయును.

వార్దే : 2-1/2 రూపాయలు.

సా. బా: (జయకరును చూపుచు) ఈతని దగ్గఱ కలదు. ఇతని వద్దనుండి అప్పు తీసికొనుము.

వార్డే అతనిని కోరెను. తన దగ్గర మిగిలిన ఆ 2-1/2 రూపాయలను సొంతముగ జయకర్ యీయవలసి వచ్చెను.

237. పి. ఆర్. అవస్తే –ఇండోర్ జడ్జి. బాబా భక్తుడు. వేసవి సెలవులలో భార్యను, కుమారుని వెంటబెట్టుకొని షిర్డికి చేరెను. అతని కుమారుని వివాహము జరుపవలయునను ప్రయత్నమున నుండి, కుమారుని దగ్గర 400 రూపాయలు, భార్య దగ్గర రు. 300/- లు ఉంచెను. అతడు బాబాను సమీపింపగ –

సా. బా: (అవస్తేతో) దక్షిణ యిచ్చెదవా?

అవస్తే : ఎంత?

సా. బా: 30 రూపాయలు.

సా. బా: (అవస్తే కుమారునితో) నాకు 40 రూపాయలు దక్షిణ నీయుదువా?

ఈ విధముగ పలుమారులు అవస్తే సతిదగ్గర నుండి ఆమె కుమారుని దగ్గర నుండి 30 కొరవగా, ఉన్న ధనమంతయు బాబా దక్షిణ రూపమున స్వీకరించెను.

సా. బా: (అవస్తేతో) నీవు 30 రూపాయలు యిత్తువా?

అవస్తే : బాబా! – దానిని యివ్వవలసినదేనా?

సా. బా: ఇమ్ము!

అంత మనస్సున మిక్కిలి బాధపడుచు అవస్తే తన భార్యవద్దనుండి ఆ మిగిలిన రు. 30/-లు కూడ తీసికొని బాబాకు సమర్పించెను.

ఇక బాబా అతని నేమియు నడుగ లేదు.

బాబా దగ్గర నుండి విచారముతో తిరిగి పోవుచున్న అవస్తే వీపును విజయ సూచకముగ తట్టుచు -

బాపూసాహేబ్ జోగ్ : మిత్రమా! నిన్నభినందించు చున్నాడను. నీ దగ్గర నుండి బాబా పలుమారులు దక్షిణలు తీసికొనినాడు. నీవు

అదృష్టవంతుడవు. బాబా పది మడుంగులు తిరిగి ప్రసాదించుటకే స్వీకరించును.

అవస్తే - నే నది యెరుగను. నే నిపుడు వివాహ స్థలమునకు చేరుటకు చేతిలో పైసాకూడా లేదని మాత్ర మెరుగుదును.

జోగ్ : నీ కెంత కావలయును?

అవస్తే : నూరు రూపాయలు.

జోగ్ : ఇదిగో! తీసికొనుము. బొంబాయిలోని వర్తకుడు పోయినవి యని అనుకొనిన సరుకులు తిరిగి లభించిన నాల్గవ వంతు లాభము బాబాకు సమర్పింప దలచుటచే అతని కోరిక ఫలించి, బాబాకు 600 రూపాయల పంపినాడు.

3 రోజులలో మూడు వందలు ఖర్చు పెట్టినాడు. నీకు నూర రూపాయ లిచ్చితినని నేను చెప్పిన కాదనడు. తిరిగి తెమ్ము! అనడు. కా బాబా నీ దగ్గర నుండి 600 రూపాయలు స్వీకరించుటచే నీ కిప్పుడ జీతములో నెలకు 50 రూపాయలు పెంపు జరుగును - అని ఘంటా పథము నీకు తెలుపుచున్నాడను.

అవస్తే : నాకు జీతము పెంపుసేయగల అభిమాని ఎవ్వడు లేడ నే నెరుగుదును.

కాని జోగ్ తెలిపినట్లు వేసవి సెలవులు పూర్తికాగానే అవస్తేకు నెలక 50 రూపాయలు జీతము పెంపు చేయబడినట్లు ఉత్తరువులు అందినవి.

రాబోవు ధనము పెంపును సూచించుటయే.

తొలి ఫలము రూపమున దక్షిణ స్వీకరించుట.

238. సా. బా: (యస్. బి. ధుమాల్‌తో) భావ్! 50 రూపాయలు దక్షిణ తెమ్ము!

ధుమాల్ : బాబా! నా దగ్గర పైకము లేదు.

సా. బా: అయితే - సాహెబ్‌ను (హెచ్. వి. సాతే) అడుగుము. ధుమాల్, సాతే దగ్గరకు వెళ్ళి 50 రూపాయలు అడిగెను. సాతే

సంతోషముతో నిచ్చెను. సాతే తన పింఛనులో 50 రూపాయలతో హెచ్చు రావలయునని ప్రభుత్వమునకు పంపుకొనిన కాగితము ఆలోచనలో నుండెను. బాబా 50 రూపాయలు స్వీకరించిన దినముననే (ఆ తేదీననే) ఆ 50 రూపాయలు పింఛను వృద్ధి చేయబడినటుల ఉత్తర్వులు జారీ చేయబడినవి.

239. సోమనాథ్ యస్. డి. నిమోన్కర్ - పోలీసు సబ్ ఇన్స్పెక్టర్- 1912 న బాబాను చేరెను.

సా. బా: 10 రూపాయలు దక్షిణ యిమ్ము!

సోమనాథ్ : 10 రూపాయలు సమర్పించెను.

6 నెలల తరువాత బాబాకు 10 రూపాయలు సమర్పించిన తేదీనుండి జీతము పది రూపాయలు పెంపు చేయబడినటుల ఉత్తరువులు అందెను.

దక్షిణ – భవిష్యత్సూచకము – నిర్ణయము

240. ఆర్. యస్. దేవ్ 5 గదులతో ఒక భవనము కట్టదలంచి, బాబా అనుమతి కొరకు బాబాను జేరి మ్రొక్కెను.

బాబా నేలపై 25 గీతలు గీయుచు ఒక్కొక్క గదికి ఒక రూపాయ చొప్పున 25 రూపాయల నిమ్ము అనెను. దేవ్ ఆ పైకము బాబాకు సమర్పించెను. అతడు మొదట 5 గదులు మాత్రమే కట్టింప దలచి, వానిని పెంచుచు 25 గదులు కట్టించెను. ఇప్పటికి 25 గదులు మాత్రమే కలవు.

241. సా. బా: (యస్. బి. నాచ్నేతో – శంకరరావుతో) నాకు అరువది నాలుగు రూపాయలు ఈయుడు!

నాచ్నే : మా దగ్గర పైకము లేదు బాబా!

తరువాత బాబా జబ్బుపడినపుడు పేదలకు అన్నదానము చేయుటకై ధనము వసూలుచేసి పంపిరి. వారు ప్రోగుచేసినది మొత్తము 64 రూపాయలు

దక్షిణ – తొలి ఫలమును గైకొనుట

242. దాజీహరిలేలే – నాశిక్‌లో ల్యాండ్ రికార్డు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ – షిర్డికి వెళ్ళుచు మార్గమున 'కొపర్‌గాము' లో తన జీతము 125 రూపాయల నుండి 150 రూపాయలకు పెంపు చేయబడినట్లు గెజెట్‌లో చూచెను. అతడు షిర్డికిచేరి బాబాకు మ్రొక్కెను.

సా. బా: 15 రూపాయలు తీసుకొని రమ్ము!

లేలే : బాబా! నా దగ్గర పైకము లేదు.

సా. బా: నిన్ననే కదా! నేను 25 రూపాయ లిచ్చితిని పొమ్ము! పైకము తీసికొని రమ్ము!

లేలే అప్పు తీసికొనివచ్చి బాబాకు ఆ పైకము చెల్లించెను.

హెచ్. వి. సాతే అనుభవములను చూడుము.

దక్షిణ – మనుష్యుడు తీసికొనదగని – ఉంచుకొనదగని, ధనమును పరిహరింపబడుట.

243. యస్. బి. ధుమాల్, బాబా సేవకునిపై, మోపబడిన నేరము తీర్పుపైకోర్టులో అపీలు చేయుటకు కోరబడెను. (చూ. 404) బాబా చమత్కారము వలన క్రింది కోర్టులో చేయబడిన నేరము తీర్పు తోసి వేయబడి, బాబా సేవకుడు 'నిర్దోషి' అని నిర్ణయింపబడెను. ఆ నేరమునకు సంబంధించినవారు ధుమాలునకు 300 రూపాయ లిచ్చిరి. ఆ ధనమును తీసుకొని ధుమాల్ షిర్డికి జేరెను.

సా. బా: భావ్! దక్షిణ యిత్తువా?

ధుమాల్ : బాబా! యిత్తును.

ఈ విధముగ పలు తడవ లడిగి ఆ 300 రూపాయలను బాబా దక్షిణ రూపమున గ్రహించెను. ఆ తరువాత అడుగలేదు.

దక్షిణ – సంకల్పసిద్ధి కొరకు స్వీకరింపబడుట.

244. యం. డబ్ల్యు. ప్రధాన్ ప్రప్రథమమున బాబాను సందర్శించుటకు బయలుదేరునపుడు 20 వెండి రూపాయ నాణెములు బాబాకు యీయ

దలచెను. 50 రూపాయల 'కరెన్సీనోటు' మార్చెను. తుదకు బాబాను చేరిన తరువాత అతని తలంపు మార్చుకొని ఒక సవర బంగారు నాణెము బాబాకు సమర్పించెను.

సా. బా: ఇది యేమి?

నూల్కర్ : అది సవర.

సా. బా: దాని విలువ యెంత?

నూల్కర్ : 15 రూపాయలు.

సా. బా: ఇది నాకు వలదు. నాకు 5 రూపాయలిమ్ము. దీనిని నీ దగ్గర నుంచుకొనుము.

ప్రధాన్, బాబా స్పృశించి యిచ్చిన బంగారు నాణెమును భద్ర పరచుకొని 15 రూపాయలు వెండి నాణెముల నిచ్చెను.

సా. బా: (మరల మరల లెక్కించుచు) ఇచ్చట పది మాత్రమే కలవు. తక్కిన 5 రూపాయలు తెమ్ము.

ప్రధాన్ : ఇవిగో 5 రూపాయలు అధికము.

ఇటుల బాబా తప్పులెక్క పెట్టు నెపమున తన గురువుతోడ బుద్ధి బలమును కొలువజూచు ప్రధానును పరీక్షించు విధమున ప్రధాన్ తొలి సంకల్పము ప్రకార మీయదలచిన 29 రూపాయలు బాబా స్వీకరించెను. ఆ పిదప అతనిని నేమియు నడుగ లేదు.

దక్షిణ – మరియొక అర్థము

245. సా. బా: (బి. వి. దేవ్‌తో) భావ్! దక్షిణ నిమ్ము.

బి. వి. దేవ్ ఒక సవర యిచ్చెను.

సా. బా: ఇంకను యిమ్ము!

బాబా అటుల నాలుగు స్వీకరించిన తరువాత యిట్లనెను. నీవు నాలుగు యిచ్చినను బాబా పొందినది ఒకటే.

దేవ్ : నేను నాలుగిచ్చితిని.

సా. బా: నిజమే! నా దగ్గర ఒక్కటే కలదు. నీ వెరుగుదువు. (దాని భావము భక్తుడు తన నాలుగు అంతః కరణములు (మనస్సు – బుద్ధి – అహంకారము – చిత్తము) సమర్పించినను బాబా స్వీకరించునది జీవుని మాత్రిమే. తక్కిన వికారము లన్నియు దైవమును – బాబాను చేరునప్పటికి ఒక్కటే అగును. దైవము అగు గురువుతో ఐక్యము పొందుటకు మనస్సు పలుమారులు సమర్పణము కావలయును.)

"రేరే చిత్తత్యజద్వం ద్వం త్వమేకత్వం సమా(శ్రయ
తతశ్చాసి చిదే వత్వం నా(త్రకార్యా విచారణా".

ద క్షి ణ

246. సా. బా: (జి. జి. నార్కేతో) నాకు 15 రూపాయలు దక్షిణ యిమ్ము!

నార్కే : బాబా! నా దగ్గర పైసాకూడ లేదని నీ వెరుగుదువు. తరచుగ నన్ను 15 రూపాయలు దక్షిణ యేల అడుగుదువు?

సా. బా: నీ దగ్గర ధనము లేదని యెరుగుదును. నీవు యోగ వాసిష్ఠము పఠించుచుంటివి గదా! నాకు 15 రూపాయలు దక్షిణ అందుండి తెమ్ము.

(ఇచ్చట దక్షిణ తెచ్చుట అనగా యోగవాసిష్ఠమునుండి పాఠముల గ్రిహించి, వానిని బాబా అధిష్ఠించియున్న అతని హృదయమున పదిల పరచుకొనుటయే.) చూ. 186.

247. సా. బా: (ఆర్. బి. పురందర్‌తో) 2 రూపాయలు దక్షిణ యిమ్ము!

పురందర్ : బాబా! నే నొక పేద గుమాస్తానని యెరింగియు నన్నేల 2 రూపాయలు దక్షిణ యిమ్మని తరచుగ నడిగెదవు?

సా. బా: ఈ నాణెములు కావు. నాకు కావలసినవి 1 నిష్ఠ (గాఢ విశ్వాసము) 2. సబూరి ధైర్యముతో కూడిన ఓర్పు).

పురందర్ : నే నిచ్చితిని. వీనిని నాచే కావింప నిమ్ము.

248. సా. బా: (తార్కాడ్ సతితో) నాకు 6 రూపాయలు దక్షిణ నిమ్ము.

తార్కాడ్ సతి : (భర్తతో) మన దగ్గర ధనము లేదు. బాబా అడిగినప్పుడు ధనము లేకపోవుట చాల బాధగ నుండును.

తార్కాడ్ : బాబా కోరునది నీ అంతః శ్శత్రువులను (కామ క్రోధాదులను) సమర్పణ చేయుమని.

సా. బా: (మరల తార్కాడ్ సతితో) 6 రూపాయలు దక్షిణ నిత్తువా?

తార్కాడ్ సతి : బాబా! నేను వాని నిచ్చితిని

సా. బా: తొలగిపోకుండ చూడుము!

దక్షిణ – నీతి గఱపుట

249. జడ్జి యం. బి. రేగే 1912 న రు. 100 జేబు నందుంచు కొని బాబా దగ్గర కేగెను.

సా. బా: నాకు రు 40/- లు దక్షిణ ఈయుము! (రేగే యిచ్చెను)

సా. బా: (మరల) 40 రూపాయలు దక్షిణ ఈయుము! (రేగే యిచ్చెను.)

సా. బా: (మరల) 20 రూపాయ లిమ్ము!

బాబా తన దగ్గరనున్న దంతయు స్వీకరించు చున్నాడని తలంచి ఆ 20 రూపాయ లిచ్చెను.

సా. బా: (తరువాత జడ్జితో) 40 రూపాయలు దక్షిణ ఈయము.

రేగే : ఎవరి దగ్గరకు వెళ్ళుదును?

సా. బా: శ్యామా.

అంతట రేగే శ్యామా దగ్గఱకు వెళ్ళి చెప్పెను.

శ్యామా : బాబాను నీవు గ్రహించలేదు. నీ రూపాయలు ఆయనకు

తృణప్రాయము. ఆయన కోరునది నీ మనస్సు, బుద్ధి – నీకాలము – నీ ఆత్మను ఆయన కంకితము చేయుటయే, బాబా భావమదియే.

రేగే తిరిగి వెళ్ళి బాబా కావిషయము తెలిపెను.

సా. బా: (చిరునవ్వు నవ్వి) దీక్షిత్ దగ్గఱకువెళ్ళి అడుగుము.

రేగే దీక్షిత్తునకు చెప్పెను.

దీక్షిత్ : ఈ సందర్భమున బాబా ఆదేశము గ్రహింపుము. ధనము దగ్గఱ లేకపోయెనని కించకాని, ధనము కొఱకుకాని, మఱి దేనికొఱకుగాని యాచించుట అగౌరవమని కాని, ఇతరుల దగ్గఱకేగి చేయిచాచు స్థితికి మించియున్న వాడవనికాని, నీవు తలంచరాదు – అనుపాఠము నీకు బోధించుట బాబా అభిప్రాయమని నీవు గుర్తింపుము.

రేగే వెళ్ళి ఆ విషయములను బాబాకు విన్నవించెను.

సా. బా: (చిఱునవ్వు నవ్వుచు) నా. గో. చందోర్కరు దగ్గరకు పొమ్ము.

రేగే నానా దగ్గఱకు వెళ్ళి తెలిపెను.

నా. గో. చం: బాబా దక్షిణ అడిగినపుడు ఇచ్చుటకు మన దగ్గఱ ధనము లేకపోయిన ఎంత బాధాకరమో నేనెఱుగుదును. నా పద్ధతులను నీవు గ్రహింపవలయును. నే నెప్పుడు షిర్డీకి బయలుదేరిన కొంతధనము తీసికొని ప్రయాణమై అందు సగము కోపర్గాము నందుంచి, తక్కిన సగముతో నిచటకు వత్తును. ఉదాహరణకు, ఈ పర్యాయము 200 రూపాయలతో బయలుదేరితిని. సగము కోపర్గాము నందుంచి 100 రూపాయలతో నిచటకు వచ్చితిని. నాదగ్గఱనున్న దానినుండి బాబాకు దక్షిణ నిచ్చుచుందును. అది పూర్తిఅయిన పిదప కోపర్గాము నందుంచిన నిలువకొఱకు వర్తమాన మంపుదును. నీవును ఈ మార్గము ననుసరింపుము.

రేగేవెళ్ళి ఆ విషయము బాబాకు తెలిపెను. బాబా నానాను పిలువ నంపెను. నానా వచ్చెను.

సా. బా: నానా! 40 రూపాయలు నా కిమ్ము!

నానా యిచ్చి వెడలిపోయెను. మరల నానా పిలువనంపబడెను. నానా వచ్చెను.

సా. బా: నానా! ఇంకను 40/- రూపాయలిమ్ము.

నానా యిచ్చెను. మరల చందోర్కరును పిలువనంపి 20/- రూపాయలు తీసికొనెను. అంతట చందోర్కరు కోపర్గామునకు వర్తమానమంపెను. అచ్చటనుండి పైకము అందులోపల బాబా యింకను ధనమీయుమని అడుగ చందోర్కరు చిన్నవోయెను.

బాబా కోరినపుడెల్ల మనుష్యుడు తానే మహా ప్రభువువలె ఇచ్చుచుండెననికాని, బాబాకు కావలసిన అవసరములెల్ల తానే తీర్చుచున్నవాడనని కాని, అనుకొనరాదు – అను పాఠము బోధించుటకే యీ విధముగ పలుమాఱులు దక్షిణ రూపమున బాబా ధనమడిగినాడని మనము గ్రహించవలయును.

దక్షిణ

2, 5, 6, 10, 16 రూపాయలు బాబా దక్షిణకోరిన సందర్భములను – వాని భావములను 135, 136, 186, 248, 255 నెంబర్లలో గమనింపుడు.

[దక్షిణ ఇచ్చిన ఈయకపోయినను బాబా కోపము ప్రకటించినది లేదు. దక్షిణ నిచ్చినవారిపై ప్రత్యేక అభిమానముగాని, ఈయనివారిపై నిరభిమానముగాని చూపడు. అమూల్యమైన బాబా కరుణ అందఱకు ఉచితముగ ప్రసాదింపబడినది. అటుల దక్షిణరూపమున తీసికొనబడిన ధనము బాబా చేతులలో ఒక క్షణము నిలువదు. ఎప్పటికప్పుడు వెంటనే బాబా తలచిన వారికి ఆ ధనము ఇచ్చివేయబడును. బాబా ఏ విధమైన సుఖాడంబర జీవితము గడపి యెఱుగడు. భిక్షించి తెచ్చికొనునది, నైవేద్యరూపమున భక్తులొసంగినది తప్ప మఱేమియు భుజించి యెఱుగడు – అని చక్రినారాయణ - పోలీసు ఇన్‌స్పెక్టరు బాగుగా గుర్తించినాడు].

సంపదలయెడ బాబా నిర్లక్ష్యము

250. బాబా : (బాలకృష్ణ గోవింద ఉపాసనీ శాస్త్రితో) నాకు దక్షిణ నిత్తువా?

బా. గో. ఉ: బాబా! నా దగ్గఱ ధనములేదు.

సా. బా: నీ జేబులో నున్నదేమి? దానినిమ్ము.

బా. గో. ఉ: ఇది వెండి గడియారము బాబా! తీసికొనుము.

సా. బా: దీని నిచ్చుటచే నష్టపడుచుంటివని తలంచకుము.

బా. గో. ఉ: బాబా! నీకు సమర్పించిన దేదియును నష్టముకాదు.

బాబా గడియారమును గ్రహించి, అక్కడ నున్నవారిలో నొకనికి దానిని బహూకరించెను. బా. గో. ఉపాసనీ పూనాకి వెళ్ళెను. అచ్చట ఒక ధనికుడైన మిత్రుడు గోవింద ఉపాసనీ బాబాకు గడియారము సమర్పించిన విషయము తెలిసికొని (బాబా పలికిన పలుకు తెలియగనే) ఒక బంగారు గడియారమును స్వీకరింపుమని ఉపాసనీని నిర్బంధించెను. కావున బా. గో. ఉపాసనీ, బాబాకు వెండి గడియారము సమర్పించుటచే లాభము పొందినవాడే కాని, నష్టపడలేదు.

251. ఒక సమయమున ఒక స్వదేశ సంస్థానాధిపతి వ్యాజ్యెము గెలిపించి, ఆ ప్రభువువలన పొందిన ధనమును ఒక ట్రంకుపెట్టె నిండుగ పోసి, హరిసీతారాం దీక్షిత్ షిర్డీకి తీసుకొనివచ్చెను.

హ. సీ. దీక్షిత్ : (బాబా ముందుంచి), బాబా! ఇదియంతయు నీదే.

సా. బా: అలాగా?

అంతట బాబా పెట్టె మూతతెరచి, రెండుచేతులతో ఆ ధనముచు తీసికొనుచు అచటచేరిన వారికందరకు పంచిపెట్టెను. కొలది నిముషములలో ఆ పెట్టె ఖాళీ యయ్యెను దీక్షిత్ మిత్రుడు నాగపూర్ సబ్‌జడ్జి శ్రీ గార్డే - దీక్షిత్ ముఖమువంక చూచుచుండెను. అటుల మిక్కిలి శ్రమపడి సంపాదించిన ధనమావిధముగ పంచిపెట్టబడుచున్నను దీక్షిత్ ముఖమున లేశమేని సంకోచముగాని, విచారముగాని, నిస్పృహగాని చూపట్టలేదు. దీక్షిత్ వైరాగ్యమును పరీక్షించి దృఢపరచుటకే బాబా ఆ ధనమంతయు ఆ విధముగ పంచిపెట్టినాడు.

257. భక్తులు వెండిపల్లకి తీసికొనివచ్చి బాబాకు బహూకరించినపుడు

సా. బా: దీనిని తీసుకొనిపొండు. ఇది నాకు వలదు.

కాని, భక్తులు బాబా చిత్రపటమందు నిలిపి, ఊరేగించుటకు

కావలయునని పట్టుదల వహించిరి. ఆ పల్లకి బయట నుంచబడెను. ఆ రాత్రి దానికి పూన్చబడిన వెండి గుఱ్ఱము లపహరింపబడెను.

భక్తుడు: బాబా! పల్లకి వెండి గుఱ్ఱములను రాత్రి యెవరో అపహరించిరి.

సా. బా: వెండిపల్లకి మొత్తమేల దొంగిలింపబడలేదు?

253. దామోదర్ రసానే ఒక వ్యాపారము ప్రారంభింపదలచి, బాబా అంగీకారము కొఱకొక ఉత్తరము వ్రాసెను. బాబా ఆ పనికి సమ్మతింపలేదు. అపుడు దామియా (రసానే) బాబా దగ్గరకువెళ్ళి తాను చేయబోవు వ్యాపారమునందు లాభములో బాబాకు భాగమిత్తునని చెప్పెను.

సా. బా: ఓయీ! దామియా! నేను దేనితో సంబంధము కల్పించు కొనను. (అనగా – నాకు ధనములతో ఏవిధమైన సంబంధములేదు).

[ఏదేని ఒక మఠము - ఆశ్రమము నిర్మించుటకుగాని, ఒక సంస్థ నేర్పరచి దానికి యాజమాన్యము వహించుటకుగాని, తన శిష్యులలో (ఆశ్రితులలో) ఎవరినో నొకరిని స్వీకరించి, తన యనంతరము తన పీఠము నధిష్ఠింప ననుమతి నిచ్చుటగాని బాబా సమ్మతించినవాడుకాదు. మరియొకడు యాజమాన్యము వహించుటకు బాబా ఏవిధమైన స్థిర చర ఆస్తులను విడిచి వెళ్ళలేదు. బాబా నిర్లిప్త స్థితి యట్టిది.

254. సా. బా: ఒక తఱి నేను "పుంటంబ" అనుచోట నుంటిని. అచట ఇరుపక్షములవారు కలహించుచుండిరి. వారేల తగవులాడు చుండిరా! అని ఆశ్చర్యపడితిని. వారి సమీపమున ధనముతో నింపబడిన కుండ నొకదానిని జూచితిని. వారి కలహ కారణమది. నేను మెల్లగ అచటకు జేరి ఆకుండను తీసికొని వెళ్ళితిని. వారి సంపద నశించుట కనుగొని వారు మిక్కిలి దుఃఖింపసాగిరి.

"నే నెవడను? ఈ ధనమేమి? ఇది యెవరిది? దీనికొరకింత భ్రాంతి? ఇంత కలహము దేనికి? ఆకుండ నాది. ఆకుండ యజమానిని నేను" – అని, నాలో నేననుకొంటిని.

255 ఇరువురు దక్షిణదేశ బ్రాహ్మణులు బాబా దగ్గరకు జేరిరి.

సా. బా: శ్యామా! (ఒకరిని వ్రేలితో జూపుచు) ఈతనిని 15/- రూపాయలడుగుము!

అతడు వెంటనే యిచ్చెను. బాబా తీసుకొని ఉంచుకొనెను. అడుగ బడకయే రెండవాడు 35/- రూపాయలు బాబాకు సమర్పించెను. బాబా ఆ పైకము లెక్కపెట్టి తిరిగి అతని కిచ్చెను.

శ్యామా : దేవా! ఈ విచక్షణమేమి? ఇట్టిది నేనెప్పుడు చూచి యెఱుగను. కొద్దిపైకమడిగి తీసికొంటివి; తనకుదావే పెద్దమొత్తమీయగ దాని నతనికి దిరిగి యిచ్చితివి!

(ఈ క్రింది విషయములు 103 లో చెప్పబడినవి)

సా. బా: శ్యామా! నీవు పసివాడవు. నీకేమియు తెలియదు. నేనే మియు జేయను. నేనేమియు స్వీకరింపను. దత్తస్వామి తనకు జెంద వలసినది తానడిగెను. తనకు జేరవలసిన 15/- రూపాయలు అడిగి తీసికొని మసూది అయీకిచ్చెను. కావున ఆ ధనము (నాచే) స్వీకరింపబడినది. (చూ. 8) కాని యీ 35/- రూపాయలు మనవికావు. అందుచే తిరిగి ఈయబడినవి.

ఇతడు (మొదటివాడు) మొదట మిక్కిలి పేదవాడు. తనకు ఉద్యోగము దొరికిన మొదటి నెల జీతము దత్తస్వామికి సమర్పించెదనని మ్రొక్కుకొనెను. అది 15/- రూపాయలు. ఇతడా మ్రొక్కుబడి మఱచెను. కాలము గడచెను. ఇతని జీతము 15 నుండి 30, 60, 100, 200, 400, చివరికిపుడు 700 రూపాలయ్యెను. ఇతని సుకృత మిచటకు గొనివచ్చినది. కావున నాకు జెందవలసిన 15 రూపాయలను దక్షిణగ అడిగి తీసికొంటిని.

తరువాత మఱియొక ఉదంతము కలదు.

సముద్రతీరమున నేను సంచరించుచు నొక ధనికుడు మంచి కుటుంబీకుడగు నొక బ్రాహ్మణుని భవనమును జేరితిని. అచ్చట నన్ను మిక్కిలిగ ఆదరించిరి. ఆ బ్రాహ్మణుడు సమృద్ధిగ భోజనముపెట్టి నిద్రించుటకు గోడ "అలమర" దగ్గరగ నాకు చక్కని స్థలము జూపెను. నేను గాఢనిద్రయందుండగ నతడా అలమరకుగల పెద్ద రాతిపలకను

ఊచపెరెకి లోనికి బ్రివేశించి, నా జేబులోనున్న వేయి రూపాయల నోట్లు 30 గల కట్ట నపహరించెను. నేను నిద్రలేచిన తరువాత, నా సర్వము అపహరింపబడినదని తెలిసికొని, మిక్కిలి వ్యాకులపడి దుఃఖించితిని. ఆ బ్రాహ్మణుడే నా ధనము దొంగిలించెనని తలంచితిని. అన్నము తినుట నీరు త్రావుటకేని మనస్సు కలుగక 15 దినము లాతని పంచలోనే పడియుంటిని. 15 వ దినమున ఆ దారిన పోవుచున్న ఫకీరొకడు మిక్కిలిగ దుఃఖించుచున్న నన్నుజూచి, ప్రేమతో నా విషయమడిగెను. జరిగిన దంతయు నేను చెప్పితిని. "నేను చెప్పినట్లాచరింతువేని నీకు మేలు కలుగును. ఒక ఫకీరు పేరుసు – అతని విలాసమును నీకు దెలుపుదును. ఆయన పాదములను శరణు పొందుము. నీ ధనము నీకు తిరిగి లభించునట్లాయన అనుగ్రహించును. నీవొక మొక్కును మొక్కుకొనుము. నీ ధనము నీకు తిరిగి లభించువరకు, నీకు మిక్కిలి ప్రియమైన ఆహారమును మానుకొందునని ప్రతినజేయుము. ఆ ప్రతిన నీకు విజయము ప్రసాదించును" అని, బోధకావించినాడు.

"ఆ ఫకీరు బోధననుసరించి, నాకు మిక్కిలి ప్రియమైన ఆహారము వర్జించి, ఆ ఫకీరు పాదముల శరణొందితిని. అంతట నాధనము నాకు దిరిగి ప్రాప్తించెను. తరువాత ఆ గృహము విడిచి, ఆ సముద్రతీరమున దిరుగుచుంటిని. ప్రయాణీకుల గొనిపోవుట కచట నొక పొగయోడ యుండెను. కాని, దానిలో బ్రవేశింప సాధ్యపడలేదు ఆ యోడలోని నౌకరొకడు నాకుగా బని కల్పించుకొని, అదృష్టవశమున నన్నందు ఎక్కజేసెను. దానిపై ప్రయాణముచేసి రైలుస్టేనుకు జేరితిని. చివరికీ మసూదిఆయిని జేరగలిగితిని" అని బాబా యిది యంతయు దెలుపుచుండ ఆ వచ్చినవారు చకితులైరి. కాని, శ్యామాకు బాబా మాటలేమియు బోధపడలేదు.

సా. బా: శ్యామా! ఆ వచ్చినవారిని మీ యింటికి గొనిపోయి తినబెట్టుము.

భోజన సమయమున "బాబా సముద్రమునుగాని, సముద్రతీరముగాని చూచియెరుగడు. ఎప్పుడు నిక్కడే యుండువాడు. ఎవరేని దొంగిలించుట కాయనవద్దర 30 వేల ధనమును లేదు. బాబా పలుకులు మీకేమైన అర్థమైనవా?" అని శ్యామా, వారల నడిగెను.

ఆ యిరువురలో నొక అతిథి మిక్కలిగ భావోద్రేకముతో నీ విధముగ బలికెను.

"నా జన్మస్థలము సముద్రతీరమున పడమటి కనుమలలోయ. నా జీవనోపాధికొరకు 'గోవా' చేరితిని. నాకేదేని వృత్తి లభించిన మొదటి నెలజీతము దత్తస్వామికి సమర్పింతునని మ్రొక్కుకొంటిని. దత్తస్వామి అనుగ్రహమున నెలకు 15 రూపాయలు జీతముగల ఉద్యోగము దొరికెను. బాబా పలికినటుల అది క్రమముగా వృద్ధినొందెను. దత్తస్వామికి 15 రూపాయలు చెల్లించు విషయమిచట బాబా తెలిపినంతవరకు నాకు జ్ఞప్తి యందులేదు. బాబా దయతో 15 రూపాయలు స్వీకరించుటచేత నా మ్రొక్కు బడిని నేటికి చెల్లించగలిగితిని".

ఆ రెండవ అతిథి తన కథ మొదలు పెట్టెను. "నావంట బ్రాహ్మణుడు 35-సంవత్సరముల కాలము నా దగ్గఱనుండి మిక్కలి విశ్వాసముతో సేవించినాడు. దురదృష్టవశమున వాని బుద్ధి మాఱినది. నేను కూడబెట్టుకొనిన ధనమంతయు దొంగిలించినాడు. నాయింట 'అలమర' వెనుక పలకరాయి కలదు. ఆ వంటవాడు ఆ రాతిని తొలగించి కన్నము ద్వారా లోనికి ప్రవేశించి, నా ధనమును సర్వము దొంగిలించికొని పోయెను. అది 30 వేల రూపాయల "కరెన్సీనోట్ల" కట్ట. నా జీవితమున కష్టించి సంపాదించి కూడబెట్టుకొనిన ధనమది. ఆ ధనము సంఖ్య బాబా యెట్లు తెలిసికొనెనో నా కాశ్చర్యముగ నున్నది. నాకు గలిగిన ధన నష్టమును గూర్చి దివారాత్రములు దుఃఖించితిని. ఆ నష్ట ద్రవ్యమును ఎట్లు తిరిగి రాబట్టు కొనుటయా! యని ఆలోచించితిని. పోలీసులకు దెలుపుకొంటిని. ఏమి ప్రయోజనము కలుగలేదు. 15 దినములు మిక్కలి దుఃఖముతో గడపితిని. నా యింటి పంచలో నటుల మిక్కలి విచారముతో గూర్చుండియున్న నన్ను ఆ దారినబోవుచున్న ఫకీరుచూచి, విచారమునకు గారణమేమని ప్రశ్నించెను. జరిగిన సంగతి నంతయు దెలుపుకొంటిని.

"కోపర్గాం తాలూకా షిర్డి గ్రామములో 'సాయి' అను పేరుగల 'అవాలియా' కలడు. నీ ధనము తిరిగి నీకు లభించిన ఆయనను సందర్శింతునని మ్రొక్కుకొనుము. సాయిని దర్శించునంతవరకు నీకు

మిక్కిలి ప్రియమైన భోజన పదార్థమును త్యజింతునని ప్రతిన బూనుకొనుము" అని ఆ ఫకీరు తెలిపినాడు.

'నా ధనము నాకు తిరిగి లభించి, శ్రీ సాయిని సందర్శించునంత వరకు నాకు మిక్కిలి ప్రియమయిన వరియన్నమును మానుకొందును" అని మొ్రొక్కుకొంటిని.

తరువాత 15 దినములు గడిచినవి. ఆ వంట బ్రాహ్మణున కేమి జరిగినదో నే నెఱుగను. అతడు తనంతతానే తిరిగి నాదగ్గఱకు వచ్చి, నా ధనమంతయు నా చేతులందుంచి 'నా బుద్ధిచెడి నే నిట్లు ప్రవర్తించితిని. ఇపుడు నీపాదముల మ్రోలపడి నా తప్పు క్షమింపుమని ప్రార్థించుచున్నాడను" అని పలికినాడు.

ఆ 30 వేల నుండి, వానికి 2 వేలు ఇచ్చితిని. 'కొలాబా'లో నొక నాటిరాత్రి స్వప్నమున శ్రీ సాయిని చూడ గలిగితిని. అది, నేను షిర్డికి వెళ్ళి సాయీ సందర్శనము చేసికొందునని కావించిన మ్రొక్కును జ్ఞాపకము చేయుటకే యని గ్రహించితిని. గోవాకు వెళ్ళితిని. అచటనుండి 'స్టీమరు' మీద బొంబాయిజేరి, రైలుమీద షిర్డికి రావలయునని బయలుదేరితిని. ఓడ రేవునకుజేర స్టీమరులో జనము క్రిక్కిరిసి యుండిరి. తావులేదని ఆ ఓడ అధికారి కెప్టెన్ పలికెను. ఆ ఓడపై నొక సేవకుడు డుండెను. అతని నేనెఱుగను. నేనాతని సంబంధీకుడనని ఆసేవకుడు కెప్టెన్‌తోజెప్పి, దన్నా ఓడలోని కెక్కించుకొనునట్లు తోడ్పడెను. బొంబాయికిజేరి యచటనుండి రైలుపై ప్రయాణముచేసి ఇచటకు రాగలిగితిని. సత్యముగ శ్రీసాయి సర్వవ్యాపి, మనమెవరము? మన నెలవేమి? బాబా తన దగ్గఱకు జేర్చికొనుటచే మనమెంత అదృష్టవంతులము! అపహరింపబడిన ఆ ధనమంతయు దిరిగి నాకు లభించుట ఎంత ఆశ్చర్యకరము? (చూ. 230).

ఆస్తి – సంపద

256. సా. బా: మార్వాడిబాగ్‌చందు – తన గడ్డివామి నిప్పంటు కొనినదని, తనకు నష్టము కలుగనీయక రక్షింపుమని ప్రార్థించుచున్నాడు. లాభనష్టములు, చావుపుట్టుకలు దైవాధీనములు. కాని, జనులంధులై దైవమును మరతురు. లాభము కలిగినచో వారానందింతురు. నష్టము

కలిగిన నేడ్తురు. ఏల "ఇదినాది" - అని చెప్పుకొననేల? దాని భావమేమి?

ఆ గడ్డివామి ఆ మార్వాడీది కాదు. అది గడ్డి మాత్రమే, అతని తనువుకాదు. నేలనుండి విత్తనములవలన మొలచినది. మేఘములనుండి కురిసిన వానవలన, సూర్యరశ్మివలన పెరిగినది. భూమి, మేఘము, సూర్యుడు దాని అధిపతులు. 'తనది' - అని చెప్పుకొను వీనిపలుకులు నిరాధారములు. ఈ అధిపతులైన మూటియందు 'అగ్ని' కలదు. అదియే యీ గడ్డివామిని కాల్చివేసినది. మనము అధిపతులముకాము. భగవానుడొకచేత నిచ్చును- మఱియొకచేత దానిని తీసికొనును.

ఓ సేత్! ఇంటికిబొమ్ము. నీకు గలిగిన యీ నష్టమును మరియొక వ్యాపారమున సర్దుకొనగలవు.

257. సా. బా: ఈతని (హ. సీ. దీక్షిత్తు) ఆవు జైన్ మనుష్యునిది. అంతకుబూర్వము ఔరంగబాద్ వానిది. దానికి బూర్వము మహల్సాపతిది. ఇది యెవరిదో ఆ భగవానునకే ఎఱుక!

భగవానునందు గాఢవిశ్వాసముగలవాని కేవిధమైన కొఱతకలుగదు.

258. పరమేశుడిడున చెప్పుటికిని జెడదు.

నరుడొసంగునది యెన్నడు నిల్వబోదు.

259. సా. బా: (నా. గో. చందోర్కరుతో) నానా! నాదియని నేను చెప్పుకొనుచున్నది ఒక గుడ్డపేలికగోచి (లంగోటి), కుఫ్నీ, ఒకచిన్న కుండ, ఒక రేకుడబ్బా మాత్రము- చూడుము! ఈ జనులు వివిధ కామితములు కోరి నన్నెట్లు పీడించి, బాధించి వేధించుచున్నారో! దీనినిగూర్చి నేనేమి చెప్పవలయును.

దురదృష్ట విత్తము

260. యస్. ఆర్. వి. జయకర్ – ఒక ముస్లింకాంతకు 4 వేల రూపాయలు అప్పు నిచ్చెను. ఆ ధనమామె అతనికి దిరిగి చెల్లించలేదు.

జయకర్ : బాబా! ఆ ధనము రాబట్టుకొనుటకు నేనటకు వెళ్ళుదునా?

సా. బా: ఆ దురదృష్ట విత్తముతో మనకెట్టి సంబంధము కల్పించుకొనదగదు.

ఆ ముస్లింకాంత తన సంపదలను సర్వము 2, 3 సంవత్సరములలో గోల్పోయెను. జయకరునకు ఒక కాసేనియు తిరిగి దక్కలేదు.

పేదరికము – ఫకీర్ – అవక్లపాదుషా.

261. సా. బా: పేదరికము సర్వసంపదలకంటె మహోన్నతమైనది. ఒక ప్రభువు స్థితికంటె నిది వేయి రెట్లుమేలు. దైవము పేదవాని సోదరుడు. ఫకీరే సత్యమైన చక్రవర్తి. పేదరికముచెడదు. సామ్రాజ్యము క్షణమున క్షీణించును.

(దైవము) – విధి

262. సా. బా: జనులు విధివిధానమునందు గాఢ విశ్వాసము వహింపవలయును. తిండిగుడ్డలకై వారు ఆరాటపడరాదు. వీని నిమిత్తమై జీవితము వ్యర్థము చేసికొనదగదు.

నా భక్తులయింట తిండిగుడ్డలకు ఎట్టిలోటు కలుగదు.
"భోజనాచ్ఛాదనే చింతాం వృథాకుర్వంతివై జనాః
యోऽసావిశ్వంభరస్వామీ స్వభాక్తార్థకిము పేక్ష్యతే"
"అభావమన్న వస్త్రాణాం నమేభక్త గృహేభవేత్
తస్యదేహకుటుంబార్థం వ్యగ్రోऽహంపాలనే సదా"

నైతిక బోధలు

బాబా వివిధభావములు – దైవభక్తుడుగ.

263. సా. బా: (రంగారీతో) ఈ హైందవులు నన్ను సేవించుచున్నను నేను భగవంతుని భక్తుడను. నేను దైవమును స్మరింతును. మఱువను.

264. సా. బా: నేను అల్లాను ప్రార్థించుచున్నాడను. నాప్రార్థనము (హ. వి. సాతేకు పుత్రజననము) ఆ తండ్రి అనుగ్రహించును.

265. సా. బా: నేనిక్కడ ఆయా విషయముల బలుకుచుందును. అవి అక్కడ జరుగుచుండును.

266. సా. బా: ఓ అల్లా! ఇక చాలును! వర్షమును ఆపుము. నా బిడ్డలు తిరిగి యింటికి వెళ్ళవలయును. ఎట్టి కష్టముల బాల్పడ నీయక వారినింటికి బోనిమ్ము! (వర్షము ఆగెను.... ప్రధాన్ కుటుంబము, వారు క్షేమముగా వెళ్ళిరి).

సంతృప్తి – శరణాగతి.

267. సా. బా: దైవము గొప్పవాడు. అతడు మహా ప్రభువు. "అల్లామాలిక్" దైవమెంత గొప్పవాడు! అతనితో నెవరు సమానులుకారు. అద్వితీయుడు. అతడీ సకలమును సృష్టించి, పోషించి, లయింపజేయువాడు. ఆ తండ్రిలీల లనూహ్యములు.

మన తలంపులను ఆయన కధీనములు గావించి, ఆయన మనల నిలుపదలచిన విధమున నిలుచుటకు సంతృప్తి నొందుదము. "అల్లా రఖేగావైసారహెనా" – ప్రాప్తించిన దానిని స్వీకరింపుము. సంతృప్తి సంతోషముల బొందుము. ఎన్నడును ఆందోళన పడకుము. ఆ తండ్రి సమ్మతి – సంకల్పములేక ఒక ఆకేనియు కదలదు.

ఋజుభావము – నిర్భయము – సాధుత్వము కలిగి యుండవలయును. మనలో నెవరికివారు వారి ధర్మములను,విధులను నిర్వర్తించు చుండవలయును కాని, మన పనులకు మనమే కారణములము – కర్తలము – అని తలచి, ఏ క్షణము నందైనను మోహభ్రాంతులను పొందరాదు. కర్త దైవమే. ఆయన స్వాతంత్ర్యమును మన పారతంత్ర్యమును గుర్తించి సకల కార్యములు ఆ స్వామివిగనే తెలిసికొనవలయును. అట్లు కావించిన మనము అలిప్తులమై కర్మబంధముల నుండి విడివడుదుము.

దామియా ఆకసము నందుకొన జూచు చున్నాడు. భగవానుడాతనికి బ్రసాదించినది నిలుపుకొని సంతృప్తిని పొందదలచుటలేదు.

సకల జీవములను ప్రేమించుట

268. సా. బా: ఎల్లప్రాణులను ప్రేమించుము. ఎవరితో కలహింపకుము. ప్రతీకార బుద్ధివహింపకుము. ఎవరిని నిందింపకుము. ఎవరేని నీకు వ్యతిరేకముగ మాటాడిన కలతపడక తొలగిపొమ్ము. ఇతరుల

మాటలు నీ తనువున దుస్సికొనవు. ఇతరుల పనులు వారినే బాధించును. నిన్ను బాధింపవు. నీవు కావించునవియే నిన్ను బాధించునవి.
(చూ. 208, 289)

అలసత (సోమరితనము)

269. సా. బా: సోమరితనము వహింపకుము. ఏదొక కృషి చేయుము. దైవనామము స్మరింపుము. సద్గ్రంథములను పఠింపుము.

ఇతర నైతిక బోధలు

270. సా. బా: (చంద్రబాయి బోర్కర్‌తో) మన మితరులయెడ ద్వేషము – ఈర్ష్య – ప్రతీకారవాంఛ వహింపదగదు. ఇతరులు మనల ద్వేషించిన, నామజపమునకు గడంగి, వారికి దూరముగ తొలంగుటమేలు.

271. సా.బా: (బాపూరావ్ యస్. చందోర్కర్‌తో) నీ తల్లిదండ్రుల మాటలు వినుము. పనులందు నీతల్లికి తోడ్పడుము. ఎల్లవేళల సత్యము – సత్యము మాత్రమే పలుకుము. నేను పసిమృద్ధిగ నీయగోరు దాని నెవ్వరు స్వీకరింపరు. నేనీయజాలని దానినే వారు కోరుచుందురు. తల్లియే దైవము.

271-ఎ. సా. బా: (యస్. జి. చందోర్కర్‌తో) నిన్ను విడిచి వెళ్ళుచున్న ఈ హరిదాసును చూడుము! తుదివరకు కష్టసుఖము లందు నిన్ను హత్తుకొనియుండు మిత్రులనే సంపాదించుకొనుము.

(తాను బాబా బొంబాయికి బయలుదేరుచు తనవెంట నొకమిత్రుని గొనిపోయి, మధ్యమార్గమున నతనిని దిగవిడిచె, వెళ్లదలచిన, హ. సీ. దీక్షిత్తుతో).

నేను ఎవ్వర నెప్పుడు మార్గమధ్యమున దిగవిడువను.

దయ్యములు – భూతములు

272. ఒక భక్తుడు : బాబా! భూతములు వాస్తవముగ కలవా?

సా. బా: కలవు. వానితో మనకేమియు సంబంధము లేదు.

273. ఆర్. ఎ. తార్ఖాడ్ ఒక రాత్రి వెలుపలకేగెను. ఒక చెట్టు

క్రింద నొక ఆకారమును చూచెను. భయపడి బాబాను ధ్యానించుచు ధైర్యము వహించి, షిర్డియందు తన విడిదికి జేరెను. మఱునాటి ఉదయమున బాబా తానే స్వయముగ ఆ విషయమును ప్రస్తావించుచు -

సా. బా: రాత్రి నీవేమి చూచితివి?

తార్ఖాడ్ : ఒక భూతమును జూచితిని.

సా. బా: కాదు. అది నేనే.

తార్ఖాడ్ : కాదు - బాబా! అది యొక భూతము.

సా. బా: అది నేనే. వెళ్ళి తన తల్లిని అడుగ ఆమె, సకల భూతములు బాబా అధీనములో నున్నవి - యని ఆమె చెప్పెను.

సా. బా: నేనా భూతాదులన్నింటిలోను లేనా? ఆహా! అవి మనకెట్టి హాని కలిగింపవు. ఈ విషయమును నేను క్రిందటి సంవత్సరమున చెప్పలేదా?

అమానిత్వము

274. సా. బా: (ప్రధాన్ సతితో) ఎవరేని మనల పదిమాటలనిన సమాధానము చెప్పవలసిన ఒక మాటలో పలుకదగును. ఎవరితోడను కలహించుట కాని, ప్రతీకారవాంఛ కాని, వదరుట కాని, మాఱు పలుకుట కాని తగదు.

సహనము - ఓర్పు

275. ఉద్ధవేశభావ్ : (ప్రథమ దర్శనమున) నా మోక్ష గురు వెందుగలడు? అతని నేనెట్లు పొందగలను?

సా. బా: 5 సంవత్సరములు వేచియుండుము. నీవెఱుగగలవు. రొట్టెనంతయు నొక్కమాఱుగ నెట్లు మ్రింగగలవు? 5 సంవత్సరములు వేచిచూడుము.

సందేహముపట్టున విశ్వాసము పాటింపుము

276. ఒక ప్రార్థనా సమాజికుడు బాబా దగ్గఱకేగెను. అచటకు ాళ్ళపూర్వము ఎవరితోడనో "బాబా - గీతలందు దెలుపబడిన 'స్థితప్రజ్ఞ' ాక్షణములు కలవాడగునా? కాదా?" యని, యేమేమో చర్చించినాడు. ిది - అతని మనస్సునందు అశాంతి కలిగించెను. అతని విశ్వాసము ిడలెను. అట్టి స్థితిలో నాతడు బాబాను జేరినాడు.

సా. బా: శ్యామా! ఆతనిని తీసికొనివెళ్ళి యేదొకటి తెలుపుము.

అంతట 'శ్యామా' అతని తన యింటికి గొనిపోయి యీ సుబోధ ాావించెను.

1) ప్రజలు పలుకు బాధ్యతారహితములు - అజ్ఞాన చోదితములైన ిలుకులు నాదరింపకుము.

2) నీ మనస్సును బాబా పాదములందు నిలుపుము.

3) సకలము సురక్షిత మగును.

తరువాత వారిరువురు బాబాను జేరిరి.

సా. బా: శ్యామా కావించిన బోధ బాటింపుము.

విపరీత వ్రత నియమము

277. సా. బా: ఆహారాదులను పూర్ణముగ త్యజించి విపరీత వ్రతనియమములను పాటింపదగును.

"యుక్తాహార విహారస్య" (భగవద్గీత)

275-ఎ. సా. బా: (కుశభావ్‌తో) ఈ పర్యాయము నీవు వచ్చునపుడు 'ఇరువురు' రండు! (వివాహితుండవై రమ్ము).

276. హ. సీ. దీక్షిత్ రాత్రులందు భోజనము మానవలయునని నిశ్చయించుకొని బాబాను జేరగ -

సా. బా: కాకా! రాత్రి వంట చేయించుకొని భుజింపుము! హరి సీతారాం దీక్షిత్ రాత్రులందుపవసింప వలయునను తలంపు మానుకొనెను.

వ్యర్థములగు ఉపవాసములయెడ బాబా అనిష్టత

279. ఒకపరి సింఘా పండుగకు గోఖేల్‌సతి షిర్డికిజేరి దాదా కేల్కారు ఇంటనుండి షిర్డియందున్నంతవరకు ఉపవాసము చేయదలచెను.

సా. బా: (దాదా కేల్కారుతో) నా బిడ్డలు సింఘా పండుగయందు ఉపవసింతురా? నేనది సమ్మతింపను - జరుగనీయను.

ఆ మరునాడు గోఖేల్ సతి షిర్డికిజేరి బాబాను సందర్శించి, మోలి గూర్చుండెను.

సా. బా: (తానే ఆ విషయము ప్రస్తావించుచు) మనమేల ఉపవసింపవలె? దాదా కేల్కారు ఇంటికి బొమ్ము. పూరణ్ పోలీలను సిద్ధ పరచి, నీవు భుజించి, ఆ కుటుంబములోని వారి కందరకు పంచిపెట్టుము.

గోఖేల్ సతి, దాదా యింటికి వెళ్ళెను. కేల్కారు సతి వెలుపల నుండుటచే, అతిథి యయ్యును ఆమె వంట చేయవలసి వచ్చెను. బాబా నిర్దేశించినట్లు పూరణ్ పోలీల సిద్ధపరచి, తాను భుజించి ఆ యింటిలోని వారికందరకు పెట్టెను.

280. సా. బా: (యస్. బి. నాచ్నేతో) నీవు భుజించితివా?

నాచ్నే : బాబా! ఈ రోజు ఏకాదశి. (నాచ్నే తన యింటివద్ద ఏకాదశి ఉపవసించు ఆచారము లేనివాడైనను తన వెంట షిర్డికి జేరిన ఇరువురు మిత్రులు ఏకాదశి ఉపవాస వ్రతము గల వారగుటచే తాను ఉపవసింప వలయునని ఆ రోజున తలంచెను.

సా. బా: ఈ యిరువురు పిచ్చివారు. నీవు వెళ్ళి భుజింపుము.

నాచ్నే, బాలభావ్ 'హొటల్' నకు వెళ్ళెను. కాని బాలభావ్ నైష్ఠికపరు డగుటచే హారతి జరుగని కారణమున భోజనము పెట్ట నిరాకరించెను. అందుచే నాచ్నే బాలభావ్‌తో కలిసి ఆరతి వేళకు మసీదు జేరెను.

సా. బా: (నాచ్నేతో) నీవు భుజించితివా?

నాచ్నే : బాబా! ఇది ఆరతి సమయము గదా! ఆరతి – అయిన తరువాత భోజనము పెట్టబడును.

సా. బా: కాదు – నీవు వెళ్ళి భుజింపుము. ఆరతి– నీ కొఱకు ఆగును.

కావున బాలభావ్ నాచ్నేకు భోజనము పెట్టక తప్పలేదు. నాచ్నే భుజించిన తరువాత నాచ్నే, బాలభావ్ యిరువురు ద్వారకామాయి జేరిరి. అప్పుడే 'మావుసీ' పెక్కు ఆకు బీడాలు తెచ్చి బాబాకు సమర్పించెను.

సా. బా: (నాచ్నేతో) ఈ ఆకు బీడాను తినుము.

నాచ్నే ఆకు బీడాను తీసికొని ఏకాదశినాడు తాంబూల చర్వణము ఆచారము కాని కారణమున సందేహించు చుండెను.

సా. బా: సందేహింపకుము, కానిమ్ము! నమలుము. నాచ్నే ఆకు బీడాను నమలెను.

యోగము – ఉల్లి భక్షణము

281. యోగ సంబంధమైన కొన్ని విషయములను బాబా వలన తెలిసికొన దలచిన ఒక యోగాభ్యాసకుని వెంటబెట్టుకొని నా.గో. చందోర్కరు షిర్డికి జేరెను. వారు మసీదు జేరగ బాబా ఉల్లిపాయలను భక్షించు చుండెను. ఆ యోగాభ్యాసి తామసికాహారమగు ఉల్లిగడ్డలను తినుచున్న బాబా తనకా యోగసాధన విషయమున ఎట్టి సాయము చేయజాలడని తలంచెను.

సా. బా: నానా! జీర్ణించుకొన (తామసిక గుణమును విరోధింప) జాలెనేని ఉల్లిభక్షణమున ఏమి హాని కలదు?

అంతట తన తలంపు గుర్తింపజాలిన బాబా యోగేశ్వరుం డగుట సత్యమని ఆ యోగసాధకుడు గుర్తించెను.

బాబా – దాసుగాణూను ఉల్లిని తినిపించిన విధము.

282. నైష్ఠికుడైన గాణూదాసునకు ఉల్లి అనిన అనిష్టము.

కుశ : అది 'రోజాస్' వంటిది.

సా. బా: 'రోజాస్' – అననేమి?

కుశ : మేముపవశింతుము. కందములుతప్ప మరేమియును తినము.

సా. బా: ఓ! కాండములా! (ఉల్లిపాయలని అర్థము.) మీరీనాడు భక్షించునది, ఇవిగో ఉల్లిపాయలు. ఇచట కలవు తినుము -

కుశ : (బాబా తనను అనాచారభుక్తి చేయింపదలచినాడని తలచి) బాబా! నీవు తినిన నేను తిందును.

అంతట బాబా కొన్ని తినెను. కుశభావ్ కొన్ని తినెను. ఇంతలో కొందఱు ద్వారకామాయి మసీదు చేరిరి. బాబా కొంత చమత్కారము గావింపదలచెను.

సా. బా: (చేరిన వారితో) ఈ బాపని జూడండి! ఏకాదశినాడితడు ఉల్లిపాయలను తినుచున్నాడు.

కుశ : బాబా తినినాడు, నేను తింటిని.

సా. బా: నేను కందములను (తీపిగడ్డలను) తింటిని.

బాబా తీపిగడ్డలను క్రక్కెను.

కుశభావ్, బాబా కావించిన అద్భుత చమత్కారమును గనుగొని, అత్యాతురతతో - ప్రసాదముగ భావించి బాబా క్రక్కిన ఆ తీపిఉల్లిగడ్డలను తీసికొని తినెను.

సా. బా: (కుశభావ్‌ను కొట్టుచు) మూఢుడ! ఆ క్రక్కిన వానినేల తినెదవు?

కాని కుశభావ్ ఆ దెబ్బలను లెక్కచేయలేదు. బాబా హృదయము దర్వించినది.

సా. బా: (కుశభావ్ మస్తమున హస్తము నిలిపి) నిన్ననుగ్రహించుచున్నాడను. నన్ను తలంచుచు దోసిలి పట్టుము. నా ప్రసాదము నీకు లభించును.

16)

కుశభావ్, అది మొదలు బాబాను ధ్యానించుచు దోసిలిపట్టిన అందు బాబా ప్రసాదము 'ఉధి' జేరును, ఆ 'ఉధి' ని బాబాప్రసాదముగ నతడు కోరినవారి కిచ్చును.

దాదాకేల్కార్ – ఉల్లి

264. దాదాకేల్కారు మిక్కిలి పట్టుదలగల బ్రాహ్మణుడు. ఉల్లి గడ్డలనిన మిక్కిలి ఏవగించును. అతడు మిక్కిలి అభినివేశముతో సాతేవాడలో విడియువారలను ఉల్లిపాయల నుపయోగింపనీయకుండువాడు. యస్. బి. నాచ్నే అత్తగారు ఉల్లిపాయల నుపయోగించుచుండ నామెను నిందించెను. అతని మనుమరాలికి కనులకలక ఏర్పడెను. కేల్కారు – బాబాను చేరి –

దా. కే: బాబా! బిడ్డకు కండ్ల కలక ఏర్పడినది. నేనేమి చేయ వలయును.

సా. బా: కనుల కాపునకు ఉల్లిపాయ లుపయోగింపుము.

దా. కే: ఉల్లిగడ్డలకు నే నెక్కడకు వెళ్ళెదను?

సా. బా: (నాచ్నే అత్తగారిని వ్రేలితో చూపుచు) ఈ తల్లి దగ్గఱ నుండి తీసుకొనుము.

నాచ్నే అత్త : బాబా! దాదాకేల్కార్ నేను ఉల్లిపాయలు ఉపయోగించుచుంటినని నన్ను తిట్టినాడు. అతనికేమియు నిచ్చుటకు నాకిష్టములేదు. నీవాజ్ఞాపింతువేని ఇచ్చెదను.

సా. బా: ఇమ్ము!

ఆమె ఉల్లిగడ్డలనిచ్చెను. బాబా ఆమెద్వారా దాదాకేల్కారుయొక్క స్వాతిశయము, సహింపరాని మూర్ఖపు పట్టుదలను అడచెను. (చూ 587)

అపరణము – అతిథి సత్కారము

బాబా భోజన ధూమపానములతో నితరుల నాదరించకు.

285-(ఎ) సా. బా: (డి. వి. సంభారేతో) బిడ్డా! దగ్గఱకురమ్ము! దూరముగ నుండనేల? పొగ త్రాగుము!

286-(బి) సా. బా: ఆకలి నొందినవారిని ముందుగ దినబెట్టుము. తరువాత నీవు భుజింపుము.

287-(సి) సా. బా: (హాస్యముగ అన్నాసాహెబ్ దభోల్కర్‌తో) ఆహా! అది అతని అలవాటు మధుర పదార్థములను తానొక్కడే భుజించును. ఇతరులకు పెట్టబోడు.

"ఏకం స్వాదు నభుంజీద"

288-(డి) సా. బా: (అ.సా. దభోల్కర్‌తో) నీ భోజన సమయమున నేను నీ దగ్గరలేనా? నాకొక ముద్దయైన పెట్టుదువా?

(ఇ) అతిథి నిర్వచనము – బాబా, నా. గో. చందోర్కరునకు కావించినబోధ గమనింపుడు. (199, 306)

ఐకమత్యము – పొందిక

289. సా. బా! స్పర్థ, జగడములను మానుకొంటివా భగవానుడు నిన్ను రక్షించును.

కీడునకు కీడు చేయకుము – 'దెబ్బకు, దెబ్బ' – అనకుము.

కీడునకు తిరిగి మేలుచేయుము!

ఇతరుల మాటలు నీకు హాని కలిగింపలేవు.

పరిశ్రమ – సహనము

290. సా. బా: యోగ - యాగ - తపో - జ్ఞానముల నుపార్జింప జాలని జీవితము వ్యర్థము.

291. సా. బా: (ఒక భక్తునకు సందేశ మంపుచు) నీవు భోజనము చేయుచు నూరక కూరుచుందువా? (సబూరి) ఓర్పును, ధైర్యమును పొదుకొలుపుకొనుము.

292. సా. బా: (ఒకని నుద్దేశించి వాని యెదుటనే) మన (నీ) గతి తుదకు మిక్కిలి దుస్సహము - హేయము నగును. ఒకటి రెంట నేను హెచ్చరిక చేయుదును. ఇచ్చిన సలహాను పాటింపనియెడ తుదకతని గతి దుర్ఘట మగును. గర్భమున పెడ తిరిగిన పసికందునేని కండ తుండెములుగ ఖండించి వెలికి పాఱవేయ వలయును.

త్రాగుడు దురభ్యాసమును బాబా తొలగించుట.

292-ఎ. (1) సా. బా: త్రాగుడు దురభ్యాసముగల డి. వి. సాంబారేతో) బిడ్డా! నీ విట్లేల ప్రవర్తించెదవు? చూడుము! నీ యీ త్రాగుడు అలవాటు మానుమని తొలుత నీకీ హెచ్చరిక చేయుచున్నాను. దీనిని నీవు పాటింపవేని మరల నీకు హెచ్చరిక చేయను. నీ కర్మమునకు నిన్ను విడిచి పెట్టుదును.

డి. వి. సాంబారే సురాపానము చేయనని ప్రతిజ్ఞ చేసెను. త్రాగ వలయునను కోరిక అతనికి శమించెను. ఒక దినమున అతని పై అధికారి విందు చేయుచు సాంబారేను ఆహ్వానించెను. అది ఒక పెద్ద విందు. ఒక గ్లాసు నిండుగ బ్రాందీని అతని ముందుంచిరి. సాంబారే ఏవేవో కారణముల తెలుపుకొని త్రాగ జంకెను. ఎల్లరు నవ్విరి. ఇట్లు సాంబారే అయోమయ స్థితిలోపడి, ఏమి చేయుటకు తోచకుండెను. తటాలున విద్యుద్దీపము లన్నియు ఆరిపోయెను. ఆ యజమాని కారణ మరయుటకు వెళ్ళెను. ఇంతలో సాంబారే ప్రక్కనున్న అతిధి సాంబారే గ్లాసులోని సురను త్రాగెను. దీపములు వెలిగెను. యజమాని తిరిగి వచ్చెను. ఆ గ్లాసు 'ఖాళీ' యగుట చూచి, తన మాటను సాంబారే ఆదరించెనని తలంచి వెడలిపోయెను. ఈ విధముగ బాబా, తన వాని (సాంబారేను) రక్షించుటకీ లీలను నెఱపెను. ఆ దీపము లేల ఆరి పోయెనో తిరిగి యెట్లు వెలిగెనో ఆ కారణ మెవరు నెరుగజాలకుండిరి.

2. సా. బా: (త్రాగుడు దురభ్యాసముగల [ఎ] శాంతారాముతో [బి] కంసాలి బాలునితో) ఇచ్చట ఆరు దినము లుండుడు!

వారుండిరి. అది మొదలు వారికి త్రాగవలయునను కోరిక శమించెను. వారు షిర్డి విడిచి వెళ్ళిన తరువాత త్రాగి యెరుగరు.

మసీదునందు బల్లపలకపై బాబా తపస్సు - జాగరూకత.

293. ఒక సందర్భమున బాబా తాను పరుండిన బల్లపలకను గూర్చి తెలిపెను. ఆ బల్లపలక 5 అడుగులు పొడవు, 15 అంగుళములు వెడల్పు గలది. ప్రమిద దీపములు దానిపై నలువైపుల నుంచబడును. మసీదు కప్పునందలి దంతెల నుండి సన్నని గుడ్డ పేలికతో వ్రేలాడ కట్టబడినది. నేల మట్టము నుండి 6, 7 అడుగుల యెత్తున వ్రేలాడ గట్టబడిన ఆ బలపై ప్రమిద దీపములు క్రింద పడకుండ, గుడ్డ పేలికలు తెగకుండ బాబా ఎటుల పైకి ఎగిరి పరుండునా? అను ఆశ్చర్య మొకటి; బల్లపై చేరిన బాబాబరువునకు ఆ సన్నని గుడ్డపేలిక లెట్లు తెగక నిలువగలవా! యను వింత రెండవది. దానుగాణూ మరి యితరులా చోద్యమును చూడవలయునని ప్రయత్నించుటచే బాబా కుపితుడై, విసుగొంది ఆ బల్ల పలకను ముక్కలు ముక్కలు చేసి పాఱవైచెను.

హరిసీతారాం దీక్షిత్తు, బాబా పరుండుట కొక మంచము నిత్తుననెను.

సా. బా: వలదు. మహల్సాపతిని క్రింద నేలపై పరుండనిచ్చి, నేను మంచముపై పరుండుదునా? దానికంటె నేనే నేలపై శయనించి, మహల్సాపతిని ఉన్నత స్థానమున పరుండనీయుట మేలు.

హ. సీ. దీక్షిత్ : నేను రెండు బల్లల నిత్తును. ఒకటినీకు మరొకటి మహల్సాపతికి.

సా. బా: అతడు బల్లపై పరుండడు. నేలమీదనే పరుండును. బల్లపై పరుండుట మాటలు కాదు. కనులు తెఱచికొని నావలె మెలకువతో నిద్రపోగల వారెవరు? అట్టివాడే బల్లపై పరుండ గలడు.

నేను నేలమీద పరుండునపుడు మహల్సాపతిని నా ప్రక్కన గూర్చుండి, అతని అరచేతిని నా యురపుపై నుంచుమని నియమింతును. కావున బల్ల అతని కే విధముగ నుపయోగము లేనిది. నేను క్రింద పరుండి మానసికముగ నామస్మరణము చేయుచుందును. 'నా ఉరముపై నీ చేతిని నిలుపుము - నేను నిదురించు చున్నట్లు గమనించితివా నన్ను మేల్కొల్పుము' అని మహల్సాపతికి తెలిపితిని. ఇది వరకు - ఇప్పుడు నా ఆజ్ఞ అదియే.

యోగనిష్ఠ యందు సాధారణముగ నిద్ర ఒక ప్రతిబంధకమే. ఆ ధ్యాన - నిష్ఠ కొన్ని విషయముల నిద్రను పోలియుండును. నామస్మరణ - ధ్యాన నిష్ఠ యందు – సాధారణ నిద్ర యందు హృదయ స్పందనమున భేదము కలదు.

సాధకులకు బోధ

294. సా. బా: (అబ్దుల్‌తో) చాలా తక్కువగ భుజింపుము. వివిధ శాకపాకాదులు తగవు. ఏదేని ఒక అనుపాకము చాలును. ఎక్కువగ నిద్రింపకుము. నీవు చదివిన అంశములను గూర్చి ధ్యానింపుము - అల్లాను స్మరింపుము.

294-ఎ. అడకువ వలని లాభములు : హలకూర్ (పాకీవాడు) అని మిరియంబి అని (లౌకిక దృష్టిలో నీచములు అనుకొను, ఊడ్చుట మొదలగు సేవలు చేయువాడు) పిలువబడు అబ్దుల్‌నకు బాబా కావించిన బోధ.

1. నీ మట్టి బంగారముగ పరిణమించు చున్నది.
2. సప్త సముద్రముల నీవు దాట గలవు.
3. గొప్ప భవనము నీ కొఱకు నిర్మింపబడు చున్నది.

పరనింద

295. బాబా భక్తుడొకడు దూరమున నున్న మరియొక భక్తుని గూర్చి ఏవేవియో నిందలు పలికెను బాబా వెలుపల కేగి, యాతనిని 'లేండి' వనము దగ్గర కలిసెను.

సా. బా: దానిని జూచు చుంటివా?

భక్తుడు : అది ఒక పంది.

సా. బా: అది ఏమి చేయుచున్నది

భక్తుడు ; పెంటను తినుచున్నది.

సా. బా: ఆ పంది యెంత ఆతురత – ఆసక్తితో ఆ అశుద్ధమును తినుచున్నదో చూడుము! మనుష్య మలము నందు దానికెంత ఆనందము కలదో కనుగొనుము! కాని మన కది అసహ్యము కలిగించును. నీ ప్రవర్తనము అదేవిధము. జనులు తమ సోదరులపై క్రోధావేశమువహించి తమ హృదయములు సంతృప్తిపడునట్లు నిందించు చుందురు. ఎన్నెన్నో సుకృతములు చేసికొనిన పిదపగాని మనుష్య జన్మము లభింపదు. అట్టి నరుడు షిర్డికి చేరియు నైతిక ఆత్మహత్యకు గడంగుటా!

296. సా. బా: ('సగున్') తేయాకు దుకాణము దగ్గర పరనింద కావించిన 'మాత్రదాసుతో') సగున్ ఏమను చున్నాడు!

మాత్రదాసు సిగ్గు నొందెను.

సా. బా: మంచివారు, చెడ్డవారు అందరు నిచటకు చేరుదురు. వారి లోపముల దోషముల గూర్చి పలువుర యెదుట వెలుబుచ్చి, వారిని నిందింప నేల?

అహింస

(ఎ) మహల్సాపతి – కుక్క

297. మహల్సాపతి యొకనాడు పుండ్లుపడి రోగిష్టియైన ఒక కుక్కను కర్రతో కొట్టెను. తరువాత బాబాను చేరెను.

సా. బా: భగత్! ఈ గ్రామములో నావలె రోగిష్టియైన ఒక కుక్క గలదు. ప్రతిజనుడు దానిని గొట్టుచున్నాడు.

బాబా తనను ఉపాలంబించు చున్నాడని గుర్తించిన మహల్సాపతి తాను గావించిన తప్పిదమునకు విచారపడెను.

(బి) హ. సీ. దీక్షిత్తు – సర్పము

298. హ. సీ దీక్షిత్తు : బాబా! సర్పము మనుష్యులను చంపును. కావున సర్పము కంటబడినపుడు దానిని నరుడు చంపవలదా?

సా. బా: తగదు. మనమెప్పుడు దానిని చంపరాదు. ఏలయన –

దైవము అజ్ఞలేనిదే అది మసలనెప్పుడు చంపదు. దైవ మావిధమున ఆజ్ఞాపించిన మనము దానిని తప్పుకొనజాలము.

(సి) పిచ్చికుక్కయెడ దయ

299. 1917 వైశాఖమున ఒక పిచ్చికుక్కచే కఱువబడిన ఒక చిన్నకుక్క పెద్దకుక్కలను తఱుముచుండెను. గ్రామవాసులోని జనులు గుదియలజేబూని, ఆ చిన్నకుక్క వెంటబడిరి. అది వీధులవెంట బరుగెత్తి తుదకు ద్వారకామాయి మసీదుజేరి బాబా వెనుకనుండి బాబాను శరణ స్థానము గావించుకొనెను.

గ్రామజనులు : బాబా! ఆ కుక్క పిచ్చిది. వెలుపలకు తరుముము. మేము దానిని చంపెదము.

సా. బా: పిచ్చివారలారా! వెలుపలకు పొండు! దిక్కులేని యీ చిన్న జీవమును బాధించి చంపదలచినారా? అని బాబా ఆ చిన్నకుక్క ప్రాణముల గాపాడినాడు. దానికి పిచ్చిలేకుండుట విదితమయ్యెను.

కీడునకు ప్రతిఘటనము తగదు.

300-(ఎ) సా. బా: (ఒక కాంతతో) అమ్మా! అతనినే తిననిమ్ము. ఆ తినువాడు నీ తండ్రియే. (నీకు ఇంతకు బూర్వము దత్తముచేసిన దానిని తానే తినుచున్నాడు) ఆతనితో వ్యాజ్యెము లాడకుము, దైవము నీకు సమృద్ధిగ ప్రసాదించును.

(బి) సా. బా: (తనపై కుఱికిన నానావాలిని క్రిందకు ద్రోసిన, హ. వి. సాతేతో) సాహెబ్! ఆ విధముగ ప్రవర్తింపకుము.

(సి) జవర్ ఆలీ వృత్తాంతము 304 చూడుడు.

బాబా అడకువ – గురుబాబా – దైవము అగుననుకాడు.

301. 1917 లో తార్కాడ్‌సతి, కుమార్ తార్కాడ్ బాబాను సందర్శించిరి.

సా. బా: (కుమార్ తార్కాడ్‌తో) బిడ్డా! 8 రూపాయలు దక్షిణనిమ్ము!

కు. తా: బాబా! నా దగ్గఱ 8 రూపాయలు లేవు.

సా. బా: పొమ్ము. బాపూసాహెబ్‌జోగ్ దగ్గఱనుండి తెమ్ము.

కుమార్ తార్ఖాడ్ జోగ్‌దగ్గఱకేగెను. జోగ్ ధ్రువచరిత్రను జదువుచు వ్యాఖ్యానము చేయుచుండెను. "సాధువులు దైవము కాకపోయినను ఆ దైవము వలన ప్రసాదింపబడిన కొన్ని మహిమలు కలవారు" - అనుచు జోగ్ మెమో వివరించుచుండెను.

ఆ బాలుడు కుపితుడై వెంటనే బాబా దగ్గఱకు తిరిగి వెళ్ళెను.

కు. తా: బాబా! నన్నక్కడకేల పంపితివి?

సా. బా: ఏమి విశేషము?

కు. తార్ఖాడ్ : నీవు మానవ మాత్రుడవేయని, దైవము కావని అక్కడవారు నిన్ను లాఘవ పఱచుచున్నారు.

సా. బా: అవును. దానిలో అసత్యమేమి కలదు? ఆహా! నే నెవడను? ఒక పేద ఫకీరును, నేను దైవమును కాను. దేవుడెంత గొప్పవాడు! దైవముతో నెవరు సరిపోల్చుకొన దగరు.

కు. తా: బాబా! నీ వట్లు పలుకుచు మమ్ము మోసపుచ్చు చున్నాడవు. నీవు దేవుడవని మేము పూర్ణముగ విశ్వసింతుము. ఎవరేని నిన్ను లాఘవ పరచుచున్న, దానిని మే మెట్లు సహింప గలము? సాధువులను గేలి చేయు చోట ఒక క్షణమేని మేము నిలువరాదను మాట వాస్తవము కదా!

సా. బా: నిజము.

కు. తా: భగవంతుని నిందించిన అతడు కోపింపడు. కాని, భాగ వతుల నిందించిన దైవము సహింపడు. కాదా?

సా. బా: అవును.

కు. తా: అట్టియెడ ఆ సాధువు గొప్పవాడు, ఈ సాధువు కాదు- అని సాధు నిందా చర్చల వినుటవలన ప్రయోజన మేమి?

సా. బా: సాధు సత్పురుషులనుగూర్చి నిందలు పలుకబడు తావున ఒక క్షణమేని నీవు నిలువ రాదు. (బాబా ఆ బిడ్డతల ప్రేమతో నిమురుచు) సద్గ్రంథము పారాయణము చేయుము. నామ జపము కావింపుము.

కు. తా: బాబా! నేను మధ్యలో ఆపితినా - నాకు పాపము కలుగును, ప్రత్యవాయ మాపాదించును. కావున నేను చేయను.

సా. బా: (తార్కాడ్ సతితో) అమ్మా! నీ బిడ్డ యొక్క సంపూర్ణ బాధ్యతలు నేను వహింపవలయును.

తా. సతి : బాబా! మా యందఱ సంపూర్ణబాధ్యతల నీవే వహింప వలయుడు.

(ఇరువురు బాబాపాదములవ్రాలి మ్రొక్కిరి. అపుడు కొందఱు వచ్చిరి)

సా. బా: (ఆ వచ్చినవారితో) నా భక్తులనుగూర్చి నేను జాగ్రత్త పడవలయును. నా భక్తుడెవడేని కూలుచున్న నా చేతులు నాలుగు - నా నాలుగు చేతులు చాచి వానిని లేవనెత్తి వాని నే నాదుకొనవలయును. నావాని నెందేనియు బడనీయను- చెడనీయను.

కు. తార్కాడ్ : బాబా! ఇప్పుడే "నేను దేవుడను కాను నే నొక పేదఫకీరును"- అంటివే! అట్టియెడల నీవు నాలుగు చేతులెట్లు కలిగియున్నావు?

బాబా సమాధానము చెప్పక చిఱునవ్వునవ్వి, తార్కాడ్ కుమారుని ప్రేమతో అంగీకారసూచకముగ కటాక్షదృష్టిబఱచెను.

బాబా - అడకువ

301-ఎ. భక్తులు : బాబా! ఈ జి. జి. నార్కె - నీవు ఒక మానవ మాత్రుడవనుచున్నాడు.

సా. బా: అతడు పలుకునది సత్యము. కాని, భక్తులగు మీరటుల పలుకరాదు. మీ సకలాభీష్టములను నా వలన మీరు పొందవలయును. (చూ. 31, 331, 371, 383).

302. సా. బా: (తన భక్తులతో) నేను మీ సేవకుల సేవకుడను. మీకు ఋణపడినవాడను. మీ దర్శనభాగ్యమున పవిత్రుడనైతిని. మీ పాదసందర్శన భాగ్యము నాకు కల్పించుట యిది మీ కరుణా విశేషము, మీ పాద ధూళిని నేను.

బర్టిస్ రాక

303. రెవిన్యూకమీషనర్ - మఱిపలువురు రాజకీయోద్యోగులతో బాబాదర్శనమునకై వచ్చుచుండగా -

సా. బా: నూఢుడు. నాయందు చూచుట కేమి కలదు? సామాన్య కర చరణాద్యవయవములుగల ఒక పేద ఫకీరును.

జవర్ అలీ

304. సా. బా: అతడు (జవర్ అలీ) నా గురువుగ చెప్పుకొనిన చెప్పుకొననిమ్ము. మనము శిష్యులవలె విధేయులమై యుండుదము. మన మితరులపైననైన ఆధారపడి యుండవలె, లేదా ఇతరులు మన పైననైన ఆధారపడి యుంతవలె. ఇతర విధానములు మనలను గమ్యమునకు - పర మార్థమునకు జేర్పజాలవు.

జవర్ అలీ మౌలానా - ఒక గొప్ప విద్యావంతుడగు 'మౌలీ'. అతడు షిర్డికి 1880-90 మధ్యకాలమున వచ్చెను. సాయిబాబాను తనకు శిష్యుడై 'రహతా'కు రమ్మని ఆహ్వానించెను. అప్పటికే పలువురు హిందువులు బాబాను సేవించుచు పూజించుచున్నను, బాబా, జవహర్ఆలీ వెంట రహతాకు వెళ్ళెను. జవర్ ఆలీని సేవించుచు అచట 2, 3 నెలలు ఉండెను. షిర్డిలో బాబా భక్తులు బాబాను, జవర్ఆలీని షిర్డికి గొనిపోయిరి. దేవదాసు - అను హైందవ యోగియొక్క యుక్తిచే తనను హైందవులు ఆదరించుటలేదని గ్రహించి జవర్ ఆలీ షిర్డి విడిచివెళ్ళెను. ఆ పిదప బాబా పైన తెలుపబడిన మాటలను పలికెను. ఏమైనను బాబా ఉద్యమము పరిపూర్ణమగుటకు (మౌల్వీ గురువు) మస్తాన్ గురువుకూడ అవసరమే అయ్యెను.

305. నానావాలీ - ఒకనాడు గద్దెపైగూర్చున్న బాబానుజేరి "బాబా! నీవచటనుండి లెమ్ము! నీగద్దెపై నేను గూర్చుండబోవుచున్నాను" - అనెను.

బాబా లేచెను. నానావాలి, బాబాగద్దెపై గూర్చుండెను. కొంత తడవటుల గూర్చుండి, నానావాలి లేచి -

నానావాలి: బాబా! నీ యథాస్థానమగు నీ గద్దెపై గూర్చుండుము.

అంతట బాబా కూర్చుండెను. నానావాలి బాబాపాదముల వ్రాలి మ్రొక్కెను.

ఆ విధముగ నాజ్ఞాపింపబడుటకు బాబా ఏ లవమేని అనిష్టమును ప్రకటింపలేదు.

అన్నదానము – భిక్షము పెట్టుట

(ఎ) మంచితనము – సరళభావముతో భిక్షము పెట్టుట.

306. సా.బా: నానా! నీకు మఱియొక బోధ కావించు చున్నాడను.

నా. గో. చందోర్కర్ : మంచిది బాబా!

సా. బా: నానా! నిన్నెవరేని ఏదేని కోరిన, యాచించిన, అది నీకు సాధ్యమైనదైన, అది నీ విచ్చుటకుగాని, యిప్పించుటకుగాని వీలుపడునదైన అటుల కావింపుము. కాదు – లేదు – అనకుము. నీ యందుబాటులో లేనిదైన సరళముగ "నావల్లకాదు" – అనుము. ఆ అర్థిని – యాచకుని నిరసించుటకాని, హేళన చేయుటగాని, యతనిపై కోపము వహించుటగాని తగనిది. నీకుగల దానినిచ్చుటకు సమ్మతింపవా "లేదు" – అని, అసత్యము పలుకకుము. ఈయజాలను – అనికాని, ప్రతిబంధకము కలదు – అనికాని సౌమ్యముగ దెలుపుము. ఈబోధ జ్ఞప్తియందుంచుకొందువా? మఱతువా?

నా.గో.చం: బాబా! ఇందు కష్టమేమికలదు? తప్పక జ్ఞప్తియందుంచు కొందును.

సా. బా: ఈ బోధ వెలికి తోచునంత తేలికయైనది కాదు.

నా. గో. చం: బాబా! నేను మనస్సున నిలుపుకొందును.

కొంతకాలము జరిగిన తరువాత, కోపర్గామున దత్తస్వామి దేవాలయమునకు 300/- రూపాయలు ధర్మమిడుదునని వాగ్దానముచేసి, ఆ సైకము తీసికొనిరాని కారణమున, షిర్డికివచ్చు మార్గమున నున్నను కోవెలకేగి దత్త స్వామిని దర్శింపక, అతని స్నేహితుని సమ్మతితో సరియైన దారినిగాక ముండ్ల మార్గమున నడిచి, చందోర్కరు అతని మిత్రుడు తనువుల ముండ్లుగ్రుచ్చుకొన షిర్డికిజేరి బాబాను సందర్శించి మ్రొక్కిరి. బాబావారితో మాట్లాడలేదు.

నా. గో. చం: బాబా! నాతో పలుకాడవేమి?

సా. బా: నానా! నేను కావించిన బోధ జ్ఞప్తియందుంచు కొందునని మాటయిచ్చి, వాస్తవముగ అటుల కావింపని వానితో నేనేమి మాటాడగలను?

నా. గో. చం: బాబా! నీవు కావించిన బోధలన్నియు మనస్సున నిలుపుకొనినాడను.

సా. బా: పెద్దమనుష్యులు మీరు. మహాప్రభువును (దత్తస్వామిని) సందర్శింపక పెడమార్గమున వచ్చినారు. ఏల? అచట సాధువు 300/- రూపాయలడుగునని కదా! నాబోధ మనస్సున నిలుపుకొను విధ మిదియేనా? నీ దగ్గఱ ధనములేదేని, ధనము తీసికొనివచ్చుటకు సాధ్యపడదేని ఆ విషయ మాతనితో జెప్పనగును. ఆ సాధువు నిన్ను తినునా? ఆ సాధువు నిన్ను ధన మడుగునను భీతితో స్వామికోవెలను తప్పుకొని, పెడమార్గమునవచ్చు ఈ ఉపాయమేమి? నీపాదముల, దేహమున, నీ మిత్రుని వెనుకభాగమున ముండ్లు గుచ్చుకొనలేదా? అట్టి మనుష్యులతో నేనెట్టుల మాటాడగలను?

బి) గర్వము, కోపము లేక బిచ్చము పెట్టుట.

307. సా.బా: నానా! ఈ దినమున నీకు మఱియొక బోధ కావించు చున్నాడను.

నా. గో. చం: బాబా! మంచిది. బాబా!

సా. బా: నానా! ఎవరేని చేరి ఏమేని యాచించిన నీశక్తి కొలది సమర్పింపుము. ఆ యాచకుడు దానితో తృప్తినొందక అధికముగ యాచించెనా సౌమ్యముగ "వీలుకాదు" – అనుము. అగ్రహోదగ్రుడవై నీ అధికార దర్పమును ఆ బిచ్చగానిపై ప్రకటింపకుము.

నా. గో. చం: మంచిది. బాబా!

కళ్యాణ్‌పురమున చందోదర్కరు కుటుంబముతో నివసించుచుండ నొక బిచ్చగత్తె వారింటికి వచ్చెను. చందోర్కరు సతి బిచ్చము పెట్టెను. ఆ బిచ్చగత్తె మఱికొంచెము హెచ్చు పెట్టినగాని కదలనని మంకుపూనెను. ఆ గృహిణి తన భర్తయగు చందోర్కరునితో చెప్పెను. నా.గో.చందోర్కరు వేగముగ లేచివచ్చి "ఆ పెట్టినది తీసికొని పోయినసరే! లేకున్న మెడ

పట్టి వెలుపలకు గెంటుము" అని తన బంట్రోతు నాజ్ఞాపించెను. తరువాత కొంతకాలమునకు చందోర్కరు షిర్డికివెళ్ళి బాబాను సందర్శించెను. బాబా చందోర్కరు వైపునకు దిరుగగ మౌనముగ నుండెను.

నా. గో. చం: బాబా! నాతో మాటాడవేమి?

సా. బా: నా మాటలు పాటించనివారితో నాకేమి మాటలు కలవు?

నా. గో. చం: బాబా! నీవు కావించిన బోధలేమి మఱచితిని? నీ బోధలన్నియు జ్ఞప్తియందుంచుకొనుచుంటినే.

సా. బా: ఆనాడొక బిచ్చగత్తె నీయింటికి వచ్చి పెట్టిన బిచ్చముతో తృప్తి నొందక అధికముగ పెట్టుమని మూర్ఖత వహింపగ నీ యధికార దర్పము ప్రకటించుచు ఆ బిచ్చగత్తెను మెడపట్టి వెలుపలకు గెంటుమని నీ 'జవాను' నాజ్ఞాపించ వలసిన పనియేమికలదు? నీవధికముగ పెట్ట నిరాకరించిన వెడలిపోక మంకుబూని ఆ పేదరాలు నీవాకిట గూర్చున్న మాత్రమున నీకు గలుగు నష్టమేమి? కొంత తడవు కూర్చుండి వెడలి పోయెడిదికదా? సౌమ్యముగ చెప్పుటకు బదులుగా ఆగ్రహావేశమున ఆ బిచ్చగత్తెను మెడపట్టి గెంటుమని నీ నౌకరును ఆజ్ఞాపించనేల?

308. సా. బా: ఎవరేని ఇతరునిపై ఆగ్రహించిన నన్ను ఆతడు వైశమబాధపెట్టిన వాడగును.

ఎవరేని ఇతరుని నిందించిన నేను బాధపడుదును. తన్ను ఎవరేని నిందించిన ఓర్పుతో సహించువానియెడ నేను మిక్కిలి సంతోషింతును.

(సి) విచక్షణ పాటింపక భిచ్చము పెట్టుట.

అతిథి (శబ్ద) వివరణము

309. నా. గో. చందోర్కరు నిత్యకర్మాదులు, వైశ్వదేవము పూర్తి కావించుకొని అతిథులు కొఱకు కొన్ని నిమిషములు వేచిన, నెవరు రాక పోవుటచే, అతిథికొఱకు వేచియుండుమని వేదములాదేశించుట నిరర్థక విషయమా? - అని బాబాను అడుగదలచెను. ఆతడు బాబాను సమీపింపగనే చందోర్కరు అడుగబోవు ప్రశ్నమును తెలిసికొనిన బాబా యిట్లనెను.

సా. బా: అవును - అవును. అతిధులు వత్తురు. తప్పకవత్తురు.

నా. గో. చం: బాబా! సత్యము, నేనునిత్యము కాకబలి సమర్పించి, వెలుపలికేగి, అతిథులకొఱకు వేచియుందును - ఎవరు రారు.

సా. బా: నానా! శాస్త్రములలో పొరపాటులేదు. మంత్రములు లోపభూయిష్టములు కావు. కాని అందలి సత్యవిషయము నీవు గుర్తింపలేదు. నిరర్థకమైన వివరణము (భావము) నీ తలకెక్కించుకొని, అతిథులకొరకు వేచి నిలిచి యుందువు. వారురారు. అహా! 'అతిధి' - అను పదమునకర్థము 3-1/2 మూరలు పొడవుగల బ్రాహ్మణుడనియేనా? ఆకలి నొంది నీదఱికా వేళకు వచ్చు ఏ జీవియైన "అతిథి"యే. నర జంతు పశుపక్ష్యాదు లేవైనను అతిథియే. ఇవన్నియు ఆహారముకొఱకు నిరీక్షించును. నిన్ను జేరు నిజమైన అతిధిని నీవు అటుల గుర్తింపజాలవు. ఇవి లక్షలకొలది నీదఱికి వచ్చునవి. నానా! నీ వ్యర్థమైన తలంపు త్రోసిపుచ్చుము. కాకాబలి సమయమున తగినంత అన్నమును ఇంటివెలుపలకు గొనిపోయి ఒకచోట పెట్టుము. నీవు వేనిని పిలువవలదు. చప్పటుల చఱచవలదు. డాసిన వానిని వేనిని తరుమవలదు. ఏ జీవివచ్చి తినినను నీ మనస్సున కలత పొందవలదు. ఈ విధముగ లక్షల కొలది అతిథుల దనిపిన సుకృతము పొందుదువు.

కర్మ సిద్ధాంతము, విత్తినది కోసికొందువు

310. సా. బా: (ఆర్. యస్. దేవ్‌తో) నీవు విత్తినది కోసికొందువు. నీవు ఇచ్చినది పొందుదువు.

311. సా. బా: (అవినీతి కృతికి శిక్షితుడై పై అధికారులకు తన శిక్షను రద్దుచేయుమని మనవిచేసికొని, బాబాఅనుగ్రహము బడయగోరి వచ్చిన ఒక సబ్జడ్జితో) వేప విత్తనము విత్తుము. వేపపండ్లను కోసికొనుము. ఆ తరువును నఱికివేయుము.

పూర్వకర్మము - దేహ ప్రారబ్ధము.

312. సా. బా: ఇపుడు నీవు కృషిసలుపుటచే పొందగలిగిన ఫలము ప్రస్తుత కర్మఫలము. నీవిపుడు పొందుచు కారణమెఱుగ జాలనిది పురాకృత కర్మఫలము, ఒకేపని కావించు నిరువురకు ఫలములు విభిన్నములుగ ప్రాప్తించుచుండును. ఆ భేదము వారిపూర్వకర్మ భేద

ఫలములుగ నిర్ణయించుకొననగును. ముందుగ జూడబడిన చూచుటకు సాధ్యముగాని ఫలములు పూర్వకర్మ జనితములగుటచే వాని కారణములు మనకగోచరములు. (కావున ఉహ్వొంగుటకాని, నిస్పృహ నొందుటకాని ఇతరులతగదు. నిందించుటయు గూడదు). ఫలసిద్ధి కారణమగు నైతిక ధర్మము కలదని గుర్తింపుము. కావున తొణకక నైతిక ధర్మము ననుసరింపుము. నీవు కావించు కృషి ఫలితముల నీవిపుడు పొందజాలకున్నను కలుగనున్న జన్మములలో వానిని పడయగలవు. ఇక వాసనల విషయమున నైతిక ధర్మము అతి కఠినమైనదని, అప్రతిహతమని గుర్తింపుము. కావున నైతిక ధర్మమును పాటించుచు, అనుసరించుచు నీ గమ్యమును – నైతిక ధర్మ పరిపూర్ణమును – దైవమును – జేరుము.

సత్సంగము – యమనియమములు మొదలగునవి.

313. సా.బా: సత్సంగము- మంచివారితో సాంగత్యము శ్రేయము మేలుగూర్చును. దుస్సంగము-చెడ్డవారితోడి చెలిమి హాని కీడు కలించును. కావున ప్రయత్నపూర్వక దుస్సంగమము విడనాడవలయును. యమము – నియమము :- నిషిద్ధములగు ఆహార పానీయముల జోలికి పోవకుము. "యుక్తాహార విహారస్య....". వ్యర్థములగు కలహముల మానుము. కల్లలు – అబద్ధములు పలుకకుము. పలుకుపొంకము కలిగి మితభాషివగుము.

ఇచ్చినమాట నిలుపుకొని ఋజుభావము కలిగి యుండుము. పర కాంతావ్యామోహము విడువుము. స్వపత్నియందే నిమిత ప్రవృత్తి కలిగి యుండుము.

దాంపత్య సుఖము పొందుట ధర్మసమ్మతమే కాని, కామమునకు బానిసీడు కాదగదు. కామ లంపటులకు ముక్తి దుర్లభము. కామము, మనశ్శాంతిని, బలమును, స్థైర్యమును చెఱచును. మహావిద్వాంసులనేని కామినీ వ్యామోహము పతితులను జేయును.

అధీనములుగాని పశువుల గమనమును నిరోధించుటకు మెడలో గుది కొయ్య (గళకాష్టము) కట్టుదురు. కాముక వ్యామోహమును రూపుమాపుటకు మనస్సునకు వివేకము – (యుక్తాయుక్త పరిజ్ఞానము) అను గుది కొయ్యను కట్టవలయును.

కోరికలను అధీనమునందుంచు కొనవలయును. అవి నీకు లొంగి యుండవలయునుగాని, నీవు వానికి లొంగియుండదగదు. "విజితాత్మా జితేంద్రియః"

నీ అంతశ్శత్రువులను (కామక్రోధాదులను) మితిమీఱనీయక నీవు ఉపయోగించు (కొనగలవు) కొనుము.

కామము — ధర్మపత్ని విషయమున,

క్రోధము — నీ దుష్ప్రవర్తనమునెడ,

లోభము — దైవనామస్మరణమున,

మోహము — ముక్తి విషయమున,

మత్సరము — చెడ్డపనులయెడ - పఱపుము.

మదము — ఎన్నడు తగనిది, వర్జింపుము.

మృతి (చావు)

ఎ. [నైతిక బోధలు]

313-ఎ. బాబా ప్రేమను అనుగ్రహించుట.

సా. బా: [రావుసాహెబ్ గాల్వంకర్ ఎదుట పొడమి] నీ కేమి కావలయును.

గాల్వంకర్ : ప్రేమతప్ప మఱేమియు వలదు.

కు. తా: అలాగే. [అని, బాబా అదృశ్యుడయ్యెను].

అదిమొదలు గాల్వంకరునకు ప్రేమ తరంగములు హృదయమున నుప్పొంగ దొడగెను.

313-బి. [ఇమాం] విశ్వాసమును బాబా ప్రసాదించుట.

రాజబాలీ మహమ్మదు బాబాను సందర్శించెను.

సా. బా: నీకేమి కావలయును?

రా. మ: [ఇమాం] విశ్వాసము మాత్రమే.

సా. బా: అల్లా అచ్ఛాకరేగా! (దైవమనుగ్రహించును).

314. సా. బా: ఏల నీవు దుఃఖించెదవు? గిట్టుటకే మనుష్యుడు పుట్టినది. ఏదో ఒక దినమున మనలో ప్రతివ్యక్తియు మరణించవలసినదే.

సా.బా: (అప్పాకులకర్ణిభార్యతో) చావుపుట్టుకలు దైవ విధానములు' ఈ రెంటిని వేర్పఱుపజాలవు. సకలమున దైవమనుస్యూతమైయున్నవాడు. (వాస్తవముగ) పుట్టువాడెవ్వడులేడు. ఎవ్వడు మృతినొందడు. నీ అంతర్దృష్టితో చూడుము! నీవు దైవమని – దైవమునకు భిన్నుడవు కావని ఎఱుగుదువు. చినిగి చీకిన వస్త్రమువలే, ఈ దేహము దైవముచే పాఱవేయ బడినది. నేను నా 'కుఫ్నీ'ని పాఱవేయుపూర్వము 'అప్పా' తన దుస్తులను మార్చుకొనగోరినాడు. అప్పాను పోనిమ్ము! అతని నాపవలదు. ఉధికొఱకు అడుగవలదు.

లాభనష్టములు – పుట్టుకచావులు దైవాధీనములు. ఈ జనులెంత అంధులై దైవమును మఱచుచున్నారు. ప్రాణముండునంతవరకు దానిని రక్షించుకొనుము. మృతి ఆసన్నమైన దుఃఖింపకుము.

వివేకముగలవారు "మృతి" అనిన ఏడ్వరు. అవివేకులు దుఃఖింతురు.

చూడుము! ఇంతదనుక ఈ ఐదు ప్రాణములు తాత్కాలికముగ ఉపయోగించుకొనుటకు బదులు ఈయబడినవి. ఆ బదులు ఇచ్చినవాడు తనసొత్తు తాను తిరిగి రాబట్టుకొనినాడు. అవి తిరిగి ఆ యజమానిని జేరినవి. గాలి - గాలిని, అగ్ని - అగ్నిని, ఇట్లే పంచభూతములు వాని స్థానమును జేరుకొనినవి.

ఈ దేహము పృథ్వీవికారము. భూతత్త్వము వలన కలిగినది. యథార్థముగ అవి యన్నియు నొకటే.

కావున దేహము భూమినిజేరుట దుఃఖింపదగిన విషయము కాదు.

జననము - (పుట్టుక)

313. సా. బా: పుట్టువు విషయమును గూర్చియు అదే విధము, పుట్టువునుగూర్చి ఆనందోత్సాహములను పొందకుము. సృష్టిలో నిదియొక

విధానము - క్రమము. (మొదటినుండియు ఇది జరుగుచునే యుండును) దానిచే చలింపరాదు.

భూమి బీజముల వహించును. మేఘములు వానిపై వర్షించును. సూర్యుడు కిరణములబఱపి వానిని మొలకెత్తజేయును. ఇవి మొలకెత్తిన పిదప భూమి, మేఘము, సూర్యుడు వారివారి లీలలను బఱపుచు వానికి ఎల్లవిధముల సుఖానందముల గూర్చుచునే యుందురు. ఆ మొలకలు పెరుగుచున్నచో నవి ఉప్పొంగవు. అవి నశించిన దుఃఖింపవు.

వీని (పృథివి మేఘసూర్యుల) వలె నీవును కలతపొందరాదు. అటుల నీవున్న నీకు దుఃఖమెందుండి కలుగును? ఈ దుఃఖరాహిత్యమే 'ముక్తి'.

దుఃఖము - స్వార్థపరత

316. సా. బా: (దీర్ఘకాలవ్యాధిచే బాధలు పడి పడి బాబాను ధ్యానించుచు ప్రాణములు విడచిన భర్తకొఱకు దుఃఖించుచున్న ఒక వృద్ధురాలి ఏడ్పులు విని) ఆ వృద్ధురాలి ఏడ్పుడు వినుడు! "నాగతియేమి కావలె? నాకు తిండి గుడ్డ లెవరిత్తురు?"- అని, విలపించుచున్నది. ఆమె భర్తయొక్క బాధలను, సుఖమును సంపూర్ణముగ మఱచుచున్నదిసుమా! భర్త బాధలు - కష్టములు కావు, ఆమెకు కావలసినవి - తిండి గుడ్డలు.)

పుత్ర మరణము - పుత్రికా మరణము మొదలగునవి

(డబ్లు. జి. ప్రధాన్)

317. సా. బా: (ఒక మేజస్ట్రేటుతో) ఒక కుమారుని మరణము గూర్చి ఆ అవివేకి అటులేల ఏడ్వవలె? అది పృథివిని జేరుటయే. ఆ తనువు భూమిని జేరవలసినదే, దానిని గూర్చి యటుల విలపించు చుండనేల? రామ ఫలముల అన్నిదిశల వెదజల్లుము!

సా. బా: (మనుమనిమృతికై విచారపడు నానా గోవింద చందోర్కరుతో) చూ. 371.

318. సా. బా: (బయ్యాజిపటేల్‌తో) నీవు నీ తండ్రి మృతికొరకు విచారపడనేల? 5 నెలలలో నతడు తిరిగివచ్చును. (5 నెలల బయ్యాజికి పుత్రుడు జనించెను).

జ్ఞాని – నిర్యాణము

319. సాధు సత్పురుషులు మృతిచెందినవారు – అని అనరు. వారు సమాధి నొందుదురు. (చూ. కబీరు)

బాబా : మృతిని దప్పింపబోని సమయము. ఎ) బెంద్రేకు - బి) సర్పదష్టుడైన బాలునకు సి) ప్రిదిలిన పెదవిగల పిల్లల తండ్రికి డి) అప్పాకులకర్ణికి – బాబా హెచ్చరికచేయుట.

(ఎ) 4 దినములలో మతుని గోల్పోనున్న జి. పి. బెంద్రేకు బాబా హెచ్చరిక చేయుట.

320. సా. బా: వెళ్ళుము! బూటీని 10 రూపాయలు దక్షిణ నడుగుము.

బెంద్రే, బూటీదగ్గఱకేగ అపుడే మృతినొందిన యాతని గుమస్తాను భూస్థాపితము జేయుటకై ప్రశాంతముగ నడచుచు పోవుచున్న బూటీని జూచెను. (తిరిగి వచ్చెను)

సా. బా: (బెంద్రేతో) మిక్కలి విచారకరమగు విషయము ఆపాదించెను - భయపడకుము. ధైర్యము వహింపుము. పొమ్ము. తబ్బిబ్బు కావలదు.

ఆ విధముగ సిద్ధపఱుపబడిన బెంద్రే ఆ తరువాత రెండు రోజులకు మృతినొందిన కుమారునిగూర్చి అంతగా శోకమగ్నుడు కాలేదు.

(సర్పదష్టుడైన బాలుడు)

వడదెబ్బతగిలి మృతినొందిన బాలుని బాబా బ్రతికించిన కొంతకాలము తరువాత ఒక కాంత సర్పదష్టుడైన తన కుమారుని రక్షింపుమని, 'ఉధి' ప్రసాదింపుమని, బాబానుజేరి ప్రార్థించెను. ఉధి ప్రసాదింపబడలేదు. ఆ బాలుడు మరణించెను. ఆమె మరల బాబాను జేరి పెద్ద పెట్టున ఏడ్చెను.

321. హె. సి. దీక్షిత్ : బాబా! ఆ కాంత విలాపము హృదయ విదారకముగనున్నది. నన్ను గూర్చియైన – నా కొఱకు ఆ మృతినొందిన ఆమె పుత్రుని బ్రతికింపుము.

సా. బా: భావ్! ఈ విషయమున నీవు జోక్యము కల్పించు కొనవలదు. భావ్! ఏమి జరిగినదో అది మేలునకే. అతడు నూతన తనువున ప్రవేశించెను. అతడీ నీవు చూచు తనువును చేయజాలని గొప్ప గొప్ప పనులా నూతన తనువున జేయగలడు. నేనాతని ఈ తనువులోనికి ఆకర్షించితినా ఆ తనువు మృతినొందును. ఈ తనువు పునర్జీవిత మగును. నీ కొఱకు నేనీపని గావింతును-కాని, దాని పర్యవసాన మాలోచించితివా? దాని బాధ్యత విషయమై నీకేమేని యోజనకలదా? నీవా బాధ్యత వహింప సిద్ధపడుదువా?

హ. సీ. దీక్షిత్తు తనకోరిక విషయమై పట్టుదల విడచెను.

సి) పగిలిన పెదవిగల బాలిక

322. 1913 లో యస్. బి. మోహిలే, డాక్టర్లకు సాధ్యముగాని, చీలిన పై పెదవిగల తన పుత్రికను చక్కబఱపించుకొనుటకై బాబాదగ్గరకు గొనిపోయెను.

సా. బా: నీ వెందుకు వచ్చితివో నేనెఱుగుదును. నేనీ బిడ్డను చక్క బఱుపగలను. కాని, ప్రయోజనములేదు. ఈ బిడ్డ దైవ సంపదకలది, ఈ బిడ్డ ఆయుఃప్రమాణము మిక్కిలి స్వల్పము. రాబోవు మాఘ శుద్ధ చతుర్దశినాడు (మార్చి 1914) ఈమె తనువును విడుచును. నీవా దినమున నింటనుండక ఆఫీసుకు వెళ్ళినయెడ నీవు తిరిగి వచ్చునప్పటికి బిడ్డను సజీవముగ జూడ జాలవు.

తండ్రి ఆఫీసులో నుండగ బాబా తెలిపిన దినముననే ఆమె మృతి నొందినది.

డి) అప్పాకులకర్ణి

323. (=314) సా. బా: (అప్పాకులకర్ణితో) బందిపోటు దొంగలు గ్రామమున ప్రవేశించినారు. నీవే వారి మొదటి లక్ష్యమగుదువు. ప్రధాన వస్తువులను చేజిక్కించుకొనుటయే వారి ఆశయము. వీనిని దీసికొని పాఱిపోదురు.

ఇది కలరావ్యాధి షిర్డిలో ప్రవేశించు విషయమును గూర్చి తెలుప బడినది. అప్పాకులకర్ణియే దీనికి మొదటిబలి. అప్పా ఈ విషయమును

అపార్థము జేసికొని చావడిలో నుంచిన 'సర్కారుపైకము' అని తలంచి దానికి ప్రత్యేకముగ 'కాపలా' పెట్టినాడు. అప్పాకు కలరావ్యాధి సోకి మృతినొందెను.

323-ఎ. అప్పాకులకర్ణిభార్య : (ఏడ్చుచు వచ్చి) బాబా! నా భర్తను బ్రతికింపుము.

సా. బా: అమ్మా! అప్పాను పోనిమ్ము. అతని నాపవద్దు, నా కుఫ్నీని నేను విడుచుముందు అతడు తన కుఫ్నీని విడుచుచున్నాడు. అటుల అతడు వెళ్ళుట అతనికి మేలు.

మృతిని తప్పించుయత్నము - బుద్ధిసాధనము

324. 'నిగోజి' పటేల్ భార్య ప్లేగు వ్యాధివలన ప్రమాదస్థితియందుండెను. ఆ రాత్రి బాబా భగత్ మహల్సాపతితో చావడియందుండెను.

సా. బా: భగత్! ఈ రాత్రి నిద్రింపకుము. నిలిచి కనిపెట్టి యుండుము. నే నీ దినమున దైవమును స్మరించవలె. ఆ కఠిన రోహిల్లా (మృత్యువు - ప్లేగు) ఆ కాంతను చంపగోరుచున్నది. నేను అల్లాను ప్రార్థించుచున్నాడను.

బాబా ప్రార్థనములకు ఏవిధమైన అంతరాయము - భంగము కలుగకుండ మహల్సాపతి జాగ్రత్త వహించుచుండెను. కాని, ఆ రాత్రి 'నివాస్' మామ్లత్‌దారు, అతని సేవకులు అర్భాటము చేయుచు మామ్లత్ దారునకు బాబా దర్శనము కావలయును - అని బిగ్గరగ అఱచుచుండిరి. మహల్సాపతితో వారి సంభాషణ - మహల్సాపతి "ఊధీ" తీసియిచ్చుట ఇవన్నియు బాబా ధ్యాననిష్ఠకు భంగము గలించినవి. బాబా కోపించి మహల్సాపతిపై వస్త్రమునావల విసరివైచెను.

సా. బా: (మిక్కిలి దూషించిన తరువాత) ఓయీ! భగత్! నీవొక కుటుంబమునకు తండ్రివేనా? "నిగోజి" గ్రామములో నేమి జరుగుచున్నదో నీవు గుర్తించుటలేదు. (పటేల్‌భార్యకు తగిలిన విషయము). అట్టి పరిస్థితులలో జనుల నేలరానిచ్చితివి? - కానిమ్ము - ఏమి జరిగినదో అది మంచికే!

ఆ రాత్రి పటేల్ భార్య మృతి నొందెను.

325. సా. బా: (ఇరువురు బిడ్డలను గోల్పోయి ఒక కుమారునకు జబ్బుగా నున్నపుడు వచ్చిన డామోదర్ బి. రాంపూర్‌కర్‌తో) నీవేల భయ పడుచున్నావు? గతించినవారు గతించిరి. ఉన్నవారితో తృప్తి నొందుము. భయపడకుము. నీ వెంట నేనులేనా? ఇంకేమి?

326. సా. బా: (కుమార్తె మరణించిన సమయమున హ. సీ. దీక్షిత్తుతో) అధ్యాత్మరామాయణమున శ్రీరాముడు మండోదరిని ఓదార్చు ఘట్టము చదువుము!

బాబా - మృత్యువును తప్పించుట.

ఎ) అభినవమార్కండేయుడు.

327. 1917 మే - జూన్ నెలలలో ఒక బొంబాయికాంత - ఆమె చిన్న కుమారుడు బాబాయెదుట మధ్యాహ్న హారతి సమయమున గూర్చుండిరి.

సా. బా: (బాలునితో) నీవు సరిగ మధ్యాహ్నము 2 గంటల కిక్కడకు రావలయును.

బాలుడు : అలాగే - బాబా!

సరిగ పగలు 2 గంటల కాబాలుడు ద్వారకామాయి మసీదునకు జేరెను

సా. బా: బిడ్డా! ఇక్కడకు రమ్ము. ఆ చాపపై నా పాదములదటి గూర్చుండుము.

నా పాదములొత్తుచు నేను తెలుపునంతవరకు నా పాదముల విడువకుము.

ఆ విధముగ ఆ బాలుడు బాబాపాదముల నొత్తుచుండెను. పగలు 3 గంటలకు వెంట్రుకలు విరియబోసికొనినతల, మలినమైన ముఖము, వెలికి వ్రేలాడు పొడవైన నాల్కతో నొక భయంకరమైన స్త్రీ రూపము ప్రహరి గోడను దూకి కుక్కనడక ననుకరించుచు ఆ బాలుని సమీపించి యిట్లనెను.

"ఈతడు నాకు కావలయును".

సా. బా: నేనీతని నీయను.

ఆమె నాకు కావలసినది యీతడే. ఆమె ఆ బాలుని జేరి లాగెను. బాబా లేచి కోపోద్రిక్తుడై, ఆ బాలునొకచేత బట్టుకొని, ఆ వికట రూపిణి యురమున నొకతన్ను తన్నెను. ఆమె పెద్దగ మొఱపెట్టుచు పాఱిపోయెను.

సా. బా: బిడ్డా! నీవు గమనించుటలేదా? ఆ వచ్చిన స్త్రీని నీ వెఱుగుదువా? అహో! ఆమె నిన్నీయుమని కోరుచున్నది. కాని నేనెటుల నీయగలను? నేను నిరాకరించితిని. కాని, నా దేహము మొద్దుపాఱినది.

(ఆ వికట స్త్రీ రూపము కలరా దేవతయని బాబా తెలిపెను. ఆ మరు నాటి ఉదయమున బాబా ఆ బాలుని, తల్లిని తిరిగి బొంబాయికి వెళ్ళుడని అజ్ఞాపించెను. అంతట షిర్డిలో కలరా వ్యాధి విజృంభించెను.

బి) బాబా నిర్యాణము

1886లో బాబా ప్రపంచమును విడనాడు మొదటి ప్రయత్నము.

328. 1886 లో బాబా మహల్సాపతితో నిట్లనెను. "నేను అల్లా దగ్గఱకు పోవుచున్నాడను. ఈ తనువును 3 దినములు కాపాడుము. నేను తిరిగి వచ్చితినా - నా విషయమునుగూర్చి నేను జాగ్రత్త పడుదును. నేను తిరిగిరానా - (అచట వెలుపలనొక ప్రదేశమును వ్రేలితో చూపుచు) ఆ ప్రదేశమున ఈ తనువును భూస్థాపితముచేసి, యీ తనువు స్థాపితమైన చోటును దెలుపునటుల అచట రెండు జెండాలను పాతుము".

అంతట బాబా శ్వాస, నాడిచలనము, రక్తప్రసారము స్తంభించెను. ఆ శరీరమొక శవమయ్యెను. గ్రామాధికారులు, పోలీసులు పంచాయితీ జరిపిరి. ఆ తనువును భూస్థాపితము చేయుమని వారు మహల్సాపతిని అజ్ఞాపించిరి. ఆదిశంకరాచార్యుల విషయమున గలిగిన మహావిపత్తు ఇపుడు బాబా తనువు నకు గలిగినది. శంకర భగవత్పాదుల విషయమున ఆ తనువును దైవము కాపాడెను. ("లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్"). మహల్సాపతి పట్టుదలపూని బాబాతనువును ఎవ్వరిని తాకనీయలేదు. 72 గంటలు గడచిన తరువాత బాబాతనువునకు చైతన్యము కలిగెను. శ్వాస ప్రారంభమయ్యెను. పొత్తికడుపు చలించెను. బాబా కనులు తెఱచెను. బాబా పునర్జీవితుడయ్యెను.

2. 1916

329. 1916 అక్టోబరు. విజయ దశమినాడు బాబా మహా కోపావేశమున నుండెను. తన దుస్తుల నన్నిటిని చింపి, తునియలు తునియలు చేసి, ముందున్న 'ధుని' – అగ్నియందు పడవేసి, పూర్ణముగ దిగంబరియయ్యెను. అగ్ని కణములవలె యెఱ్ఱగ ప్రజ్వరిల్లు నేత్రములతో నిట్లు బిగ్గఱగ పలికెను. 'మీరందరు యిటు రండు చూడుడు. నేను మహమ్మదీయుడనో – హైందవుడనో చూచి మీరే నిర్ణయించుకొనుడు!"

అటుల కోపావేశమున రెండు గంటలు గడచిన తరువాత భగోజిసింధి (కుష్ఠు రోగియైన బాబాఅనుచరుడు) ధైర్యము వహించి, బాబామొలకొక లంగోటిని కట్టి యిట్లనెను. "బాబా! యిదంతయు యేమి? ఈ దినము సీమోల్లంఘన పర్వదినము గదా"! అంతట బాబా తన 'సట్కా' - (చిన్న బెత్తము) తో నేలపై చఱచుచు 'అవును. ఇది నా సీమోల్లంఘనము - నా జీవిత పరిమితి ఉల్లంఘించుట'.

జనులు బాబా అభిప్రాయమపుడు గ్రహింపజాలరైరి. కాని, 1918 సంవత్సరమున విజయ దశమి నాడే బాబా తన భౌతిక జీవిత పరిమితిని ఉల్లంఘించినాడు.

1918 విజయ దశమికి పూర్వము బాబా మిక్కిలిగ వ్యాధి గ్రస్తుడయ్యెను. బాబా మరణింపనున్నవాడను జన ప్రవాద మన్ని ప్రాంతముల వ్యాప్తమయ్యెను. బాబా ఆరోగ్య ప్రాప్తికొఱకు భక్తు లందరు "సప్తాహము" జరిపి, పేదలకు అన్నదానము గావించిరి. తరువాత బాబా తిరిగి స్వస్థత గనెను. కాని, నానాసాహెబ్ నిమోన్కర్ పూనాకు వెళ్ళుచు బాబాదగ్గఱకు చేరెను.

సా. బా: నానా! నీ విక్కడ నిలువుము! నన్ను భూస్థాపనము చేసి పొమ్ము!

బాబా - నానా నిమోన్కరును తిరిగి అతని స్వగ్రామమగు "నీమోన్" నకుగాని, పూనాకుగాని వెళ్ళుటకు అంగీకరించలేదు.

నిమోన్కర్ పక్షమవలంబించి, శ్యామా నిమోన్కరును వెళ్ళుటకు అనుజ్ఞ నీయుమని ప్రార్థించెను.

సా. బా: శ్యామా! నా ఒడ్డలను చంప దలచితివా? కాకా (నానా నిమోన్కరు) నీ అబ్బసొమ్ము నేమైన తినిపోవు చున్నాడా?

శ్యామా : కాని, బాబా! అతని కోడలు గర్భిణి. ఆమెకు సహాయ మవసరము.

సా. బా: (నిమోన్కరుతో) ఓయీ! కాకా! నీవు ఆందోళన చెంద నేల? దైవము (అల్లా) కాపాడును. నన్ను పూడ్చి మరీ వెళ్ళుము!

అతని కోడలునకు సాయములేదు. ఒకనాటి రాత్రి 10 గంటలకు కాన్పు నొప్పులు కలిగెను. వెంటనే పూనాలోని పురపాలక ప్రసూతి వైద్యాలయమున కొక 'టాంగా' లో ఆమె కొనిపోబడెను. ఒక పాన్పుపై పరుండబెట్టిరి. అచట నున్న దాది 11 గంటలకు వేరొక గదికి వెళ్ళెను. ఆ మంత్రసాని లేని సమయమున ఏ సహాయంతో నిమిత్తములేకయే ఆమె మగ శిశువును ప్రసవించెను. ఆ సమయమున షిర్డిలో బాబా, నిమోన్కరుతో నిట్లనెను. 'ఒక కాంత కలదు ఆమె ఒక చోటునకు గొనిపోబడెను. అచట ఆమె మగ బిడ్డను కనెను'.

3. 1918 లో బాబా మహా నిర్యాణము

330. కొన్ని నెలలకు పూర్వము బాబా ఉద్ధేవేశభావుతో పక్షపక్షమున తన్ను సందర్శింప రావలదని తెలిపి, కడసారి వీడ్కోలొసంగెను. దసరాకు పూర్వము చాల దినముల నుండి బాబా – తాత్యాపటేల్ ఇరువురు జబ్బుగా నుండిరి. దసరాలో తొలుతటి దినములలో నితరుల నాధారము చేసికొని నియమిత గృహముల కేగి బాబా భిక్ష గొనివచ్చెను. చివర రెండు మూడు దినములలో బాబా వెలుపలకు వెళ్ళజాలక పోయెను.

15-10-1918 నాడు - విజయ దశమినాడు మధ్యాహ్న హారతి పూర్తి అయిన పిదప –

సా. బా: మీరు [కాకా (హ. సీ. దీక్షిత్) బూటీ మొదలగువారు] మీ భోజనములకు పొండు!

అపుడు వారు వెళ్ళిరి. బాబా తన గద్దెపై గూర్చుండి 'బయ్యాజి' ని తనుకొని "నేను వెళ్ళుచున్నాను. నన్ను వాడకు గొనిపొండు. బ్రాహ్మణు లందరు నా దగ్గఱ నివసింతురు" అని, తుది యూర్పు విడిచెను.

నానా నిమోన్కరు బాబానోటిలో నీరు పోసెను. కాని, ఆ నీరు వెలుపలకు వచ్చెను అపుడు పగలు 3 గంటలయ్యెను. అది విజయ దశమి దినమే, కాని, అప్పటికి ఏకాదశి ప్రారంభమయ్యెను.

తన నిర్యాణమును ముందుగా గుర్తించిన బాబా ఆ దశమి ఉదయమున దానములు బహూకరించెను. తన గద్దెపై గూర్చుండి ప్రతి దినము ఆహారములు సిద్ధపరచి బాబాకు తినబెట్టుచు, ప్రతి దినము బాబా వలన 4 రూపాయలు స్వీకరించు లక్ష్మీబాయి సింధేకి, బాబా తన జేబు నుండి తీసి మొదట 5 రూపాయలు, తరువాత 4 రూపాయలు ఇచ్చెను

ఇంతకుపూర్వము ఫకీరులకు తినబెట్టుటకు, పుణ్యక్షేత్రముల వ్యాజ్యముల మొఱయించుటకు 200/-రూపాయలు పంపెను. మరియొక ముస్లిము సాధువునకు యిటుల సందేశము పంపెను.

"అల్లా వెలిగించిన దీపమును అతడు తీసికొని పోవుచున్నాడు".

[ఆ సాధువా వార్తను అశ్రుధారతో స్వీకరించెను. (330-ఎ)].

బాబా జబ్బుగా నున్న 4 దినములు "రామ విజయము" పఠింపబడినది. దసరా 9, 10, 11 వ దినముల బాబా చక్కగ వినునట్లు చదువబడెను. అది మృత్యుంజయ ప్రీతికరమని బాబా పలికినాడు.

దసరా పండుగనాటి రాత్రి బాబా లక్ష్మన్ మామకు స్వప్నమున గోచరించి "వేగము లెమ్ము, నా (కాకడ్) ప్రభాత హారతి కావింపుము. 'జోగ్' నేను మృతి నొందితినని తలంచు చున్నాడు. అతడు రాడు"– అని చెప్పెను.

ఆ మఱునాడు మౌల్వీలు ఆక్షేపణ తెలుపుచున్నను లక్ష్మన్ – ద్వారకామాయి మసీదునకు వెళ్ళి, ప్రభాత హారతి కావించినాడు. 16-10-1918 మధ్యాహ్న హారతిని 'జోగ్' యథావిధిని గావించెను.

తన మహా సమాధి సమీపించు చుండెనని బాబా తెలుపుట-

330-ఎ. సా. బా: (ఛోటూఖాన్‌తో) ఈ పూలమాలను ఫకీర్ బన్నేమియా గళమున నుంచి, 'ఇక్కడ') అల్లా నిలిపిన దీపమును అల్లా కొనిపోవు చున్నాడు' - అని చెప్పుము. మౌలానా కా విషయము 15-10-1918 కి కొలది దినములకు పూర్వము తెలుపబడినది అపుడా ఫకీరు కన్నులందు అశ్రువుల స్రవించెను.

4. బాబా సమాధి – దేవాలయము.

ఒకనాటి రాత్రి బాబా గోపాలరావు బూటీని ఒక (వాడ) భవనము – దేవాలయము నిర్మించుమని కోరినట్లు శ్యామా, బాపూ సాహెబ్ బూటీ యిరువురు కలగనిరి.

హ. సీ. దీక్షిత్ శ్యామాతో కలిసి, యీ విషయమై తెలిసికొనుటకు బాబాదగ్గఱకు వెళ్ళెను.

శ్యామా : దేవా! ఎట్టి అద్భుత చిత్రములను నీవు సంఘటించు చున్నాడవు!

సా. బా: (చెవులు మూసుకొని) నేను నా స్థానములోనే యున్నాడను. నేనెవరికీ నేమియు జెప్పుటలేదు.

వారు భవన నిర్మాణమునకు అనుజ్ఞ నీయుమని కోరిరి. బాబా అను మతి నిచ్చెను.

తరువాత బూటీ ప్రత్యేక గర్భగృహములేకయే ఆ భవనము చావడి మధ్య మురళీధర విగ్రహమును ప్రతిష్ఠింపగోరి బాబాఅంగీకారము నర్థించెను.

సా. బా: ఆ దేవాలయము నిర్మింపబడిన తరువాత అక్కడ మనము నివసింతుము.

1918 లో బాబా జబ్బుపడి చివరిగడియ సమీపించు చుండగా, బయ్యాజి పటేల్‌తో మఱి యితరులతో బాబా యిట్లనెను. "నేను వెళ్ళు చున్నాను. నన్ను (బూటీ) వాడ యందుంచుడు, బ్రాహ్మణులు నా సమీపమున నుందురు.

బాబా నిర్యాణ మొందిన తరువాత బాపూసాహెబ్ బూటీ ఆ వాడలో నివసించుటకుగాని, అందు మురళీధరుని ప్రతిష్ఠించుటకుగాని కాంక్షింపలేదు. ఆ వాడలో బాబాభౌతికతనువును సమాధి చేయుటకే అంగీకరించెను.

బాబా భౌతిక తనువును సమాధిచేయు విషయమై హైందవులకు మహమ్మదీయులకు తీవ్ర భేదాభిప్రాయము లేర్పడినవి. ఆ తాలూకా మామ్లత్‌దారు 'మహజరు'రూపమున జనవాక్యము సేకరించుడని ఆజ్ఞాపించెను. అత్యధిక సంఖ్యాకులుగ హైందవులు బాబాభౌతికతనువును "బూటివాడ"లో సమాధి చేయుడని తమ (వోటు) సమ్మతి దెలుపుటచే ఆ విధమున గావింప బడినది. బాబాసమాధి యీనాడు షిర్డియందు బూటీవాడలో కలదు.

సద్గతి.

1. గ్రుడ్డివాడు

332. ఒక గ్రుడ్డివాడు తనకు చూపును ప్రసాదింపుమని బాబాను జేరి వేడెను. బాబా అతని కోరిక ననుగ్రహింపని కారణమున అతడు మసీదు విడచి అపుడు ఖండోబా దేవాలయముననున్న ఉపాసనీబాబాను చేరి ప్రార్థించెను. "నీ యీ స్థితిలోనున్న వానికి 'ప్రాకృత దృష్టి' ప్రసాదించిన లాభము లేదు. దానివలన నీ కోరికలు హెచ్చునేగాని తగ్గవు. కావున ఆధ్యాత్మిక దృష్టి లోని చూపు - ప్రసాదింపుము - అని, బాబాను కోరుము - పొమ్ము" అని ఉపాసనీబాబా తెలుప ఆ గ్రుడ్డివాడు ద్వారకామాయిని జేరి "బాబా! నాకు ప్రాకృతదృష్టి వలదు. నాకు నీ ఆశ్రయ మొసగి 'లోనిచూపు' ప్రసాదింపుము" అని కోరెను.

సా. బా: ఇక్కడ నిలువుము.

ఆ గ్రుడ్డివాడచట నెల దినము లుండెను. ఆధ్యాత్మికముగా వృద్ధి నొంది మరణించెను.

సా. బా: ఈతడు మరణింపలేదు. ఈతని భార్యయే (అజ్ఞానమే) మరణించినది. ఇతడు సద్గతి నొందినాడు.

2. యల్. కె. నూల్కర్.

333. 1909లో నా. గో. చందోర్కరు పండరీపురమున డిప్యూటీ కలెక్టరుగ నున్నపుడు లక్ష్మన్ – కె. నూల్కర్ అచట 'సబ్జడ్జి' గా నుండెను. షిర్డికివెళ్ళి బాబా దర్శనము చేసికొనుమని చందోర్కర్ నూల్కరును ప్రేరేపించెను.

నూల్కర్ : నాకు వంట బ్రాహ్మణుడు. బాబాకు సమర్పించుటకు నాగపూర్ నారింజ ఫలములు లభించినగాని నేను వెళ్ళజాలను. ఈ రెండు నిచట లభింపవు.

నా. గో. చం: బాబా అనుగ్రహమున నీకవి లభ్యములగును.

ఆ రాత్రి ఒక వంట బ్రాహ్మణుడు నా. గో. చందోర్కరు దగ్గఱకు వెళ్ళి, తన కెక్కడనేని పని చూపించుడని కోర నతడా బ్రాహ్మణుని నూల్కరు దగ్గఱకు పంపెను. నూల్కరాతని తన దగ్గఱ వంట మనిషిగ నుంచుకొనెను. ఉదయమున నాగపూర్ నారింజపండ్లు నిండుగగల ఒక బుట్ట 'బంగీ' నూల్కర్‌నకు జేరెను. అవి ఎచటనుండి యెవరు పంపిరో తెలియదు. ఎట్లయిననేమి? బాబా అద్భుతశక్తి సమర్థతలను గుర్తించి, తన కొఱతలు తీరిన నూల్కరు నా. గో. చందోర్కరుతో గలిసి షిర్డికిజేరి బాబాను సందర్శించెను.

సా. బా: నానా! నీవెంట గొనిరాబడి, మిక్కిలి వెఱ్ఱివాడని పేరెన్నిక కన్న ఈతడెవడు?

మఱునాడు నూల్కరు మసీదునకు వెళ్ళగా బాబా కోపోద్రిక్తస్థితి యందుండి, నూల్కరు తలను పట్టుకొని, ఒక స్తంభమున కానించి కొట్టుచు– "తుఝాసత్యానాశహోఇల్" (నీ ఉనికి లేక సత్యము నాశనమగును - లేక - నీ అసత్యము నాశనమగుగాక!)

నూల్కరు మిక్కిలి భయపడెను. కాని, చందోర్కర్ ఆ జరిగిన విషయములగూర్చి అవి సకలము శుభసూచకములేయని వివరించి తెలిపెను.

ఆ రాత్రి నూల్కర్ అదాటున లేచి, తాను సాధారణముగ నుపయోగింపకున్నను, పాన్‌బీడా - ఆకుబీడా కావలయునని చందోర్కరును కోరెను. అపుడు బాబా దూరమున మసీదునందుండెను.

సా. బా: (అచటనున్న ఒకనితో) ఈ నాలుగు ఆకుబీడాలు తీసుకొని వెళ్ళి, చందోర్కరుతో గూడి ఆకుబీడాకొరకు నిరీక్షించు ఆ ముసలివానికి వీని నీయుము.

తాను కోరిన వెంటనే ఆ మనిషివచ్చి ఆకుబీడా లందించుట నూల్కరునకు - బాబా తన 'అంతర్యామి' - అను నిశ్చయము గలిగి, బాబాయందు గాఢవిశ్వాసము పెంపొంది యతడు షిర్డియందే యుండెను. నూల్కరునకు అవసానకాలము సమీపించెను. సద్గ్రంథము లాతనికి వినబడునట్లు చదువబడెను. బాబాపాద తీర్థ మాతనికీయబడెను. బాబాయందు దృష్టి నిలిపి,బాబాను ధ్యానించుచు నూల్కర్ ప్రాణముల విడిచెను.

సా. బా: (నూల్కర్ మృతినిగూర్చి తెలుపుచు) తాత్యా (నూల్కర్) (మనకంటె) ముందుగ వెళ్ళినాడు. నేను నియమించి నటుల నతడిచట నుండెను. ఆతడు (గమ్యమును) సద్గతిని పొందినాడు. ఇక అతనికి జననములేదు.

3. విజయానందస్వామి

334. మద్రాసు నివాసియగు విజయానందస్వామి మద్రాసు నుండి మానస సరోవరమునకు తీర్థయాత్రకై బయలుదేరెను.

మార్గమధ్యమున నతడు షిర్డిజేరి బాబాను సందర్శించెను. అచట హరిద్వారమునుండి వచ్చిన సోమదేవస్వామి నతడు కలిసెను. ఆ సోమదేవస్వామి మానససరోవర తీర్థయాత్ర యందలి కష్టములను - గాఢమైన మంచు, నూరునూరు మైళ్ళను, వేలువేలు భాషలు, మార్గము బూటాను ద్వారాకలదు. కావున ఆ బూటాన్ దేశజనుల దుష్ట స్వభావములనుగూర్చి తెలిపి, ఆ మద్రాసు వాసిని భయచకితుని గావించెను.

ఆ తరువాత విజయానందస్వామి, బాబాదగ్గరకు వెళ్ళగా "ఈ వ్యర్థుడైన సన్యాసిని బయటకు వెడల నడుపుడు!" అని, బాబా కఠినముగ బలికెను.

అతడు మసీదు వెలుపలకు వెళ్ళెను. కాని, మంటపము దగ్గర నిలిచి, బాబాను వీక్షించుచుండెను. సాయిబాబా యందతనికి విశ్వాసము పొదుకొనెను. ఆ పిదప బాబా అతని ననుగ్రహించెను. కొన్నిదినములు గడిచిన

వెనుక "అతని తల్లికి మిక్కిలి జబ్బుగ నుండెననియు, వెంటనే మద్రాసునకు తిరిగివచ్చి, తన తల్లిదగ్గఱ నుండవలయుననియు" అతనికొక ఉత్తరము చేరెను. ఆ సన్యాసి తిరిగివెళ్ళి తన తల్లి చరమ కాలమున దగ్గర నుండ వలయునని తలంచి బాబా అనుమతిని అర్థించెను. ఆ సన్యాసికంటె నాతని భవిష్యత్తును బాబా లెస్సగా ఎఱింగిన వాడగుటచే "నీవు నీ తల్లిపై నింత ప్రేమగలవాడవేని నీవీ సన్యాసివేషమేల ధరించితివి? కావి వస్త్రములకు - మమతకు సంబంధములేదు. పొమ్ము. నీ విడదియందు గూర్చుండుము. ధైర్యము వహించి, కొన్ని దినములు వేచియుండుము. భవిష్యత్తునుగూర్చి తదుపరి విచారించుదము. నీ వాడ (విడది) లో పలువురు దొంగలు కలరు, తలుపులు గడియలు వేసికొని జాగరూకత కలిగియుండుము. వారు సకలము నపహరింతురు. ధనము, బంధు మిత్రాదులు మొదలగునవి అస్థిరములు, భయకారణములు. సంపూర్ణవిరక్తియే మోక్షమునకు జేర్చునది. రేపటి నుండి 'భాగవత సప్తాహము' ప్రారంభింపుము. తనూవాఙ్మనముల నియమించి, ధ్యాన నిష్ఠగలిగి మాడు సప్తాహములను గావింపుము. ఇది సకల వాసనలను క్షయింపజేయును. భ్రాంతి నశించును" అని బాబా బోధించెను.

ఆ మఱుదినమునుండి విజయానందస్వామి చక్కని నిష్ఠతో భాగవత పారాయణ సప్తాహము ప్రారంభించెను. రెండు సప్తాహములు (14 దినములు) పూర్తి అయిన పిదప నతడు మిక్కిలిడస్సి, దుర్బలుడయ్యెను. అందుచే రెండు దినములతడు విడిదియందు గడపెను. మూడవ దినమున "బడేబాబా" తొడమీద తలజేర్చి పరుండి ప్రాణముల విడిచెను.

అతని అవసానకాలమెఱిగి, బాబా, ఆ విజయానందునకు 'సద్గతి' గూర్చిన విధమిది.

4. యస్. బి. ధుమాల్ సతి.

335. సా. బా: (యస్. బి. ధుమాల్‌తో) ఈమాఱు నీ భార్య మాసికము షీర్డియందు జరుపుము. ఆమెకు సద్గతిని బ్రసాదింతును. (అ విధముగ మాసికము జరుపబడెను).

5. ఉపాసనీ మహారాజు సతి

336. 1912 జనవరిలో ఉపాసనీబాబా సతి మరణించినపు డాతడు

క్కలి వ్యాకులపడి, బాబాను సమీపించి, "బాబా! ఇవిగో 10 రూపాయలు పతికి సద్గతి గలిగించుట కేదేని గావింపుము" అనెను.

సా. బా: ఆ ధనముంచుకొనుము. ఆమె (ఆమె ఆత్మ) ఈ వరకే న్ను జేరినది. నీదగ్గఱనుండి తీసికొనదగినది యీవరకే తీసికొనబడెను.

6. జంతువులకు సద్గతి – ఒక గేదె.

337. సా.బా: (జోగ్‌సతితో) నీ దగ్గఱకొక గేదెవచ్చును. దానికి నేతితో సమృద్ధిగ సిద్ధపఱచిన పూరణపోలీలను తృప్తిగ పెట్టుము.

జోగ్‌సతి : బాబా! ఆ గేదెను నేనెట్లు గుర్తింపగలను?

సా. బా: అది తనకుదానే నీతలుపు దగ్గఱకు వచ్చును.

జోగ్‌సతి : అనేకములగు గేదెల వాతలుపు ప్రక్కగ పోవుచుండును.

సా. బా: "నీవు చేయదలచిన పూరణపోలీలన్ని పూర్తియైనప్పుడు నీ తలుపుదగ్గఱకు వచ్చు గేదెయే నేను" అనెను.

జోగ్‌సతి : బాబా! నా యింటికి ఉత్తరమున - దక్షిణమున రెండు తలుపు లున్నవి.

సా. బా: అది దక్షిణపు తలుపుదగ్గఱ నుండును.

ఆరోజు మధ్యాహ్నమునకు జోగ్‌సతి పూరణపోలీలను నేతితో అంది సిద్ధ పఱచెను. అప్పుడే ఒక గేదె ఆమె దక్షిణపు తలుపుదగ్గర నుండెను. ఆ పూరణపోలీలన్నియు నామె దాని ముందుంచెను. ఆ పశువు వానిన్నటిని తిని క్రిందపడి చచ్చెను. పరలోకమున ఆమెకు గలుగనున్న పాప శిక్షణగూర్చి, యచట ఆ గేదె యజమానివలన, ప్రభుత్వమువారి వలన తనకు గలుగనున్న బాధలనుగూర్చి తలచుకొని జోగ్‌సతి భయకంపితయయ్యెను. ఆమె బాబాను సమీపించి జరిగిన విషయములను, ఆమె భయములనుగూర్చి చెప్పుకొనెను.

సా. బా: ఆ గేదెకు నేతితో బాగుగ అలదబడిన పూరణపోలీలను తినవలయుననుు వాసనతప్ప తక్కిన వాసనలన్నియు ఇదివరకే క్షయించి

నవి. ఆ కోరికయు తీరిన పిదప దానికి సకలవాసనా క్షయమగుటచే ఆ గేదె తనువును విడిచిపెట్టెను. ఇంటికి పొమ్ము! నీవు కలతపడవలసిన నిమిత్తములేదు. ఈ తనువునుండి దానికి విముక్తి గల్పించిన దానవు.

బాబా అభిప్రాయము.

337-ఎ. యం. బి. రేగే – బిడ్డకు సద్గతి 1914న యం.బి.రేగే – గర్భవతియైన తన భార్యతోగూడి, బాబాను దర్శించెను. అపుడు బాబా "బహుమతులలో నొకటి మీ దగ్గఱగలదు" అని, పలికెను. బిడ్డ జన్మించిన తరువాత ఆ బిడ్డను వారు బాబాదగ్గఱకు గొనిపోయిరి.

సా. బా: (రేగేతో) ఈ బిడ్డ నావాడా? నీవాడా?

రేగేసతి : బాబా! నీవాడే.

సా. బా: నాకుగా నీ దగ్గఱనుంచుము!

18 నెలల తరువాత ఆ బిడ్డ మరణించుస్థితిలో నుండెను. "ఈ బిడ్డను స్వీకరించి, నీ పాదములదఱి ఈ బిడ్డకు ఆత్మశాంతి ప్రసాదింపుము – ఈ బిడ్డ యొక్క శేషించిన కర్మము నన్ననుభవింపనిమ్ము" – అని రేగే – బాబాను ప్రార్థించెను. అంతట ఆ బిడ్డ చిఱునగవు మోమునతోప యోగివలె బ్రహ్మరంధ్రము మార్గమున ప్రాణముల విడిచెను. రేగే కొంతకాలము తరువాత షిర్డికి జేరగా –

సా. బా: (అచటివారితో) ఆ బిడ్డనాది. ఈతడు (రేగే) ఆ బిడ్డను కాపాడనియ్యకొనెను. ఒక దినమున "వీనిని నీదగ్గఱ నుంచుకొనుము. ఆ కర్మము నే ననుభవింతును" అనినాడు. నేను తీసుకొని యిచట (హృదయమును జూపుచు) ఉంచుకొనినాడను. అతడిచట శాశ్వతముగ నుండును.

శక్తులు – సమర్థతలు

శక్తులు – సిద్ధులు – (లేక) యోగమార్గము

338. సా. బా: (ప్రాణాయామాదుల నభ్యసించి, కొన్ని యోగ శక్తుల సంపాదించి దూరమున నతని యంత్రశాల తగులబడుచుండుగ, తన ధ్యానమందిరమున అగ్నిని జూడజాలిన వానితో సిద్ధులచే నాకర్షింపబడుటవలన కలుగు అపాయములగూర్చి తెలుపనెంచి) వేశ్యా ప్రదర్శనములవేల

ఆసక్తితో చూచుచున్నాడవు? నే నెప్పుడు తమాషాలను ప్రదర్శింపజాలను. వేశ్యతో ముద్దులాడుట మనకెప్పుడు తగదు.

బాబా – దృష్టిని తిరిగి ప్రసాదించుట

339. 1916లో విఠలరావు వై. దేశపాండే సంపూర్ణముగ అంధుడైన తన తాతను షిర్డికి గొనిపోయి రెండుచేతులు పట్టుకొని ఆయనను బాబా దగ్గఱకు జేర్చెను. ఆ తాత సాగిలబడి మ్రొక్కి "బాబా! నేను చూడజాలను"- అనెను.

సా. బా: కలవు! నీవు చూడగలవు! 4 రూపాయలు దక్షిణనిమ్ము!

వి. వై. దేశపాండే 'కరెన్సీ' కాగితము మార్చి చిల్లర తెచ్చుటకు వెలుపలకు వెళ్ళెను. ఆ ముసలివాని తలపైన బాబా తన హస్తము నిలిపెను. ఆతనికి సంపూర్ణముగ దృష్టి తిరిగి ప్రసాదింపబడెను.

ముసలివాడు : (ఆనందబాష్పములతో) బాబా! నీ కరుణ అపారము. నీశక్తి అత్యద్భుతము. నేనిపుడు ప్రతి వస్తువును చూడగలుగుచున్నాడను.

సా. బా: 'ఉధి' తీసికొని వెళ్ళుము.

ఆ ముసలివాడు మసీదునుండి షిర్డిలోనికి, షిర్డినుండి బొంబాయికి, సంపూర్ణమగు దృష్టికలిగి, యే యితరుల సహాయములేకయే వెళ్ళగలిగెను.

బాబా – (తాత్కాలికముగ) దృష్టిని ప్రసాదించుట.

'బాస్సీను' నుండి ఒక కాంత బాబాదగ్గఱకు జేరెను. ఆమె అంధురాలు. మసీదుజేరి, "బాబా! ఈ నేత్రములతో నిన్ను చూడవలయునని నా కోరిక"- అనెను. వెంటనే ఆమె బాబాను చూడగలిగెను. ఆమె వెలుపలకు వెళ్ళగ యథాప్రకార మామెకు అంధత్వము ప్రాప్తించెను.

తుఫానురాకడ గుర్తించుట.

340. 1914 వైశాఖమున బొంబాయినుండి 'భీమా' అను నతడు బాబా చమత్కారములను కొన్ని చూడవలయునను తలంపుతో ద్వారకామాయి మసీదు జేరెను. మధ్యాహ్న హారతి అయిన తరువాత -

సా. బా: మీరందరు వెళ్ళుడు, మీమీ విడుదులలోనే కూర్చుండుడు, వెలుపల తిరుగవలదు. మిమ్ము తిరిగి పిలువ నంపినపుడే రండు!

బాబా యీ మాటలు పలికినపుడు వాతావరణము నిర్మలముగనే యుండెను. అంతలో ఇండ్లకప్పుల రేకుల నెగురకొట్టి, యిండ్లను కూల్చి వేయగలయంత భీభత్సకరమైన పెద్దగాలి వీచెను. 15 నిమిషములైన పిదప ఆ గాలి తగ్గెను. కొలది నిముషములపాటు ఆకాశమున మబ్బులు క్రమ్మి, కొద్దిగ వర్షించెను. తరువాత తీవ్రమగు సూర్యరశ్మి ప్రకాశించెను. అంతట బాబా వారినందర బిలువనంపి, "మీరు భయభ్రాంతులైతిరా?" అనెను అపుడు 'భీమా' బాబాపాదములవ్రాలి ఆనందోత్సేకమున ఏడ్చెను.

సా. బా: భయపడకుము. ఇది భగవానుని లీల - ఇట్టిలీల లనేకము లను నీవు చూడగలవు.

బాబా - తుఫానును అధీనము నందుంచుకొనుట.

341. మఱియొక సమయమున తుఫాను (గాలి – వాన) వీచు సందర్భమున (మేఘగంభీర ధ్వనితో ఆ తుఫాను నుద్దేశించుచు) "ఆపుము! ఇదంతయు ఆపుము!" అని బాబా పెద్దగ ఆజ్ఞాపించెను.

కొలది నిముషములలో ఆ తుఫాను తగ్గెను. ఇక గాలియు వానయు లేదు. ఆకసము నిర్మలమయ్యెను.

బాబా - అగ్నిని అధీనము నందుంచుకొనుట.

ఎ) కొండాజీ గడ్డివామి

341-ఎ. సా. బా: (ఒక దినమున మధ్యాహ్నమున) కొండాజీ! నీ గడ్డివామిదగ్గరకు పొమ్ము! నీ వామికి నిప్పంటుకొనినది.

కొండాజీ దూరముననున్న తన వామిదగ్గరకు వెళ్ళి, అచట మంట లేమియు జూడలేక తిరిగివచ్చి -

కొండాజీ : బాబా! అచట మంటలేదు. నన్ను తమాషాకొరకు దూరముగ ఎండలో పంపదలచితివి. అంతేనా?

సా. బా: ఇప్పుడు తిరిగి నీ వెనుక వైపునకు జూడుము.

ఆ సమయమున ఆ గడ్డివామిపై పొగ రేగుచుండెను. గ్రామములోని జనులు పరుగెత్తిరి. కొండాజీవామి తగులబడు చుండెను. గ్రామములోని జనులు బాబానుచేరి, కొండాజీ వామిదగ్గఱగల తక్కినవారి పెక్కు వాములను తగులబడకుండ రక్షింపుమని ప్రార్థించిరి. (చూ. 608)

342. సా. బా: (కొండాజీవామిచుట్టు సన్నని నీటిధారతో గీటు గీచి) ఈ వామి మాత్రమే తగులబడును. ఇతరము తగులబడవు.

గాలి వీచుచున్నను, సమీపమున నితరములు పెక్కు వాములున్నను ఆ కొండాజీ వామి మాత్రమే తగులబడెను.

(బి) ధునిలోని మంట

343. సా. బా: (ధునిలోని అగ్నిని ఉద్దేశించి మంటలు విజృంభించి పైకిలేచి, మసీదు పైకప్పు వాసముల అంటుకొనబోవు చుండగా 'సట్కా' తో దగ్గరనున్న స్తంభమును కొట్టుచు) వెనుకకు పొమ్ము! వెనుకకు పొమ్ము! జాగ్రత! జాగ్రత!

ఆ మంటలు వెంటనే తగ్గి యథాస్థితి యందుండెను.

(సి) బాబా - అగ్నిని - ఎండవేడిని అదుపున నుంచుట.

344. ఒక వేసవి మధ్యాహ్న సమయమున ఎండ వేడిచే వాతావరణము అతి దుర్భరముగ నుండెను. ఐదుగురుతక్క తక్కిన వారందరు మసీదు విడిచి వెళ్ళిరి.

సా. బా: (ఆ ఐవురతో) మీరు వెళ్ళి (ధుని) అగ్ని దగ్గర కూర్చుండుడు!

వారటుల కావించిరి. కొలది నిమిషములలో మసీదులోని వాతావరణము చల్లబడెను. చల్లని వాయువులు వారికి విసరెను.

బాబా - తనువు విడిచిన జీవాత్మలను అధీనము నందుంచుకొనుట - వానికి మార్గము నిర్దేంచుట-

345. సా. బా: నా స్నేహితురాలు ఒక బాలిక కలదు. ఆమె

ఒక శిల్పి- అమె మరణించెను. సమాధి చేయబడెను. నే నామె సమాధి ప్రక్కగ బోవుచు, అగి ఒక రాత్రి అచట గడిపితిని. ఆమెఆత్మ నన్ననుసరించెను. ఆమెను మొదట నొక 'బాబుల్' చెట్టునందుంచితిని. తరువాత షీర్డికి దీసికొని వచ్చితిని.

అనుగ్రహ నిదర్శనము

346. సి. కె. గాడ్గిల్ మరియొక తావునకు బదిలీ చేయబడి వెంటనే చేరవలసినదిగ అజ్ఞాపింపబడుటచే, రైలుపెట్టెలో గూర్చుండి, 'బాబాను దర్శింపకయే వెళ్ళుచుంటిని' అని మిక్కిలి విచారపడెను. అదాటుగ అతని తొడపై ఒక 'ఉధి' పొట్లము పడెను. తరువాత అతడు షీర్డికి వెళ్ళినపుడు —

సా. బా : (చిదంబర్ కేశవ గాడ్గిల్‌తో) నీవు రాజాలవైతివి. అందుచే నీకు ఉధి పంపితిని, నీకు అందలేదా?

347. సా. బా: (కుశభావ్‌తో) కుశభావ్! నన్ను తలంపుము. వెంటనే నీదగ్గి నుందును. (కుశభావ్ బాబాను ధ్యానించినపుడెల్ల అతని అంజలి పుటము నుండి 'ఉధి' (బాబా ప్రసాదము) వెలికి ప్రవహించు చుండును. (చూ. 283)

గంగా యస్యపదోద్భవా

348. దాసుగాణూ (జనులు గంగ అను పేరున పిలుచు) గోదావరి నదికి స్నానమునకై వెళ్ళదలచి, 'బాబా! ఇది మహా శివరాత్రి, (షీర్డికి 3 మైళ్ళ దూరమునగల) 'సింగబా' గ్రామమున గంగాస్నానము చేయవలయునని తలంచు చున్నాడను.

సా. బా: నీ వక్కడకు పోనేల?

దాసుగాణూ వెంటనే నిస్పృహ నొందెను.

సా. బా: గంగ యిక్కడ నా పాదములదగ్గఱ కలదు. వెళ్ళవలదు.

దాసుగాణూ మరల నిరుత్సాహము నొందెను. ఏలన? - అతడు బాబా సాక్షాత్ విష్ణుదేవుడని గ్రంథములలో రచించినను ఆతడు పలికిన పలుకులలో విశ్వాసము మిక్కిలి తక్కువ.

సా. బా: ఇచటకు రమ్ము! నా పాదములదగ్గర దోసిలి పట్టుము.

దాసుగాణూ అట్లు గావించెను. అహెూ! చూడుము! ఒక సన్నని నీటి ధార బాబాపాదములనుండి దాసుగాణూ దోసిలిలోనికి ప్రవహించెను. దాసు గాణూ అంజలి ఆ పవిత్ర తోయములతో నిండెను. ఇచట గంగ కలదు. ఆ జలమును దాసుగాణూ తలపై చల్లుకొనెను.

శక్తిని ప్రసాదించుటకు శక్తి

349. సా. బా: (జనులకు వివిధ జాడ్యములకు ఔషధము లిచ్చుచున్న నా. గో. చందోర్కరుతో) అన్ని వ్యాధులకు ఒకే ఔషధ మిమ్ము!

అది మొదలు నా. గో. చం. తేలు కుట్టినపుడు, పాము కాటునకు - వివిధ జాడ్యములకు 'సున్నపు తేట' నే ఔషధముగ నిచ్చి జనులకు స్వస్థత గూర్చినాడు.

ఉపలాద భవజ్జలమ్

(రాతి నుండి నీరు పుట్టుట)

350. నా. గో. చందోర్కర్ - ఒక వేసవి దినమున హరిశ్చంద్ర పర్వత మెక్కుచుండగ మిక్కిలి దప్పిక గొనెను. ఆ ప్రదేశమున నెక్కడ త్రాగుటకు నీరు లేదు. చందోర్కరు 'బాబా యిచ్చట నుండిన నాకు నీరిచ్చును' అని అనుకొనెను. ఆయెడ బాబా 40 మైళ్ళ దూరమున షిర్డి యందుండెను. షిర్డిలో మసీదు నందు -

సా. బా: నానా దప్పిక గొనినాడు. వేసవి ఎండ వేడిమి అధికముగ గలదు. దోసెడు పానీయ మాతనికీయ దగమా?

అచట చేరియున్న భక్తులు బాబా పలుకు మాటలు గ్రహింపనేర కుండిరి. కాని, ఆ కొండమీద నొక భిల్లుడు క్రిందికి దిగివచ్చుట నా.గో.చం. చూచెను.

నా.గో.చం: ఓయీ! భిల్లుడా! నేను దప్పికగొని యున్నాడను. నాకు త్రాగుటకు నీరెచటనేని లేదా?

భిల్లుడు: నీవు కూరుచున్న బండక్రిందనే నీరు కలదు అని పలుకుచు ఆ భిల్లుడు వెళ్ళెను.

ఆ బండ పైకి యెత్తగ దాని క్రింద స్వచ్ఛమైన జల ముండెను. నా.గో.చం. ఆ జలము త్రాగెను.

బాబా - గింజలుగల ద్రాక్షలను గింజలులేని ద్రాక్షలుగ మార్చుట

టి. డి. జతభాయ్

351. కాకామహాజని యజమాని (షాహుకార్) సేత్ తక్కర్. ధర్మసే – జతభాయ్ (బాబానుగూర్చి) తెలిసికొనవలయునను కోరికతో కాకా మహాజనిని వెంటబెట్టుకొని షీర్డికి వెళ్ళెను. వారు గింజలుగల ద్రాక్షపండ్లను తెచ్చి బాబాకు సమర్పించిరి. ఆసేత్ బాబాకావించు చమత్కారములను కొన్ని చూడదలచెను. కాని, దక్షిణ సమర్పింప వలయునను తలంపు లేదు.

సా. బా: సేత్! ఇవిగో కొన్ని ద్రాక్షలు తినుము.

ఆ సేత్ మిక్కిలి ఆందోళన చెందెను. ద్రాక్షలను నోట నుంచుకొనెను అందలి విత్తనములు నేమి చేయవలయునో అతనికి తోచలేదు. ఆ మసీదులో ఉమియుట తగదు. కావున ఆ గింజలను తన జేబులో నుంచుకొనెను. అదియు నతనికి అనిష్టము. సాయి గొప్పసాధువే అయిన అతని అనిష్టత గుర్తింప కెట్లుండునని యతడాశ్చర్యపడెను. వెంటనే –

సా. బా: ఇవిగో మఱికొన్ని ద్రాక్షలు, వీనిని తీసికొని తినుము.

అని పలుకుచు వారు తెచ్చిన ద్రాక్షలనే మఱికొన్నిటి నిచ్చెను. ఆ సేత్ వానిని చేతిలోపట్టుకొని, యేమిచేయుదునా! అని తలంచెను.

సా. బా: వానిని తినుము.

సేత్ వానిని నోటిలో వేసికొనెను. అవి గింజలులేని వయ్యెను. అతడు చమత్కారములు కోరెను. అవి లభించెను. మొదట బాబా అతని

తలంపు నెఱిగెను. పిదప సబీజ ద్రాక్షలను నిర్బీజ ద్రాక్షలుగ మార్చెను.

అంత 'శ్యామా' "ఈయన మన కాకామహాజని యజమాని" – అని ఆ సేఠ్‌ను బాబాకు పరిచయము చేసెను.

సా. బా: అతడు కాకా యజమాని ఎట్లగును? పరమానందమును ప్రసాదించు వేఱొక యజమాని కాకాకు కలడు.

ఆరతి అయిన తరువాత సేఠ్, కాకామహాజనితో కలిసి తిరిగి వెళ్ళ దలచెను. సాధారణముగ కాకా ఎప్పుడు వచ్చినను బాబా అతనిని కొన్నిరోజులు నిలుపుచుండువాడు. సేఠ్, కాకాలు తిరిగి వెళ్ళుట కనుమతి నీయుమని శ్యామా వారికిగా బాబాను ప్రార్థించెను. బాబా తన ప్రత్యేకవైఖరి అనుసరించి యిట్లనెను.

సా. బా: సంపూర్ణ ధనారోగ్యములు గలిగి మనస్థిమితములేని యొక పెద్దమనిషి కలడు. అనవసరమైన బరువులన్నియు తలపై కెక్కించుకొని ఇక్కడ కక్కడకు వానిని మోసికొనిపోవుచు మనశ్శాంతి నతడెఱుంగడు. ఆ బరువులను క్రింద బడవేయుచు మరల తలకెక్కించుకొను చుండును. అతని మతి స్థిరముకాదు. నేనాతనిపై జాలికలిగి "ఇపుడు నీకిష్టమైన ఏదో ఒక తావున గాఢ విశ్వాసము కలిగి యుండుము. నీ యీ సంచారములు – అందోళనలు వ్యర్థములు" అని చెప్పుచున్నాడను.

ధర్మసే ఆ బాబాపలుకులు తన వాస్తవస్థితి వివరణముగా గ్రహించెను.

అంతట బాబా కాకాను 15 రూపాయలు దక్షిణ అడిగి తీసికొనెను.

సా. బా : నే నెవరిదగ్గర నుండియేని ఒక రూపాయి దక్షిణ తీసికొంటినా – దానికి పది మడుంగులు తిరిగి ఈయవలయును. నే నెప్పుడు దేనిని యూరక స్వీకరింపను. విచక్షణలేక ప్రతివానిని దక్షిణకోరను. ఆ ఫకీరు నిర్దేశించువాని వద్దనుండియే గ్రహింతును. ఆ దాత యిచ్చును. వాస్తవముగ నతడు బహుమతి రూపమున విత్తనము విత్తి, ఆ పిదప మిక్కిలి సమృద్ధమైన పంటను కోసికొనును. సంపద – ధనము – ధర్మ సాధనము మాత్రమే. కేవలము స్వకీయ సుఖానందములకు దానిని వెచ్చించెనా – అది వ్యర్థ వ్యయమే యగును. సంపద నీ విదివర కిచ్చి యుండవ యేని యిపుడు పొంద జాలవు. సంపద ఈయబడినది కావుననే యిపుడు కోరబడుచున్నది. దక్షిణ నిచ్చుటవలన వైరాగ్యము – దాని

మూలమున భక్తిజ్ఞానములు పెంపొందును. నే నిపుడేమి చేయుచున్నాడను? ఒకటి స్వీకరించి దానికి పదిరెట్లు తిరిగి యిచ్చుచున్నాడను.

పులుపు – పులుపు కాదు

351-ఎ. యం.బి.రేగే (జడ్జి) షిర్డిలో ఒకనాడు బాబాకు సమర్పించు నిమ్మరస 'షర్బత్' తయారుచేసెను. అతడు ముందుగ దానిని రుచిచూచెను. ఏమాత్రము పులుపులేదని గ్రహించెను. పిదప దానిని గొనిపోయి బాబాకు సమర్పించెను.

సా. బా: (రుచి చూచిన తరువాత హ. సీ. దీక్షిత్తుతో) కాకా! ఇది ఎంత పులుపుగా నున్నదో చూడుము!

హ. సీ. దీక్షిత్తు, రేగే యిరువురు రుచి చూచిరి. పులుపుగ నుండెను. రేగే నివ్వెరపోయెను.

సా. బా: కాదు - నే నూరక తమాషాకు పలుకుచున్నాడను. ఇపుడు చవిచూడండి!

మరల హ. సీ. దీక్షిత్తు – రేగే – ఇరువురు రుచి చూచిరి. ఈమారు అది ఏమాత్రము పులుపు లేదు.

ప్రత్యక్ష నిదర్శనములు (మూర్తీభవించుట)

1. మహల్సాపతికి "జజూరి" లో దర్శన మిచ్చుట.

352. మహల్సాపతి తన పాలకితో "జజూరి"కి తీర్థయాత్రకై వెళ్ళెను. అచట ప్లేగు వ్యాధి విజృంభించు చుండెను. మహల్సా - అతని అనుచరులు పాలకిని క్రిందికి దింపి, మిక్కిలి విచారముగ నుండిరి. మహల్సా ఆ పాలకి నానుకొని కూర్చుండెను. అతని వెనుక నెవరో వున్నట్లాతనికి తోచెను. వెనుకకు తిరిగి బాబాను చూచెను. వెంటనే బాబా అదృశ్యుడయ్యెను. బాబా తమ వెంటనేయున్నవాడని మహల్సా అతని మిత్రులతో చెప్ప వారు ధైర్యము వహించి, నాలుగు దినము లచట నుండిరి. వారిలో నెవరికి ప్లేగు వ్యాధి సోక లేదు. సురక్షితముగ తిరిగి యింటికి జేరిరి. వారు బాబాను దర్శించినపుడు—

సా. బా: భగత్! నీవు చక్కని తీర్థయాత్ర గావించితివి. పాలకి నానుకొని నీవు కూర్చుంటివి. అపుడు నే నచటికి వచ్చితిని.

ఆ విధముగ తాను స్వయముగ 'జజూరి' యందు తన అద్భుత మహిమా విశేషము నన్నువాడనియు, మహల్సా – బాబాను చూచిన విషయము ఏ విధమైన భ్రాంతి – ఊహలు కావని బాబా దృఢపరచినాడు.

2. మూలేశాస్త్రికి ధోలప్ మహారాజుగ

ద్వారకామాయి మసీదున బాబాకు మ్రొక్కుటకు దురభిమానము వహించిన మూలేశాస్త్రికి నాతని గురువగు ధోలప్ మహారాజుగ బాబా దర్శన మిచ్చి మూలేశాస్త్రిని చక్కదిద్దెను. (చూ. 223)

3. సగుణోపాసన నిరసించువాని తండ్రి కంఠ ధ్వని బాబా వినిపించుట

353. కాకామహాజని మిత్రుడు నిరాకారోపాసకుడు. సాకారోపాసన లన్నిటిని నిరసించువాడు. బాబానుగూర్చి తెలిసికొన వలయునను కోరికతో కాకావెంట షిర్డికి వెళ్ళెను. బాబాకు మ్రొక్కననియు, దక్షిణ సమర్పింపననియు ముందుగ కాకాతో చెప్పెను. అతడు షిర్డిలోని మసీదు మెట్లెక్కుచుండగా – 'కాం – యావేజీ' – స్వాగతము! బాబూ – అని బాబా పలికెను.

కాని, కాకా మిత్రునిచెవికి వినవచ్చిన ఆ కంఠధ్వని అతని తండ్రి కంఠస్వర మగుట అతని కత్యంతానందోత్సేకము కలిగించెను. వెంటనే అతడు బాబాపాదముల శిరము జేర్చి మ్రొక్కెను.

బాబా రెండు పర్యాయములు కాకాను దక్షిణ అడిగి తీసుకొనెను. కాని, అతని మిత్రుని నడుగలేదు. అతడు కాకాతో రహస్యముగ తానును దక్షిణ సమర్పింపగోరు చున్నాడనని తెలిపెను.

సా. బా: (కాకాతో) నీ మిత్రుడేమి చెప్పుచున్నాడు?

కాకా అతడనిన మాటలు తెలిపెను.

సా. బా: అతనికి దక్షిణ నిచ్చుట కిష్టములేదు. కావున నే నతని నడుగ లేదు. ఇప్పుడాత డీయదలచిన నీయవచ్చును.

అంతట కాకా మిత్రుడు బాబాకు 17 రూపాయలు దక్షిణ నిచ్చెను.

సా. బా: (అతనితో) నిన్ను నన్ను వేర్పఱచునది యీ (త్రైల వర్తకుని గోడ) తెర. దీనిని తీసివేయుము. అపుడు మన మొండొరుల ముఖములను విస్పష్టముగ చూడగలము.

ఆ పిదప కాకా అతని మిత్రుడు తిరిగి వెళ్ళుటకు ప్రయాణ మగు చుండిరి. మేఘములు క్రమ్మి వాతావరణము భయకారణముగ నుండెను.

సా. బా: శ్యామా! వారిని భయాందోళనములు లేక వెళ్లమనుము. వారి తిరిగి ప్రయాణమున వర్షబాధ లేమియు కలుగవు.

ఉరుములు మెఱుపు లున్నను వారు రైలు ఎక్కనంతవరకు వారి కే విధమైన వర్ష బాధలు కలుగలేదు.

ఇతర సాధువులుగ - తానే యితర సాధువులుగ బాబా తోచుట,

ఇతర సాధువులు తాను ఏకమని బాబా నిరూపించుట -

354. యస్. బి. నాచ్నే సోదరునకు బొంబాయిలో జరుగుచున్న మిక్కిలి ప్రమాదకరమగు శస్త్రచికిత్సను గూర్చి నాచ్నే - అతని కుటుంబము లోని వారందఱు మిక్కిలి ఆందోళన పొందుచుండిరి. వారున్న 'దహాను' వారింటి కొక సాధువు వచ్చెను. నాచ్నే వదిన ఆ సాధువునకు భోజనము పెట్టెను. పెట్టుటకు యోగ్యముగలేని కారణముగ బెండకాయ బజ్జి మాత్రము వేయలేదు. ఆ సాధువు తానే దానిని పెట్టుమని కోరుటచే దానిని వేసిరి. ఆ సాధువు భుజించిన పిదప వారి నాశీర్వదించుచు 'బొంబాయిలో జరిగిన శస్త్ర చికిత్స విజయవంతమని - క్షేమకరమని' తెలిపి, వెళ్ళెను. 3 సంవత్సరముల తరువాత నాచ్నే బాబా దగ్గఱకు వెళ్ళెను. అపుడు -

సా. బా: (నాచ్నేను చూపుచు) నే నీతని యింటికి భోజనమునకై వెళ్ళితిని. ఈతడు నాకు బెండ బజ్జి పెట్టలేదు.

ఆ సాధువు హైందవుడు. బాబాకు అతనికి ఏ విధమైన పోలికలు లేవు.

355. బాలకృష్ణ గోవింద ఉపాసనీశాస్త్రి-(సంస్కృతభాషాచార్యుడు) హరిద్వారము - తపోవనము (స్వర్గాశ్రమము) నకు వెళ్ళెను. అచట ఒక సాధువును జూచెను. ఆ సాధువు అతనితో ఉపాసనీల వంశమున తరతరముల నుండి కులధనముగా వచ్చుచున్న 'సాల గ్రామము' తానిచ్చినదే - యని చెప్పెను. తా నెవరో- తన అభేవ తత్త్వమును దెలుపుమని ఉపాసని అడుగ, హిందూస్థానీ భాషలో 'అహెూ! ఒక చెట్టు (దూలము) కలదు. ఒకరు క్రిందకి వచ్చిరి. రెండవవాడు పైకి పోయెను. నీవు తెలిసికొన గలవు' అని పలికి అదృశ్యుడయ్యెను.

పెక్కు సంవత్సరముల తరువాత 1911 చివర భాగమున అతడు తన తమ్ముని కాశీనాథుని (ఉపాసనీబాబా) జాడ నరయుచు నిందందు తిరుగుచుండెను. మామ్లత్ దారు కోరికపై నతడు కోపర్గామున దిగెను. ఆ మామ్లత్ దారు అతనిని షిర్డికి బంపెను. గోవిందఉపాసని,బాబాను దర్శింపగా-

సా. బా: ఖండోబా వద్దకు పొమ్ము!

బా. గో. ఉ: బాబా! నిన్ను సందర్శించిన సకల దేవతలను సందర్శించిన వాడనే.

సా. బా: (మరల) ఖండోబా దేవాలయమునకు బొమ్ము!

బా. గో. ఉపాసని మసీదు నుండి వెలుపలకు వచ్చి, బాబా ఆజ్ఞ దెలుపగా అచట జనులు కాశీనాథ ఉపాసని ఖండోబా దేవాలయమున నున్నవాడని చెప్పిరి. ఒకరు చెప్పకయే బా. గో. ఉ. సంబంధము - అతని అన్వేషణము బాబా తెలిసికొనెను. బా. గో. ఉపాసని ఖండోబా దేవాలయము నుండి తిరిగి వచ్చి బాబాను జేరగనే బాబా తపోవనమున ఆ సాధువు పలికిన పలుకులే ఆ హిందూస్థాని భాషలోనే యిట్లు పలికెను.

"ఒక చెట్టు (దూలము) కలదు. ఇరువురు దానిపై కెక్కిరి. ఒకడు క్రిందికి దిగెను. రెండవవాడు పైకి వెళ్ళెను". ఆ విధముగ సాయిబాబా తపోవనమున సాధువు తానే యని నిరూపించెను.

355-ఎ. 1908 శ్రావణమున (చాతుర్మాస్యము) చంద్రబాయ్ ఆర్. బోర్కర్ – కోపర్గామున నుండగ ఆమె యెరుగని ఒక

వచ్చి, రొట్టె - ఉల్లిపచ్చడి పెట్టుమని కోరెను. చాతుర్మాస్యమున ఉల్లి భక్షింపనని ఆమె చెప్పెను. ఆ ఫకీరు అదృశ్యుడయ్యెను. ఆమె సాయి బాబానుగూర్చి, ఆయన నిత్యము ఉల్లి భక్షించుటనుగూర్చి విని, ఆ వచ్చిన ఫకీరు సాయిబాబా ఏమోయని తలంచెను. అందుచే ఆమె ప్రప్రథమమున షిర్డికివెళ్ళి బాబాపాదములకు మ్రొక్కెను. "నీవు రొట్టె - ఉల్లి పచ్చడి పెట్ట కుంటివి. ఇక్కడ కేలవచ్చితివి?" అని, బాబా అనెను. ఈ మాటలు ఆ వచ్చిన ఫకీరు 'బాబా' యను నామె తలంపును ధ్రువపఱచినవి. అంత నామె "అవును - నీకు రొట్టె - ఉల్లిపచ్చడి పెట్టుటకే నేను వచ్చితిని"-అని అనెను.

"ఆమె ఏడుతరములుగ తన సోదరియనియు, తనకొఱకు ఎప్పుడు అన్వేషించుచుండెడిది యనియు" - బాబా తెలిపెను. (చూ. 460)

[గమనిక : భక్తుల అనుభవములు 3వ భాగమున తెలుపబడిన వానిలో కొన్ని మార్పులు కలవు. కావున 'సాయిలీలామాసిక్' - వాల్యూమ్ 3. పుటలు 383లో ప్రచురించబడిన చంద్రాబాయి తెలిపిన అంశములే మిక్కిలి గణనీయములు].

సాయిబాబా - అనసూయ - దత్తస్వామి - అభేదస్థితి.

356. 1911 దత్తజయంతినాడు బల్వంత్ కోహెూల్కర్, సాయంత్రము 5 గంటలకు బాబాను దర్శించెను.

సా. బా: నాకు కాన్పు నొప్పులేర్పడినవి, నొప్పులు దుర్భరముగ నున్నవి - అని పలుకుచు మసీదునుండి యందఱును వెలుపలకు పంపెను. అనసూయ - తన అభేదస్థితి నిరూపించుటయది. కొంచెముసేపు అయిన తరువాత బాబా అందఱను లోనికి పిలిచెను. కొహెూల్కర్ మొదట వెళ్ళెను.

అచట గద్దెమీద బాబా లేడు. ఒక జగన్మోహనాకారుడగు మూడు శిరముల బిడ్డ (దత్తస్వామి) అచటనుండెను. మఱుక్షణమున దత్తస్వామి అదృశ్యుడై బాబా ఆ స్థానమున నుండెను.

బాబా - ఇతర రూపముల దర్శనమిచ్చెను.

357. బి. వి. దేవ్ - ఒక ఉద్యాపన వ్రతము చేయనెంచెను. అన్న సంతర్పణము కూడ కలదు. అతడు బాబాను ఆ విందునకు తప్పక

రావలసినదిగ తెలుపుమని షిర్డిలోనున్న 'జోగ్' నకు ఉత్తరము వ్రాసెను. అప్పుడు –

జోగ్ : బాబా! దేవ్, 'దహను' లో తాను జరుపు ఉద్యాపనము విందునకు రావలసినదిగా, నిన్ను కోరుచున్నాడు.

సా. బా: ఆ విందునకు తప్పక నేను ఇంక నిరువురతో కలిసి వత్తునని, నేను ప్రయాణము చేయుటకు వాహనము లవసరములేదని, నా భక్తుడు ప్రేమతో నన్ను పిలచిన మాత్రమున తత్ క్షణము నేను ప్రత్యక్షమగుదునని తెలుపుచు ఉత్తరము వ్రాయుము.

ఆ దినము విందునకు వచ్చినవారిలో బాబాలేడు. దేవ్ అంతకు ముందు ఎఱిగిన ఒక సన్యాసి, మఱియిరువురతో వచ్చి "నేను విందునకే వచ్చితిని. ధనముకొఱకు రాలేదు" అని, వారితో భుజించెను. అంతట దేవ్ – బాబా విందునకు రాక, మాటతప్పినాడని జోగ్‌నకు ఉత్తరము వ్రాసెను. ఆ ఉత్తరము బాబాదగ్గఱకు తీసికొనివెళ్ళి, దానిని తెఱచు పూర్వమే –

సా. బా: ఆతని ఉద్యాపనము విందున భుజింతునని ఆతనికి నమ్మబలికి, నేను మోసపుచ్చితిని అనుచున్నాడా? నేను మఱియిరువురతో వచ్చియుంటిననియు, అతడు నన్ను గుర్తింపజాల కుండెననియు వ్రాయుము. నేను ధనముకొఱకు రాలేదని, కేవలము విందుకొరకే వచ్చి యుంటినని నేను స్పష్టముగ తెలిపితిననియు వ్రాయుము.

జోగ్ ఉత్తరము వ్రాసెను. బాబా ఒక సన్యాసి రూపమున వచ్చి విందుభోజన మారగించినాడని దేవ్ విశ్వసించెను.

358. ఆదం దలాలీ దగ్గఱకు ఒక మార్వాడీవెళ్ళి భోజనముకోరెను. ఆ.ద. కొంతధనమిచ్చి అతనిని మార్వాడి 'హొటలు'నకు పంపెను. తరువాత ఆ. దలాలీ షిర్డికి వెళ్ళెను.

సా. బా: (ఆదం దలాలీని చూపుచు) నేనీ మనిషి దగ్గఱకు వెళ్ళితిని, తిండికి నన్నీతడు మార్వాడీ హొటలునకు పంపినాడు.

కుక్క రూపమున – బాబా

359. బి. యస్. కపర్దేసతి ప్రతిదినము నైవేద్యముతెచ్చి బాబాకు

సమర్పించుచు బాబాను తన విడిదికి భోజనమునకు రావలసినదిగ కోరుచుండెను. బాబా మాట యిచ్చెను. కాని వెళ్ళలేదు. ఒక దినమున ఆమె శాకపాకములు సిద్ధపఱచుచుండగ ఒక కుక్క ఆమె దగ్గఱకు చేరెను. అది యొక అసహ్యాకరము, అశుభ్రమైన జంతువని తలంచి కాలుచున్న ఒక కట్టె కొఱవిని తీసికొని దానిమీద విసరెను. అది పాఱిపోయెను. ఆ దినమున మధ్యాహ్నము బాబాకు నైవేద్యము సమర్పించునపుడు —

జి. యస్. కపర్దేసతి : నా విడిదికి భోజనమునకు రమ్ము.

సా. బా: అలాగే — నేను వచ్చినపుడు మండుచున్న కట్టె కొఱవిని నాపై విసరుము.

బాబా - భవిష్యత్సూచనము - నియంతృత్వము - అధిపత్యము

రానున్న షిరిడి విఖ్యాతినిగూర్చి బాబా ముందుగ దెలుపుట.

360. 1908కి చాల పూర్వము (అప్పటి నుండియే బాబా ప్రసిద్ధి వ్యాపించినది) షీర్డి ఒక మారుమూల గ్రామమై యుండినపుడు బాబా తెలిపినాడు "ఈ గ్రామమున భవనములు నిర్మింపబడును. గొప్ప గొప్ప వారు చేరుదురు. తుపాకులు ప్రేల్చబడును. రథములు - గుఱ్ఱములు - ఏనుగులు వచ్చును. పెద్ద వూరేగింపులు జరుపబడును.

అట్టి కుగ్రామమున నిట్టివి దుర్లభములని తలంచి జనులు నవ్విరి, పరిహసించిరి. బాబా విఖ్యాతి వ్యాపించినకొలది ఇవి యన్నియు రూపొందినవి.

361. మాహింబజారు నివాసి, లక్ష్మన్ - వి. నాద్కర్ 1915 లో షీర్డికి వెళ్ళి బాబాను సందర్శించెను. అచ్చటనుండి బాబా సెలవు తీసికొని వెళ్ళబోవునపుడు కోపర్గామున రైలు అందుకొనుటకు వేళమించినట్లుతోచెను.

సా. బా: పొమ్ము. కోపర్గామున రైలు అందుకొనగలవు.

నాద్కర్ వెళ్ళెను. గోదావరి నదినిజేరగ చీకటిపడెను. చీకటిపడిన తరువాత వరదలలోనున్న గోదావరిపై పడవలను నడువనీయరు. ఆతడు తీరమున చిక్కుబడినవాడయ్యెను. అపుడు అకస్మాత్తుగ మామ్లత్దారు అచటకు వచ్చెను. అతనికొఱకొక పడవ సిద్ధపఱుపబడెను. నాద్కర్ కూడ అందులోనికెక్కెను. ఆ విధముగ దొంగల భయము, మఱి యేవిధమైన భీతిలేకయే యతడు స్టేషన్‌జేరి రైలు నందుకొనెను.

డి. వి. సంభారే – రైలు ఆలస్యము

362. డి. వి. సంభారే ఉదయము 8 గంటలకు బొంబాయికి జేరు ఎలులో ప్రయాణము చేయదలచి బయలుదేరునపుడు –

సా. బా: హొమ్మ్! మధ్యాహ్నమునకు జేరుదువు.

ఆ రైలు 4 గంటలు ఆలస్యమగుటచే బొంబాయికి అతడు మధ్యాహ్నమునకు జేరుకొనెను.

నా. గో. చందోర్కరు – రైలు ఆలస్యము

చూడుము. 143. (1) రైలు ఆలస్యమయ్యెను. నానా అందుకొనెను.

మహల్సాపతి

363. మహల్సాపతి "డోర్హనీ" యందు ఆతని వియ్యంకుని (కూతురుమామ) యింటియందు విందునకు ఆహ్వానింపబడెను. బాబా సెలవు కోరగ –

సా. బా: నీ వచట అవమానము పొందుదువు.

ఏమైనను వెళ్ళక తప్పదని మహల్సాపతి వెళ్లెను. అతడు 'డోర్హనీ' చేరగా ఆ విందునకు జేరిన వారాతనికొఱకు వేచియుండక భోజనములు చేసిరి.

364. మహల్సాపతి "అర్ధాన్గోను" నకు వెళ్ళదలచి బాబా సెలవు కోరెను.

సా. బా: అక్కడకు వెళ్ళకుము. అచట కలహములు, దెబ్బలాటలు జరుగును.

కాని, మహల్సాపతి వెళ్ళక తప్పలేదు. అతడు అచటకు వెళ్ళి "మల్హారి మహాత్మ్యము"పారాయణము చేయుచుండెను. అతడు పఠనము కావించునపుడు పిల్లలు తగవులాడుకొనిరి. కఱ్ఱలతో కొట్టుకొనిరి. పారాయణమునకు భంగము కలిగి, మహల్సాపతి తిరిగి షిర్డికి జేరెను.

సింగ్వేకర్

365. అనంత మహదేవ్ సింగ్వేకర్, బాబాను అడిగెను. – నేను పరీక్షలో నుత్తీర్ణుడ వగుదునా? నా 'నెంబరు' విజయము పొందినవారి "జాబితా"లో నుండునా?

సా.బా: నీ నెంబరు 114 – పరీక్షలో గెలుపొందినవారి "జాబితా"లో నుండును.

అతని నెంబరు 114, పరీక్ష అయినవారి జాబితాలో ఆ నెంబరు ఉండెను.

యన్. ఎ. సామంత్

366. సా. బా: (యన్. ఎ. సామంతుతో) నీవీ 5 రూపాయలు తిరిగి తీసికొనుము. దానిని జాగ్రత్తగా దాచిపెట్టుకొనుము. అది అపహరింపబడును.

సామంతు తన కోటును భోజనశాల వెలుపల తగిలించి, భోజనమునకు వెళ్ళెను. ఆ 5 రూపాయల 'నోటు' అపహరింపబడెను.

టెండల్కర్ – మరియు – సపత్నేకర్ మిత్రుడు

367. సా. బా: జాతకములు - భవిష్యత్తులు జ్యోతిష్కులతో చర్చలు మొదలగు దూరముగ త్రోసివేయుమని అతనితో (టెండల్కర్‌తో) చెప్పుము, సుస్థిమితముగ పరీక్షకు వెళ్ళుమనుము, అతడు విజయము పొందును. (ఆ విధముగ నతడు విజయము పొందెను)

సా. బా: (సపత్నేకర్ మిత్రునితో) ఎంతకష్టపడి చదివినను నీవీ సంవత్సరమున 'లా' పరీక్ష (న్యాయవాది పరీక్ష) యందు జయమొందజాలవు. రాబోవు సంవత్సరమున ఎంత స్వల్పముగ జదివినను నీవు గెలుపొందుదువు.

(ఆ మరుసటి సంవత్సరమతడు విజయము పొందెను)

తప్పిపోయిన ఒక పార్శీ వర్తకుని బిడ్డ

368. సా.బా: కాకా! ఆ పిల్లవాడు దక్షిణ దిశకు వెళ్లెను. అతడు క్షేమముగ - ఉత్సాహముగ నున్నాడు. తనంతట తానే తిరిగివచ్చును.

త్వరలోనే ఆ పిల్లవాడు మద్రాసు నుండి తిరిగి వచ్చెను.

మతిచెడిన పార్సీబాలుని ఆరోగ్యము

369. సా. బా: (మతి చెడిన పార్శీబాలుని తండ్రితో) నీ బిడ్డ చక్కబడును.

ఆ బిడ్డ ఆరోగ్యము పొందెను. ఆ పిదప వ్యాపారము చేయ సమర్థుడయ్యెను.

న్యాయవాది సోదరుని పిచ్చి

370. సా. బా: (బొంబాయి హైకోర్టు న్యాయవాదితో) నీ సోదరుని పిచ్చి నివారణమగును. (అతడు స్వస్థుడయ్యెను).

శ్రీ ఏ. మనశ్చాంచల్యము

370-ఎ. యం. బి. రేగే. 'ఎ' అనునతని ప్రప్రథమమున షిర్డికి దీసికొని పోయెను.

సా. బా: (ఆ 'ఎ'ను చూచి) పిశాట్! (పిచ్చివాడా!) ఏలవచ్చితివి?

ఒకటి రెండు దినములలో ఆ 'ఎ' కు మతిభ్రమణ మేర్పడెను. అతడు షిర్డినుండి వెడలినతోడనే స్వస్థత నొందెను.

అద్భుతములు – భవిష్యత్తు దెలుపుట – వీనిభేదము

371. సా. బా: (నా. గో. చం.తో) నేను సమృద్ధిగ నీయదలచు దానిని స్వీకరింప నెవరు కోరరు. నేనీయ జాలనిది నానుండి వారికి కావలె!

బాబా ఒక సందర్భమున నా. గో. చం. తో 'చమత్కారముల' గూర్చి మనోహరముగ దెలిపినాడు. అది 1901 — 1904 మధ్యకాలమున విషయము, చందోర్కరు పుత్రిక 'మీనాతాయి' ప్రసవ సంకట స్థితి యందుండగ గోసావి (గిరిభావ్) ద్వారా బాబా 'ఉధి' పంపి అనుగ్రహించెను. మీనాతాయిబిడ్డ అతి బాల్యముననే మృతి నొందెను. ఆమె భర్తయు మరణించెను. చిన్నతనముననే ఆమెకు వైధవ్యము ప్రాప్తించెను. సంతానములేదు. ఆ కుటుంబమున కంతయు ఇది మిక్కిలి విచారణ

కారణమయ్యెను. నా. గో. చందోర్కరు తన కుటుంబముతో షిర్డీకి వెళ్ళి బాబాయెదుట మిక్కిలి విచారముతో మౌనముగ గూర్చుండెను. అతడెప్పుడు బాబాను సందర్శించిన ఇరువురు అమితోత్సాహముతో సంభాషించుచుందురు. ఈ పర్యాయము మిక్కిలి విచారకరమైన సమావేశమయ్యెను. కొన్ని నిమిషములట్లు నిశ్శబ్దత అలమిన పిదప బాబా ఉపక్రమించెను.

సా. బా: ఏల నీవిట్లు మౌనముగ నుంటివి?

నా. గో. చం: బాబా! నీవు సర్వము నెఱుగుదువు. నీ సంరక్షణ మందున్న మాకిట్టి దుఃఖములు ప్రాప్తించెను. మనుమని, అల్లుని కోల్పోయి దుఃఖముల పాలైతిని.

సా. బా: నీవు బిడ్డ - అల్లుడు మొదలగు వారియందు ఆసక్తిబూని, వారికొఱకే నాదగ్గఱకు జేరుచుంటివా - నీవు పొఱబడుచున్నావు. వీరికొఱకు నాదగ్గఱకు రావలసిన పనిలేదు. ఇవి నా అధీనమునలేవు. ఇవి (బిడ్డ జననము - బంధువుల మరణము) పూర్వకర్మములపై నాధారపడియున్నవి. ఈ విశ్వమును సృష్టించిన పరమేశ్వరుడేనియు వీనిని మార్చజాలడు. నియమిత స్థానములకు రెండు గజములు దూరముగ నుదయింపుడని సూర్యునకు, చంద్రునకు పరమేశ్వరుడేని చెప్పగలడని నీవు తలంతువా? కాదు - అటుల చెప్పలేడు. చెప్పడు.

నా. గో. చం: అట్లయిన, బాబా! నీవు ఒకనితో "నీకు కుమారుడు జనించె" నందువు – కుమారుడు పుట్టును. మఱియొకనితో "నీకు ఉద్యోగము దొరకు" నందువు – అతనికి ఉదోగ్యము దొరకును; ఇవి నీవు కావించు చమత్కారములు కావా?

సా. బా: కావు. నానా! నే నెట్టి చమత్కారములను కావింపను మీకు జ్యోతిష్కులు కలరు. వారు గుణించి చూచి, రెండు రోజులు ముందుగ ఏవో భవిష్యత్తులను దెలుపుదురు. కొన్ని నిజములగును. నే నింక కొంచెము ముందు దూరము చూతును. నేను చెప్పునది జరుగును. నేను చేయు పనియు నొక విధమగు జ్యోతిష్యమే. కాని, పామరులు మీరు. దీనిని గ్రహింపలేరు. నీవు ముందు జరుగునవి యెరుగజాలవు గాన నా మాటలు నీకు చమత్కారములుగ నుండును. ఆ యా విషయములు నా అద్భుత శక్తి

ఘటనా నిదర్శనములుగ భావించి, భయ భక్తులతో గూడిన గౌరవము నా యందు వెలుపుచుందురు. నేను వానిని - మీరు వెలుపు భయ భక్తి గౌరవములను ఆ భగవానునకు సమర్పించి, మీరు యథార్థముగ అనుగ్రహింపబడునట్లు చూతును.

372. సా. బా: (1918 లో నాశిక్ నివాసి నారాయణరావు – మోటీరాం – జానీతో) ఇంకమీదట నీవు సేవకుడవుగా నుండవు. నీ స్వంత వ్యాపారము గావించుకొనుము!

అంతట నారాయణరావు నాశిక్‌లో ఆనందాశ్రమ హెూటల్ - ప్రారంభించెను. అది అతనికి మిక్కిలి భాగ్య సంపదలను చేకూర్చెను.

373. సా. బా: (నాచ్నేతో) 1. ఉద్యోగమునకు బొంబాయికి రమ్ము. 2. పిచ్చివారిని నమ్మకుము.

(1. నాచ్నే బొంబాయి శివారునకు బదిలీ చేయబడెను. 2. అతడు పూజ యందుండగా హాని చేయనివాడని యతడు నమ్మిన ఒక పిచ్చివాడు నాచ్నేపై కురికి కంఠము పట్టుకొని చంప ప్రయత్నించెను).

374. సా. బా: (శంకరరావు మరియు నాచ్నేతో) 15 రూపాయలు దక్షిణ యిమ్ము!

శంకరరావు : బాబా! నా దగ్గఱ ధనము లేదు.

సా. బా: నాకు 30 రూపాయలు దక్షిణ యిమ్ము.

శంకరరావు : నావద్ద ధనము లేదు బాబా!

సా. బా: నాకు 64 రూపాయలు దక్షిణ తెమ్ము.

నాచ్నే : (అంతట) బాబా! మేము పేదవారము. అంత పెద్ద మొత్తము లీయ సమర్థులము కాము.

సా. బా: అయితే ప్రోగుచేసి యీయుడు!

తరువాత కొంత కాలమునకు (1916 లో) బాబా జబ్బు పడెను. బాబా ఆరోగ్యము పొందుటకు పెద్ద సప్తాహము కావింపబడినది. పేదలకు

అన్నదానము కావించుటకై చందాలు "వసూలు" చేయబడినవి. శంకరరావు, నాచ్నే లిరువురు కలిసి చందాలు ప్రోగుచేసి పంపిరి. ఆ పంపిన ధనము సరిగ 64 రూపాయల్లు మాత్రమే.

హ. సీ. దీక్షిత్తు కుమారుడు

375. 1913 లో బాంద్రాలో నున్న కుమారుడు జబ్బుగా నున్నాడని, హ. సీ. దీక్షిత్తునకు ఉత్తరము అందెను. అతడు వెళ్ళుటకు బాబా అనుమతిని కోరెను.

సా. బా: నీవు వెళ్ళవలదు. ఆ పిల్లవాని నిక్కడకు పిలిపింపుము.

హ. సీ. దీక్షిత్తు, కుమారుని షిర్డికి పంపుడని ఉత్తరము వ్రాసెను. కాని, పరీక్షలు సమీపించు చుండెనని, షిర్డియందు వైద్య సహాయముగాని, విద్యా సహాయముగాని దొరుకుట దుర్లభమని, ఆ బాలుని కది తగిన ప్రదేశము కాదని తిరుగు జవాబు వచ్చెను.

సా. బా: అది లక్ష్యపెట్టకుము. పిల్లవానిని పిలిపింపుము.

ఆ బాలుడు షిర్డికి గొనిరాబడెను. త్వరలో ఆరోగ్యము పడసెను. తరువాత 2-11-1913 న పరీక్షలు ప్రారంభింపబడునని, పిల్లవానిని వెంటనే పంపుమని బాంద్రానుండి ఉత్తరము వచ్చెను.

సా. బా: ఆ బిడ్డను పంపవలదు.

పరీక్షలు 2-11-1913 నుండి, 6-11-1913 కి మార్చబడినవని ఆ తేదీనాటికి పరీక్షలకా బాలుని పంపుమని మరల ఉత్తరము వచ్చెను.

సా. బా: అగుము! మనము చూచెదముగాక!

6-11-1913 నాటికి బాలుని పంపలేదు.

పరీక్షలు 13-11-1913 నాటికి మార్చబడినవని మరల ఉత్తరము హ. సీ. దీక్షిత్తునకు అందెను.

సా. బా: 13-11-1913 నాటికి బిడ్డను పంపుము.

ఆ బాలుడు పరీక్షలకు హాజరై ఉత్తీర్ణుడయ్యెను.

జోగ్‌నకు గోదావరీ జలము -

376. బాపూసాహెబ్‌జోగ్ : (1910 నవంబరులో) బాబా! గోదావరీ – స్నానమునకు రేపు వెళ్లుటకు నా కనుజ్ఞనిమ్ము. రేపు పర్వదినము.

సా. బా: వెళ్ళవలదు.

జోగ్ అసంతృప్తినొంది షిర్డియందే నిలిచెను.

మఱునాటి ఉదయమున గ్రామములోని జనులు బాబాదగ్గఱకు పరువెత్తికొని వెళ్ళిరి.

గ్రామ జనులు : బాబా! (సర్కారువారు 1912 నుండి నీరు అందించునట్లు ఉత్తరువు లిచ్చినను) క్రొత్తగా త్రవ్వబడిన కాలువలద్వారా గోదావరి జలము మన షిర్డిలోనికి వచ్చుచున్నవి.

సా. బా: జోగ్! భగవానుడెంత దయామయుడో చూడుము.

377. బాపూసాహెబ్‌జోగ్ పితృ శ్రాద్ధము సమీపించుచుండెను.

జోగ్ : (బాబాతో) బాబా! కోపర్గామునకు వెళ్ళి నా తండ్రిగారి శ్రాద్ధమునకు మాశాఖ బ్రాహ్మణులను తీసికొనివచ్చుటకు సెలవిమ్ము.

సా. బా: నీవు వెళ్ళనక్కఱలేదు.

జోగ్ : బాబా! శ్రాద్ధము మానుకొనుమందువా?

సా. బా: ఇంక నాలుగు రోజులు వ్యవధి కలదు. మనము చూచెదముగాక!

రెండు రోజుల తరువాత జోగ్ బాబా దగ్గఱకు వెళ్లెను.

జోగ్ : నాశాఖ బ్రాహ్మణులు నాకు కావలయును. నన్ను వెళ్ళనిమ్ము బాబా!

సా. బా: వారు వత్తురు.

జోగ్ : వారు శ్రాద్ధము విషయమై ఎట్లుఱిగివత్తురు? నా శాఖ వారగుదురా?

సా. బా: అవును.

శ్రాద్ధదినము "పున్‌టంబా" నుండి యిరువురు బ్రాహ్మణులు బాబాదగ్గఱకువచ్చి మాకిచట బ్రాహ్మణ భోజనము దొఱకునా?" అని అడిగిరి.

సా. బా: జోగ్ దగ్గఱకు వెళ్లుడు!

వారు జోగ్ దగ్గఱకు వెళ్ళిరి. ఆ వచ్చినవారు తన శాఖవారును, శాస్త్రపారంగతులును, పితృశ్రాద్ధము జరిపించుటకు సమర్థులని జోగ్ తెలిసికొనెను.

జోగ్ యిచ్చిన అప్పు (=230)

378. జోగ్ ఔరంగాబాదులోని ఒకనికి రు. 1400 లు అప్పు ఇచ్చెను. ఆ నోటు వాయిదా కడచిపోవు ముందు –

జోగ్ : బాబా! ఔరంగాబాదు వెళ్ళుటకు నాకు సెలవీయుము.

సా. బా: అప్పు తీసికొనిన వాడే యిచ్చుటకు వచ్చును. అప్పుడతని నడుగుము.

జోగ్ : (ఉద్రిక్తుడై) నన్ను 2, 3 వేల రూపాయలు నష్టపడు మందువా? రేపటి నుండి మీపూజ ఆరతులు నేను చేయను. ధనము లేక నేనిక్కడ ఎట్లు బ్రతుకగలను?

సా. బా: నీ ధనమెక్కడకు పోవును? ఇంటిలో ప్రశాంతముగ కూర్చుండుము. అది వచ్చును.

జోగ్ : నీ మాటలు వినజాలను. వాడు తనంతటతానే వచ్చునా? నేను వెళ్ళినను నా పైకమును చెల్లించలేదు. 'దావా' వేసినగాని నా పైకము తిరిగి యీయడు.

సా. బా: ఆ విషయమట్లుంచుము!

జోగ్ తానిచ్చిన ధనము తిరిగి రాబట్టుకొను ఆశ వదులుకొనెను. ఆ నోటు వాయిదా వెళ్ళిన తరువాత కొంతకాలమునకు ఆ అప్పు తీసికొనిన వాడు వచ్చి అతనికి జోగ్ ఇచ్చిన అసలు రు. 1400 లను ఈయబోయెను. జోగ్ సమ్మతింపలేదు.

సా. బా: జోగ్! తీసికొని నోటు రద్దు వ్రాసి యిమ్ము!

అంతట జోగ్ తీసికొని ఆ పైకమును బాబాముందు పెట్టెను. బాబా దానిలో కొంత తీసికొని మిగిలినది జోగ్‌నకు ఇచ్చెను.

నార్కె ఉద్యోగము – సంతానము – ధర్మకర్తృత్వము

379. (1913 లో) జి. జి. నార్కె తల్లి : (బాబాతో) నా బిడ్డ పెక్కు తావులకు అటు నిటు త్రిప్పబడు చున్నాడు. వానికి స్థిరమైన ఉద్యోగము లభింపలేదు. బాబా! వాని నొకచోట స్థిరముగా నిలుపుము!

సా. బా: నే నతనిని పూనాలో స్థిరపఱచుదును.

మూడు సంవత్సరముల తరువాత కాశీ కళాశాలలో ఉద్యోగమునకు అవకాశము కలిగెను.

జి. జి. నార్కె : బాబా! దానికి ప్రయత్నింతునా?

సా. బా: మనకు కాశీతో ఏమిపని కలదు? మనకు పూనాకు – సతారాకు పోవలయును.

1917 న పూనాలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఉద్యోగము ఖాళీ ప్రకటించబడెను.

జి. జి. నార్కె : బాబా! దీని నభ్యర్థించ మందువా?

సా. బా: కానిమ్ము! ప్రయత్నింపుము!

(తరువాత) సా. బా: నార్కె ఎక్కడకు వెళ్ళినాడు?

భక్తులు : ఉద్యోగ ప్రయత్నమున నతడు పూనాకు వెళ్ళెను.

సా. బా: అల్లా అనుగ్రహించును. అతనికి బిడ్డలు కలరా?

భక్తులు : ముగ్గురు నలుగురు పుట్టిరి. కాని పసివారుగనే మరణించిరి.

సా. బా: అనుగ్రహించును.

1918 లో నార్కె పూనాలో ఉదోగ్యమును సంపాదించుకొనెను. 1918 తరువాత జనించిన బిడ్డలు ఇప్పటికి జీవించి యున్నారు.

380. సా. బా: (1913న జి. జి. నార్కెతో) నీ మామ "బూటీ" ఇచట నొక దేవాలయము నిర్మించును. నీవు దానికి ధర్మకర్తవగుదువు.

1916-18లో సాయి దేవాలయము నిర్మింపబడెను. 1918 తరువాత సాయి సంస్థానమునకు నార్కే ధర్మకర్తయై సమాధి మందిరము యొక్క యాజమాన్యము వహించెను.

381. సా. బా: (యం. డబ్ల్యు. ప్రధాన్ సతితో) నీ బిడ్డకు మూర్ఛ కలుగును. (2 గంటల తరువాత ఆ బిడ్డకు మూర్ఛ వచ్చెను).

కల్యాణ్ నివాసి – కార్ణిక్

382. సా. బా: (కల్యాణ్ నివాసి కార్ణిక్ ప్రప్రథమమున షిర్డీకి వచ్చి బాబాను దర్శించినపుడు) స్వాగతము! సాహుకార్!

కార్ణిక్ – ఆ సమయమున దుర్భర దారిద్ర్యముననున్నవాడు. ఆ పిదప పెక్కు సంవత్సరముల కతడు ఒక పెద్ద సాహుకారు (కోటీశ్వరుడు) అయ్యెను.

శ్యామా వదిన – ప్లేగు వ్యాధి

387. శ్యామా సోదరుని భార్యకు ప్లేగు జ్వర మేర్పడి, పొత్తికడుపు క్రింద బొబ్బ పొడమినది. శ్యామా సోదరుడు షిర్డికి వేగముగ వెళ్ళి 'ఉధి' తీసికొని తన వెంట రమ్మని కోరెను. శ్యామా, ఉధిని ప్రసాదించి వెళ్ళుటకు సెలవిమ్మని బాబాను కోరెను.

సా. బా: ఇప్పుడు 'ఉధి' పంపుము – దైవము మన ప్రభువు. ఆ జ్వరము – బొబ్బ వానియంతట అవే శమించును. రేపు ఉదయమున వెళ్ళి తిరిగి రమ్ము – ఇప్పుడు వెళ్ళవలదు.

ఆ "ఉధి" ఉపయోగింపబడెను. ఆ రోగి స్వస్థత గనెను. మరు నాడుదయమున శ్యామా అచటకు వెళ్ళగా అతని వదిన "కాఫీ" సిద్ధపరచు చుండెను. శ్యామా తిరిగి వచ్చి -

శ్యామా : బాబా! ఎట్టి అద్భుతలీలలు నీవు కావించుచున్నాడవు!

సా. బా: ఆ ప్రశంస యంతయు దైవమునకే. నేను భగవానుని సేవకుడను మాత్రమే.

బల్వంత్, జి. కపర్దే – ప్లేగు (521 చూడుడు)

384. 1911లో షిర్డియందు ప్లేగు వ్యాధి వ్యాపించెను. బల్వంత్,

జి. కపర్దేకు జ్వరము, బొబ్బలు నేర్పడెను. బల్వంత్ తల్లితో నామె బిడ్డ ప్రాణములను రక్షించుట కాతని వ్యాధిని తానాకర్షించు కొంటిని అని బాబా ఆ ప్లేగు బొబ్బలను తన దేహమున చూపెను.

సా. బా: (జి.యస్.కపర్దేతో) నీ కుమారుని బల్వంతును రక్షించితిని. ఆ ఆజ్ఞలు అవితథములు - (తిరుగులేనివి).

ఆదమ్ దలాలి – అపరాధ ఆరోపణము

385. ఆదం దలాలీ : బాబా! అన్యాయముగ తీవ్రమైన నేరము నాపై ఆరోపింపబడినది.

సా. బా: భయపడకుము! అన్నియు చక్కబడును.

ఆదం దలాలీపై నేరము త్రోసివేయబడెను. అతనిని ప్రభుత్వ పక్షమున సాక్షిగ తీసికొనిరి.

హెచ్.యం. పెన్సే - నేరము తీర్పునుగూర్చి పై కోర్టునకు అర్జీ.

386. నాచ్నే : (బాబాతో) బాబా! హరిభావ్ యం. పెన్సే తాను నిర్దోషి యగుటచే తనపై మోపబడిన నేరమునుగూర్చి పై కోర్టునకు అర్జీ పెట్టుకొనినాడు. నీ అనుగ్రహము - సహాయము కోరుచున్నాడు.

సా. బా: ఎట్టి ఆందోళన చెందవలదని అతనికి చెప్పుము. పై అధికారులు అతడు నిర్దోషియని తీర్పు చెప్పుదురు.

(అతడు నిర్దోషియని తీర్పు చెప్పబడెను).

ఒక బ్రాహ్మణుని మరణ దండనము

387. సా. బా: నాలుగు రోజులలో అతడు నిర్దోషియని తీర్పు చెప్పబడును.

(ఆ విధముగ జరిగెను).

విద్యార్థులకు (పరీక్షలో) బాబా సహాయము

1. టెండల్కర్ (చూ. 367)
2. సపత్నేకర్ మిత్రుడు (చూ. 367)
3. హ. సీ. దీక్షిత్ కుమారుడు (చూ. 375)

విజయము పొందిరి.

4. వైద్య విద్యార్థి

388. 1917లో ఒక వైద్య విద్యార్థి పరీక్షకు సిద్ధమగుచుండెను. అతని స్వప్నమున బాబా దర్శనమిచ్చి యిట్లనెను.

సా.బా: నా కడుపు (పేగులు) నొప్పిగా నున్నది. నీవు వైద్యుడవు. నాకు ఔషధము తీసికొని రమ్ము.

విద్యార్థి: నే నింకను విద్యార్థినే – వైద్యుడను కాను.

సా. బా: పొమ్ము! మందు తీసికొని రమ్ము!

ఆ విద్యార్థి లేచి లోపలికి వెళ్లెను. బాబా అదృశ్యుడయ్యెను. అతని పరీక్షయందు కడుపునొప్పికి సంబంధించిన ప్రశ్న నడిగిరి.

బాబా – సంస్కృతము బోధించుట

389. సా. బా: ముకుంద లేలేశాస్త్రి యెదుట నీ శ్లోకము నుదహరించెను.

"అపిచేదసిపాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః
సర్వంజ్ఞాన ప్లవేనైవ వృజినం సంతరిష్యసి"

(చూ. 355-ఎ.)

390. సా. బా: (నానా నిమోన్కర్‌తో) కాకా! నీవు పారాయణ మేల చేయవు?

నా. ని: బాబా! నాకు సంస్కృతము రాదు.

సా. బా: సందేహింపకుము. మసూది ఆయీ నీకు సంస్కృతమును బోధించును. క్రమముగా నీవు నేర్చుకొందువు. ప్రారంభింపుము.

నానా నిమోన్కరు ప్రారంభించి, త్వరలో అభివృద్ధిపడసి సంస్కృతమున పండితులైన హ. సీ. దీక్షిత్తునకు, బాపూసాహెబ్‌జోగ్‌నకు 'జ్ఞానేశ్వరిని' వివరింప దొడగెను.

సా. బా: (నా.ని.తో) మన మితరులకు విషయములు వివరింపనేల? అది మనకు అహంభావమును, స్వాతిశయమును కలిగించును.

బాబా – ఔషధ యోగములు (నిర్దేశించు ఔషధములు)

391. సా. బా: దేవాలయ సమీపమున నీ దగ్గరకు వచ్చు నల్ల కుక్కకు పెరుగు కలిపిన అన్నము పెట్టుము. (ఇది చలిజ్వరమునకు బాబా తెలిపిన ఔషధ యోగము) ఆ విధముగ చేయబడెను. చలిజ్వరము నివారణ మయ్యెను.

392. సా.బా: కాకామహాజని! వేరుశనగపప్పు తిని, నీరు త్రాగుము. నీ పాయువు (మలద్వారము) గట్టిగ మూసికొనినది. (అతి సారమున కిది ఔషధయోగము. అతిసారము శమించెను).

393. సా. బా: (బూటీతో) విరేచనమునకు వెళ్ళకుము! వాంతి చేయకుము. (బూటీ విరేచనములు, వాంతులు ఏ ఔషధములు లేకయే నివారణమయ్యెను).

394. సా. బా: ఆతని (బూటీ) కలరా వ్యాధికి బాదము, సీమ బాదముపప్పు, 'అక్రోటి' కాయపప్పు కషాయము పాలలోజేర్చి త్రాగుమనుము! (ఆ పానీయము కలరావ్యాధిని నివారించెను).

395. సా. బా: బాగుగ వెచ్చచేసిన కలబంద నొప్పిగలభాగమున కట్టుమనుము. ఆ నొప్పి శమించును. [ఇది ఒక సేవకుని నడుము నొప్పిని నివారించెను

396. ఆర్. ఆర్. సామంతు బిడ్డల అతిసార వ్యాధికి బాబా 'శీరా' (గోధుమ పిండితో సిద్ధపఱచిన ఒక తీపి అసనము) ఔషధయోగముగ దెలిపెను. 'శీరా'తో వారి వ్యాధి ఉపశమించెను].

బాబా - కర్మ సిద్ధాంతము

డాక్టరు జి. పిళ్లె – నారకురుపు.

397. డాక్టరు జి. పిళ్లె : నారకురుపుచే మిక్కలిగ బాధపడుచు (హ.సీ.దీక్షిత్తుతో) కాకాసాహెబ్! ఈ నారకురుపు బాధ దుర్భరముగనున్నది. దీనికంటె మృతియే మేలనిపించుచున్నది. ఈ బాధ పూర్వ కర్మానుభవమే, సందేహములేదు. బాబాదగ్గఱకు వెళ్ళి ఈ బాధను ఇంతటనాపి, శేషించిన పూర్వకర్మఫలము నింక పది జన్మములలో అనుభవించి క్షయింప జేసి కొనునట్లు అనుగ్రహింపుమనుము.

హ. సీ. దీక్షిత్తు బాబాదగ్గఱకువెళ్ళి అతని ప్రార్థనమును విన్నవించెను.

సా. బా: భయపడవలదని అతనికి చెప్పుము. ఇంక పదిపుట్టువులేల? పది దినములలో ఆ బాధయంతయు పూర్తి చేసికొనగలడు. భక్తుల లౌకిక పారలౌకిక (ఆధ్యాత్మిక) శ్రేయమునుగూర్చుటకే సాధుసత్పురుషులు పొలుతురు. దీనికై పిళ్ళె కోరుచున్నది మృతినా? అతని నిక్కడకు గొనిరమ్ము! అతనిని చీకాకు పడనీయకుము.

ఆ డాక్టరు బాబాదగ్గఱకు వచ్చెను. బాబా అతడు విశ్రమించుటకు తనదిండు నొసంగి యిట్లనెను. "దీనిపై నానుకొనుము. వ్యర్థాలోచనలను విడువుము. నీకాలు చాచుకొని నిశ్చింతగ నుండుము. నిక్కముగ అనుభవింపకయే కర్మము విరుగడకాదు (తీరదు) అది సత్యము. సుఖదుఃఖములకు కర్మమే కారణము. నీకేది యెటుల ప్రాప్తించినను సహింపుము. అల్లామాలిక్! దైవము సర్వనియంత - రక్షకుడు. ఎల్లపుడా ప్రభువునే తలంపుము. ఆతడెల్లరను కాపాడును. ఆ స్వామికి సంపూర్ణ శరణాగతిజేయుము. ఎల్లపుడా ప్రభువును గూర్చియే తలంచుము. ఆ స్వామి యేది యెట్లు కావించునో నీవు తెలిసికొనగలవు.

అంత నా. గో. చందోర్కరు ఆ గాయముపై కట్టుకట్టెను.

సా. బా: దానిని తీసివేయుము. నానా పిచ్చివాడు. అది నిన్ను చంపును. ఇపుడొక కాకివచ్చి ఆ గాయమును పొడుచును. అది నీకు క్షేమము కలిగించును.

మరునాడు అబ్దుల్ క్రిందికి మెట్లుదిగుచు, చూడక తన పాదమును పిళ్ళె కురుపై నిలిపెను. వాచిన ఆ పుండు త్రొక్కబడెను. అందలి పురుగును వెలుపలకు త్రోయబడెను. డాక్టరు పిళ్ళె మిక్కిలి బాధతో పెద్ద పెట్టున కేక పెట్టెను. తరువాత -

పిళ్లె : బాబా! ఇకమీద ఆ కాకివచ్చి నా పుండును పొడుచునా!

సా. బా: రాదు. ఆ కాకి (అబ్దుల్) వచ్చినది. ఆ పుండునగల పురుగులు వెలార్చబడినవి పొమ్ము! వాడలో విశ్రమింపుము.

ఉధిని లోపలికిగొనుచు, పుండుపైన అలదుటచేత ఏ ఇతర ఔషధములతో నిమిత్తము లేకయే పది దినములలో ఆ నారకురుపు పూర్తిగ నివారణమయ్యెను.

శరణాగతుడు – కర్మము నతిక్రమించుట

భీమాజి పటేల్

398. పూనా మండలమున జున్నేర్ అను గ్రామమున భీమాజీపటేల్ కలడు. విడువని జ్వరము, నెత్తురుకళ్లె, జీర్ణాశయ బాధతోగూడిన క్షయవ్యాధి కలిగెను. కావించిన చికిత్స లన్నియు వ్యర్థమయ్యెను. నా.గో. చందోర్కరు అతనిని సాయినాథుని దగ్గఱకు పంపెను. భీమాజీని టాంగా నుండి దింపుటకు నలుగురు మనుష్యులు సాయపడవలసి వచ్చెను. శ్యామా అతనిని బాబాదగ్గఱకు జేర్చెను.

సా. బా: శ్యామా! ఈ దొంగను నా దగ్గఱకు గొనివచ్చి యెంత బాధ్యతా రూపమగు బరువు నా భుజములపై నిలుపుచున్నాడవు!

అంత భీమాజీ తన తలను బాబాపాదములమోపి, "ఓ దీనబంధూ! నేను దీనుడను. నాపై జాలి వహించి అనుగ్రహింప ప్రార్థించుచున్నాడను" అనెను.

బాబా తన వైఖరిని మార్చి చిరునగవుతోప నాతనితో నిట్లనెను.

సా. బా: నిలువుము! ఆందోళన విడువుము! వివేకులు విచారము వహింపరు. నీవు షిర్డిని మెట్టిన తోడనే నీ పూర్వకర్మ ఫలానుభవములు తీరినవి. అతి కఠిన కష్టములచే కృశించి కృంగిన జనులు ఈ మసీదునందలి మెట్లెక్కినతోడనే ఉద్ధరింపబడి సుఖానందముల బడయుదురు. ఆ ఫకీరు (దైవము) మిక్కిలి దయామయుడు. నీ వ్యాధిని నిర్మూలించును. ఆయన ప్రేమను ప్రదర్శించును. సకల జీవుల యెడ దయ గలవాడు పొమ్ము! భీమాబాయి యింట నుండుము.

ఆ విధముగ భీమాజీ షిర్డి యందు భీమాబాయి యింట బాబా ప్రసాదించిన ఊధి మాత్రమే యుపయోగించుచు నుండెను. మొదటి రోజున బాబా స్వయముగ ఊదిని అతని నుదుట నుంచి, తన అభయ హస్తము ఆతని శిరముపై జేర్చి అనుగ్రహించెను.

సా. బా: భీమాజీ! నీ విడిదికి నడిచి పొమ్ము!

ఆ పటేల్ యెవరి సహాయము లేకయే తన బండిదగ్గఱకు నడిచి వెళ్ళెను. బాబా యే ఔషధము లీయలేదు. అన్నిటికంటె బలీయమైనది, సమర్థమైన దానినే ప్రసాదించెను. భీమాజీ రెండు కలలు కనెను. మొదటి స్వప్నమందు అతడొక బాలుడుగ నుండెను. ఉపాధ్యాయుడతనికి పాఠము బోధించుచు బెత్తముతో అతి కఠినమైన దెబ్బలు కొట్టెను. అతడా నిద్రలో పెద్ద పెట్టున అఱచుచు యేడ్చెను. రెండవ కలలో నెవరో అతని ఱొమ్ము పైకెక్కి దానిపై పెద్ద రుబ్బుడు బండను అటునిటు పొరలించినట్లు కనెను. అతని ప్రాణములు పోయినంత బాధ తోచినది. అంతట నితడు మేల్కొనెను. ఈ రెండు స్వప్నములలో అతని జాడ్యమడుగంటెను. ఆతడు మెల్లగ మసీదునకు వెళ్ళి బాబాపాదములకు మ్రొక్కెను. ఒక నెల బాబాదగ్గఱ గడిపి సంపూర్ణమగు ఆరోగ్యము బడసి స్వగ్రామమునకు తిరిగి వెళ్ళెను.

పారిరబ్ధము, వ్యతిరేకముగ నున్నను బాబా సంతతి ననుగ్రహించుట

389. 'హర్దా' నివాసి "సింధియా" అను నతనికి ఏడుగురు పుత్రికలు జనించిరి – కాని, కుమారుడు కలుగలేదు.

1903 లో నతడు "గంగాపూర్" నకు వెళ్లి, దత్తస్వామిని పుత్రుని ప్రసాదింపుమని ప్రార్థించి, సంవత్సరము లోపల కుమారుడు కలిగిన ఆ బిడ్డను స్వామి దర్శనము చేయించుటకు గంగాపురమునకు తీసికొని వత్తునని మ్రొక్కుకొనెను. 12 నెలలలో అతనికి కొడుకు పుట్టెను. కాని ఆతడా బిడ్డను గంగాపూరునకు తీసికొని వెళ్ళలేదు. 1911 నవంబరు నెలలో షిర్డికి వెళ్లి బాబాను సందర్శించెను.

సా. బా: ఏమి! నీవు గర్వించు చున్నావా? నీ (నశీబ్) ముఖమున వ్రాయబడిన వ్రాతలో పుత్రప్రాప్తి యెచట కలదు? (తన శరీరము జూపుచు) ఈ శరీరమును చీల్చి నీ కుమారుని ప్రసాదించితిని.

దామోదర్ రసానే విషయమునగూడ అతని జాతకములోని గ్రహ దోషములను సైతము త్రోసి రాజని ఆతనికి బాబా సంతానమును ప్రసాదించెను.

(గమనిక) మాంత్రిక విధానములలో బాబా పద్ధతులను పోల్చి చూడుడు!

శ్రీమద్భాగవతము 5 (19) 25 - 26 కాశ్యపుడు పుంసవన వ్రతము బోధించిన ఘట్టము.

ఏతచ్చరిత్వావిధివద్వ్రతంవిభో। రభీప్సితార్థంరభతేపుమానిహ
స్త్రీత్వేతదాస్థాయలభేతసౌభగం। శ్రియంప్రజాంజీవపతిం
యశోగృహం
కన్యాచవిందేతమసగ్రలక్షణం। వరత్వవీరాహత కిల్బిషాగతిమ్
మృత ప్రజాజీవసుతాధనేశ్వరీ సుదుర్భగాసుభగారూపమగ్ర్యమ్॥

బాబా – ఔషధము లేకయే వ్యాధి నివారించుట

400. సా. బా: (దూరగ్రామమున భార్య వ్యాధిగ్రస్తయైయున్న మహల్సాపతితో) నీ భార్య కంఠము వాపుచే మిక్కిలి బాధపడుచున్నది. నేను నివారింతును. అది ఇతరుల వలన సాధ్యముకాదు.

మహల్సాపతి ఆ కంఠమువాపు విషయముగాని, మఱి యే జబ్బు విషయముగాని యెఱుగడు. అతని భార్య కంఠమువాపుచే బాధపడినట్లు, నివారణమైనట్లు అతనికి తరువాత ఉత్తరము అందెను.

హ. సీ. దీక్షిత్తు సోదరుడు

401. హ. సీ. దీక్షిత్తు సోదరుడు నాగపూర్‌లో వ్యాధిగ్రస్తుడై యుండెను. ఆ విషయమును తెలుపు జాబు దీక్షిత్తు షిర్డియందు బాబాదగ్గఱ నుండగా అందెను.

హ. సీ. దీక్షిత్తు : బాబా! (నా సోదరునకు) నే నెట్టి సహాయము చేయలేని స్థితిలో నున్నాడను. (అనగా తన తమ్మునకు తానే రూపమైన సాయము చేయలేకున్నాడను అని భావము).

సా. బా: నేను మిక్కిలి సహాయము చేయనున్నాను.

బాబా పలికిన పలుకులలోని శక్తి హ. సీ. దీక్షిత్తునకు తరువాత విదితమైనది. దీక్షిత్తు బాబాతో మాట్లాడుచున్న సమయమున నాగపూర్‌లో నున్న ఆతని సోదరునిదగ్గఱ కెవరో వెళ్ళి, ఇక్కడ బాబాపలికిన పలుకులే "నేను మిక్కిలి సహాయము చేయనున్నాను" అని పలికి, ఆతనిని స్వస్థుని గావించెను.

బాబా తన ఇచ్ఛాశక్తి నితరులలో గలుగజేయుట

ఇతరుల బుద్ధులను నియమించుశక్తి

(1) జి. యస్. కపర్దేపై నేరము మోపబడుట

402. సా. బా: ఆ గవర్నర్ బల్లెమును చేబూని దాదాసాహెబ్‌ను (జి. యస్. కపర్దేను) పొడువ వచ్చెను. కాని నే నాతనిని తుదకు సమాధాన పఱచి పంపితిని.

[ఆ సమయమున లోకమాన్య బాలగంగాధరతిలక్ చెరసాలలో బంధింప బడెను. అతివాదులలో ముఖ్యుడని జి. యస్. కపర్దేపై నేరము మోపి అతనికిగూడ కారాగార శిక్ష విధింప ప్రభుత్వమువారు ప్రయత్నించుచుండిరి "నేనిచటనుండ నిక భయమేల?" అను బాబా అభయ ప్రదానమును విశ్వసించి కపర్దే బాబాదగ్గఱ 6 నెల లుండెను. జి. యస్. కపర్దేమీద ఎట్టి నేరము మోపబడలేదు.

402-ఎ. యం. బి. రేగే 1914 న క్రిస్మస్ సెలవులలో షిర్డీకి ప్రయాణమై తన వెంట పి. ఆర్. అవస్తేనుగూడ తీసికొని రాదలచెను. కాని విచారణములు పూర్తి అయిన దావాలన్నిటికి తీర్పులు పూర్తి చేయువరకు స్వస్థానము విడిచి వెళ్ళరాదని పై అధికారులు 'అవస్తేకు' ఉత్తరువులు పంపిరి. సాధారణముగ 2, 3 రోజులలో ఆ తీర్పులన్నియు పూర్తిచేయుట అతనికి సాధ్యము కానిపనియే. కాని 'అవస్తే' పనిబూని కూర్చుండి సఫలు డయ్యెను. అంతట రేగే – అవస్తే – ఇరువురు ఇండోరునుండి రైలులో వచ్చుచుండ మార్గమున "మ్హౌవ్" అను సైనిక స్టేషన్ చేరిరి. అచట సైనికాధికారి ఉత్తరువుల ప్రకారము ప్రయాణీకులు రేగే- అవస్తేలుకూడ దిగవలసి వచ్చెను. తలవని తలంపుగ సేనాధికారి వచ్చి, రేగే - అవస్తేలున్న పెట్టె అవసరము లేదని దానిలో వారి నెక్కుమనెను. వారు షిర్డీకి జేరి బాబాను దర్శింపగ –

సా. బా: (రేగేను చూపుచు) చూడుడు! ఈతడొక్కడు వచ్చుటకు తృప్తినొందడు. ఇతరులనుగూడ వెంటగొనిరా పట్టుదల వహించును.

సా. బా: (మరల) నా బిడ్డలను వారు రైలునుండి దింపదలంచిరి. వారిని వా దగ్గరకు రానిమ్మని నేను సేనాధిపతితో చెప్పితిని.

రేగే రైలుప్రయాణమున రాత్రియంతయు మేల్కొని బాబాభజనము గావించుచునే యుండెను. అతడు షిర్డికి జేరగనే –

సా. బా: (రేగేను చూపుచు) ఇతడు రాత్రి నన్ను కన్ను మూయ నీయలేదు. నా శయ్యచుట్టు రాత్రియంతయు "బాబా! బాబా!" - అను కేకలే!

403. సా. బా: (బి. వి. దేవ్‌తో) ఇది 25 రూపాయలు గూర్చిన వివాదము! నేను తఱచుగ 25 రూపాయలు ఇమ్మని చెప్పితిని. కాని అతడు నామాట లాలకించుటలేదు. 2 లేక 4 నెలలలో నతడిచ్చును.

[ఆ సమయమున బి. వి. దేవ్‌నకు పైకక్ష్యకు పెంపు జీతమునందు 25 రూపాయలు అభివృద్ధిని పై అధికారులు నిలుపుదల చేసిరి. 2 (లేక) 4 నెలల కావల నతడా రెంటిని బడయగలిగెను].

404. బాబా సేవకుడు "రఘు" మఱి ఐదుగురు ఒక మార్వాడి కాంతను మానభంగము కావించిరను నేరమున 6 నెలలు కాలము చెరసాల శిక్ష విధింపబడిరి. రఘు చెరసాల యందుండి ఏడ్చెను. బాబా అతని స్వప్నమున గోచరించి, "మఱునాడు; విడుదల యగుదువు" - అని అభయమిచ్చెను. అంతకుముందు, నేరము తీర్పుకు సంబంధించిన కాగితములను చదివిన న్యాయ వాదులు, పై న్యాయస్థానమునకు "అపీల్" చేసిన లాభము లేదనిరి.

తాత్యాపటేల్ : బాబా! అపీల్ కాగితములివి.

సా. బా: వానిని భావ్ (యస్. బి. ధుమాల్ - నాశిక్‌లో న్యాయ వాది) దగ్గరకు దీసికొని పొమ్ము!

ఆ కాగితములను తీసికొని వెళ్ళిరి. యస్. బి. ధుమాల్ క్రింది కోర్టు తీర్పు - పై కోర్టుకు అపీల్ కాగితములు అహమ్మద్‌నగర్ జిల్లా మేజస్ట్రేటు బంగళాకు తీసుకొని వెళ్ళెను.

జి. మేజస్ట్రేటు : నీవు దేనికి వచ్చితివి?

ధుమాల్ : సాయిబాబా సేవకుడు రఘు, మఱి ఐదుగురిపై చెప్ప బడిన నేరము తీర్పునుగూర్చి పైకోర్టునకు అపీల్ అందించుటకు.

జి. మేజస్ట్రేటు : ఆ విషయములేమి?

ధుమాల్ అందలి విషయముల సంక్షేపముగ దెలిపెను.

జి. మేజస్ట్రేటు : అది బలీయమైన తీర్పుగా కనబడుచున్నదే! ఏమి ప్రత్యక్షముగ చూచిన ఆరుగురు సాక్షులా? నీవేమి అభిప్రాయ పడుచున్నావు?

ధుమాల్ : ఆరుగురేమి? పాక్షిక వైషమ్యములు గల షిర్డివంటి గ్రామములో 60 మంది ప్రత్యక్ష సాక్షులను సంపాదింపగలరు.

జి. మేజస్ట్రేటు : నీ వటుల తలంతువా?

ధుమాల్ : తలంచుట ఏల! గాఢముగ విశ్వసించుచున్నాడను.

జి. మేజిస్ట్రేటు : మంచిది. నీ కక్షిదారుల నందరను నిర్దోషులని తీర్పు నిత్తును. నీ అపీల్ కాగితము లిటు తెమ్ము.

ఆ జిల్లా మేజస్ట్రేటు క్రింది కోర్టు తీర్పు దానికి సంబంధించిన కాగితములు తెప్పించుకొనక అపీలులోని విషయములను విశ్వసించి, వారందరు నిర్దోషులని తీర్పు నిచ్చెను.

జి. మేజస్ట్రేటు : మీ సాయిబాబా హైందవుడా? మహమ్మదీయుడా?

ధుమాల్ : ఈ తెగలకు జేరడు. ఈ ఇరువురకు అతీతుడు.

జి. మేజస్ట్రేటు : ఆయన ఏమి బోధించును.

ధుమాల్ : దానిని తెలిసికొనుటకు నీవు స్వయముగ వెళ్ళదగును.

ఆ రోజుననే అహమ్మద్‌నగర్‌నుండి ఆ విడుదల చేయబడిన వారు షిర్డికి తిరిగి వచ్చుచుండగా –

సా. బా: (కొందరు గ్రామజనులతో) ఇక్కడకు రండు! మీా రొక చమత్కారము (ఆశ్చర్యము) చూతురు.

కొంచెము కాలము గడచిన పిదప యస్. బి. ధుమాల్, ఆ విడుదల చేయబడిన ఆరుగురు షిర్డికి జేరిరి. అదియే చమత్కారము.

బాబా ఆ జిల్లా మేజస్ట్రేటు బుద్ధిని ప్రేరేపించి, ఇతర కాగితములతో, ఇరుపక్షముల విచారణముతో నిమిత్తము లేకయే ఆ ఆరుగురును

నిర్దోషులు అను తీర్పు నీయ నియమించెనని బాబా పలుకులు - ఆ మేజస్ట్రేటు పలుకులు నిరూపించుచున్నవి.

బాబా – ఇతరుల బుద్ధుల నియమించి ఆటంకములు తొలగించుట.

(3) దేవ్ - మామ్లత్‌దార్.

405. బి. వి. దేవ్ బి. ఏ. మామ్లత్‌దార్. 'జ్ఞానేశ్వరి' ని పారాయణము చేయదలచెను. కాని, యెప్పుడు ప్రారంభించిన ఏదో ఒక ఆటంకము తప్పక కలుగుచుండెను. కావున బాబా ప్రారంభింపుమని ఆజ్ఞాపించు నంతవరకు పారాయణము ప్రారంభింప గూడదని అతడు నిశ్చయించుకొనెను. దేవ్ షిర్డికి వెళ్ళి (ఆ గ్రంథమును తిరిగి యిచ్చునను తలంపున) 'జ్ఞానేశ్వరిని', ఒక రూపాయిని బాబాకు సమర్పించెను.

సా. బా: ఒక రూపాయి యేల? 20 రూపాయలు తెమ్ము!

దేవ్ తీసికొనివచ్చి 20 రూపాయలు బాబాకు సమర్పించెను. కాని బాబా (పోతీ) పారాయణమును గూర్చి యేమియు చెప్పలేదు. బాబా అనుగ్రహమున ఆధ్యాత్మికాభ్యున్నతిని పొందుచున్న 'బాలక రామమాన్కర్'ను జేరి, అతడు పొందిన అనుభూతులను, బాబా కరుణకాతడెట్లు పాత్రుడైన విషయములను దెలుపుమని అడిగెను. ఆ విషయములను మఱునాడు సాయంత్రము తెలుపుదునని బాలకరాము చెప్పెను. మఱునాడు-

సా. బా: (దేవ్‌తో) 20 రూపాయలిమ్ము.

దేవ్ ఆ పైకము బాబాకు సమర్పించి తిరిగివెళ్ళి బాలకరాముతో మాట్లాడుచుండెను. బాలకరాము చెప్పుట ప్రారంభించెను.

ఆ సమయమున బాబా, దేవ్‌ను పిలువనంపెను. దేవ్ వెళ్ళెను.

సా. బా: నీవేమి మాట్లాడుచున్నావు? ఎవరితో? ఎక్కడ?

దేవ్ : దీక్షిత్ వాడలో మీ గొప్పతనము, కీర్తిని గూర్చి బాలకరాముతో మాట్లాడుచున్నాను.

సా. బా: 25 రూపాయలు తెమ్ము!

దేవ్ తీసికొనివచ్చి 25 రూపాయలు బాబాకు సమర్పించెను.

సా. బా: ఇక్కడ మసీదులో కూర్చుండుము!

అంతట బాబా తలవని తలంపుగ మిక్కిలి ఆగ్రహావేశమున "నా గుడ్డ పేలికలేల దొంగలించు చున్నాడవు? తలనెరసిన వాడవై యుండియు అట్లు దొంగలించుట నీ పద్ధతియా? గొడ్డలితో నిన్ను చంపుదును" అని పలికెను.

దేవ్ మిక్కిలి ఆందోళన చెందెను. ఆ గుడ్డ పేలికలేమిటో అతనికి బోధపడలేదు. ఆ కోపము తుదకు దేనికి దారితీయునో అతడెఱుగకుండెను. అటుల పది నిముషములు ఆగ్రహావేశమున గడచిన పిదప దేవ్ మఱి ఇతరులు మసీదునకు పిలువబడిరి.

సా. బా: తంబీభావ్! ఆ గుడ్డపేలికల విషయమై మాట్లాడుచు నిన్ను నొవ్వజేసితినా? దొంగతనమేదేని ఉన్న, దానిని తెలుపవలయును. వేఱు మార్గములేదు. అది అట్లుండనిమ్ము! దైవము సకలమును కనిపెట్టి యుండును.

అంతట దేవ్‌ను 12 రూపాయలు దక్షిణ నడిగెను. దేవ్ తెచ్చి యిచ్చెను.

సా. బా: (దేవ్‌తో) నీవేమి చేయుచున్నావు?

దేవ్ : ఏమియు లేదు.

సా. బా: వాడలో ప్రతి ఉదయము పారాయణము చేయుచుండుము. నేను నీకు పూర్ణమగు చక్కని జరీఅంచు శాలువ బహూకరింపదలచి యుండగ చినిగి చీకిన గుడ్డలకై వెళ్ళి నీవు దొంగలింపనేల?

దేవ్ జ్ఞానేశ్వరి పారాయణము ప్రారంభించెను. ఇక అతనికెట్టి ఆటంకములు కలుగలేదు. బాబాయొక్క మహాద్భుత నియంతృత్వ దివ్యశక్తి సంపదల దెలుపునది స్వకీయానుభూతి; కావున, ఇతరుల అనుభవములగూర్చి తెలిసికొనవలసిన అవసరములేమ. అట్టి స్వానుభవమే చక్కని జరీ అంచు శాలువాయని - ఇతరుల అనుభూతులగూర్చి వారి వీరివలన వినుట చినిగిన గుడ్డపేలికలను దొంగలించుట - యని, దేవ్ గ్రహింపగలిగెను.

ఎట్టి ఆటంకములు లేకయే దేవ్ జ్ఞానేశ్వరి పారాయణను సాగింప గలిగినను, అందలి భావమును గ్రహించుట యందెట్టి అభివృద్ధి పొంద లేకుండెను. ఒకనాడు బాబా అతని స్వప్నమున గోచరించి –

సా. బా: నీవు చదువునది బోధపడుచున్నదా?

దేవ్ : (కన్నీరు స్రవించుచు) లేదు - బాబా! నీ కరుణను ప్రసరింప జేయవేని నేనెట్లు గ్రహింపగలను?

సా. బా: నీవు త్వరగ చదువు చున్నాడవు. నా ప్రక్కన గూర్చుండి చదువుము.

దేవ్ : దేనిని చదువుదును?

సా. బా : అధ్యాత్మ –

అంతట దేవ్ వెళ్ళి అధ్యాత్మ రామాయణము తీసికొని వచ్చెను. దానితో స్వప్న మంత ముగిసెను. దేవ్ మేలుకొనెను.

బాబా ఈ విధముగ 'గాడ్గీభావ్' యొక్క దురదృష్టమును తొలగించెను. అతడు ప్రారంభించిన సత్రముల నిర్మాణము పూర్తి చేయలేకపోయెను. కావున అతడు సాయిబాబాదగ్గఱకు వెళ్ళెను. బాబా ఆతనిని చెడదిట్టెను. భావ్ నవ్వెను. అతని దురదృష్టము తొలగెను. ధనము సమకూడెను. సత్రములు పూర్తి యయ్యెను.

405-ఎ. పరమానంద బాబా

ఏ విధమైన పలుకులు పలుకకయే భక్తుల హృదయములను ఆనంద పరిపూర్ణముల కావించువాడు. ఉదా : 1) యన్. జి. చందోర్కర్ 2) నారాయణ ఆశ్రమ 3) మేనేజర్ సతి (సదాశివతార్కాడ్ సతి) 4) జి. యస్. కపర్దే (యోగదృష్టిచేత) 5) దక్షిణ ఆఫ్రికా డాక్టరు.

అంతర్జ్ఞానము – (ఋతంభర ప్రజ్ఞ)

1. బాబా స్పష్టీకరణము

406. బాబా ఒక దినమున మధ్యాహ్న హారతి పూర్తిఅయిన తోడనే (బాబా భక్తులెల్లరకు వారి వారి నిత్యానుభవముల గుర్తింప గలుగు విషయము)

మీ రెక్కడనైన నుండుడు. మీరేమైనను కావింపుడు. ఇది సర్వ కాలముల జ్ఞప్తియందుంచుకొనుడు. మీరు తలంచునది, పలుకునది, కావించునది నే నెల్లవేళల తెలిసికొనుచుందును.

2. బాబా తన సర్వజ్ఞత్వమును నిరూపించు

స్థిర నిదర్శనములను – హ. సీ. దీక్షిత్తునకు ఎఱుకపఱచుట

407. 1917 దసరా తరువాత కాకామహాజని యజమాని (ఠాకర్ సే సేత్) జబ్బుగా నుండెను. సేత్ కుమారుడు మహాజనిని షిర్డికి వెళ్ళి, తన తండ్రి ఆరోగ్యమునుగూర్చి బాబా ఆజ్ఞలను తెలిసికొని రమ్మని తన తండ్రి చెప్పినటుల కాకామహాజనికి చెప్పెను. హ. సీ. దీక్షిత్తు షిర్డియందున్నవాడు కావున ఉత్తరము వ్రాయుదమని మహాజని అనెను. కాని, ఆ సేత్ కుమారుడు అటులకాదు – మహాజని స్వయముగ వెళ్ళి బాబా ఆజ్ఞలను కొనివచ్చినగాని తన తండ్రికి సంతృప్తి కలుగదనెను. ఆ సమయమున షిర్డిలో బాబా హ. సీ. దీక్షిత్తుతో 'అచట జరుగుచున్న చర్చలు - ఆలోచనలు ఏమి?' అనెను. ఆ మరునాడు కాకామహాజని షిర్డికిజేరి, బాబాను సందర్శించి, తాను వచ్చిన విషయమును తెలుపగా 'నిన్న నేను పలికిన విషయమిదే' - అని బాబా - దీక్షిత్తుతో ననెను.

అంత కాకామహాజని - హ. సీ. దీక్షిత్తు ఈ విషయమునుగూర్చి కలియబలుకుకొని, వందలమైళ్ళ దూరమున నేమి జరుగుచున్నది, పలుకుచున్నది సకలము బాబా తెలిసికొనగలడని వారు గుర్తించిరి.

3. బాబా గజానన్ మహారాజు నిర్యాణము

408. 'షిగోను' నందు గజానన్ మహారాజు నిర్యాణ మొందగా షిర్డి యందు బాబా 'నా గజాననుడు దాటిపోయినాడు' - అనెను.

షిర్డిలోనివారు కొందరు గజానన్ మహారాజు విషయమును గూర్చి 'షిగోను' నకు ఉత్తరము వ్రాసిరి. బాబా తెలిపిన దినముననే గజానన్ మహారాజు పరమపదించినటుల సమాధానము వచ్చెను.

సర్వవ్యాపిత్వము – అంతర్జ్ఞానము

సర్వజ్ఞత్వము అధర్వణవేదము

ఇరువురుచేరి ఆలోచనలు చేయుచున్న వరుణుడు మూడవ వాడుగ జేరి సకలము నెరుగును.

గగనోపరిస్థలమునకు చాల దూర మెగిరిపోయినను, వరుణుని దాటి పోజాలడు.

భూమ్యాకాశముల మధ్య యింకను వీని కావల వరుణుడు చూడగలడు. మనుష్యుల పక్ష్మ చలనములను బంధించినాడు.

అధర్వణవేదము. 5 16-2, 4, 5.

సకల సముద్రములు అతని నడుము (రొండి) అయినను వరుణుడు ప్రతి బిందువు నందు నధివసించి యున్నవాడు. 5 16-3.

4. దాస్‌గాణూ - పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరు పదవి

409. సా. బా: (అపుడొక పోలీసు కానిస్టేబుల్ అయిన దాస్ గాణూతో) గాణూ! నీ పోలీసు ఉద్యోగము విడిచి పెట్టుము.

దా. గా: బాబా! నేను ఫౌజుదారు (సబిన్స్పెక్టరు) నై ఒక సంవత్సరము పనిచేసిన పిదప ఉద్యోగమును వదలుదును.

సా. బా: నీవు దానిని పొందలేవు.

గాణూ పై అధికారుల అనుమతి లేకయే తన పొలిమేరదాటి నైజాము రాష్ట్రము పొలిమేరలోనికి వెళ్ళెను. అతడు తిరిగి స్వస్థానమునకు వచ్చుటకు గోదావరి తీరముజేరెను. అతనిపై ఈర్ష్యగల పోలీసులు ఆవలతీరమునుండి అతనిగనిపెట్టి అధికారులకు దెలుప వారు వేచియున్నట్లు గాణూ గుర్తించెను. అంతట నతడు గోదావరి జలములను దోసిటబట్టి 'ఆ అపాయమునుండి (శిక్ష నుండి) తాను తప్పుకొనిన, తన ఉద్యోగమును విడుతునని ప్రమాణపూర్వ కముగ బాబాను ప్రార్థించెను. వెనుకకు తిరిగి నైజాము సరిహద్దువైపునకు దృష్టిమరల్చెను. దొంగలు కొందఱు దోచిన ధనమును పంచుకొనుట నతడు చూచెను. వారిని బంధించి, ఆ దోపిడి ధనముతో వారిని తన వెంట గొనివచ్చి తన పోలీసు స్టేషనునకు జేరెను. ఈ కారణమున తన స్థానమున విడిచి వెళ్ళినట్లు గాణూ పై అధికారులకు దెలుపుకొనెను. దానిచే అతనికి శిక్షలేకపోవుటయే కాదు - ఉద్యోగాభివృద్ధికి మంచి అవకాశమేర్పడెను. అందుచే నతడు ఉద్యో గము విడువలేదు. ఒకనాడు తన ఉద్యోగము పనిమీద వెళ్ళుచు బాబా కంటబడకుండుటకై షిర్డి ప్రక్కగా గుఱ్ఱముపై పోవుచుండ బాబా ఆ మార్గమున గాణూకు ఎదురయ్యెను.

సా. బా: గాణూ! గోదావరి జలమును దోసిటబట్టి ప్రమాణముచేసిన వారెవరు?

దా. గా: బాబా! అందేమి చెప్పుగలదు? నేనే ఉద్యోగమును సత్యముగ విడువనున్నాడను.

సా. బా: అగుము! పరిస్థితులిట్లు (అనుకూలముగ) ఉన్నంత వరకు నా మాటలు వినవు.

కొంతకాలము తరువాత మిక్కిలి ప్రమాదస్థితి యేర్పడెను. ఒక నేరము చేసినవాని నుండి 'వసూలు' చేయబడిన "జుల్మానా" గాణూ ఆధిపత్యమున నున్న స్టేషన్‌లో అతడు లేని సమయమున చెల్లింపబడెను. ఆ ధనము పైఅధికారులకు జేరలేదు. కావున గాణూపై నేరము మోపబడెను. అతనికి చెరసాల శిక్షకూడ ప్రాప్తమగు స్థితికలిగెను.

అంతట గాణూ ఆ అపాయమునుండి తప్పుకొనగలిగిన తన ఉద్యోగమును త్యజింతునని ప్రమాణముచేసి బాబాను ప్రార్థించెను. బాబా అనుగ్రహమున ఆ ధనమపహరించిన ఉద్యోగి పట్టుబడుటచే గాణూ ఆ నేరము – శిక్షనుండి తప్పుకొనెను. ఉద్యోగమును విడిచెను.

(5) తెంబెస్వామి – కొబ్బరికాయ.

410. దాస్‌గాణూ సంచారమున, తెంబెస్వామి అతనికొక కొబ్బరి కాయనిచ్చి, దానిని శ్రీ సాయిబాబాకు సమర్పింపుమనెను. కాని, మార్గ మధ్యమున గాణూ మిత్రులాకాయను పగులకొట్టి తినిరి. గాణూ షిర్డికి జేరి వట్టిచేతులతో (కొబ్బరికాయ లేకయే) బాబాను దర్శించెను. అతనికెదురుగా బాబా వెళ్ళి యిట్లనెను - "ఇడుగో! దొంగ. నా సోదరుడిచ్చిన కొబ్బరికాయ ఏది?

(6) కాకా మహారాజు నిర్యాణము (214 చూడుడు)

411. దోపేశ్వర్‌లోని కాకామహారాజు తానాప్లీడరు (సాతే అల్లుని తమ్ముడు) హెచ్. జి. జోషీని, మఱియొకరిని షిర్డికివెళ్ళి సాయిబాబాను సందర్శింపుడని ఆజ్ఞాపించెను. కాని వారు కొంతకాలము వేచియుండిరి. కాకామహారాజు పరమపదించెను. వారు షిర్డి మసీదుజేరినపుడు బాబామిక్కిలి

ఆగ్రహావేశమున పారవశ్యస్థితి యందుండెను. బాబా వారిని జూచెను. "వారి నిరువురను ఈ మసీదులోనికి గొనిరండు" అనెను.

వారు లోనికి వెళ్ళగా బాబా శాంతి వహించి ప్రసన్నుడయ్యెను.

సా. బా: మీరు ముసలివానిని చంపి యిచటకు వచ్చితిరా?

(ఇది కాకా మహారాజు నిర్యాణమును తెలుపుట)

7. గాడ్గిల్ - ప్రథమమున బాబాను దర్శించుట

భీమశంకర్ నుండి ఆగమనము

412. పూనాలో భీమశంకర దేవాలయమున నున్న ఒక సాధువు చిదంబర్ కేశవగాడ్గిల్‌ను షిర్డిలోని సాధువును దర్శింపుమని చెప్పెను.

గాడ్గిల్ : (ప్రప్రథమమున షిర్డికి జేరి అచట ఉపాధ్యాయుడుగ నున్న శ్యామాతో) యిచట సాధువులు యెవరేని ఉన్నారా?

శ్యామా : ఎవ్వరు లేరు. అచట మసీదులో కూర్చున్న ఆ పిచ్చి ముస్లిం ఫకీరును చూడుము! ఇచట మేము యెఱిగినది అతడొక్కడే.

ఏమైనను - గాడ్గిల్ - అతని మిత్రులు ఆ మసీదు వైపునకు కొన్ని అడుగులు నడిచిరి.

సా. బా: (కఠినముగ దూషించుచు) ఈ మసీదులోనికి రావలదు. నే నొక ముస్లిమును. వెళ్ళి ఆ భీమశంకర దేవాలయముననున్న సాధువు కాళ్ళపై పడుడు!

గాడ్గిల్ ఆ క్షణముననే బాబాయొక్క అంతర్జ్ఞానమును గుర్తించి, బాబాయందు గాఢభక్తి గలిగిన వాడయ్యెను.

3. గాడ్గిల్ బహూకరణములు

413. యల్. జి. ముంగే, సిన్నేరి మామ్లత్‌దార్ చిదంబర- కేశవ-గాడ్గిల్ తోడను, అతని మిత్రుడు వామనరావు తోడనుగూడి, షిర్డికి ప్రయాణమయ్యెను. మార్గ మధ్యమున షిర్డికి చేరు దినమునకు క్రిందటి రాత్రి, కొన్ని ఖర్జూరపు పండ్లు, ఒక రూపాయి, అగరవత్తులకట్ట బాబాకు సమర్పించుటకు గాడ్గిల్ ప్రత్యేకించి యుంచెను.

సా. బా: (గాడ్గిల్‌తో) నా ఖర్జూర ఫలములు, అగరవత్తుల కట్ట, వా రూపాయి నా కిమ్ము! (చూ. బాబూరావ్ బోరవ్కే 442).

9. బాబాను గణపతిగ గాడ్గిల్ పూజించుట

414. సి. కె. గాడ్గిల్ సాయిబాబాను గణపతిగ హృదయమున భావించి సేవించు చుండెను.

సా. బా: ఈ టక్కరి నా క్రింద ఎలుకను చూచుచున్నాడు.
(గణపతి మూషక వాహనుడు)

10. ఆర్. యస్. దేవ్ అభిప్రాయము, ఉపదేశము

415. ఆర్. యస్. దేవ్ అకల్‌కోటకు ప్రయాణమై మార్గమధ్యమున షిర్డికి జేరెను.

సా. బా: నేను అకల్‌కోటకు వెళ్ళితీరవలయును.

(ఈ విధముగ ఆ వచ్చినవాని ప్రధానాశయము బాబా వెలిబుచ్చెను)

ఆర్. యస్. దేవ్ రత్నగిరియందు సంప్రదాయ (వంశ) గురువు కలిగియు 'బాబా! నాకు ఉపదేశము గావించి నా గురువు నీ వగుము' – అని కోర –

సా.బా: గురువులతో నేమియు అవసరములేదు. అది (ఆ ఉపదేశము) అంతయు నీలోనే యున్నది. నీ అంతరాత్మను వినుము! నీవు నిర్దేశింపబడు విధమున నడువుము. మనము అంతర్ముఖులము కావలయును. నీ బోధకుడు, నీ గురువు నీలోనే యున్నాడు.

(ఆర్. యస్. దేవ్ హృదయము నందున్న భావము లవియే బాబా యీ పైన దెలుపబడిన విధమున ప్రతిధ్వనించు చున్నాడు).

11. డాక్టరు ముల్కీ తప్పిదము.

416. డాక్టరు డి. యం. ముల్కీ పెద్ద జబ్బుపడి వ్యాధి నివారణమైన పిదప షిర్డికి వెళ్ళి, బాబాను దర్శింతునని మ్రొక్కుకొనెను. వ్యాధి నివారణమైన పిదప వెళ్ళలేదు. ఒకపరి ఆ అభిప్రాయముతో 'మన్మాడ్'

వరకు వెళ్ళి అచట రైల్వే స్టేషనులోని గుమాస్తాను కలిసెను. ఆ గుమాస్తా సాయిబాబా ఒక అవినీతి పరుడని, అపాయకరుడని బాబానుగూర్చి విరుద్ధముగ చెలిపెను. ముల్కీ అచటనుండి వెనుదిరిగి బొంబాయి చేరెను. అతని వదిన బాబాను దర్శించుమని గట్టిగ ప్రేరేపించెను.

ముల్కీ షిర్డికి వెళ్ళి బాబాను దర్శింపగా- బాబా అతని ప్రొక్కుబడిని గూర్చి, మన్మాడ్ స్టేషన్‌లోని విషయములను మొదలగు వానిని వివరింప ముల్కీ ఆ రైల్వే గుమాస్తా మాటలు నమ్మినందుకు మిక్కిలి సిగ్గుపడెను.

ముల్కీ : బాబా! స్వస్థానమునకు తిరిగి వెళ్ళుటకు నాకు సెలవిమ్ము.

సా. బా: మంచిది. వెళ్ళుము. జ్ఞానేశ్వరి పఠింపుము. జీతము పెంపు మీద బీజపూరునకు నీకు బదిలీ అయినట్లుత్తరువులు నీ బల్లమీద నుండును.

డాక్టరు తిరిగివెళ్ళి బాబా తెలిపినట్లు అతని బదిలీ ఉత్తరువులు తన బల్లమీద నుండుట గమనించెను.

జి. జి. నార్కే

12. బాబా పిచ్చివాడు. 13. భిక్షాపాత్రము

14. కుఫ్నీ బహుమతి

417. ఆరతి సమయమున ఏ విధమైన కారణము లేకయే బాబా అత్యధిక కోపోద్రిక్తుడైనట్లు జి. జి. నార్కే గమనించి, 'బాబా ఒక పిచ్చివాడా యేమి?' - అని తలంచెను. అది అతని మనస్సున పొడమిన తలంపు. తరువాత ఆ సాయంత్రము నార్కే, బాబాపాదములొత్తుచుండగ బాబా నార్కేతో 'నేను పిచ్చివాడను కాను' – అనెను.

418. ఒక సమయమున బాబా జబ్బుగా నుండగ వామనరావు పటేల్ (బి. ఎ., యల్. యల్. బి.,) బాబాకొరకు భిక్షకై వెళ్ళుచున్నాడని తెలిసికొని, జి. జి. నార్కే బాబాకొరకు ఆ మధ్యాహ్నమున నియామక గృహములందు భిక్షగొని వచ్చుటకు తనకా అవకాశము కలిగించి సేవా భాగ్యము ప్రసాదింప వలయునని కోరుకొనెను.

ఒక భక్తుడు : బాబా! ఈ రోజు భిక్షకొరకు వామనరావును పంప వలదా?

సా. బా: (నార్కేను చూపుచు) నా కొరకు భిక్షగొని వచ్చుటకు ఈతని వెళ్ళనిమ్ము!

జి. జి. నార్కే ఆ రూపమగు సేవా మహాభాగ్యము (ఆ గొప్ప అధికారము) నాలుగు మాసములు పొందెను.

419. బాబా 'కుఫ్నీ' లను భక్తులకు పంచియిచ్చుట నార్కే దూరము నుండి గమనించి, తనకొక 'కుఫ్నీ' బాబా తప్పక ప్రసాదింప వలయునని తలంచెను.

సా. బా: (ఆతని కీయక) నీకు 'కుఫ్నీ' యీయ లేదని నన్ను నిందింప వలదు. ఆ ఫకీరు (దైవము) నాకు అనుమతి నీయలేదు.

(గమనిక : 'కుఫ్నీ' సన్యాసమును సూచించును.

జి. జి. నార్కే–గృహస్థుడుగ నుండవలసినదే కాని సన్యాసి కాదగడు.)

15. యస్. బి. నాచ్నే – సెలవు

420. యస్. బి. నాచ్నే – ప్రప్రథమమున బాబాను సందర్శింప బోవుచు 'కోపర్గాము' నందు దిగెను. అచట 'స్టేషన్ మాష్టరు' బాబా ఒక మాయావి యనియు, మన దేశమునగల పలువురు ఇంద్రజాలికులవలె జనులను మోసగించుచున్నాడనియు జెప్పెను. - ఇది నాచ్నే మనస్సున సందేహము కలిగించెను. నాచ్నే షిర్డికి వెళ్ళెను.

సా. బా: (నాచ్నే చూచిన తోడనే) ఏమి! మామ్లత్‌దారు వలన సెలవు తీసుకొనకయే వచ్చితివా?

నాచ్నే : అవును.

సా. బా: ఆ విధముగ ప్రవర్తింపకుము.

తాను మామ్లత్‌దారు గుమాస్తాయనియు యజమాని సెలవు లేకయే తాను వచ్చెననియు బాబా యెట్లు తెలిసికొనెనా? – యని నాచ్నే ఆశ్చర్యపడెను. బాబా తనకు మిక్కిలి ప్రేమతో నొసంగిన సలహాకు

సంతోషించెను. బాబా అంతర్జ్ఞానము - బాబా ప్రదర్శించిన ప్రేమ ఆ స్టేషన్‌మాష్టరు మాటలవలన కలిగిన సందేహము లన్నియు నిర్ధూతము లయ్యెను. ఆ పనికొఱకే బాబా తన అంతర్జ్ఞానమును, ప్రేమను ప్రదర్శించినాడు.

(16) యస్. బి. నాచ్నే - 2 అణాలు.

421. ఒక భక్తుడు బాబాకు సమర్పింపుమని నాచ్నేకు 2 అణాలు, కొబ్బరికాయ మొదలగునవి యిచ్చెను. నాచ్నే ఆ వస్తువులను మాత్రమే బాబాకు సమర్పించి ఆ రెండు అణాల విషయము మఱచెను.

నాచ్నే : బాబా! నేను తిరిగి వెళ్ళుటకు సెలవిమ్ము.

సా. బా: మంచిది, 'చితాలే' మీదుగా వెళ్ళుము. కాని, ఒక పేద బాపని రెండు అణాలను ఏల దాచుకొనెదవు?

ఆ విధముగ జ్ఞప్తిపఱుపబడి నాచ్నే ఆ రెండు అణాలను సమర్పించి, తన విధిని నిర్వర్తించెను.

సా. బా: నీవేపనికేని ఒప్పుకొంటివా - దానిని సంపూర్ణముగ కావింపుము. కాదా - దాని జోలికి పోవకుము!

(17) దాతే - నారింజలు.

422. నాచ్నే - 'దాత్నే'తో కలసి ఒకపరి షీర్డికి వెళ్ళెను. దాతే-తన ఫలాహారము కొఱకు తన విడిది దగ్గఱ బండిలో కొన్ని నారింజ పండ్లు నుంచి, మిగిలిన పండ్లను గొనివెళ్ళి బాబాకు సమర్పించెను. అచట జేరిన వారికాపండ్లు పంచిపెట్టబడెను. ఒక మార్వాడి బాలిక మఱికొన్ని పండ్ల కొఱకు బాబాను కోరెను.

సా. బా: (దాతేతో) వెళ్ళి నారింజపండ్లను తీసుకొని రమ్ము.

(18) రాజబల్లీ మహమ్మద్ - చెట్టు పట్టా

423. (నాశిక్‌లోని ఒక "కంట్రాక్టరు" దగ్గఱనుండి నూనిన చెట్టు పట్టాల నందుకొనుటకు రాజబల్లీ మహమ్మద్ నాశిక్ వెళ్ళెను. అవి సిద్ధముకాని కారణమున అచటనుండి షీర్డికిజేరెను. అతడు తిరిగి వెళ్ళదలచి బాబా సెలవు కోరెను.

సా. బా: అతడు నీ కిచ్చుటకు సరకుల సిద్ధపఱుపలేదు.

రాజబల్లీ మహమ్మద్ తరువాత నాశిక్ చేరెను. బాబా తెలిపిన విషయము యథార్థమని కనుగొనెను. (చూ. 535–బి)

(19) మేఘుని కులాభిమానము.

మేఘుడు (మేఘశ్యామ) హెచ్. వి. సాతే ప్రేరణమున షీర్డికిజేరిన ఒక చదువురాని బ్రాహ్మణుడు మార్గమధ్యమున బాబా ఒక మహమ్మదీయుడని తెలిసికొని, బాబాపై మిక్కిలి అసూయ వహించెను. కాని హెచ్. వి. సాతే అతనిని బలవంతపెట్టెను. మేఘుడు బాబాదగ్గఱకు వెళ్ళెను.

సా. బా: ఆ దుష్టుని వెలుపలకు తఱిమి వేయుడు! (మేఘునితో) నీవు గొప్పకులమునకు జెందిన బ్రాహ్మణుడవు. నాకు ప్రణమిల్లిన నీ కులమునకు హానికలుగును. వెడలి పొమ్ము! ఇక్కడకు రావలదు. ఆ అవివేకి సాహెబ్ (హెచ్. వి. సాతే) ఈ వెఱ్ఱివాని నాదగ్గఱకేల పంపినాడు

మేఘుడు - షిర్డినుండి వెడలిపోయి 1-1/2 సంవత్సరములు త్రయంబక క్షేత్రమున నివసించెను. కడుపునొప్పి ఇతర వ్యాధులతో బాధపడెను. బాబాయందు విశ్వాసము కలిగి, బాబానుజేరి, 1910 లో బాబా పూజారియై బాబాను సేవించెను. 1912 లో నతడు మరణించినపుడు అతని తనువుపై బాబా తన హస్తమును ప్రసరించుచు ఇట్లనెను. "ఇతడు నాయథార్థ భక్తుడు". బాబాను శివుని అవతారముగ మేఘశ్యాముడు సంభావించి సేవించినాడు.

[20] యస్. లోండా – కులాభిమానము.

425. 'నివాస్'– నివాసి 'నరహరి లోండా' అను నతడు ఇతరులతో గలసి బాబాను సందర్శించుటకు మసీదు జేరెను. మార్గమధ్యమున తాను బ్రాహ్మణుడై యుండి ఒక మహమ్మదీయున కెట్లు మ్రొక్కుటా! యని యతడు మాత్రమే సందేహించెను. తక్కినవారు బాబాపాదముల వ్రాలి నమస్కరించిరి. బాబా వారలను ఆదరించి అనుగ్రహించెను.

లోండా, బాబాను సమీపించి మ్రొక్కుదమని తన మనస్సును సమాధాన పఱచుకొనుచుండగా "నాదగ్గఱకు రా సాహసింపకుము. వచ్చి

వా! జాగ్రత్త" - అని, అనుచున్నాడా - యనునట్లు బాబా అతనివైపునకు యంకర దృష్టిని పఱచెను. మరల మరల నతడు బాబాను జేరబోవ బాబా దే విధమగు చూపుజూచెను. అతడు మసీదునుండి వెడలి, బాబా యొక్క బ్రాహ్మణభక్తుడు - ఉపాసనీబాబా ఉన్న ఖండోబా దేవాలయమునకు వెళ్ళెను. చట గూడ నాతడు నిరాకరింపబడెను. ఉపాసనీ మహరాజు అపుడు కాళ్ళను చుకొని కూర్చుండెను. లోండా, ఉపాసనీబాబాను జేరి మ్రొక్కవలయునని లుమాఱులు యత్నింప ఉపాసనీ మహరాజు తన కాళ్ళను ముడుచుకొని, నీవు బ్రాహ్మణుడవు, నీవు సాయిబాబాను దర్శింపజాలవు. అట్టియెడ నిచట తో నీకేమిపని కలదు? - అనెను.

[21] హరికనోబా – పాదరక్షలు.

426. హరికనోబా - అతని మిత్రులతో గలసి సాయిబాబాను పరీక్షించుటకై బొంబాయినుండి షీర్డికిజేరెను. అతడు తలపై జరీతలపాగ, పాదరక్షలను ధరించెను. చెప్పులను వెలుపల విడిచి, మసీదులోనికి వెళ్ళి, బాబాను సందర్శించెను. తిరిగి వెలుపలకువచ్చి చూడగా చెప్పులులేవు. ఆ ప్రాంతమంతయు వెదకెనుగాని ప్రయోజనంలేకపోయెను. అతడు విడిదికిజేరెను.

బాబా ఆ పాదరక్ష నొక మార్వాడి బాలునకిచ్చి, "బిడ్డా! యీ పాద రక్షల నొక కర్రకొనకు దగిలించుకొని, "హరి కా బేటా! - జరీ కా పేటా!" అని అఱచుచు పొమ్ము. ఎవరేని ఆ చెప్పులు తనవి - యనిన అతడు హరి పిల్లవాడేనా? యని, అతనికి జరీతలపాగ కలదా? యని యడిగి, అతడే యనిన ఈ చెప్పులతనికిమ్ము" అని చెప్పెను. ఆ పిల్లవాడు హరికనోబా బసదగ్గఱకు రాగానే హ. క. ఆ పాదరక్షలు తనవేయని, తాను హరికుమారుడనని-తెలిపి, తన జరీతలపాగను చూపెను. కనోబా అతని తండ్రిపేరు అనగ- హరి- హరి కనోబా ఈ రెండును అతని పేర్లే. బాబా పలుకులు "హరి కా బేటా" - దాని కెంతయు సరిపోలియున్నది. బాబా తన పేరెట్లు తెలిసికొని ఆ పాదరక్షలను పంపెనా? యని అతడాశ్చర్యపడెను.

[22] సోమదేవస్వామి - బాబా జెండాలు.

426-ఎ. 1911న సోమదేవస్వామి, బాబాను చూచుటకు షిర్డికి వెళ్ళెను. అతడు మసీదుపై మిక్కిలి ఎత్తుగ రెండు జెండాలు ఎగురుచుండుట

చూచి, "ఈ గర్వ సూచకమైన జెండా ఎగురవేయుట సాధువినయమున కెంతయు దగనిది" – అని, తనలో తలంచి బాబాను చూచుట తన కిష్టము లేదని అతని మిత్రులతో జెప్పెను. కాని వారి నిర్బంధమువలన బాబాను దర్శించుటకై వెళ్ళవలసి వచ్చెను. మంటపమును సమీపించి, బాబా నేత్రములవంక చూచినతోడనే అతడుపరవశుడయ్యెను. అతని కానందాశ్రువులు స్రవించెను. కంఠము గద్గదిగనొందెను. ఆనందమున మేనుకంపించెను. అతడు బాబాను సమీపింపగ బాబా మహోగ్రుడై కఠినముగ దూషించెను.

సా. బా: నీ యింటికి తిరిగి పొమ్ము – ఇకమీద నా మసీదులోనికి ప్రవేశించితివా – జాగ్రత్త! జెండా ఎగురువేయువాని దర్శింప నీ కేల? అది సాధులక్షణమా! ఒక నిమిషముగూడ నీ విచట నుండరాదు.

బాబా యొక్క సంపూర్ణ అంతర్ జ్ఞానమునకు సోమదేవస్వామి ఆశ్చర్య చకితుడయ్యెను.

[23] గుర్జార్ – ఒక రూపాయి

427. ధండిరాజు - విగుర్జార్ (వురఫ్) బాబూసాహెబ్, షిర్డికి బయలుదేరి వచ్చుచుండగ 'కనిత్కార్‌సతి' - బాబాకు సమర్పింపమని ఒక రూపాయ అతనికిచ్చెను. షిర్డియందతడు రెండు మూడు దినము లుండెను. ప్రతి దినము బాబా అతనిని దక్షిణ అడుగుచుండెను. చివర రోజున –

సా.బా: ఈ మూడుదినములు నేను వినోదముగ గమనించు చున్నాను. నేను దక్షిణ నడిగినపుడెల్ల నీ ధనము నిచ్చుచుంటివి. ఆ కాంత యొసగిన రూపాయ నీ జేబులోనే దాచియుంచితివి. దానినిచ్చెదవా?

ఈ విధముగ గుర్జార్ ఆ రూపాయ విషయము జ్ఞప్తిచేయబడి, బాబాకు సమర్పించెను.

[24] మాన్కర్ – తార్కాడ్‌సతి యొసగిన 'పేడా'ను సమర్పింపక పోవుట

428. 1915నందు జి. బి. మాన్కర్ షిర్డికి వెళ్ళుచుండ తార్కాడ్ సతి తనయింట బాబాకు నివేదింపబడి శేషించిన పేడా (లడ్డు) మాన్కర్‌న

కొసగి దానిని బాబాకు సమర్పింపుమని కోరెను. షిర్డికిజేరి మాన్కర్ ఆ లడ్డు విషయము మఱచిపోయెను. బాబా దర్శనము చేసికొనెను. ఆ ఉదయము బాబా ఏమియు నడుగలేదు. ఆ సాయంత్రము రిక్తహస్తములతో మాన్కర్ వెళ్ళెను. బాబా ఇంక సహింపలేక పోయెను.

సా. బా: నా కొఱకేమి తెచ్చితివి?

మాన్కర్ : ఏమియు తీసికొని రాలేదు.

సా. బా: నా తల్లి తార్కాడ్‌సతి నేను తినుటకు 'పేడా' పంపలేదా!

మాన్కర్ : సిగ్గు - భయముపొంది, క్షమాపణము తెలుపుకొని విడిదికివెళ్ళి 'పేడా' తెచ్చి బాబా చేతులందుంచెనోలేదో బాబా అత్యాప్యాయతతో దానిని దినెను.

[25] బల్లి పలుకు

428-ఎ. బాబా మసీదునందొక బల్లి టిక్కుటిక్కు అని ధ్వని జేసెను.

ఒకరు : బాబా! ఆ బల్లి కావించు ధ్వనియందలి భావమేమి?

సా. బా: ఔరంగబాదు నుండి తన సోదరి వచ్చుచున్నదని అది ఆనందించుచున్నది.

ఆ సమయమున ఔరంగాబాదు నుండి గుఱ్ఱముపై నొక రచటకు వచ్చి, తన సంచిలోనున్న ఉలవల నచట బోసెను. అందుండి యొక బల్లి క్రింద పడెను. ఆ బల్లి మసీదులోనికి అతివేగముగ పరుగిడి గోడపైకి ప్రాకి, అంతకుముందు అచటనున్న బల్లితో ఆడుకొనుచుండెను.

26. చోల్కారునకు పంచదారతో తేనీరు

429. చోల్కార్ – అను నతడు బాబా అనుగ్రహమున పరీక్ష యందు ఉత్తీర్ణుడై ఉద్యోగమును బడసెను. షిర్డికి వెళ్ళి బాబాను సందర్శించవలసిన మ్రొక్కుబడి మాత్రము శేషించెను. అతని వేతనము అతి స్వల్పము. కావున తాను త్రాగు తేనీటి యందు పంచదారను

మానుకొనెను. అటుల కూడబెట్టిన ధనముతో షిర్డికి జేరి బాపూసాహెబ్ జోగ్ యింట బసచేసి, బాబాను సందర్శించెను. తన విషయము అతడు జోగ్‌న కెఱిగించు పూర్వము –

సా. బా: (జోగ్‌తో) ఈతనికి (చోల్కారునకు) లెస్సగా పంచదార కలిపిన తేనీరు నిమ్ము.

27. పండరి న్యాయవాది

వక్రప్రవర్తనము – పరదూషణము – ప్రకటింపబడుట

430. హ. సీ. దీక్షిత్తునకు పరిచయముగల పండరి న్యాయవాది షిర్డికి వెళ్ళి, యితరులతోగూడి బాబాకు ప్రణమిల్లి, దక్షిణ సమర్పించెను.

సా. బా: జనములెంత మోసగాండ్రు! పాదములకు ప్రణమిల్లుచు, దక్షిణలు సమర్పించుచు వారినే హృదయముల నిందించు చుందురు.

బాబా పలికిన పలుకులు – పండరిపురమున న్యాయవాదులు చేరి విశ్రమించు గదిలో తాను - ఇతర న్యాయవాదులు కలిసి, "సబ్జడ్జి" "నూల్కరు" ను గూర్చి "ఇంతటి విద్యావంతుడయ్యు యీ నూల్కర్ తన కంటిబాధ, మధుమేహ వ్యాధి నివారించుకొనుటకు ఒక చదువురాని ఫకీరు – బాబాదగ్గఱకు వెళ్ళుచున్నాడు - అని, అవహేళన చేసిన మాటలు యథార్థమని ఆ వచ్చిన పండరి న్యాయవాది తరువాత హ. సీ. దీక్షిత్తునకు దెలిపెను.

28. వి. హెచ్. టాకూర్, దున్నపోతుపై స్వారి

431. వి. హెచ్. టాకూరు బి. ఎ. సర్వే డిపార్టుమెంటులో ఒక గుమాస్తా. కన్నడి "అప్పా" అను సాధువతనికి "నిశ్చలదాసు" రచించిన "విచార సాగరము" అను గ్రంథమును బహూకరించి, "కొంతకాలమునకు నీవు దక్షిణ దేశమున ప్రయాణము చేయునపుడు బ్రహ్మజ్ఞుడైన ఒక సాధువు నీకు బోధించును" - అని టాకూరునకు దెలిపెను.

టాకూరు అయా ప్రాంతముల దిరుగుచు ఒకచోట కొండ ప్రదేశమున దున్నపోతుపై స్వారి చేయవలసి వచ్చెను. ఆ సవారి అతనికి చాల బాధ

కలిగించెను. తరువాత కొంతకాలమునకు షిర్డికి జేరి బాబాను సందర్శించెను. బాబా తానే ప్రస్తావించుచు నిట్లనెను.

సా. బా: ఆ సాధువు నీ కిక్కడ బోధ కావింపబడునని తెలిపినాడు. కాని, ఆధ్యాత్మిక మార్గము మిక్కిలి ఒడిదుడుకులు గలది. మిక్కిలి కఠినము. నీవు మహిషముపై సవారి చేసినట్లు పెక్కు శ్రమలకు లోనుగావలయును.

29. మోదక్ – మిత్రుడు

ఈయదలచిన బహుమతి నిడుటకు వెనుకాడుట

432. వి. యస్. మోదక్ - ఒక మిత్రునితో గూడి షిర్డికి వెళ్ళెను. బాబాకు వేర్వేఱుగ రెండు రూపాయలు సమర్పింపదలచి వారి జేబులందు ప్రత్యేకించి యుంచుకొనిరి. వారు బాబాను దర్శించిరి.

సా. బా: (మోదక్‌తో) నాకు దక్షిణ నిత్తువా?

మోదక్ : ఇత్తును. (అని 2 రూపాయలు సమర్పించెను).

సా. బా: (మోదక్ మిత్రునితో) నీవు దక్షిణ నిత్తువా!

మిత్రుడు : ఇత్తును (అని ఒక రూపాయి సమర్పించెను).

సా. బా: కొందరు జనులెంత బొంకరులు! ఆ ఫకీరున కీయదలచి 2 రూపాయలు జేబులో వేఱుగా నుంచినారు. ఇప్పుడు ఒక్క రూపాయి మాత్రమే ఈయనేల? ప్రయాణము ఖర్చులకు వేఱొక జేబులో ధనము సమృద్ధిగ లేదా?

30. యస్. ఆర్. యస్. - బాంధవ్యము

433. యస్. ఆర్. సహస్రబుద్ధి బాబా ఉధి అనుగ్రహముల వలన నాకకొంత ప్రాథమిక స్థితియందున్న మతిభ్రమణమును(పిచ్చిని) నివారించెను. ఈ విషయమునుగూర్చి సహస్రబుద్ధియొక్క నేర్పుగ ఎవరో బాబాకు తెలిపిరి.

సా. బా: ఆతడెవరికి సాయము చేసినాడు? ఆమె అతని కోడలేకదా.

యస్. ఆర్. యస్. ఆమెతోగల బంధుత్వ మెఱుగడు. విచారించిన పిదప ఆమె తనసన్నిహిత దాయాదియొక్క భార్యయని తెలిసికొనినాడు.

31. జయకర్ సందేహములు నివారణమగుట

434. ఒకనాడు మంటపమున సత్యనారాయణ పురాణమును చదువుచుండిరి. జయకర్ మసీదునందు బాబాదగ్గఱ కూర్చుండెను. ఆ మంటపము మట్టము మసీదు మట్టమునకంటె 3 అడుగులు తగ్గుగనున్నది. జయకర్ అచట గూర్చుండుటను గూర్చిన తలంపు లాతని తారుమారు కావించినవి.

(1) బాబా సన్నిధిని గూర్చుండుట ఎప్పుడు శ్రేయస్కరమే.

(2) సత్యనారాయణ పురాణశ్రవణ మాతనికి ప్రత్యేక ఆకర్షణీయ విషయము.

(3) సత్యనారాయణ పురాణము తగ్గు ప్రదేశమున చదువబడు చుండ తాను ఉన్నత ప్రదేశమున గూర్చుండుట ఉచితముకాదు.

ఈ విషయముల గూర్చి యేమి చేయవలయునో ఆతని మతికి దోచకుండెను. బాబా అతని తలంపుల గుర్తించి "పొమ్ము! ఆ పురాణము వినుము!" అనెను. దీనితో ఆతని సందేహములు నివారణములయ్యెను.

దక్షిణలు మొదలగు తలంపులను – విధులను నిర్వర్తింపజేయుట

32. దీక్షిత్తు – 25 రూపాయలు దక్షిణ

435. హ. సీ. దీక్షిత్తు బాబాకు పూలమాల, 25 రూపాయల దక్షిణ సమర్పింపదలచి బాబాను సందర్శించి పూలదండను ముందుగ సమర్పించెను.

సా. బా: ఈ పూలమాల 25 రూపాయలను కోరుచున్నది.

అంత హ. సీ. దీక్షిత్తు 25 రూపాయలు దక్షిణ బాబాకు సమర్పించెను

33. దీక్షిత్తు – తాంబూలము

436. హ. సీ. దీక్షిత్తు బాబా పటమునకు నిత్యము పూజ జరుపువాడు - ఒకనాడు తాంబూలము సమర్పించుట మఱచెను. ఆ దినము బాబాను దర్శింపగా –

సా. బా: కాకా! నాకు తాంబూలమిమ్ము!

[34] కపర్దే – దక్షిణ

437. జి. యస్. కపర్దే కుమారుడు స్వప్నమున బాబా తన యింటికి వచ్చి భుజించినట్లు కలగనెను. మఱునాడు ఆ విషయమును గూర్చి - బాబా తన యింటికి వచ్చిన విషయమును గూర్చి - తెలిసికొనగోరి బాబాదగ్గఱకు వెళ్ళెను. అతడడుగనున్న ప్రశ్నమును గుర్తించి –

సా.బా: రాత్రి నీవు నాకు భోజనము పెట్టితివి. కాని దక్షిణ నీయలేదు. ఇపుడు దక్షిణ నిమ్ము!

[35] ఉద్ధవేశభావ్ – ధననష్టము దప్పిక

438. దహన్ నివాసి ఉద్ధవేశభావ్ కొందఱు మిత్రులగూడి ద్వారకకు వెళ్ళుటకై పొగయోడ నెక్కెను. ఆ నావమీదనుండగ అతని దగ్గఱనున్న ధనము - అందలి టికెట్లు మొత్తము సముద్రమునబడెను. ద్వారకనుండి షిర్డిలోని సాయిబాబాకు జరిగిన విషయము దెలిసికొనుచు ధనము కొఱకు ఉత్తరము వ్రాసెను. ఆ రాత్రియే (అతనిజాబు షిర్డికి జేరుపూర్వమే) "నీ తండ్రి ధనము సముద్రమున పడిపోయినది. ఆతనికి ధనము పంపుము" - అని దహనులో నొక భాగ్యవంతుడు ఎవరో తెలిపినట్లు కలగనెను. అతడు ద్వారకలోని ఉద్ధవేశభావునకు 150 రూపాయలు పంపెను. అంతట ఉద్ధవేశభావ్ తన తీర్థయాత్ర సాగించుచు నొక దినమున నొకకొండ సగము దూరమెక్కునప్పటికి మిక్కిలి దప్పికగొనెను. అపుడొక ఫకీరు ఆతనికి పానీయ మొసగి దప్పిక తీర్చెను. ఉ. భా. షిర్డికిజేరగ శ్యామా ముందుగవెళ్ళి బాబాతో ఉద్ధవేశభావ్ రాకను దెలిపెను.

సా. బా: (వెంటనే) నే నతని జూచితిని - అని అతని ధనము సముద్రమున పడిన విషయము – దైవమతని కెట్లు ధన మొసంగినది,

అతని దప్పిక నెట్లు తీర్చినది ఆ రెండు విషయములను శ్యామాకు తెలిపెను.

[36] వి. యస్. మల్హర్కర్ – పక్కాభక్తుడు.

439. వి. యస్. మల్హర్కర్ బాంద్రాలోని పెద్దగుమాస్తా. నా. గో. చందోర్కర్‌తో కలసి షిర్డికి ప్రయాణమైవచ్చుచు కోపర్గామునందొకనితో నా. గో. చందోర్కర్‌నుగూర్చి "ఇతడు పక్కా (పండు) భక్తుడు" – అని అనెను. అతడు షిర్డికి జేరినతోడనే బాబా ఆతడనిన మాటలు మరల బేర్కొనుచు "నానా పక్కా భక్తుడు - నీవు కచ్చా భక్తుడవా?" అనెను. (పక్కా=పండు. కచ్చా=పచ్చి).

[37] ప్రత్యేక పేడా – మల్హర్కర్‌సతి జీవితము.

440. మల్హర్కర్ - పండరీపురమున ప్రత్యేక పేడాకొని షిర్డికి తీసికొనివచ్చి బాబాకు సమర్పించెను.

సా. బా: (ఆ విషయము లెవరివలన దెలిసికొనకయే) ఈ పేడా పండరినుండి తేబడినది. ఇది ప్రత్యేకించి నాకొఱకు గొనిరాబడినది.

అంత మల్హర్కర్‌సతి నిత్యజీవిత విషయములను బాబా వివరించి తెలిపెను.

[38] డి. డి. రసానే - జేబులో ఇంకను ధనము కలదు.

441. డి. డి. రసానే - ఆతని బంధువు బాబాకు పలుమాఱులు దక్షిణలు సమర్పించిరి. వారిదగ్గఱ నింకను 25 రూపాయలుండెను. ధనము పంపుమని యింటికి ఉత్తరము వ్రాసిరి.

సా. బా: (వారితో) దక్షిణనీయుడు!

రసానే - అతని బంధువు : బాబా! మా దగ్గఱ ధనము మిగులలేదు.

సా. బా: మోసములాడనేల? మీదగ్గఱ నింకను 25 రూపాయలు కలవు. మీరు పంపుడని ఉత్తరముద్వారా కోరిన ధనము త్వరలో రానున్నది. (చూ. ఆర్. బి. (పురందర్).

39. బాబూరావు బోరవ్కే – మఱచిన రూపాయి

442. బాబూరావు బోరవ్కే చిన్నతన మగుటచే దగ్గఱ ధనములేదు. షిర్డికి బోవకుండెను. మార్గమధ్యమున అతని పిన తండ్రి దగ్గఱకు వెళ్ళెను. సాధువులదగ్గఱకు రిక్తహస్తములతో పోరాదని అతడు బాబాకు సమర్పింపుమని ఒక రూపాయి బాబూరావునకిచ్చెను. బోరవ్కే షిర్డికిచేరి బాబాను సందర్శించెను.

సా. బా: నాకు రూపాయి దక్షిణ తెమ్ము!

బోరవ్కే : (క్రొత్తగా సంపాదించిన రూపాయిమాట మఱచి) నా దగ్గఱ యేమియులేదు.

సా. బా: చూడుము! నీ జేబులో రూపాయి యున్నది. ఒక ఫకీరునకు నీ ఒక రూపాయి యీయ వలయును.

బోరవ్కే తన జేబు తవిడి రూపాయి తీసి బాబాకు సమర్పించెను.

40. అచ్చు వేయువాని – యస్. వి. యుక్తిని వెలిపఱచుట

443. డి. వి. సంభారే మిత్రుడు బొంబాయిలో అచ్చు వేయువాడు. యస్. వి. బాబా దక్షిణ అడుగునని తెలిసికొనెను. యథార్థముగ తనదగ్గఱ ధనము లేదని పలుకుటకు వీలుగ తన ధనము సంభారే దగ్గఱ నుంచెను. వారు షిర్డికి చేరి బాబాను సందర్శించిరి.

సా. బా: (యస్. వి. తో) నాకు 2 రూపాయలు దక్షిణ నిమ్ము! అతని (డి. వి. సంభారే) దగ్గఱ నుండి తీసికొని యిమ్ము.

సర్వము జూడజాలు. బాబా కనుల గప్పజాలమని యస్. వి. గ్రహించెను.

41. శ్రీ టి. [తార్కాడ్-?] తప్పు తెలిసికొనిన తరువాత సరిదిద్దుకొనవలయును.

444. శ్రీ టి. (తార్కాడ్) ఇంటి నుండి వెళ్ళుచుండగా అతని భార్య పైకమడిగెను. తన జేబులో యేమియు లేదను తలంపుతో లేదని

చెప్పి మేడ దిగి వచ్చెను. క్రిందికి దిగిన తరువాత జేబులో రూపాయి వున్నట్లు తెలిసికొనెను. కాని పైకివెళ్ళి దానినీయలేదు. ఆఫీసునకు వెళ్ళెను.

కొన్ని వారములు జరిగిన పిదప తార్కాడ్ దంపతులు షిర్డీకి వెళ్ళి బాబాను సందర్శించిరి.

సా. బా: (తార్కాడ్‌సతితో) అమ్మా! ఈ రోజులలో జనులెంతటి వంచకులు! అతని జేబులో రూపాయి వుంచుకొనియు లేదనినాడు.

తార్కాడ్ అప్పుడు భార్యతో తన తప్పు ఒప్పుకొనెను.

42. లాలా లక్ష్మీచంద్

445. 1910 లో లాలా లక్ష్మీచంద్ తానెప్పుడు నెరుగని వానిని భక్త జనులతో గూడి, గడ్డము గలిగిన ముదుసలి వానిని స్వప్నమున జూచెను. ఆ పిదప దాసుగాణూ మహారాజుదగ్గఱగల ఆ ముదుసలి వాని పటముజూచి అతడు షిర్డీలోని సాయిబాబా అని తెలిసికొనెను. అతడు షిర్డీకి వెళ్ళ నిశ్చయించుకొని ప్రయాణము ఖర్చులకు 15 రూపాయలు అప్పు తీసికొనెను. మార్గ మధ్యమున నింకను అధికముగ తెలిసికొనవలయునని బాబానుగూర్చి జనుల నడిగెను. లాలాచంద్ షిర్డీకిజేరి బాబాను సందర్శింపగనే –

సా. బా: మూర్ఖుడు! అందఱను ప్రశ్నించుచుండును. ఇతరుల నడుగ నేల? తన స్వప్నమున జూచినది సత్యమగునా? కాదా? అనునది తాను నిర్ణయించుకొనవలయును. మార్వాడీదగ్గఱ అప్పు తెచ్చుకొనినాడు. ఈ దర్శనమున కింతతొందర యేల? అతని హృదయ కామిత మిప్పుడు తీరినదా?

43. లాలా లక్ష్మీచంద్ – గోధుమ కుడుము

ఆకలి నొందినవారియెడ బాబా ఆదరణము

446. లాలా చంద్ వాడకు వెళ్ళి మిఱుల ఆకలితో గోధుమకుడుము (సాంజా) దొరకునను ఆశతో బాబా దగ్గరకు వెళ్ళెను.

జోగ్ : బాబా! నైవేద్యమున కేమి సిద్ధపఱచుదును?

సా. బా: గోధుమకుడుము (సాంజా) సిద్ధపఱచుము. ఆకలి నొందిన వారి కది మంచిది. (మరల) సాంజా సిద్ధమైనది - హారతి సేవ త్వరగా కానిమ్ము!

44. ధనికుని దత్త పుత్రుడు

447. ఒక ధనికుని దత్తకుమారుడు అతి కష్టము మీద షిర్డికి గొనిపోబడెను. అతడు తన తండ్రి ప్రక్కన బాబాయెదుట గూర్చుండెను. అతడు తన దత్తపిత కేమియు జెప్పక షీర్డి విడిచి వెళ్ళవలయునని తనలో తలంచెను.

సా. బా: (వెంటనే) నా ఆజ్ఞ లేనిదే యెవరును ఈ రోజు షీర్డి విడిచి వెళ్ళరాదు.

ఆ పిల్లవాడు తన తలంపును బాబా గ్రహించినాడని గుర్తించి, తానా దినమున షీర్డి విడిచి వెళ్ళదలంచిన విషయమును చెప్పుకొనెను.

45. పోలీసు ఉద్యోగి – 50 రూపాయలు దాని అవసరము.

448. సా. బా: (పోలీసు ఉద్యోగితో) నాకు దక్షిణ యిమ్ము!

పో. ఉ: నా దగ్గఱ యేమియు లేదు.

సా. బా: నీ జేబులో చూడుము. 50 రూపాయల కరెన్సీ కాగితము కలదు.

పో. ఉ: ఇదిగో బాబా! తీసికొనుము.

సా. బా: వలదు. ఉంచుకొనుము. నీకు త్వరలో దాని అవసరము కలుగును.

పోలీసు ఉద్యోగి తిరిగి వెళ్ళెను. తోడనే అతనికొక కష్టము కలిగెను' ఆ పైకముతో అవసరము తొలగెను.

బాబా – భూతముల సహాయముగల ఇంద్రజాలము

449. [1] తత్వజ్ఞాన సమాజకురాలు : (బాబాకుగల అత్యద్భుత శక్తిసామర్ధ్యములు భూతముల సహాయముగల ఇంద్రజాల మగునా? - అని తలంచెను).

(గమనిక : బాబా అద్భుత శక్తులు, మంత్రానుష్ఠాదుల వలన, వానికి సంబంధించిన వివిధ నియమములను పాటించుట వలన కలిగినవి కావు. అవి బాబా సహజస్థితిలోని అంశమై పెద్దకాలము గురుసేవా తత్పరతవలన గురుదేవుని అనుగ్రహము వలన పెంపొందినవి. భాగవతము, వి-(5)-35 నందలి ఋషభుని వృత్తాంతము గమనింపుడు. ఋషభుడు బ్రహ్మజ్ఞుడై తనయందు సకల చేతనాऽచేతనాత్మక ప్రపంచమున వాసుదేవ పరబ్రహ్మమును జూడగలిగియాతడు సంచరించుచుండ సకలసిద్ధులునాతని వరించినవి. 1]దూరగ్రహణము [దూరమునగలుగు విషయముల దెలిసికొనుట]. 2] అంతర్ధానము (దృశ్యమగుట - అదృశ్యమగుట (చూ. 352, 532) 3] మనోజవము. (సకల జీవ మానసిక వ్యాపారములను తత్క్షణము గుర్తించుట, ప్రేరేచుట మొదలగునవి. చూ. 406) 4] పరకాయ ప్రవేశము [వివిధ తనువుల జేరుట చూ. 321] 5] వైహాయస గమనము [ఎట్టి ఆటంకములులేక యెల్ల ప్రదేశముల సంచరింప గలుగుట. చూ. 75-87]

సా. బా: కాలయవనుడా? - ఇతడు బ్రాహ్మణుడు - స్వచ్ఛ - పావన బ్రాహ్మణుడు. వేనకువేలు జీవులను శుభమార్గమున నడింపింపగల సమర్థుడు. [అనగా పవిత్ర మార్గమున నడింపించి దైవమును జేర్పగలవాడు] కాలయవనుడిచట అడుగైన పెట్టజాలడు. [చూ. 57]

450. [2] సా. బా: [కుశభావ్‌తో] అపుము! నీ ఐంద్రజాల విద్యలన్నియు గట్టిపెట్టుము. ఆ పిదప ఇచటకు రమ్ము!

451. [3] సా. బా: [భూత ప్రేత ఐంద్రజాలవిద్య ప్రయోగ బాధితునితో] దైవము నిన్ననుగ్రహించును!

పర్భని నివాసియొకడీ భూతప్రేత ఐంద్రజాల విద్యా ప్రయోగమునకు గురియైనాడు. అన్నం వెంట్రుకలుగ గోచరించి, పేడకంపు కొట్టుచుండెను.

అతడు పెక్కు పూజలు జరిపించెను. భూతవైద్యులచేత మంత్రోచ్చాటనలు వేయించెను. కాని ప్రయోజనము కలుగలేదు. చివరకు షీర్డికి జేరెను. బాబా అతని ననుగ్రహించెను. అతనిపై ప్రయోగింపబడిన ఐంద్రజాలశక్తి నిర్మూలనమయ్యెను.

452. [4] బాబాచేత, బాబాసాన్నిధ్యము మాత్రమున దుష్టభూత ప్రేతాదులచే బాధింపబడినవారు స్వస్థులైనారు.

[ఎ] హన్సిరాజునకు దుష్టభూతము సోకెను. అతడు బాబాను ఆశ్రయించెను.

సా. బా: [అతని నరచేతితో గొట్టుచు] దుష్టభూతమా! పొమ్ము! వెడలి పొమ్ము!

హన్సిరాజునకా పిదప దుష్టభూత బాధ తొలగెను. బాబాసన్నిధికి కొంతకాలముండుటచే నతనికి చాలకాలమునుండి బాధించుచున్న ఉబ్బసము వ్యాధియు నిర్మూలనమయ్యెను.

[బి] గాలిసోకిన [దయ్యము పట్టిన] టిప్నిస్‌సతి - బాబాసన్నిధికి గొనిరాబడెను. బాబా అనుగ్రహలేశమున - ఆశీఃప్రభావమున ఆ దుష్ట భూతమామెను విడచి వెళ్ళెను.

భవిష్యత్తు నెఱుగుటవలన లాభములు
ధైర్యము - సహనము.

453. 1] సా. బా: [ఆర్. బి. పురందర్‌తో] నీవు ఏమనకుము- ఈ ఉబ్బసము బాధ అల్లా నాకు కలిగించినాడు. రెండు నాలుగు రోజులలో తగ్గిపోవును.

454. సా. బా: [హ. సీ. దీక్షిత్తుతో] నీకు జ్వరము తగులును 8 రోజులలో నివారణమగును. దానికొరకు ఆందోళన పడవలదు.

దీక్షిత్తునకు జ్వరము తగిలెను. ఆతడెట్టి ఆందోళనము చెందలేదు. అతని మిత్రులెంత చెప్పినను వినక ఔషధములను సేవింపలేదు. రోగులకు అపథ్యములైన ఆహారపానీయములను తీసికొనెను. 8 దినములలో నతడు సంపూర్ణ ఆరోగ్యము పొందెను.

బాబా – పూర్వవృత్తాంతములు

(ఎ) బాబా - ఇతరుల పూర్వజన్మల వృత్తాంతములు.

455. (1) సా. బా: (బాలసాహెబ్ భాటేతో) నీ పూర్వభవమున నీవు ఒక "ఖాత్రి" వి. ఇప్పటి నీ భార్య - కుమారుడు వారి పూర్వభవమున 'సాలె' కులమువారు.

456. (2) సా. బా: వాసుదేవ కాకా, పూర్వజన్మమున 'జయ సింగ్' - అను పేరుగల రాజపుత్రుడు అతని కూతురు చెడి ఒక బార్వారునకు భార్యయైనది.

457. (3) సా. బా: ఇటీవల (1912లో) మృతినొందిన కొండాజీ పుత్రుడు పూర్వభవమున నొక 'మాంగ్' అంతకు పూర్వభవమున నా తాత కుష్ఠవ్యాధిచే మరణించెను. ఈ మూడు పుట్టువులందు అతనికి తోడ్పడి, క్రీడించుచు నతని దగ్గఱ నుంటిని. (చూ. 473, 17).

458. (4) మసీదు 'మించార్' పైననిపుడు (1912 లో) గూడు కట్టుకొనిన పిచ్చుకలు పూర్వమక్కడే గూడుకట్టుకొనినవి. వానిని సర్పము భక్షించెను. అవి మరల పిచ్చికలుగ పుట్టి ఆ చోటనే గూడు కట్టుకొనినవి.

459. (5) సా. బా: కొన్ని శతాబ్దములుగ నితడు (ఆర్. బి. పురందర్) నాతో సంబంధము కలిగియున్నాడు.

460. (6) సా. బా: ఈ సోదరి (చంద్రాయ్ బోర్కర్) ఏడు జన్మములందు నా సోదరియై యున్నది. నేనెక్కడకు వెళ్ళినను నా కొఱకు అన్వేషించు చుండునది. (చూ. 355-ఎ)

461. (7) సా. బా: (శ్యామాతో) నీవు ఇతనిని (జి.జి. నార్కేను) నాకు పరిచయము చేయుచుంటివా? నే నితనిని 30 జన్మముల నుండి యెరుగుదును.

462. (8) సా. బా: శ్యామా! (మాధవరావు దేశపాండే) నేను నీతో 72 జన్మముల నుండి సంబంధము కలిగియున్న వాడను. ఇంతకు ముందెప్పుడు నిన్ను బుగ్గ మెలియపెట్టి యెఱుగను.

463. (9) సా. బా: (జి. యస్. కపర్దేసతిని గూర్చి) ఈమె పూర్వభవముననొక కోమటి ఆవుగనుండి (నాకు) సమృద్ధిగ క్షీర మొసగినది.

తరువాత నొక తోటమాలి పుత్రికయై పుట్టెను. ఒక క్షత్రియుని జేరెను. తరువాత నొక వర్తకుని వివాహమాడెను. ఆ పిదప బ్రాహ్మణజన్మమొందెను.

చాలాకాలము గడచిన పిదప నేనీమెను మరల చూచుచున్నాడను.

ఈమె నాకొసగు ఆహారము అతిమధురమైనది.

[ముందుగా సమర్పింపబడిన ఇతరుల నైవేద్యములను తాకక, జి.యస్. కపర్దేసతి సమర్పించిన నైవేద్యమునే ముందుగా స్వీకరించి, ఆమెయందు పక్షపాతము ప్రకటించుచున్నవాడవని శ్యామా, బాబాను ఆక్షేపింపగా దానికి బాబా తెలిపిన సమాధానమిది]

(10) జి. యస్. కపర్దే

464. సా. బా: (జి. యస్. కపర్దేతో) నీవు పూర్వజన్మమున నాతో 2, 3 సంవత్సరములుంటివి. నీ యింట సుఖ సంతోషములతో జీవించుటకు సమృద్ధిగ నున్నను నీవు ప్రభుసేవకొఱకు వెళ్ళితివి. [రాజకీయోద్యోగము చేసితివి].

465. [11] రావుసాహెబ్ యశ్వంతరావు గాల్వంకర్ - బాబా దగ్గఱకు 1917 న వెళ్ళెను.

సా. బా: [తన అరచేతిని గాల్వంకర్ మస్తమున నిలిపి, ఆతనికి తన్మయత్వస్థితిని ప్రసాదించి] పూర్వభవము లందు ఋజుత్వ పవిత్రతల గలిగినవాడితడు. అందుచే నీతని నిప్పటి మాతృగర్భమున జనింపజేసితిని. నేటికిని ఆసద్గుణము లితనియందు గలవు. [చూ. 469]

466. [12] సా. బా: [కల్యాణ్ నివాసి, టి. ఎ. కార్ణిక్‌తో] నేను నిన్ను రెండు వేల సంవత్సరములనుండి యెరుగుదును. నీ వెప్పుడు పెడ బుద్ధియు, కోతియుక్తులు గలవాడవు.

[13] ఉరి తీయువాడు – పగ తీర్చుకొన తిరిగి పుట్టుట,
పునర్జన్మము – కర్మఫలమనుభవించుట.

467. షిర్డిలో 'తాకియా' దగ్గఱనొక గ్రుడ్డి వాడుండెను. అతడు వధింపబడెను. గ్రామాధికారుల ఆజ్ఞలననుసరించి ఆ హంతకుడు ఉరి

తీయబడెను. కాని, ఆ ఉరి తీసినవాడు అహంతపై వైరము, ద్వేషముగల బుద్ధితో ఆ పని కావించెను. కావున ఆ ఉరి తీయబడినవాడు ఉరి తీసినవాని కుమారుడుగ జన్మించెను.

14. నా. గో. చందోర్కర్

459. నా. గో. చం: (బాబాతో) బాబా! నన్నేల పిలిపించితివి?

సా. బా: వేనకు వేలు జనులు కలరు. నేను వారికొఱకు పిలువ నంపుదునా? నీవు నేను నాలుగు జన్మలనుండి సంబంధము గలిగియున్నారము- నీవది యెఱుగవు. కాని నే నెఱుగుదును. నీ కవకాశము గలిగినపుడు నా దగ్గఱకు వచ్చుచుండుము.

15. కిష్య (లేక) పిష్య

469. సా. బా: అతడు 'గోహిల్లా' అయియుండెను. అతడు నా అవ్వను వివాహమాడెను. మరణించెను. అతనిని ఇప్పటి మాతృ గర్భమున జనింపజేసితిని.

16. బాబు ప్రధాన్.

470. షిర్డియందొక పవిత్రుడైన వృద్ధుడు 12 సంవత్సరములు నివసించెను. ఆతని భార్య, పెద్దవారైన కుమారులు 'జాల్నా' లో నుండి ఆ వృద్ధుని తమ దగ్గరకు రావలసినదిగ పలుమారులు ప్రార్థించిరి. చివర కతడు గుఱ్ఱముపై ప్రయాణము చేసి వెళ్ళెను. నే నాతని వెంట బండిలో వెళ్ళితిని. కొంతకాలమైన తరువాత ఆ వృద్ధుడు తన తమ్ముని చిన్నకుమార్తెను వివాహ మాడెను. ఆమె వలన నొక కుమారుడు కలిగెను. ఆ పిల్లవాడు ఆరేండ్లవాడుగ నున్నపుడు ముసలివాడు మరణించెను. బీరాదారులు ఆ పిల్లదానికి విషముపెట్టి చంపిరి. ఆ పిల్లవాడు 'బాబు' గ (దాదా కేల్కారు సోదరుని కుమారునిగ) జన్మించెను. బాబు 1910 లో నిచట (షిర్డిలో) మృతినొంది బొంబాయిలో జన్మించెను.

1910లో యం.డబ్లియు. ప్రధాన్ దంపతులు బాబాను సందర్శించిరి.

సా. బా: శ్యామా! ఈ ప్రధాన్‌సతి నా 'బాబు' = తల్లియగును.

ఆ కాంత అప్పటికి గర్భిణికాదు. కాని పిదప 12 నెలల లోపల ఒక కుమారుని గని, ఆ బిడ్డనుగూర్చి బాబా తెలిపిన కారణమున ఆ బిడ్డకు 'బాబు' - అని పేరు పెట్టుకొనిరి. ఆ బిడ్డ జనించిన కొన్ని నెలల తరువాత ఆ దంపతులు తమ బిడ్డను షిర్డికి గొనివచ్చి బాబా ముందుంచిరి.

సా. బా: (ఆ బిడ్డను చేతులలోని కెత్తుకొనుచు) బాబూ! నీ వెక్కడ నున్నావోయి! నాపై విసుగు, కోపము గలిగినదా?

బాబా మహాసమాధి నొందిన వెంటనే 1919 లో 'బాబు' గూడ పరమ పదించెను.

బాబా - జీవుల పూర్వజన్మ స్మృతులు – మేకలు

471. ఒక సమయమున 'లేండి' వనము ప్రక్కగా పోవుచున్న మేకలమందనుండి బాబా రెండు మేకలను 32 రూపాయలకు కొని తెచ్చెను. అప్పటిలో ఆ మేకల గరిష్ఠమైన విలువ 8 రూపాయలగుట శ్యామా - తాత్యా ఈ యిరువురు బాబా ఈ బేరమున మోసగింపబడినాడని తలంచిరి. బాబా 4 శేర్ల పప్పుధాన్యముకొని ఆ మేకలకు తిన బెట్టించి, వానిని మరల ఆ మంద యజమాని దగ్గఱకు పంపించెను.

సా. బా: శ్యామా! తాత్యా! నేను వంచింపబడితినని మీరు తలంచుచున్నారా! - కాదు. ఈ మేకల వృత్తాంతము వినుడు! పూర్వ భవమున ఈ మేకలు నా పొరుగింటి మానవులు. తొలుత వారొండొరులు మిక్కిలి ప్రేమించుకొనువారు. నన్ను ప్రేమించినవారు. తరువాత వారు ద్వేషించుకొన దొడగిరి. కలహించుకొని, యొండొరుల చంపుకొనిరి. ఇపుడు వారు మేకలై పుట్టిరి. అవి (మేకలు) నా ప్రక్కగ వెళ్ళుచు నావంక జూచినవి. వాని పూర్వగాథను గుర్తించితిని. వాని యందు ప్రేమ తిరిగి పొడముటచే వానిని మరల నా దగ్గఱ కొంత తడవుంచుకొని తృప్తిగ దిన బెట్టించుట కీ ధనము వెచ్చించితిని. నా బేరము మీకు అనిష్టమగుటచే వానిని మందకాపరి దగ్గఱకు పంపితిని.

జన్మజన్మముల గురువు భక్తులననుసరించును – తార్కాడ్‌సతి.

472. సా. బా: (బొంబాయి నివాసులు, తార్కాడ్‌సతి, ఆమె

కుమారునితో) మీ పూర్వజన్మముల నెన్నిట మీతోనుంటిని! ఇంక గలుగబోవు జన్మములనెన్నిట మీతో నుండగలను! మనము మరల కలియుచుందుము.

నాకు సమర్పింపబడిన ప్రతిపైసాను గూర్చి (నన్ను శరణొందిన ప్రతి జీవినిగూర్చి) భగవానునకు నేను లెక్క చెప్పుకొనవలయును.

472. (ఎ) (బాబా తన ప్రస్తుత జన్మ వృత్తాంతమునుగూర్చి తనతో విస్పష్టముగ దెలిపినట్లు మహల్సాపతి తఱచుగ జెప్పువాడు) "నేను "పత్రి" గ్రామమున బ్రాహ్మణ కుటుంబమున జన్మించితిని. నా తల్లిదండ్రులు నా బాల్యమున నన్నొక ఫకీరునకు ఇచ్చినారు". (పత్రి గ్రామములోని పలువుర పేర్లను దెలిపి బాబా వారినిగూర్చి విచారించువాడు).

472. (బి) (బాబా చెప్పినది దాస్‌గాణూ తెలిపినాడు). "నా గురువు బ్రాహ్మణుడు - 'శేలు' నివాసి వేంకుశుడు".

"నా గురువు బ్రాహ్మణుడు" - అని, బాబా తెలిపినట్లు - జి. జి. నార్కే చెప్పుచున్నాడు.

బాబా తన గురువు పేరు తెలిపినట్లు - అది ష్-ష-శ్ - అక్షరములతో అంత మయినట్లు - అది బహుశః 'వేంకు-శ్' అయి యుండునని - హెచ్.వి. సాతే' చెప్పినాడు.

472. (సి) బాబా పునర్జన్మము

1) బాబా తన బిడ్డలను కనిపెట్టియుండుటకు మఱల మఱల జన్మించు చుందునని తెలిపినాడు.

ఉదా : యం. బి. రేగే (చూ. 17) తార్కాడ్ కుమారుడు. (చూ. 472)

2) సా. బా: (నా. గో. చందోర్కర్‌తో) నానా! నీ (మాంఘట్ చేతి మణికట్టు కొంతకాలమునకు ముసలివాని మెడవలె చలించును. ఆ పిదప నేను బాపు (చందోర్కర్ కుమారుడు) బిడ్డగ జనింతును.

3) బాబా తాను మఱల జన్మించి, జనములకు 8 సంవత్సరముల బిడ్డగ ప్రకట మగుదునని విస్పష్టముగ దెలిపినట్లు హ. సీ. దీక్షిత్తు చెప్పినాడు. (దీక్షిత్తు డైరీ)

స్వీయ చరిత్రాత్మకములగు పూర్వజన్మ స్మృతులు

పాము – కప్ప – పగ తీర్చుకొన మఱల పుట్టుట – వాసనల పెంపు

దైవ నిర్ణయము – న్యాయము.

473. "సాధు సత్పురుషుల పాదములకు సంపూర్ణ శరణాగతి జేసిన కప్ప జీవి కావించిన పాపము నశింపదు" అని సాయిబాబా ఒక సందర్భమున పలికి, ఒక గాధ దృష్టాంతముగ దెలిపెను.

ఈ కథను పురస్కరించుకొని "ధనము నందు అత్యాశ జీవిని అధోగతి (హీన జన్మముల) పాల్జేయును' - అను మఱియొక నీతిని బాబా తెలిపినాడు.

సా. బా: ఒకనాటి ఉదయము 8 గంటలకు నేను విహారమునకు వెళ్ళితిని. నే నొక (రహతా నదివలె) అగాధమైన నది దగ్గఱకు వెళ్ళితిని. అచట చెట్లనీడగల కాలిబాట, బండ్లబాటయు కలదు. పిల్లగాడ్పులు వీచు చుండెను. అచట నీడలో గూర్చుండి, దట్టమైన చెట్ల ఆకుజొంపముల జూచు చుంటిని. (చిలమ్) పొగగొట్టము తీసి పొగ త్రాగుటకు చేతి చిఱు చేలమును తడుపుచుండగ నొక కప్ప గోణుగు (కూత) వినబడెను. చకుముకి రాళ్ళు రాపిడిచే పొగ గొట్టమును వెలిగించితిని. ఒక బాటసారి వచ్చి నమస్కరించి, నా ప్రక్కన గూర్చుండి తన యింటికి భోజనమునకు రమ్మని నన్నాహ్వానించెను. నేను సమ్మతించితిని. అతడు పొగ గొట్టమును వెలిగించి, నా కందించెను. అతడు కప్ప అఱపువిని ఆ రొదకు కారణమేమో తెలిసికొన దలచెను.

"అది కష్టములోనున్న ఒక కప్ప. దాని పూర్వకర్మ విషమ ఫలమను భవించు చున్నది. చూడుము! మన పూర్వ జన్మముల గావించిన కర్మముల ఫలము నిప్పుడు అనుభవించితీరవలె. ఇపుడా (విధి విధానమును గూర్చి) పెద్ద పెట్టున ఏడ్వ నేల?"- అని నేను పలికితిని. అతడా కారణ మరయుటకు ఆ ధ్వని వచ్చు మార్గమున నడిచి వెళ్ళెను. ఆ కప్ప ఒక పెద్ద సర్పముచే పట్టుబడి యేడ్చుచున్నది - అని నేను చెప్పితిని. పూర్వ భవముల వారిరువురు దుష్టులే- ఆ కర్మ ఫల మనుభవించుటకు ఈ పుట్టువులొందినారు. ఆ బాటసారి నా పలుకుల సత్యము గ్రహించినాడు. ఒక పెద్ద కప్పను నోట బట్టుకొనిన ఒక పెద్ద కాలసర్ప మచటనుండెను.

అతడు తిరిగివచ్చి 10, 20 నిమిషములలో ఆ సర్పము కప్పను పూర్తిగ మ్రింగివేయునని నాతో అనెను. 'నేను దాని (కప్ప) తండ్రిని. ఇక్కడ నుంటిని. దాని నా సర్పము నోట బడనీయుదునా? దాని నెట్లు విడిపింతునో చూడుము.' - అని పలికి, ఆ బాటసారిని వెంటబెట్టుకొని సర్పమున్న తావునకు వెళ్ళితిని. అతడు ముందుగ వెళ్ళి పామునుజూచి భయభ్రాంతుడై తిరిగివచ్చి ఆ సర్పము మనపై బడునేమో! - మన మిచట నుండి పాఱిపోవుదము. దగ్గఱకు పోవలదు' - అనెను. అంత నేను దగ్గఱకు వెళ్ళి, ఆ పెనుగులాడు జీవులతో నిట్లంటిని. ఓయీ! వీరభద్రప్ప! యిప్పటికైన నీ శత్రువైన బసవప్పపై నీకు జాలి కలుగలేదా! అతడు కప్పగ నీవు సర్పముగ జన్మించితిరి. మీ అన్యోన్య వైరములకు సిగ్గుపడుడు! ద్వేషము విడిచి శాంతముగ బ్రతుకుడు!' అని పలికితిని.

ఆ మాటలు వినినతోడనే సర్పమా కప్పను విడిచెను. లోతు నీటి లోనికి జొచ్చి అదృశ్యమయ్యెను. ఆ కప్పయు వెడలి యొక చెట్టున దాగెను. ఆ మాటలు వినినంత సర్పమా కప్పనేల విడిచెను? - వీరభద్రప్ప యెవరు? బసవప్ప యెవరు? - వారి యిరువుర వైర కారణమేమి? ఆ విషయము నా కేమియు బోధపడలేదు. దానిని వివరింపుము' - అని ఆ బాటసారి నన్ను కోరెను. మేము తిరిగి నీడలోనికి వెళ్ళి పొగత్రావుచు ఆ విషయ మంతయు నిట్లెఱుక పఱచితిని.

నా నివాసమునకు 2, 3 క్రోసుల దూరమున నొక పవిత్ర క్షేత్రము కలదు. అందు శిథిలావస్థలో నున్న మహాదేవుని ఆలయము కలదు. ఆ గ్రామములోని జనులు దానిని పునరుద్ధరింప నిశ్చయించుకొనిరి. ఆ కార్యమునకై ధనము (చందాలు) ప్రోగు చేసిరి. ఒక ధనికుడు కోశాధి కారిగ నియమింపబడెను. అతడు 'జమా ఖర్చులు' - సక్రమముగ వ్రాసి యుంచువాడు కాని, అతడు పుట్టుకతోనే లోభి. ఆ కోవెల పునరోద్ధరణము పూర్తి కాలేదు. మరల ధనము ప్రోగు చేసిరి. కాని, ఆ దేవాలయము అసంపూర్తిగనే నిలిచెను. ఆ కోశాధికారి భార్య స్వప్నమున భగవానుడు పొడమి 'నీవు దేవాలయ పునరుద్ధరణకు వెచ్చించు ధనమునకు నూరు మడుంగులు శంకరుడు నీకు ప్రసాదించును' - అని తెలిపెను. ఆ విషయ మామె భర్తకు దెలిపెను. ఆ పని తనకు ధన వ్యయమగునని అతడు తలంచి,

ఆ మాటలకు పరిహసించి, 'అది ఒక కల మాత్రమే. దానిని విశ్వసించి మన మేపనియు జేయరాదు. కానిచో ఆ భగవానుడు నా దగ్గఱకు వచ్చి నా కేల తెలుపలేదు? నేను దూరముగ నుంటినా? అనెను.

మరల భగవానుడు ఆమె స్వప్నమున గోచరించి, ఆమె భర్త ధనముతో నెట్టి సంబంధము గల్పించుకొనక - ఆమెను తలంపుగలిగిన ఆమె సొంత ధన మేమేనియునున్న దానిని వెచ్చింపదగునని తెలిపెను. ఆమెకు స్త్రీ ధనము ఆభరణములు కలవు. కావున ఆమె తన భర్తకా స్వప్న వృత్తాంతమును దెలిపి, తన ఆభరణములను దైవమునకు సమర్పింతునని తన కోరిక తెలియజేసెను. ఆ లోభి ఈపనియందును దైవమును వంచింపదలచెను. ఆమె నగలు వేయి రూపాయిలు విలువగలవి. వానిని దీసికొని మహాదేవుని పేర భూమిని వ్రాసి యిత్తునని యాతడనెను. ఆ భూమియు నొక వితంతు వాతని దగ్గఱ అప్పు తీసికొని తాకట్టుపెట్టి వదలుకొనిన భూమి, అది సాగులేనిది. మంచి ఋతువు లందునే పంటయుబండని ఒక తీరపు భూమి. దాని నతడు ఆ దేవాలయ పూజారికి మహాదేవుని పూజార్థము ఈనాముగ వ్రాసి యిచ్చెను. అంతట నొక పెద్దతుఫాను ఉరుములు, మెఱుపులతో దాపురించి పిడుగులు పడెను. ఆ పిడుగుల వలన ఆ లోభియిల్లు దగ్ధమై కూలెను. ఆ దంపతులు మరణించిరి. మరుసటి జన్మమందా ధనికుడు మధుర (ముత్ర) యందు జనించెను. ఆమెకు 'గౌరి' యను పేరు పెట్టిరి. ఆ భూమి తాకట్టు పెట్టిన మనిషి (దుబాకి) మగవాడుగ జనించి 'బసప్ప' అను పేర బఱగెను. ఆ పూజారి వారసులకు దత్తుడయ్యెను. మధురలో జనించిన ధనికుడు "వీరభద్రప్ప" అను పేరున బిలువబడెను. ఆ పూజారి నాకు గూర్చు మిత్రుడు. తఱచుగ నా దగ్గరకువచ్చి పొగ త్రాగుచుండువాడు. అతని పుత్రికయు నాయందు భక్తి కలది.

ఆ పూజారి తన కూతురు వివాహమునకు తగిన వరుడెవరా! యని ఆలోచనలో పడి నన్నడిగినాడు. "నీవు ఆందోళన చెందవలదు. ఆమెను వివాహమాడుటకు ఒకడు నీ దగ్గఱకు వచ్చును" - అని నేను చెప్పితిని. వీరభద్రప్ప తన పేద తల్లిదండ్రులను విడిచిపెట్టి వెడలి ఆయా తావుల నన్నము భిక్షించుకొని తినుచు తుదకా మహాదేవుని పూజారి యింటికి

జేరెను. ఆ పూజారి కూతురును వివాహమాడుటకు సమ్మతించెను. వీరభద్రప్ప గౌరిని వివాహమాడెను. వీరభద్రప్పయు నా భక్తుడయ్యెను. కాని వాడెంత సేపు ధనలంపటుడు. అతని వివాహమునకు నేను కారకుడనని ఆతనికి ధనమును గూర్చు విషయమున తోడ్పడవలయునని నన్ను కోరెను.

"ఆగుము! మంచి కాలము రానున్నది" అని నేను పలికితిని.

ఆ తీరపుభూమి విలువ తలవని తలంపుగ హెచ్చెను. అది ఒక లక్ష రూపాయల కమ్మబడెను. సగము విలువ రొక్కము చెల్లింపబడి, తక్కిన సగము రెండువేలు చొప్పున 25 వాయిదాలుగ చెల్లించునట్లు నిర్ణయింపబడినది. అందఱు ఈ నిర్ణయమునకు సంతోషించిరి. అంతట వీరభద్రప్ప - బసప్ప ఈ ధనమును గూర్చి తగవులాడుకొనిరి. గౌరి - ఆ పూజారి ఆస్తికి ఏకైక అధికారిణి - యని నేను చెప్పితిని. ఆ ఆస్తిని గౌరి మాత్రమే ఉంచుకొనదగునని, దానిపై నితరుల కెవరికి హక్కు నంగీకరింపవలదని ఆమె కలగనెను. గౌరి నా రక్షణము నర్థించెను. ఆమెను సంరక్షించుటకు సప్తసముద్రములనైన దాటెదనని నేనామెకు అభయ మొసంగితిని. [ఆ జన్మమున బాబా సకలసిద్ధులు గలిగిన ఒక ముస్లింగా నుండి, మసీదులో నివసించువాడని తోచుచున్నది].

వీరభద్రప్ప - బసప్పతో కలహించి, యిరువురు నా దగ్గఱకు వచ్చిరి. వీరభద్రప్పను సమాధానపఱుపనెంచి విఫలుడనైతిని. అతడు నాపైనాగ్రహించి, మతిచెడి, బసప్పను కండతుండములుగ నరికి చంపుదునని బెదరించెను. పిరికివాడైన బసప్ప నా రక్షణ మర్థించెను. పగబూనిన వీరభద్రప్ప దురాగ్రహము నుండి రక్షింతునని 'బసప్పకు' నేనభయ మిచ్చితిని. దురాగ్రహావేశుండై మతి చెడిన వీరభద్రప్ప నన్ను, దక్కినవారలను చెడతిట్టి ఏవేవో శపథముల బలికెను. వీరభద్రప్ప చచ్చి సర్పమై జనించెను. బసప్ప మృతినొంది కప్పయై పుట్టెను. ఆపదలోనున్న "బసప్ప" కూయివిని, నా అభయ ప్రదానమును జ్ఞప్తికిదెచ్చుకొని, సర్పమైన వీరభద్రప్ప బారినుండి కప్పయైన "బసప్ప"ను రక్షించి నామాట నిలుపుకొంటిని. భగవానుడు నన్ను పంపి, తన భక్తుడైన బసప్పను కాపాడినాడు. ఇది యంతయు దైవలీల. (చూ. 1-3)

బాబా - పూర్వజన్మ స్మృతులు

బాబా పూర్వ స్మృతులు - (వయో నిర్ణయములేదు) నిబద్ధ పరిశ్రమ

474. నేనొక ప్రదేశమున కేగితిని. అచట పటేల్ నిర్బంధమున ఒక వనమును ప్రతిష్ఠించితిని - దానిలో కాలిబాట నేర్పరచితిని.

475. ఒక సమయమున నాకు గుండెదడ యేర్పడినది. ప్రాణాపాయస్థితి యందుంటిని. నా ఉరముపై విష్ణుసహస్రనామముల నుంచి కొనినాడను. భగవానుడు నా దేహములోనికి దిగివచ్చినాడు. ఆ వ్యాధి శమించెను. నేను సురక్షితుడనైతిని. (చూ. 198)

476. సా. బా: ఒకతఱి నేనొక బాలకుడను, తిండికి సంపాదించుకొన యత్నించితిని. వృత్తికై అన్వేషింపదొడంగితిని. 'బీడ్'- అనుచోటున కేగి జరీఅంచు వస్త్రములనునేయు వృత్తి సంపాదించుకొంటిని. నాపని యందెప్పుడు విసుగునొంది యెఱుగను. నా ఫకీరు (యజమాని) విధానములవలన అలపు తలంపు తోచలేదు. ప్రతిదినము నలుగురు పిల్లలు చేయు పని చేసినాడను. తడవకు నొకబాలుడు 50 రూపాయల వస్త్రములను, మఱియొకడు 100 రూపాయల వస్త్రమును, యింకొకడు 150 రూపాయల వస్త్రములను తయారు చేసిన నేను 600 రూపాయల వస్త్రములను తయారుచేసితిని. నా యజమాని సంతోషించెను. నన్ను ప్రేమించి, యితరుల యెదుట నన్ను ప్రశంసించినాడు. నాకు మంచి చక్కని దినుసులను, తలపాగ, శాలువ నుత్తరీయముగ నొసంగినాడు. వానిని నేనుపయోగించుకొనక ఇతరులకిచ్చితిని. ప్రభువు (దైవము) ఒసంగునది చివరిస్థాయి యగును. నరుడొసగునదికాదు.

"పరమేశుడిడిన దెప్పటికిని జెడదు-
నరుడొసంగునది యెన్నడు నిల్వబోదు".

477. నేను "కబీరు" నైయుంటిని. నూలు వడకువాడను.

478. నేను నలుగురు సోదరులను గలిగియుంటిని. ధనమంతయు పెద్దవాని ఆధీనమున నుండెను. అతని భార్య మమ్మందఱను పస్తుపెట్టి

నది. నేనొక వృత్తిని గుత్తకు తీసికొని ధనము సంపాదించి, సోదరులను పెద్దవానిని గూడ పోషించితిని. పెద్దవాడు కుష్ఠురోగియగుట నెల్లరు పరిత్యజించిరి. తరిమివేసిరి. నేనతనిని సేవించి అవసరముల దీర్చితిని. తుదకాతడు మరణించెను.

479. నేను 4 వేల జనులతో నుంటిని. అపుడొక అంటువ్యాధి వ్యాపించెను. అందఱు భయభ్రాంతులైరి. ఆ జనులందఱనూరడించి "మిమ్ము మృతినొందనిచ్చుటకు ముందు నేనే మృతి నొందుదును. మిమ్ము చావనిచ్చుట కంటె నేనే చత్తును" అని వారికి ధైర్యము గొలిపి, అభయ మిచ్చితిని.

480. ఈ షిర్డియందీ బాబా మసీదువున్న తావున "ముజఫర్ షా" అనువాడుండెను. అతని కుమారుడు నివసించు 'నాండుర్కి' - వరకు మైళ్ళకొలది అతనికి (ఆస్తి) భూసంపదగలదు. నేనతని దగ్గఱ వంట వానిగ నుంటిని. ఈ మసీదునందు 'ధుని' వెలుగుచుండు తావున నతడు మరణించెను.

481. ఒక భక్తుడు : నీ జన్మస్థానమేది?

సా. బా: (నవ్వుచు) అతడు పేరులేని పిచ్చివాడు. ఇపుడాతడెందో ఒకచోట నివసించు చుండును.

482. సా. బా: నా సోదరుడొకప్పుడు చెడుగా ప్రవర్తించెను. అందు చేనతడు కులమునుండి వెలిపెట్టబడెను. నేనాతని యోగక్షేమముల మరచితిని. తుదకు అతనిని కులమునందు జేర్చుకొన జేసితిని!

483. సా. బా: (1913) లో బాబా తన పూర్వ జన్మములలో నొక జన్మమునకు సంబంధించిన నొక దీర్ఘ గాథ నిట్లు తెలిపినాడు.

సా. బా: నేను ఔరంగబాదునుండి యిచటకు వచ్చితిని. నా మేనమామ నన్నిటకు వెంటగొని వచ్చినాడు.

భక్తుడు : ఆ మేనమామ పేరేమి? ఇపుడాతడెచట నున్నాడు?

మేమిరువురు సోదరులము. మేమొక మార్గమున బోవుచుంటిమి. నా సోదరుడు ముందుగ బోవుచుండెను. క్రూరజంతువు లాతనిగఱచినవి. వాడు మరణించెను. ఐదారుగురు మనుష్యులు నా దగ్గఱకువచ్చి 'నీ సోదరుడేడి?'- అని అడిగిరి. జరిగిన విషయ మెఱిగించి, యాతని శవముపై వస్త్రము కప్పితి ననియు జెప్పితిని. నా మాటలను విశ్వసింపక నేను వలదని చెప్పుచున్నను నా సోదరుని వెదకుటకై వెడలి వారలును ఆ జంతువులచే చంపబడిరి. తరువాత నొక స్థూల దేహముగల కాంత నన్ను జేరి యింతకు పూర్వము వారడిగిన ప్రశ్ననే యడిగి, నా సమాధానమును నమ్మక అన్వేషింపబోయిన ఆమెకును పూర్వము వారిగతియే కలిగెను. ఆమె శవముపై గుడ్డ కప్పితిని. అంతట నేను ముందునకు సాగిపోవుచుండ నారుగు రేడుగురు మహమ్మదీయు లొక గొఱ్ఱెతో నెదురైరి. వారు నాయెదుట దానిని చంపి, దాని మాంసమును బలవంతముగ నా నోటబెట్ట యత్నింపగ "దైవమును ప్రార్థించి భుజింతును" అని నేను పలికితిని. నేనా మాంసముపై నొక వస్త్రమునుగప్పి దైవమును ప్రార్థించితిని. ఆ మాంసము పెద్ద రోజాపుష్పములుగ మాఱెను. ఏ ఒక గులాబి పుష్పమునేని నీ అఱచేతిలో నిముడ్చుకొన జాలని యంత పెద్దది. ఆ ముస్లిములు వెడలిపోయిరి. నా మార్గమున నేను సాగితిని. కాలిబాటను నడచుచు స్వచ్ఛమగు అపార జలప్రవాహముచే నావరింపబడితిని. అచట మార్గము కనబడలేదు. ఇదియంతయు దైవ సంఘటనము.

సా. బా: (శ్యామావైపునకు దిరుగుచు) మన విధియేమి? సక్రమముగ ప్రవర్తింపుము- అది చాలును. వాడకు వెళ్ళుము- పారాయణము గావింపుము.

484. బాబా ఒకపరి యిట్లనెను. నేను బాలుడుగ నున్నపుడు శాలువులు నేయుచుంటిని. నా పని నేర్పునకు నా తండ్రి మెచ్చుకొని నాకు 5 రూపాయలు కాబోలు! బహుమతి నిచ్చినాడు.

485. నేనొక సమయమున తూర్పు తీరమున (కోరమాండల్ తీరమున) భుజించుచుంటిని. (నివసించుచుంటిని).

486. సా. బా: అహో! అక్బరు విషయమేమి? అతనిని శైశవమున రక్షించితిని. నన్నుగాంచి ఆశ్చర్యచకితుడైనాడు.

487. ఆ పైరాను బ్రాహ్మణుని (ఏకనాథస్వామిని) నే నెఱుగుదును. అట్టి సర్వోత్తములైన బ్రాహ్మణులను మనమీరోజులలో జూడజాలము.

488. 'గుఱ్ఱము నెటకు దోలితివి?' - అని అడుగుచు "చాన్‌భాయి పటేల్" నా దగ్గఱకు వచ్చినాడు.

"నన్నేల నిందించెదవు? వెళ్ళి చూడుము! నీ గుఱ్ఱమా పొదచాటున మేయుచున్నది" - అని సమాధాన మిచ్చితిని. (ఆ అశ్వమచట నుండెను)

489. సా. బా: (బాలకృష్ణ ఉపాసనీశాస్త్రితో) ఝాన్సీ మహారాణి పాల్గొనిన యుద్ధమునందు నేనుంటిని? నేనా సేనలో నుంటిని.

490. ధనికుడగు నా తండ్రికి ధనపు పాతరలుండెను. నేనొక దానిపై గూర్చుంటిని. ఒక పెద్ద త్రాచునైతిని. కొంత కాలమైన పిదప ఆ ధనమును విడిచిపెట్టితిని తిరిగి మనుష్యరూపము నొందితిని.

491. సా. బా: (జి. యస్. కపర్దేతో) నేనిచట షిర్డిలో - (లేక గోదావరీతీరమున) 8 (లేక) 10 వేల సంవత్సరముల పూర్వమున నుంటిని.

492. ఈ ప్రదేశమున నొక ముసలి పటేల్ ఉండెడివాడు. అతడు నా దగ్గఱకు వచ్చుచుండువాడు. వేగువాండ్రు 4 (లేక) 12 మంది కని పెట్టియుండువారు. ఆ ముసలివానితో వారికి అభిప్రాయ భేదము కలిగెను. ఒకపరి వారతనిపై కలియబడిరి. అప్పుడా ముసలివానికి నేను తోడ్పడితిని. ఒకపరి వారతనిపని పట్టదలచి బలవంతముగ నీడ్చుకొని ఒక పెద్ద నగరము నకు గొనిపోయిరి. నేను జోక్యము కల్పించుకొని ఆ ముసలివానిని విడిపింపజేసితి.

493. నా చిన్నతనమున 'జాల్నా 'నుండి చాల దవ్వు వెళ్ళుచుంటిని. మార్గమున నొక మామిడి చెట్టుండెను. దాని పండ్ల కన్నిటికి పురుగులు పట్టెను. ఆ చెట్టు బోదెలో యినుప మేకులు దిగగొట్టితిని. ఆ లోపము చక్కబడెను. ఆ పిదప పండ్ల కా పురుగుల బాధ కలుగలేదు.

494. సా. బా: నేను - (అంగోన్కావాడ్ నివాసి) సఖారాం - ఇరువురము నొక గురువు దగ్గఱ విద్య నభ్యసించితిమి. మా చేతులతో మామిడి మొక్కలను నాటితిమి. నే నిపుడు (1910 లో) ఆ చెట్ల నుండి రెండు పండ్లను నీకు (కనిత్కార్‌సతికి) పంపినాడను.

ఆ మఱునాడు కనిత్కార్‌సతి ఆమె మార్గమున కోపర్గామునకు జేర నచట దేవాలయములోని బ్రహ్మచారి 'బాబా నీ కొరకు వీనిని పంపినాడు' అని చెప్పుచు, ఆ పండ్లను ఆమె కొసగెను.

495. నా చిన్నతనమున ఒకనాటి ఉదయమున వెలుపలకు వెళ్ళితిని. అదాటున ఒక బాలికగ మారితిని. ఆ పిదప కొంతకాల మా విధముగ నుంటిని.

(పూర్వజన్మమున) బాబా సాధనము

496. నేను మిక్కిలి కష్టించితిని. నెలల పర్యంతము భోజనము లేక వేప మొదలగు చెట్ల ఆకులను తిని జీవించితిని. దైవము నా యెడ దయ వహించినాడు. దేహమున రక్తమాంసములు క్షయించి శల్య మాత్రావశిష్టుడ నైతిని. ఎముకలు సైతము చూర్ణముగానున్న స్థితి పట్టినను ప్రాణము నిలిచినది.

నిరంతర నిస్స్వార్థ సేవ

497. ఒక తోటలో 200 మంది రోహిల్లాలకు ఈతకల్లు విక్రయించుచున్న ఒక కన్యను నా తండ్రి చూచి ప్రేమించి (లేక) వివాహమాడి ఆమెవలన పుత్రులను బడసెను. ఆమె ఆతని ననుసరింపక యితరుల పలువుర ప్రేమించెను. ఆమె పాదములకు పురుగు లేర్పడెను. ఆమె నా తండ్రికి భార్య యగుటచే నామె పాదములకు చికిత్సచేసి వానిని చక్కపఱచితిని. తరువాత ఆమె మరణించెను.

498. వస్త్రములు - తలపాగలు - పీతాంబరములు - తివాచీలు మొదలగు వానిని నేసితిని. కాని, యిన్ని పనులు చేయజాలియు తిండి గడచినదికాదు.

499. నా తల్లి తనకు కుమారుడు (నేను) కలిగినాడని మిక్కిలి ఆనందించు చుండినది. ఆమె ప్రవర్తనమును గూర్చి నాలో నే నాశ్చర్య పడుచుండువాడను. 'ఆమె నన్నెప్పుడు కన్నది? నే నెప్పుడేని జన్మించితినా? నే నెల్లప్పుడు నున్నవాడను కానా? దీనిని గూర్చి ఆమె యేల ఆనందించు చున్నది?' - అని.

499-ఎ. నడుము దిగువ భాగము చిలుక రూపము తాను పొంది నట్లు బాబా తెలిపినాడు.

ఋణానుబంధము

ఋణానుబంధమునజేసి జనులను బాబా
తన దరి కాకర్షించువాడు.

1. నా. గో. చందోర్కర్

500. నానా : బాబా! నన్నేల పిలువ నంపితివి?

సా. బా: ఈ ప్రపంచమున వేన వేలు గలరు. నేను వారందఱను పిలువనంపుదునా? నిన్ను పిలువనంపుటకు ప్రత్యేక కారణములు ఉండవలదా?

నానా : ఉండవచ్చును. నే నెఱుగజాలకున్నాడను.

సా. బా: నానా! నాలుగు జన్మముల నుండి మన మిరువురము సంబంధము కలిగి యున్నారము. అది నీ వెరుగవు. కాని, నే నెఱుగుదును. కావున నీకు అవకాశము గలిగినపుడు ఇక్కడకు వచ్చుచుండుము.

500-ఎ. సా.బా: ఒక బావి కలదు. దానిదరి నొక చెట్టుగలదు. ఆ చెట్టుపై రెండు పక్షులు కూర్చుండెను. ఒకటి జారి బావిలోపడి మునుగు చుండెను. దాని ప్రియ మిత్రము దానిని రక్షించుటకు వెంటనే బావిలోనికి దుమికెను. రక్షింపదుమికిన మిత్రమునకు ప్రాణము పోవునంత పనియైనను మొదటి దానిని రక్షించెను.

2. భగవంతరావు క్షీరసాగర్

501. సా.బా: విఠోబాను ఇతని తండ్రి సేవించి నట్లితడు సేవింపడు, నైవేద్యము సమర్పింపడు. నన్ను - విఠ్ఠలుని పస్తుపెట్టుచున్నాడు. ఈతని తండ్రి నా మిత్రుడు. కావున విఠోబాపూజ తిరిగి ప్రారంభింప జేయించుట కితని నిచట కాకర్షించితిని.

502. (3) పూర్వ మొక జన్మమున నేను, నీవు (జి.యస్. కపర్దే), జోగ్, కాకా (హ. సీ. దీక్షిత్తు), శ్యామా, దాదాకేల్కార్ - అందఱము కలిసి చీకటి వీధియందు మన గురువుదగ్గఱ నున్నవారము. వీరల నందఱ నొక చోటునకు మరల జేర్చినాడను.

(4) నానా! ఈతడొక బొక్కసము (పెట్టె) మన దగ్గర నుంచినాడు. ఇపుడు దానిని తిరిగి కోరుచున్నాడు. దానిని నిరాకరించుట తగదు. (అనగా— పూర్వభవమున నితడు మనకొక మేలు కావించినాడు. మన మిపు డీతనికి తిరిగి మేలు చేయవలయును). చూ. 227.

5. తరిమివేయుట తగదు

503. ఋణానుబంధము (పూర్వజన్మ సంబంధము) లేనిదే యెవరు మనదగ్గరకు రారు. కావున కుక్క- పిల్లి- పంది- ఈగ లేక యే మనుష్యుడు మన దఱికిజేరిన 'ఛీ - ఛీ' అని 'పో పో' అని తరిమివేయకుము.

6 జంతువుల ఋణానుబంధము

504. సా. బా: (పులి మరణించినపుడు ప్రదర్శకునితో) పూర్వ జన్మమున నీకు ఆ పులి చెల్లించవలసిన ఋణమిప్పుడు తీరినది.

బాబా – తా నీ జన్మమున బ్రాహ్మణుడ నని సూచించుట

505. (ఎ) ఇది ఒక బ్రాహ్మణ మసీదు

(బి) ఇతడొక బ్రాహ్మణుడు. పావన బ్రాహ్మణుడు. వేన వేలు ప్రజలను శుభ్రమార్గమున మోసికొని పోగల స్వచ్ఛమైన బ్రాహ్మణుడు.

506. (ఎ) (బాబాకు 8 అణాలు సమర్పింప దలచి 4 అణాలు మాత్రమే యిచ్చి వెనుకకు మఱలిన 'చాబల్‌పతి' తో) అమ్మా! ఆ మిగిలిన 4 అణాలనీయక పేదబ్రాహ్మణుడనైన ఈ నన్ను మోసగింపనేల?

(బి) సా. బా: వి. సి. యస్: బాబాకు సమర్పింపుమని యిచ్చిన 2 అణాలు నిచ్చుట మఱచి, తిరిగి వెళ్ళుటకు సెలవీయమని బాబాను కోరిన యస్. బి. నాచ్నేతో మంచిది! 'చితాలీ' మీదుగ పొమ్ము. కాని, ఒక పేద బ్రాహ్మణుని 2 అణాలు మోసగింపనేల?

బాబా – భక్తులయెడగల ప్రేమ

1. బాబా – ప్రేమను అభినందించుట

(ఎ) వినాయక్. యస్. గిరిధర్ (మాలాద్ నివాసి)

507. వి. యస్. గిరిధర్ భార్య బాబాయందు అపార భక్తి గలిగిన సాధ్వి. ప్రత్యేక శ్రమ తీసికొని ఒక చక్కని పూలమాల సిద్ధపఱచి తన భర్త ద్వారా బాబాకు పంపెను.

బాబా ఆ పుష్పమాలను అత్యాదృతితో స్వీకరించి, కంఠమున ధరించి, చాలసేపు ఆ విరిదండ నుంచుకొనెను.

సా. బా: ఇది అత్యధిక భక్తితో సిద్ధపఱుపబడినది. ఈ విధముగ ప్రతి వారము నీ యింట నా పటమునకు ఒక పూలమాల నర్పింపుమని ఆమెకు చెప్పుము.

(చూ. టెండుల్కర్ సతి – వకుళ పుష్పమాలలు)

(బి) ఆర్. బి. పురందర్.

508. (1) సా. బా: నేనాతని మఱువను. అతడు 2 వేలమైళ్ళ దూరమున నున్నను జ్ఞప్తియందుంచుకొందును. ఉబ్బసము – అయాసము హెచ్చుగనుండెను, అతని విడిచి యే లవమేనియు భుజింపను.

సా. బా: పురందర్! గృహమును కట్టుకొనుము. ఎవరిని నొక పైసా కూడా అడుగవలదు. నేనే నీకు సహాయము చేయుదును.

అంతట పురందర్ తన ఆఫీసులో 500 రూపాయలు అప్పు తీసికొని ఒక ఇల్లు కట్టుకొనెను. అది ఊరి వెలుపల పొలములోనున్న ఏకాంత గృహము.

సా. బా: నీ వేమియు భయపడవలదు. నేను స్వయముగ నచట గూర్చుండి నీ యింటిని నీ పిన్నవయస్సున నున్న భార్యను కాపాడుచుందును.

(ఆ దంపతులు ఊరి వెలుపల నేకాంతముగ నివాసమున్నను వారికెట్టి ఆపదలు కలుగలేదు).

3) 1915లో బాబా చాల జబ్బుగనుండెను. ఉబ్బసము, ఆయాసము హెచ్చుగ నుండెను. ఈ జబ్బు విషయ మెఱుగకయే పురందర్ షిర్డికి వెళ్ళి బాబా మిక్కిలి ఆయాసపడుట చూచి ఏడ్చెను.

సా. బా: నీ వేల ఏడ్చెదవు?

పురందర్ : బాబా! నీయీస్థితిజూచి నేను సహింపజాలకున్నాడను.

సా. బా: భయపడకుము. 2, 4 దినములలో చక్కబడును. అల్లా నాకీ వ్యాధి నొసంగినాడు. ఈ గడువులోపల తిరిగి స్వస్థత కలిగించును. నీవు దుఃఖింపవలదు. 2, 3 రోజులనుండి నిన్ను గూర్చి తలంచుచున్నాడను. నిన్నిటకు రమ్మని ఉత్తరము వ్రాయవలసినదిగా కాకా (హ. సీ. దీక్షిత్తు) తో చెప్పినాడను. (ఆ ఉత్తరము అందు లోపలనే పురందర్ షిర్డికి వెళ్ళెను).

4) ఆర్. బి. పురందర్ తల్లి పండరికి వెళ్ళి విఠోబాను దర్శింప దలచెను.

అపుడు పురందర్ తల్లికి, పురందర్ భార్యకు విఠోబా రుక్మిణీ రూపమున షిర్డిలోని మసీదునందే బాబా దర్శన మిచ్చెను. వారు సంతృప్తి నొందిరి.

సా. బా: (తరువాత) అమ్మా! నీవు పండరికి ఎపుడు వెళ్ళుదువు?

పురందర్ తల్లి : నా దైవము షిర్డిలోనే యున్నాడు. ఇదియే నా పండరి.

(షిర్డిమాయే పండరిపూర్ - సాయిబాబా రమావర్)
(ఆరతి గేయము)

5) సా. బా: (పురందర్‌తో) నీవెల్లవేళల సత్యమును పాటింపుము. నీ విచ్చిన మాటను చెల్లించుచుండుము. గాఢవిశ్వాసము - ఓర్పు - గలిగి యుండుము. అపుడు నీ వెక్కడనున్నను ఎల్లవేళల నేను నీ వెంటనే యుందును.

పురందర్ : బాబా! దయతో నన్నట్లు ప్రవర్తింపజేయుము!

సా. బా: నీవేసమయమున కలహించి పోరాడకుము. నీ వితరులతో కలహించునపుడు నేను విసుగునొంది బాధపడుదును. (చూ. 289)

509. బాబా నిత్యము భిక్షించు గృహములలో నందరామ్ - యస్. మార్వాడి - గృహమొకటి. షిర్డియందు ప్లేగువ్యాధి వ్యాపించి నందరామునకు జ్వరము తగిలెను. అతడు భయపడి షిర్డి విడిచి వెళ్ళ దలచెను. (చూ. 37)

సా. బా: వెళ్ళవలదు. నీవు మరణింపవు. నేను తనువు విడుచు వరకు నిన్ను మృతినొందనీయను.

బాబా అతనికి ఉదిని ప్రసాదించెను. అతని జ్వరము తగ్గెను. అతడింకను [1940 నాటికి] జీవించియే యున్నాడు.

510. 1914 శ్రీరామనవమియందు లక్షల జనము బాబా చుట్టు జేరిరి. ఒక వృద్ధురాలు బిగ్గఱగ అఱచుచుండెను.

వృద్ధురాలు : ఓ బాబా! ఈ ముదుసలిదానిపై కరుణ వహింపుము. ఓ బాబా! నీ దర్శనము నాకు ప్రసాదింపుము.

శ్యామా వెలుపలకువెళ్ళి జనసమూహమును త్రోసికొనుచు, ఆ వృద్ధురాలిని బాబా సన్నిధికి గొనివచ్చెను. ఆమె సంతోష బాష్పములను స్రవించుచు, తన రెండు చేతులతో బాబా నడుమును బంధించెను.

సా. బా: అమ్మా! నీకొరకెంత కాలమునుండియో వేచియుంటిని. నాకు ఏమేని తినుటకు తెచ్చితివా?

వృద్ధురాలు : ఇదిగో చలిది రొట్టెముక్క - ఉల్లిగడ్డ. నేనొక రొట్టె, రెండు ఉల్లిగడ్డలను తీసికొని ప్రయాణమై వచ్చితిని. ఈ ఉదయము ఆకలి నొంది ఒక ఏటి దఱినిజేరి సగము రొట్టె నొక ఉల్లిని భక్షించితిని. శేషించినవి యివిగో - వీనిని నీవు భక్షింపుము.

సా. బా: [ఆ చప్పని రొట్టెముక్క నమలుచు అత్యాసక్తితో తినుచు] అమ్మా! నీ రొట్టె ఎంత మధురముగా నున్నది! [చూ. 515]

511. 1913 న నామసప్తాహము జరుగు సమయమున పలువురు భక్తులు గుంపులు గుంపులుగ బాబాను క్రమ్ముకొని కూర్చుండిరి.

సా. బా: శ్యామా! వెలుపలకు వెళ్ళుము. ఆ గోడకు వెలుపల నొక వృద్ధుడు కూర్చున్నవాడు. అతని దగ్గర కలకండ కలదు. నాకై కొంచెము కలకండ అడిగి తెమ్ము!

శ్యామా వెళ్ళి ఒక ముదుసలి వానిని జూచెను. అతని నోటినుండి చొంగకారుచు, రొమ్ముపైగల కురుపునుండి చీము స్రవించుచు ఈగలు క్రిమ్ముకొని యుండెను. శ్యామా జన సమూహమును ద్రోసికొనుచు ఆ వృద్ధుని వెంటగొనివచ్చి, "అతడిడుగో!" - అనెను. బాబా తన అభయ హస్తము నతని మస్తకముపై జేర్చి, ఆశీర్వదించి, అతని మూటనుండి కొంచెము కలకండ తీసికొని, శేషించినది (ప్రసాదముగ) కొనిపొమ్ము" - అనెను.

512. 'బస్సీను' నివాసి, వఖర్కర్ – బాబా కొఱకు ఒక అరటి పండ్ల గెలను పంపెను. ఆ గెలను మోసికొని వచ్చినవాడు దాని నొసగక బాబా ఎదుట దూరముగ నిలిచియుండెను.

సా. బా: ఓయీ! (ఆ గెల తెచ్చిన మనిషితో) ఆ గెలనుండి ఒక పండు తీసియిమ్ము! అతడు (వఖర్కర్) ఇంతవరకు భోజనము చేయలేదు. బాబా అరటిపండు భక్షించినాడని తంతి పంపుము! అపుడతడు భుజించును.

బాబా అపుడు పలికిన మాటలే వఖర్కర్ తనతో జెప్పినట్లు ఆ గెల తెచ్చినవాడు జ్ఞప్తికి దెచ్చుకొనెను.

513. 1915 జనవరిలో సంక్రాంతికి 8 రోజులు ముందు –

సా. బా: సంక్రాంతికి హల్వా పంపుము.

వార్తాహరుడొకడు మిఠాయి కొట్టునకు వెళ్ళి తిరిగివచ్చి "సంక్రాంతి యింక 8 రోజులుండుటచే దొరకలేదు" - అనెను.

సా. బా: సంక్రాంతి హల్వా నాకిపుడు కావలయును.

వార్తాహరుడు మిఠాయి అంగడికి వెళ్ళెను. అప్పుడే తపాలా మనిషి ఒక బంగీ తెచ్చి బాబాచేతి కిచ్చెను. భక్తుడొకడు ప్రత్యేకించి సిద్ధపఱచి ముందుగ రుచి చూచుటకై పంపిన (టిల్‌గుల్) సంక్రాంతి హల్వాగల బంగీ అది. బాబా తన అంతర్‌జ్ఞానమున అది ఎప్పుడు పంపబడినది - యెప్పుడు చేరినది తెలిసికొన గలిగినాడు.

514. సా. బా: నాకు (కాచేరి) వంకాయ కారపు - కాయ కావలయును.

అవి అపుడు అంగడిలో లేవు. పురందర్‌భార్య కెవరో వంకాయలు పంపుటచే నామె బాబా కొఱకు (వేపుడు) కారపుకాయ సిద్ధము చేయుచుండెను. ఆ విధముగ నెవరు అడుగకయే తనకు అందింపబడిన ప్రేమపూర్వక బహూకృతిని గుర్తించి బాబా తన అభీష్టములను తెలిపినాడు.

515. సా. బా: (గోవింద బాలకరాం మాన్కర్‌తో) నా కొఱకు ఏమైన నీవు తీసికొని వచ్చితివా?

గో. బా. మా: ఏమియు తీసికొనిరాలేదు - బాబా.

సా. బా: నాకై తీసికొని వెళ్ళుమని ఎవరు నేమియు నీయలేదా?

గో. బా. మాన్కర్ : లేదు - బాబా!

సా. బా: నాయనా! నీవు బాంద్రానుండి బయలుదేరునపుడు ఆ తల్లి ఆర్. ఎ. తార్కాడ్‌సతి అత్యంత భక్తి ప్రేమలతో నా కిమ్మని మిఠాయి (లడ్డు) నీకీయలేదా?

గో. మాన్కర్ : అవును - బాబా! ఇప్పుడు నాకు జ్ఞాపకమునకు వచ్చినది.

ఇంతకు ఆ లడ్డు ఎప్పుడో తయారు చేయబడి, బాంద్రాలో బాబా పటమునకు నివేదింపబడినది. మాన్కర్ ద్వారా బాబాకు పంపుటకు ఇతర మేమియు నప్పటికి లేనికారణమున ఆ తార్కాడ్‌సతి అత్యంత భక్తిప్రేమలతో ఆ పాత మిఠాయి పంపినది.

516. బాబా ద్వారకమాయి మసీదునందు మధ్యాహ్నమున ఆసీనుడై యుండగ పలువురు భక్తులు పెక్కుపళ్ళెరములలో నైవేద్యములను గొనివచ్చి బాబాముందు పెట్టిరి. కాని, బాబా వాని నేమియు తాకలేదు. జి. యస్. కపర్దేసతి పళ్ళెరములో నైవేద్యము తెచ్చి బాబాముందుంచిన తోడనే బాబా ఆ పదార్థముల రుచి చూచెను.

శ్యామా : దేవా! ఏమిది? యిది యెట్టివేర్పాటు? ఇతరులు తెచ్చిన వానిని నీవు తాకనైన తాకలేదు. ఈ తల్లి పళ్ళెరమున నైవేద్యము తెచ్చిన తోడనే రుచి చూచుతివి!

సా. బా: ఈమె (జి. యస్. కపర్దేసతి) పూర్వమొక వైశ్యుని గోవు (నాకు) సమృద్ధిగ క్షీర మొసంగినది. తరువాత తోటమాలి కూతురుగ జనించి, క్షత్రియుని దగ్గఱ జేరెను. అపుడొక కోమటిని వివాహమాడెను. ఆ పిదప ఆమె బ్రాహ్మణ జన్మమొందెను. చాలాకాలము గడిచిన పిదప ఆమెను మరల జూచుచున్నాడను. ఆమె నాకొసగు నాహారము (అపార ప్రేమ రసమిశ్రితమై) మిక్కిలి మధురముగ నుండును.

517. దుర్గంధము గలిగి దుర్బలుడైన ఒక కుష్ఠురోగి తన మురికి గుడ్డ కొంగున పాలోక్వా (పేడా) పొట్లమును మూట కట్టుకొని, దానిని బాబాకు బహూకరించి, యందు కొంత తిరిగి ప్రసాదముగ స్వీకరించు తలంపుతో ద్వారకామాయి మసీదుమెట్లను మెల్లగ నెక్కుచు, 'ధుని' దగ్గఱకేగి ఉధినిజేకొని బాబాచేతియందుంచెను. సిగ్గు, భయములు పీడింప ఆ పేడా పొట్లము బాబాకు బహూకరింపకయే మరలి వెళ్ళుచుండెను. బాబాదగ్గఱగ గూర్చున్న ఒకకాంత (సదాశివతార్కాడ్‌సతి) ఆ చెడుకంపు కొట్టుచున్న ఆ కుష్ఠురోగి వెడలిపోవుట చూచి "బ్రతికితిమి స్వామీ! యీ పీడ వదలిపోయినది" అని, తనలో దలంచెను.

సా. బా: (ఆమె వైపునకు తీవ్రము నిసితమైన దృష్టిని ప్రసరించుచు) ఓయీ! ఆ మనిషి నిటు తిరిగి పిలువుము!

ఆ కుష్ఠురోగివచ్చి, ఆ మిఠాయి పొట్లము తన చేతులలోనే యుంచుకొని ప్రణమిల్లెను.

సా. బా: (ఆ పొట్లము తీసికొని విప్పి) అహో! ఏమి యిది? (పేడా) మిఠాయియా?

సా. బా: అందు కొంచెము తీసి తార్కాడ్‌సతికి యిచ్చి దీనిని భక్షింపుము.

అంతట బాబా ఆ మిఠాయిలో కొంచెము తన నోటిలో వేసికొనెను.

ఆ సతికి వచ్చినంతపనియైనను, తోడి జీవులందు సానుభూతి గురువునందు గాఢ విశ్వాసము వహింప వలయునను పాఠమును తనకీ రూపమున బాబా బోధించుచున్నాడు – అని తలచి ఆమె ఆ మిఠాయిని మ్రింగెను.

సా. బా: (అందు మిగిలిన మిఠాయిని ఆ కుష్ఠురోగికి తిరిగి యిచ్చుచు) ఈ ప్రసాదమును తీసికొని పొమ్ము!

1. నిర్మల మనస్సుతో సమర్పించు బహుమతులు

ఎ. (గార్డే – మామిడి పండ్లు – పండిట్ – శేషించిన లడ్లు)

518. కె.కె. గార్డే, బి.ఎ.,యల్.బి., (నాగపూరు సబ్జడ్జి ఉద్యోగము నుండి విరమించిన వాడు) పూనాలోని 'రే మార్కెట్' నందు మంచి చక్కని మామిడి పండ్లు మూడింటిని గొనితెచ్చి వానిని బాబాకు సమర్పించెను.

సా. బా: (వానిని స్వీకరించుచు) అహో! ఇతడు (గార్డే) అంగడిలో నా కొఱకు కొనిన పండ్లన్నియు, మొన్న ఆ పండిట్ చేసినట్లుగాక (వీనిలో నేమియు తాను భక్షింపక) తీసికొనివచ్చి సమర్పించినాడు. పండిట్ పొట్లము లో కట్టిన లడ్లన్నిటిని నా కీయవలయునని తీసికొనివచ్చుచుండెను. కాని, మార్గమున గోదావరిలో స్నానముచేసి ఆకలి నొంది ఆ పొట్లములోని లడ్లలో కొన్నిటిని తిని శేషించినవి తెచ్చి నా కిచ్చినాడు. ఈ ఫలములు ఆ లడ్లవలె 'భుక్త శేషములు' కావు.

బి. మలిన మనస్సుతో నొసగు బహుమతులు

భికూబాయి – పూలమాల – కర్బూజ ఫలములు, పాలోఁకవా

519. భికూబాయి బయ్యాజి పటేల్ అహమ్మద్‌నగర్ నుండి షిర్డీకి తిరిగి ప్రయాణమై పూలమాల, కర్బూజా ఫలములు, దూద్‌పేడా వెంటగొని వచ్చుచుండెను. కోపర్గామునందు గోదావరి నదిని దాటెను. తన సఖియొక్క దుర్మరణమును జ్ఞప్తికి దెచ్చుకొని అచట నేడ్చుచు, తన సఖిని ఆ దుర్మరణము నుండి రక్షించినవాడు కాడని, బాబాను తన మనస్సున నిందించెను. కాని, షిర్డికిజేరి బాబాకు ఆ తెచ్చిన వస్తువులు బహూకరించునపుడు అట్టి తలంపు లన్నిటిని మఱచియే యుండును.

సా. బా: ఈ (తల్ - తల్) మానసిక వ్యాకులతతో గూడిన పూల మాల నాకు వలదు.

అంతట నామె ఆ పూలమాలను రెండు చేతులతో తీసికొని బాబా మెడలో నిలుప దగ్గఱకు జేరెను. ఆశ్చర్యముగ ఆ పూలమాల ముత్తునియలై ఆమె రెండు జేతులలో రెండు ముక్కలు నిలిచి, నేలపై నొక ముక్క పడెను. అంతట ఆమె కర్బూజ ఫలములను, పాల్కోవాను సమర్పింపబోయెను. బాబా వానిని నిరాకరించెను.

సా. బా: ఈమె గోదావరి తీరమున దుఃఖించుచు కన్నీరు కార్చుచుండెను. అట్టి వ్యాకుల మనస్సుతో వీనిని తీసికొని వచ్చినది - కావున వీనిని స్వీకరింపను.

సంశయాత్మక బహూకృతులు

కనిత్కార్ కాంత – ద్రాక్ష ఫలములు

520. కనిత్కార్‌సతి తన పుత్రికలతో గూడి బాబాకు సమర్పింప ప్రత్యేకముగ మిక్కిలి ప్రేమతో మంచి ద్రాక్ష ఫలములను బుట్ట నిండుగ తీసికొని వెళ్ళెను.

సా. బా: (కరుణాస్వరమున) నీవేమి తీసికొనివచ్చితివి? ద్రాక్షలా!

క. సతి : అవును బాబా! నీ కొఱకు వానిని నాశిక్‌నుండి తెచ్చితిని.

అంతట నామె ఆ పండ్లబుట్టను బాబాకు సమర్పించెను. బాబా ఫలములు కొన్ని త్రిప్పిచూచుచుండగా - ఆమె కూతురు - బానుతాయి "ఈ పండ్లన్నియు బాబాచే పంచిపెట్టబడి వ్యర్థము కానున్నవి" - అని తలంచెను

సా. బా: (ఆ బుట్టను కనిత్కార్‌సతివైపునకు త్రోయుచు) నీబుట్టను నీవు తీసికొనిపొమ్ము!

కనిత్కార్‌సతికి ప్రైప్రాణములు పైన పోయినట్లయ్యెను. ఆ తల్లి పొందిన మానసిక బాధను బాబా గుర్తించి ఆ బుట్టనుండి యెండిపోయి పనికి రానిపండ్లను కొన్ని తీసికొని, శేషించిన వానిని తిరిగి యిచ్చుచు "యిపుడు పొమ్ము! నీ బిడ్డలను వీని దిననిమ్ము" - అనెను.

కనిత్కార్‌సతి, ఆమె కుమార్తెలు ఆ పండ్లబుట్టతో తిరిగి పోవుచుండగా "అమ్మా! నా కట్టి ఆలోచన ఏల కలిగెనో నే నెఱుగను. నీ వాబుట్టను

బాబాకు బహూకరింపగా "ఏమి! యీ పండ్లబుట్టనంతయు నిచ్చినదే! క్షణములో నివియన్నియు పంచిపెట్టబడును. బాబా ఏమియు తినడు. మన క్షేమియుదక్కవు- అని తలంచితిని" అని బాసూతాయి తల్లితో పలికెను.

బాబా చర్యలు - పలుకులు - ఆ తల్లియొక్క ఆశయము - ఆమె బహూకృతిని గూర్చిన తలంపు - ఆ కూతురు యొక్క అనిష్టత వలన చెలుప బడినదిగ విశదీకరించునట్లు గమనింపదగును.

2. బాబా - భక్తుల కొఱకు స్వార్థత్యాగము

(ఎ) బల్వంతు జి. కపర్దే ప్లేగువ్యాధిని తన చక్కికి బాబా ఆకర్షించుకొనుట.

521. 1911 - 12 లో షిర్డియందు ప్లేగువ్యాధి వ్యాపించెను. జి. యస్. కపర్దే - కుమారుడు బల్వంతునకు (ప్లేగు సంబంధమైన) జ్వరము తగిలెను.

జి. యస్. కపర్దేసతి : బాబా! మేము వెళ్ళుటకు సెలవిమ్ము?

సా. బా: మబ్బులు క్రమ్మినవి, పిదప వర్షించును. అంత పైర్లు పెరిగిపండును. మబ్బులు విచ్చును. నీవు భయపడనేల?

కపర్దేసతి బాబాపలుకులను గ్రహింపలేక వెడలిపోయెను.

తరువాత బాబా తన కుపినీ పైకెత్తి తనకడుపు మీద ప్లేగు బొబ్బలను చూపుచు - "అమ్మా! చూడుము! నీ కష్టములను నివారించుటకై నేను మీ కొఱకు కష్టపడవలయును.

బల్వంతు తనువునుండి ఆ ప్లేగు బొబ్బల జ్వరమును బాబా ఆకర్షించు కొనెను. బాబా జ్వరముతోడ బల్వంతు జ్వరము రెండు, మూడు దినములలో శమించెను.

గమనిక : ఈ విధముగ 'గోవా' లోని పోలీసు సూపరింటెండెంటు ప్లేగువ్యాధిని గూడ బాబా తన చక్కికి ఆకర్షించుకొనినాడు.

(బి) బాబా – తన కంఠమును సమర్పించుట.

522. ఆర్.ఎ. తార్కాడ్- కంధహార్ నివాసి మీర్జమాన్, యింకను యితరులు చావడిలో బాబాసమీపమున నిద్రించు చుండిరి. మీర్జమాన్ అర్థరాత్రమున నిద్రలేచి బాబాతో నిట్లనెను.

మీ. జ: బాబా! ఈ హైందవులు నిన్ను - ఇస్లామ్ మతమును చెఱచు చున్నారు. నా కనుజ్ఞ నిమ్ము! నా ఖడ్గముతో వీరి యందఱి కంఠములను క్షణములో తెగ్రవేయుదును.

సా. బా: నేను (పాగల్) పిచ్చివాడను. నన్ను సేవించు నీ హైందవులు పిచ్చివారు. వారి అత్యాచారములకు నేను బాధ్యుడను. నా ప్రవర్తనమునకు వారు బాధ్యులుకారు. నీవెవరి కంఠమునేని తెగ్రవేయు దలచితివా - నా కంఠమునే తెగ్రవేయుము.

అది మొదలు మీర్జమాన్ శాంతి వహించెను.

(సి) బాబా – ఆరోగ్య త్యాగము

523. సా.బా: 1910 (జి. యస్. కపర్దేతో) 2 సంవత్సరముల నుండి నేను రొట్టె - నీరము మాత్రము గొనుచు జబ్బుపడి యున్నాడను. నారకురుపు నాకేర్పడినది. జనులు క్రమ్ముకొని నాకు విశ్రాంతి నీయరు. నేను స్వస్థానము చేరువరకు నీ విధముగనే జరుగును. నా ప్రాణముల కంటె నా బిడ్డల రక్షణమే నా ప్రధాన లక్ష్యము. కావున వీనిని నేను లెక్కచేయను.

3. బాబా – భక్తుల తలంపులను మన్నించుట - ప్రతిఫలమును ప్రసాదించుట

(ఎ) తల్లియొక్క ప్రార్థనము – (హరిభావ్ – పన్సే)

524. దహన్కర్‌లోని హరిభావ్‌పన్సే - తన తల్లి వలదనుచున్నను రామేశ్వరము యాత్రికు బయలుదేరెను. ఆతడు తిరిగివచ్చు వరకు అతని తల్లి ఉపవసింప నిశ్చయించుకొనెను. తన సుతుడు షిర్డీయందు బాబా దగ్గఱ నున్నవాడని తెలిసికొని బాబానిట్లు ప్రార్థించెను. 'బాబా!

నీవు సత్యముగ సాధుసత్పురుషుడ వగుదువేని నా కుమారుని తీర్థయాత్ర విరమింపజేసి, అతని తిరిగి యింటికి వచ్చునట్లు చేయుము!'

సా. బా: (హరిభావ్‌తో) నాకు దక్షిణ నిమ్ము!

హరిభావ్‌దగ్గఱనుండి దక్షిణ రూపమున షిర్డి నుండి రామేశ్వరమునకు వెళ్ళివచ్చుటకగు ప్రయాణము ఖర్చు ధనమంతయు దీసికొనెను.

సా. బా: (హరిభావ్‌తో) ఇంటికి పొమ్ము! నీ - విల్లు విడిచి వచ్చినది మొదలు రామేశ్వరము పస్తుపడి యున్నది. నీ విప్పుడు తిరిగి వెళ్ళవేని రామేశ్వరము అంతరించును. ఆ స్థానమును భద్రేశ్వర మాక్రమించును.

హరిభావ్ తిరిగి యింటికేగి తన తల్లి ఉపవాసము - ఆమె బాబాను గూర్చి కావించిన ప్రార్థనములు, బాబా ఆమె ప్రార్థన మనుగ్రహించిన విధము సకలము గ్రహింపజాలెను.

(బి) కుశలభావ్ - పవిత్రమైన కోరికలు

525. బాబా ఒకనాడు హ. సీ. దీక్షిత్తును టాంగామీద రహాతాకు వెళ్ళి, తనకుగూర్చు భక్తుడైన కుశలభావును దోడ్కొనిరమ్మని నియమించెను. కారణమేమి? ఆ క్రిందటి దినము - బాబాను దర్శించి చాలా కాలమైనది-అని కుశలభావ్ తలంచెను. ఆ రాత్రి బాబా అతని స్వప్నమున గోచరించి "షిర్డికి రమ్ము' - అని ఆదేశించెను. ఆ మఱునాటి యుదయమున టాంగామీద షిర్డికి వెళ్ళుటకు గుఱ్ఱములేని కారణమున తాను వెళ్ళలేక తనకు మాఱుగ తన కుమారుని కాలినడకతో షిర్డికి పంపెను. ఆ కుశలభావ్ కుమారుడు షిర్డికిజేరు పూర్వము -

సా. బా: కాకా! (హ. సీ. దీక్షిత్తు) టాంగా తీసికొని రహాతాకు వెళ్ళి, కుశలభావు నిటకు దోడ్కొని రమ్ము!

హ. సీ. దీక్షిత్తు కుశలభావును జేరగా నతడు తాను వచ్చుటకు గుఱ్ఱము లేదని చెప్పెను.

హ. సీ. దీక్షిత్తు : అందుచేతనే టాంగా తీసికొనివెళ్ళి నిన్ను తోడ్కొనిరమ్మని బాబా నియమించినాడు.

కుశలభావ్ తాను మిక్కిలిగ నభిలషించుచున్న బాబా సందర్శనము చేసికొన గలిగెను.

(సి) బాబా – భక్తుల తలపులను మన్నించుట – (మావుషే)

526. సా. బా: (ఒకనాడు) నా కడుపు నొప్పిగా నున్నది.

అంతట 'మావుషే' కాల్చిన యిటుకరాతితో బాబా పొత్తికడుపు మీద కాపుకాచెను. ఆ పిదప నామె తన బలముకొలది అతి తీవ్రముగ బాబా పొత్తికడుపు ఇరుప్రక్కల నొత్తుచుండెను. అచటనున్న యమ్. బి. నాచ్నే – "ఆపుము! ఆపుము! మెల్లగ నొత్తుము. బాబాకు బాధ కలుగును" - అనెను.

సా. బా: వెలుపలికి పొమ్ము! జోక్యము కల్పించుకొనకుము!

(డి) బాబా- నాచ్నే అత్తగారి దగ్గరనుండి ఉల్లిగడ్డలను తీసికొనుటకు దాదా కేల్కారును నియమించుట. (చూ. 284)

(ఇ) వథవ్కర్ – ఆకలి

527. సదాశివ - టి - వథవ్కర్, బాబానుజేరి ఎదుట కూర్చుండెను. అతనికి ఆకలి పీడించుచున్నను చెప్పుకొన జంకెను. ఒకడు పేడా (లడ్డు) పొట్లమొక దానిని బాబాకు సమర్పించెను. ఏమేని కానివారలిడిన పదార్థములను బాబా తాకడు. ఈ తఱి, ఆ పొట్లమును విప్పి వథవ్కర్ తొడమీద నొక లడ్డు విసరివైచెను. వథవ్కర్ దానిని తన చేతిలో నుంచుకొనెను.

సా. బా: నీ చేతిలో నుంచుకొనుటకు దాని వీయలేదు.

అంతట వథవ్కర్ దానిని తినెను. సగము ఆకలి తీఱెను. అంతట మఱియొక లడ్డును బాబా పడవైచెను. వథవ్కర్ ఇంటికి తీసికొని వెళ్ళవలెనని తన చేతిలో నుంచుకొనెను.

సా. బా: దానిని దాచుకొనుటకు నీకియలేదు.

వథవ్కర్ దానిని భక్షించెను. ఆకలి పూర్తిగ శమించెను. బాబా ఆ పిదప అతని వైపునకు లడ్డు పడవేయలేదు.

528. (1) 1911 న బి. వి. వైద్య - కుటుంబముతో రాత్రి 1 గంటకు షిర్డికిజేరి సాతేవాడలో విడిసెను. ఏదో అల్పాహారము (ఫరల్) తీసికొని నిద్రించెను. (ఆ మరునాటి ఉదయమున)

సా. బా: (కోపముతో - ఆ వాడలోని మనుష్యులతో) నా బిడ్డలు వచ్చిరి. ఎవ్వరు వారిని గూర్చి విచారించినవారు కారు. వారిని పస్తు పరుండ నిచ్చిరి.

(అని పలుకుచు మసీదున చేరిన భక్తులనందఱను బాబా తఱిమి వేసెను).

(2) షిర్డిని విడిచి నాశిక్ వెళ్ళదలచి 'వైద్య' బాబాను జేరి సెలవు కోరెను.

సా. బా: నాశిక్‌నకు వెళ్ళుచున్నావా? అచట కేల వెళ్ళవలయును? అచట ప్లేగు గలదు. వెళ్ళవలదు. నీ కుటుంబముతో నింటికి పొమ్ము.

(3) వైద్య బాబా చిత్రపటమును దీసికొని వెళ్ళి బాబాచేతులందుంచెను. బాబా దానిని స్పృశించి (పూజించుకొనుటకు) అతనికి తిరిగి యిచ్చెను.

సా. బా: నీ విప్పుడు వెళ్ళుము.

'వైద్య' తన కుటుంబముతో ప్రయాణముచేసి రైలుస్టేషన్ చేరునప్పటికి రైలు తప్పెను. అది వారి దురదృష్టమనుకొని, తరువాత బండి కొరకా స్టేషనులో కొన్ని గంటలు గడపిరి. అటు పిమ్మట వచ్చిన రైలులో 'మన్మాడ్'చేరిరి. అంతకుముందు వెడలిన బండిలో ప్రయాణముచేసి మన్మాడ్‌లో బండిమారి మఱియొక బండిలో వెళ్ళిన యెడల ఆ బండికి కలిగిన ప్రమాదంలో నొక పెట్టె తుత్తునియలగుటచే బాబా తమకా అపాయము కలుగనీయక కోపర్గాములో బండిని తప్పించెనని వారు తెలిసికొనిరి.

4) ఒక సమయమున వచ్చినపుడు సెలవు దాటిన తరువాత గూడ 'వైద్య'ను, అతని కుటుంబమును బాబా షిర్డియందు నిలిపెను.

సా. బా: ఊరకుండుము. భయము వలదు.

సెలవు గడువు దాటిన 3 రోజుల తరువాత తిరిగివెళ్ళి సెలవు పొడిగింపుమని కోరుచు జి. ఐ. పి. రైల్వే అధికారులకు కాగితము వ్రాసికొనగా నెట్టి కష్టములేక సెలవు ఈయబడినది.

(జి) బాబా - ప్రధాన్‌సతి పసిబిడ్డ ఏడ్పులాలించుట.

529. యం. డబ్లుయు - ప్రధాన్‌సతి ద్వారకామాయ మసీదునందు బాబాపూజ కావించుచుండెను. అదాటుగ బాబా ఆమె కావించు పూజను ఆపెను.

సా. బా: అపుము! నీ విడిదికి (వాడ) వెళ్ళుము!

ఆమె పూజనాపి విడిదికి వెళ్ళెను. ఆమె పసిబిడ్డ యేడ్చుచుండుట కనెను. ఆ బిడ్డ నోదార్చి, నిద్రపుచ్చి తిరిగి బాబాదగ్గఱకు జేరెను.

సా. బా: ఇపుడు నీ పూజ కానిమ్ము!

ఆమె విడిది మసీదునకు చాల దూరముననున్నను బాబా తన అంతర్ జ్ఞానముచే నా బిడ్డ ఏడ్పు వినెను. అట్టి వినికిడినిగూర్చి ప్రసిద్ధమైన గేయమునందిట్లు తెలుపబడినది.

"ముంగీకి పాప్‌మే అవాజ్ హెూవే
ఓభీ సాయీ సుంతాహై"
(చినచీమ అడుగువేసిన సవ్వడేని
విననేర్చు సాయీ యీపృథ్వి నెందేని).

(హెచ్) పురందర్‌యొక్క మూర్ఖపు పట్టుదల

530. భక్తులు వెండిపాలకిని సంపాదించిరి. దానికి పూన్చిన వెండి గుఱ్ఱము లపహరింపబడెను. ఆర్. బి. పురందర్, అతని మిత్రులా వెండి పాలకిని భద్రపఱచుటకు మసీదు ఉత్తరమువైపున నొక గదిని నిర్మింప దలచిరి. గదిని నిర్మించుచుండిరి. బాబా లేని సమయమున మసీదు గోడకు పురందర్ రంధ్రములు తొలుచుచుండెను. బాబావచ్చి ఆ పనిని ఆపుమని అజ్ఞాపించెను. బాబా బెదురించుచున్నను పురందర్ ఆ పనిని సాగించుచునే

యుండెను. తన భోజనము వేళ దాటినను దానిని పాటింపక పురందర్ తన పనియందే నిమగ్నుడయ్యెను.

సా. బా: ఇదియెంత దుస్సహమో- గమనింపుడు. ఇతడు నామాటలను వినడు. దీనినంతయు నేను సహింపవలయును.

సా. బా: (మరల) నీవు భోజనమునకు వెళ్ళుము.

ఆర్. బి. పు: బాబా! నేను వెళ్ళను. నేను లేని సమయమున నేను చేసిన పనినంతయు నీవు తారుమారు చేయుదువు.

సా. బా: అట్లుచేయను. నీవు భోజనమునకు వెళ్ళుము.

అంతట పురందర్ భోజనమునకు వెళ్ళెను.

సా. బా: ఏమి చేయవలె? బిడ్డ మనకాలిపై మలము విసర్జించిన మనము కాలు నరకుదుమా? బిడ్డను ఛేదింతుమా? దానిని మనము సహింపవలయును.

(1) వార్డే – మూర్ఖపు పట్టుదల

531. వార్డే: బాబా! మసీదునందు సత్యనారాయణ పూజ కావించుటకు నా కనుజ్ఞనిమ్ము!

సా. బా: నీవు చేసికొనుము.

అంతట వార్డే వెళ్ళి అరటి పిలకలను గొనివచ్చి, బాబాను ఒక విగ్రహముగ భావించి, బాబాకు అన్నివైపుల ఆ పిలకల నుంచెను.

సా. బా: అటుల చేయకుము. నే నటుల జరుగ నీయను.

అంతట వార్డే పెద్దపెట్టున నేడ్వదొడగెను. ఆ రోదన మంతకంతకు హెచ్చుటచే తుదకు బాబా సమ్మతించవలసి వచ్చెను - అపుడు –

వార్డే: ఖర్చులకు నా దగ్గఱ ధనములేదు.

సా. బా: నీ కెంత కావలయును?

వార్డే: రు. 2-8-0

సా. బా: (జయకర్‌ను చూపుచు) ఈతని దగ్గఱ కలదు. అతని దగ్గఱ నుండి అప్పు తీసికొనుము.

జయికర్ దగ్గఱ నున్నది ఆ మాత్రమే అయినను ఆతడు అప్పు నీయక తప్పినది కాదు. వార్డే సత్యనారాయణ వ్రతము కావించెను.

4. బాబా – బిడ్డలను ప్రేమతో కనిపెట్టి రక్షించుట

1. ధులియా – బహల్కర్ బిడ్డ జబ్బు

532. 1913 మార్చి - 'రావుజీ బాలకృష్ణ ఉపాసనీ బహల్కర్' యొక్క చిన్న బిడ్డకు 5, 6 రోజులు పెద్ద పెట్టున జ్వరము తగిలెను. వైద్యులాశ లుడిగిరి. బహల్కర్ బాబాపటము మ్రోలగూర్చుండి ప్రార్థించెను. రాత్రి 2 గంటలకు ధులియాలోని అతని గదిలో బాబా పొడమి, ఆ బిడ్డకు 'ఉధి' పెట్టుచు 'ఇంక మీరు అందోళన చెందవలదు. 2, 3 గంటలలో బిడ్డకు చెమటపోయును. ఉదయమున కీ బిడ్డ కోలుకొనును. పూర్తి ఆరోగ్యము బడసిన పిదప బిడ్డను నా దగ్గఱకు తీసికొని రమ్ము!' - అనెను.

ఉదయమునకు ఆ బిడ్డ కోలుకొనెను. ఇది 6-3-1913 ఆ ప్రాంతమున జరిగిన విషయము.

8-3-1913 న శ్యామా - రావుజీకి ఉత్తరము వ్రాసెను. అందు "ధులియాలోని" నీ మిత్రుని యింటికి నేను వెళ్ళినాను" అని బాబా చెప్పినాడు. 'మిత్రుడెవరు?' - అని నేను ప్రశ్నించితిని. 'ఉపాసనీ బహల్కర్ రావుజీ. నేను ప్రతి దినము అతని యింటికి వెళ్ళుచున్నాను. నీ వాతనికి ఉత్తరము వ్రాసి చూడుము!' - అని బాబా పలికినాడు. అందుచే నీ ఉత్తరము వ్రాయుచున్నాడను".

15 దినములు గడచిన తరువాత రావుజీ - ఆతని కుమారుడు షిర్డీకి వెళ్ళుచుండిరి. మార్గమున కోపర్గామునందు టాంగా త్రోలువాడు జాగు చేయుచుండెను. ఆరతి సమయమున –

సా. బా: శ్యామా! కొంచెముసేపు ఆగి ఆరతి ప్రారంభించుడు! నీ ధూలియా మిత్రుడు వచ్చుచున్నాడు. ఆ టాంగా త్రోలువాడు వారికి కష్టము కలిగించు చున్నాడు.

రావూజీ - ఆతని కుమారుడు వేళకు జేరి ప్రసాదము నందుకొనిరి.

సా. బా: (బాలునితో) బిడ్డా! నీకు జబ్బు చేసినపుడు ధూలియాకు వచ్చితిని. నీకు జ్ఞాపక మున్నదా?

2. మహల్సాపతి – సర్పములు

533. 1) సా. బా: భగత్! రెండు సర్పములు మీ యింటివద్ద తిరుగు చున్నవి.

బాబాచే 'భగత్' (భక్తుడా!) అని పిలువబడు మహల్సాపతి ద్వారకామాయి మసీదునుండి యింటికి తిరిగివెళ్ళి అతని తలుపుదగ్గఱ ఒక సర్పమును, అచట కుమ్మరివాని దిండు క్రింద ఒక సర్పమును జూచెను.

2) సా. బా: భగత్! నీవీరాత్రి వచ్చునపుడు లాంతరు చే గొని రమ్ము. గ్రామద్వారమువద్ద దొంగలెదురు పడుదురు

ఆ రాత్రి లాంతరు తీసికొని మహల్సాపతి వచ్చుచు గ్రామ ద్వారము వద్ద సర్పమును జూచెను.

534. ఒక భక్తుడు మసకచీకటిలో మలవిసర్జనమునకు వెళ్ళెను. అచట నతడేమియో అకులకదలిక చప్పుడు వినెను. అదియొక సర్పమని నమ్మి త్వరత్వరగా అతని విడిదికి వెళ్ళెను. తరువాత బాబాను జేరెను.

సా. బా: నీవు వెలుపలకు వెళ్ళిన తావున నేను లేనా? నీవు భయ పడనేల?

31. (చూ: పూనా నివాసి సదాశివతార్కాడ్‌పతి సర్పము మీాద పాదము నిలుపబోవుచు అంతర్‌జ్ఞానముచే అదాటున వెనుకకు తగ్గిన విషయము).

4) మిరికరునకు అభయము – సర్పము.

535. సర్దార్ మిరికర్ (బాబా భక్తులలో నొకడు) కుమారుడు 'బాలుసాహెబ్ మిరికర్' - మామ్లత్‌దార్ - బాబాసెలవు తీసికొన గోరెను.

సా. బా: మన ద్వారకామాయి కలదని నీవు ఎఱుగుదువా?

మిరికర్ గ్రహింపజాలక ఆందోళ చెందెను.

సా. బా: ఇచట నీవు గూర్చుండి యున్నది ద్వారకామాయి. ఇది తన బిడ్డల అపాయములను, ఆందోళనలను తొలగించును. ఈ మాసూది అయి మిక్కిలి దయామయి. తనను గాఢముగ విశ్వసించు బిడ్డలందఱకి ఈమె అనుగుతల్లి. ఆపత్కాలమున తనవారి నీమె రక్షించును. ఒకసారి విశ్వసించి ఆశ్రయించిన వాని కష్టము లన్నియు నివారణ మగును. (చూ. 1)

సా. బా: ఉధిని ప్రసాదించుచు మరియు నిట్లనెను. ఆ పొడవైన పెద్దమనిషిని నీ వెరుగుదువా? (బాబా బారచాచి ఒక అరచేతిని త్రాచుపాము పడగవలె కదలించుచు) అతడు మిక్కిలి భయంకరుడు. కాని, ద్వారకామాయి బిడ్డల నది యేమి చేయగలదు? అది కనబడిన మనము వినోదముగ జూతుము. ద్వారకామాయి రక్షింప నున్నపుడు సర్పము తాకగలదా!

మిరికర్ వెంట వెళ్ళుమని శ్యామాను బాబా ఆజ్ఞాపించెను. ఆ రాత్రి 9 గంటలకు మిరికర్ - శ్యామా మరి కొందరు 'చితాలీ' కి జేరి మారుతి దేవాలయమువద్ద నుండిరి. మిరికర్ వార్తాపత్రికల చదువు చుండెను. తటాలున వార్తాపత్రికల మీద కదలిక చప్పుడు 'జవాను' వినెను. లాంతరు తెచ్చి చూచెను. మిరికర్ ఉత్తరీయమున కొంత భాగము ఆ వార్తాపత్రికల మీద కలదు. ఆ వస్త్రము చివర ఒక సర్పము చేరి యుండెను.

'సర్పము' - 'సర్పము' - అని ఆ జవాను అరచెను. అది మిరికర్ దగ్గఱ నుండి తొలగిపోయెను. జనులుజేరి ఆ సర్పమును కర్రలతో కొట్టి చంపిరి. మిరికర్ వినోదముగ దానిని చూచెనేకాని, భయభ్రాంతుడు కాలేదు.

535-ఎ. షిర్డిలో బాబా ఒకనాడు (ప్రాణాపాయ) విచార సూచక శంఖారావము గావించుచు - 'అహో! నానా చావనున్నవాడు కాని నేను చావనిత్తునా?' - అనెను. ఆ సమయమున, నా. గో. చందోర్కర్ - లేలే శాస్త్రియు పూనా దగ్గఱ టాంగాలో ప్రయాణము చేయుచుండిరి. గుఱ్ఱము

టాంగాను వెనుకకు నెట్టుకొనిపోయి దానిని తలక్రిందులు చేసెను. చందోర్కరు-లేలేశాస్త్రి ప్రాణాపాయ స్థితిలో నుండిరి. వారు మెల్లగ లేచి యెట్టి గాయములు తగులలేదని గుర్తించిరి. తరువాత వారు షిర్డికి వెళ్ళినపుడు బాబా పైన తెలిపిన విధమున వారికి కలుగనున్న ఆపదను కనిపెట్టి రక్షించినట్లు తెలిపికొనిరి.

535-బి. ఆర్. వి. మోదక్ - తనకొక ప్రత్యేక పరీక్ష జరుపబడునని, దాని కతడు హాజరైన యెడల ఉద్యోగాభివృద్ధి పొందుటో లేక అతని అసమర్థత కారణముగ ఉద్యోగము నుండి తొలగింపబడుటో జరుగునని యాతడు భయపడు చుండెను. అతడు బాబాదగ్గఱకు వెళ్ళెను. బొంబాయిలో పరీక్ష గడువు దాటిపోవు వరకు అతనినట నిలిపెను. ఆ పరీక్ష తేదీ దాటి పోయిన తరువాత -

సా. బా: పొమ్ము.

మోదక్ : బాబా! ఎక్కడకు? ఇంటికా? బొంబాయికా?

సా. బా: ఇంటికి పొమ్ము! నీ బిడ్డలు నీ కొఱకు నిరీక్షించు చున్నారు.

5. బూటీ గండము – బాబా అభయము

536. నానా సాహెబ్ రేంగ్లే ప్రసిద్ధ జ్యోతిష్కుడు. అతడొకతటి నా దినమున 'బూటీకి' ప్రాణ గండము కలదని చెప్పెను. తరువాత వారిరువురు బాబాదగ్గర కేగిరి.

సా. బా: నానా యేమి చెప్పుచున్నాడు! నీకు మృతి ఆసన్నమైనదని తెలుపుచున్నాడా? ఏమి? మనము భయపడవలసిన పనిలేదు. తాకుము! తాకుము! నీ వెట్లు తాకి చంపుదువో నేను చూచెదను గాక!

ఆ తరువాత 'బూటీ' మల విసర్జనమునకు వెళ్ళెను. అచట నొక సర్పముండెను. సేవకుడు దానిని జూచి ఒక రాతిని జేకొని పైకెత్తెను. 'దాని కంటె ఒక కఱ్ఱమేలు, క్షేమకరము' - అని, బూటీ అనెను. సేవకుడు కఱ్ఱ తెచ్చులోపల ఆ సర్పము వెడలిపోయెను.

'మృత్యుదేవత రానూ వచ్చినది. ప్రాణాపాయము గలిగింపక పోనూ పోయినది'.

5. బాబా – భక్తుల ఆరోగ్య విషయమై ఆలోచన – బాలషింపి

537. ఆదరించు వారెవ్వరు లేక మిక్కిలి వ్యాధిగ్రస్తుడై బాట ప్రక్కన పడియున్న 'బాలషింపి'ని బాబా చూచెను. బాబా నిత్యము భిక్షించు గృహములలో నాతని గృహము ఒకటి. అతని కుటుంబమునెడ బాబాకు మిక్కిలి ఆదరము కలదు. 'నింగోను'లో నున్న నానాసాహెబ్ డేంగ్లేదగ్గఱకు వెళ్ళుమని బాబా బాలషింపితో చెప్పెను. ఆ సమయమున నానాసాహెబ్ స్వప్నమున బాబా పొడమి 'నీ దగ్గఱకుజేరు 'బాలషింపి' విషయమై తగు శ్రద్ధ తీసికొనుము' - అని ఆదేశించెను. కావున బాలషింప ఆతని దగ్గఱకు వెళ్ళగా డేంగ్లే ఆతనిని మిక్కిలి ఆదరముతో పోషించెను.

బాబా – కుష్ఠ రోగులయెడ ఆదరణము

538-(ఎ) సా. బా: భీమాబాయి? ఈ కుష్ఠ రోగియైన కాంతను నీ యింటికి గొనిపోయి పోషింపుము.

భీమాబాయి : బాబా! ఆమె కుష్ఠ రోగి.

సా.బా: దానిని లెక్కింపకుము. అయిన నేమి? ఆమె నా సహోదరి. ఆమెను నీ యింటికి గొనిపొమ్ము!

భీమాబాయి ఆ కుష్ఠ రోగిని తన యింటికి పిలుచుకొనిపోయి ఒక నెల రోజులు పోషించెను. అటుతర్వాత ఆ రోగి మృతి నొందెను.

(బి) సా.బా: (బాలాజి పటేల్ - నివాస్కర్‌తో) బాలా! నీ వింటికి పోవలదు. ఇచట నుండి ఈ డగ్డుభావ్‌ను (ముస్లిమ్ కుష్ఠరోగిని) పోషింపుము.

బాబా ఆజ్ఞ ననుసరించి బాలా ఆ కుష్ఠ రోగి మరణించువరకు ఒక నెల దినములు పోషించెను.

6. సహాయములు – సంతతి ననుగ్రహించుట

(ఎ) డి. యస్. రసానే

539. దామోదర్ – సావళ్రాం - రసానే - మొదటి భార్యయందు

సంతానము కలుగని కారణమున మఱియొక భార్యను చేపట్టెను. కాని ఆమెయందు సంతతి కలుగలేదు. ఆతని జాతకమున జన్మలగ్నమునకు పంచమస్థానమున పాపగ్రహముండెను. గ్రహములతనికి ప్రతికూలములుగ నుండెను. కాని, అతనికి బాబాయందు గాఢవిశ్వాసము కలదు. అతడు షిర్డికి వెళ్ళినపుడు బాబా అతని కొఱకు నిరీక్షించు చుండెను. అతనికి 4 మామిడిపండ్ల నిచ్చుచు –

సా. బా: దామియా! ఈ పండ్లనిపుడు తీసికొని పొమ్ము. వీనిని తిని చావుము.

దామియా భయ చకితుడయ్యెను. సంతతి బడసి, సంసారమగ్నుడగుట ఆధ్యాత్మిక మృతియే - యని, అతడు గుర్తించినవాడు కాడు.

సా. బా: ఈ పండ్లను నీవు తినవలదు. నీ భార్యకు వీనినిమ్ము!

దామియా : ఏ భార్యకు?

సా. బా: నీ రెండవ భార్యకు. ఆమెను ఈ పండ్లను దిననిమ్ము, ఆమెయందు ఇరువురు పుత్రులు జనింతురు. మొదటి బిడ్డకు 'దౌలత్ షా' – అని, రెండవ బిడ్డకు 'తానాషా' - అని పేర్లు పెట్టుము.

(ఆ తరువాత) అతనికి ఎనమండుగురు బిడ్డలు జనింతురనియు బాబా తెలిపెను. ఆ విధముగనే జరిగెను. దామియాకు మొదట ఇరువురు కొమరులు కలిగిరి. అతడు మొదటి బిడ్డ జనించినపుడా బిడ్డను బాబాదగ్గఱకు గొనిపోయి "బాబా! ఈ బిడ్డకేమి పేరు పెట్టుమందువు? అని అడిగెను".

సా. బా: నేను నీకు తెలిపినది మరచితివా? నీ నోటు పుస్తకములో 3వ పేజీలో వ్రాసికొంటివి. ఈ బిడ్డకు 'దౌలత్ షా' - అను పేరు పెట్టుమని నేను చెప్పలేదా?

(గమనిక : ఇతడు, దౌలత్ షా నానాసాహేబ్ రసానే - షిర్డి సాయి సంస్థానమునకు ధర్మకర్త).

(బి) రావ్‌బహద్దూర్. హెచ్. వి. సాతే

540. హెచ్. వి. సాతే డిప్యూటి కలెక్టరు. 50వ సంవత్సరమున

భార్యా వియోగము కలిగెను. అతనికి ఇరువులు కుమార్తెలు మాత్రము కలరు. మగ సంతానము లేదు. పురుష సంతతికొఱకు మఱల వివాహము చేసికొన నతడు మిక్కిలి సందేహించుచుండెను. 1904 న అతడు మామ్లత్‌దారుతో కలిసి షిర్డికి వెళ్ళెను.

మామ్లత్‌దార్ : బాబా! సాహెబ్‌నకు పురుష సంతతిలేదు.

సా బా: సాహెబ్ వివాహమాడిన భగవానుడు ఇతనికి కుమారుని ప్రసాదించును.

ఆ విధముగ బాబా వలన అభయము పొంది సాతే మరల వివాహమాడ సిద్ధపడెను. మరుసటి సంవత్సరమున దాదా కేల్కారు తన కుమార్తెను సాతేకు ఈయదలచెను. కాని సాతే బాబాసలహా తీసికొన గోరెను. శ్యామా - దాదా కేల్కారు ఆ కన్యను బాబాదగ్గఱకు వెంటగొని వెళ్ళగ బాబా ఆ కన్యనొసట కుంకుమను పెట్టుచు "ఈ బిడ్డను అహమ్మదాబాదునకు (హెచ్. వి. సాతే నివసించుచోటు) పంపుడు" - అనెను.

హెచ్. వి. సాతే - ఆ కన్యను 1906న పరిణయమాడెను. తరువాత 6 సంవత్సరములలో ఇరువురు కుమార్తెలు మాత్రము జనించిరి. 1912న దాదా కేల్కారు సతీసమేతముగ బాబానుజేరి మ్రొక్కి "బాబా! మాకు దౌహిత్రుని జూచు భాగ్య మెప్పటికి? - అనెను.

సా. బా: నేను అల్లాను ప్రార్థించుచున్నాడను. నా ప్రార్థనము మన్నించును.

[1913 నందు సాతేకు కుమారుడు జనించెను. 1940 (ఈ గ్రంథ రచన) కాలమునకు అతడు మంచి ఆరోగ్యమున నున్నవాడు]

(సి) సపత్నేకర్.

541. సపత్నేకర్ : అనునతడు న్యాయశాస్త్ర విద్యార్థి. న్యాయశాస్త్ర పట్టపరీక్షకు సరియగు పరిశ్రమ లేకయే ఎట్లు విజయము పొందగలవు? - అని తన తోడి విద్యార్థి నతడు ప్రశ్నించెను. తన విద్యా పరిశ్రమయందెట్టి కొఱతలున్నను తనకు తప్పక విజయము కలుగునని సాయిబాబా అభయ ప్రదానముపై నాధారపడియున్న వాడనని ఆ మిత్రుడు సమాధాన మిచ్చెను.

అంతట సపత్నేకర్ ఆ మిత్రుని, సాయిబాబాను గూడ అవహేళనము చేసెను. ఆ పిదప పరీక్షాఫలితములు ప్రకటనమై బాబా అభయ ప్రదానమును యథార్థము గావించినవి. ఏమైనను ఆ పరీక్షలో తన మిత్రుని విజయమొక "గ్రుడ్డివేటు"-గ పేర్కొని యింకను బాబాయందు నిరాదరణ బుద్ధినే వెలిబుచ్చెను. ఆ సపత్నేకర్ అకల్కోటయందు న్యాయవాదిగ బనిచేసెను. పది సంవత్సరములు గడచిన పిదప తన ఏకైక సుతుని గోల్పోయెను. అతని అంతరాత్మ అతని బాధింప దొడగెను. బాబాను సందర్శించి, క్షమాపణము జెప్పుకొన దలచెను. అతడు షిర్డికిజేరి బాబాకు ప్రణమిల్లెను.

"చల్ - హట్" (వెడలి పొమ్ము!) కొంత తడవు వేచి మరల బాబాకు ప్రణమిల్లెను.

సా. బా: ఇక్కడనుండి వెడలి పొమ్ము.

సపత్నేకర్ షిర్డి విడిచి యింటికి వెళ్ళెను.

ఒక సంవత్సరము గడచినపిదప బాబా సపత్నేకర్ భార్య స్వప్నమున గోచరించి, ఆ దంపతులను తన దగ్గఱకు రమ్మని ఆహ్వానించెను. ఈ సమయమున సపత్నేకర్ తన పూర్వద్వేష ప్రవర్తనమునకు క్షమాపణము అతి వినయమున దెలుపుకొనెను. అంతట బాబా వివిధ కాలములందు వివిధ ప్రదేశముల జరుగుచున్న విషయములన్నియు తాను గుర్తించుచునేయున్న వాడని సపత్నేకర్ తెలిసికొనునట్లు అతని వృత్తాంతమంతయు స్వీయ వృత్తాంతముగ అతని ఎదుటనే ఒక గొల్లపడతితో జెప్పెను. మఱియు ఆ గొల్ల పడతితో –

సా. బా: (సపత్నేకరును చూపుచు) ఈతడు తన పుత్రుని నేను చంపితినని నన్ను నిందించుచున్నాడు. క్రమ్మఱ నేనా జీవాత్మనే ఈతని సతీ గర్భమున జేర్చుదును.

బాబా అంతట సపత్నేకర్ వైపునకు దిరిగి అతని మస్తకమున తన హస్తమునిలిపి "నీ ఆశయ మతిశీఘ్రముగ ఫలించును" - అని ఆశీర్వదించెను.

సపత్నేకర్ పరమానంద భరితుడయ్యెను. బాబా తన అంతర్జ్ఞానము

నంతకంత కధికముగ ప్రకటించినకొలది అతనికి బాబాయందు గాఢవిశ్వాసము పొడమకొనెను

ఉదా : సపత్నేకర్ సతికి గలుగనున్న వ్యాధిని గూర్చి దానికి గావింపదగు చికిత్సనుగూర్చి బాబా ముందుగ దెలిపినాడు. స్వానుభవమున నిట్టి విషయములను గుర్తింపజాలిన సపత్నేకరునకు విద్యార్థి దశలో వలె బాబాయందు అవిశ్వాసము ఎన్నటికిని పొసగబోదు. ఆ దంపతులు సెలవు తీసికొను సమయమున బాబా సపత్నేకరునకు కొబ్బరికాయను ప్రసాదించి "దీనిని నీ భార్య పైటకొంగున నుంచుకొని ఆనందమున వెళ్ళుడు!" - అని ఆశీర్వదించెను.

12 నెలలలో నతనికి పుత్రుడు జనించెను. ఆ దంపతులు తమ సుతుని బాబాదగ్గఱకు గొనివచ్చిరి.

(బి) ఔరంగ బాద్కర్‌సతి.

542. షోలాపూర్ నివాసి - సఖారాం ఔరంగబాద్కర్ రెండవ వివాహము చేసికొనినను సంతతి కలుగలేదు. 27 సంవత్సరములు వారు కాపురము చేసిరి. ఆ సతి షిర్డికిజేరి శ్యామాద్వారా బాబా అనుగ్రహము పడయగోరెను. బాబా సంతోషముగ నున్న సమయమున బిలుతునని అంతవరకు మసీదు దగ్గర నుండుమని శ్యామా ఔరంగబాద్కర్‌సతికి జెప్పెను. బాబా భోజనానంతరము చేతులు కడిగికొనుటకు శ్యామా నీరు పోసెను. బాబా చేతులు తుడిచికొని శ్యామా బుగ్గనుపట్టి మెలియపెట్టెను.

శ్యామా : (కోపము నటించుచు) ఏమి? దేవా! నా బుగ్గను మెలిపెట్టుట నీకు తగునా!

సా. బా: నీవు నాతోడనున్న 72 జన్మములనుండియు నిన్నింతవరకెప్పుడు బుగ్గ మెలిపెట్టి ఎఱుగను. నిన్ను తాకుటకు ఇప్పటికైనను సమ్మతింపవా?

శ్యామా : దేవా! మేము పదార్థములను (స్వర్గము - విమానములు మొదలగునవి) మాకు ప్రసాదింప దేవుని కోరుదుము.

సా. బా: అవును. వాస్తవముగ దానికొఱకే నేను వచ్చితిని.

అంతట బాబా తన గద్దెపై కూర్చుండెను. శ్యామా ఆ కాంతను పిలిచెను. ఆమె వచ్చి బాబాకు ప్రణమిల్లి, కొబ్బరికాయ, అగరవత్తులు సమర్పించెను.

బాబా ఆ ఎండిన కొబ్బరికాయను చేతబట్టి కదలించెను. లోపల ఎండిన కొబ్బరి కదలి ధ్వనించెను.

సా. బా: (కొబ్బరికాయను దోసిటబట్టి కదలించుచు) శ్యామా! ఇది లోపల దొరలుచున్నది. అది ఏమి పలుకుచున్నదో తెలిసికొనుము!

శ్యామా : ఈ కాంత తన గర్భములో బిడ్డ ఆ విధముగా దొరల వలయునని ప్రార్థించు చున్నది. అట్టి ఆశీస్సులతో ఆ నారికేళమును ప్రసాదింపుము!

సా. బా: ఆమె కిచ్చిన కొబ్బరికాయ బిడ్డగా మారునా! అట్టి ఆలోచనలు గల మనుష్యులెంత అవివేకులు!

శ్యామా : దేవా! నీ ఆశీః ప్రభావమును, ఆ నారికేళమును నే నెఱుగుదును. ఆ కొబ్బరికాయను ఆశీస్సులతో ప్రసాదింపుము!

అటుల ఇరుమారు - ముమ్మారు శ్యామా బాబాను ప్రార్థించెను.

సా. బా: ఆమెకు సంతానము కలుగును.

శ్యామా : కాని, ఎప్పుడు?

సా. బా: 12 నెలల్ల లోపల.

అంతట ఆ కొబ్బరికాయను పగులగొట్టి సగము ఆ కాంతకు బాబా ప్రసాదించెను.

శ్యామా : అమ్మా! ఈయన మాటలను వినినావు కదా! నీకు 12 నెలలలో సంతతి కలగకున్న ఒక కొబ్బరికాయ ఈయన తలపై పగులగొట్టి, యీ మసీదు నుండి, ఈయనను వెలుపలకు నీడ్చివై చెదను. అటుల కావింపనా-నన్ను 'మాధవరావు' - అని పిలుచుకొనను.

సంవత్సరము లోపల ఆమెకు కుమారుడు కలిగెను. ఆ బిడ్డను 5వ నెలలో బాబాదగ్గఱకుగొనివచ్చిరి. తండ్రి బాబాకు 500 రూపాయలు సమర్పించెను. ఆ ద్రవ్యముతో బాబా అశ్వము (శ్యామకర్ణము) నకు ఒక కొట్టము నిర్మింపబడినది.

(ఇ) చింతామణిరావు

534. సా. బా: (మహల్సాపతితో) ఆతడు మరల వివాహము చేసికొనిన ఒక పుత్రుడు, ఒక పుత్రిక జనింతురని అతనితో(చింతామణిరావుతో) చెప్పుము.

చింతామణిరావు తిరిగి వివాహము చేసికొనెను. ఒక కుమారుడు, ఒక కుమార్తె మాత్రమే జనించిరి.

(ఎఫ్) మహల్సాపతి

544. మహల్సాపతికి స్త్రీ సంతతి మాత్రమే కలదు. అటులయ్యు నతడు బ్రహ్మచర్య నిష్ఠ గలిగి బాబా వెంట మసీదునందు చావడియందు నిద్రించువాడు.

సా. బా: భగత్! వెళ్ళి నీ యింట నుండుము. నీకు సుతుడు జనించును. సుతుడు చూతఫలము (మామిడి పండు), సుత తింత్రిణీ ఫలము. (చింతకాయ)

భగత్ మహల్సాపతి గోకులాష్టమినాడు ఇంటికి వెళ్ళెను. మరల గోకులాష్టమిలోపల అతనికి పుత్రుడు పుట్టెను.

(జి) రతన్జీసేత్

545. (నైజామ్ రాష్ట్రములోని) నాందేడ్ నివాసి 'రతన్‌జీ-సపూర్జీ-వాడియా' కు సంతానము లేదు. ఒకనాడు దాస్‌గాణూ మహారాజు - మౌలీ సాహేబ్ (మౌలానా) లకు రు. 3-14-0 లు వెచ్చించి అల్పాహార విందు కావించి, సంతాన ప్రాప్తికి బాబా ఆశీస్సుల బడయగోరి షిర్డికి వెళ్ళి బాబాకు మ్రొక్కెను.

సా. బా: నీ విదివరకు రు. 3-14-0 లు యిచ్చినావు. నా కిపుడు రు. 2-2-0 లు దక్షిణ నిమ్ము.

రతన్జీ ఆ పైకము నిచ్చెను. కాని, తానంతవరకు బాబాను దర్శింపక యేమియు ధనము పంపని వాడగుటచే తాను బాబాకు రు. 3-14-0 లు సమర్పించుట యెట్లు పొసగెనా యని ఆశ్చర్యపడెను.

సా. బా: నీ హృదయ కామితమును భగవాను డనుగ్రహించును.

బాబా ఆశీస్సులు బడసి రతన్జీ తిరిగి యింటికి వెళ్ళెను. బాబా లోగడ ధనము స్వీకరించుట మౌలానా రూపమున బాబా స్వీకరించినాడని దాస్‌గణూ మహారాజు విశదపరచెను. రతన్జీ తన లెక్కలను చూచుకొనెను. మౌలానా మౌలీసాహెబునకు అల్పాహార విందునకై తాను వెచ్చించినది సరిగ రు.3-14-0లు అగుట అతడు గుర్తించెను - తరువాత బాబా అనుగ్రహమున రతన్జీకి పుత్రుడు జనించెను.

(హెచ్) నారాయణ గోంద్ సింధే

నా. గో. సింధేకు ఏడుగురు పుత్రికలు జనించిరి. పురుష సంతానము లేదు. అతని ప్రారబ్ధ కర్మము ననుసరించి పుత్ర సంతాన ప్రాప్తిలేకున్నను అతడు దత్తస్వామిని ప్రార్థించిన కారణమున బాబా అతనికి సుతుని ప్రసాదించిన విషయము 1903లో బాబా తెలిపినాడు. (చూ. 399)

545-ఎ. బిడ్డలకు బాబా దీర్ఘాయువును ప్రసాదించుట

సా. బా: జి. జి. నార్కేకు బిడ్డలు కలరా?

భక్తుడు: బాబా! అతని బిడ్డలు మిక్కిలి బాల్యముననే మృతి నొందిరి.

సా. బా: అల్లా అనుగ్రహించును.

ఆ తరువాత నార్కేకు నలుగురు బిడ్డలు కలిగిరి. అందఱు దీర్ఘాయువు గలవారైరి.

(గమనిక: బాబా, 'బడావే' సతినిగూడ యీ విధముగ అనుగ్రహించినాడు).

సా. బా: నీ విదివరకు రు. 3-14-0 లు యిచ్చినావు. నా కిపుడు రు. 2-2-0 లు దక్షిణ నిమ్ము.

రతన్జీ ఆ పైకము నిచ్చెను. కాని, తానంతవరకు బాబాను దర్శింపక యేమియు ధనము పంపని వాడగుటచే తాను బాబాకు రు. 3-14-0 లు సమర్పించుట యెట్లు పొసగెనా యని ఆశ్చర్యపడెను.

సా. బా: నీ హృదయ కామితమును భగవాను డనుగ్రహించును.

బాబా ఆశీస్సులు బడసి రతన్జీ తిరిగి యింటికి వెళ్ళెను. బాబా లోగడ ధనము స్వీకరించుట మౌలానా రూపమున బాబా స్వీకరించినాడని దాస్‌గాణూ మహారాజు విశదపరచెను. రతన్జీ తన లెక్కలను చూచుకొనెను. మౌలానా మౌలీసాహెబునకు అల్పాహార విందునకై తాను వెచ్చించినది సరిగ రు.3-14-0లు అగుట అతడు గుర్తించెను - తరువాత బాబా అనుగ్రహమున రతన్జీకి పుత్రుడు జనించెను.

(హెచ్) నారాయణ గోంద్ సింధే

నా. గో. సింధేకు ఏడుగురు పుత్రికలు జనించిరి. పురుష సంతానము లేదు. అతని ప్రారబ్ధ కర్మము ననుసరించి పుత్ర సంతాన ప్రాప్తిలేకున్నను అతడు దత్తస్వామిని ప్రార్థించిన కారణమున బాబా అతనికి సుతుని ప్రసాదించిన విషయము 1903లో బాబా తెలిపినాడు. (చూ. 399)

545-ఎ. బిడ్డలకు బాబా దీర్ఘాయువును ప్రసాదించుట

సా. బా: జి. జి. నార్కేకు బిడ్డలు కలరా?

భక్తుడు : బాబా! అతని బిడ్డలు మిక్కిలి బాల్యముననే మృతి నొందిరి.

సా. బా: అల్లా అనుగ్రహించును.

ఆ తరువాత నార్కేకు నలుగురు బిడ్డలు కలిగిరి. అందఱు దీర్ఘాయువు గలవారైరి.

(గమనిక : బాబా, 'బిడావే' సతినిగూడ యీ విధముగ అనుగ్రహించినాడు).

మనెను. ఆమె నిరాకరించెను. కుపితుడైన భర్త (సాతే) బండివాని చేతిలోని కొరడా లాగికొని భార్యను దండించుటకా కొరడా పైకెత్తెను. వెంటనే మేఘుడు - (మేఘశ్యామ) పరుగున వచ్చి -

మేఘ : బాబా నిన్ను వెంటనే ద్వారకామాయి మసీదునకు రావలసినదిగా ఆదేశించు చున్నాడు.

సాతే ఆ కొరడాను క్రింద పాఱవైచి, బాబా దగ్గఱ కేగెను.

సా. బా: ఏమి? ఆ విషయము. ఏమి జరిగినది? నీ భూమి అచటనే కలదు. వెళ్ళి దానిని చూడవలసిన అవసరమేమి కలిగినది?

హ. వి. సాతే తన భార్యను కొరడాతో కొట్టదలచిన ప్రయత్నమునకు సిగ్గుపడెను. తనయెడ, తన కుటుంబమునెడ నిరంతరము జాగృతితో ప్రసరించుచున్న బాబా కరుణార్ద్ర దృష్టిని దలంచుకొని సాతే మిక్కిలి సంతోషించెను.

8. వ్యాపారమున సహాయము

(ఎ) డి. యస్. రసానే

548. దామోదర్ - సావళ్రాం - రసానే బొంబాయిలోని ఒక దలారి ద్వారా ప్రత్తి చట్టావ్యాపార సంబంధమైన బేరము కలిగెను ఆ దలారి ఆ చట్టా వ్యాపారమున లక్షలకొలది లాభము కలుగునని రసానేకు తెలిపెను ఈ విషయమున బాబా సమ్మతి తీసికొనుమని రసానే - షిర్డిలోని శ్యామాకు ఉత్తరము వ్రాసెను. శ్యామా ఆ ఉత్తరమును బాబాదగ్గఱకు గొనిపోయెను. దానిని తెఱచి చదువు పూర్వమే -

సా. బా: దామియా- ఆకాశము నందుకొనజూచు చున్నాడు. దైవము ప్రసాదించినది నిలుపుకొని దానిలో సంతృప్తి నొందుటలేదు. దామియా మతి భ్రమించు చున్నది. అతని ప్రస్తుత స్థితి యెట్టి లోటులేదని వ్రాయుము. అతని కిపుడుగల సగమురొట్టె చాలును. లక్షలను గూర్చి ఆందోళన చెందవలదని తెలుపుము.

అంతట దామియా ఆ చట్టా వ్యాపారము చేయవలయునని అందు లభించు లాభములో బాబాకు భాగమీయ వలయునను తలంపున స్వయముగ షిర్డికి వెళ్ళి బాబాను దర్శించి, బాబా పాదములొత్తుచుండెను.

సా. బా: (బిగ్గరగ) దామియా! నేను దేనిలో లేను. అనగా - నా కీ సంసారమున దేనితో సంబంధము (లాభములు పంచుకొనుట మొదలగు వానితో సంబంధము) కల్పించుకొనెను.

(కావున 'దామియా' ఆ ప్రయత్నము మానెను).

తరువాత కొంత కాలమునకు దామియాకు ఒక తలంపు కలిగెను. ధాన్యమును పెద్ద మొత్తములుగ కొని, నెలలు, సం॥ములు నిలువచేసి, ధర హెచ్చిన పిదప అమ్మవలయునను ఉద్దేశము కలిగెను. దామియా బాబాదగ్గరకు వెళ్ళి 'బాబా! నేను ధాన్య వ్యాపారమును చేయుదునా?' అని అడిగెను.

సా. బా: వలదు. నీవు 5 శేర్లు చొప్పున కొని 7 శేర్లు చొప్పున అమ్ముదువు.

కాని కొన్ని వారముల వరకు ధాన్యము ధర హెచ్చు చుండెను. బాబా భవిష్యత్సూచన లసత్యములా - యను నట్లుండెను. కాని ఒకటి, రెండు నెలల తరువాత - శ్రావణమున అంతట వర్షములు సమృద్ధిగ కురిసెను. ధాన్యము ధరలు తలవని తలంపుగ తగ్గుచు నటుల చాల కాల ముండెను. ధాన్యము నిలువ చేసిన వర్తకులు మిక్కిలి నష్టముల పాలైరి. బాబా, దామియాను అట్టి దుర్గతి నుండి తప్పించెను.

(బి) బయ్యాజీ పటేల్

549. (1) సంవత్సరముల తరబడి బాబా బయ్యాజి - అప్పాజి - పటేలునకు నిత్యము 4 రూపాయలు చొప్పున నిచ్చుచుండెను.

సా. బా: ఈ ధనము నెవరికి అప్పు నీయవలదు. ఇతరులకు దాన ధర్మములు చేయవలదు. నీ సంసారమున నిత్య భోజనాదులకు వ్యయ పెట్టవలదు.

ఆ ధనముతో అతడు భూమి కొనవలయునని బాబా అభిప్రాయము. ఆ విధముగ బయ్యాజి ఆ ధనముతో 84 ఎకరముల భూమిని కొని యిప్పటికిని నిలుపుకొనినాడు.

(2) చెఱకు పంట పండించుట అచట రైతుల కాచారమైనది. గోదావరి లోయ యందు ప్రతి కృషీవలుడు చెఱకు పైరు వేయుచుండును.

బయ్యాజి : బాబా! నేను చెఱకు పైరు వేయుదునా?

సా. బా: వలదు.

కాని, ఇతరులు కావించు పనిచూచి చెఱకులో గొప్ప లాభముల గడింపవలయునను తలంపుతో బాబామాటలను పాటింపక బయ్యాజి చెఱకు నాటెను. పర్యవసానమున చెఱకు తోటలకు పెట్టిన పెట్టుబడి 400 రూపాయలు నష్టమగుటయేగాక, ఇతరములగు మెట్ట పైరుల వలన వచ్చు ధాన్యము-పశుగ్రాసము మొదలగు వానిని కోల్పోయినాడు.

(సి) రావ్ బహద్దూరు – యస్. బి. ధుమాల్

550. నాశిక్‌లో పబ్లిక్ ప్రాసిక్యూటర్ - (ప్రభుత్వపక్ష న్యాయవాది) ఉద్యోగమునకు చేరవలసినదిగా ధుమాల్‌నకు పిలుపు వచ్చెను. బాబా అంగీకారము కొఱకు ధుమాల్ షిర్డిలోని శ్యామాకు ఉత్తరము వ్రాసెను.

సా. బా: ఆ క్రొత్త ఉద్యోగము అతడంగీకరింపనేల? పాత పదవియే చాలును.

యస్. బి. ధుమాల్ ఆ ప్రభుత్వ న్యాయవాది పదవిని నిరాకరించెను. అతని ఆదాయమున కెట్టి కొఱతయు కలుగలేదు.

9. భక్తుల ప్రేమకులోగి బాబా తన పూజకు సమ్మతించుట

551. భక్తులు తన భౌతిక తనువును పూజించుట బాబాకు మొదటి నుండియు నిష్టములేదు. వారించినాడు. కాని తీవ్రమైన భక్తిగల మహల్సాపతి బాబాపూజను ప్రారంభించెను. బాబా కాదనలేకపోయెను. నా. గో. చందోర్కరు కుమారుడు 'బాపు' - 4 ఏండ్ల బిడ్డ దీనిని కొనసాగించెను. ఆ బిడ్డవలె అందఱు ఆ స్వాతంత్ర్యమును చూఱగొన దొడగిరి. అప్పటికిని బాబా తన ముఖమున గంధముతో అడ్డముగ త్రిపుండ్రములను పెట్టుటకు సమ్మతించలేదు. కాని డాక్టర్ పండిట్ వచ్చి బాబా ముఖమున గంధముతో త్రిపుండ్రములను అడ్డముగ పెట్టినాడు. బాబా ప్రశాంతముగ నోర్చికొనినాడు.

దాదాకేల్కార్ : బాబా! ఏమిది? చందన తిలకమును నిరాకరించువాడవు నీ విపుడు సమ్మతించితివేల?

సా. బా: ఈ పండిట్ తన బ్రాహ్మణ గురువు ధోపేశ్వర్‌లోని కాకా మహారాజుగ నన్ను మనసున భావించి, తన గురువునకు గంధము, తిలకము దిద్దినట్లు నా నుదుటనుంచినాడు. కావున నేను నిరాకరింప జాలనైతిని.

తరువాత అబ్దుల్‌రంగారి (ముస్లిం) వచ్చి బాబానిట్లు ప్రశ్నించెను.

అ. రం: ఏమిది? నీ నుదుట గంధ మలదబడినదే! ఇది మన ఆచారము కాదు.

సా. బా: "జైనాదేశ్ - వైపొవేష్" - మన పరికరముల ననుసరించి మనము వర్తింపవలె. ఈ హైందవులు వారిదైవముగ నన్ను పూజించు చున్నారు. వారి మనస్సును నేను బాధింపనేల? వారి నటుల కావించుటకు సమ్మతించితిని. నేను భగవానుని భక్తుడనే.

బాబా – గురుపూర్ణిమ జరుప నియమించుట.

552. 1909 నుండి బాబా నిత్యసమిష్టి ఆరతిపూజలు ప్రారంభ మైనవి. కాని గురుపూర్ణిమ (ఆషాఢశుద్ధపూర్ణిమ) నాడు బాబా ప్రత్యేక పూజారాధనలు జరుపు ఆచారములేదు. 1909 గురుపూర్ణిమనాడు బాబా స్వయముగ దాదాకేల్కారును పిలువనంపెను. "ఈ దినము గురుపూర్ణిమయని నీ వెఱుగవా? పూజా ద్రవ్యములగొనివచ్చి గురుపూజ గావింపుము"-అనెను. ఆ దినమున గురుపూజ కావింపబడినది. అది మొదలు బాబా భక్తులందఱు గురుపూర్ణిమనాడు ప్రత్యేక గురుపూజ గావించు ఆచారము ప్రారంభమై నేటికిని జరుపబడుచున్నది.

కాని, శివరాత్రినాడు అర్ధరాత్రమున రహస్యముగ బాబాపూజ జరుపుచున్న హ. వి. సాతేను బాబా వారించెను.

10 భక్తులయెడ బాబా జాగరూకత

(ఎ) నా. గో. చందోర్కర్.

553. నా. గో. చందోర్కర్ - పండరిపురమునకు బదిలీచేయబడి, అచట ఉద్యోగములోజేరు పూర్వము బాబా సెలవు తీసికొన షిర్డికివచ్చు చుండెను. బాబా అచటజేరిన భక్తుల - మహాల్సాపతి, కాశీరాం, అప్పా సింధిలను సంబోధించుచు నిట్లనెను. మనము నలువురము భజనచేయుదము. పండరిద్వారము చక్కగ తెరువబడినది. మన మానందముతో భజన చేయుదము. బాబా గేయమునిట్లు ప్రారంభించెను.

పండరికిని దారి పట్టి పోవుదుము
ఉండు దమిక యందె యుండు వారలము
చక్కగ నట నివాసంబు జేయుదుము
అక్కడ మన ప్రభు వలరారుజిరము.

వారు ఈ కీర్తనము గానము చేయుచుండగా నానాసాహెబ్ చందోర్కరు మసీదుజేరెను.

554. తానాప్లీడరు 'జోషి' తమ్ముడు చిన్నజోషి షిర్డికి వెళ్ళి బాబాను దర్శింపదలచెను. కాని వెళ్ళుటకతనికి సాధ్యపడలేదు. కొన్ని దినముల తరువాత ఒక కొంకణాస్థ బ్రాహ్మణుడు బొంబాయికి వెళ్ళుటకు బాబా సెలవు కోరుచుండెను.

సా. బా: (కొం. బ్రా. తో) ఈ ఉధిపొట్లము దీసికొనివెళ్ళి, నీవు ప్రయాణముచేయు రైలులో నీ దగ్గఱనుజేరి, కూర్చుండుటకు కొంచెము 'జాగా' నీయుమని కోరునతనికి దీనినిమ్ము.

కొం. బ్రా: (ఆ ఉది పొట్లము తీసికొని) నా కెవరు సందర్భ పడని యెడల దీనిని తిరిగి మీకు పంపుదును.

సా. బా: నీ వా మనుష్యుని జూతువు.

అంతట ఆ బ్రాహ్మణుడు కోపర్గామునుండి బొంబాయికి రైలులో బయలుదేరెను. కల్యాణ్ స్టేషన్ వరకు నెవ్వరు తటస్థపడలేదు. కల్యాణ్ దగ్గఱ రైలుబండిలోని పెట్టెలు - ఈ బ్రాహ్మణుడున్న పెట్టె క్రిక్కిరిసి యుండెను. ఆ చిన్న జోషి యాతడున్న పెట్టెలోనికి కొద్దిగా జాగా నిమ్మని ఆ బ్రాహ్మణుని కోరెను. కొం. బ్రాహ్మణుడు కొంచెమెడమిచ్చి, ఆ ఉధి పొట్లమును అతని కొసంగెను.

555. 1915 అక్టోబరు 3వ వారమున సాయంత్రమున 5 గంటలకు కాకా మహాజని, తన యజమాని సేత్‌యొక్క కుమారుని గలిసెను.

సేత్ కుమారుడు : నా తండ్రి తాను నాశిక్‌లో ఇంకా కొన్ని దినము లుండుమనునో - లేక - బొంబాయికి జేరుమనునో - బాబా ఆదేశమేమిటో తెలిపికొనుమని నాశిక్‌నుండి ఉత్తరము వ్రాసినాడు. కావున దయతో షిర్డికి వెళ్ళి బాబానడిగి తెలిసికొనుము.

కా. మ: హ. సీ. దీక్షిత్తు షిర్డిలో నున్నవాడు. ఆయనకు ఉత్తరము వ్రాసి బాబాఆజ్ఞను తెలిసికొందుము.

సేత్ కుమారుడు : వలదు వలదు. నీవు స్వయముగా వెళ్ళి బాబా ఆదేశమును తెలిసికొని రావలసినదిగా తండ్రిగారు వ్రాసినారు.

కా. మ: సరే - నేను వెళ్ళుదును.

ఆ సమయమున బాబా మసీదులో హ. సీ. దీక్షిత్తు మరి 24 గురు భక్తులతో నున్నవాడు.

సా. బా: (హ. సీ. దీక్షిత్తు వంకకు తిరిగి) అహెూ! ఏమి! ఆ విషయములు - వాదములు - ఆలోచనలు?

మఱునాడు కాకా మహాజని షిర్డికి వెళ్ళెను.

సా. బా: (కా. మ.తో) నీవు వచ్చి మంచిపని చేసితివి.

(దీక్షిత్ వైపునకు తిరిగి) నిన్న సాయంత్ర మీ విషయమై తలంచు చుంటిని గదా!

అంతట కా. మహాజని, హ. సీ దీక్షిత్తు ఇరువురు కలియబలుకుకొని, బాబా తన భక్తులను షిర్డియందు, బొంబాయియందు నొకే కాలమున నెట్లు జాగృతమై కనిపెట్టియున్నది గుర్తించిరి. (చూ. 9)

(బి) రావ్‌బహద్దూర్. యం. డబ్లుయు - ప్రధాన్ - తల్లి

556. సా. బా: (ప్రధాన్‌తో) నాకీ పార్శ్వమున మిక్కలిగ నొప్పి యేర్పడినది. 2 లేక 4 దినములలో తగ్గిపోవును.

బాబా పై మాటలు పలుకునపుడు ఆరోగ్యముగనే యున్నవాడు. ప్రధాన్ ఆ మాటలపుడు గ్రహింపలేకపోయెను అతడు బొంబాయిలోని తన యింటికి జేరగా తన తల్లికి పక్షవాతము సంబంధమగు నొప్పి తీవ్రముగ గలిగి 2, 4 దినములలో తగ్గినట్లు తెలిసికొనెను.

(సి) (మేనేజర్) సదాశివతార్ఖాడ్ – సేవకుడు

557. సా. బా: (తార్ఖాడ్ ఎదుట) నా కాలు నొప్పిగా నున్నది. కలబంద చీల్చి నిప్పుపై వెచ్చచేసి కాలిపై కాపుకాచిన అది తగ్గిపోవును.

అది తార్కాడ్ సేవకునకు కలిగిన (బోదెకాలు) నొప్పి, బాబా తెలిపిన ఆ ప్రక్రియ చేయగా నతని కాలునొప్పి తగ్గినది.

(11) బాబా జాగృతి – భవిష్యత్ జ్ఞానము

(ఎ) జి. జి. నార్కే – (చూ. 608)

558. 1916 న బాబా నిత్యహారతి వేళకు షిర్డిలో హల్వా రొట్టె తయారుచేసి పంపువాడు ప్లేగు వ్యాధిచే మరణించెను

సా. బా: (నార్కేతో) హల్వాయి అంగడికి వెళ్ళి నైవేద్యము తీసికొని రమ్ము.

నార్కే : (అచటకువెళ్ళి హల్వాయి భార్యతో) బాబా నైవేద్యమును పంపుమను చున్నాడు.

హ. భార్య : అటు చూడుము. ప్లేగు వ్యాధిచే మరణించిన నా భర్త కళేబర మదిగో - హల్వా ఆ అలమారలో నున్నది. నీ కిష్టమేని తీసికొని పొమ్ము.

జి. జి. నార్కే ఆ హల్వా నైవేద్యము స్వీకరించిన తనకు ఇతరులకు ప్లేగు వ్యాధి సోకునను భయముతో గడ - గడ వణకుచు ఆ హల్వా తీసికొని వెళ్ళి బాబా ముందుంచెను.

సా. బా: నీవు షిర్డికి దూరముగ నుండిన బ్రతుకుదు వనియు, షిర్డిలో నున్న మరణింతువనియు దలచుచుంటివా? అటులెన్నటికినికాదు. దైవ యోగమున ఎవరెవరు బ్రేటుపడవలసి యుందురో వారే బ్రేటుపడుదురు. ఎవరెవరు చావవలసి యుండిరో వారే చత్తురు. ఎవరెవరు లాలింపబడవలసి యుందురో వారే లాలింపబడుదురు. (చూ. 288, 608)

ఆ హల్వా నైవేద్య మందరకు పెట్టబడెను. దానివలన నెవరికి ప్లేగు వ్యాధి కలుగలేదు.

(బి) యస్. బి. ధుమాల్

559. ధుమాల్ – తాను నివసించు నాశిక్ పురమున ప్లేగు వ్యాపించి తన యింటిలో నెలుకలు చచ్చిపడుట గమనించెను. తన

గృహమును విడిచి దూరముగనున్న బంగళాలో చేరుట మంచిదేమో బాబా నడిగి తెలుపుమని ధుమాల్ షిర్డిలోని శ్యామాకు ఉత్తరము వ్రాసెను. బంగళాలో చేరుమని బాబా అనుమతి అందెను. కాని, బంగళాలో చేరిన రాత్రియే మంచములం దొకదానిపైన చచ్చిన ఎలుక పడియుండెను. అంతట ఆ బంగళా విడిచి మరియొక తావునకు వెళ్ళుట తగునో, తగదో తెలుపుమని ఉత్తరముద్వారా ధుమాల్, బాబాను కోరెను. సమాధానము వచ్చువరకు అచటనే యుండెను. బంగళాలోనే యుండుమని సమాధానము వచ్చెను.

ఆ పిదప యిరుగుపొరుగు గృహములందువలె బంగళాలో నెల్లెడల సేవకుల నివాసమున బావియందు చచ్చిన ఎలుకలు కనబడెను. మరల ధుమాల్ బాబాకు జాబు వ్రాసి, సమాధాన మందుపూర్వమే బంగళాలోని తన సామానులు సర్దుకొని తిరిగి నాశిక్ పురమున తన యింటిలో చేరు తలంపున నింటి తలుపు తాళము తీయుచుండగ బాబా సమాధానము అందెను. 'ఇప్పుడున్న నివాసము మనమేల మార్చవలయును?' అని సమాధానము.

వెంటనే ధుమాల్ తిరిగివెళ్ళి బంగళాలో చేరి అచటనే నివసించెను. బాబా పరిరక్షణమున నున్న ధుమాలునకు, అతని కుటుంబమునకు ఎట్టి ఆపదలు కలుగలేదు.

559-ఎ. షిర్డీ గ్రామ జనులు : (అప్పా కులకర్ణి మృతి పిదప) బాబా! గ్రామములో కలరా వ్యాధి అతిభయంకరముగ వ్యాపించు చున్నది. మమ్ము రక్షింపుము.

సా. బా: భయపడ వలదు. ఏడుగురు మాత్రమే మృతి నొందుదురు. ఆ పిదప ఈ వ్యాధి అంతరించును.

12. బాబా – తన భక్తుల అధిపతి – యజమాని స్థానము వహించుట

(ఎ) కాకా మహాజని

560 సా.బా: థాకర్‌సే (సేత్) ఎట్లు కాకా మహాజని యజమాని కాగలడు? అతనికి పరమానందము ప్రసాదింపగల వేఱొక యజమాని కలడు.

(బి) ఆర్. బి. పురందర్ విషయము

561. ఒక భక్తుడు : అతడు (పురందర్) సెలవు అతిక్రమించి యిచట నుండిన యజమాని అతనిపై కఠిన చర్య తీసికొనును.

సా. బా: నేనే అతని యజమానిని.

562. భక్తుడు : రైలు అందుకొనుటకు నాకు సెలవు ప్రసాదింపుము. లేకున్న ఈ ఉద్యోగము నుండి తొలగింపబడును.

సా. బా: (నీకు నాకంటె) ఇక్కడ నున్నతాధికారి యెవడు లేడు. భోజనముచేసి సాయంత్రము వెళ్ళుము.

బాబా ఆజ్ఞను చలింపని విధేయతతో పాటించుట అత్యంత క్షేమకర విధానముగ భక్తులెల్లరు గుర్తింపగలిగిరి.

13. అపరాధుల (నేరము కావించినవారి) యెడను బాబా కరుణ

563. 1915 దసరాలో ఒక దినమున –

సా. బా: (హ. సీ. దీక్షిత్తుతో) కాకా! మన దర్బారు నందు మంచి వారివలె చెడ్డవారును చేరుదురు. మనము నిష్పక్షపాత బుద్ధితో వారి నాదరించవలె - కాదా?

అపుడొక గుమాస్తా వచ్చి బాబా పాదముల ముందల సాగిలబడెను. అతడు తన యజమాని ధనము అపహరించిన కారణమున అతని బట్టుకొని తెచ్చుటకు వారంటు (అధికార పత్రము) జారీ చేయబడి యుండెను. మసీదు నందపుడాతని పై అధికారి యొకడు కలడు. తాను వెంటనే వెళ్ళి పోలీసులకు తెలుపవలదా? - అని అతడు తలంచెను.

బాబా అంతట వాస్తవమైన పేర్లుకాక (వాణి - తాలి) యితర పేర్లను పేర్కొనుచు ధనాపహరణము కావించుట - అతనిపై వారంటు మొదలగు వానిని గూర్చి పలికెను.

సా. బా: (ఆ గుమాస్తాతో) నీవు వెళ్ళి వెంటనే భోజనము చేయుము.

సా. బా: (పై అధికారితో) నీ విక్కడనే యుండుము!

సా. బా: (భోజనము చేసివచ్చి బాబాతో ఏకాంతముగ మాటాడిన ఆ గుమాస్తాతో) నీ విపుడు వెళ్ళిపొమ్ము.

సా. బా: (ఆ గుమాస్తాను పాటిపోనిచ్చి నందులకు తన పై అధికారులు తన్నునిందితురేమోయని భయపడుచున్న పై అధికారితో) నీవు భయపడుచుంటివా?

పై అధికారి : లేదు. బాబా!

పై అధికారికి 3, 4 రోజుల తరువాత షిర్డినుండి వెళ్ళుటకు బాబా అనుమతి నిచ్చెను. అతని పై ఉద్యోగు లాతని నిందింప లేదు. ధనాపహారణము చేసిన గుమాస్తా (బాబా బోధలను పాటించుటచే) స్వయముగ న్యాయాధికారుల యెదుటబడి తన నేరము ఒప్పుకొనెను. అతని యజమాని కఠిన శిక్ష విధింపుడని కోరని కారణమున ఆ గుమాస్తాను స్వల్పశిక్షతో న్యాయాధిపతులు విడిచిరి.

14. ప్రయాణములందు బాబా సహాయము

564. సా. బా: [హరిదాసు దా. గా. తో నున్న నానాతో] భోజనము చేసి రైలుకు వెళ్ళుడు.

[హరిదాసు [దా. గా.] బాబాయందు విశ్వాసములేని కారణమున భోజనము చేయకయే బయలుదేరి వెళ్ళెను. నా. గో. చందోర్కరు భోజనము చేసి రైలువచ్చు పూర్వమే స్టేషనుకు చేరుకొన గలిగెను].

నానా చందోర్కరు భోజనముచేసి మరల బాబా సెలవు తీసికొనిన పిదప బయలుదేరెను. ఇంత జాగుచేసినను ఆ బండి కొన్ని గంటలు ఆలస్యమగుటచే రైలు వచ్చువేళకు చేరగలిగినాడు.

కోపర్గామునకు 'బేరే' ప్రయాణము

564-ఎ. 'గణేష్ - విష్ణు - బేరే' [వ్యవసాయశాఖ ఇన్స్పెక్టర్] దాస్‌గాణూతో కలిసి టాంగాపై కోపర్గామునకువెళ్ళి రైలు నందుకొనవలయునని బాబా సెలవు కోరెను.

సా. బా: త్వరపడుము. ఆలసింపకుము. నీవు స్టేషన్ జేరువరకు టాంగా నెక్కడ నాపనీయకుము!

ఆ విధముగ నిరువురు టాంగాపై షిర్డీనుండి బయలుదేరిరి. రైలు వచ్చుటకింకను వ్యవధికలదు. కానవు ఇతర టాంగాలవాండ్రు 'వేరే' యున్న టాంగాను కొంచెముసేపు ఆపుమని కోరిరి. వారి మాటలను లెక్కింపక వేరే రైలువేళకు చాలముందుగనే కోపర్గామునకు క్షేమముగ జేరెను. తరువాత ఇతర టాంగాలు రైలువేళకు చేరికొనినవి. కాని ఆ టాంగాలను దారిదోపిడి దొంగలడ్డగించిరి. బాబా త్వరపెట్టిన కారణమవుడు వేరేకు విశదమయ్యెను.

565. సా. బా: (పురందర్‌తో) నాశిక్‌లో రెండు రోజులుండి వెళ్ళుము.

(ఆర్. బి. పురందర్ బిడ్డలకు జబ్బుచేసిన కారణమున నాశిక్‌లో 2 రోజులుండి వెళ్ళవెలసి వచ్చినది).

566. సా. బా: (నాశిక్ - వెళ్ళదలచి, బి. వి. వైద్యతో)నాశిక్‌లో ప్లేగు వ్యాధికలదు. నీ బిడ్డలతో నింటికి తిరిగి వెళ్ళుము

567. సా.బా: (కోర్టుకు హాజరు కావలసినదిగా ఉత్తరువులందిన 'తాత్యా'తో) ఈ రోజున నీవు కోర్టుకు వెళ్ళవలదు. (తలవని తలంపుగ ఆ దినమున కోర్టు మూసివేయబడినది).

568. సా.బా: (తాత్యాతో) నీవు మార్కెటునకు వెళ్ళవద్దు. కాదా శ్యామాను వెంటదీసికొనిపొమ్ము.

శ్యామాను తోడుచేసికొనక తాత్యా ఒంటరిగ వెళ్ళెను. తీవ్రమైన నడుమునొప్పిచే నొక గుఱ్ఱము స్వాధీనము తప్పిపోయినది.

569. సా. బా: ఆంగ్లేయుడా! కోపర్గామునకు వెళ్ళవలదు.

ఆ ఆంగ్లేయుడు వెళ్ళెను. మార్గమధ్యమున బండినుండి క్రిందబడెను. తుదకు ఆస్పత్రిలో చికిత్సకొఱకు చేర్చబడెను.

570. సా. బా: (అప్పుడే షిర్డీకిజేరిన కాకా మహాజనితో) నీ వెప్పుడు తిరిగి యింటికి వెళ్ళుదువు?

కా. మ: బాబా! నీ ఆజ్ఞయైనపుడు.

సా. బా: రేపు ఉదయము వెళ్ళుము.

కాకా మహాజని మఱునాడు ఉదయమే బయలుదేరి వెళ్ళెను. అతడు 'ఆఫీసు' చేరుసరికి అతని ఉనికి ఎంతయో అవసరమయ్యెను.

571. సా. బా: (బాబా అనుగ్రహమున ఉద్యోగమేదేని సంపాదించుకొనవలయునను ఆశతో అప్పుడే షిర్డికిజేరి బాబాను సందర్శించిన 'సదాశివతార్కాడ్' తో) అహమ్మద్‌నగర్ మీదుగ నీ స్వస్థానమగు పూనాకు వెళ్ళుము. తాత్యాపటేల్ తో ఇప్పుడే ప్రయాణమగుము.

సదాశివతార్కాడునకు వెంటనే తిరిగి వెళ్ళుట-అందులో ఏ ఉద్యోగము లేక తిరిగిపోవుట - మిక్కిలి కఠిన సమస్యయైనది. కాని అతడు పూనాచేరగా అచట యంత్ర కర్మాగారమున కూలీలు సమ్మె చేయుటచే ఆ యంత్ర యజమానులు 'తార్కాడ్' రాకకొఱకు అత్యాతురతతో నిరీక్షించుచుండిరి. ఆ యజమానులు "తార్కాడ్" ను ఆ యంత్ర కర్మాగారమునకు కార్య నిర్వాహకునిగ నియమించిరి.

572. సా.బా: (నా.గో.చందోర్కరుతో) నీ వీ రోజున వెళ్ళవలదు. కోపర్గామున కలెక్టరును కలిసికొనుటకు రేపు పొమ్ము.

కలెక్టరు ఆరోజు కార్యక్రమము తంతిద్వారా రద్దుచేసికొని, అ మఱునాడు కోపర్గామునకు 'మకాం' ఏర్పాటు చేసికొనెను. ఆ విషయము చందోర్కరెఱుగడు. బాబా తన అంతర్జ్ఞానమున దెలిసికొన జాలినాడు.

573. సా. బా: (పండరిపుర న్యాయవాదితో) నీవీ రోజున బయలుదేరవలదు. నీ పండరి వ్యాజ్యముకొఱకు రేపు ప్రయాణమగుము.

ప్రతిపక్ష - ప్రభుత్వ న్యాయవాది తనకెట్టి సమాచారమందింపకయే మఱునాటికి వాయిదా వేయించికొనినట్లు పండరి న్యాయవాది తరువాత తెలిసికొనెను.

574. హ. సీ. దీక్షిత్తు : (బాబాతో) 6-2-1916న 'విల్' దావా విచారణమునకు వచ్చును. కావున బొంబాయిలోనివారు నన్నిపుడు బయలుదేరి సాక్ష్యమిచ్చుటకు రావలసినదిగా కోరుచున్నారు.

సా. బా: వలదు - వలదు - మనము వేచి చూచెదము.

హ. సీ. దీక్షిత్తు : (తరువాత) ఆ దావా 9వ తేదీకి వాయిదా వేయబడినట్లున్నది.

సా. బా: మనము వేచి చూచెదముగాక!

హ.సీ.దీక్షిత్తు : బాబా! ఆ దావా 13వ తేదీకి వాయిదా వేయబడినది.

సా. బా: మనము నిదానించి చూచెదము –

బాబా - హ.సీ. దీక్షిత్తును 14వ తేదీన బయలుదేరుటకు సెలవిచ్చెను. బొంబాయిలో ఆ దావా సరిగ 15వ తేదీన విచారణకు దీసికొనబడెను. ఆ విధముగ దీక్షిత్తు షిర్డీలో నిలుపబడుట బొంబాయిలోని దాని సంబంధీకులకు ప్రమాదకరముగ నుండెను. వారు దీక్షిత్తునకు 'వారంటు' పంప నాలోచించుచుండిరి. 14 వ తేదీన బాబా, దీక్షిత్తును పంపుటచే ఆ వివాదాంశము (వారంటు జారీచేయించుమని) తొలగిపోయెను.

574-ఎ. బాబా చంద్రాబాయి బోర్కరును పండరిపురమునకు వెళ్ళుమనెను. అచట ఆమె భర్త బోర్కర్ ఉద్యోగము చేయుచున్న స్థలము, ఆమె వెళ్ళి తన భర్త మఱియొక తావునకు బదిలీ అయినట్లు తెలిసికొని అచట ధర్మశాలకు జేరి విచారముగ గూర్చుండెను. ఒక ఫకీరు ఆమె దగ్గఱకువచ్చి, ఆమె భర్త "ఢోండు"నకు బదిలీ అయినట్లు తెలిపి, టిక్కెట్లు ఇచ్చి, ఆమె నటకు గొనిపోవుటకొక మనిషిని తోడుగనిచ్చి పంపెను.

15. వివాహ విషయముల బాబా సహాయము

(ఎ) ఆదామ్ దలాలీ

575. ఆదామ్‌దలాలీ : (బాబాతో) నా కుమారునకు వివాహము కావలయును. నీ వనుగ్రహించి ఆశీస్సులొసగినతప్ప ఆ కార్యమునకు నాకు ధన మెట్లు చేకూరును?

సా. బా: వేచియుండుము.

సా. బా: (కొంతకాలము జరిగిన తరువాత ఆ. దలాలీతో) ఇపుడు నీ కుమారుని వివాహము జరుపుము.

ఆ దలాలీ ఒక మంచి దలారీ వ్యాపారము సంపాదించుకొనెను. దానివలన లభించిన ధనముతో అతని పెద్దకుమారుని వివాహము జరిపెను.

ఆ విధముగ ఆ. దలాలీయొక్క తక్కిన యిరువురు కుమారుల వివాహములు బాబా ఆశీః ప్రభావమున కావింపబడెను.

(బి) యల్. జి. ముగ్నే

576. లక్ష్మన్ - గోవింద్ - ముగ్నే 1890లో రహతాకు వెళ్ళెను. అచట సాయిబాబాను కలిసెను.

సా.బా: బిడ్డా! రమ్ము. నిన్న నీ విషయమై తలంచుచుంటిని. రమ్ము. ఈ మామిడిపండు తిని, నా పాదముల నొత్తుము. నీ వెందుకు వచ్చితివి?

ముగ్నే : నా వివాహము నిశ్చయింపబడినది. నాకు ఆభరణములు లేవు. (నా బంధువుల వద్దనుండి) ఆభరణములను అరువు తీసికొనుటకు వచ్చితిని.

సా. బా: ఎవడు ఎవనివాడు? ఇచ్చువాడెవడు? తీసికొనువాడెవడు? సమయమున కెవ్వరు సాయపడరు. నీకు 1000 లేక 2000 రూపాయలు (విలువగల ఆభరణములు) కావలయునా - నా దగ్గఱనుండియే తీసికొనుము.

ముగ్నే : [తనలో] ఈ పేద ఫకీరు నాకు 2 వేల రూపాయలు విలువగల ఆభరణము లెట్లీయ గలడు?

అతని బంధువులు [బాబా ముందుగ దెలిపినటుల] సహాయము చేయ నిరాకరించిరి. ముగ్నే మిత్రుని ప్రేరణమున 'సిన్నేరు' ఒక గుజరాతీ షాహుకారు 25 రూపాయలు రొక్కము తీసికొని 2 వేల రూపాయలు విలువగల ఆభరణముల నతనికి అరువుగనిచ్చెను. ఆ విధముగ 'ముగ్నే' వివాహము జరిగెను.

[సి] దామోదర్ రసానే

577. దామోదర్ రసానే పెద్దకుమారుడు 'నానా దౌలత్‌షా' కు నాలుగు పెండ్లి సంబంధములు వచ్చినవి. అందొకరు 2500 లేక 3000 రూపాయలు కట్నము నిత్తుమనిరి.

డా. రసానే : ఈ నలువురు కన్యల జాతకముల ననుసరించి యే కన్యను నా కుమారునకు జేసికొనమందువు?

సా. బా: (పేదకన్యయొక్క జాతకము తీసికొని) దామియా! ఈ బిడ్డను నీ కోడలుగా స్వీకరింపుము! ఆ కన్యను దౌలత్‌షా వివాహమాడెను. ఆ నిర్ణయము మిక్కిలి శుభకరమైనది.

(డి) యస్. బి. ధుమాల్

యస్. బి. ధుమాలునకు 36వ ఏట భార్యా వియోగము కలిగెను. అతనికి సంతతిలేదు. అతని మామ రావుబహద్దూర్. బి. డి. కింఖేడ్ - ధుమాలును తిరిగి పెండ్లి చేసికొను మనెను. కింఖేడ్ - బాబాను దర్శించి యా విషయమును దెలుప బాబా నేత్రములు అసమ్మతిని సూచించెను. బాబా ధుమాలును పునర్వివాహము జేసికొననీయలేదు. కావున రావుబహద్దూర్, యస్. బి. ధుమాల్ జీవితపర్యంతము ఏకాకిగనే గడపెను.

16. యం. బి. రేగేయెడ బాబా ప్రేమ

578. సా. బా: (పట్టభద్రుడై ప్రప్రథమున షిర్డికిజేరి బాబా పాదములకు ప్రణమిల్లిన యం. బి. రేగేతో) ఏమి, నీవు ఒక మానవునకు మ్రొక్కుదువా?

యం. బి. రేగే ఆ ఆక్షేపణ (ప్రతిఘటనము) చే నిస్పృహనొంది స్తబ్ధుడయ్యెను. తుదకు బాబా ఏకాంతముగ నున్నప్పుడు అతడు బాబాను సమీపించెను. బాబా అతని జేరబిలిచి, యతడు తన శిరమును బాబాపాదముల జేర్చి మ్రొక్కినతోడనే రేగేను కౌగిలించుకొని తన సమీపమున గూర్చుండ బెట్టుకొనెను.

సా. బా: నీవు నా బిడ్డవు. ఇతరులు (క్రొత్తవారు) దగ్గఱనుండగా బిడ్డలను జేరనీయక దూరముగ నుంచుదుము.

తరువాత కొంతకాలమునకు రేగే షిర్డికి వచ్చినపుడు తన విడిదిలో సాయీనామజపము చేయుచుండెను. బాబా రేగేను పిలువనంపెను.

సా. బా: ఈ ఉదయమున ఏమి చేయుచుంటివి?

రేగే : జపము.

సా. బా : ఏ నామము?

రేగే : నా దైవముయొక్క నామము.

సా. బా : నీ దైవమెవరు?

రేగే : నీవది యెఱుగుదువు.

సా. బా : (చిరునగవుతో) మంచిది.

ఆ రూపమున బాబా - సాయినామ జపమును - భక్తుని ఆధ్యాత్మిక సాధనా విషయ గోపనమును గూర్చి తన సమ్మతిని విశదము చేసినాడు.

ఒక సమయమున (గురుపూర్ణిమ కావచ్చును) భక్తులందఱు (రేగే తప్ప) పూలదండల దెచ్చి బాబాకు సమర్పించిరి. అపుడు రేగే తానుగూడ పుష్పమాల గొని రాకపోవుటకు మనస్సున మిక్కిలి బాధ నొందెను. అంతట బాబా తనపై నున్న పూలమాలల నన్నిటిని పైకెత్తి పట్టుకొని రేగేవైపు చూపి, "ఇవి యన్నియు నీవే!" అనెను.

1915 శ్రీరామనవమి సముయమున రేగే బాబాకు - తనకు అభేద స్థితి బాటించుచు - బాబా యీ విషయమున తన సమ్మతి దెలుపుచు - తమ యిరువుర అభేద స్థితిని బ్రకటించవలయునని తలంచెను. శ్రీరామనవమి నాడు భక్తులు నూతన వస్త్రముల గొనివచ్చి బాబా ముందుంచిరి. బాబా తన దివ్య హస్తమున వానిని స్పృశించి తిరిగి ప్రసాదించుట కటుల గావించిరి. రేగే 85 రూపాయలకు చక్కని (డెక్కా మస్లిన్) పట్టు శాలువ ముడిచి కాగితమున జుట్టి, జేబులో పెట్టుకొని వచ్చి, బాబా పాదములకు మ్రొక్కుచు ఎవరి కంట బడకుండ ఆ శాలువ ముడిచిన పొట్లమును బాబా కూర్చున్న గద్దెక్రింద బెట్టెను. అటుల చేయుచు తనకు బాబాకు అభేద మగుటచే బాబా తన ప్రేమను సత్యముగ పాటించువాడే అయిన ఆ శాలువను తిరిగి యీయక బాబా దానిని ధరించవలయునని తన మనస్సున నిశ్చయించుకొనెను. భక్తులు తెచ్చిన వస్త్రముల నన్నిటిని తిరిగి యిచ్చివేసిన పిదప బాబా తన గద్దెపై నుండి లేచెను.

35)

సా. బా : ఈ గద్దెమీద నున్నవాని నన్నిటిని తీసివేసి, దులిపి శుభ్రము చేయుడు.

ఆ గద్దెను తీసి దులుపునపుడు ఆ శాలువ ముడిచిన చిన్నకట్ట బయట పడెను.

సా. బా : (దానిని తీసికొని, విప్పి పఱచి) అహెూ! ఏమిది! శాలువ! దీనిని నేను తిరిగి యిాయను. ఇది నాది.

సా. బా : (దానిని తనపై కప్పుకొని, యం. బి. రేగేవైపు తిరిగి) దీనిని ధరించిన నేను చక్కగలేనా?

బాబా తమ అభేద స్థితి నంగీకరించి ఆ బహూకృతిని అట్టి తలంపుతో స్వీకరించినాడని రేగే మిక్కిలిగ నుప్పొంగినాడు.

17. ప్రాణ రక్షణము

ఎ) యస్. బి. నాచ్నే

579. సా. బా : (1913 న యస్. బి. నాచ్నే- ఇంకను పలువురు భక్తులయెదుట) పిచ్చివారలను మనమెప్పుడు విశ్వసింపరాదు.

1914 న నాచ్నే తనయింట పూజ గావించుచుండెను. ఒక పిచ్చివాడు లోనికి జొరబడి నాచ్నే కంఠమును పట్టుకొని "నీ రక్తము నేను త్రావుదును" అనుచు నోరు లెస్సగ తెఱచి కంఠమును కొఱుకబోయెను. నాచ్నే తన చేతిలో నున్న ఉద్ధరిణను ఆ పిచ్చివాడు తెఱచిన నోటిలోనికి జొనిపి, వెంటనే స్మృతి తప్పెను. ఇతరులు వెంటనే వచ్చి నాచ్నే ప్రాణములను కాపాడిరి. తరువాత నాచ్నే షిర్డికి వెళ్ళి బాబాను దర్శింపగా-

సా. బా : (యస్. బి. నాచ్నేను చూపుచు అన్నా చించినీకర్‌తో) అన్నా! నేనొక క్షణ మాలసించిన నీతడు మరణించి యుండెడివాడే. ఇతని కంఠమును ఆ పిచ్చివాడు తన చేతులతో పట్టుకొనెను. నేనా పిచ్చివానిని త్రోసివైచితిని. ఏమి చేయవలెను? నా బిడ్డలను నేను రక్షింపకున్న నింక రక్షించు వారెవరు కలరు?

బి) నిమోన్కర్ బిడ్డ

580. యస్. యస్. డి. నిమోన్కర్ [సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్] పూనా నుండి బయలుదేరి, బిడ్డను కనిన తన సోదరుని భార్యను చూచుటకు 'నిమోన్' అను చోటునకు వెళ్ళుచు మార్గమున షిర్డికి జేరి బాబాను సందర్శించెను.

సా. బా : (సెల వొసంగుచు అందఱకు వలె 'ఉధి' ని ప్రసాదించుచు నిమోన్కర్‌తో) ఆ బిడ్డ ప్రాణముల గాపాడుము.

నిమోన్కర్ : 'నిమోను' చేరగా నూతనముగ జనించిన బిడ్డ ప్రమాద స్థితిలో నుండి, కాళ్ళు చేతులు చల్లబడి కంప మేర్పడినది. తల్లిదండ్రులా బిడ్డపై ఆస లుడిగిరి. బాబా ప్రసాదించిన 'ఉధి' కొఱకు నిమోన్కరు వెదకెను. కానరాలేదు. అంతట ఆ బిడ్డను చేతులలోనికి తీసికొని, ఆ బిడ్డ ప్రాణముల కాపాడుమని నిమోన్కర్ బాబాను ప్రార్థించెను. 15 నిమిషములలో ఆ బిడ్డ కోలుకొనెను. స్వస్థత కలిగెను.

బాబా - సర్వతంత్ర స్వతంత్రత

[ఎ] ధులియా కోర్టు కమిషన్

581. నగలు సొమ్ము అపహరించిన కారణమున ఒకడు నేరము మోపబడి ధులియా మేజిస్ట్రేటు కోర్టునకు గొనిరాబడెను. తన కా సొమ్ములు నగలు షిర్డిలోని సాయిబాబా యిచ్చినాడని ఆ ముద్దాయి కోర్టులో తెలుపుకొని బాబాను సాక్ష్యముగ వేసికొనెను. కోర్టు ఉత్తరువులు జారీ చేయబడినవి.

పోలీసు : బాబా! నీకు కోర్టువారి ఉత్తరువు లివిగో!

సా. బా : వానిని తీసికొనివెళ్ళి ఆ నిప్పులో పడవేయుడు.

ఎవరో ఆ కోర్టు సమన్లు తీసికొని నిప్పులో పడవేసిరి. సమన్లు అందింపబడినట్లు కోర్టువారికి తెలుపబడినది. విచారణనాడు బాబా వెళ్ళని కారణమున బాబాకు వారంటు జారీ చేయబడెను.

పోలీసు గణపతిరామ్ - బాబా! ఆ కోర్టువారు వారంటు పంపినారు. దయయుంచి నాతో ధులియాకు వత్తువా?

సా. బా : (కోపముతో) ఆ కాగితము ముక్కలు అవల పాఱవేయుము అనుచు బాబా యేమియో తిట్టెను.)

ఆ పోలీసున కేమియు తోచలేదు. నా. గో. చందోర్కరు సలహాపై షిర్డిలోని జనులు పలువుర సంతకములతో ఒక 'మహజర్' పంపబడెను. అందు "సాయిబాబా వేనవేలు జనులచే దైవముగ భావించబడుచున్నవాడు. అట్టియెడ బాబాకు కోర్టు సమన్లు - వారంటు తగనివి, అపేక్షణీయములు కావు. బాబాసాక్ష్యమే అవసరమని తోచిన ఒక కమీషనరును నియమించుట మేలు" - అని తెలిపిరి. నానాజోషి - మొదటి తరగతి మేజస్ట్రేటును బాబా సాక్ష్యము తీసికొనుటకు 'కమీషనరు'గా ధులియా కోర్టువారు పంపిరి.

కమీషనరు : నీ పేరేమి?

సా. బా : నన్ను "సాయిబాబా" అని పిలుతురు.

కమీషనరు : నీ తండ్రి యెవరు?

సా. బా : నా తండ్రి పేరు సాయిబాబా.

కమీషనరు : నీ గురువు పేరు?

సా. బా : వేంకుశ.

కమీషనరు : మతము?

సా. బా : కబీరు.

కమీషనరు : కులము - శాఖ?

సా. బా : పర్వర్దిగార్ - (దైవ)

కమీషనరు : వయస్సెండి?

సా. బా : లక్షల సంవత్సరములు.

కమీషనరు : నీవు చెప్పబోవునది సత్యమని ప్రమాణము చేసి చెప్ప గలవా?

సా. బా : సత్యము.

కమీషనరు : నేరము చేసిన (ఫలాని) వానిని నీ వెఱుగుదువా?

సా. బా : ఎఱుగుదును. ఆతని నెఱుగుదును - ఎల్లఱ నెఱుగుదును.

కమీషనరు : అతడు నీ భక్తుడని, నీ దగ్గఱ నున్నవాడని చెప్పు చున్నాడు. అవునా?

సా. బా : అవును. నేను ప్రతివానితోడ నుందును. అందఱు నావారే

కమీషనరు : అతడు చెప్పినట్లు ఆ నగలను నీవిచ్చితివా?

సా. బా : అవును. నే నిచ్చితిని. ఎవరు వేని నెవరి కిత్తురు?

కమీషనరు : నీవా నగలతని కిచ్చిన అవి నీకెట్లు లభించినవి?

సా. బా : సకలము నాదే.

కమీషనరు : బాబా! ఇది దొంగతనమునకు సంబంధించిన పెద్ద నేరము. అతడు నీవీ నగల నాతనికి నిచ్చితివని చెప్పుచున్నాడు.

సా. బా : ఏమి యీ రగడ అంత? ఆ గొడవతో నాకేమి సంబంధము?

కమీషనరు మిక్కిలి అయోమయ స్థితి నొందెను. అంతట ఆ షిర్డి గ్రామమునకు జేరు క్రొత్తవారి పేర్లు గుర్తింపబడు 'డైరీ' ని తెప్పించిరి. ఆ దొంగ తెలిపినట్లు అతడు షిర్డికి వచ్చినట్లు - ఉన్నట్లు ఆ డైరీలో లేదు. బాబా షిర్డిని విడిచి యెక్కడకు వెళ్ళియుండ లేదను విషయ మెల్లరకు విదితమే.

ఈ విషయముల నన్నిటిని కమీషనరు బాబాయెదుట పెట్టెను. బాబా అవి సత్యములని చెప్పెను. దానితో కమీషనరు విచారణము పూర్తి యయ్యెను. బాబాను సంతకము చేయుమనిగాని, వ్రేలిముద్ర వేయుమనిగాని కమీషనరు కోరలేదు. అటుల బాబా యెప్పుడు చేసి యుండలేదు.

[బి] సర్. జి. సేమోర్‌కర్టిస్ - బాబాను దర్శించుట

582. 1910-11 లో ఒకనాడు బాబా ద్వారకామాయి మసీదు నందిట్లనెను. 'దుష్టుడు - నన్ను చూచుటకు వచ్చుచున్నాడు. నాకేమి కలదు? మానవావయవములు గల దిగంబర ఫకీరును!

బాబా యెవరినిగూర్చి పలుకుచున్నాడా? - యని జను లాశ్చర్య పడిరి. అంత కొంచెము తరువాత మసీదు ప్రక్కగ (ఉద్యోగుల గుంపు) రివెన్యూ కమీషనర్ - కర్టిస్, అతని భార్య, కలెక్టర్ మాక్స్వెల్, తదితర ఉద్యోగుల గుంపు నడిచెను. వారందఱు చావడికి జేరిరి.

అసిస్టెంటు కమీషనరు : (యస్. ఆర్. యస్. తో) ఉద్యోగులు దర్శింపవలయునని కోరుచున్నారు. కావున సాయిబాబాను తన ఉదయకాల విధులు త్వరగా పూర్తి చేసికొనుమని చెప్పుము.

యస్. ఆర్. యన్ : సాయిబాబా విషయమున అట్టి సందేశములు - అనాలోచనీయములు- తగనివి. వారితో మీకేమైనను పనియున్నచో వారి అనుగ్రహమునకు వేచి యుండవలయును.

అరగంటకు బాబా ఆ ప్రక్కగా వెళ్ళెను. కర్టిస్‌సతి బాబాకు నమస్క రించి, "మహరాజ్! మీతో కొంచెము మాటాడవలయునని కోరుచున్నాము- అనెను.

సా. బా : అరగంట వేచియుండుడు! నేను వెళ్ళి భిక్షించుకొన వలయును. (అని చెప్పుచు బాబా వెడలిపోయి పది నిమిషములలో తిరిగి వచ్చెను.) మరల కర్టిస్ సతి నమస్కరించి, తన కోరికను దెలిపెను.

సా. బా : ఒక అరగంట వేచియుండుడు! (అని పలుకుచు బాబా మసీదునకు వెళ్ళెను.)

ఆ ఉద్యోగులు త్వరలో నుండిరి. వారు వేచియుండలేదు. బాబా అనుగ్రహమున సంతానము పడయవలయునను కర్టిస్ సతి కోరిక నెర వేరలేదు.

బాబా నిర్భయము

బాబా - గంధ సమర్చనము - ముస్లిములు కర్రలతో జేరుట

583. పలువురు భక్తులు బాబాను పుష్పములు మొదలగు వానితో పూజించువారు. చందనము పూత విషయమున మహల్సాపతి మాత్రము బాబాకంఠమున మాత్రము మంచి గంధమునలందువాడు. బాబా నిరాకరించుటచే నుదుట మాత్రము గంధము పెట్టడు. ఒక దినమున బాబాముఖమున గంధము ధరించినట్లు కలలో తోచెను. అది మొదలు మహల్సాపతి బాబా ముఖమున గంధము తిలకము పెట్టుచుండెను. బాబా నిరాకరించలేదు. కాని కొందఱు ముస్లిములు ఆక్షేపణ తెలిపిరి. బాబా వారి తలంపులను లెక్కచేయలేదు. అంతట మహమ్మదీయులందఱు కలిసి 'సంగంనేరు' లోని కాజీతో నాలోచించి, బాబాముఖమున గంధమలందువారిని కొట్టవలయునని తీర్మానించుకొనిరి. 'తాంబులి' అను నతడీ విషయమును మహల్సాపతికి దెలిపెను. ఆ దినము మహల్సాపతి మసీదు అవరణకు వెలుపలనుండి అచటనే బాబాపూజ గావించుచుండెను. బాబా మహల్సాపతిని జేరబిలిచి-

సా. బా : నీవచట నేమి చేయుచుంటివి?

మహల్సాపతి : బాబా! నీ పూజ చేయుచుంటిని.

సా. బా : లోపలకు రమ్ము. నా ముఖమున, ఉరమున, అంతట చందనమలందుము. ఎవరు నిన్ను కొట్టెదరో నేను చూచెదనుగాక!

ముస్లిములు భయపడి వెడలిపోయిరి. అది మొదలు హైందవ దేవాలయములందువలె చందన కైంకర్యము పూజలు నిరాటంకముగా సాగెను.

బాబా - న్యాయ విధానము

584. 1913-14 న పూనాలో ప్లేగు వ్యాపించెను. ఆర్.కె.దూబే షిర్డికి వెళ్ళుదునని మ్రొక్కుకొనినవాడు. అటుల గావింపక 'సాసర్వాడ' కు వెళ్ళెను. ఆ ప్రయాణమున నతడు పసిబిడ్డను కోల్పోయెను. అతని

భార్య మిక్కిలి జబ్బుపడి ప్రమాద స్థితిలో నుండెను. డూబే - బాబాను ప్రార్థించినాడు.

సా. బా : (అతని స్వప్నమున పొడమి) మనుష్యుడు కావించు మ్రొక్కుబడులు చెల్లించుకొనవలయును. లేనియెడల ఈ విధముగా శిక్ష సహించవలయును.

అంతట డూబే సతి నొసట ఉధిని పెట్టి బాబా అదృశ్యుడయ్యెను.

డూబే నిద్రలేచి ఆమె నుదుట ఉధిని జూచెను. ఆ మఱునాడు ఆమె ఆరోగ్యము పొందెను.

తరువాత డూబే దంపతులు షిర్డికి వెళ్ళిరి. బాబా పై విషయముల నన్నిటి నచటవారికి తెలిపెను.

బాబానీతి - సమత్వము

సమోఽహం సర్వ భూతేషు

585. ఈ ప్రపంచము నన్నే పుట్టించుచున్నది. అందరు నా ప్రజలే. అందఱియెడ సమదృష్టి బరపుదును. కాని కొందరు దొంగలగుచున్నారు. వారి విషయమున నే నేమి చేయగలను? వీరు నా యెడ అవజ్ఞత పఱపి నన్ను మిక్కిలిగ బాధించుచున్నారు. నేనేమియు పలుకక ఊరకున్నాడను. దైవము మహాప్రభువు. అంతట మిక్కిలి సమర్థులైన ప్రతినిధుల నేర్పఱచినాడు. నరుడు తనకు గల దానితో సంతృప్తి సంతుష్టుల బొంది యుండవలయును. నేను మిక్కిలి శక్తివంతుడను. నే నచట 8 లేక 10 వేల సంవత్సరములకు పూర్వమున నుంటిని.

(జి. యస్. కపర్దే - డైరి)

(ఎ) వేపచెట్టు కొమ్మ

536. గర్భమున పెడతిరిగిన బిడ్డనేని నీవు కండ తుండెములుగ ఖండించి వెలువరింప వలయును - (అని ఈ మాటలు పలుకుచు బాబా సాతేవాడ గోడ నిర్మించుటకు అడ్డము వచ్చిన మధుర నింబ వృక్షము శాఖలు ఛేదించెను.)

(బి) యస్. బి. నాచ్నే అత్త గారి ప్రతీకారము

587. దాదా కేల్కార్ : నా మనుమరాలి కంటి కలకకు కాపు కాయుటకు ఉల్లిగడ్డ నెచట తెచ్చు కొనగలను?

సా.బా: (నాచ్నే అత్త గారిని చూపుచు) ఈ తల్లి దగ్గఱ నుండి తెచ్చుకొనుము.

నాచ్నే అత్త : బాబా! ఈ దాదా, నేను ఉల్లి తరుగుచుండగా ఈ ఉదయమున నన్ను తిట్టినాడు. ఈతని కేమియు నిచ్చుటకు నా కిష్టము లేదు. కాని, నీ వాజ్ఞాపించిన నిచ్చెదను.

సా.బా: ఇమ్ము!

(బాబా నీతి యుక్తమైన ఆజ్ఞలచే దాదా కేల్కారు కావించిన కీడునకు నాచ్నే అత్త తిరిగి మేలుచేసి చక్కని ప్రతీకారము సాధించినది.)

(సి) బాలా పటేల్

588. దామియా (దామోదర్ సావ్రాం రసానే) బాబాను చేరి నిమ్న జాతికి జెందిన బాబా సేవకుడు 'బాల పటిల్' ను బాబాకు ప్రతి నిధిగా తన ఇంట జరుగు విందునకు పంపుమని కోరెను.

సా. బా: మంచిది! కాని, 'ధట్-ధట్' (ఎడమగ నుండుము-ఎడమగ నుండుము) అని, అతని ననవలదు. నీవు భుజించు తావునకు దూరముగ అతని నుంచకుము.

దామియా బాబా బోధను బాటించి బాలపటిల్‌ను తన అతిథిగ భావించి, అతనిని యింటివెలుపల గాకుండ, భోజనమునకు తన సమీపమున గూర్చుండజేసెను.

(డి) చక్రినారాయణ

589. చక్రనారాయణ అను క్రైస్తవుడు కోపర్గామున ఫౌజుదారుగ నియమింపబడినపుడు—

ఒక భక్తుడు: బాబా! ఫౌజుదారుగ ఒక క్రైస్తవుడు మనకు వచ్చినాడు.

సా. బా: అయిన నేమి ? అతడు నా సోదరుడు.

(ఇ) పెస్టన్ జామాన్

599. 1915 నందు పెస్టన్, అతని బావమఱది సాయీ మహారాజును సందర్శించుటకు షిర్డికి వెళ్ళిరి. అపుడు దీక్షిత్‌వాడలో జనము క్రిక్కిరిసియుండిరి. ధనికులకు మాత్రమే మేడపైన వసతి గూర్చబడినది. ఈ యిరువురు పార్శీలు దిగువ భాగమున నుండిరి.

"ఈ దర్బారులో ఇదేమి న్యాయము? గొప్పవారు పైన సుఖమనుభవించుచుండ పేదలు క్రింద ఇరుకున కష్టపడుచున్నారు" అని, యీ ఇరువురు పార్శీలు తలంచిరి. వారు మసీదుజేరి బాబాను సందర్శించిరి.

సా. బా: (అచటనున్నవారితో) ఈ యిరువురను పైకి తీసికొనిపొండు.

వారికి మేడ పై భాగమున వసతి చూపబడెను.

(ఎఫ్) తుకారాంబర్కు

591 తుకారాంబర్కు ఒక మహల్ (హరిజనుడు) నౌకరికొఱకు అతడు షిర్డివిడిచి వెళ్ళుచుండెను. బాబా అతనిని కలిసి తన బాహువు నతని మెడచుట్టు జేర్చి—

సా. బా: (బర్కుతో) నీవు వెళ్ళవలదు.

బర్కు: నేను వెళ్ళి సంపాదించుకొనవలయును.

సా. బా: వెళ్ళవలదు.

బాబా ఆదేశము నిరాకరించి బర్కువెళ్ళి, జబ్బుపడి, చాలాకాలము బాధలొంది ఏమియు సంపాదించుకొనలేకయే తిరిగి వచ్చెను.

బాబా - జంతువులు

592. నానాసాహెబ్ డేంగ్లే ఒక వెండిపళ్ళెరములో మంచి రుచికర పదార్థముల గొనివచ్చి, బాబాకు సమర్పించి, తినమని ప్రార్థించెను. బాబా చప్పటుల జఱచెను. ఒక నల్ల కుక్క వచ్చి ఆ ఆహార పదార్థములను దినెను. నానాసాహెబ్ విసుగునొంది, "ఈ ఛండాలపు కుక్కకొఱకా నేనీ పదార్థముల సిద్ధపరచినది ?" అని తన మనస్సున తలంచెను.

సా. బా: (ఆపళ్ళెరము నావలకు త్రోయుచు) దీనిని తీసికొనిపొమ్ము.

592 ఎ) లక్ష్మీబాయిసింధి తెచ్చిన రొట్టెలను బాబా కుక్కకు పెట్టిన వృత్తాంతము . (చూ. 68)

బాబా మత సామరస్యము - సర్వజన సమ్మతత్వము

(ఉదారబుద్ధి)

593. సా. బా: ఎల్లదైవములు ఒకరే. హైందవునకు, మహమ్మదీయునకు భేధములేదు. మసీదు, దేవాలయము ఒకటే. అటులయ్యును మీ ఆశయములను నేను గౌరవింతును. (మహల్సాపతి ఆక్షేపణము కారణముగ) (ఖండోబా) ఆ దేవాలయమున నేను ప్రవేశింపను.

చోకామేళుని వృత్తాంతమును గమనింపుడు!

594. సా.బా: (తన గృహమున దీక్షిత్ వాడయందు క్రీస్తును గూర్చి, క్రైస్తవ మతమును గూర్చి నిందింపవచ్చిన హ.సీ. దీక్షిత్తుతో) పొమ్ము- నా పాదముల నొత్తవలదు.

హ.సీ. దీక్షిత్తు తన ప్రవర్తనమునకు పశ్చాత్తాపము జెంది, తిరిగి వచ్చి బాబాపాదముల నొత్తునపుడు బాబా ఆక్షేపించలేదు.

బాబా - మతాంతరీకరణమును నిరసించుట

595. బడేబాబా (ఫకీర్‌బాబా) హిందూమతము విడిచి ముస్లిం మతమును స్వీకరించినవానిని (ఇబ్రహీం) మసీదునకు దీసికొనివచ్చి బాబా కెఱుక పఱచినపుడు-

సా.బా: (ఆ మతాంతర స్వీకృతుని చెంపకొట్టి) ఆ! నీ అబ్బను మార్చుకొంటివా?

బాబా - ప్రార్థనలు.

596. సా.బా: నేనిక్కడ పలుకుదును. (నా పలుకుల కనుగుణముగ) అవి అక్కడ జరుగును. అది యంతయు దైవలీల!

(యం. డబ్లుయు. ప్రధాన్ విషయమున)

సా. బా: ఓ భగవాన్! ఆ వర్షమును ఆపుము ! నా బిడ్డలు ఇంటికి

వెళ్ళవలయును. వారిని క్షేమముగ వెళ్ళనిమ్ము. [ప్రధాన్ కుటుంబము రైలు స్టేషన్‌జేరువరకు వాన ఆగెను.]

హెచ్. వి. సాతే విషయమున

596. ఎ) దాదాకేల్కార్: బాబా! మేము మనుమని [దౌహిత్రుని] పడయుట ఎపుడు ?

సా. బా : నేను అల్లాను ప్రార్థించుచున్నాడను. అతడు నా ప్రార్థనము మన్నించును. [మరుసటి సంవత్సరమున మనుమడు పుట్టెను.]

597. నేను దీర్ఘముగ నాలోచించుచు రేయింబవళ్ళు తలంచు చున్నాడను. అందఱు దొంగలే. కాని, మనము వారితో మెలగవలయును. వారిని చక్కపఱుపుమని లేదా తొలగింపుమని భగవాను నెల్లవేళల బ్రార్థించు చున్నవాడను. దైవమాలకించి, నా తలంపు మన్నించి, యనుగ్రహించుట లేదు. నే నొకటి రెండు నెలలు వేచి చూచెదను.

కాని, బ్రతుకనీ చావనీ నేను ప్రార్థించునది సాధించి తీరుదును. నేను [తేలి-వాణి] వారి వీరి దగ్గఱకు వెళ్ళను. నేను వారిని ప్రార్థింపను. జనులు సత్ప్రవర్తనులై భగవద్భక్తి గాంచరు. బుద్ధి స్థిరములేదు. చంచలస్వాంతులు ఎవరో కొందరు మిత్రులు బ్రహ్మజ్ఞానమును గూర్చి చర్చించుదురు. స్థిమితముగ గూర్చుండి ధ్యానింతురు.

[జి. యస్. కపర్దే - డైరి]

598. సా. బా. [1886న మహల్సాపతితో] నేను దైవము దగ్గఱకు వెళ్ళుచున్నాను.

599. సా.బా: [తన కాలిన చేతినిగూర్చి] ఇది అంతయు దైవలీల, అతడే దీనిని నివారించును. మన మాందోళన జెందనేల? అల్లా నావైద్యుడు.

సా.బా: [ఆర్. బి. పురందర్‌తో] 2, 4 రోజులలో నేను స్వస్థత నొందుదును. అల్లా ఈ వ్యాధి నా కొసగినాడు. ఈగడువులోపల తిరిగి చక్క జేయును, నీవు ఏడువవలదు.

బాబా - విజ్ఞానము. [అనుభవజ్ఞానము]

వై రా గ్య ము

600. బాబా మసీదున గూర్చుండెను. సీతాఫలముల ఋతువు అప్పుడే ప్రారంభమయ్యెను. ఒక కాంత ఆ ఫలములను దెచ్చి వానిని కొనుమని మంచి మాటల బల్కుచుండెను. మొదట ఆమె ఆ పండ్లకు ఎక్కువ ధర చెప్పెను.

సా. బా: నీ ఫలములు నాకు వలదు- తీసుకొనిపొమ్ము.

అంతట నామె 6 పండ్లు 10 అణాలకు తీసికొనుమని బాబాను ప్రార్థించెను. బాబా వానిని తీసికొనెను. [ఆ కాంతకు డబ్బు ఇచ్చులోపల] కొంచెము సేపు తరువాత సీతాఫలములను మఱియొకతె తెచ్చెను. బాబా బేరమును చేసెను.

సా. బా: పది ఫలములకు నీకు ఆరు అణాల నిత్తును.

ఆమె సమ్మతించెను.

సా. బా. శ్యామా! ఈ ఇరువురకు మన మీయవలసిన మొత్తమెంత?

శ్యామా: దేవా! ఒకరూపాయి.

సా. బా: [అచట నున్న వారిలో ఒకనితో - కాకా మహాజనితో] భావ్! నాకు రెండు రూపాయలిత్తువా!

బాబా కోరిన రెండు రూపాయలు అతడిచ్చెను.

అంతట బాబా మొదటి పండ్ల మనిషిని పిలిచి, 'దీనిని తీసుకొనిపొమ్ము' అని ఒక రూపాయి నిచ్చెను.

పిదప రెండ మనిషిని పిలిచి అమెకు ఒక రూపాయి నిచ్చెను.

రెండు రూపాయ లిచ్చిన భక్తుడు : బాబా! యిదంతయు నా కేమియు బోధపడలేదు. నేను గ్రహించునట్లు చేయుదువా?

సా. బా: ఇందు కష్టమేమి కలదు?

మొదటి పండ్లబుట్ట వచ్చినపుడు పండ్లు అరుదుగ నుండెను. అందుచే 6 పండ్లకు 10 అణాలు బేరము స్థిరపరుపబడినది.

రెండవ బుట్ట వచ్చినపుడు పండ్లు అంత 'గిరాకిగ' లేవు. అందుచే 10 పండ్లు 6 అణాలకు నిర్ణయింపబడినవి. ఇక పైకము (మూల్యము) చెల్లించు విషయమా! ఈ ఇరువురు వారి వారి భాగ్యము (పూర్వకర్మము) ననుసరించి ధనము బడసిరి. (ఈయబడిరి)

601. 1890 లో నానాసాహెబు నిమోన్కరు బాబాకు పది రూపాయల కరెన్సీ నోటు నిచ్చెను.

సా. బా: నేను తీసికొనను. నేనొక ఫకీరును.

602. 1907 న 'కనిత్కార్' కుటుంబముతో షిర్డీకి వెళ్ళెను. బాబాను చావడిలో జూచెను. అపుడు బాబా ఏమేమియో దూషించుచు అసహ్యకరములైన మాటలాడుచుండెను. అది కని అతడాశ్చర్యపడెను. అతని గుమస్తాలు బాబా మహాసాధువని తెలిపిరి. 'నాకుటుంబమునుండి తీసికొనిన దక్షిణ లన్నియు తిరిగి యిచ్చిన బాబా మహాసాధువని నేను భావింతును' అని కనిత్కార్ పలికెను.

తరువాత అతని భార్య కుటుంబము బాబాను జేరెను.

సా. బా: మీరింతవరకు నా కిచ్చిన ధన మిదిగో! తీసికొనిపొండు!

కనిత్కార్ సతి : బాబా! కట్టెలు మొదలగునవి కొనుటకు అవసరమగును. కావున నుంచుకొనుము.

సా. బా: నాకిది అవసరములేదు.

603. సా. బా: (యస్. బి. నాచ్నేతో) నీవేమి చేసిన దానిని సంపూర్ణముగ జేయుము. లేదా ఆ పని అంగీకరింపకుము.

604. సా. బా: విందులకు, పండుగలకు, యాత్రలకు, ప్రయాణములకు అప్పు తీసికొనకుము.

605. సా.బా: నీవు ప్రయాణము చేయుముందు భోజనము చేసి బయలుదేరుము.

బాబా – పూర్వాచార పాలనము

మృతాఽశౌచము - భక్తులు పాటించు సందర్భము

606. సా.బా: (హరిభావ్ కార్ణిక్‌తో) మసీదు మెట్లు ఎక్కకుము. నేరుగ మీ గృహమునకు (దహన్) మధ్యదారిలో ఆలసింపక వెళ్ళుము !

హరిభావ్ తిరిగి వెళ్ళి బాబా షిర్డిలో పై మాటలు పలికిన 2 గంటలకు పూర్వము అతని మనుమని భార్య మృతి నొందినట్లు తెలిసికొనెను.

607. గోఖేలుసతి ఇతరులతో గలిసి మసీదులోనికి వచ్చుచుండెను.

సా. బా: (గోఖేలు సతితో) మసీదులోనికి రావలదు.

ఆమె తిరిగి వెళ్ళి స్నానముచేసి శుభ్రవస్త్రముల ధరించి వచ్చి మసీదు మెట్లెక్కబోయెను.

సా. బా: (మరల) లోనికి రాకుము!

అంతట గోఖేల్ సతి (యింటికి) స్వస్థానమునకు తిరిగి వెళ్ళి తాను షిర్డిలోని మసీదు లోపలకు వెళ్ళబోవునపుడు తన బంధువుల మృతివలన అశౌచమున నున్నట్లు గ్రహించెను.

బాబా - నిగూఢ ఆచార ధర్మము - ఎఱుక

608 ఎ] షిర్డికాంత - (బాబాతో) బాబా ! నీవు గోధుమలు పిండి విసరుచున్నాడవు - మమ్ము తోడ్పడనిమ్ము.

సా.బా: మంచిది.

(కొంతసేపు పిండి విసరిన పిదప)

షిర్డి కాంత: బాబా ! నీవు రొట్టెలు చేసికొనవుగదా! మేమీ పిండిని తీసికొని పోదుము.

సా. బా: వలదు-వలదు రండు! మనము పిండిని మోసికొని పోవుదము.

అంతట బాబా షిర్డికి ఉత్తర సరిహద్దుగాగల వాగు దగ్గఱకు దారితీసెను.

సా.బా: ఈ పిండినంతయు వాగుగట్టుపొడవున పోయుదుము. ఈ అంటు వ్యాధులు కలరా, ప్లేగు మొదలగునవి దేవతల రూపమున గ్రామములోనికి ప్రవేశింపక వెడలి పోవుదురు.

బాబా ఆ విధముగ షిర్డి గ్రామము ఉత్తరమునగల వాగుగట్టు పొడవున ఆ పిండని పోయుటచే యథార్థముగ ఆ భయంకరమైన అంటువ్యాధులు షిర్డి లోనికి ప్రవేశింపలేదు.

(బి) బాబా - నాణెములను రుద్దుట.

బాబా ఏకాంతముగా నున్నపుడు తన జేబులోనుండి నాణెములను వెలుపలకుదీసి తన వేళ్ళతో వాని పైభాగమున రుద్దుచు(అటుల గావించుటచే ఆ నాణెముల పై నున్న అక్షరములు మొదలగునవి అరిగిపోయినవి) నానాచే-నానాచే (నానాయొక్క-నానాయొక్క), కాకాచే-కాకాచే, సోమియాచే-సోమియాచే, మొదలగు పేర్ల నుచ్ఛరించుచుండును.

ఇట్లు కావించుటచే వీరికి గలుగు ప్రతిబంధకములు తొలగిపోవు చుండును. (తుడిచివేయబడుచుండును.) బాబా భక్తులా విధముగ దలచి విశ్వసించినారు.

[సి] బాబా - తన భక్తుల క్షేమమరయుట

సా. బా: [అబ్దుల్‌తో] అబ్దుల్! ఆ అఖండము [లేండివనము నందుంచ బడిన దీపము- అఖండము] ప్రక్క బొక్కెనలతో నీరముంచుము- ఆ అఖండ జ్యోతి ఆరిపోవకుండ కనిపెట్టి, అవసరమైనపుడు ఎప్పటికప్పుడు నూనెతో నింపుచుండుము!

ఆ విధముగ అఖండము ప్రక్కన నీటితో నింపబడిన బొక్కెనలు సిద్ధపఱుపబడిన పిదప, బాబా ఆ నీరము చేతితో తీసికొని అన్ని మూలల జల్లుచుండును. లేచి, యెనిమిది దిక్కుల ఒక్కొక్క దిశ వైపునకు కొన్ని అడుగులు వేసి, మూలములయందు, ఆకాశము వైపున దృష్టినిలిపి ఏవి యేవియో పలుకుచుండును. తన భక్తులకు గలుగు ఆపదల గమనించుచు, వానిని దొలగించుట కటుల గావించు చుండునని తెలియుచున్నది.

(బి) బాబా ఒక దినమున తన చేతిని మోచేతివరకు (ధుని) అగ్ని లోనికి జునిపెను. చర్మము కాలెను.

శ్యామా : బాబా! నీ వటులేల చేసెదవు? (అనుచు బాబాచేతిని వెలుపలకు లాగెను.)

సా. బా : ఈ పాపిష్టి హస్తమును పోనిమ్ము. ఒక బిడ్డ అగ్నిలో పడెను. ఆ బిడ్డ నందుండి వెలికి తీయుచున్నాడను.

తరువాత షిర్డి సమీప ప్రదేశమున నొక్కచోట కమ్మరి కొలిమిలో ఒక బిడ్డ పడెననియు, ఆ బిడ్డకు ప్రాణాపాయము కలుగకముందే ఆ బిడ్డ అగ్ని నుండి వెలికి తీయబడినదను వార్త షిర్డికి జేరెను.

బాబా - రహస్య క్రియలు

[అ] 1912 మార్చిలో ఆరతికి పూర్వము

సా. బా : అహెూ! నా కడుపులో విపరీతమైన నొప్పిగా నున్నది. తలపాగ తీసికొని రండు.

తలపాగను తెచ్చిరి. బాబా దానిని తన దేహము మధ్యభాగమున జుట్టి ఇరువురు మనుష్యులను కుడి-ఎడమ పార్శ్వముల నిలచి తలపాగ కొనలను పట్టుకొని గట్టిగ లాగుడు- అనెను. వారు లాగుచుండిరి.

సా. బా: లాగుడు! ఇంకను లాగుడు. ఇంకను బాధ తగ్గలేదు.

(తరువాత) సా. బా : ఇప్పుడిక నా కడుపు బాధ తగ్గినది.

ఆ విషయ మేమో ఎవరు తెలుసుకొనలేకపోయిరి. షిర్డికి 2 మైళ్ళ

దూరమునగల నింగోన్‌లో ఒక బాబా భక్తురాలు దుర్భరమైన కాన్పు నొప్పులతో బాధపడినదనియు ఆ పిదప సుఖ ప్రసూతి జరిగినదను వార్త కొంతసేపటికి షిర్డీకి జేరెను. కావున ఈ నిగూఢ క్రియ కాన్పు విషయమున తోడ్పడినట్లు విశదమగుచున్నది.

(ఎఫ్) బాబాను సమీపించి యెప్పుడేని దర్శనభాగ్యము పొందుటకు అవకాశ మీయబడని ఒక భక్తురాలు మిక్కిలి వ్యాధిగ్రస్తయై యుండెను. ఆమె వ్యాధిని నివారించుటకు బాబా ఆ రోగియున్న ప్రక్క యింటిపై కెక్కి పై భాగమున నడిచి, ఆ రోగి యింటిపైకి వెళ్ళి, అచట నుండి ఆవల ఇంటి పైగా నడచి అచటనుండి నిచ్చెన తెప్పించుకొని దిగివచ్చి ఆ నిచ్చెన తెచ్చిన వానికి రెండు రూపాయలిచ్చుచు, "మనము ఇతరుల సేవలను ఉచితముగ స్వీకరింపరాదు" అని - అచట నున్నవారితో చెప్పెను. (చూ. 226)

ఆ భక్తురాలు ఆరోగ్యము పొందెను.

(జి) వాస్తుపూజ మొ॥

1911 లో షిర్డిలోని మసీదు పునర్నిర్మాణము గావింపబడినపుడు బేల్దారివాండ్లు కావించు కట్టడములను తఱచుగ బాబా కూల్చివేయుచుండు వాడు. ఆ నిర్మాణ కార్యము పూర్తియైన పిదప ముందున్న ఖాళీ స్థలములో తుత్తునాగరము రేకులలో ఒక పందిరి వేయుటకు స్తంభములను పాతు చుండిరి. వాస్తు శాస్త్రమున తెలుపబడిన దిక్కుల విషయము వారు గుర్తింపకుండిరి. బాబా కోపమున వచ్చి తాత్యాపటేలును పట్టుకొని అప్పుడే పాతిన ఒక స్తంభము నూడబెరికి తాత్యాపటేలు పై వస్త్రమును తీసి తగులబెట్టి, ఆ మసిని, ఒక వెండి నాణెమును ఆ స్తంభమునకు దీసిన గుంటలో వైచి, ఆ స్తంభమును మరల పాతి పని జరుగనిచ్చెను. బాబా - గృహములు - దేవాలయములకు సంబంధించిన వాస్తుశాస్త్ర నియమములను పాటించుచుండెనని తోచుచున్నది.

(హెచ్) బాబా తఱచుగ చేతులతోడనో, చేతి వేళ్ళతోడనో, చేతిలో దాల్చు (సట్కా) చిన్న కర్రతోడనో ఏవేవో సైగలు చేయుచుండువాడు. 1. ధునిముందు, 2. చావడిముందు, 3. మసీదుముందు, చావడికి ఊరేగింపు సందర్భమున మారుతి దేవాలయము కనబడు ఒక నియమిత స్థలము జేరినపుడు [చూ. 85], 4. మసీదున డి. ఎస్. కపర్దే ఎదుట, 5. ఇతర

సమయమముల నితర ప్రదేశములందు సైగలు చేయువాడు. వీటి యన్నిట నేవియో ప్రత్యేక ప్రాముఖ్యములు కలవు.

(ఐ) ఒకనాటి మధ్యాహ్నమున భయంకర తీవ్రతాప సమయమున ఒక మేకపిల్ల మసీదు దగ్గఱకు జేరి గిరగిర తిరిగి చచ్చినట్లు పడియుండెను. బాబా దానిచుట్టు తిరిగి నీటి బిందువులను దానిపై జల్లెను. అది లేచి గంతు వైచి పాఱిపోయెను.

ఆ విధముగ షిర్డిలోని మార్వాడి గడ్డివామి తగులబడుచుండగా ఆ గడ్డివామిచుట్టు సన్నని ధారగా పోసి "ఈమాత్రమే తగులబడును" అనెను. పెద్ద గాడ్పులు వీచుచున్నను దాని చుట్టుప్రక్కల నున్న గడ్డివాముల కెట్టి నష్టము కలుగలేదు. (చూ. 342)

(జె) అబ్దుల్ ఖాదిర్ వైరాగ్య యోగనిష్ఠలద్వారా ఆధ్యాత్మికోన్నతి గోరి బాబాను ఆశ్రయించెను. బాబా పిడికిలి బట్టి చేతిని పైకెత్తి, అతనిపైకి నేవో విసరినట్లు పిడికిలి తెఱచుచు "లేప్" అనెను. ఆ క్షణము మొదలతనికి గాఢ వైరాగ్యము గలిగి లౌకిక విషయ విముఖు డయ్యెను. అతని బంధువు లందరు మిక్కిలి బాధ-అసంతుష్టి నొందిరి. అతడును నియమ విహీనముగ సంచరింపదొడగెను. అంతట బాబా అతనివైపునకు చేతిని చాచి, పిడికిలిబట్టి తనవైపునకు లాగుచు "లావో" (తిరిగి యిమ్ము) అనెను. అది మొదలతడు సాధారణస్థితి, బుద్ధినొంది లౌకిక విషయముల పాల్గొన దొడగెను. ఈ విషయములను 'ఛోటేఖాన్' గుర్తించినాడు.

వివిధ విషయములు

1. తన చరిత్ర [రచన] విషయమున బాబా ఆదేశము

609. సా. బా : చరిత్ర వ్రాయుటకు తగిన విధానము.

1. భక్తుల అనుభవ వృత్తాంతముల విచారించి ప్రోగుచేయుము.

2. చరిత్రకారుడు స్వాభిమాన గర్వముల- హేతువాదముల జోలికి పోరాదు. పక్షపాతబుద్ధి, అన్యపక్ష నిరసన రూపములగు చర్చలు తగవు.

3. రచయిత శ్రీ సాయిబాబా చింతనామృతాంబుధి యందు మునిగి, తన ఆత్మను, అహంభావమును సంపూర్ణ సమర్పణము గావించి పిదప చరిత్ర రచనకు గడంగ వలయును.

4. బాబా జీవిత చరిత్రను పఠించుట - రచించుట - చింతించుట వలన ఫలము :

భక్తి పెంపొందును, అజ్ఞానము నిర్మూల మగును. వివాదాత్మక బుద్ధితో గ్రంథమును రచించిన అజ్ఞానము హెచ్చును.

5. విశ్వాస బుద్ధితో నన్ను [బాబా] సేవించువానిని దైవ మను గ్రహించును.

బాబా పలుకులందు ప్రత్యేకత - వైపరీత్య భావము

610. హ. సీ. దీక్షిత్తునకు అతని వాడలో [నివాసమున] విఠోబా (పండరినాథ) దర్శన ప్రాప్తి కలిగెను. తరువాత అతడు బాబాను జేరెను.

సా. బా : విఠల్ పటేల్ రాలేదా? నీ వాతని చూడలేదా? ఆ విఠల్ క్షణములో తప్పించుకొని పోవువాడు. అతనిని గట్టిగ బంధింపుము. ఏమరుపాటున అతనిని కనిపెట్టుట మఱచితివా! అతడదృశ్యుడగును.

[గమనిక: విఠోబా క్షణిక సాక్షాత్కారమైనను దాస్‌గాణూ మహారాజు నకు ప్రాప్తింపలేదు. చూ. 130]

611. దాస్‌గాణూ మహారాజు 'ఈశావాశ్యోపనిషత్తు' భావము గ్రహింపజాలక తికమక జెంది బాబాను జేరెను.

సా. బా : నాయనా! ఇందేమి కష్టము గలదు? విల్లిపెర్లిలో కాకా (హ. సీ. దీక్షిత్తు) యింటికి బొమ్ము. అతని మోల్కారిన్ (ఇంట పనిచేయు కాపుపిల్ల) నీ సందేహములను తొలగించును.

దాస్‌గాణూ అచటకు వెళ్ళెను. అచట 'కుంబీ' కులమునకు జెందిన 8 ఏండ్ల పనిచేయుపిల్ల ఉండెను. ఆ పిల్ల అతని కష్టములు నెఱుంగకయే, తా నాతని సందేహముల నివారించుచుంటినను భావము లేకయే, పలికిన పలుకులు, ఆ పిల్ల ప్రవర్తనలు ఆ ఉపనిషత్తులలోని విషయముల నాతనికి బోధపఱచినవి.

612. శ్యామాను పాము కఱచెను. అతడు బాబా ఉన్న మసీదు చేరెను.

సా. బా : బ్రాహ్మణ! పైకెక్కకుము - దిగిపొమ్ము!

బాబా తనను మెట్లెక్కి రావలదనుచున్నాడని శ్యామా తలంచెను.

సా. బా : (కొంచెము తరువాత) పైకి రమ్ము! ఆ ఫకీరు (దైవము) దయామయుడు, నీకు నివారణమగును.

[బాబా మొదట పలికిన పలుకును సర్పవిషము బ్రాహ్మణ తనువు పైకెక్కక దిగుమని అజ్ఞాపించినాడని, శ్యామా అపుడు గుర్తించెను.]

613. ఉద్ధవేశభావ్ 15 రోజుల కొకసారి (ఏకాదశినాడు) బాబాకు ఉత్తరము వ్రాయుచుండును. బాబా మహాసమాధికి కొన్ని నెలలముందు షిర్డికి వచ్చి బాబాను సందర్శించెను. తరువాత సెలవు తీసికొని వెళ్ళునపుడు-

సా. బా : మంచిది! వెళ్ళుము. నీవు ప్రతి పక్షము ఇక్కడకు రా నక్కరలేదు. నేనెప్పుడు నీతోడనే యున్నాను, ఎప్పుడు నుందును. అచట జనుల కందఱకు [అటుల] దెలుపుము. (నా ఆశీస్సుల నందఱ కందింపుము)

ఇవి యథార్థముగ వీడ్కోలు వాక్కులు. ఉద్ధవేశభావ్ ఆ మాటలలోని భావము గ్రహింపలేదు. ఎటులైన నేమి- మఱపుచేత, తరువాత ఏకాదశ లందు ఉత్తరములు వ్రాయలేదు. 15 రోజుల కొకమాఱు వచ్చుట అను బాబా మాటలు ఉత్తరములను సూచించునవి యగుట స్పష్టము.

614. 1) సా. బా : [నిరుపేదయు, పవిత్రుడైన మనుష్యుని గూర్చి అతడు అధికమగు పైసా [ధనము] కలవాడు.

(2) బ్రాహ్మణులు వారి ప్రవర్తనలచేత అధికమగు పైసా నార్జింతురు. [పైసా - అనిన, బాబా అభిప్రాయము- పుణ్యము- అపూర్వము అని గ్రహింపదగును.]

615. సా. బా : [అప్పుడే మృతి నొందిన 'హార్దా' నివాసినిగూర్చి] అతడెట్లు మరణించును? ఉదయమున జీవించును.

(ఆ మృతి నొందినవాని బంధువులు అతడు తిరిగి బ్రతుకునని ఆ శవమును కనిపెట్టి యుండిరి. తుదకు నిరాశ నొందిరి. బాబా తెలిపినది ఆత్మ నిత్యత్వము- తరువాత జన్మమున నూతన తనువు ధరించుట)

616. ఆ ఫకీరు ఎల్లరయెడ దయగలవాడు. [ఫకీరు- అను మాటచే బాబా తన దైవమును, గురువునుగూర్చి పలికినాడు.]

617. హ. సీ. దీక్షిత్తు : (బాబాతో) బాబా! నానాసాహెబ్ కరందెల్కార్, తన భార్య, సోదరుడు జబ్బుగా నున్నారని, వారు తిరిగి కోలు కొనుటను నీ అనుగ్రహము నర్థించుచు ఉత్తరము వ్రాసినాడు.

సా. బా : అతని సోదరుడు కోలుకొనును.

హ. సీ. దీ : అతని భార్య?

సా. బా : ఆమె వచ్చినదా?

హ. సీ. దీ : ఆమె నిటకు పిలిపించుదుమా?

సా. బా : పిలిపింపుము.

[సోదరుడు కోల్కొనెను. భార్య మరణించెను. "ఆమె వచ్చినదా?"- అన్నటలో మృతి నొందిన పిదప సూక్ష్మ శరీరమున- అని భావము.

618. హ. సీ. దీక్షిత్తు- ఎట్టి బహుమతులను స్వీకరింపక, మిక్కిలి ఆర్థిక సంకటములలో నున్న షిర్డిలోని ఒక భక్తునకు ధన సహాయము చేయ దలంచి కొంత పైకము (కరెన్సీనోట్లు) ఒక కవరులో పెట్టి తీసికొని బాబా దగ్గఱకు వెళ్ళెను.

హ. సీ. దీ. : బాబా! ఈ 'కవరు'ను పంపుదునా?

సా. బా ; పంపుము.

హ. సీ. దీక్షిత్తు వెంటనే పంపెను. అది స్వీకరింపబడెను.

ఆ భక్తుడిటుల వివరించి తెలిపెను. అంతకు 2 గంటల పూర్వము ఆ భక్తుని భార్య బాబాదగ్గఱకు వెళ్ళెను. "అమ్మా! నేను మీ యింటికి వచ్చుచున్నాడను. నన్ను నిరాకరింప వలదని నీ భర్తతో జెప్పుము" అని బాబా తెలిపినాడు.

(3) బాబా ప్రత్యేక హాస్యము - చిన్నపుచ్చుట - హేళనము

619 ఒక సమయమున పస్తుపడి కృశించి, చావనున్న ముసలి మేక యొకటి మసీదులోనికి వచ్చెను.

సా. బా : (బడేబాబాతో) ఒక్క వ్రేటున ఆ మేకను తెగవ్రేయుము.

బడేబాబా : (దానివంక జాలితో చూచుచు) మనము దీనినెట్లు చంపగలము? (అని పలుకుచు నతడు మసీదునుండి వెడలిపోయెను.)

సా. బా : శ్యామా! నీవు దీనిని నఱుకుము. రాధాకృష్ణఆయి దగ్గఱ నుండి కత్తిని దీసికొని రమ్ము.

(ఆయి కత్తిని పంపెను. ఆ పనియేమో తెలిసికొని, దానిని తిరిగి తెప్పించుకొనెను.)

శ్యామా : నే నింటికి వెళ్ళి కత్తి దెచ్చెదను.

(శ్యామా యింటికి వెళ్ళి అచటనే నిలిచిపోయెను.

సా. బా : (అంతట హ. సీ. దీక్షిత్తుతో) నీవు కత్తి తెచ్చి దీనిని చంపుము.

హ. సీ. దీక్షిత్తు వెళ్ళి కత్తి తెచ్చెను.

హ. సీ. దీ. : బాబా! దీనిని చంపుదునా?

సా. బా : చంపుము!

హ. సీ. దీ. : (కత్తి పైకెత్తి జాగుచేయుచు పట్టుకొని యుండెను.)

సా. బా : నీ వేమి ఆలోచించు చుంటివి? కొట్టుము.

దీక్షిత్తు విధేయుడై కత్తి దింపబోవుచుండెను.

సా. బా : ఆపుము! ఆ జంతువును నిలువనిమ్ము. నేనే దీనిని చంపెదను. కానీ మసీదులో కాదు.

అంతట బాబా ఆ జంతువును కొన్ని గజముల దూరము మోసికొని పోయెను. ఆ పిదప అది క్రిందపడి చచ్చెను.

620, జి. డి. పండిట్ (హెలాస్సే నివాసి) వచ్చి బాబాకు ప్రణమిల్లెను.

సా. బా : [ఒకరితో] బాపూసాహెబ్ ఏమి చేయుచున్నాడు?

నారాయణ : నిద్రపోవుచున్నాడు.

సా. బా : నారాయణ్ ఇక్కడకు వచ్చినపుడు వానిని బాగుగ కొట్టుము. నాకు 3-4 వేల రూపాయలు బాకీపడి యిచ్చుటకు జాగు చేయుచున్నాడు.

ఇది జి. డి. పండిట్ బాకీదారుడు బాపూసాహెబ్ అను సతనిని గూర్చిన విషయము అతడా ధనము నీయక జాగు చేయుచున్నవాడని సూచింపబడినది. కాని, అప్పుడప్పుడు బాబా ఖజానాదారుడుగ పనిచేయు బాపూసాహెబ్ జోగ్ - తనపై బాబా అన్యాయముగ నింద మోపినాడని తలంచి కోపముతో తానంత ధనము బాకీ లేనని విస్పష్టముగ పలికెను. [ఇచట నిరువురి పేర్లు ఒకటి యగుట గుర్తింపదగును.]

(4) బాబా - ప్రత్యేక బోధా విధానము.

621. మాధవరావు బాబాయెదుట గూర్చుండి- "బాబా తనకు "హంస [సాధువు] ను గూర్చి బోధింపవలయునని" తనలో దలంచెను.

సా. బా : [మాధవరావు] వెళ్ళి [హ. సీ దీక్షిత్తు చదువు] పురాణము వినుము!

మాధవరావు దీక్షిత్తుదగ్గరకు వెళ్ళెను. దీక్షిత్తు ఏకనాధ భాగవతమున 11 వ స్కంధము, 18 వ అధ్యాయము, 27-37 శ్లోకములలో "హంస - పరమహంస" వివరణము చదువుచుండుట గమనించెను.

622. ఒక ప్రార్థనా సామాజికుడు బాబాయొక్క శక్తి - స్వభావ- ప్రవర్తనలద్వారా 1] అవతారములు సాధ్యములు- విశ్వాసనీయములు 2] భక్త సంరక్షణార్థమై దైవము అవతరించుచుండును. [దైవమునకు] అవతారములకు హారతి-నైవేద్యములు సమర్పించుట యుక్తములు అని గుర్తించినాడు. షిర్డికి వచ్చి బాబాయెదుట గూర్చుండి- "బాబా! నా భారము యెన్నియు నీపై నిలుపుదునా?" అను ప్రశ్నను మనస్సున తలంచెను.

సా. బా : [బిగ్గరగా] నిలుపుము!

ప్రా. స : బాబా! ఎల్లరయెడ సమదృష్టిని ప్రసరింతువా?

సా. బా : ప్రశ్నించుటకు కొంత వివేకముండవలయును. ఎట్టి కొంటె ప్రశ్నము నీవడుగు చున్నావు? నే నెల్లఱయెడ సమదృష్టిని బఱపు చుందును.

ప్రా. స : తాను సేవించి పూజించుట కొక ఇష్ట దేవత (రూపము) కావలయునని తన మనస్సున దలచెను. అతడు ప్రాతశాల వైపునకు దిరిగెను. అచట నొక చక్కని స్త్రీ దేవతా రూపము నిలుచుండి, అతనివంక జూచు చున్నట్లు గోచరించెను. అతడు బాబా వైపునకు దిరిగెను. బాబా చిఱునగవు తోప అతనివంక జూచెను. ఆ సందర్భమున నిట్టి దృశ్యమతడు పలు మాఱులు చూచెను.

ప్రా. స : తాను చూచిన రూపము అన్నపూర్ణాదేవి యని గుర్తించి, తన ఇష్ట దేవతగ నిర్ణయించుకొనెను.

ఆ ప్రార్థనా సామాజికుడు రెండవతూరి షిర్డికి వెళ్ళినపుడు ఎవరో "సాయిబాబా స్థితప్రజ్ఞుడగునా? షిర్డికి వెళ్ళుట వలన లాభమేమి?" - యని ఏమేమియో అతనితో చర్చించిరి. ఆ చర్చలతని విశ్వాసమును పడలించి నవి. అతడు వెళ్ళి బాబా ఎదుట గూర్చుండెను.

సా. బా : శ్యామా! ఈతనిని దీసికొని పొమ్ము. ఏదొక విషయము దెలుపుము!

శ్యామా అతనిని వెలుపలకు దీసికొనివెళ్ళి "ఇతరుల పలుకులు, ఆ పలుకుల మూలమున నీ విశ్వాసము సడలుట అంతయు బాబాలీల. ప్రపంచ ప్రలాపములను, ప్రపంచము కల్పించు కష్టములను నీ మనస్సున పాటించ కుము. నీ మనస్సును బాబా పదములందు లగ్నము చేయుము. అపుడ బాబా నీకు శాంతిని ప్రసాదించును" అని బోధించెను.

వారిరువురు తిరిగి మసీదులోనికి వెళ్ళగా-

సా. బా : (ప్రా. స. తో) శ్యామా కావించిన బోధ పాటించి అను రింపుము.

38)

623. సా. బా : (రాధాబాయి దేశముఖిన్‌తో) మీ కానాలా దుస్నారాగురు నవ్హే - (నేను చెవి కొఱకు గురువును కాదు. నేను చెవిలో మంత్రము ఉపదేశించు వాడను కాను) ఆమాచ ఘరాణోం నిరాళా ఆహె (మా సాంప్రదాయములు - పద్ధతులు ప్రత్యేకములు)

624. సా. బా : (ఉపాసనీ మహరాజుతో) నా చెంతకు చేరుము. ఊరక నుండుము. తక్కిన పని నేను కావింతును.

నారాయణ ఆశ్రమ యోగి విషయమునవలె యీ భక్తుని (ఉ. బా) మనసును తన అధీనము జేసికొని చక్కదిద్దినాడు. స్వప్నములద్వారాగాక, ప్రత్యక్ష ప్రబోధ మేమియు చేసి యెరుగడు.

625. శ్యామారావు, ఆర్. శ్రోత్రి. (థానా జిల్లాకోర్టు రికార్డు గుమాస్తా) ఒక ప్రశ్న మనస్సున నుంచుకొని బాబాఎదుట గూర్చుండెను.

సా. బా : "బాయిదగ్గఱకు పొమ్ము. ఆమె దేవాలయములో పురాణము చదువుచున్నది.

'శ్రోత్రి' అచటకు వెళ్ళి వినెను. ఆమె చదివిన దానిలో తన ప్రశ్నకు సమాధాన ముండుట అతడు గమనించెను.

తన భక్తులకు బాబా సమాధానమిచ్చు మార్గములలో నిది యొకటి.

5) బాబా ఛాయాపటము తీయు విషయము

626. సా. బా : శ్యామా! ఆ పిల్ల లిచట కేల వచ్చిరి?

శ్యామా : బాబా! నీ ఛాయాపటము తీయుటకు.

సా. బా : నా (సహజాకారము గనుటకు) ఛాయాపటము తీయవలదని ఆ పిల్లలతో చెప్పుము. ఆ గోడ పడగూల్చిన చాలును.

(గమనిక ; గోడ 1. దేహమై యున్నదని, 2. దేహమే మనము అను భావము గలిగియున్నవారమని - బాబా సహకారము బ్రహ్మమై యున్నది అని భావము.)

6) బాబా నీతి కథలు

626. బంగారు మూటలతో నింపిన గాడిదలను పెక్కు కొనివచ్చి తిని. మార్గమున దొంగలు వాని నన్నిటిని జూచిరి. కావున దొంగల (సమీపమున) యింటి యందుండుట కష్టము. నీవు (భావ్‌సాహేబ్ ప్రధాన్- సబ్ రిజిష్ట్రార్) నా వలన నీ విషయమున దెలిసికొనుటకు యిక్కడకు పంప బడినావు. ఈ నిస్సారమైన ప్రపంచమున నుండుట మిక్కిలి కష్టము. నేను గ్రహించినది [బోధింపబడినది] అదియే. నా సోదరుడు మహాదేవ్‌నాథ మహారాజున కీ మాత్రము తెలుపుము.

627. ఎ) నా ధనమును జను లపహరించుకొని పోయిరి. నే నేమియు బలుకలేదు. కాని, మెల్లగా వారి ననుసరించి వెళ్ళి, వారిని చంపి, నా ధనమును తిరిగి సంపాదించుకొంటిని.

628. సా. బా : నా దేహము దిగువ భాగము చిలుక ఆకారముగ మార్చుకొంటిని. ఒక సంవత్సర మటు లనుభవించిన తరువాత దాని నొక సహింపరాని నష్టముగ తెలిసికొంటిని. నే నొక లక్ష రూపాయలను గోల్పడితిని. [లక్ష్యమును గోల్పడితిని.]

629. సా. బా : నే నొక స్తంభముదగ్గఱ గూర్చుంటిని. అపు డొక పెద్ద సర్పము మేల్కొని మిక్కిలి ఆగ్రహించెను. అది పై కెగురుచు పైనుండి క్రిందికి బడ దొడగెను.

630. సా. బా : ఒకనికి ఒక చక్కని గుఱ్ఱముండెను. వాడెంత ప్రయత్నించినను అది జత కలియదు. దాని నెక్కడ నుండి తెచ్చెనో అచటకు (దాని మూలస్థానమునకు) దీసికొని పొమ్మని ఒక విద్వాంసుడు తెలిపెను. ఆ విధముగ జేయబడెను. ఆ పిదప అది అధీనమై, ఉపయోగకర మయ్యెను.

631. సా. బా : [బి. వి. దేవ్‌తో] నీవు నాలుగు ఇచ్చితివి. నిజమే కాని, బాబాకు జెందునది-పొందునది మాత్రమొక్కటే.

632. సా. బా : (జి. ఎస్. కపర్దేతో) మబ్బులు క్రమ్మినవి. వర్షములు కురియును. పైర్లు పెరిగి పంట పండును. మబ్బులు విచ్చును. నీవు భయపడనేల?

633. సా. బా : ఒకడు ఒంటెపై స్వారీ చేయుచుండెను. అది మలము విసర్జించెను. ఆ మలమంతయు ప్రోగుచేసి నేను తింటిని. నా కడుపు ఉబికి వాచెను. స్మృతి తప్పి పడిపోతిని. ఆ రౌతు నాపై జాలి పొందెను. నాకు నాలుగు శనగ గింజల నిచ్చెను. నేను తింటిని. నీరు త్రాగితిని. నా దుస్సహమైన బాధ శమించెను. నా కడుపు ఉబ్బరము తగ్గెను. ఇక స్వస్తత కలుగును.

634. శ్యామా : నీవు తిరుగలితో ధాన్యమేల విసరుచున్నాడవు?

సా. బా : ఇక్కడకు (నా దగ్గఱకు) వచ్చువారి కొఱకు నేను విసర వలయును.

శ్రీ సాయిబాబా - కాశీనాథ ఉపాసనీ మహారాజుతో పలికిన పలుకులు

635. సా. బా: అహో! కాశీనాథ్! నీ విక్కడనుండి వెడలునపుడు 8 రోజులలో తిరిగి రాజాలనని ప్రతిఘటించితివి!

కాశీ : ఇది యెట్లు జరిగెనో నేను తెలిసికొన జాలకున్నాడను. ఇదంతయు నీ కార్యమే!

సా. బా : నాయనా! ఈ దినములు నేను నీ వెనుకనే యుంటిని. ఇపుడు వెళ్ళుము- వాడలో (దీక్షిత్ వాడలో) నుండుము.

సా. బా : (అచట జనుల నుద్దేశించి) ఒక దినమున నేను దారిన పోవుచుండ నొక గర్భిణీ స్త్రీని జూచితిని. ఆమెకడుపు ఉబికియున్నది. చేతులు, పాదములు మిక్కిలి కృశించియున్నవి. ఆమె ఒంటరిగ నుండెను. ఒక కట్టె ఆధారములేక నడువజాలని స్థితిలో నుండెను. "నీవు పెక్కు సంవత్సరములుగ గర్భము ధరించినట్లున్నదానవు. ఇంతవరకేల ప్రసవింపలేదు?" అని నేను ప్రశ్నించితిని. ఆమె సమాధానము లేదు. "మూత్ర విసర్జనము చేయుము. వేడినీరు మాత్రము త్రాగుము. అపుడు ప్రసూతి తేలిక యగును" అని తెలిపితిని. ఆమె నా మాటల బాటింపక చన్నీరు త్రాగుట కొక వాగుదగ్గఱకు జేరెను. అపుడు నేను "అహో! ఈమె గర్భమున గల అసంఖ్యాకములగు బిడ్డలును మరణింతురు" అని తలంచి ఆమెను సమీపించి- "అమ్మా! చల్లని నీరు త్రాగవలదని నేను నీకు చెప్పలేదా? నీవీ వాగుదగ్గఱ కేల వచ్చితివి? ఊరిలోనికి వెళ్ళి త్రాగుటకు

వేడినీరు సంపాదించుకొనుము" అని చెప్పితిని. ఆ దినము మొదలామె వేడినీరు త్రాగెను. ఇప్పుడామె క్షేమముగ నున్నది. ఇదంతయు కేవలము (వాయువు) వాతమే. సాయిబాబా యీ మాటలు పలుకుచు అపుడపుడు కాశీనాథుని వైపు జూపుచు సతనివంక జూచెను. కాశీనాథుడు వెంటనే గ్రహించెను.

"రాహురి-యందు వేడినీరు త్రాగుమని నాకు జెప్పినది సాయియే. అచటకు 15 మైళ్ళ దూరమున నున్న 'బజూరి' యందు వేడినీరు త్రాగుమని నన్ను నిర్బంధించినది సాయియే. అతడు దయామయుడైన రక్షకుడు, ఏ వైద్యులకు నలవికాని నా బాధను తొలగించినాడు" అని ఉపాసనీ మహారాజు తెలిసికొనెను.

636. మన యిరువురకు ఋణానుబంధము కలదు. మన కుటుంబములు వందలు, వేలు సంవత్సరములనుండి పరస్పర ఋణ కారణమున బంధింపబడినవి. కావున నీకును, నాకును భేదము లేదు.

637. సా. బా : కాశీనాథుడు షిర్డి విడిచి వెళ్ళ పూర్వము అతని లెక్కలన్నియు పరిష్కారము చేసికొని పోవలయును.

శ్యామా : ఏమి లెక్కలు?

సా. బా : నా దగ్గఱకు జేరువారి లెక్కల నన్నిటిని పరిష్కారము చేయుదును. (కొన్ని వారముల తరువాత) 2, 4 బండ్ల లెక్కలు తప్ప తక్కిన లెక్కలన్నియు పరిష్కారమైనవి. (శ్రావణము - జులై, ఆగష్టు 1911) అన్ని లెక్కలు సరిచూడబడినవి. దాని ఫలితముగ కాశీనాథుడు షిర్డియందు నాలుగు సంవత్సరము లుండవలయును.

శ్యామా : ఇచట 4 సంవత్సరము లతడేమి చేయవలయును?

సా. బా : అతడూరక విఠోబా దేవాలయములో గూర్చుండి యుండ వలయును. ఏమియు జేయనక్కరలేదు. అతడు రొట్టెకూరలు మాత్రము తినుచు ఊరక ఉండవలయును. నేను కోరునది సంపూర్తి చేయుదును.

సా. బా : (కాశీనాథునితో) ఎవనితో నెట్టి సంబంధము నీవు కల్పించు కొనకుము. నీ భవిష్యత్తు మిక్కిలి శుభాస్పదము.

సా. బా : (ఇతరులతో) అతని విలువ అట్టిది! ఈ విశ్వమంతయు త్రాసులో నొక పళ్ళెరమున-ఈతని మఱియొకటి నిలుపదగును.

బొంబాయి ప్రభు : ఏమి? బాబా! నీ సంపూర్ణానుగ్రహము అతనికి రాగిరేకుమీద శాశనము లిఖించి ఇచ్చుచుంటివా ?

సా. బా: నేను పలికినది- నాకుగల సర్వస్వము ఈతని కనుగ్రహింప బడినది' - అనియే.

సా. బా: (కాశీనాథునితో) నీ వెక్కడనున్నను నీవు దైవమవు. బంగారు రేకుపై నా'ఫర్మానా' నీ చేతులందున్నదని నీవు గ్రహింపుము. నీవు తరచుగ నాదగ్గఱకు రావలదు. అప్పుడపుడు మాత్రము రమ్ము. నాతో సంభాషింపవలదు. నేను నీతో సంభాషింపను. 4 సంవత్సరముల తరువాత మహల్సాపతియొక్క సంపూర్ణ ఆదరణము నీవు పడయగలవు. నీవు సకలము నెఱుగగలవు. నీవు నన్ను గుర్తింపలేదు. నేను నిన్ను పరిపూర్ణముగ గుర్తించితిని. పెక్కు సంవత్సరముల నుండి నిన్నుగూర్చి అతి తీవ్రముగ తలంచుచుంటిని. నీవిపుడెక్కడకు పోవలె? ఎక్కడకు రావలె? నీ వేమియు జేయ నేరవా? ఊరక యుండుము. నేను స్వయముగా నీ వెంటవచ్చి టిక్కెట్టు తెచ్చి నిన్ను రైలు ఎక్కించి, నీ గమ్యము నీవు చేరుకొనునట్లు చేసెదను. (చూచెదను)

ప్రభు : ఏమి? బాబా! ఈ వ్యక్తికి నీ సర్వస్వము ప్రసాదించితివా?

సా. బా : అవును! అవును! సకలము ప్రసాదింపబడినది. మంచివాడు కాని, చెడ్డవాడుకాని, అతడు నా వాడు.

నాకు - అతనికి భేదమేమియు లేదు. అతనికి సంబంధించిన సకల బాధ్యతలు నాపైన నిలిచియున్నవి.

638. సా. బా: (కాశీనాథునితో) నీ వున్న ఖండోబా దేవాలయమునకు నేను వచ్చుచుందును

నేనచటకు వచ్చినపుడు నన్ను గుర్తించి పొగ త్రాగుటకు 'చిలిమ్' (పొగ గొట్టము) ఇచ్చుచుందువా?

కాశీ : బాబా! నిన్ను గ్రహింపజాలకున్నాను.

639. సా. బా : (కాశీనాథునితో) నీ ప్రసాదము నా కవసరము లేదు. నీ వింత దూరము తీసికొని వచ్చుటకు శ్రమపడనేల? నే నచటనే యుంటిని.

కాశీ : బాబా! అచట నొక నల్లకుక్కతప్ప మఱి యెవరును లేరు.

సా. బా : అవును. నల్లకుక్కను నేనే.

640. సా. బా : (కాశీనాథునితో) నన్ను తఱిమి వేసితివి.

కాశీ : అచట ఒక రోగియైన శూద్రుడు తప్ప మఱెవ్వరు లేరు బాబా!

సా. బా : అతడు నేనే!

కాశీ : నీ వాతడగుదువా?

సా. బా : నేను సకలమునందు, దాని కావలగూడ నున్నవాడను.

641. కాశీనాథుడు : [బాబాతో] నీవు అవలకు త్రోసి తగులబెట్టిన వ్యక్తి నేనే.

సా. బా : అవును. నీవా పాప రూపమున నున్నవాడవు. అతని నిర్మూలించితిని. నీ విపుడు పాప విముక్తుడ వైతివి. మన యిఱువుర కృషివలన నికముందు కావింప దగినవి చాల కలవు. పాపము శేషించిన అది యెట్లు సాధ్యమగును?

642. సా. బా : [కాశీనాథునితో] ఆ మనిషివంక జూడుము! అది నీవే, నీ పుణ్య పురుషుడు! (112)

కాశీ : బాబా! ఈతడు నా పుణ్య పురుషుడే అయిన- నీవు ఇంతకు ముందు తగులబెట్టినది నా పాప పురుషుడే అయిన- నే నెవడను?

సా. బా : నీవీ (రెంటికి) యిఱువురకు అతీతుడవు. నేను యెవడనో నీవు అతడవే! నీవు - నేనే!

643. సా. బా : (కాశీనాథునితో) శతాబ్దముల కొలది పెరిగి వర్ధిల్లునటుల 11 అశ్వత్థ వృక్షములను (రావిచెట్లను) నాటుము.

ఓమ్ తత్సత్! శ్రీ సాయినాథార్పణమస్తు!

—o—

మంగళ హారతి!

శ్రీరామసాయి! సిద్ధావతార! శ్రితజన మందార!
ద్వారకామాయీ భవనవిహారా! భవభయ పరిహార!
హారతి - కప్పూర హారతి - మంగళ హారతి- నర్పింతు.
కారుణ్యమున జీవాళిని బ్రోతు - కరముల జోడింతు.
నీ బిడ్డలమిదె! నీ పదరజమున - నెమ్మిని వ్రాలెదము
బాబా! ఆసల పాల్పడ జేయక - పరమ పదంబిడుము!
ఎవరెవ రెటులాశ్రయింతురో వారి - నీ వటులేలుదువు!
వివరింప నీ మహత్త్వ మపారము - విశ్వాధారుడవు.
నీ నామతరణి నిశ్చయముగ భవ - నీరధి దాటించు
దీన జనంబుల దిక్కువు సాయీ - దేవా! కరుణించు!
సగుణ బ్రహ్మముగ జగతి బొడమితి- సాయీ! హరివీవు!
అగణిత నిగమాగమాదులేన్ - నిన్నరయంగ నేరవు!
శరణాగత దీన రక్షకుడవను - శపథంబు నిల్పుము!
వరదా! వరదాఽభయ కరము బఱపి - ప్రణతు నన్గాముము!
అనయము నీ శుభ పదసేవన - భాగ్యంబును మాకీడుము!
హనూమ చాతకమును సాయీఘన - దాంబువుల దన్పుము!

తో॥ నీరాజనంబు నీకిదె - సాయీ! - నితాంత జగదాధారా!
ద్వారకామాయీ భవనవిహారా! స్వాశ్రిత జనమందార!

రచయిత :

శే॥ శ్రీ బాపట్ల హనుమంతరావు పంతులుగారు

కే! సాయీ

త వీవె నాకు; పావనమా నీ

శరణంబని

ాలుతు గృపఁగను తండ్రీ! హనుమా!!! (ప్రచురణకర్త)